యోగప్రవేశం

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2015

యోగదీక్ష

విషయసూచిక

యోగేశ్వరుని గొప్ప వాగ్దానం

అనంతుని కోరుకొనువాడు, అనంతునిచే కోరబడినవాడే. అతనికి దివ్య స్పర్శ లభించింది, అది లేకపోతే అతను మేల్కొనడు, అతనిలో ఆత్మశక్తి ఉన్మీలనం కాదు. కాని ఒక్కసారి దానిని స్వీకరిస్తే, సిద్ధి ఖాయం. అది వేగంగా ఒక జీవితకాలంలోనే జరుగుతుందా లేక అభి వ్యక్త జగత్తుకు సంబంధించిన అనేక సృష్టుల, ఆవృతుల ద్వారా సహనంతో కొనసాగిస్తే జరుగుతుందా అనేది వేరే విషయం.

CWSA 23:53 (SABCL 20:47-48)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

ప్రయాణానికి సన్నాహం

ఒక సుదీర్ఘ సన్నాహం మనిషి జీవితం
ఆశ, ప్రయాసల శాంతి యుద్ధాల సమావృత వృత్తం
కాంతిహీన పదార్థ ఆవరణంలో ప్రాణం కనిపెట్టినదీ మనిషి జీవితం.
క్రిత మెవరి పాదల ముద్ర పడనిది.
అతడి శిఖరారోహణ పథం.
మసక నీడ గుండా అన్వేషిస్తూ జ్వాలతో
సగం తెలుస్తున్న, అందరాని ఆచ్ఛాదిత సహజత్వం
ఇక్కడెక్కడా రూపుదాల్చని మహదాదర్శ వైఖరి
ఉత్థాన పతనాల అంతం లేని ఊర్ధ్వగమన వర్తులం
ఎవరికై మనమంతా తయారుకాబడ్డామో
ఏ బ్రహ్మాండ బిందువు గుండా
అతడి శోభ వెలుగులు విరజిమ్ముతుందో
ఆ బిందువు చేరువరకు... ఈ ప్రయాణం.
ఆ దివ్యుని అనంతంలోనికి విప్పారుదాం.
మన స్వభావ సరిహద్దులు దాటి
సజీవ ప్రకాశభరిత
దివ్యస్వభావ వంపులోకి తప్పించుపోదాం.

సావిత్రి, పుట 24

శ్రీఅరబిందో

నీ క్రియా కలాపాలన్నింటినీ దైవానికి అర్పించు, సర్వత్రా అతడినే దర్శించు

(ఇద్దరు సోదరుల్లో పెద్దవాడు వకీలు, అతడు ఈ ఉదయం శ్రీఅరవిందుల్ని కలవాలను కొన్నాడు)

దీని సంక్షిప్త కథనం: వాళ్లకు శ్రీఅరవిందులు కలలో కనిపించారట, వారిని తమ వద్దకు రమ్మని చెప్పారట, పైగా మృతుడైన తమ సోదరుడి ఆత్మకు సంబంధిం

చిన సూచన లేవో ఇచ్చేరట. శ్రీఅరబిందో: వాళ్లకి ఈ క్రింది సూచనలు చేసి వున్నారు. తగినంత జ్ఞానం లేకుండా ఆత్మల లోకాల్లోకి ప్రవేశించడమనేది చాలా అపాయకరమన్న విషయం ఆ సాధనలో మాధ్యమంగా మారిన (ఇరువురిలో) తమ్ముడికి చెప్పవలసి వుంది. ప్రత్యేకించి తగినంత బలంగా లేని వాళ్ళకి ఇది మరింత ప్రమాదకరం. అతడు (ఆ రకమైన సాధనలు వదిలివేసిన తరువాత) కర్మ యోగాన్ని ఆచరిస్తూ మనస్సును దృఢంగా చేసుకోవాలి. తనలోని అహంకారాన్ని, కోర్కెలను వదిలి వేయాల్సి వుంటుంది. అతడు చేయగల్గే పనులు భక్తిభావంతో చేస్తూ వాటి నన్నింటినీ దేవునికి సమర్పించాలి. ఈ విధంగా తన క్రియాకలాపాల్ని భగవంతునికి అర్పణ చేయగల్గడాన్ని సాధన చేస్తూ సాటివారి అందరిలో, అన్ని స్థితుల్లోనూ ఆయనను దర్శించడానికి ప్రయత్నించాలి. అదే అతడి ధ్యాన మౌతుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ఈ యోగాన్ని అతడు చేపట్ట లేడు. ఎందుకంటే ఇది 'ఆత్మార్పణ యోగం'. దీనిలో వ్యక్తి ఉన్నత శక్తికి తాను బద్ధుడై, పూర్తిగా ఆ వైపే తెరుచుకోవలసి వుంటుంది. కానీ అతడు యిప్పటికే ఇతర శక్తులకు వశమై పోయాడు. ఇట్లాంటి స్తబ్ధమైన స్థితి అతడికి మంచిది కాదు. అన్ని రకాల శక్తులూ అతడిని ఆవహించి వ్యక్తిత్వాన్ని స్వాధీనపర్చుకోవచ్చు. కాబట్టి ఈ యోగాన్ని స్వీకరించడమన్నది అంత క్షేమకరం కాదు.

శ్రీఅరవిందులతో సాయం సంభాషణలు, ఎ. బి. పురాణీ, 1-11924

ఈ యోగాన్ని స్వీకరించాలని కోరుకొంటున్న, ఒక జిజ్ఞాసువుకి సూచనలు

శ్రీఅరబిందో: సూర్యుడు దివ్యప్రకాశానికి ప్రతీక, అతడు క్రిందికి దిగివస్తూ, దివ్యప్రకాశం క్రిందికి అవతరించి మనస్సుకు సంబంధించిన అన్ని క్రియాకలాపాలకు ప్రేరణను ఇవ్వమనే ఆకాంక్షను అభివ్యక్తపరుస్తాడు.

ఈ యోగంలో కూడా ఆ దివ్యసూర్యుడు మనస్సునే కాక, ప్రాణికాన్ని, అన్నమయ పురుషుణ్ణి పాలించేందుకై దిగిరమ్మని ఆకాంక్షించడం జరుగుతుంది. కానీ ఇది ఎంతో కష్టతరమైన యత్నం. అందరూ ఆ సూర్యప్రకాశం దిగివస్తే, దానిని భరించలేరు. గాయత్రి మంత్రం సత్యంలోని దివ్యప్రకాశాన్ని ఎంచుకొని అది

క్రిందికి దిగివచ్చి ఈ మనస్సును పాలించాలని సూచిస్తుంది. ఆ విధమైన ప్రకాశాన్ని భరించగల సామర్థ్యం అయితే ఈ యోగాన్ని చేపట్టడానికి అనువైన పరిస్థితిని కలుగజేస్తుంది. నీ వీ మంత్రం పైన ధ్యానం చేయవచ్చు. దీని అర్థాన్ని మననం చేసుకొంటూ ఈ యోగానికి తగినట్లుగా అవడానికి ఆకాంక్షించవచ్చు. నీ మనస్సును కేంద్రీకరించగల్గితే, దేవతకు చెందిన ఏ రూపం పైనైనా ధ్యానం చేయవచ్చు. నిన్ను, ఈ యోగానికి అర్హునిగా, అనువైనవాడివిగా చేయమని నీ ఇష్టదేవతను ప్రార్థించవచ్చు. తద్వారా ఆ దేవత నీలోకి దిగివచ్చి నీ ఆకాంక్షకు తగినట్లుగా పని చేయగలదు.

నిజం చెప్పాలంటే ఈ యోగం మనిషి శక్తిసామర్థ్యంతో జరుగదు. దైవశక్తి ద్వారానే జరుపబడుతుంది. కాబట్టి ఆమె (శక్తి) సాధకుడి సామర్థ్యంలో అవసరమైన ప్రతిమార్పును తేగలదు.

శ్రీఅరవిందులతో సాయం సంభాషణలు, ఎ. బి. పురాణీ, 1-11924

ప్రశ్న: ఒక వ్యక్తి యోగసాధన కోసం తనను తాను సంసిద్ధపర్చుకోవడానికి ఏమి చేయాలి?

అన్నింటి కంటే ముందు అన్ని విషయాల్లోనూ సచేతనుడవు కావాలి. నిజానికి మనం అంత ప్రాధాన్యతను సంతరించుకోని వ్యక్తిలోని ఒక పార్శ్వాన్ని గురించే ఎరుకను కల్గి వుంటాం. తక్కిన చాలా భాగం గురించి తెలియనే తెలియదు. ఇదిగో ఈ అచేతన స్థితే... ఉన్నతానికి ఎదగని స్వభావం లోనికి అణగద్రొక్కి మన స్వభావ పరివర్తనను, రూపాంతీకరణాన్ని నిలిపివేస్తుంది. ఈ అచేతన ద్వారా అదైవిక శక్తులు మనలోకి చొరబడి మనల్ని వాటికి బానిసలుగా చేసుకొంటాయి. నీకు నీవుగా సచేతనుడివి కావాలి. నీవేమి చేస్తున్నావు, ఎందుకు చేస్తున్నావు, చేసేవాటిని గూర్చి ఎలా ఆలోచిస్తున్నావు, వాటినెలా అనుభూతి చెందుతున్నావు అన్నది గ్రహించాలి. నీవు చేసేదానికి గల ఉద్దేశ్యాలను, ప్రేరణలను, శక్తుల్ని, నిన్ను నడిపించే కనిపించని, కనిపించే వాటి నన్నింటినీ అర్థం చేసుకోవాలి. నిజానికి యంత్రాన్నంతా విడి విడి భాగాలుగా చేసి చూసినట్లు నిన్ను నీవు విడగొట్టుకొని పరిశీలించాలి. ఇలా ఒకసారి సచేతనుడవైతే అన్నింటిని గాలించి దేనికదిగా వేరుపరచగలవని అర్థం. ఇహ ఏ శక్తులు నిన్ను, క్రిందికి లాగి వేస్తున్నాయో ఏవి నీకు సహకరిస్తున్నాయో

చూడగలవు. నీవు ఎప్పుడైతే ఏది సరియైనదో, ఏది తప్పు, ఏది యథార్థమో, ఏది బూటకమో, ఏది దైవమో, ఏది అదైవమో తెల్సుకుంటావో అప్పుడు ఆ విధమైన జ్ఞానంతో నియమబద్ధంగా కఠినంగా పనిచేయగలవు. చెప్పాలంటే నీ ఇచ్ఛాపూర్వకంగా ఒక దానిని సమ్మతించి, రెండవదానిని నిరాకరించగలవు. ఈ ద్వంద్వ స్థితి అడుగడుగునా నీ ముందు నిలుస్తూనే వుంటుంది. అట్లాగే నీకు నీవుగా ఒకదానిని ఎంపిక చేసుకొని, ఓరిమి, పట్టుదలతో అప్రమత్తంగా, చురుకుగా వ్యవహరించాలి. 'విశ్రమించక' అన్న నానుడిని పాటిస్తూ దైవానికి వ్యతిరేకంగా నిలిచిన అదైవికమైనది, అది ఏదైనా సరే ఎట్టి పరిస్థితుల్లో దానికి ఆవకాశమివడాన్ని నిరాకరించాలి.

శ్రీమాత

యోగానికి సంసిద్ధ మవ్వడంలో పుస్తక పఠనం

గ్రంథపఠనంతో యోగానికి సంసిద్ధమవ్వడం అవసరమనుకుంటే అది చాలా సమయాన్ని తీసుకొంటుంది. ఒక వేళ ఎవరి ద్వారానైన నేరుగా మార్గనిర్దేశాన్ని పొందడం సంభవిస్తే... అన్ని పరిస్థితుల్లోనూ ఆ సంసిద్ధత ఎంతో వేగంగా సమకూరుతుంది. నీ కిది నిర్దేశించేవారు ఎవ్వరూ లేనప్పుడు ఇక గ్రంథసహాయంతో నీ త్రోవను నీవే కనుగొనాల్సి వస్తే 'ఈ పుస్తకం కాదు, ఆ పుస్తకం చదువు' అని చెప్పేవాళ్ళు ఒక్కరైనా లేక ప్రతిదీ నీకు నీవుగా కనుగొనడం అనేది ఎంతో సమయాన్ని తీసుకొంటుంది. ఏళ్ళే పట్టవచ్చు. ఆ తేడాను నీవు చూడవచ్చు. ఒక విషయాన్ని గురించి తెలుసుకొన్న వ్యక్తిని, అంటే ఆ అంశాన్ని తన స్వానుభవంలోకి తెచ్చుకొని, దాని చివరి భాగం వరకు చేరుకొని, దానికి చెందిన పూర్తి జ్ఞానాన్ని పొందిన ఆ వ్యక్తిని ప్రశ్నించగల్గడానికి, గ్రంథాలు చదివి తెలుసుకోవడానికి ఎంతో వ్యత్యాసం వున్నది. "ఇది మంచిదేనా, దీని వల్ల ఉపయోగం వున్నదా, ఇది కీడు కలుగ జేస్తుందా" అని అతడిని అడగగలవు. అడిగిన మరు నిమిషంలోనే ఆ "ఇది చెయ్యి, ఇది చదువు, అది చేయకు" లాంటి జవాబు నీ కందుతుంది. ఇది ఎంతో తేలిక కదూ! నీవు పూర్తిగా ఒంటరివి అన్నప్పుడు, నీ కనువైన పరిసరాల్లో లేనప్పుడు నీ పరిస్థితిని గురించి అర్థం చేసుకోగలవారు లేనప్పుడు, వున్నవారు నీకు చెరుపు చేయకుంటే ఇక దానిని గురించి ఆలోచించకు. ఇది మంచిది, ఈ పుస్తకం చదువు, అది దీని కంటే మంచిది, అది చదువు అని చెప్పగల్గేవాళ్ళు లేనప్పుడు ఇక నీకు నీవే

గం‌పెడు విషయాలను చదివి తీరాలి. వాటిని మళ్ళీ నీ స్వంత ఆలోచనతో పోల్చి చూసుకోగలగాలి. అవి నీ పై ముద్రించిన ప్రభావాన్ని సరిపోల్చుకోవాలి. మరి అది నీ కెంత వరకూ సహకరించగలదో, సహకరించలేదో తెలియదు.

సహజంగా పూర్వ నిర్దేశిత భాగ్యవంతులు తమ అంతరంగ మార్గదర్శి నుండే నిర్దేశించ బ డతారు. అట్లాంటివారికి సహజంగానే సరిగ్గా కావాల్సిన పుస్తకం చేతి కందడం, దానిని చదవడం, సరియైన సూచనను ఇవ్వగల మనిషి తారసపడటం తటస్థిస్తుంది. కొంత కాలం తరువాత ఆ ఘటనకు సంబంధించిన ప్రత్యేక చేతన అక్కడ పని చేసినట్లు గ్రహించగల్గుతారు. అది ఏమిటి, అది ఎక్కడి నుండి వచ్చింది, వాళ్ళ జీవితాన్ని ఎవరు వ్యవస్థీకరించారు, వాళ్ళ జీవితంలోని పరిస్థితుల్ని ఎవరు చక్కబెట్టారు అన్నది, అంత బాగా తెలియదు. వాళ్ళను మున్ముందుకు నడిపే శక్తిని కనుగొనడంలో అడుగడుగునా ఎవరు సహకరించారన్నది వారెరుగరు. ఇట్లాంటి సందర్భం తదరచుగా సంభవించేది కాదు. చాలా అరుదైనది. ఇట్లాంటి మనుషులు, పూర్వ విధి నిర్ధారిత అనుగాములు. లేని పక్షంలో ఇది చాల కష్టం. చాలా సమయం తీసుకొంటుంది. కానీ ఇది ప్రారంభమే. ఇది సత్యాలను కనుగొనడానికి.. ఆ సత్యాల పైన వ్యక్తి యొక్క యోగం నిలద్రొక్కుకుంటుంది. ఇది యోగం కాదు మనం చెప్పుకొన్న సాధారణ సూత్రాలు. వాటి పైన మనిషి తన యోగాన్ని నిర్మించబోతు న్నాడు.

ఎవరిలో ప్రత్యేకమైన ఉత్సాహం వున్నదో వాళ్ళే ఆ ప్రత్యేకమైనదాన్ని దేన్నో కనుగొంటారు. ఇది భారతీయులకు చెప్పబోవటం లేదు. ఎందుకంటే వాళ్ళకది ఎంతో ఎంతో తేలికైన విషయం. భారతదేశంలో యోగానికి సంబంధించి సజీవమైన పరంపరాగతమైన ఆచారం ఉంటుంది. ఎవరు యోగసాధనకు పూనుకొంటారో వాళ్లు వెంటనే ఆ దిశగా సమాచారాన్ని అందించేవాళ్ళను అన్వేషిస్తారు. ఇక్కడ ఏమీ తెలియని అజ్ఞాని, నిశానీ కూడా యోగసాధన వనుసరించి ఏమి చేయాలి, ఏది తనకు సహకరిస్తుంది అన్న అవగాహనను అస్పష్టంగానైనా కల్గి వుంటాడు.

శ్రీమాత

సత్యసూర్యుని వైపుగా ఆకాంక్ష

ఆ సత్యసూర్యుని వైపు, ఆ పరమ ప్రకాశం వైపు పూర్తి చిత్తశుద్ధితో, సుహృద్భావనతో,

తీవ్ర ఆకాంక్షతో తిరిగి రోజు రోజుకీ పై పైకి ఉద్గమించాలనే సంకల్పాన్ని పూనుదాం.

తద్వారా ఆ ప్రకాశం మనల్ని ఆ సాంతం ముంచెత్తి తన ప్రజ్ఞా జ్యోతిలో మన మనస్సులను, హృదయాలను, మన ఆలోచనలను క్రియాకలాపాలను ప్రకాశింప జేయాలి.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

పిలుపు సమర్థత

మార్గం — సమర్థత

ఒక మనిషికి, నీవు చెప్పే అర్హతలన్నీ ఉండవచ్చు, దృఢంగా కనబడవచ్చు; కాని, అతడు మార్గంలో పయనించ లేకపోవచ్చు. అదే సమయంలోనే వేరొక మనిషి బల హీనంగా కనబడవచ్చు, కాని, అతనిలో ఏదో ఒకటి కల్పించుకుంటుంది. అతడు పయనించగల్గుతాడు మార్గంలో. అందుచే ఈ విషయంలో మానసిక నిబంధన ఏదీ లేదు. వారిలోదేదో — నేనిదివరకే చెప్పినట్లు — కోరుకుంటోంది యోగాన్ని; అదే నడిపిస్తున్నది వారిని ముందుకు. కొన్ని సందర్భాలలో 'విధి' తోస్తుంది వారిని, ముందుకు. ఈ విషయాన్ని చెప్పొచ్చు: ఇక్కడికి వచ్చే వారందరికీ మార్గంలో పయనించే అవకాశం వుంటుంది, దానిని పట్టుకు వ్రేలాడగల్గితే.

సాయం సంభాషణలు శ్రీఅరవిందులతో, ఎ. బి. పురాణీ, 20-9-1926

మనం అవసరంగా (తప్పనిసరిగా) తెల్సుకోవల్సినవి

ఈ విషయంలో ఎవరు సమర్థంగా ఉన్నప్పటికీ — సమర్థత, అసమర్థత అనేవి — ఆధ్యాత్మిక విషయాల్లో — ఒక మాట్లాడే పద్ధతి మాత్రమే — బాహ్యస్వభావం గురించి. కాని లోపల ఉంటుంది ఒక ఆత్మ, పైన ఉంటుంది — దైవానుగ్రహం[1].

అదే నీవు తెల్సుకోవలసింది — తప్పనిసరిగా తెల్సుకోవల్సింది. కాని నీవు

[1] పెద్దల ఆశీర్వాదం కూడ ఇందులోదే.

తెల్సుకోనప్పటికీ — మంచిది — కనీసం ఏదో విధంగా నీవీ మార్గంలోకి వచ్చి పడ్డావు; నీ వక్కడే వుండాలి, ముందుకు లాగబడే వరకు; నీలో ఆత్మజ్ఞానం మేల్కొనే వరకు.

ప్రశ్న: ఒక అత్యంత ఉత్సాహపరిచే సూత్రం కనుగొన్నా — మీ ఉత్తరంలో — "లోపల ఒక ఆత్మ, పైన దైవానుగ్రహం" — "ఇదే నీవు తెల్సుకోవల్సినది, నీవు అవసరంగా తెల్సుకోవల్సినదంతా ఇదే" నిజంగా ఇదేనా అంతా?

సమా: అవును. ప్రతి ఒక్కరు చేయగలరు — ఎంతో మంది చేశారు.

ప్రశ్న: అలా ఐతే, ప్రతివానిలోను ఆత్మ వున్నది, పైన దైవానుగ్రహం వున్నది. కాని ఎలా ప్రజలు దైవానికి వెన్ను చూపుతున్నారు?

సమా: రాజసిక అహంకారం, దురాశ, డాంబికం వల్ల; దైవానుగ్రహాన్ని కాక, వారి ప్రయత్నాలనే ఎక్కువ నమ్మడం వల్ల.

ప్రశ్న: నేనెప్పుడూ వినలేదు — దైవానుగ్రహం అంతా చేస్తుందని; అలా కనబడితే ఎలా తెల్సుకోగలం మనం — అతడు సాధన చేయలేదని, గత జీవి తంలో? దీనిని మీరు ఖండించలేరు. ఖండించగలరా?

సమా: ఆధ్యాత్మిక చరిత్రలో అనేక సంఘటనలను చూపగలను — ప్రఖ్యాతి గాంచిన జగాయ్, మధాని[2] నుండి ప్రారంభించి; రెండు రెళ్ళు నాలుగు అని ఒప్పుకోవడాని కిష్టపడని బుద్ధికి వ్యతిరేకంగా చెప్పితే ఫలితముంటుంది? నీవు ఒప్పుకోలేవు. ఒప్పుకోగలవా?

ప్రశ్న: కేవలం అంటి పెట్టుకుండటం సరిపోదు. అలా అయితే మన ఆశ్రమంలో

---

[2] జగాయ్, మధాతు సంఘటన — చైతన్య నిత్యానందులకు సంబంధించినది. ఈ కథకు సంబంధించి అనేక వదంతు లున్నాయి. ఒక మారు చైతన్య వీధులలో క్రిష్ణనామ సంకీర్తన చేయుచుండగా — అతని స్నేహితుడు నిత్యానందుని ఎదుర్కొన్నారు ఇరువురు పరమ తాగుబోతులు — జగాయ్,మధాయ్‌లు. వారు దొంగలు, విధ్వంసకారుల ముఠాకు చెందినవారు. వారిలో మధాయ్ ఒక మట్టికుండను నిత్యానందుని మీదికి విసరి, అతని నుదిటిని గాయపర్చాడు. ఈ సంఘటన గురించి విన్న చైతన్య మహాప్రభువు కోపించి తన దివ్యచక్రంతో వారిరువురిని చంప బూనారు. వెంటనే నిత్యానందుడు వారిని క్షమించ మని ప్రాధేయపడ్డాడు. నిత్యానందుని ఔదార్యానికి వారిలో మార్పు వచ్చి, వారిరువురు

పిల్లి ఋషికి కూడ ఒకే అవకాశం ఉండగలదు.

సమా: అవును దానికి — వున్నది ఒక కొత్త తరహా ఉన్నత జన్మకు ఎదిగేందుకు — మరు జన్మలో — అంతా ఆమెకు అనుకూల వాతావరణంలో.

ప్రశ్న: రామకృష్ణుని బుజ్జి పిల్లి వంటి సాధకుడు కూడ — ఒక నిర్ణయాత్మక ప్రయత్నం — ఆత్మసమర్పణ — తప్పనిసరిగా చేయాల్సి వచ్చింది — మిగిలిన సత్తా నంతటిని — విధేయతలో ఉండమని బలాత్కరించవల్సి వచ్చింది అది — ఆర్యా, నన్ను చెప్పనీయండి — భూమిపై అతి కష్టమైనది.

సమా: నేనెప్పుడూ వినలేదు — బుజ్జి పిల్లి అలాంటి వాడని. అలా ఉంటే అది బుజ్జి పిల్లి కాజాలదు. (అది బుజ్జి కోతి. బుజ్జి పిల్లిలా ఉండడానికి ప్రయత్నించిన బుజ్జి కోతి. అదే అలా చేస్తుంది) నీకు నిజంగా, నా కంటే, రామకృష్ణుని కంటే కూడ. ఎక్కువ జ్ఞానం — ఆధ్యాత్మిక విషయాలలో వున్నది. నేను కేవలం తలవంచి, వినమ్రతతో, తక్కువ జ్ఞానం గలవారి వైపు నా దృష్టి మరలుస్తాను.

ప్రశ్న: జనం సాధనలో పడి, పక్కదారి పట్టిన సంఘటనలు గుర్తున్నాయి — దైవం ఏమీ చేయ లేకపోయాడు వారి విషయంలో. దైవానుగ్రహం దిగి రావడానికి ముందు — ఆకాంక్ష, త్యాగము, ఆత్మసమర్పణ, వంటివేవీ తన వ్యక్తిగత ఇచ్ఛకు వ్యతిరేకంగా చేయలేకపోయాడని — అలా చేద్దామనే నిశ్చయం కూడ చేయలేకపోయాడని

సమా: దైవానుగ్రహం కోసం వేచి వుండమని కూడ దాని అర్థం. ఇక్కడ వ్యక్తి ఇచ్ఛ అటువంటిది కాదు. వ్యక్తి ఇచ్ఛ వినాశనాన్ని కోరుకుంటే, అతని అహంకారం దైవంతో

చైతన్యులకు అంతేవాసు లయ్యారు.

3. ఋషీ — ఆశ్రమంలో నివసించే పిల్లి, శ్రీమాతారవిందుల దివ్యస్పర్శకు మార్పు చెంది, శ్రీమాత సన్నిధిలో ధ్యానం చేసేది. ఫలితంగా, మరణానంతరము — అనేక మెట్లు — పరిణామక్రమంలో పైకి దుమికి, మానవ జన్మ పొందినట్లు శ్రీమాత బహిర్గతం చేశారు.

దైవానుగ్రహం అందరకు లభిస్తుందని — అతి పెద్ద పాపికి, జంతువుకు కూడ, వారు తెరుచుకుని వుంటే, లభిస్తుందని చెప్పడానికే — జగాయ్, మథాయ్ ఉదంతాన్ని ప్రస్తావించారు శ్రీఅరవిందులు.

శత్రుత్వం వహిస్తే, దైవం తప్పనిసరిగా అతనికి — అతడు కోరని, అతను కాలదన్నే — తన అనుగ్రహాన్ని చూపనవసరం లేదు.

శ్రీఅరవిందులతో నిరోద్ బరన్ ఉత్తరప్రత్యుత్తరాలు, పుటలు 465-67)

అనువాదం: యస్. వై. సోమయాజులు

ఈదురు గాలులూ, నా చుట్టూ ఝుళిపించే పవనాలతో
పర్వత సానువుల నెక్కి చిత్తడి భూమికి వెళుతున్నా
నాతో రాగల దెవరు? నాతో కలిసి అధిరోహించే దెవరు?
కాలువ నెదురీది, మంచు గుట్టలపై నడుస్తూ
ధీరుడై, ఆపదల కాప్తుడై
నా సామ్రాజ్యానికి భాగస్వామియై నాతో నడిచే వాడెవరు?

(శ్రీఅరబిందో ఆలీపూర్ జైలులో ఉన్న సమయంలో రచించిన 'ఆహ్వానం' అనే కవిత నుండి సంగ్రహించినది)

CWSA 2:201

ఆధ్యాత్మిక జీవనానికి సంసిద్ధత

ఆధ్యాత్మిక జీవనానికి సంసిద్ధతకు చిహ్నాలు:

ప్రశ్న: ఆధ్యాత్మిక పథానికి సంసిద్ధత కలిగిందని చెప్పటానికి ఏమైనా గుర్తులు ఉన్నాయా? ముఖ్యంగా ఆధ్యాత్మిక గురువు లేనపుడు.

సమా: ఉన్నాయి. అతి ముఖ్యమయిన సంకేతం ఎలాంటి పరిస్థితులలో అయినా పరిపూర్ణమై నిలిచి వుండే సమత. ఇది అత్యంత ఆవశ్యకమయిన పునాది. చాలా నిశ్శబ్దమూ, నిశ్చలమూ శాంతియుతమూ యై వుండి శక్తి భరితం అయిన అనుభూతి వుంటుంది. అది జడత నుండి వచ్చే ప్రశాంతత కాదు. ఒక కేంద్రీకృతమయిన శక్తి భావన నుండి కలిగేది. ఎపుడూ, ఏమి జరిగినా, జీవితంలో అతి భయంకరమనిపించే పరిస్థితులలో కూడా నిన్ను నిశ్చలంగా ఉంచే ప్రశాంతత. అది మొదటి గుర్తు.

రెండవ గుర్తు. నీ సాధారణ చేతనలో నీవు పూర్తిగా బందీ అయినట్లుగా

భావించినపుడు — ఏదో అత్యంత కఠినతరమయినదిగా, ఊపిరి సలపనట్లుగా, భరించలేనట్లుగా, ఒక ఇత్తడి గోడకు రంధ్రం చేసి బయటపడాలని అనిపిస్తుంది. ఈ హింస ఎంతో దుర్భరంగా అనిపించి ఊపిరాడక పోవటం. బ్రద్దలు చేసుకొని బయటకు రావాలని లోపల నుండి ప్రయత్నించినా నీవు అలా చేయలేకపోతావు. ఇది కూడా మొదటి చిహ్నాలలో ఒకటి. నీ బాహ్యరూపం మరీ చిన్నదిగా అయిపోయినట్లనిపించే స్థాయికి నీ అంతర చేతన చేరుకొంది. సాధారణ జీవితం, సాధారణ కార్యకలాపాలు, సాధారణ సంబంధ బాంధవ్యాలు — ఇవన్నీ మరీ చిన్నవి, అల్పమైనవిగా అనిపిస్తుంది. వాటిని ఛేదించే ఒక శక్తిని నీలో అనుభూతి చెందుతావు.

మరొక లక్షణం కూడా ఉంది. నీ మనసును కేంద్రీకరించి, ఆకాంక్షించినపుడు దాదాపు వెనువెంటనే నీ లోనికి పైనుండి క్రిందకు ఏదో దిగి వస్తున్న భావన కలుగుతుంది. నీ కొక సమాధానం అందుతుంది. ఒక తేజస్సు, శాంతి, శక్తి క్రిందకు వచ్చినట్లుగా అనుభూతి చెందుతావు. నీవు ఎక్కువ సమయం వేచి వుండనక్కర లేదు. చాలా కాలం గడవవలసిన పని లేదు. ఆంతరమైన ఆకాంక్ష, పిలుపు మాత్రం చేత సమాధానం లభిస్తుంది. ఇది అనుసంధానత బాగా ఏర్పడిందని సూచిస్తుంది.

CWM 11:97

తొలుత అవసరమైన విషయం

ప్రశ్న:యోగం గురించి ఏమైన చెప్తారా?

సమా; నీవు దేని కోసం యోగం చెయ్యాలనుకుంటున్నావు? శక్తి పొందటానికా? శాంతి, నిశ్చలత కోసమా? మానవాళికి సేవ చెయ్యటానికా?

పై కారణాలేవీ నీవు యోగమార్గానికి అర్హుడవు అనటానికి తగినవి కావు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు. నీవు దైవం కోసం యోగమార్గాన్ని అనుసరించాలనుకుంటున్నావా? భగవంతుడే నీ జీవితంలో పరమోన్నత సత్యమా? ఎంతగా అంటే దైవం లేకుండా ఉండటం నీకు అసాధ్యమయినంతగా నీ జీవిత పరమార్థం దైవమే అని. దైవం లేకుండా నీ మనుగడకు అర్థం లేదనీ భావిస్తున్నావా? అపుడే ఈ మార్గానికి పిలుపు ఉందని చెప్పవచ్చు.

మొట్టమొదట ఆవశ్యకమయినది దైవానికై ఆకాంక్ష, తరువాత నీవు చేయవలసినది ఆ ఆకాంక్షను పోషించి, సర్వదా అప్రమత్తంగా, జాగృతంగా, సజీవంగా ఉంచు

కోవటం. అందుకు అవసరమైనది ఏకాగ్రత. దైవసంకల్పానికీ, లక్ష్యానికీ, సమగ్రమయిన, సంపూర్ణమయిన సమర్పణా దృష్టితో దైవంపై ఏకాగ్రతను కలిగి ఉండటం.

హృదయస్థానంపై ధ్యాసను కేంద్రీకరించండి. దానిలోకి ప్రవేశించి, లోపలికి, వెళ్ళగలిగినంత లోపలకు వెళ్ళండి. విస్తృతంగా పరుచుకున్న నీ చేతనా తంత్రులను ఏరికూర్చి, చుట్టివేసి ఒక్క దూకు దూకి మునిగిపో.

హృదయపు లోతైన నిశ్శబ్దంలో ఒక జ్వాల వెలుగుతున్నది. అది నీలోని దివ్యత్వం. నీ నిజమైన అస్తిత్వం. దాని స్వరాన్ని విను, దాని ఆదేశాలను శిరసావహించు.

CWM 3:1

ఆత్మాన్వేషణ ఆరంభ కేంద్రం

ప్రస్థాన ... కేంద్రం నీ శరీరానికి, జీవన స్థితిగతులకీ అతీతంగా నీ మానసికమయిన ఆలోచనల రూపకల్పన కాక, నీ భాష, అలవాట్లు, నీవు జీవించే పరిసరాలు, నీవు జన్మించిన దేశకాలాలపై ఆధారపడినది కాక భిన్నంగా నీలో స్వతంత్రంగా ఉన్నదానిని అన్వేషించాలి. నీ అస్తిత్వపు లోతులలో విశ్వజనీనతను, అవధులు లేని పరివ్యాపకతను అవిచ్ఛన్నంగా కొనసాగుతున్న దానిని నీవు కనుగొనాలి. అపుడు వి కేంద్రీకరించి, పెంచి, విస్తరింప చెయ్యి. నీవు అన్నిటిలోనూ అన్ని ప్రాణులలోనూ జీవించటం ప్రారంభిస్తావు. వ్యక్తులను వేరు చేసే అడ్డుగోడలు కూలిపోతాయి. వాళ్ళ ఆలోచనలలో ఆలోచిస్తావు. వారి స్పందనలలో ప్రకంపిస్తావు. వాళ్ళ అనుభూతులలో నీవు చెందుతావు. వారి స్పందనలలో ప్రకంపిస్తావు. వాళ్ళ అనుభూతులలో నీవు అనుభూతి చెందుతావు. వారందరి జీవితాలలో జీవిస్తావు. జడంగా కనిపించినదంతా ఒక్కసారిగా ప్రాణంతో నిండిపోతుంది. నిర్జీవ శిలలు, సజీవాలౌతాయి, రాళ్ళు చలించటం, మొక్కలు అనుభూతి చెందటం, సంకల్పించటం, బాధ పడటం మొదలు పెడతాయి. జంతువులు మూగభాషలో మాట్లాడటం మొదలు పెడతాయి. సమయం పరిమితి లేకుండా ఒక మహత్తరమైన చేతనతో అన్నీ చలించటం మొదలవుతుంది. ఇది అంతరాత్మ సిద్ధికి ఒక పార్శ్వం మాత్రమే. ఇంకా ఉన్నాయి మరెన్నో ఉన్నాయి. అన్నీ నీ అహంకారపు అవధులు, నీ బాహ్యవ్యక్తిత్వపు గోడలు నీ ప్రతిచర్యల నిర్వీర్యత, నీ సంకల్పపు అసమర్థతలు దాటి వెళ్ళటానికి నీ కుపకరిస్తాయి.

నేను ముందే చెప్పినట్లుగా అటువంటి సిద్ధి కలగటానికి మార్గం సుదీర్ఘమూ,

కంటకప్రాయమూ, కష్టతరమూ — సడలని దృఢమైన పట్టుదలను ఆశించే పరిష్కరించవలసిన సమస్యలతో ఉంటుంది.

అది ఎవరూ చరించని అడవి గుండా, ఒక తెలియని ప్రదేశ అన్వేషణకై, ఆవిష్కరణకై సాగే పరిశోధకుడి ప్రయాణంలా ఉంటుది. ఒక నూతన ఖండాన్ని కనుగొనటానికి కావలసిన ఓర్పు, సహనాలే అంతరాత్మ ఆవిష్కరణకూ అవసరమవుతాయి. ఈ పరిశోధనకు ఉపక్రమించినవారికి కొన్ని సరళమయిన మాటల సలహా ఉపయోగపడవచ్చు.

అన్నింటి కన్నా ముందుగా తెలుసుకోవలసిన అతి ముఖ్యమయిన విషయమేమిటంటే మనసు ఆధ్యాత్మిక విషయాలను విశ్లేషించ లేదు.

ఈ విషయంపై వ్రాసిన వారందరూ యిలానే చెప్తారు. చాలా కొద్దిమంది మాత్రమే దానిని ఆచరించారు. ఈ మార్గంలో ముందుకు వెళ్ళటానికి అన్ని రకాలయిన మానసిక అభిప్రాయాలు, స్పందనల నుడి పూర్తిగా దూరంగా ఉండటం అనివార్యం.

CWM 12:32-33

శ్రీమాత

అనువాదం: డా. సరోజినీ ప్రసాద్

ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించడం

ప్రవేశమును సూచించే మొదటి గుర్తులు

ప్రశ్న: ఒక వ్యక్తి నిజంగా ఆధ్యాత్మిక పథంలోకి ప్రవేశించాడని ఎప్పుడు చెప్పగలం?

సమా: నా ఉద్దేశంలో సంఘటనలు జరిగే క్రమాన్ని పరిశీలనలోకి తీసుకుంటే, మొదటి గుర్తు (అది అందరికీ ఒకే విధంగా ఉండదు), నీకు ఇతరమైనది ప్రతిదీ పూర్తిగా ప్రాముఖ్యం లేనిదిగా కనపడుతుంది. మొత్తం నీ జీవితం, నీవు చేసే పనులన్నీ, మొత్తం నీ గమనాలు సాగిపోతూనే ఉంటాయి, అదీ పరిస్థితులు ఆ విధంగా సమకూడితే, కాని అవన్నీ నీకు ఏ మాత్రం ప్రాముఖ్యం లేనివిగా అనిపిస్తాయి, నీ

అస్తిత్వ ఉనికికి అవి ఇక ఏ మాత్రమూ అర్థవంతంగా తోచవు. నేను దీనిని మొదటి గుర్తు అని నమ్ముతున్నాను.

ఇంకా వేరే కూడా ఉండవచ్చు, ఉదాహరణకు, ప్రతిదీ తేడాగా ఉన్న అనుభూతి, తేడాగా జీవిస్తున్న అనుభూతి, మనస్సులో ఇంతకు మునుపు లేని కాంతి, హృదయంలో ఇంతకు మునుపు లేని ప్రశాంతి. అది మార్పు తీసుకువస్తుంది; కాని గుణాత్మకమైన మార్పు సాధారణంగా తరువాత వస్తుంది. చాలా అరుదుగా అది మొదట ఒక మెరుపు లాగా మాత్రమే ఒక వ్యక్తి ఆధ్యాత్మిక జీవితానికి మారే సమయంలో వస్తుంది. అప్పుడప్పుడు, అది ఒక గొప్ప వెలుగు విరజిమ్ముతూ మొదలవుతుంది, గాఢమైన సంతోషం నీలో ప్రవేశిస్తుంది; కాని సర్వసాధారణంగా, తరువాత అది ప్రకటనలేక వెనుక ఉండిపోతుంది, ఎందువల్లనంటే, ఇంకా నీలో చాలా అపరిపూర్ణతలు గట్టిగా పట్టుకుని వేలాడుతున్నాయి.... అదేమీ ఏవగింపూ కాదు, తిరస్కారమూ కాదు, కాని నీకు ప్రతిదీ ప్రాముఖ్యరహితమైనదిగా తోస్తూ వాటి బధ్యతలను స్వీకరించాలని అనుకోవు. ఉదాహరణకు, నీవు కొన్ని భౌతిక పరిస్థితుల మధ్య ఉన్నపుడు ఆహ్లాదకరమైనవైనా లేక ఆహ్లాదకరం కాకపోయినవైనా (రెండింటి కొసలూ కలుస్తాయి), నీకు నీవు చెప్పుకుంటావు, "అదంతా నాకు అంత ముఖ్యమైనదేనా? కాని అది నాకు మాత్రం ముఖ్యమైనది కాదు!" నీకు నిజంగా అవతలి వైపుకు మరలిన గట్టి అభిప్రాయం ఏర్పడుతుంది.

ఆధ్యాత్మిక జీవితం అంటే ఒక మూల కూర్చుని ధ్యానం చేయగల సామర్థ్యం కలిగి ఉండటమేనని కొంతమంది ఊహ! అది చాలా, చాలా సర్వ సాధారణమైన భావన. నేను ఈ విషయంలో చాలా నిష్కర్షగా ఉండబోవటం లేదు, కాని ధ్యానానికి ఎక్కువగా తమ సామర్థ్యాన్ని వినియోగించే అధిక శాతం జనులు — వారు ఒక గంటలో ఒక నిమిషం కూడా ధ్యానం చేస్తారని నేను అనుకోను. నిజంగా ధ్యానం చేసేవారు దాని గురించి ఎన్నడూ మాట్లాడరు; వారికది చాలా సహజమైన విషయం. అది అంత సహజమైన విషయం అయినప్పుడు, దానికి అంత ఔన్నత్యం నీవు ఆపాదించినప్పుడు, నీవు నీకు పురోభివృద్ధిని పొందుతున్నావని చెప్పుకోవడం మొదలుపెడ్తావు. ఎవరైతే దానిని గురించి మాట్లాడతారో వారికది మిగతావారి

కంటే ఆధిక్యతను కలుగజేస్తుంది, ఇది కచ్చితం అనుకో, వారు అత్యధిక సమయం జడత్వంలోనే ఉంటారు.
CWM 4:103

అంతరంగ కవాటలు తెరవడం

ఎన్నో రకాలైన ధ్యానపద్ధతు లున్నాయి.... నీవు ఒక భావనను అంది పుచ్చుకుని, దాని వలన రావలసిన ఫలితం పొందే వరకు దానిని అనుసరించవచ్చు — ఇది క్రియాశీలమైన ధ్యానం. సమస్యను పరిష్కరించాలనుకున్న మనుషులు లేదా లిఖితరూపంగా పెట్టదలచుకున్నవారు ఈ విధంగా ధ్యానం చేస్తారు, కాని వారికి తాము ధ్యానం చేస్తున్నామనే సంగతి తెలియదు. తదితరులు, సుఖాసీనులై, ఎటువంటి భావనను అనుసరించకుండా ఏదో ఒకదాని మీద ఏకాగ్రత వహించే ప్రయత్నం చేస్తారు — తమ ఏకాగ్రతాశక్తిని తీవ్రతరం చేయడానికి కేవలం ఒక విషయం మీదే ఏకాగ్రం చేస్తారు; అది ఒక విషయం మీద ఏకాగ్రం చేసినప్పుడు సర్వ సాధారణంగా ఏం జరుగుతుంది అనే దానిని తెలియజేస్తుంది: ఒక విషయం మీద తగిన రీతిలో నీ సామర్థ్యంతో ఏకాగ్రతను కూడ గట్టుకోవడంలో నీవు కృతార్థుడవైతే, అది మానసికమూ, ప్రాణికమూ లేదా భౌతికమూ ఏదైనప్పటికీ, ఆ క్షణంలో దాని ద్వారా ముందుకు సాగిపోయి, మరియొక చైతన్యంలో ప్రవేశిస్తావు. ఇంకా ఇతరులు చేసేదేమంటే, ఒక నిశ్శబ్ద ప్రశాంతతలోకి చేరడానికి తమ తలలో నుంచి అన్ని గమనాలనూ, భావాలనూ, ప్రతిబింబాలనూ, ప్రతిక్రియలనూ బయటకు నెట్టివేస్తూ ఉంటారు. ఇది చాలా కష్టసాధ్యం, 25 సంవత్సరాలు దీని కోసం ప్రయత్నించిన వారున్నారు, కాని విజయం సాధించలేదు, ఎందువల్లనంటే అది ఏటికి ఏదురీదటం లాంటిది.

ఇంకొక విధమైన ధ్యానపద్ధతి వుంది, అందులో వ్యక్తి తాను ఎంత మట్టుకు ప్రశాంతంగా వుండగలో అంతగానే ఉంటాడు, కాని ఆలోచనలను ఆపాలనే ప్రయత్నం చేయడు, ఎందువల్లనంటే కొన్ని ఆలోచనలు యాంత్రికమైనవై ఉంటాయి, వాటిని ఆపాలనే ప్రయత్నం చేస్తే దానికి సంవత్సరాలు పడుతుంది, పైగా ఆశించిన ఫలితం దక్కుతుందనే నమ్మకం లేదు; దాని కంటే ఉత్తమం నీవు నీ చైతన్యాన్నంతా కూడదీసుకుని, సాధ్యమైనంతగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటూ, బాహ్యవిషయాల

నుంచి వాటి మీద ఆసక్తి లేనట్లుగా వాటి నుంచి, వేరుపడాలి. అప్పుడు హఠాత్తుగా ఒక్కసారిగా, నీ లోని ఆకాంక్ష అనే జ్వాలను ఉద్దీపించి, దాని లోని మంటను పైకి పై పైకి ఇంకా పైకి ఎగసేటట్లుగా, వచ్చే వాటనన్నింటిని వేసి; దానితో తాదాత్మ్యం చెంది, నీ చైతన్యం, ఆకాంక్ష చివరి అంచు వరకు వెళ్ళి, దేనిని గురించీ ఆలోచించకుండా — కేవలం, ఒక ఆకాంక్ష పెరిగి, పెరిగి, మరితంగా పెరిగి, ఒక్క నిమిషం కూడా ఫలితం గురించి ఆలోచించకుండా, ఏది జరుగుతున్నదీ, ప్రత్యేకించి ఏమి జరగకూడదు, అన్నింటినీ మించి ఏదో వస్తుందనే కోరిక లేకుండా — పెరిగి, పెరిగిపోతూ ఎక్కువెక్కువగా తనకు తాను తీవ్రతరం చేసుకునే ఆకాంక్ష హర్షాతిరేకంతో నిరంతరమైన ఏకాగ్రతను కలిగి ఉండాలి. అప్పుడు, అక్కడ నేను మీకు ఆశ్వాసన ఇచ్చేదేమంటే, జరిగేదంతా మంచే జరుగుతుందని. అంటే, ఇది చేయగానే నీకు ఎంత వరకు సాధ్యపడగలదో అంతగా సాక్షాత్కరించుకో గలుగుతావు. ఈ సాధ్యాసంభావ్యతలు వ్యక్తులను బట్టి ఎంతో వైవిధ్యభరితమైనవై ఉంటాయి. కనుక ఈ విధంగా నిశ్శబ్దంగా ఉండాలని ప్రయత్నించడం, ఆకృతుల ననుసరించి వాటి వెనుక పోవడం, సమాధానాలిచ్చే శక్తిని ఆవాహన చేయడం, నీ ప్రశ్నలకు సమాధానం కోసం నిరీక్షించడం, అటువంటివన్నీ భ్రాంతిపూర్వకమైన ఆవిరి మేఘంలాగా అదృశ్యమైపోతాయి. ఈ జ్వాలలో నీవు ఎరుకతో జీవించడంలో విజయం సాధిస్తే, ఈ విధంగా ఆకాంక్షను పెంచుకుంటూపోగలిగితే, తక్షణ ఫలితం సాధించకున్నా, కొంతకాలం తర్వాత ఏదో ఒకటి జరగడం తప్పక చూస్తావు.
CWM 4:104-05

సాధనాపథంలో మొదటి చలనాలు

ప్రశ్న: "బాహ్యరూపాలలో కూరుకుపోయి తనకు తాను మరచిపోయినటువంటి స్వార్థపూరిత అహంకారస్థితిలోని చైతన్యం నుంచి మానవ ఆత్మను మరలించటం యోగవిధానం..." "బాహ్యరూపాలలో కూరుకుపోయి తనను తాను మరచిపోయి నటువంటి స్వార్థపూరిత చైతన్యం..." అనేది నాకు పూర్తిగా అర్థం కాలేదు.

సమా: మనుషులు బాహ్యవిషయాలలో నిమగ్నమై ఉంటారు. అనగా, చైతన్యం బాహ్యవిషయాల దిశగా మరలించబడి ఉంటుంది, — అంటే, అతడు చూసేది, తెలుసుకునేది అంతా — అంతరాంతరాళాల్లోని గాఢతరమైన సత్యాన్ని, ఆ

దివ్యసన్నిధిని తెలుసుకొనే నిమిత్తం అంతరంగం వైపు మరలటానికి మారుగా. ఇది మొదటి చలనం. నీవు చేసే పనులన్నింటితోటి నీవు తీరిక లేకుండా గడుపుతుంటావు, నీ చుట్టూ వున్న మనుషులతో, నీవు ఉపయోగించేవాటితో; తరువాత జీవించడంలో: నిద్రపోవడం, తినడం, మాట్లాడటం, కొంత పని చేయడం, కొంత వినోదం కూడా కలిగి ఉండటం; వాటినే తిరిగి మొదలుపెట్టడం; నిద్రపోవడం, తినడం మొదలైనవి, మళ్లీ వాటినే పునరావృతం కావించడం. అనంతరం, ఒకరు ఇది ఏమని చెప్పారు, ఒకరు దానిని ఏ విధంగా చేశారు, ఒకరు విధిగా చేయవలసిన దేమిటి, ఒకరు విధిగా నేర్చుకోవలసిన పాఠం ఏమిటి, ఒకరు విధిగా తయారుగావడానికి చేయవలసిన అభ్యాసం ఏమిటి; ఇంకా తాను ఆరోగ్యం పొంది తయారుగా ఉన్నాడని అనుకుంటు న్నాడా మొదలైనవి. వీటిని గురించే ఒకరు సాధారణంగా ఆలోచిస్తూ ఉండేది.

కనుక మొదటి చలనం — అది అంత తేలికైన విషయం కాదు — దాని నంతటిని వెనక్కు పంపించివేయడం, ఒకే ఒక్కదానిని మాత్రం ముఖ్యమైనదిగా లోనికి, చైతన్యం ముందుకు రానివ్వం: తన ఉనికికి, జీవితానికి అసలైన లక్ష్యాన్ని కనుగొనడం, తానేమిటో, తాను ఎందుకు జీవిస్తున్నాడో, దీని కంతటికి వెనుక ఏమున్నదో తెలుసుకోవడం. ఇది మొదటి అడుగు. అభివ్యక్తమైన సృష్టి కంటె, దీని కారణంలో, ధ్యేయంలో ఆసక్తి కలిగి ఉండటం. అనగా, మొదటి చలనం, బాహ్యంలోనూ, ప్రత్య క్షంగా కనపడే విషయాలలోనూ పూర్తిగా తాదాత్మ్యమై ఉండే చైతన్యాన్ని ఉపసంహ రించి, తాను కనుగొనాలన్నదాని మీద, తాను కనుగొనలానుకొన్న మహాసత్యం మీద ఒక విధమైన అంతరంగ ఏకాగ్రతను ఏర్పరచుకోవడం. ఇది మొదటి చలనం.

ఇక్కడ నివసించేవారిలో చాలా మంది ఒక విషయాన్ని మరచిపోతున్నారు. వారు చివర నుంచి మొదలు పెట్టాలని చూస్తున్నారు. అతిమానసిక మహాశక్తి లేక మహాచైతన్యం అని వారు పిలిచేదానిని వారి జీవితంలో అభివ్యక్తం చేయటానికి వారు తయారుగా ఉన్నారని వారు అనుకుంటున్నారు. ఇంకా వారు వారి చేతలలో, చలనాలలో, నిత్యజీవితంలో దీనిని చొప్పించాలని అనుకుంటున్నారు, కాని వున్న కష్టమల్లా అతిమానసిక మహాశక్తి లేక మహాచైతన్యం అంటే ఏమిటో వారికే మాత్రమూ తెలియకపోవడం, దానికి ముందు జరగవలసిన ఆవశ్యకమైన విషయం, మహాసత్యం అభివ్యక్తతకై తన అంతరంగంలో వెతకటానికి వెనుకకు మరలే మార్గాన్ని తీసుకోవడం, లోనికి వెడలే మార్గానికి తెర తీయడం, జీవితం నుంచి ఉపసంహరణ.

అతడు దానిని తెలుసుకోలేనంత కాలం, అభివ్యక్తం చేయడానికంటూ ఏమీ ఉండదు. అతడు తాను అపురూపమైన జీవితాన్ని గడుపుతున్నట్లుగా ఊహించుకుంటే, అతడు తన అపూరూపమైన స్థితి అనే భ్రాంతిలో మాత్రమే జీవిస్తాడు. అందువలన, మొదటగా తప్పక తాను తన ఆత్మను, దానిని వశం చేసుకొని వున్న దైవాన్ని తెలుసుకోవడమే కాకుండా, అతడు దానితో తప్పక తాదాత్మ్యం చెందాలి. దాని తరువాతనే, అతడు తన బాహ్యకార్యకలాపాలకు తిరిగి రావడం ప్రారంభించవచ్చును, తరువాత వాటిని పరివర్తన చేయవచ్చు; ఎందువల్లనంటే, అప్పుడు అతడికి వాటిని ఏ దిశగా తిప్పాలో, దేనిలోకి పరివర్తన చేయాలో తెలుస్తుంది. ఈ స్థాయి పైగా మాత్రం అతడు లంఘించలేడు.

ఒకరు తన ఆత్మను తప్పక తెలుసుకోవాలి, దానితో తనకు తాను తాదాత్మ్యం చెందాలి, ఇది పూర్తిగా అనుల్లంఘనీయం. తరువాత అతడు పరివర్తన చేపట్టవచ్చు. శ్రీఅరవిందులు ఇలా వ్రాశారు: "ఇతర యోగాలు అంతమైన చోటు నుంచి మా యోగం మొదలవుతుంది".

CWM 7:349-50

యోగం చేయడానికి ఒకరు తప్పనిసరిగా ఎరుకతో దానిని కోరుకోవాలి

చూడు, ఒకరికి చాలా మంచి ఇచ్ఛ ఉండవచ్చు, దైవాన్ని సాక్షాత్కరించుకొనే దిశగా జీవితం ఉద్దేశించబడి ఉండవచ్చు, ఏదైనా గాని, కొంచెం హెచ్చుతగ్గులతో దైవకార్యానికి పై పై సమర్పణతో, కాని యొగం చేయడానికి మాత్రంకాదు.

శ్రీఅరవిందుల యోగం చేయడం అంటే తాను సమగ్రంగా పరివర్తన చెందాలని కోరుకోవడం, అదే జీవితంలో ఏకైక లక్ష్యం కావాలి, అది ఎటువంటిదంటే ఇతరమైనదేదీ ఇక ఏమాత్రమూ మిగిలి ఉండదు, కేవలం అది మాత్రమే ఉంటుంది. అంటే ఒకరు స్పష్టంగా తనలో అనుభూతిని పొందుతారు, కోరుకున్నా కోరుకోకపోయినా; కాని ఒకరిలో అది కలుగకపోతే, అయినా కూడా అతడు ఒక ఆదరణీయమైన జీవితం, ఒక సేవకు అంకితమైన, అర్థయుక్తమైన జీవితంగ ఉండవచ్చు. మహత్తరమైన కార్యమునూ చాలా తేలికగా పూర్తిచేసే విధంగా పరిశ్రమించవచ్చు — అటువంటి

వాటిని — ఒకరు ఎన్నో చేయవచ్చు. కాని వాటికీ, యోగం చేయడానికీ ఎంతో గొప్ప తేడా ఉంది.

యోగం చేయడానికి నీవు తప్పక ఎరుకతో కోరుకోవాలి, మొదలు పెట్టడానికి నీవు అదేమిటో తప్పక తెలుసుకోవాలి, నీవు దాని గురించి ఒక దృఢమైన నిర్ణయం తప్పక తీసుకోవాలి; ఒకసారి దృఢనిర్ణయం తీసుకున్న తరువాత, నీవు ఏమాత్రం జంకగూడదు. ఈ కారణంగానే, నీవు తప్పకుండా ఆ విషయానికి సంబంధించిన సంపూర్ణ జ్ఞానంతో దానిని స్వీకరించాలి. నీవు నిర్ణయించకొనే ముందు, "నేను యోగం చేయాలని కోరుకుంటున్నాను" అని తప్పకుండా చెప్పేటప్పుడు, నీవు దేనిని గురిచి నిర్ణయం తీసుకుంటున్నావో అది నీకు తప్పక తెలిసుండాలి; అందువలననే, ఈ విషయంగా నిన్నెప్పుడూ ఒత్తిడి చేసానని అనుకోను. నేను ఈ విషయంగురించి నీకు చెప్పగలను. ఓహ్! నేను దీని గురించి చాలానే చెప్తాను, దానిని గురించి నేను చెప్పటానికి ఇక్కడ నాకు నీవున్నావు; కాని వ్యక్తిగతంగా, "అవును, ఏదైనా కాని యోగం గురించి నా భావన నా కుంది, నేను యోగం చేయాలని కోరుకుంటు న్నాను" అని ఎవరైనా చెప్తే , వారికి మాత్రం; సరే మంచిదే అలాగే అని అంటాను.

అప్పుడు, అటువంటివారికి అది యేదో వేరే విధంగా ఉంటుంది, జీవితంలోని నియమనిబంధనలు వారికి వేరుగా ఉంటాయి, ప్రత్యేకించి ఆంతరికంగా. ప్రత్యేకించి అంతరంగపరంగా, విషయాలు మారిపోతాయి.

అక్కడ ఎల్లప్పుడూ ఒక చైతన్యం, నిరంతరం అచటి పరిస్థితిని సరిచేయటానికి పని చేస్తూ ఉంటుంది, నిన్ను ఎల్లకాలమూ అడ్డంకులతో కూడుకున్న పరిస్థితులలో ఉండేటట్లు చేస్తూ, నీ తప్పులకూ, నీ సొంతమే అయిన నీ అవివేకపు పనులకూ పడిపోయేటట్లు చేస్తూ ఉంటుంది. కేవలం ఎవరైతే యోగం చేయాలని నిర్ణయించు కున్నారో వారికి మాత్రమే ఇది ఈ విధంగా పని చేస్తుంది. తక్కినవారికి ఆ మహా చైతన్యం ఒక ప్రకాశంగా, ఒక జ్ఞానంగా, ఒక రక్షణగా, ఒక అభివృద్ధి శక్తిగా పని చేస్తుంది, దాని మూలంగా వారు వారి అత్యున్నత సామర్థ్యాలకు చేరుకోగలరు, సాధ్యమైనంత అనుకూలమైన వాతావరణంలో సాధ్యమైనంతవరకు అభివృద్ధిని పొందగలరు — కాని ఎంపికలో వారి వారి సంపూర్ణ స్వేచ్ఛకు వదలివేయడం జరుగుతుంది.

CWM 7:198-99

యోగం: ఒక అంతరంగ నిర్ణయం, కాని బాహ్యమార్పు కాదు

నిర్ణయం తప్పక అంతరంగం లోనుంచి రావాలి. యోగం చేయాలనే స్పృహతో వచ్చినవారు, యోగం అంటే ఏమిటో అవగాహనతో వచ్చినవారు, అటువంటివారు, వారు ఇక్కడ జీవించడానికై నిబంధనలు.... బాహ్యంలో ఏ తేడా ఉండదు, కాని అంతరంగంలో గొప్ప తేడా ఉంటుంది. అక్కడ చైతన్యంలో ఒక రకమైన నిరంకుశత్వం, వారిని మార్గంలో నుంచి వైదొలగకుండా చూస్తుంది: అతడు చేసే తప్పులు తక్షణం అతడికి ప్రస్ఫుటమౌతాయి, వాటి పర్యవసానాలతో సహా. అవి ఎంత బలంగా ఉంటాయంటే అతడు మళ్ళీ ఆ విషయంగా అటువంటి తప్పులను చేయలేని విధంగా, విషయాలు చాలా గంభీరతను సంతరించుకుంటాయి.

...కాని, నీవు ఎంచుకున్న రోజు నుంచి — మొత్తం నీ చిత్తశుద్ధితో ఆ పని చేసి, నీ అంతరంగంలో ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్న అనుభూతి పొందినప్పుడు — అది వేరుగా ఉంటుంది. అక్కడ అనుసరించవలసిన జ్ఞానప్రకాశం, ఒక మార్గం ఉంటుంది, నీవు దాని నుంచి ఏమాత్రం పక్కకు మళ్ళకూడదు. అది ఎవ్వరినీ వంచించదు, తెలిసిందా; యోగం అంటే తమాషా కాదు. నీవు దానిని ఎంచుకున్నప్పుడు, నీవు చేసే పని నీకు తప్పక తెలిసి ఉండాలి. కాని ఒకసారి ఎంచుకున్న తరువాత, దానికి కట్టుబడి ఉండాలి. నీకు ఇక ఏ మాత్రమూ ఊగిసలాటకు ఆస్కారం లేదు. నీవు సూటిగా ముందుకు తప్పక పోవలసినదే. అదీ విషయం!

నేను కోరుకునేది మాత్రం ఏమిటంటే, బాగా చేయాలనే ఇచ్ఛను కలిగి ఉండటం, పురోభివృద్ధికై ప్రయత్నం, జీవితం సాధారణ మానవులను ఒకింత మించి ఉండటం. నీవు చాలా ప్రత్యేక ప్రకాశంలో, ఎరుకు గలిగిన, సామరస్యపూరితమైన, పూర్తి ఆదరణీయతతో కూడిన పరిస్థితులలో పెరిగి, అభివృద్ధిని పొందావు; దానిని ప్రతి స్పందనగా నీవు ఈ ప్రపంచంలో ఈ ప్రకాశాన్ని, ఈ సామరస్యతను, ఈ ఆదరణీయ తను అభివ్యక్తంచేయి. ఇది నాటి నుంచీ అత్యుత్తమం, అత్యుత్తమం.

CWM 7:199-200

యోగం నీ ఏకైక లక్ష్యంగా అయితేనే చేయి.

యోగాభ్యాసం ఈ పరివర్తన యోగాభ్యాసం, అన్ని యోగాలలోకి, అత్యంత

కష్టసాధ్యమైనది — అది, ఒక వ్యక్తి ఇక్కడకు వచ్చినది కేవలం దీని కోసమేనని అనుభూతి పొందితే (అంటే దానర్థం, ఈ భూమి మీదకు), అతడు, మరేమీ చేయడానికి లేదు ఇది తక్క అనీ, అదే కేవంల తన ఉనికికి పరమార్థమనీ దృఢంగా తీర్మానించు కుంటే — ఒక వేళ అతడు అతి ప్రయాసతో శ్రమించవలసి వచ్చినప్పటికీ కష్టపడవలసి వచ్చినప్పటికీ, సంఘర్షించ వలసివచ్చినప్పటికీ అది అంత ముఖ్యమైన విషయం కాదు — "ఇదే నేను కోరుకునేది, మరి ఇతరమేమీ కాదు" — అన్నప్పుడు అది విభిన్నం. అలా కాకపోతే, నేను ఏమంటానంటే, "సంతోషంగా ఉండండి, మంచిగా ఉండండి, మీ నుంచి ఆశించేది అదే. మంచితనంతో, అర్థం చేసుకుంటూ ఉండే రీతిలో, మీరు జీవించిన కాలంలోని ఈ పరిస్థితులు చాలా అసాధారణమైనవనే విషయాన్ని తెలుసుకుంటూ, ఎక్కువ ఉన్నతంగా, ఎక్కువ ఉదారంగా, సాధారణ జీవితం కంటె ఎక్కువ ఋజుజీవితాన్ని జీవించే ప్రయత్నం చేస్తూ, కొద్దిగా ఈ చైతన్యమూ, ఈ ప్రకాశమూ, దాని శ్రేయస్సూ ఈ ప్రపంచంలో అభివ్యక్తమవటానికి అనుమతిని ఒసంగుతూ జీవించండి. అది చాలా మంచి విషయం". అదీ సంగతి

కాని, ఒకసారి యోగమార్గంలో అడుగువేస్తే, నీవు తప్పక ఉక్కువంటి దృఢ నిర్ణయంతో, సూటిగా లక్ష్యం వైపుకు సాగిపోవాలి, విజయమో, వీరస్వర్గమో — ఏది ఏమైనా.

CWM 7:200

నిజమైన ఆధ్యాత్మిక జీవితానికి ప్రారంభాలు

సాధారణ జీవితంలో లక్షలలో ఒకడు గూడా తన చైత్య అస్తిత్వంతో ఎరుకతో సంపర్కం కలిగిన వాడుండడు, కేవలం క్షణకాలమైనా కాని. చైత్య అస్తిత్వం అంతరంగంలో నుంచి పని చేస్తుంది, కాని బాహ్య అస్తిత్వాని కది ఎంతో అదృశ్యంగా, ఎరుక లేనిదిగా, అసలు లేనట్లుగానే ఉంటుంది. కాని,చాలా సందర్భాలలో, అధికాధికం ప్రజలలో, చాలా మట్టుకు మొత్తం అందరిలో అది నిద్రాణమై ఉందని అనిపించే విధంగా, ఏ మాత్రం కార్యకారి కానిదై, ఒక విధంగా జీవచ్ఛం వలె జడమయంగా ఉంటుంది.

కేవలం సాధన వలన, చాలా గట్టి పట్టుదలతో కూడిన ప్రయత్నం వలన ఒకరు చైత్య అస్తిత్వంతో ఎరుకతో కూడిన సంపర్కం పొందడంలో విజయం సాధించగలరు.

సహజంగానే, అసాధారణమైనటువంటి కొందరు వ్యక్తుల విషయాలలో అది — కాని, ఇది నిజంగా అసాధారణం, అటువంటివారు చాలా స్వల్పం, వేళ్ళ మీద లెక్కించవచ్చు — చైత్య అస్తిత్వం పూర్తిగా రూపుదిద్దుకున్నదై, స్వతంత్రతను పొందిన అస్తిత్వం, తనకు తాను ప్రభువైనది, తన పని చేయడం కోసమై మానవ శరీరాన్ని ధరించి భూమి మీదకు తిరిగి రావాలని నిశ్చయించుకున్నవాటి విషయాలలో అది సంభవం. ఇటువంటిది జరిగినప్పుడు, ఆ వ్యక్తి సాధనను ఎరుకతో చేయకపోయి నప్పటికీ, అతని చైత్య అస్తిత్వం చాలా శక్తివంతం అయినదవటం సాధ్యపడుతుంది, ఫలితంగా కొంచెం హెచ్చుతగ్గులతో ఎరుకతో కూడిన సంపర్కం కలిగి ఉండటమూ సాధ్యమౌతుంది. కాని, ఇటువంటి సందర్భాలు, చెప్పాలంటే అవి అసమానమూ, అసాధరణమూ కాగా, అవి నిబంధనలను ధృఢపరచి వర్తింప జేస్తాయి.

చాలా మట్టుకు అన్నింటిలో, చాలా మట్టుకు అన్ని సందర్భాలలో, చాలా, చాలా నిలకడతో పడిపోకుండా చేసే ప్రయత్నం ఒకరికి తన చైత్య అస్తిత్వపు ఎరుకను పొందడానికి ఆవశ్యకమౌతుంది. సాధారణంగా, ఒక వ్యక్తి 30 సంవత్సరాలోల దానిని సాధించగలిగితే అతడు ఎంతో అదృష్టవంతుడు — 30 సంవత్సరాల నిలకడతో పడిపోకుండా చేసే ప్రయత్నం, అని నేను చెప్తాను. అది దానికంటే త్వరితంగానూ జరిగే అవకాశం ఉంది. కాని అది చాలా అరుదు, అటువంటిది జరిగినప్పుడు, తక్షణం ఒకరు ఏమంటారంటే, “అతడు సాధారణ మానవుడు కాదు”, అటువంటి మనుషులనే కొంచెం హెచ్చుతగ్గులతో దివ్య అస్తిత్వాలుగా భావించడం జరుగుతుంది; వారు గొప్ప యోగులు, గొప్ప ఉపదేశకులు.

CWM 7:269

శ్రీమాత

అనువాదకులు: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మార్గం — ఎన్నిక

దైవమే శిష్యుణ్ణి ఎన్నుకుంటాడు

ప్రశ్న: శ్రీమాతా, ఇక్కడ "అనంతాన్ని ఎన్నుకున్నవారు అనంతంచేత ఎన్నుకోబడినవారే" అని చెప్పబడింది.

అది ఒక అత్యద్భుత వాక్యం

అది సంపూర్ణమైన సత్యం. 'Thoughts and Glimpses' లో కూడా ఇలాంటి వాక్యం ఉంది, అయితే అక్కడ 'అనంతం' అన్న మాటకి బదులుగా 'దైవం' అన్న మాట నుపయోగించారు. కాని భావం ఒక్కటే — అది దైవమే నిన్ను ఎన్నుకున్నాడు, ఆ అనంతమే నిన్ను ఎన్నుకుంది అన్న భావం. అందువల్ల నీవు 'అతడి' వెంట పరుగెడతావు.

అతడు ఇచ్చినది ఇదే — అదే అతడు చెప్పినది, ఇవ్వలేదా? — అతడి అభయమే మనకి ఆ విధమైన నమ్మకాన్ని దృఢ విశ్వాసాన్ని ఇచ్చినది, కచ్చితంగా అది ముందుగానే విధిగా నిర్ణయించబడింది — అది ముందుగానే నిర్ణయింపబడినప్పుడు, దాటలేనంత పెద్ద కష్టాలున్నా కూడా నీ విజయం తథ్యం కాబట్టి నీవు అధిగమించగలవు. అదే నీకు అన్ని కష్టాలనూ ఎదుర్కొనే తిరుగులేని ధైర్యాన్ని ఆ బాధలన్నీ భరించగలిగే సహనాన్నీ యిస్తుంది. నీకు విజయం తప్పక లభిస్తుంది.

అది ఒక వాస్తవం — ఆ వాస్తవం ఎలాంటిదంటే, నీలో ఓ క్షణంలో ఆ ఆలోచన కల్గిందంటే, ఎవరో నీ గురించి ఆలోచించడం వల్ల నీకా ఆలోచన వచ్చింది, నీవు ఎన్నుకోబడ్డావు, కనుక నీవు ఎన్నుకున్నావు. ఒక్కసారి నీవు ఎన్నుకోబడితే, అది కచ్చితంగా జరుగుతుంది. అందువల్ల సందేహాలు, సంకోచాలు, నిరుత్సాహం, సందిగ్ధతలు, ఇవన్నీ కూడా మన కాలాన్ని, శక్తిని వృధా చేసే విషయాలు, వాటి వల్ల మనకేం ఉపయోగం లేదు.

ఎవరైనా తనలో తాను ఒక్క క్షణం, "ఆహా! ఇదీ నాకు కావలసిన సత్యం" అని భావిస్తే చాలు, ఇంక ఆ పని పూర్తయినట్లే, అది నిర్ణయించబడింది. ఆ నిర్జనారణ్యంలో నీవు మార్గాన్ని సుగమం చేసుకుంటూ ఏళ్ళు గడిపినా, అది పెద్ద ముఖ్య విషయం కాదు — అది నిర్ణయించబడింది, ఆ ఎన్నిక పూర్తయింది.

అందుకే మీ అందరితో ఒక రోజు నేను ఇలా చెప్పాను, "మీలో ఎక్కడో

ఇక్కడ ఉండాలని కోరుకున్నారు కాబట్టే మీరు ఇక్కడున్నారు, ఆ కోరిక మీలో కలి గిందంటే దాని అర్థం, నీ ద్వారా దైవం అదే జరగాలని కోరాడు."

CWM 7: 338-39

*

ప్రశ్న: మధుమయి మాతా, "ఆ పరమాత్మ తన అద్భుత ప్రకాశం, శాంతి మరియు ఆనందాల ప్రకాశమంతమైన హస్తాన్ని తను ఎన్నిక చేసుకున్న పాత్రుడైన మానవుడిపై వుంచుతాడు" (శ్రీఅరవిందులు SABCL 20:81) ఆ పరమాత్మ తన సాధనంగా ఉండే ఆ వ్యక్తిని తానే ఎన్నుకుంటాడా, లేక ఆ వ్యక్తే ఆ పరమాత్మకు సాధనంగా వుండాలని నిర్ణయించుకుంటాడా?

దీనిని నీకు నచ్చినట్లుగా నీవు అర్థం చేసుకోవచ్చు.

ఎవరు ప్రారంభించారో ఎవరూ చెప్పలేరు! కాని, ఆ రెండూ సాధారణంగా ఒకేసారి సంభవిస్తాయి.

నీకు ఆ ముందు వెనుకల క్రమం కావాలంటె, వ్యక్తి కన్న ముందు దైవం వున్నాడన్నది స్పష్టం. అందువల్ల ప్రథమంగా ఎన్నుకున్నది దైవమే అయ్యుండాలి. కాని ఆ ఎన్నిక ఈ భూమ్మీద జీవితాన్ని ప్రారంభించడానికి ముందే చేసుకున్నది. సామాన్య మానవ చైతన్యక్రమంలో ఇది ఏదో ఒక విధానంగా జరిగినట్లు లేదా ఒకే సారి జరిగినట్లు అనిపిస్తుంది. నిజానికి ఏ వ్యక్తి తయారుగా వున్నాడో ప్రథమంగా గుర్తించేది దైవమే అయ్యుండాలి. అయితే తయారుగా వున్న వ్యక్తి కూడా మొదట్లో సామాన్యంగా ఈ విషయం తెలిసినవాడై ఉండడు, అందువల్ల అతడు, అతడే నిర్ణ యించుకున్నట్టు, అతడే ఎన్నుకున్నట్టు భావిస్తాడు. కాని ఇది వాస్తవం కాదు, అతడి దృఢాభిప్రాయమే. ఒక్కసారి నీవు ఎన్నుకోబడితే, ఇంక అది నీవు తప్పించు కోలేవు, నీవు ప్రయత్నించినా, నీవు పారిపోలేవు.

CWM 8:23

మార్గాన్ని ఎన్నుకుందుకు, మార్గాన్ని చేరే కాలాన్ని నిర్ధారించుకుందుకు స్వేచ్ఛ

కొందరు చాలా సూటిగా వున్న మార్గాన్ని అనుసరిస్తారు, వారు గమ్యాన్ని త్వరగా చేరతారు. మరి కొందరు చిక్కు దారులను, చుట్టు తిరుగుడు మార్గాన్ని

ఇష్టపడతారు, వారికి సమయం ఎక్కువ పడుతుంది. ఎవరికేనా లక్ష్యం ఉంది, ఆ ముగింపు ఉంది. దాని మీద జీవితంలో ఒక్కసారైనా ఆ గొప్ప ప్రేరణ కల్గని వ్యక్తి ఒక్కడు కూడా ఉండడని అనుభవం ద్వారా నాకు తెలుసు — అతడు దేన్ని పిలుస్తాడన్నది ముఖ్యం కాదు — మనం దాన్ని మాటల్లో సౌకర్యంగా చెప్పుకుందుకు 'డివైన్' అని అందాం, అతడు కచ్చితంగా వస్తాడని (అనుకోం) చెప్పలేం, ఒక వేళ ఓ సమయంలో అతడు ఆ దైవం నించి వెనుకకు మరలినా, దానికే మాత్రం ప్రాముఖ్యత వుండదు — ఎందుకంటే అతడు వచ్చి తీరతాడు. అతడు కొంత కష్ట పడాల్సి వుండచ్చు, కొంత బాధ పడాల్సి వుండచ్చు, కాని యేదో ఒకనాడు అతడు తప్పక విజయం సాధిస్తాడు. ఆ యెన్నుకోబడినది ఒక ఆత్మ, దాని ఘడియ వచ్చింది కాబట్టే అది చైతన్యమంతమైంది — ఒక్కసారి ఆ సమయం వస్తే, ఫలితం త్వరలోనే వెంట వస్తుంది. ఇది నీవు కొన్ని నెలలలో సాధించవచ్చు, కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు, లేదా నీకు కొన్ని జీవిత కాలాలు పట్టవచ్చు — కాని నీవు సాధించి తీరతావు.

ఇందులో చాలా ముఖ్యమైన గమనించదగ్గ విషయం ఆ యెన్నుకునే స్వేచ్ఛ నీ కివ్వబడటం, అందువల్ల నీలో నువ్వు ఒక జీవితకాలంలోనే దానిని చేయగలనని సంకల్పించి నిర్ణయించుకుంటే, నీవు చేయగలవు. నేనిక్కడ ఒక శాశ్వతమైన ఎడతెగని నిర్ణయం గురించి మాట్లాడటం లేదు — అప్పుడు నువ్వు పన్నెండు నెలలలోనే చేరుకోగలవు. నే నన్న మాటల్లోని అర్థం అది కాదు, దాని అర్థం: నిన్ను ఒక్కసారిగా "నాకు అది కావాలి" అన్న ప్రేరణ బలంగా వశం చేసుకున్నప్పుడు, ఒక్కసారిగా అనిపించినా సరే, ఒక్క మెరుపు మెరసినంత క్షణంలో ఆ ముద్ర (సీలు) వేయబడు తుంది, అది నిర్ధారించబడింది.

అలాంటి స్థానంలో మనం ఉన్నాం.

(స్వేచ్ఛా విధానంలో)

కాని అది మనం ఆ మార్గంలోనే వృధాగా కాలయాపన చేయడానికి కారణం కాకూడదు, ఆ కారణంగా ఆ చిక్కుదారుల వెంట, ఆ చుట్టు తిరిగే అపసవ్య మార్గాల ద్వారా చేరాలన్నది దాని అర్థం కాదు — ముగింపు చేరేసరికి అప్పుడు చాలా చెత్తని కూడా తీసుకెళ్ళాలి. అది కాదు. దాని అర్థం ఎన్నడూ నిస్పృహ చెందడానికి కారణం లేదని, ఏ కష్టాలున్నా... ఆశ వీడనక్కర లేదని చెప్పడం.

ఎవరైనా సరే సూటిగా ఈ మార్గంలో వెళ్ళాలని నిశ్చయించుకుంటే, ఏది ఏమైనా సరే — కొన్ని కష్టాలు భరించాలని తెల్సినా, కొన్ని అసౌకర్యాలు ఎదుర్కోవల్సి వచ్చినా, బలహీనతలు లేకుండా ఉంటే — అప్పుడు చాలా వరకు కష్టాన్ని పరిహరించవచ్చు. కాని కొందరు వ్యక్తులు మాత్రం తీవ్రశక్తితో మెడ బట్టుకుని ఈడిస్తే తప్ప కదలరు. అప్పుడు వాళ్ళు హింసాత్మకంగా నెట్టబడ్డామని అరుస్తారు. ఏమైనా, అదీ వాళ్ళు కోరుకున్నదే.

CWM 7:339-40

ప్రతి వ్యక్తి తన మార్గాన్ని తాననుసరిస్తాడు

ఈ మార్గాల యొక్క ముఖ్యమైన క్రమాన్ని ఓ సామాన్యమైన నిబంధనగా చెప్పడం ఎవరికీ కుదరదు, అది పూర్తిగా వ్యక్తిగత విషయం. ఓ సమయం వచ్చినపుడు వారికే బాగా అర్థమౌతుంది. ఏ రెండు మార్గాలు ఒకే రకంగా ఉండవన్నది స్థూలంగా కనిపించే విషయం, ఏ రెండు మార్గాలు ఒకేలా ఉండవు, ఉండలేవు, ప్రతి వ్యక్తి తన స్వీయమార్గాన్ని అనుసరిస్తాడు, అదే అతడి అస్తిత్వ సత్యం. ఎవరైనా దాని కన్న ఉన్నత స్థాయి నించి దాన్ని చూడగల్గితే, ముందుకు వెళ్లే మార్గంలో వచ్చిన వేగం యొక్క తేడాని చూడగలం, కాని అది ఎల్లప్పుడు ఆ బాహ్య గుర్తులకు అనుగుణంగా ఉండదు. వేగంగా వెళ్ళడం ఎల్లప్పుడూ తెలివైనవాళ్ళకు మాత్రమే సొంతం కాదు, అని చలోక్తిగా చెప్పవచ్చు.

CWM 8:324

ఆధ్యాత్మిక దీక్షకు ఎవరి దగ్గరకు వెళ్తున్నావో — సావధానంతో గమనించు

అనేకమంది ప్రజలు[1] దురదృష్టంకొద్ది సన్యాసులను కల్సుకోవడం వలన వ్యథ చెందారు, వేధించబడ్డారన్నది గమనించాల్సిన విషయం. నేనీ విషయం మిమ్మల్ని

1. అందరూ గౌరవించే కాషాయ వస్త్రాలు ధరించి, వారి అహంతో కూడిన ఇచ్ఛలను, ఆ దుస్తుల పరదాల వెనక దాచుకునే ప్రయోజనం కోసం సన్యాసి వేషం వేసుకునేవారిని మాత్రమే ఉద్దేశించి అన్న మాట. పవిత్రము, స్వచ్ఛము ఐన హృదయంతో ఉండి, దుస్తులు

భయపెట్టడానికి చెప్పటం లేదు, కారణం ఇక్కడ మీరు సురక్షితంగా ఉంటారు, కాని అది నిజం. వారి దగ్గర దీక్ష పొందేవారు, వారి నుంచి ప్రాణిక ప్రపంచంలోని ఓ భయపెట్టే శక్తిని కూడా అందుకుని ఉంటారు, అది అత్యంత ప్రమాదకరమైనది... అందరి విషయంలో ఇలా జరుగుతుందని చెప్పలేం, కాని చాలా తరుచుగా ఇదే జరుగుతుంది.

కారణం, నిజాయితీ అన్నది ఈ ప్రపంచంలో చాలా అరుదుగా లభించే సుగుణం. అందుకే సుగుణం కనిపించినపుడు దాని ముందు ఎవరైనా సరే గౌరవంతో తలవొంచాలి. నిజాయితీ — మనం నిజాయితీ అని పిలిచేది పరిపూర్ణ పవిత్రత, పారదర్శకత అని చెప్పడం అన్న మాట: అస్తిత్వంలో ఎక్కడా కూడా ఏ మాత్రం నటన లేకపోవడం, దాపరికం లేకపోవడం, లేనిదాన్ని ఉన్నట్టుగా చెలామణీ చేయక పోవడం.

CWM 8:73

ఆకాంక్ష ఆధ్యాత్మిక జీవనానికి ప్రారంభం

మనం ఆధ్యాత్మిక అనుభవమని సామాన్యంగా దేన్ని చెప్తూ ఉంటామో, అది మనం జీవించే ఈ జీవితం కన్న మరో దాని కోసం మన లోపల ఉన్న ఓ గాఢమైన ఆవశ్యకత. చాలా సార్లు జీవితంలో కొన్ని నిరాశలు, విచారం లేదా బాధలను ఎదుర్కొన్నప్పుడు అది జాగృతమౌతుంది. మనకి విచారాన్ని తీసుకువచ్చిన ఈ విషయాలన్నీ, అదే సమయంలో మరొక మంచిస్థితి కోసం ఆకాంక్షను రేపుతాయి. సామాన్యంగా ఆధ్యాత్మిక అనుభవాలకు మూలకారణం ఇదే అవుతుంది.: అదే ఒక ప్రతికూలత, ఒక వ్యతిరేకత.

దైవాన్ని తెలుసుకోవాలని, అతడిలో ఐక్యం కావాలన్న అనుకూలమైన ఆవశ్యకత చాలా కాలం తరువాత కాని రాదు. నేను సామాన్యంగా చెప్తున్నాను, దానికి కొన్ని మినహాయింపు లుండచ్చు, కాని అది సాధారణంగా మొదట్లో నీ బాధామయ జీవితం నించి చేసే పలాయనం, అదే నిన్ను ఆధ్యాత్మిక జీవితం వైపు నెడుతుంది.

కేవలం వారి ఆధ్యాత్మిక జీవనం యొక్క పరిపూర్ణ సమర్పణకి బాహ్యమైన గుర్తుగా ఉండే వారి గురించి అలాంటి ప్రశ్నే ఉదయించదు"

బాహ్య, ఆంతరంగాల్లో సంపూర్ణమైన సామరస్యం కల్గి, ఏ బాధా, ఏ విచారమూ జీవితంలో ఏ మాత్రం అనుభవించకుండా ఉంటే, అలాంటివారిలో బహుశ బహు కొద్దిమంది మాత్రమే దైవం గురించి ఆలోచించి ఉండేవారు. సామాన్యంగా ఎక్కువ శాతం అతడిని పట్టించుకుని ఉండేవారు కాదు. వారు ఆ సగం సగం విషయాల్లో మునిగి తృప్తిపడి, ఆ సమగ్రత కోసం అన్వేషించేవారు కాదు...

కాని, ఎవరైనా ఈ ఆధ్యాత్మిక జీవితాన్ని కనుక్కున్నప్పుడు, అది ఈ పైకి కనిపించే రూపాల వెనక, ప్రతి చోటా ప్రత్యక్షంగానూ నిరాకారంగానూ ఉన్నదని గుర్తిస్తాడు. అతడు చెప్పేది ఈ దృశ్యమాన విషయాల వెనక ఉనికి కలిగి వున్నదాన్ని గురించి, మనం ఈ పరస్పర విరుద్ధతలను కనుక్కొని, వాటి మధ్య సామరస్యం కుదర్చాలి. అవి సామరస్యంతో ఉండగల్గిన ఓ ప్రదేశం లేదా ఓ చైతన్యస్థాయి ఉంది.

కాని, మొదట ఎవరైనా ఈ విధంగా వెళ్లాలి (ఆరోహణా సూచన) అప్పుడు మళ్లీ తిరిగి రావాలి (అవరోహణా సూచన) అదీ సంగతి!

*

ప్రశ్న: మధుమయీ మాతా, మన నిజమైన ఆధ్యాత్మిక జీవితం ఎక్కడ మొదలవుతుంది?

మన చైత్యలో ఉన్న దైవంతో సంస్పర్శ కల్గినపుడు, నిజమైన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమౌతుంది. ఎవరు చైత్యలో ఉన్న దివ్య ఉనికికి ఎరుకతో ఉండి, చైత్యాతో నిరంతర సంస్పర్శ కల్గి ఉంటారో అప్పుడన్న మాట. అప్పుడే ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమౌతుంది, అంతకు ముందు కాదు.

సత్యసంధత కల్గిన ఆధ్యాత్మిక జీవనం

ఎవరు వారి చైత్యపురుషతో ఐక్యత పొంది, ఆ దివ్య ఉనికికి ఎరుక కల్గి ఉంటారో, ఆ దివ్య ఉనికి నించి వారి యొక్క కార్యాచరణకు ప్రేరణను అందుకుంటారో, ఎప్పుడు వారి సంకల్పం దివ్యసంకల్పంతో ఎరుక కల్గిన సహచర్యం చేస్తుందో — అదే ప్రారంభం. తొలి అడుగు.

దానికి పూర్వం, ఎవరైనా ఆధ్యాత్మిక జీవితానికి ఆకాంక్షపరులు కావచ్చు,

కాని అతడి కింకా ఆధ్యాత్మిక జీవనం లేదని చెప్పవచ్చు.

CWM 8:135

*

ప్రశ్న: మధుమయి మాతా, శ్రీఅరవిందులు వ్రాశారు:
"ఓ చైత్య జ్వాల ఆంతర్యంలో ప్రజ్వలింప చేసి, సర్వం దైవం పేరుతో ఆ అగ్నికి ఆహుతి చేయాలి."

(The Synthesis of Yoga, SABCL 20:165)

*

ప్రశ్న: చైత్యజ్వాల ఎప్పుడూ ప్రజ్వలిస్తుండదా?
ఎల్లవేళలా ఆ జ్యోతి వెలుగుతూ వుండదు.

ప్రశ్న: ఆ జ్యోతి నెలా వెలిగించాలి?
ఆకాంక్షతో.

పురోగమనం కోసం సంకల్పం చేయడం వల్ల, సంపూర్ణత్వం కోసం తపించే ప్రేరణ వల్ల.

అన్నింటిని మించి అభివృద్ధి కోసం, మరియు స్వీయ స్వచ్ఛత కోసం చేసే సంకల్పం. అదే ఆ జ్వాలను వెల్గిస్తుంది. ఎవరికైతే ధృడ సంకల్పం ఉంటుందో వారు దానిని ఆధ్యాత్మిక అభివృద్ధి, మరియు స్వచ్ఛతల వైపు తిప్పినపుడు, అప్రయత్నంగానే వారిలో ఆ జ్యోతిని ప్రజ్వలింప చేసుకుంటారు. మనం సరి చేసుకోవాలనుకున్న ప్రతి లోపం, లేదా మనం సాధించాలనుకున్న ప్రతి అభివృద్ధి — అదంతా ఆ జ్వాలలోకి విసిరివేస్తే అది మరింత గాఢతలో ప్రజ్వలిస్తుంది. ఇది ఒక ప్రతీక చిత్రం కాదు, అది సూక్ష్మభౌతికంలో వాస్తవం. ఎవ్వరైనా ఆ జ్వాలయొక్క వెచ్చదనాన్ని అనుభూతి చెందవచ్చు, ఆ సూక్ష్మభౌతిక స్థితిలో ఆ జ్వాలాప్రకాశాన్ని వారు చూడవచ్చు. ఎవరికైనా వారి స్వభావంలో ఆ అభివృద్ధిని నిరోధించే గుణం ఉన్నపుడు, అతడు దానిని ఆ జ్వాలలోకి విసిరివేస్తే, అది మరింత ప్రజ్వలిస్తుంది, ఆ జ్యోతి మరింత గాఢప్రకాశంతో ఉజ్వలిస్తుంది.

CWM 8:251

శ్రీమాత

అనువాదం: శ్రీమతి డి. సత్యవాణి

యోగం లోనికి ప్రవేశం

యోగంలో ప్రవేశించడానికి గల కొన్ని విధానాలు, ఆధ్యాత్మిక జాగృతి

యోగం స్వీకరించాలని ప్రేరణను కలిగించే మాధ్యమం, శ్రుతమైన దివ్యవాక్కు. ఆ వాణి లేక మంత్రం మనకు అంతరంగం నుంచి అందవచ్చు, లేక బాహ్యం నుండి రావచ్చు. అదెలా వచ్చినప్పటికీ అంతరంగంలో దాగివున్న జ్ఞానాన్ని పని చేసే విధంగా ప్రేరణ కలిగించే మాధ్యమం అది. అది సదా దైవోన్ముఖమై వుండే అంతరాంతరంలోని అంతరాత్మ వాక్కు గావచ్చు. లేదా అది సమస్త జీవుల హృదయాలలో తిష్ఠ వేసి వున్న రహస్య జగద్గురువు వాక్కు గావచ్చు. ఎందుచేత నంటే ఉపదేశానంతరం కొనసాగే యోగమంతా సదా నిలిచి వుండే ఆ స్పర్శ, మార్గదర్శకత క్రింద జరిగేదే గనుక, దానికి యెవరి అవసరం లేని అరుదైన కొన్ని సందర్భాలు గూడా వున్నాయి. హృదయ కమలంలో అధివసించి యుండేవాని నుండి వెలువడే తేజోప్రసారపు క్రియాశక్తి వల్ల అంతరంగంలో జ్ఞానకమలం తనంత దా వికసిస్తుంది. ఒక లిఖిత గ్రంథం లేక ఒక సజీవ గురువర్యుల తప్పించుకోలేని ప్రభావం క్రింద నుండి సాగిపోవలసిన అవసరం లేని వాళ్ళు, అంతరంగంలో నుండి ఆత్మ-జ్ఞానం పెల్లుబికి వచ్చే కొద్దిమందీ, నిజంగా గొప్పవారు.

సాధారణంగా బాహ్యం నుండి అందే వాక్కు లేక మంత్రం దైవానికి ప్రాతినిధ్యం వహించే ఆత్మ-వికసనా కార్యక్రమంలో సహాయకంగా అవసరం అవుతుంది. అది గతంలో ప్రవహించబడిన ఒక మంత్రంగాని లేదా సజీవ గురువదేవుల నుండి అందే మంత్రంగాని కావచ్చు. అంతరంగంలోని శక్తి మేలుకొని అభివ్యక్తం గావడానికి ఒక రకమైన ఆలనంబనగా కూడా మంత్రాన్ని కొంతమంది స్వీకరించవచ్చు. ప్రకృతిని శాసించు సర్వ సామాన్య ధర్మాన్నుండి సర్వశక్తివంతుడు, సర్వజ్ఞుడు అయిన దైవం యిచ్చిన ఒక మినహాయింపు, మంత్రమని అనుకోవచ్చు.

అందుబాటులో వున్న లిఖిత శాస్త్రం — పూర్వయోగుల అనుభవంతో రూపొందిన గత కాలం నాటి మంత్రం — వల్ల యోగమార్గదర్శకతను పొందుతుంటే దానిని కేవలం పురుష ప్రయత్నం వల్ల లేదా గురువు సహాయంతో ఆచరణలో పెడ్తూ సాగిపోవచ్చు. బోధించబడిన సత్యాలపై, ధ్యానించడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని

పొంది స్వీయానుభవంలో వాటిని సాక్షాత్కరింప జేసుకోవడం ద్వారా అవి సజీవం, సచేతనం అవుతాయి. గురుదేవుల సూచనలతో శక్తివంతంగా, ప్రకాశవంతంగా తయారైన పవిత్ర గ్రంథం, లేక సంప్రదాయం బోధించిన, నిర్దేశించిన విధానాల ఫలితాలచే యోగం కొనసాగుతుంటుంది. అయినా అదొక సంకుచితమైన ఆచరణే అవుతుంది, కాని దాని పరిమితులలో అది సురక్షితమైనది, ప్రభావం చూపేది. ఎందుచేతనంటే అది యెంతో కాలం నుండి పరిచయమున్న గమ్యం వైపుకు చేర్చే బాగా నలిగిన దారి.

లిఖిత శాస్త్రి ప్రామాణికత యెంత గొప్పదైనా లేక దాని బోధనాసారం యెంత విశాలమైనదైనా శాశ్వత దివ్యజ్ఞానాన్ని పాక్షికంగా వ్యక్తం చేసేదే అని పూర్ణయోగ సాధకుడు గుర్తు పెట్టుకోవలసిన అవసరం వుంది. అత్యుత్కృష్ట పవిత్ర గ్రంథాలను, అత డుపయోగించుకొంటాడు గాని తనను తాను దానికి కట్టి పడవేసుకోడు.

CWSA 3:54-56 (SABCL 20:48-49)

శ్రీఅరవిందులు

తదేక దీక్షతో, సహనంతో ఆచరించాలి

ఆశ్రమంలోని బిడ్డలతో దివ్యజనని సంభాషణ

కాబట్టి నేను మీకో విషయం చెప్పాలి. మీకు అసహనం వుండకూడదు. మీకు నిజంగా జ్ఞానం పొందాలని వుంటే మీరీ విషయా న్నర్థం చేసుకోవాలి.. అదే జ్ఞానమైనా మీరు దాన్ని ఆచరణలో పెట్టి తీరాలి. ఈ జ్ఞానాన్ని కార్యరూపంలో పెట్టగలగాలంటే మీరు మీ స్వభావాన్ని మీ అధీనంలో వుంచుకోగలగాలి. ఇచటి కొచ్చిన మీ అందరికీ అనేక విషయాలు చెప్పారు. సత్యలోకంతో మీకు సంపర్కం కలిగింది. మీరు శ్వాసించే గాలి దానితో నిండి వుంది. అయినప్పటికీ ఈ సత్యాలను ఆచరణలో పెడ్తేనే వాటికి విలువ వుంటుందని మీలో చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. చేతన, జ్ఞానం, అంతరాత్మ సమత, విశ్వజనీనత, అనంతత్వం, శాశ్వతత్వం, పరమోన్నత సత్యం, దైవసన్నిధి, అటువంటివాటిని, నీవు అనుజీవించడానికి కృషి చేయకపోతే, వాటిని స్పష్టంగా నీలో అనుభూతి చెందకపోతే వాటిని గురించి మాట్లాడడం నిరుపయోగం. "ఓహ్ నేనిక్కడెన్నో సంవత్సరా లున్నాను, నా కృషికి ఫలితాన్ని పొందాలని చాలా అన్పిస్తోంది" అని నీకు నువ్వు చెప్పుకోవద్దు. అతి

చిన్న బలహీనతనైనా, అతిచిన్న అల్పబుద్ధినైనా, స్వభావంలోని అతిచిన్న నైచ్యాన్నైనా, నీ చెప్పుచేతల్లో వుంచుకోవాలంటే చాలా పట్టుదలతో కృషి చేయవలసి వుంటుందని తెలుసుకో. ఎవరైనా అహంకారం లేకుండా ప్రేమించ లేనపుడు దివ్య ప్రేమను గురించి మాట్లాడితే యేం ప్రయోజనం? గతానికి వర్తమానానికి ఒకడు గాఢానురక్తి కలిగి వుంటే, ప్రతిదాన్నీ స్వీకరించడానికి, దేన్నైనా విడిచివుచ్చడానికి కష్టపడకపోతే అమృతత్వాన్ని గురించి మాట్లాడితే యేం ప్రయోజనం?

మీరింకా చాలా చిన్నవాళ్ళు, గమ్యాన్ని చేరడానికి మూల్యం చెల్లించాలని, పరమోన్నత సత్యాలను అర్థం చేసుకోవాలంటే వాటిని నీవు నీ నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలనీ ఈ క్షణం నుంచీ నేర్చుకోండి.

CWM 9:71-72

ఆవలి వైపుకు చేరుకోవడం

నీ మనస్సే నీకు వాస్తవం అయినంత కాలం, నీ ఆలోచనా విధానం నీకు యదార్థం, నిజం, ఘనిష్టం అవుతుంది. అది నీవు ఆవలి వైపుకు యింకా చేరుకోలేదని ఋజువు చేస్తుంది. మొట్టమొదట నీవు ఆవలి వైపుకు చేరుకోవాలి. ఆ తర్వాతే నేను చెప్పేదాన్నర్థం చేసుకోగలుగుతావు.

ఆవలి వైపుకు చేరుకో

కొంచెం కొంచెంగా అర్థం చేసుకొంటారనేది యదార్థం కాదు, అదలా వుండదు. ఈ విధమైన పురోగతి భిన్నంగా వుంటుంది. ఒక గుల్లలో వ్యక్తి బంధించుకొని వున్నాడు. దాని లోపల, గ్రుడ్డులో తయారవుతున్న పిల్లలా యేదో జరుగుతోంది. అది అందులో సంసిద్ధమౌతోంది. అది అందులో వుంది బయటి కెవరికీ కన్పించదు. అలా తయారైన తర్వాత గుల్లను ఛేదించుకొంటూ వెలుగు లోనికి జన్మించగల సామర్థ్యం లభిస్తుంది.

అంటే అర్థం, అధికాధికంగా అవగాహన కందగల, లేక కంటికి కనుపించగల విధంగా తయారవుతారని కాదు. గుల్లలో మూసుకుపోయి వున్నాడు, మూసుకు పోయి... సున్నితమైన వ్యక్తులకు, తాము అన్ని వైపుల నుంచి వత్తిడికి లోనవుతున్నట్లు ముందుకు సాగిపోవాలని ప్రయత్నిస్తూ యెదురుగా వున్న ఒక గోడ దగ్గరకు చేరుకొన్నట్లొక భయంకర సంవేదన కూడా కలుగుతుంది. అప్పుడతడు దానిని తట్టుతూ,

తట్టుతూ, తట్టుతూ వుంటాడే గాని ముందుకు పోలేడు.

అతడలా లోపలే వున్నంత కాలం, అతడు అనృతంలో వున్నట్లే. అతడు పైనున్న గుల్లను ఛేదించుకొని దివ్య వెలుగు లోనికి వెలువడిన రోజున మాత్రమే స్వేచ్ఛాజీవి అవుతాడు.

ఇది ఆకస్మికంగా, అప్రయత్నంగా, చాలా అనూహ్యంగా సంభవించవచ్చు. (ఇప్పుడున్న స్థితిని) అతడు క్రమంగా దాటిపోగలడని నేననుకోవడం లేదు. గుల్లలో నుండి చూడగలిగే విధంగా అది నెమ్మది నెమ్మదిగా అరిగి లేక తరిగిపోయేది అని నేననుకోను. ఇంత వరకు అటువంటి సంఘటన ఒక్కటి కూడా నా దగ్గరకు రాలేదు. అలా గాక లోలోపలే శక్తి పుంజుకొని, అవసరం తీవ్రతరమై, యే భయమూ, ఆరాటమూ అంచనా లేని విధంగా అతనిని తయారుచేసే కృషిలో స్థిరంగా అతడు నిలబడడం జరుగుతుంది. పర్యవసానాలను యెంత మాత్రం గణించని బలమైన ఒక అవసరం యేర్పడుతుంది.

ఏదీ నిరోధించలేని విస్ఫోటనం కలిగించే ఒక ప్రేలుడు వస్తువుగా తయారై కాంతులీను వెలుగు లోనికి తన బందిఖానా నుండి ఒక్కసారిగా అతడు బయటపడ్తాడు.

కాని తర్వాత తిరిగి వెనక్కు పడిపోవడం జరుగదు.

నిజంగా అదొక నూతన జన్మ.

CWM 9:136-37

ఆధ్యాత్మిక జీవితం లోనికి నూతన జన్మ

"అవును, దీన్ని నేను చూడగలను, స్పృశించగలను, బాధపడగలను, నన్ను ఆకలి వేధిస్తుంది, నన్ను నిద్రాభారం ఆవహిస్తుంది, ఇది నిజం, ఇది అత్యంత వాస్తవం" అని నీవు అనుకొంటున్నంత కాలం... (దివ్యజనని నవ్వుతారు) నీవు ఆవలి వైపుకు యింకా చేరుకోలేదని, నీ వింకా నూతన పుట్టుక పుట్టలేదని అర్థం.

(మౌనం)

మనుష్యుల్లో అధికులు, తలుపులు, కిటికీలు అన్నీ మూసివేసి వున్న జైలులోని ఖైదీలు, అందుకే వాళ్ళకు సహజంగా ఊపిరాడనట్టుంటుంది. కాని తలుపులు, కిటికీలు తెరచే తాళంచెవి వాళ్ల దగ్గరే వుంది కాని వాళ్లు దాన్నుపయోగించరు... వాళ్ళ దగ్గర తాళంచెవి లేదనుకొనే కాలం ఒకటుంటుంది తప్పకుండా. కాని చాలా

కాలం తర్వాతైనా ఆ విషయం వాళ్ళు తెలుసుకొంటారు. చాలా కాసం తర్వాత వాళ్ళా విషయం వింటారు. ఆ తాళంచెవికి తలుపులను, కిటికీలను తెరచే శక్తి వుందా అని లేక వాటిని తెరవడం మంచిదేనా అని వాళ్ళు దాన్నుపయోగించడానికి సందేహిస్తారు. "ఎంతైనా మంచిదే గదా" అని వాళ్ళకు అన్పించినా, కొంత భయమింకా మిగిలే వుంటుంది. "ఈ తలుపులు, కిటికీలు తెరచి పెడ్తే యేమవుతుందో?" అని వాళ్ళు భయపడ్తారు. ఆ వెలుగులో, స్వేచ్ఛలో తాము కనుమరుగైపోతామేమో నని భయపడ్తారు. వాళ్ళు వాళ్ళనుకొనే 'మేము' గానే మిగిలిపోవాలనుకొంటారు. వాళ్ళ అనృతత్వాన్నే బంధనాన్నే వాళ్ళిష్టపడతారు. వాళ్ళలో యేదో, వాటిపై మక్కువ చూపుతుంటుంది, దానికే అంటిపెట్టుకొని వుండిపోతుంటుంది. తమ పరిమితులు లేకపోతే తమ అస్తిత్వం లేకుండా పోతుందనే అభిప్రాయం వాళ్ళకింకా వుంది.

కాబట్టి పయనం చాలా సుదీర్ఘమైనది కనుకనే కష్టంగా కూడా వుంటుంది. ఎందుచేతనంటే యెవరైనా నిజంగా ఇక్కడ లేకుండా పోవడాని కంగీకరిస్తే, ప్రతిదీ యెంతో తేలికవుతుంది, ప్రకాశవంతం, సంతసకరం అవుతుంది. కాని మనుష్యులు చెప్పుకొనే అర్థంలో సంతోషంగా, సుఖంగా బహుశా అది వుండకపోవచ్చు. నిజానికి పోరాటాన్ని ఆనందించని వాళ్ళు కొద్దిమందే వుంటారు. నిశీధి లేకపోవడాన్ని అంగీక రించేవాళ్ళు చాలా కొద్దిమందే వుంటారు. కొద్దిమందికి వెలుగు అంటే అంధకారానికి వ్యతిరేకమైనదే అని అనుకొంటారు. "ఛాయలు లేకుండా చిత్రం వుండదు, పోరాటం లేకుండా విజయం లభించదు. బాధ లేకుండా ఆనందం లేదు" అని వాళ్ళు భావిస్తారు. ఈ విధంగా ఆలోచిస్తున్నంత కాలం అతడు ఆత్మలో ప్రవేశించలేదన్న మాటే.

CWM 9:430-31

యోగమంతా ఒక నూతన జన్మే

స్వాభావికంగా యోగమంతా నూతన జన్మయే. అది సాధారణ పుట్టుక కాదు. మానసికం చేయబడిన మానవుని ఐహిక జీవితాన్ని వున్నత ఆధ్యాత్మిక చేతన లోనికి, ఒక మహనీయ దివ్యతర అస్తిత్వం లోనికి జన్మింప చేయడం. ఆ సువిశాలమైన ఆధ్యాత్మిక మనుగడ ఆవశ్యకతకు సంబంధించిన ఒక బలీయమైన ప్రేరణ వుంటే తప్ప ఏ యోగాన్నైనా సఫలమయ్యేటట్లు స్వీకరించలేం, అనుసరించలేం. ఈ

ప్రగాఢమైన, బృహత్తరమైన ఆంతరిక పరివర్తననానికై పిలువబడిన అంతరాత్మ ప్రథమ పయనారంభానికి అనేక మార్గాల దగ్గరకు చేరవచ్చు. తెలియకుండానే ఆ ప్రేరణ వైపుకు, ఆ మేలుకొలుపు వైపుకు దాన్ని నడుపుతున్న సహజ పురోభివృద్ధి వల్లే దానికీ దారి లభించవచ్చు. ఒక మతం లేక దర్శనశాస్త్రపు ప్రభావం వల్ల ఆ దారి దానికి లభించవచ్చు. నిదానంగా పెరిగిన ప్రకాశం లేక ఒక ఆకస్మిక స్పర్శ లేక అఘాతం వల్ల ఒక్క దూకు దూకడం ద్వారా ఆ మార్గం దగ్గర కది చేరవచ్చు. దాని వైపుకు నెట్టబడినందు వల్ల బాహ్యపరిస్థితుల వత్తిడి వల్ల నడుపబడి లేదా ఒక ఆంతరంగిక ఆవశ్యకత వల్ల, మనస్సు పైన ముద్రలను తొలగించే ఒక్క పలుకు వల్ల, లేదా సుదీర్ఘ ఆత్మవిచారణ వల్ల ఆ మార్గంలో యెన్నడో నడచినవారిని ఉదాహరణగా తీసుకొన్నందువల్ల లేదా అతనితో సంపర్కం వల్ల, ఆతని నిత్య ప్రభావం వల్ల, అది ఆ దారి దగ్గరకు చేరవచ్చు. స్వభావాన్ననుసరించి, పరిస్థితుల ననుసరించి పిలుపు వస్తుంది.

CWSA 23:69 (SABCL 20:63)

కేవలం భావన, బౌద్ధిక అన్వేషణ చాలదు

కాని అది యే విధంగా లభించినా, మనస్సు, సంకల్పాల దృఢ నిర్ణయం తప్పకుండా వుండాలి. తత్ఫలితంగా లభించే ఒక సంపూర్ణ ప్రభావవంతమైన ఆత్మార్పణ వుండాలి. నూతన ఆధ్యాత్మిక భావానాశక్తి, క్రియాశక్తి, అస్తిత్వంలో ఊర్ధ్వం వైపు మొగ్గగల ఒక ఆధ్యాత్మిక ప్రకాశం, సంకల్పం, హృదయాకాంక్షచే ప్రభావితమైన ఒక మలుపు లేదా మార్పిడి — యోగం లభింప జేయవలసిన సమస్త ఫలితాలను బీజంలో మాదిరిగా తనలో కలిగి వున్న ఒక బ్రహ్మాండమైన చర్య ఇది. కోరుకొనవలసిన ఒకే ఒక్క విషయం అదేనని హృదయం దానిని పట్టుకొంటే తప్ప, చేయవలసిన కార్యం అదొక్కటే అని సంకల్పం సంకల్పించుకొంటే తప్ప మనస్సు ఆసక్తి వల్ల యెంత గాఢంగా గ్రహించబడినా ఊర్ధ్వంగా ఆవల యెక్కడో వున్న యేదో దాన్ని గురించిన కేవల భావన లేక బౌద్ధిక అన్వేషణ నిష్ప్రయోజనమే. ఎందుచేతనంటే పరమాత్మ సత్యం కేవలం భావించవలసినది కాదు, అది జీవించవలసిన సత్యం. దాన్ని జీవించాలంటే అస్తిత్వం అంతా చేయవలసి వున్న ఆ ఒక్కదానితో సందేహాస్పదమైన మనస్సుచే లేదా కొద్ది ఊర్జంతో లేదా విభాగితమైన సంకల్పంతో

సాధ్యపడదు. దైవాన్ని కాంక్షించేవాడు తనను భగవంతునికి, భగవంతునికి మాత్రమే అర్పణ చేసుకోవాలి.

CWSA 23:69-70 (SABCL 20:63)

శ్రీఅరవిందులు

దైవాన్ని ఆవిష్కరించుకొనడానికి చెల్లించవలసిన మూల్యం

అన్ని కాలాల్లోనూ, ఆకాంక్షి మంత్రోపదేశాన్ని పొందడానికి ముందు పరీక్షలలో ఉత్తీర్ణుడు కావలసి ఉండేది. ప్రాచీన కాలం నాటి బోధనా విధానాలలో పరీక్షలు అసహజమైవిగా ఉండేవి. అందుచేత వాటి విలువ బాగా తగ్గిపోయింది. కాని యిప్పుడు అలా యెంత మాత్రం లేదు. నిత్యం జరిగే సాధారణ సంఘటన వెనుక ఆ పరీక్ష దాగి వుంటుంది, అమాయకంగా, యాదృచ్ఛికంగా జరుగుతున్నట్లుంటుంది. అది ఆ పరీక్షను మరింత కఠినంగానూ, ప్రమాదకరంగానూ తయారు చేస్తుంది. జాతికి, విద్యకి సంబంధించిన మనస్సు అభిమానాలనూ, దురభిమానాలను జయించినవానికే భారతదేశం తన పెన్నిధులను బయటపెడ్తుంది. ఇతరులు వాళ్ళు అన్వేషించేదాన్ని కనుగొనలేక నిరాశతో నిష్క్రమిస్తారు. ఎందుకనంటే వాళ్ళు దాన్ని అపమార్గంలో అన్వేషించారు, దైవావిష్కరణకు మూల్యం చెల్లించడానిక అంగీకరించ లేదు.

CWM 13:373-74

ప్రాచీన కాలంలో శిష్యుడు ఉపదేశం పొందడానికి గల తన అర్హతను తెలియజేసేందుకు కఠిన పరీక్షల నెదుర్కొనేవాడు. ఇక్కడ మనం ఆ పద్ధతిని అనుసరించడం లేదు. ఏ పరీక్షా యే విధమైన గమనింపు లేనట్లే పైకి కన్పిస్తుంటుంది. కాని జరుగుతున్న దాని సత్యాన్ని గమనిస్తే, ఇక్కడ అది మరెంతో కష్టంగా వున్న దనిపిస్తుంది. అక్కడ శిష్యుడికి తాను కొంత కాలం పరీక్షా విధానానికి సంబంధించిన పరిశీలన క్రింద వుంటానని ముందుగా తెలుస్తుంది. కొన్ని బాహ్యరూపకమైన పరీక్షలలో ఉత్తీర్ణుడైతే అతన్ని లోపలికి తీసుకొంటారు. కాని యిచట నీవు జీవితాన్ని యెదుర్కోవాలి, ప్రతి క్షణం నిన్ను గమనిస్తూంటారు. కాని నీ బాహ్యకర్మలను కాదు యిక్కడ గణించేది. ప్రతి ఒక్క ఆంతరిక చలనాన్ని. ఆలోచనను గమనిస్తారు, ప్రతి ఒక్క ప్రతి చర్యను దృష్టిలో పెట్టుకొంటారు. అరణ్యంలో ఒంటరిగా వున్నపుడు నీవేం

చేస్తావు అనేది గాక జీవన సంగ్రామంలో నీవెలా ప్రవర్తిస్తున్నావో అది ప్రధానం యిక్కడ.

అటువంటి పరీక్షలకు నిన్ను నీవు గురి చేసుకోవడానికి సిద్ధమా? నిన్ను నీవు సంపూర్ణంగా మార్పు చెందించుకొనడానికి సంసిద్ధమా? నీ భావాలను, ఆదర్శాలను, విలువలను, ఆసక్తులను, అభిప్రాయాలను నెట్టి వేసుకోవాలి. ప్రతిదాన్నీ క్రొంగ్రొత్తగా నేర్చుకోవాలి. దీనంతటికీ నీవు తయారుగా వుంటే, అపుడు మునకవెయ్యి లేనియెడల ప్రవేశించ ప్రయత్నించకు.

CWM 14:43

అనువాదం: కె. వి. రావు

ఒక గొప్ప సాహసానికై పిలుపు

సాహసాన్ని ప్రేమించే మనుషులున్నారు. వాళ్ళను, నేను పిలుస్తున్నది. పిలిచి వాళ్ళ కిలా చెప్తాను: "మిమ్మల్ని మహా సాహసకృత్యం చేయడానికి ఆహ్వానిస్తున్నాను."

మనకు ముందున్న వాళ్ళు ఆధ్యాత్మికంగా చేసినదాన్ని తిరిగి చేసే ప్రశ్నే లేదు. ఎందుచేతనంటే మనం చేయవలసిన సాహసకృత్యం దాని కావల వుంది. అదొక నూతన సృష్టికి సంబంధించిన సమస్య. ముందుగా తెలియనటువంటి సమస్త సంఘటనలు, ప్రమాదాలూ, విషమ సమస్యలు అందులో వుంటాయి — తథ్యమైన విజయం గమ్యంగా గల ఒక నిజమైన సాహసకృత్యం అది. కాని దారి తెలియదు, అడుగు తరువాత అడుగు వేసుకుంటూ, ఇంతవర కెవరూ శోధించని చోట మనం బాట వేసుకుంటూ నడవాలి. ఈనాటి జగత్తులో, ఏనాడూ లేని యేదో అది, అది అదే రీతిగా తిరిగి యేనాడూ వుండబోనిది. అది నీకు ఆసక్తిని కలిగిస్తే... శుభం, రా కలిసి పయనిద్దాం...

ముందుగా ఊహించినదాన్నంతా, పథకం పన్నినదాన్నంతా నిర్మించుకున్న

దాన్నంతా ప్రక్కన పెట్టివేసి అప్పుడు... అజ్ఞేయం లోనికి నడుచుకుంటూ పోవాలి. ఏం జరిగినా సరే!

CWM 9:152

శ్రీమాత

అతిమానస యోగం

యోగం, యోగి కావడానికి కాదు:

దివ్యజనని వైపు తిరిగిన ప్రతి వ్యక్తీ చేసేది నా యోగమే. పూర్ణయోగాన్ని ఒక వ్యక్తి 'చేయ' గలను అనుకొంటే అదొక పెద్ద పొరపాటే. అంటే యోగం అన్ని పార్శ్వాలను స్వప్రయత్నంతో కొనసాగించి నెరవేర్చగల ననుకొనడం ఒక పెద్ద పొరపాటు. ఏ మానవమాత్రుడూ అలా చేయలేడు. అతడు చేయవలసిందేమిటంటే తనను తాను దివ్యజనని హస్తాల్లో పెట్టుకొని సేవ ద్వారా, భక్తి ద్వారా, ఆకాంక్ష ద్వారా ఆమె కున్ముఖం కావాలి. అప్పుడు దివ్యజనని సాధన జరిగే విధంగా తన వెలుగు, క్రియాశక్తితో అతనిలో పని చేస్తుంది. ఒక పెద్ద పూర్ణయోగిగా లేక ఒక అతి మానసజీవిగా కావాలనే అత్యాశతో వుండడం, నేను ఆ వైపు యెంత దూరం వెళ్ళాను అని తనను తాను ప్రశ్నించుకొంటూ వుండడం ఒక పెద్ద పొరపాటు. నీవు యెలా తయారుకావాలని ఆమె కోరుతున్నదో అలా తయారుగావాలని, భక్తితో వుండి ఆమెకు తనను తానిచ్చివేసుకోవడం సరైన ధోరణి. నీలో యేం చేయాలో నిర్ణయించే తక్కిన వ్యవహారమంతా ఆమెకే వదిలెయ్యాలి.

CWSA 32:151-52 (SABCL 25:130)

*

'అనుభవాలు పొందడం': అతిమానస యోగం

ఒకరు యోగసాధన చేసి మనస్సులో తార్కికబుద్ధితో జ్ఞానకాంతులు పొందవచ్చు: ప్రాణికంలో శక్తిని సంపాదించి సకల విధాలైన అనుభవాలలో ఓలలాడవచ్చు; ఆశ్చర్యం కలిగించే భౌతిక సిద్ధులను సిద్ధింప జేసుకోనూవచ్చు, కాని వెనుక నున్న యదార్థ అంతరాత్మ — శక్తి అభివ్యక్తం గాకపోతే, అంతరాత్మిక స్వభావం ఉపరితలానికి రాకపోతే సిసలైన అసలు కార్యం యేదీ జరగనట్లే. ఈ

యోగంలో యథార్థ అతిమానస వెలుగుకు, చివరకు మహదానందానికి తక్కిన ప్రకృతినంతా ఉన్ముఖం చేసేది చైత్యసత్తా, (లేక చైత్యపురుషుడు). తనకు తానుగా మనస్సు స్వీయ ఉన్నత సీమలకు తెరచుకోగలదు. అది తనకు తానుగానే వుంటూ కూడా నిర్వ్యక్తికత లోనికి విస్తృతం కాగలదు. ఒక విధమైన అచల ముక్తికి సంబంధించిన నిర్వాణం లోనికి తనను ఆధ్యాత్మీకరించుకో గలదు. కాని ఒక ఆధ్యాత్మికం చేయబడిన మనస్సు ఒక్కదానిలో మాత్రమే చాలినంత ఆధారాన్ని అతిమానసం కనుగొనలేదు. అంతరాంతరంలో వున్న అంతరాత్మ మేలుకొల్పబడితే, కేవల మానసిక, ప్రాణిక, భౌతికం నుండి బయటపడి మరో నూతన జన్మను అంతరాత్మిక చేతనలో పొందితే అప్పుడు ఈ యోగం చేయగలరు. లేకపోతే (మనస్సు ఒక్కదాని శక్తితో లేక యే యితర భాగం ఒక్కదాని శక్తితో) అది అసాధ్యం. భౌద్ధిక జ్ఞానానికి లేదా మానసిక భావాలకు, లేదా యేదైనా ప్రాణిక వాంఛకు మక్కువతో కట్టుబడిపోయి నందువల్ల అంతరాత్మిక నూతన జన్మకు అంగీకరించకపోతే, దివ్యజనని నుండి నూతనంగా జన్మించిన బిడ్డలా కాలేకపోతే అప్పుడు సాధనలో విఫలం గావడం జరుగుతుంది.
SABCL 24:1095

శ్రీఅరవిందులు

కేవలం దైవం మనిషివిగా తయారవ్వు

నీవు దైవం దగ్గరకు వచ్చినప్పుడు సమస్త మానసిక అవగాహనలను రద్దు చేసుకోవాలి. కాని అలా చేయడానికి బదులు నీ అవగాహనలను దైవంపై రుద్ది, వాటి కనుగుణంగా దైవాన్నుండి మనడం చేస్తున్నావు. ఒక యోగి కుండవలసిన ఏకైక యథార్థ వైఖరి యేమిటంటే, అతడు సౌమ్యంగా వుండి, యేదెలా జరిగినా, దైవాజ్ఞను పాటించడానికి సిద్ధంగా వుండడం. అతనికి విడిచిపెట్టదగనిదంటూ యేదీ వుండగూడదు, యేదీ భారమని అతని కన్పించగూడదు. ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించాలనుకొనేవారికి తమ కున్నదాన్నంతా విడిచి వేసేయాలని తరుచుగా మొట్టమొదటి ప్రేరణ వస్తుంది. భారం దించివేసుకోవాలని అనుకొని వాళ్ళలా చేస్తారు, అంతేగాని దైవానికి సమర్పించాలని గాదు. సిరిసంపదలుండి, చుట్టూ విలాసాలను, భోగాలను అందించేవి వున్న మనుషులు దైవం వైపు తిరిగినప్పుడు, వెంటనే వాళ్ళలో జరిగే చలనం వీటన్నింటి నుండి పారిపోవాలని — లేదా "బంధం

నుండి బయట పడడానికి" అని చెప్తారు. కాని అదొక అపసవ్య చలనం. నీ దగ్గరున్న వస్తువులు నీ స్వంతం అని అనుకోవద్దు — అవి దైవానివి. దైవం నీవు వేటినైనా భోగించాలని కోరుకొంటే, అనుభవించు దాన్ని: కాని ఆ మరుక్షణమే దాన్ని చిరు నవ్వుతో వదలివేయడానికి కూడా సిద్ధంగా వుండు.

CWM 3:54

*

నీవు యోగాభ్యాసం మొదలుపెట్టినపుడు నీ కున్న మానసిక నిర్మాణాలు, అందు కుపయోగించిన సరంజామా సమస్తం కుప్ప కూలిపోతాయి, అందుకు నీవు సిద్ధంగా వుండాలి. నీ విశ్వాసం తప్ప మరే ఆధారమూ లేకుండా గాలిలో వ్రేళ్ళాడుతున్నట్లుండే స్థితికి కూడా నీవు సంసిద్ధుడవై వుండాలి. నీ గత వ్యక్తిత్వాన్ని తత్సంబంధమైన మమకార, బంధాలను పూర్తిగా మరచిపోవలసి వుంటుంది. ఆ గతాన్ని నీ చేతన లోనుంచి పెకలించి వేసి, నూతనంగా జన్మించి, యెట్టి విధమైన బంధమూ లేని స్వేచ్ఛా జీవివి కావాలి. గతంలో నీ వేమిటో దానిని గురించి మరి ఆలోచించకు, యెలా వుండాలని ఆకాంక్షిస్తున్నావో దానిని గురించే ఆలోచించు. నీవు దేనిని నిజం చేసుకోవాలనుకొంటున్నావో పూర్తిగా అందులోనే వుండిపోవాలి. మృతమైన గతాన్నుండి వెనుదిరిగి భవిష్యత్తు వైపుకు నిగుడించి దృష్టి సారించు. నీ మతం, దేశం, కుటుంబం, వున్న చోటు అన్నీ దైవం.

CWM 3:83-84

శ్రీమాత

*

శ్రీఅరవిందుల యోగం: ఇతర యోగాలు

నీకు పిలుపు వున్నట్లున్నది, నీకు యోగార్హత వున్నట్లున్నది. కాని అందుకు విభిన్న మార్గాలున్నాయి, ప్రతిదానికీ ఒక భిన్న మైన గమ్యం వున్నది, అవి అక్కడితో ముగుస్తాయి. కోరికలను జయించడం, జీవిత సామాన్య బాంధవ్యాలను ప్రక్కన బెట్టడం, అస్థిరత్వం నుండి శాశ్వతంగా వుండే సుస్థిరత్వం వైపు సాగిపోవడం అనేవి అన్ని మార్గాలకూ సామాన్య విషయమే. కలను, నిద్రను జయించడాని కొకరు ప్రయత్నించవచ్చు, అలాగే అకలిదప్పులను జయించడానికీ ప్రయత్నించవచ్చు.

ప్రపంచంతో లేదా జీవితంతో సంబంధం లేకుండా వుండడం లేదా యింద్రియాలను నిర్జీవం చేయడం లేదా వాటి చర్యను పూర్తిగా నిలిపివేయడం అనేవి నా యోగంలో భాగం గాదు. జీవితం లోనికి దివ్యవెలుగు, దైవ పరమ సత్యశక్తిని, ఆనందాన్ని, దాని క్రియాశీల నిశ్చితత్త్వాన్ని, క్రిందికి తీసుకురావడం ద్వారా జీవితాన్ని రూపాంతరీకరించడం నా యోగలక్ష్యం. ఈ యోగం జగదస్తిత్వానికి గల విలువను అంగీకరించి దానిని సత్యంగా నిలబెట్టుకొంటుంది. కర్మ, సృష్టి, అజ్ఞాన, అపరిపూర్ణతల వ్యక్తీకరణలు గాక, పరమ సత్యం, దివ్య వెలుగు, దైవ మహదానందాల వ్యక్తీకరణగా తెలియవచ్చే ఒక మహోన్నత పరమ సత్య-చేతన లోనికి ప్రవేశించడం దాని లక్ష్యం. కాని అందుకోసం ఈ పార్థివ మనస్సుని, జీవితం, దేహాలను ఆ మహోన్నత దైవచేతనకు సమర్పణ గావించడం అనివార్యం. ఎందుచేతనంటే, ఎందులో క్రియాశీలత ఇకనే మాత్రం మానసికమైనదిగాక, పూర్తిగా మరో విధమైన దైవశక్తిదై వుంటుందో ఆ, మనస్సు కావల వున్న ఒక అతిమానస చేతన లోనికి తన స్వప్రయత్నంతో ప్రవేశించడం మర్త్యమానవ జీవికి చాలా కష్టం. అటువంటి పరివర్తనకై పిలిచే పిలుపును అంగీకరించ గలిగినవారు మాత్రమే ఈ యోగంలో ప్రవేశించాలి.

కేవలం సాధారణ జీవితం మీద అవిశ్రాంతమైన అసంతృప్తి ఈ యోగసన్నద్ధతకు చాలదు. ఒక సానుకూలమైన ఆంతరిక పిలుపు, ఒక దృఢ సంకల్పం, ఒక గొప్ప అచంచలమైన పట్టుదల ఆధ్యాత్మిక జీవన విజయానికి అవసరం.

SABCL 23:545

*

ఒకసారి ఒక వ్యక్తి యోగమార్గంలోని కడుగు బెట్టినపుడు, అతడు చేయవలసింది ఒకే ఒక్కటి, అదేమిటంటే యేం జరిగినప్పటికీ, యెటువంటి యిక్కట్లు యెదురైనప్పటికీ అంతు చూడవలసిందే అని తీర్మానించుకొని దానికి కట్టుపడి పోవాలి. తన స్వీయ సామర్థ్యంతో యోగంలో నిజంగా సఫలీకృతులు కాలేరెవ్వరూ. నీకు పైగా నిలిచివున్న ఒక మహనీయ దివ్యక్రియాశక్తితో మాత్రమే సాధ్యమౌతుంది. సమస్త క్లిష్ట పరిస్థితులలో కూడా విడువక దివ్య క్రియాశక్తికై నిలిచి వుండే పిలుపు వల్ల యోగం సఫలమౌతుంది. నీవు చురుకుగా దానికై ఆకాంక్షించ లేకపోయినప్పటికీ సహాయం వస్తుందని దివ్యజనని

వైపు తిరిగి వుండాలి, ఆ ఒక్క పనినీ నీవు యెల్లపుడు చేయవలసి వుంది.

CWSA 32:294 (SABCL: 327-28)

శ్రీఅరవిందులు

*

శ్రీఅరవిందుల సంకేతం



యోగం గమ్యాన్ని చేరడం యెప్పుడూ కష్టమే. కాని మరే యితర యోగాల గమ్యం కన్నా ఈ యోగం గమ్యం చేరడం మరింత కష్టం. పిలుపు, సామర్థ్యం దేన్నైనా, ఏ ప్రమాదాన్నైనా యెదుర్కోడానికి కంగీకరించేవాళ్ళు, వైఫల్య ప్రమాదాన్ని సైతం యెదుర్కోడాని కంగీకరించేవాళ్లు, పూర్తిగా నిస్వార్థంగా, వాంఛారహితులుగా, తయారయ్యే విధంగా పురోగతి సాధించాలని, సమర్పణ కావాలని సంకల్పం గలవాళ్ళకే ఈయోగం.

SABCL 24:544

*

ఒక విభజనకు లోనైన సంకల్పంచే, లేదా ఊర్జంలోని కొద్ది భాగంతో, లేదా సంశయాత్మక మనస్సుచే ఈ యోగం సాధ్యపడదు. దైవాన్ని అన్వేషించేవాడు భగవంతునికి తనను తాను సమర్పించివేసుకోవాలి, భగవంతుడికి మాత్రమే.

CWSA 23:69-7- (SABCL 20:63-64

*

యోగం విజయ రహస్యం, దానిని జీవితంలో సాధించవలసిన లక్ష్యాలలో ఒకటిగా గాక, ఒకే ఒక్క లక్ష్యంగా పరిగణించడంలో, జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా గాక, మొత్తం జీవితమే యోగంగా పరిగణించడంలో వుంది.

CWSA 23:71 (SABCL 20:65)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

ఒక జిజ్ఞాసువు కథ

ఈ సాయంత్రం మీకొక సుబోధకమైన కథను వినిపిస్తాను. అది ముద్రణ, పుస్తకాలకు ముందు కాలం నాటిది. ఆ రోజుల్లో గురుకులాలలో విధేయతగా ఉన్నవాళ్ళకే ప్రవేశం లభించేది. అదీ గురువులు వాళ్ళు దానికి అర్హులని తలిస్తేనే!

అర్హత పొందాలంటే ఆచరణలో నిరూపించాలి గదా! ఒక గురువు ఏదైనా నియమాన్ని తన శిష్యులకు నేర్పాడంటే దాన్ని వాళ్ళు ఆచరించాలని కూడా కోరుకుంటాడు. అది ఆచరణలో ప్రతిఫలించినపుడే మరో విషయాన్ని శిష్యులకు చెప్పటానికి అంగీకరిస్తాడు.

ఇక కథను మొదలుపెడ్తాను.

జ్ఞానోపదేశము — ఒక కథ

(ఇది గుజరాతీ భాష నుంచి అనువదించబడినది)

పూర్వం ఒక మహనీయుడు వుండేవాడు. ఆయన గొప్ప తపస్వి, పండితుడు కూడా. వయసు వల్లా, జ్ఞానం వల్లా అందరి గౌరవాన్ని పొందగలిగాడు. ఆయనే 'జనూన్' మహాత్ముడు. ఆయన వద్ద విద్యాభ్యాసం చేయడానికి అనేకులు వస్తుండేవారు. ఆయన వద్దనే ఆశ్రమంలో నివసించి, ఆశ్రమ నియమాలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి ఎంతో కాలం అక్కడ వుండి జ్ఞానాన్ని పొందేవారు.

ఒక రోజు ఆ మహనీయుని ఆశ్రమానికి ఒక యువకుడు వచ్చాడు. అతని పేరు 'యూసఫ్ హుస్సేన్'. ఏ వివరాలు అడగకుండానే యూసఫ్‌కు ఆశ్రమంలో ఉండటానికి అనుమతి లభించింది. నాలుగు సంవత్సరాలు యూసఫ్ స్వామీజీ సమక్షంలో గడిపాడు.

ఒకనాడు జనూన్ మహాశయుడు యూసఫ్‌ను పిలిచి తాను ఏ ఉద్దేశంతో ఆశ్రమానికి వచ్చాడో చెప్పమని అడిగాడు. ఆధ్యాత్మిక (మత) విషయాలలో విద్యాభ్యాసం చేయటానికి తాను విచ్చేశానని యూసఫ్ సెలవిచ్చాడు. జనూన్ మహాశయుడు మారు పలుకకుండా ఒక సేవకుని పిలిచి "ఆ పెట్టె సిద్ధంగా వుందా? ఉంటే దానిని తక్షణమే ఇక్కడికి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు.

కాసేపట్లో ఆ పెట్టె జనూన్ మహాశయుడి సమక్షంలో వుంచబడింది. "శ్రద్ధగా,

జాగ్రత్తగా ఈ పెట్టెను నీలా నదికి ఆవలి గట్టున ఉన్న నా స్నేహితునికి ఇచ్చిరా. దారిలో ఏ పొరపాటు చేయరాదు. ఎప్పుడూ నీ వద్దనే వుంచుకొని, ఎవరికి ఇవ్వ మన్నానో వారికే ఇవ్వు, జాగ్రత్త. నీవు తిరిగి వచ్చాక నీ విద్యాభ్యాసం మొదలౌ తుంది." నీలా నదికి ఏ మార్గాన పోవాలో వివరించాడు. యూసఫ్ ఆయన పాదాలకు ప్రణమిల్లి ఆ పేటికను తీసికొని నీలా నది దిశగా ప్రయాణమయ్యాడు.

జనూన్ మహనీయుని ఆశ్రమం చాలా దూరం ఆ రోజుల్లో కార్లు, రైళ్ళు లేవు. యూసఫ్ కాలినడకనే ప్రయాణం సాగించాడు. రోజులో మధ్యాహ్నం దాగా నడిచేవాడు. మధ్యాహ్నపు ఎండ తీవ్రంగా ఉన్నపుడు సేద తీరటం కోసం చెట్ల నీడలో విశ్రమించేవాడు. ఆ పెట్టె చూడడానికి చిన్నదే. బరువు కూడా తక్కువే. పెట్టెకు తాళం కూడా లేదు. ఇంతవరకూ యూసఫ్ దాన్ని గమనించనే లేదు. తన గురువుగారి ఆజ్ఞ ప్రకారం పెట్టెను తీసుకొని పోతున్నాడు.

ఒకనాటి మధ్యాహ్నం విశ్రాంతి తీసికొంటుండగా తన మనసు చుట్టూ అనవస రమైన ఆలోచనలు మొదలైనాయి. ఆ సందర్భంలో అలాంటి ఆలోచనలు రావటమూ కద్దు. జనూన్ చూపులు ఆ పెట్టెపై పడ్డాయి. "ఇంత చక్కని పేటికకు తాళం ఎందుకు వేయలేదు చెప్మా! బరువు కూడా తక్కువే. ఇందులో ఏముందో? ఇందులో ఏదైనా ఉండటాని కవకాశం వుందా? ఎంత తేలికగా వుంది. బహుశా ఖాళీయేనేమో?"

ఇట్లా అనుకుంటుండగా అతని చేతులు అప్రయత్నంగా మూత తెరవాలని ప్రయత్నించాయి. కాని తమాయించుకున్నాడు. గురువు తనను భద్రంగా తీసి కొనివెళ్ళి వారి స్నేహితునకు ఇవ్వమన్నారు. అందులో ఏముంటే తన కెందుకు? అది నా కనవసరం. దాన్ని గురించి నేను ఏమాత్రం ఆలోచించకూడదు" కొన్ని క్షణాలు మౌనంగా దానివైపే చూస్తూ గడిపాడు. కాని మనసు చంచలం గదా? అది వూరుకోనివ్వలేదు. "ఇది ఖాళీ పెట్టే అయి వుంటుంది. ఏం దాన్ని తెరిస్తే! తాళం వేసి వుంటే తీస్తేనే గదా తప్పు. ఒక్క క్షణం లోపల ఏముందో చూస్తాను" అను కున్నాడు.

యూసఫ్ ఆలోచనలన్నీ ఆ పేటిక చుట్టూనే తిరగసాగాయి. వాటిని అదుపు చేసుకోలేక పోయాడు. "ఒక్కసారి ఏముందో చూస్తాను; ఒక్కసారే" అనుకున్నాడు. అప్రయత్నంగా చేతులు ఆ పెట్టె పైకి వెళ్ళాయి. కాని బలవంతంగా వెనుకకు తీసుకున్నాడు. కాని కోరిక ఆగలేదు. నెమ్మదిగా మనసు దిటవు చేసుకొని మెల్లగా

ఆ పెట్టె మూత తెరిచాడు. ఇంకేముంది! ఎన్నాళ్ళుగానో అందులో దాగి వున్న ఒక చుంచు ఎలుక అమాంతం బయటకు దూకి పారిపోయింది. యూసఫ్ నిర్ఘాంత పోయాడు. కళ్ళు పెద్దవి చేసుకొని అటూ ఇటూ పరికించాడు. ఖాళీ పెట్టె తన ముందున్నది. ఎలుక తప్పించుకుపోయింది. తన గుండె వేగంగా కొట్టుకొంటున్నది. నాలుగు వైపులు ఆశగా చూశాడు. "అయ్యో ఆ మహాత్ముడు చెప్పిన చిన్న పని కూడా నేను సక్రమంగా చేయ లేకపోయానే! ఎంత పొరపాటు జరిగింది. ఇప్పుడేం చేయాలి", అని తనను తాను నిందించుకున్నాడు. యూసఫ్ పశ్చాత్తాపంతో కృంగిపోయాడు. కాని ఇప్పుడ ఏంచేయగలడు? నిరాశతో ఆ చెట్టు చుట్టూ తిరిగి చూచాడు. బాటకు ఆ వైపు, ఈ వైపూ వెతికాడు. ఎలుక తప్పించుకొని ఎటు పోయిందో!

వణుకుతున్న చేతుల్తో ఆ పెట్టెకు మరల మూతవేసి నిరాశతో తన ప్రయాణం కొనసాగించాడు. చివరకు నీలా నదిని దాటి తన గురువు యొక్క స్నేహితునకు ఆ పెట్టెను అందజేశాడు. తాను చేసిన పొరపాటుకు పశ్చాత్తాపంతో ఒక మూలగా నుంచొని మౌనంగా ఉండిపోయాడు.

జనూన్ మహాశయుని స్నేహితుడు కూడా ఒక దివ్యపురుషుడే. యూసఫ్ తెచ్చిన పేటికను తెరచి జరిగినదంతా గ్రహించాడు. యూసఫ్ వైపు తిరిగి ఇలా అన్నాడు, "యూసఫ్, నువ్వు ఇందులోని ఎలుక పారిపోయేలా చేశావు. జనూన్ మహాశయుడు నీకు విద్యాభ్యాసం చేయటం అసంభవం. ఉన్నత విద్యను అభ్యసించాలంటే మనసుపై పూర్తి అదుపు ఉండాల్సిందే. మీ గురువు గారికి నీ మనోబలంపై పూర్తి విశ్వాసం లేకపోవటం వల్ల ఈ చిన్న పరీక్ష పెట్టారు. ఒక చిన్న ఎలుక వున్న పేటికను నిజాయితీతో తీసుకొని రాలేని నువ్వు గొప్ప భావాలను ఎలా తలకెక్కించుకో గలవు? నిజానికి 'చిన్న పని' అనేది ఏదీ ఉండదు. అవును యూసఫ్, వ్యక్తిత్వాన్ని కాపాడుకో, పట్టుదలను పెంచుకో. మరల నీ గురువుగారి వద్దకు పో. నమ్మకం కల్గించేలా నిన్ను నీవు మలచుకో. ఒకనాటికి ఆ మహనీయునికి తగిన శిష్యుడవు కాగలవు", అన్నాడు.

యూసఫ్‌కు తల తీసేసినట్లయింది. నేరుగా తిరిగి తన గురువుగారి వద్దకే వెళ్ళి తన తప్పిదం విన్నవించుకున్నాడు. ఆ మహనీయుడు ఇలా అన్నాడు "యూసఫ్, ఒక మహదవకాశం చేజార విడుచుకున్నావు, దేనికీ పనికిరాని చిన్న

ఎలుకను కాపాడలేని నీవు నిజమైన దివ్యత్వాన్ని ఎలా పొందగలవు? నీ మీద నీకు అదుపు ఉండాలి కదా! పోయి దాన్ని సాధించు; అది లేకుండా ఏ గొప్పదానినీ నీవు సాధించలేవు."

సిగ్గుతో తలవంచుకొని వెనుకకు మరలాడు యూసఫ్. అప్పటి నుండి అతనికి ఒకటే ఆలోచన. తాను మనసుపై యాజమాన్యం ఎలా సాధించాలి? అప్పటి నుండి అనేక సంవత్సరాలుగా నిరంతర కృషి చేశాడు. కఠిన తపస్సులా జీవించాడు. చివరకు మనసుపై తనకు యాజమాన్యం సిద్ధించింది. అప్పుడు మరల గురువును కలిసాడు. యూసఫ్‌ను చూడగనే ఆ మహనీయునకు ఎంతో ఆనందం వేసింది. యూసఫ్‌యొక్క పరిణతిపై ఆయనకు నమ్మకం కుదిరింది. అతనికి జనూన్ మహాత్ముని వద్ద విద్యాభ్యాసం చేసే అవకాశం కలిగింది.

సంవత్సరాలు గడిచాయి. యూసఫ్ జ్ఞానంలో పరిణతి సాధించాడు. ఇస్లాం దివ్యపురుషులలో అరుదైన స్థానాన్ని పొందగలిగాడు.

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహా రావు

ఎవరైనా నేను యోగంలో ప్రవేశపెట్టానని చెప్పినప్పుడు, దాని అర్థం, నన్ను నేను ఆ వ్యక్తికి మాటలు లేకుండా వ్యక్తం చేసుకొన్నానని. నేనేమిటో దానిని దర్శించడానికి, తెలుసుకొనడానికి, అనుభూతి చెందడానికి, అతడు సమర్థుడయ్యాడని దానర్థం.

CWM 3:84

శ్రీమాత

శ్రీమాత యోగ మార్గము

మొదటి భాగము

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2015

విషయసూచిక

గమనిక

శ్రీమాత ప్రార్థనలు 'ప్రార్థనలు, ధ్యానములు' అన్న ప్రచురణలలో ప్రకటించబడ్డాయి. వాటిలో నుండి కొన్నింటిని, అనగా, మార్చి 30, 1914 న శ్రీమాతారవిందుల ప్రథమ సమావేశం నాటి వరకు చేయబడిన ప్రార్థనలను ఈ సంచికలో ప్రచురించాము. అత్యంత ప్రాధాన్యతగల ఆ సమావేశం తరువాతి ప్రార్థనలను ఏప్రిల్, 2015 సంచికలో రెండవ భాగంగా ప్రచురించ తలచాము. పాండిచేరికి వారి ఆగమన పూర్వమే శ్రీమాత యోగం ప్రారంభమయి నందువలన ఆ యోగం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుపుట కోసం అందుకు సంబంధించిన మరికొంత సమాచారం కూడా ఇందులో జతపరచడమైనది.

ఎంతైనా, గమనించతగ్గ విషయమేమిటంటే ఏ సంకలనం కూడా శ్రీమాతారవిందుల అనుభవాలు, సిద్ధులను గురించి సంపూర్ణ సమాచారాన్ని అందించలేదు, కారణం పైకి కనిపించే వారి జీవిత విశేషాలు సామాన్య మానవులు అర్థం చేసుకోగలిగినంత తేలికైనవి గావు,

శ్రీమాత సాధనా పూర్వాపరాలు

సాధన చేస్తున్నానని తెలియకుండానే నేను జన్మించినపుడే నా సాధనను ప్రారంభించాను. దానిని నా జీవితమంతా కొనసాగించాను. అంటే సుమారు ఎనభై సంవత్సరాలు. అయితే స్వచ్ఛందంగా చైతన్యవంతమైన సాధన రమారమి యిరవై రెండు, యిరవై మూడు సంవత్సరాల వయసులో ఒక సంసిద్ధమయిన భూమికపై మొదలుపెట్టాను. ప్రస్తుతం నాకు ఎనభై సంవత్సరాలు దాటాయి. నేను దానిని తప్ప యిక దేనిని గూరించీ ఆలోచించలేదు. దానిని తప్ప మరి దేనినీ కావాలని కోరుకోలేదు. నాకు జీవితంలో మరొక ఆసక్తి ఏమీ లేదు. ఎప్పుడూ ఒక్క నిముషం కూడా నాకు కావలసినది 'అదే' అనే విషయాన్ని నేను విస్మరించలేదు. గుర్తుంచుకోవటం, మరచిపోవటమనే సందర్భాలు లేవు. ఇరవై నాలుగేళ్ళ వయసు నుండి రాత్రింబవళ్ళూ ఒక నిరంతరమైన పయనం ఎడతెగకుండా కొనసాగింది. నిజానికి నా స్వీయ యోగం తీసుకున్న క్రమానుగతిని చూసినట్లయితే, నా అయిదేళ్ళ వయసులో (నేనింకా ముందే ప్రారంభించి ఉంటాను. సరిగా, కచ్చితంగా జ్ఞాపకం లేదు) కానీ అయిదు సంవత్సరాల వయసు నుండి నా చేతనలో (మానసికమయిన స్మృతి కాదు, ఎలా చెప్పగలను? గమనించటం జరిగింది. నా చేతనలో గుర్తించటం జరిగింది.) అవును నేను చైతన్యంతో ప్రారంభించాను. చైతన్యం అంటే ఏమిటి? అనే అవగాహన నా కపుడు లేదు. కానీ నా మొదటి అనుభవం యిక్కడ చైతన్యం ఉండటం (మదర్ తన తల పైన చూపిస్తారు) ఒక దివ్యకాంతిలా, దివ్యశక్తిలా నేను అనుభూతి చెందేదాన్ని. నేను దానిని (మళ్ళీ అలానే చూపిస్తారు) అయిదేళ్ళ వయసులోనే అది అక్కడ వున్నదనే అనుభూతి పొందాను. అది చాలా ఆహ్లాదకరమైన అనుభూతి. నా కోసం ప్రత్యేకంగా చేయించబడిన చిన్న కుర్చీలో కూర్చుని, నా గదిలో ఒంటరిగా (అదేమిటో నాకు తెలియదు — కొంచెం కూడా. మానసికంగా శూన్యం) నాకు అత్యంత ఆహ్లాదకరమైన, ఎంతో శక్తివంతమయిన, ఎంతో తేజోవంతమయిన భావన యిక్కడ (తలపై) కలిగేది. చైతన్యం 'దీని కోసమే నేను జీవించాలి. నేను కావలసిన దిదే' అని భావించేదాన్ని ఈ మాటలన్నిటితో కాదు, సహజంగా (మదర్ ఊర్ధ్వంగా ఆకాంక్షను తెలియచేసే సంజ్ఞ చేస్తారు) అపుడు నేను దానిని

క్రిందకు లాగేదాన్ని. ఎందుకంటే నిజానికది నా జీవిత పరమార్థం గనుక.
(మూలం: 'ది మదర్ : బర్త్ అండ్ గ్రోత్ ఆఫ్ ఎ ఫ్లేమ్' అనురాగ్ బెనర్జీ. పబ్లిషర్స్: ఓవర్ మ్యాన్ ఫౌండేషన్, కలకత్తా పుటలు 13-14)

శ్రీమాత ప్రార్థనలపై శ్రీఅరవిందుల లేఖలు కొన్ని:

ప్రశ్న: శ్రీమాత 1914 లో వ్రాసిన కొన్ని ప్రార్థనలలో రూపాంతరీకరణ, ఆవిష్కరణ గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో ఆమె యిక్కడ లేరు గనుక ఇక్కడకు రాక మునుపే ఆమెకు ఈ విషయాలపై అవగాహన ఉన్నదని అర్థమా?

సమా: శ్రీమాత యుక్తవయసు నుండే, ఆమె బాల్యం నుండే ఆధ్యాత్మికమయిన చేతనను కలిగి ఉన్నారు. ఆమె ఊర్ధ్వముఖంగా సాధన చేసి భారతదేశానికి రాక పూర్వమే ఈ జ్ఞానాన్ని కలిగి ఉన్నారు.

23 డిశంబరు 1933

దైవం మానవరూపాన్ని ధరిస్తారు. బాహ్యంగా మానవ స్వభావాన్ని స్వీకరిస్తారు. ఎందుకంటే మార్గాన్ని ఏర్పరచి మానవులకు దిశా నిర్దేశం చేయటానికి. కానీ దైవంగా ఉండటం మానరు. అక్కడ ఆవిష్కరణ జరుగుతుంది. ప్రవర్థమానమయ్యే దివ్యచేతన యొక్క ఆవిష్కారం. మానవత దైవంగా మారటం కాదు. శ్రీమాత బాల్యంలో కూడా ఆంతరంగికంగా మానవత్వానికి అతీతంగా ఉన్నారు. అందువలన చాలామంది అభిప్రాయం దోషయుతం.

ప్రశ్న: శ్రీమాత ప్రార్థనలు మాకు ఆకాంక్షించే అంతరాత్మను చూపటం కోసం, దైవాన్ని ఎలా అర్థించాలో తెలియచేయటం కోసం ఉద్దేశించబడ్డాయని నేను భావిస్తాను.

సమా: అవును.

17 ఆగష్టు 1938

దైవం ముందుగా ప్రపంచం కోసం సాధన చేసి తరువాత తాను క్రిందకు తెచ్చినదానిని అందరికీ యిస్తారు. సిద్ధులూ, అనుభవాలు లేకుండా సాధన ఉండదు. ప్రార్థనలు శ్రీమాతద అనుభవాల సంకలనాలు.

4 జనవరి 1935

ప్రార్థనలు చాలా వరకు పృథ్వీ చైతన్యంతో మమేకమై వ్రాసినవి. నిమ్న ప్రకృతీ మాతను పరాప్రకృతి మాతను ఉద్దేశించినవి. ఇక్కడ శ్రీమాత స్వయంగా రూపాంతరీకరణానికై పృథ్వీచైతన్యపు సాధనను స్వయంగా కొనసాగిస్తూ, ఊర్థ్వంగా ఉన్న — ఎవరి నుండి అయితే రూపాంతర శక్తులు వెలువడతాయో ఆతనినే ప్రార్థిస్తూ వ్రాసినవి. పృథ్వీ చైతన్యమూ, ఉన్నత చైతన్యము ఏకమయే వరకూ యిది కొనసాగుతుంది. దైవం నుండి దైవానికి సాగే యిటువంటి ప్రార్థనలు మనం రామాయణం, మహాభారతంలో కూడా చూస్తాం.

21 ఆగష్టు 1936

CWM 1:383

శ్రీమాత తన ప్రార్థనల గురించి

ప్రార్థనలు, ధ్యానములు నాకు ప్రాప్తించాయి తెలుసా. ప్రతిసారి అవి నాకు ఆదేశింపబడేవి. నా ధ్యానం అయిన తర్వాత వాటిని నేను వ్రాస్తూ ఉండేదాన్ని. అది మనసు గుండా వచ్చేవి కాదు. అలా వచ్చేవి అంతే. ఒక సుందరమైన రూపం పట్ల ఆసక్తి ఉన్న ఎవరి నుండో వచ్చేదనేది విదితం. నేను వాటిని తాళం వేసి ఎవరూ చూడకుండా భద్రంగా ఉంచేదాన్ని. కానీ నేను యిక్కడకు వచ్చినపుడు శ్రీఅరవిందులు వాటి గురించి అడిగారు. నేను ఆయనకు కొన్ని పుటలను చూపించాను. ఆయన మిగిలినవాటిని కూడా చూస్తానన్నారు. లేకపోతే నేను ఎప్పటికీ వాటిని తాళం వేసే ఉంచేదాన్ని. మిగిలినవాటిని తీసివేసాను. నేను ప్రతిరోజూ ధ్యానం తర్వాత వ్రాసిన ప్రార్థలన్నీ కలిపి అయిదు పెద్ద గ్రంథాలుగా ఉండేవి (కొన్ని బహుశా పునరావృతమవుతుండేవి). అవి నా ధ్యాన ఫలితాలు. ఏవి ముద్రించాలో వాటిని నేను ఎంపిక చేసాను (శ్రీఅరవిందులు ఎంపికలో సాయం చేసారు). వాటిని మాత్రం తిరిగి వ్రాసి కత్తిరించి, మిగిలినవాటిని అగ్నిలో ఆహుతి చేసాను.

'శిష్యునితో సంభాషణలు' సెప్టెంబరు 15, 1962

అనువాదం డా. సరోజా ప్రసాద్

మానవజాతి కోసం దైవ ప్రార్థన

దైవంతో సంయోగం

నిన్నటి రోజున, మీపై (దైవం) గల నిర్వ్యాజమైన అపేక్షతో తపిస్తున్న ఇంగ్లీషు యువకునితో, మిమ్ములను నేను నిశ్చితంగా కనుగొన్నానని, ఆ దివ్యసంయోగం స్థిరమైనదని చెప్పాను. అట్టి మహోన్నత స్థితిని గురించిన ఎరుక నిజంగా నాకున్నది. నా ఆలోచనలన్నీ మీ వైపుగానే ప్రసరిస్తాయి. నా చేతలన్నీ మీకే అర్పితము. మీ దివ్యసాన్నిధ్యము నాకు ఒక సమగ్రమైన మార్పులేని, మార్పుచెందని అనుభూతి. దివ్యమైన మీ ప్రశాంతత నా హృదయంలో స్థిరనివాస మేర్పరచుకున్నది. అయినప్పటికీ నన్ను నేను వ్యక్తపరచుకొనుటకై 'నా', 'నేను' అను భావన నా నుండి పూర్తిగా విడిపోవడానికి నా ప్రస్తుత తాదాత్మ్య స్థితి అశక్తమైనది, అనుమానాస్పదమైనది అని, భవిష్యత్తులో ఆ స్థితిని చేరటానికి నేను ఇప్పటికీ నిస్సందేహంగా చాలా దూరంలో నున్నానని, నాకు తెలుసు. అయితే, ప్రతిసారి నేను వ్యక్తపరచాలనుకుంటున్న ఆలోచనకు 'నా', 'నేను' అను భావన ఒక ప్రతిబంధకమవుతున్నట్లుగా నున్నది. మానవుల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకొనుటకు ఈ పద్ధతి తప్పనిసరి అనుకుంటాను. అయితే అంతా ఈ 'నా', 'నేను' అనే పదం వ్యక్తపరేచేదేమిటి అన్న విషయంపై ఆధారపడి వుంటుంది. ఇప్పటికీ, ఎన్నిమార్లు నేనా పదాన్ని పలికినా, నాలో పలికేది మీరే, ఎందుకనగా నేను మీరు వేర్వేరు అనే భావనను నేను కోల్పోయాను.

కాని ఇదంతా ఇంకా పరిణతి చెందే ఆరంభదశలోనే వున్నది, పరిపూర్ణత చెందటానికి ఎదుగుతున్నది. సర్వశక్తి సమన్వితులగు మీపై గల ఈ నిర్మలమైన నమ్మకంలో ఎంత సంతృప్తికరమైన ఆత్మవిశ్వాసంతో కూడిన హామీ వున్నది!

మీరే సర్వస్వం, సర్వవ్యాపి, సర్వాంతర్యామి, దృశ్యమానమగు ఈ జగత్తు అంతా ఏ విధంగానైతే మీరే అయివున్నారో అదే విధంగా కర్మచేసే ఈ దేహం స్వయంగా మీ దేహమే. ఈ పదార్థరూప దేహంలో ఊపిరి పీల్చేది, ఆలోచించేది, ప్రేమించేది మీరే అయినందున ఈ శరీరం ఇష్టపూర్తిగా మీ సేవకుడిగా వుండాలని కోరుతున్నది.

నవంబరు 19, 1912

కర్మాచరణ యొక్క అవసరం, ప్రయోజనం

ఈ బాహ్యజీవితం, ఈ ప్రతిరోజు దినచర్య, ఈ ప్రతిక్షణ కార్యాచరణ, మేము ధ్యాన మననాదులలో గడిపే కాలంలో విడదీయలేని అనుబంధం కాదా? ఈ ఒక్కొక్క కర్మలో గడిపే సమయం అందుకై చేసే సన్నాహానికి, సాధించటానికి చేసే ప్రయత్నానికి అవసరమయ్యే సమయానికి సమాన నిష్పత్తిలో లేదా? ఎందుకనగా ఆధ్యాత్మిక చింతన ధ్యానమననాదులు సమకూర్చే ఫలితం దైవసంయోగం — వికసిత పుష్పం లాంటిది. దినచర్య అనేది స్వర్ణకారుడి దాగిలి లాంటిది. శుద్ధపరచబడుటకు, సంస్కరించబడుటకు, ధ్యానమననాదులు వలన కలిగే జ్ఞానకాంతి ప్రసరణకు అనువైన పరిపక్వతను, మెత్తదనాన్ని పొందుటకై మలచబడటానికి, కర్మలన్నీ ముందు మూసలో వేయబడి దాగిలిపై సుత్తిదెబ్బలు తినవలసిందే. సమగ్రాభివృద్ధికై చేసే బాహ్య కార్యాచరణ అవసరం కాక మునుపే ఈ కర్మలన్నీ ఒకదాని తరువాత ఒకటి ముందుగా మూసలో వేయబడాలి. అప్పుడే ఈ కార్యక్రమం మిమ్ములను సాక్షాత్కరింప చేసుకొనుటకు మార్గమవుతుంది. ఆ విధంగా మూసలో వేయబడి దాగిలిపై సాగినట్లుగా జ్ఞానకాంతి ప్రసరణ కార్యాన్ని నిర్వర్తించడానికై చైతన్యంలోని ఇతర కేంద్రాలను ఉత్తేజపరుస్తుంది. ఇందుకు ఆటంకపరచే వాటన్నింటిలోకి అహంభావం, స్వయంతృప్తి హేయమైనవి. అందువలన అందుబాటులో నున్న అతి అల్పమైన అంశాలను సైతం మలిచి శుద్ధపరచడానికి, నిస్వార్థం గావించడానికి, స్వయంతృప్తిని వదిలి త్యాగనిరతిని, భక్తిని, దయను, సౌమ్యతను అలవరచుకొనడానికి, వాటిని నమ్రతతో స్వీకరించి అనుకూలంగా మలచుకోవాలి. ఇలాంటి జీవన విధానాలు అలవాటుగా మారినపుడు, మనుషులు ఆలోచించడానికి, దివ్యమైన ఏకాగ్రతలో తమను తాము మీతో తాదాత్మ్యం చెందడానికి సిద్ధపడుతారు. అందువలన నేర్పరులైనవారికి కూడా ఈ కార్యం నెమ్మదిగా, దీర్ఘకాలం కొనసాగుతుందని, ఆకస్మికంగా చేసే మార్పులు సమగ్ర సాఫల్యతను సమకూర్చవని నా కనిపిస్తుంది. అవి అస్తిత్వం యొక్క ఆచారవిధానంలో మార్పు తెచ్చి ఒక సూటిగా సాగే మార్గంలో నిశ్చితంగా ప్రవేశపెడతాయి. అయితే నిజంగా లక్ష్యాన్ని సాధించాలనేవారు ఎవరైనా క్షణక్షణం కలిగే ఇట్టి అసంఖ్యాక అనుభవాలను తప్పించుకోలేరు.

నా అస్తిత్వంలోను, ప్రతి వస్తువులోను ప్రకాశించే ఓ సర్వేశ్వరా, మీ దివ్యకాంతి

ప్రకటితం కానీ, మీ శాంతియుత సమున్నత ఏలుబడి అందరికీ లభించనీ.

నవంబరు 28, 1912

ప్రశాంతమైన నిశ్శబ్ద సమభావ స్థితిలో దైవం వ్యక్తమవుతాడు

శాంతి, నిశ్శబ్దం, సమభావం నెలకొని వున్నప్పుడే దైవం వ్యక్తమవుతాడు. ఏదీ నిన్ను కలవరపరచనీయకు, అప్పుడే దైవం వ్యక్తమవుతాడు. ఎన్ని సంకటస్థితులు ఎదురైనా సంపూర్ణ సమత్వం కలిగి వుండు. అప్పుడు అక్కడ దైవం తప్పక వుంటాడు.... నిజమే, మేము నీ అన్వేషణలో ఆత్యధిక తీవ్రతను, ప్రయాసను కనబరచకూడదు, శ్రమించకూడదు. ఆ తీవ్రత, ఆ ప్రయాస మిమ్ములను మరుగు పరచటానికి ఒక అడ్డుతెర అవుతుంది. మీ దర్శనానికై మేము తహతహ లాడకూడదు. కారణం, అది కూడా మీ నిత్యసత్య సమక్షాన్ని మరుగుపరచే మానసికాందోళన అవుతుంది. ఒక సంపూర్ణ, ప్రశాంత, ప్రసన్న, సమత్వ స్థిలోనే మీరే సర్వస్వమై, అంతా మీరే అయి వుంటారు. అట్టి సంపూర్ణమైన, స్వచ్ఛ ప్రశాంత వాతావరణంలో అతి చిన్ని కదలిక కూడా అభివృద్ధికి ఆటంకమవుతుంది. తొందరపాటు కూడదు, ఆతురత కూడదు, ఉద్వేగం కూడదు. మీరు తప్ప మరెద్దానికీ తావు లేనప్పుడే, విశ్లేషణకుగాని, ప్రతిబంధకానికి గాని చోటివ్వనప్పుడే, నిస్సంశయంగా మీరచ్చట వుంటారు. ఎందుకనగా అంతటా ఒక పవిత్రమైన ప్రశాంతస్థితి ఒక పునీతమైన నిశ్శబ్ద వాతావరణం నెలకొని వుంటుంది.

ఈ లోకంలో అన్ని ధ్యానస్థితులలోకి ఆ స్థితి అత్యంత మేలైనది.

ఏకైక కర్తగా దైవాన్ని స్పష్టంగా గ్రహించాలి

ఓ సర్వేశ్వరా, ఓ నిత్యసత్య అధ్యాపకుడా, మీ ఆదర్శాన్ని అనుసరించుటలో సంపూర్ణ విశ్వాసం కలిగి వుండుటలో గల అసమాన సార్థకతను నిరూపించగలిగే అవకాశం మరో మారు నాకు ప్రసాదించబడింది. మీ దివ్యచైతన్యం యొక్క విశిష్టత నిన్న నా నోటి గుండా వెలువడింది. అందుకు నా అంతరంగంలో ఏమాత్రం అవ రోధం ఏర్పడలేదు.ఈ నా దైహిక పరికరం అందుకు ఇష్టపూర్తిగా, అతి సులువుగా, అతి చురుకుగా స్పందించింది.

ప్రతి విషయానికి, జీవితానికి సంబంధించిన ప్రతి కర్మాచారణకు మీరే కర్తలు.

అన్ని కార్యాచరణలలో, ఏమాత్రం మినహాయింపు లేకుండా, మిమ్ములను స్పష్టంగా దర్శించగలిగినంతగా మీ సామీప్యంలో నున్న ఎవరికైనా ప్రతి చర్యను ఒక ప్రసాదంగా, ఒక ఉపకరణంగా ఎలా మార్చుకోవచ్చునో తెలుసు.

పరిపూర్ణమైన విశ్వాసంతో మీలోనే అనువసించగలగటమే అతి ముఖ్యం. ఆ వాసం నిరంతరం కొనసాగాలి. మీలోనే అధికంగా, అధికాధికంగా, ఇంద్రియ సంవేదన లను, భ్రమలను అధిగమించి, కర్మాచరణను విరమించకుండా, నిరాకరించకుండా, తిరస్కరించకుండా — హానికరమైన వృధా ప్రయాసను — ఆ కార్యాచరణ ఎలాం టిదైనా నిరంతరం కొనసాగాలి. అప్పుడు భ్రమ తొలగిపోతుంది, ఇంద్రియ సంవేదనలు అంతరిస్తాయి, పర్యవసానాల పాశం తెగిపోతుంది. సర్వమూ మీ నిత్యసత్య ఉనికి యొక్క వైభవోపేతమైన అభివ్యక్తిగా మారిపోతుంది.

ఆ విధంగానే ఉండుగాక — తథాస్తు.

డిసెంబరు 10, 1912

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ప్రతి అభిలాష, ప్రతి పిలుపు మనను దైవం వైపు నడిపిస్తుంది.

మీ కంఠస్వరం నిశ్శబ్దంగా నున్న నా హృదయాంతరాళంలో మధురగీతంలా వినిపిస్తూ వుంది. అది నా మస్తిష్కంలోకి మాటలుగా మారి, అసంపూర్ణ మయినప్పటికీ మీ భావనతోనే నిండి వుంటుంది. ఆ గీతంలోని మాటలు భూమాత నుద్దేశించి ఇలా అంటున్నవి, “ఓ దుఃఖపూరితమైన భూమాతా, నీలో మేమున్నామని మరవకు, ఆశను కోల్పోకు. ప్రతి ప్రయత్నము, ప్రతి దుఃఖము, ప్రతి సంతోషము, ప్రతి బాధ, ప్రతి హృదయరోదన, ప్రతి అభిలాష, ప్రతి రుతు పరివర్తనము అన్నీ, ఏ ఒక్కటి మిగలకుండా సర్వము, నీకు దుఃఖ మనిపించేది, సంతోషకర మనిపించేది, సుందర మనిపించేది, వికృత మనిపించేది ప్రతిదీ నిన్ను తప్పక నా వైపు నడిపించేదే. నేనే అంతంలేని దివ్య ప్రశాంతతను, నేనే నీడలేని దివ్యకాంతిని, నేనే సంపూర్ణ సామరస్యతను, దృఢమైన విశ్వాసాన్ని, విశ్రాంతిని, చిదానందాన్ని.

విను , ఓ భూమాతా, మహనీయంగా వెలువడుతున్న కంఠస్వరాన్ని విని కొత్త ధైర్యాన్ని తెచ్చుకో!”

ఫిబ్రవరి 5, 1913

మీ అవసరం ఎప్పుడు కలిగితే అప్పుడు అక్కడ వుంటారు.

మీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి నా ప్రాణి మిమ్ము చేరుకుంటుంది. ఈ బలహీనమైన, లోపభూయిష్టమైన దేహాన్ని మీ సాక్షాత్కారానికై ఉపయోగించుకుంటారని కాదు, కారణం, మీ అంతట మీరే సాక్షాత్కారిస్తారు గనుక. అదే కాంతులకే కాంతివంతమైనది, ఆనందాలకే ఆనందమయమైనది, అద్భుతాలకే అత్యద్భుతమైనది. ఎవరైతే అత్యంత ఆర్తితో మీ కోసం వెతుకుతారో వారు మీ ఉనికి ఎప్పుడు ఎక్కడ అవసరమో అప్పుడు అక్కడ వుంటుందని తెలుసుకోవాలి. మీ కోసం వెతకనవసరం లేదు. కానీ మీకై నిరీక్షిస్తే చాలుననే పరమ సత్యాన్ని తెలుసుకొని, ప్రతిక్షణం వారిని వారు సమగ్రంగా మీ సేవకై అర్పించుకుంటే చాలు, అప్పుడు అక్కడే ప్రత్యక్షమవుతారు. సర్వకాల సర్వావస్థల యందు మీ అవసరం మాకుంటుంది కదా! అప్పుడు మీ అభివ్యక్తి విభిన్న మైన, అనూహ్యమైన రూపాలలో వుండవచ్చు.

మీ దివ్య వైభవం ప్రకటిత మవుగాక
జీవితం పవిత్రీకరింపబడును గాక
మనుషుల హృదయాలు పరివర్తన చెందుగాక
మీ దివ్యప్రశాంతత ఈ భూమిపై ప్రబలును గాక.

ఫిబ్రవరి 10, 1913

అప్రయత్నంగా సమకూరే సర్వ సాధారణ స్థితిలో అత్యున్నత శక్తి దాగి వుంటుంది

ఒక అభివ్యక్తిలో ప్రయత్నం కనుమరుగు కాగానే అది సర్వసాధారణమైనదిగా మారిపోతుంది. పుష్పం వికసించటం తన అందాన్ని వ్యక్తపరుస్తూ పరిమళాన్ని వెదజల్లటం ఎంత ఆర్భాటం లేకుండా, తీవ్రత లేకుండా సర్వసామాన్యంగా సాగిపోవునట్లుగా. అట్టి అతి సాధారణ స్థితిలోనే అత్యున్నతమైన శక్తి దాగి వుంటుంది. అది ఏమాత్రం కలుషితం చెందనిది, ప్రమాదకరమైన ప్రతిస్పందనలు రేకెత్తించనిది. ప్రాణికశక్తిని గ్రుడ్డిగా నమ్మకూడదు. కార్యాచరణ క్రమంలో అది ఉద్రేకతను కలిగి వుంటుంది. ఆ వుచ్చులో తగులుకొనే ప్రమాదం ఎప్పుడూ వుంది, ఎందుకంటే అది తక్షణ ఫలితాల రుచిని అందించి, పని మరింత బాగా చేయాలనే ప్రాథమిక

ఆతృతను పెంచి, ఆ శక్తిని వాడుకోవాలనే తీవ్ర తాపత్రయంలో పడవేస్తుంది. కాని త్వరలోనే అది మన ప్రయత్నాన్ని అపమార్గం పట్టించి, మనం చేసే పనిలో భ్రమ, చావు లాంటి బీజాలను నాటుతుంది.

సామాన్యస్థితి, అతిసామాన్య స్థితి! మీ పవిత్రమైన ఉనికిలో ఎంత మాధుర్యం వుంది!

ఫిబ్రవరి 12, 1913

ఒక అపమార్గ సూచిత మార్మికత

ఏకాంతంలో, నిశ్శబ్దతలో సమగ్ర ధ్యానస్థితిని సాధించగలిగినవాడు కూడా కేవలం తన దేహాన్ని విస్మరించి దానిని ఏమాత్రం లెక్కచేయకుండానే ఆ స్థితిని సాధించగలడు. ఆ కారణంగా. శరీర నిర్మాణంలోని పదార్థం ఇతః పూర్వం ఎంత అపవిత్రంగా, దోషభూయిష్టమై వున్నదో అలాగే వుండిపోతుంది. ఎందుకనగా అది ఎలా వుండిందో అలాగే దానిని అతడు వదిలేసాడు — లోకాతీతమైన భౌతిక వైభవ ఆకర్షణకు లోనై. ఒక అపమార్గ సూచిత మార్మికత ద్వారా స్వయంతృప్తి పొందటానికి, మీతో తాదాత్మ్యం చెందాలనే అహంకారపూరితమైన ఆకాంక్షతో, ఈ లోకంలో తన ఉనికి ఎందుకు కలిగిందో ఆ కారణాన్నే విస్మరించి, ఒక పిరికిపందలాగా, భౌతిక పదార్థ పవిత్రీకరణ అనే తన ధ్యేయాన్ని సాధించటానికి నిరాకరిస్తాడు. మన అస్తిత్వంలోని ఒక భాగం సమగ్రంగా పవిత్రీకరించబడిందని తెలుసుకొని, దానితో సంబంధం నెలకొల్పుకొని, దానితో తాదాత్మ్యం చెందాలనే అవగాహన ఎప్పుడు ఉపయోగకరమవుతుందంటే, ఆ జ్ఞానం మీ దివ్యకార్యమైన ఈ లోకం యొక్క సమగ్ర రూపాంతరీకరణను వేగవంతం చేయటానికి వాడబడినప్పుడు మాత్రమే.

జూన్ 15, 1913

అనంతత్వంలో విహరిస్తూ జీవించుట

మీ వైపుగా తిరిగి, మీతో తాదాత్మ్యం చెంది, మీలోను, మీ కోసం జీవించగలగటం అనేది ఒక దివ్యానందం, ఒక అకలుషిత సంతోషం, ఒక మార్పు చెందని ప్రశాంత స్థితి, అనంతత్వ గాలులు పీల్చడం లాంటిది. తన పరిధులను లెక్కచేయకుండా ఆ అపారతలో ఎగిసిపోవటం లాంటింది, దేశకాల పరిమితుల నుండి పారిపోవటం

లాంటిది. ఇలాంటి వరప్రసాదాలకు మనుషులు ఎందుకు భయభ్రాంతులు చెంది పారిపోతారు? సర్వబాధలకు మూలమైన అజ్ఞానమెంత వింతైనది! తమకు సుఖ సంతోషాలను అందించే అసలు విషయాలను దూరం చేసుకొని, సంఘర్షణ, దుఃఖాలతో కూడిన బాధాకరమైన సామాన్య లౌకిక జీవన విధానానికి లోను చేసే సందిగ్ధావస్థ ఎంత దౌర్భాగ్యం!

జూన్ 18, 1913

ఉత్తమమైన వైఖరి, నిర్వహించాల్సిన ఏకైక విధి

రాబోయే మాసంలో ఉత్తమమైన సేవలు మీకే విధంగా అందించాలనే విషయంపై ఈ ఉదయం దృష్టి సారించాను. అప్పుడు నా అంతరంగంలో ఓ సన్నని గళం నెమ్మదిగా వినిపించింది. అది నాకిలా చెప్పింది "బాహ్య పరిస్థితులన్నీ ఎంత అల్ప ప్రాముఖ్యమైనవో చూడు. పరమ సత్యంపై నీ స్వంత భావన రూపొందించుకొన డానికి ఇంతకా ప్రయత్నించాలా, ఇంతగా శ్రమించాలా? విషయాలను సహనంతో గ్రహించు, వాటిలో విశ్వాసం పెంచు, ఏ విషయంలోను నిన్ను నీవు కలవరపర చుకోకుండా నిగ్రహం పాటించడం నీ విధి. చెడు సంకల్పం ఎత చేటు చేస్తుందో, పని సక్రమంగా నిర్వర్తించాలని నిన్ను నీవు పీడించుకోవటం కూడా అంత చేటు చేస్తుంది. నట్ట నడి సముద్రం ఎంత ప్రశాంతంగా వుంటుందో అంత ప్రశాంతస్థితిలోనే సత్యమైన దైవసేవకు అవకాశముంటుంది.

ఆగష్టు 2, 1913

ప్రతి ఒక్క ఆరాటం నుండి, ప్రతి ఒక్క స్వార్థపూరిత ఆలోచన నుండి దూరమవడం ఎలా

ఓ ప్రభూ, ఓ జీవేశ్వరా, మా భౌతిక పరిరక్షణకై పడే ప్రయాసను అధిగమించి ఉన్నతమైన స్థితిని అందుకొనేటట్లు చేయి. ఈ దేహాన్ని కాపాడుకొనేందుకు. ఆరోగ్యం గురించి, బ్రతుకు తెరువును గురించి, జీవన విధానం గురించి నిరంతరం సాగే ఆలోచనలు మమ్ములను దిగజార్చిన క్రుంగుబాటుకు, ఆత్మగౌరవ భంగపాటుకన్నా నీచస్థితి కన్నా హేయమైనది మరొకటి లేదు. ఇదంతా ఎంత నిరర్థకం! ఒక్క నిట్టూ

ర్పుతో కొట్టుకపోయే పల్చని పొర లాంటిది, నీ గురించిన ఏకైక ఆలోచన చెదరగొట్టగల ఎండమావి లాంటింది.

ఓ ప్రభూ, కోర్కెలకు బానిసలైనవారి లాగే ఇలాంటి వ్యర్థపు ఆలోచనలతో బందీలయ్యేవారిని కూడా కాపాడు. నిన్ను చేరుకునే మార్గంలో ఇలాంటి ఆటంకాలు భయంకరమైనవే కాక కుర్రతనపు చేష్టల లాంటివి.

తన గురించి తాను పడే ఆతృత నుండి తన జీవితం, తన ఆరోగ్యం, తన సంతృప్తి, తన పురోగతిని గురించిన తాపత్రయం నుండి విడవడినప్పుడు కలిగే ఆనందాన్ని, తేలిక పొందిన అనుభూతిని ఏమని వర్ణించగలను?

ఈ విముక్తి, ఈ స్వేచ్ఛ ఓ దేవా, మీరు నాకు ప్రసాదించినవే. ఓ దేవా, దివ్య పురుషా, మీరు నా జీవితానికి జీవానివి. నా చైతన్యానికి చైతన్యానివి, ఎడతెగకుండా నాకు ప్రేమను ఉద్భోదించేవాడివి. నా జీవిత పరమార్థాన్ని నాకు తెలియచేసేవాడివి నీవే.

నాలో జీవించేవారు మీరే, కేవలం మీరే. కనుక నా గురించి కాని, నా కేమి జరుగనున్నదో అన్నదానిని గురించిగాని నేనెందుకో పట్టించుకోవాలి? మీరు వినా నా ఈ మట్టితో గూడిన శరీరమేదైతే మీ అభివ్యక్తికై ప్రయత్నిస్తున్నదో, అది ఎప్పుడో రూపం చెడి నిర్జీవమయ్యేది. మీరు లేకుండా ఇతర అభివ్యక్తి కేంద్రాలతో సంబంధం నెలకొల్పే ఇంద్రియ సంవేదన ఒక అంధకార బంధురమైన జడత్వంలో లయమైపోయేది. మీరు లేకుండా ఈ అస్తిత్వానికంతా జీవం పోసి ప్రకాశింప చేసే ఆలోచన అనిశ్చితమై, శూన్యమై, సాఫల్యమొందేది కాదు. మీరు లేకుండా అన్నింటికీ ప్రాణం పోసి, సమన్వయపరచి, ఉత్సాహపరచే ఈ దివ్యప్రేమ నిద్రాణమైన సంభావ్యత అయ్యేది. మీరు లేకుండా సర్వము జడప్రాయము, పశుప్రాయము లేక అచేతనామయమయ్యేది. మమ్ములను చైతన్యవంతులను చేసి, ఆనంద డోలికల నూగించేవారు మీరే. మా ఉనికికి మా లక్ష్యానికి కారణభూతులు మీరే. మా వ్యక్తిగత ఆలోచనలను పరిష్కరించి, మా భౌతిక జీవిత అనిశ్చిత స్థితి నుండి విడివడి మీ దివ్య వాతారవరణం లోనికి రెక్కలు జాచి ఎగరి చేరి మరల మీ వార్తాహరులుగా మీ దివ్య ఆగమన వార్తను లోకంలో ప్రకటించడానికి, ఇది చాలదా?

ఓ దివ్య ప్రభూ, దివ్య స్నేహితుడా, అత్యద్భుత ఆచార్యవర్యా, ఒక ఫలప్రదమైన నిశ్శబ్దతలో మీకు నమస్కరిస్తున్నాను.

ఆగష్టు 17, 1913

శ్రీమాత

అనువాదం: రామినేని సుందరరామయ్య, అందుగులపాటి కైలాసపతి

నవంబరు 22, 1913

మీ సమక్షంలో నిశ్శబ్దంగ గడిపిన కొద్ది క్షణాలు శతాబ్ధాల దివ్యానందమంత విలువైనవి

ఓ ప్రభూ!

నీలి నీడలన్నీ చెదరిపోవు గాక. నేను మీ ముందు నిలకడగా, స్థిమితంగా, అధికాధికంగా విశ్వాసపాత్రుడైన సేవకుడిగా నుండునట్లు అనుగ్రహించు. మీ ముందు నా హృదయం మిమ్ములను పూర్తిగా ప్రతిబింబించగలిగినంత స్వచ్ఛంగా, ఒక స్వచ్ఛమైన స్ఫటికంలా వుండనీ. ఓహ్!

మీ సమక్షంలో నిశ్శబ్దంగా నిరంతరం ఉండుటలో గల మాధుర్యం....

భ్రమ కలిగించే తేలిక దారులు

తేలికైనవి, ఏ ప్రయత్నాన్ని కోరనివీ అయిన దారులనూ, గమ్యాన్ని చేరుకున్నామనే భ్రమను కలిగించే దారులను మనము త్యజించెదము గాక; మన ప్రతి పతనానికి దారులను తెరిచే అశ్రద్ధను, ప్రతి అధః పాతాళానికి దారితీసే సంతుష్టితో కూడిన స్వోత్కర్షను మనము త్యజించెదము గాక. మన ప్రయత్నాలు ఎంతటి గొప్పవైనా, మన సంఘర్షణలు, మన గెలుపులు సైతం ఎంతటివైనా, మనం ప్రయాణించవలసిన దూరంతో పోల్చుకుంటే మనం ఇంత మట్టుకు పయనించి వచ్చినది శూన్యం — అందరూ సమానమే — అత్యల్ప అణుధూళి లేక ఏకతీరుగానున్న నక్షత్రాలు — అన్నీ ఆ శాశ్వతుడి ముందు.

కాని దేవా, నీవు అన్ని అడ్డంకులనూ గెలుచువాడవు, అజ్ఞానమంతటిని తొలగదోసి

జ్ఞానదీప్తిని వెలిగించే మహాప్రకాశానివి, ఆభిజాత్య మంతటిని జయించే దివ్యప్రేమవు. ఏ తప్పూ నీ ముందు తన ఉనికిని కొనసాగించలేదు.

జనవరి 8, 1914

విశ్వాస బలం

ప్రతి క్షణం ముందుగా తెలియబడనిదంతా, ఊహించలేనిదంతా, తెలియనిదంతా సమస్తం మన ముందున్నది, ప్రతి క్షణం విశ్వం దాని పూర్ణతలో దాని భాగాలన్నింటి లోని ప్రతి ఒక్కదానిలోనూ మళ్ళీ తిరిగి సృష్టించబడుతున్నది. నిజంగా మాకు గనక తమ మీద సజీవమైన విశ్వాసం గనక ఉంటే, తమ సర్వశక్తిమంతత్వం మీద, ఏకైకం అయినటువంటి వాస్తవికత మీద సంపూర్ణ విశ్వాసం గనక ఉంటే, తమ అభివ్యక్తత మాకు ప్రతి క్షణం విదితమవుతూ, దాని వలన మొత్తం విశ్వం అంతా పరివర్తన చెందుతుందని స్పష్టమౌతుంది. కాని మేము మా చుట్టూ ఉన్నదానికీ, గతించినదానికీ ప్రతిదానికీ ఎంతగా బానిసలమైపోయామంటే, స్వయం సంపూర్ణమైన మొత్తం అభివ్యక్త విషయాలకు మేము ఎంతగా ప్రభావితులమైనామంటే, మా విశ్వాసం ఎంతగా బలహీనంగా ఉందంటే, మేము ఇంకా ఆ గొప్ప అద్భుత రూప పరివర్తనకు మధ్యవర్తులుగా ఉపయోగ పడలేకపోతున్నాము.... కాని, ప్రభూ, ఆ రోజు తప్పక వస్తుందని నాకు తెలుసు, మా చెంతకు వచ్చేవారి నందరినీ ఆనాడు నీవు తప్పక పరివర్తన చేస్తావని నాకు తెలుసు; నీవు వాని నందరినీ ఎంత విప్లవాత్మకంగా మార్పు చేస్తావంటే, వారు గత బంధనాల నుంచి సంపూర్తిగా విముక్తులై, ఏకైకంగా నీతోనే తయారైన జీవితంగా, నీవే దాని సర్వోత్కృష్ట ప్రభువుగా, వారందరూ నీలో సంపూర్తిగా కొత్త జీవితాన్ని జీవించడం మొదలుపెడతారు. ఈ విధంగా ఆందోళనలన్నీ నిర్మలంగా, తీవ్ర పరితాపాలన్నీ శాంతిగా, సందేహాలన్నీ కచ్చితాలుగా, వికారాలన్నీ సామరస్యతగా, స్వార్థపూరిత అహంకారాలన్నీ ఆత్మ-సమర్పణగా, అంధకారమంతా ప్రకాశభరితంగా, బాధలన్నీ చెక్కుచెదరని ఆనందంగా మార్పుచెందుతాయి....

జనవరి 11, 1914

అధిక దుష్టత్వానికీ, అధిక శత్రుత్వానికీ వ్యతిరేకంగా అనుల్లంఘనీయ అవరోధం

ఓ ప్రేమైక దివ్యప్రభూ, ప్రతి అస్తిత్వంలోని నీ ఉనికి ప్రతి మానవునికి, అతడు అత్యంత క్రూరుడైనప్పటికీ కారుణ్యము నందూ, నైతికంగా అత్యంత నికృష్టుడైనప్పటికీ ఔదార్యమునకూ, చాలా మట్టుకు ఆత్మగౌరవమును కోల్పోయిన వాడైనప్పటికీ మర్యాదకూ, న్యాయానికీ ఉన్మీలనమును సుసాధ్యం చేస్తుంది. అన్ని లోకసంప్రదాయాలకూ, పక్షపాతాలకూ ఆవల నీవే, నీ దివ్యత్వమూ, పరిశుద్ధమూ అయిన ఒక ప్రత్యేక కాంతితో మేము ఏ విధంగా ఉన్నామో దానినీ, మేము చేసేదానినీ ప్రకాశింపజేసి, ఫలితంగా మేము ఏ విధంగా ఉన్నామో, ఏమి కాగలమో అనే దానిలోని తేడాను సుస్పష్టంగా చూడగలిగేటట్లు చేస్తావు. మితిమీరిన దుష్టత్వానికీ, అంధకారానికీ, శత్రుత్వానికీ వ్యతిరేకంగా నీవు అనుల్లంఘనీయమైన అవరోధాన్ని అమర్చావు; ప్రతి హృదంయోనూ సాధ్యమయ్యేవాటికీ, భవిష్యత్ పరిపూర్ణతలకూ నీవే సజీవమైన భరోసా.

తీవ్రోత్సాహమంతటితో నీకే నా ఆరాధన....

జనవరి 29, 1914

ఎంపికల ప్రాముఖ్యం

ప్రభూ, మేము ఏ విధంగా అభివ్యక్తం చేయగలమో, ఏ విధంగా అత్యుత్తమంగా నీకు ఉపయోగపడగలమో అని అడగటానికి ప్రతి రోజు ఉదయం మా బుద్ధిప్రవృత్తులు నీ వైపు తీవ్రంగా ప్రచోదనం కానీ. ప్రతి క్షణం మేము చేయగలిగిన వివిధ ఎంపికలలో, అవి ఎంత నిరర్థకంగా కనిపిస్తున్నప్పటికీ, అవి ఎల్లప్పుడూ ఎంతో ప్రాముఖ్యం కలిగినవే — మేము నిర్ణయం తీసుకున్నదాని మూలంగా మేము విధి నిర్ధారితమైన నియతిలా ఒక తరగతికో లేక ఇంకొకదానికో చెందినవారమౌతాము. — వాటియందు ప్రతి క్షణం మా వైఖరి ఏ విధంగా ఉండాలంటే, మీ దివ్యేచ్ఛయే మా ఎంపికలను నిర్ధారించాలనీ, ఆ విధంగా మా జీవితమంతటినీ మీరే నిర్దేశించాలనీ, మేము నిర్ణయం తీలుకునేటప్పుడు, మేము మా చైతన్యంలో ఉన్న పరిస్థితిని

బట్టి, మాకు ఎరుకలో నున్నటువంటి క్రమబద్ధమైన వాస్తవికతల విధినిర్ధారిత నియతకు బద్ధులమౌతాము; అక్కడి నుంచి ఒనగూడే పర్యవసానాలు, తరచుగా తెలియబడినివీ, బాధాకరమైనవీ అవుతాయి. అవి సాధారణ పద్ధతిలో సాగిపోయే ఒకరి జీవితానికీ వ్యతిరేకమై, ప్రతిబంధకాలను కలిగిస్తాయి, తదుపరి వాటిని అధిగమించటం చాలా కష్టసాధ్యమౌతుంది. కనుక, ఓ ప్రభూ, ఓ ప్రేమైక దివ్యమూర్తీ, మేము నీ ఎరుకను, కేవలం నీ ఎరుకనే కలిగి ఉండాలని కోరుకుంటున్నాం, మేము నిర్ణయం తీసుకున్న ప్రతిసారి, ఎంపిక చేసుకున్నప్పుడల్లా మేము నీ పరమోత్కృష్ట ధర్మంతో తాదాత్మ్యం చెంది ఉండి ఉండాలని, దాని వలన నీ మహదేచ్ఛ మమ్మల్ని కదిలించాలని, ఆ విధంగా మా జీవితం సమర్ధవంతంగా, సమగ్రంగా నీకు అర్పించబడాలని నివేదించు కుంటున్నాను.

నీ మహాప్రకాశంలో మేము చూడగలగాలి, నీ మహాజ్ఞానంలో మేము సరైన జ్ఞానమును కలిగి ఉండగలగాలి, నీ మహదేచ్ఛలో మేము సాక్షాత్కారతను పొంద గలగాలి.

జనవరి 31, 1914

జీవనసూత్రాలు ఒక తాత్కాలిక ఏర్పాటు మాత్రమే.

ఎవరైతే సమగ్రంగా మీతో ఐక్యమైపోయారో, ఎవరైతే పరిస్థితుల ననుసరించి నిరంతరం మీ ఎరుకతో తన చేతలలో అత్యంత పరిపూర్ణంగా మిమ్మ అభివ్యక్తం చేస్తారో, వారికి బాహ్యనియమావళులు ఏమాత్రమూ అవసరం లేదు. జీవన ప్రధాన సూత్రాలు మొత్తం మీద కేవలం ఒక తాత్కాలిక ఏర్పాటు మాత్రమే, అవి మిమ్మ ఇంకా తెలుసుకోనివారికి, వారి అజ్ఞానమును తగ్గించడానికీ, మీతో కేవలం అప్పు డప్పుడు మాత్రమే సుసర్గంలోకి వస్తూ ఉండే ఇంకా వారి అంధత్వగమనాలకు, అస్పష్ట గమనాలకు ఏదో విధంగా విరుగుడు చేయడానికీ ఉపయోగపడతాయి.

తనకు మాత్రమై నియామవళిని ఏర్పాటు చేసుకుని, వాటీని ఎంతగా వీలయితే అంతగా తేలికపరచి సాధారణ నియమావళిగా ఏర్పరచుకోవడం మంచిదే, కాని అతడు వాటిని కేవలం కృత్రిమమైన దీపాలుగా అనుకుని, వాటిని మీ సంపూర్ణ సహజకాంతిలో, మీతో సంసర్గం విఫలమైనప్పుడు తప్ప ఉపయోగించకూడదు. అంతేకాక, నిరంతరం వాటిని సంస్కరించి మార్పు చేసుకోవటం తప్పనిసరి,

ఎందువల్లనంటే, అవి కేవలం ప్రస్తుతమున్న జ్ఞానానికి అభివ్యక్తం మాత్రమే కాగలవు, అవి అవశ్యం మొత్తం అభివృద్ధితోనూ, జ్ఞానాభివృద్ధితోనూ తప్పనిసరిగా లాభాన్ని పొందుతాయి.

అందువలననే మా వద్దకు వచ్చే వారందరి మీద ఒకరికి ఉండవలసిన వైఖరి కోసం చింతన చేస్తున్నపుడు, వారికి ఏ హాని చేయకుండా ఉండటానికి మాత్రమే కేవలం నిగ్రహం కలిగి వుండటం కాకుండా; అన్నింటినీ మించి, వారికి అత్యధికంగా సాధ్యమైనంత మంచిని చేయాలని గట్టిగా ప్రయత్నించడమూ జరగాలని తలచబడింది. అనగా, పరమోత్తమమైన విషయాన్ని కనిపెట్టడానికి, అంటే వారి అంతరంగంలో నిన్ను కనిపెట్టడానికి, సాధ్యమైనంతగా వారికి ఉత్తమోత్తమమైన సహాయాన్ని అందించాలి — మీ ధర్మానికి ఆపాదించుకుంటూ ఒక ప్రయోజనాన్ని ఆశించి అమలుపరచే ఏ సూత్రమూ అపరిమేయమైనదీ, సులువుగా సఫలత నిచ్చేదీ కాదనే విషయం నాకు స్పష్టంగా అవగతమౌతున్నది, దానికి కేవలం పరిష్కారం మీతో ఎల్లప్పుడూ సంవాదంలో ఉండటమే. ఆ విధంగా దానిని సమగ్రంగా అనంతమైన వైవిధ్యమైన పరిస్థితుల నన్నింటినీ ఆపాదించుకుని అమలుపరచుకోవచ్చు.

ఫిబ్రవరి 7, 1914

దివ్యధర్మం అంటే వైఖరుల ధర్మం

ఒక వ్యక్తి మీ చైతన్యంలో ఎరుకలో ఉన్నప్పుడు పుడమి పరిస్థితుల నన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటాడు. అతడు వాటి సంపూర్ణ సారూప్యతను చూసి ఇలా చెప్తాడు, "ఒక పని ఇలా చేయాలి, అలా చేయాలి అనేది అంత ముఖ్యమైనది కాదు, కాని ఒక ప్రత్యేకమైన రీతిలో చేయబడిన పని ఒకానొక నైపుణ్యాన్ని ఉత్తమోత్తమంగా ఉపయోగించడమే కాగలదు. చేసే పనులన్నీ అవి ఏవైనప్పటికీ, చూడటానికి ఒకదాని కొకటి పూర్తి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, మీ ధర్మానికి వ్యక్తీకరణే కాగలవు, అది ఎంతవరకంటే, ఆ ధర్మం యొక్క చైతన్యంతో అది మనస్సును పట్టి ఉండేవరకు. కాని ఆ ధర్మం సర్వసాధారణ మానవచైతన్యంలో సిద్ధాంతాలుగా లేక సూత్రాలుగా ఆచరణాత్మకమై అమలుపరచేది కాదు, అది నిరంతరంగా, సహజసిద్ధంగా ఉండే వైఖరీ ధర్మం, అది ఏదో ఒక విధంగా నిర్దిష్ట పద్ధతిలో చెప్పే పదాల కూర్పుగా వ్యక్తీకరించగలిగేది కాదు, కాని జీవించగలిగినది."

కాని అతడు తిరిగి సాధారణ చైతన్యంలోకి వెనుకకు పడిపోయిన వెనువెంటనే, దేనినీ తేలికగా, ఉదాసీనతతో తీసుకొనకూడదు, ఎటువంటి అధమాధమ పరిస్థితులలోనైనా, అత్యల్పమైన పనులకు కూడా చాలా గొప్ప ప్రాముఖ్యం ఉంటుంది, ఎందువల్లనంటే, ప్రతి క్షణం మనం చేసే పని, మన చైతన్యం శాశ్వత చైతన్యంతో తాదాత్మ్యతత కోసం తప్పక ప్రయత్నించవలసి ఉంటుంది; ఈ తాదాత్మ్యతతకు అవరోధం కలిగస్తుందని అనిపించేదాని నంతటిని జాగ్రత్తగా తొలగించవలసి ఉంటుంది. మన నడవడి నియమావళికి పరిపూర్ణ వ్యక్తిగత నిరాసక్తత ఆధారమై దానికి తగ్గ పూర్తి విలువ లభ్యమౌతుంది.

నా హృదయంలో ప్రశాంతతతో, నా మనస్సులో ప్రశాంతతతో, దృఢవిశ్వాసంతో అస్తిత్వంలో జనించిన ఆశావహ దృక్పథంతో, నేను మీకు నమస్కరిస్తున్నాను, ఓ ప్రభూ, శాశ్వత ప్రేమాస్పద దివ్యప్రభూ....

ఫిబ్రవరి 12, 1914

నిజమైన సమర్పణ — పనిని గురించిన భ్రమలు

ప్రతి రోజునూ, ప్రతి క్షణమునూ నూతనంగా, ఇంకా పూర్తిగా సమర్పించుకొనే అవకాశం అయి ఉండాలి, అదే మా అత్యుత్సాహంతో కూడిన, సంరంభంతో కూడిన సమర్పణలతో ఒకటి కాకూడదు. అతిగా చేసేది, పని మీద పూర్తి భ్రమలు కలిగి చేసేది కాకూడదు, కాని గాఢమైన, నిశ్శబ్దమైన సమర్పణ. అది అత్యావశ్యకంగా దృశ్యమానమైనది కాకపోవచ్చు కాని, అది చొచ్చుకుపోతూ, మొత్తం పని రూపును మార్చివేయగలిగింది. మా మనస్సు ఏకాంతంగా, ప్రశాంతంగా ఎల్లప్పుడు నీ యందు విశ్రాంతి తీసుకోనీ, అటువంటి పవిత్రమైన పరాకాష్ఠ నుంచే అస్థిరమై, జారిపోయే దృశ్యాలన్నింటి వెనుక ఏకైక, శాశ్వత మహాసత్యం యొక్క వాస్తవికతల కచ్చితమైన గ్రహణశక్తి అనుభవానికి రావలసి ఉంది.

ఓ ప్రభూ, అన్ని అస్తిమితాల నుంచి, ఆందోళన నుంచి నా మనస్సు పరిశుద్ధమైంది; అది నిలకడతో, ప్రశాంతత నొంది, అన్నింటి యందు నిన్ను చూస్తున్నది, బాహ్యంలో మా కార్యకలాపాలు ఎటువంటివైనా గాని, మా భవిష్యత్తుతో ఎటువంటి పరిస్థితులు రాసిపెట్టి ఉన్నా కాని, మీరే సజీవంగా ఉంటారని, మీ మార్పులేని

శాశ్వతత్వంలో, మీరే వాస్తవమని, మీలోనే మేము జీవిస్తామని.... పుడమి మొత్తం మీద ప్రశాంతత పరిఢవిల్లును గాక....

ఫిబ్రవరి 21, 1914

విశ్వం కంటే విశాలమైన నా వక్షంలో జీవులందరు హాయిగా ఒదిగిపోతారు

నేను పదమూడేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు, రమారమి ఒక సంవత్సరం పాటు నిద్రకు ఉపక్రమించిన వెనువెంటనే నేను నా శరీరం బయటకు వెళ్ళేదానను, అక్కడి నుంచి సరాసరి ఇంటి మీదకు, తరువాత నగరం మీదకు, చాలా ఎత్తుకు పైకి వెళ్ళిపోయేదానను. అప్పుడు నన్ను నేను నా కంటే చాలా పెద్దదైన బంగారు వస్త్రం కప్పుకున్నదానినిగా చూసేదానను. నేను ఇంకా ఎత్తుకి పైకి పోయిన కొలదీ ఆ వస్త్రం నన్ను కప్పివేసేది, గుండ్రంగా నా చుట్టూ నగరం మీద ఒక విధమైన అపారమైన కప్పులాగా పరచుకుంటూ ఉండేది. అప్పుడు నేను పురుషులను, స్త్రీలను, వృద్ధులను, వ్యాధిపీడితులను, దురదృష్టవంతులను అన్ని వైపుల నుంచి రావడం చూసేదానను. వారందరూ విశాలంగా పరచుకున్న ఆ వస్త్రం కింద గుమిగూడి సహాయం కోసం అర్థిస్తూ, వారి దీనావస్థలను, కష్టాలను, వారి ఈతిబాధలను మొరపెట్టుకుంటూ ఉండేవారు. దానికి సమాధానంగా, తేలికైన, సజీవమైన ఆ వస్త్రం వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరి వద్దకు విస్తరిస్తూ ఉండేది. వారు దానిని తాకిన వెంటనే, వారు ఉపశమనం పొందటానికి లేక వ్యాధి నివారణ చెందడం కాని జరిగేది, వారు వారి శరీరాల నుంచి బయటకు వచ్చిన దానికంటే అధికమైన ఆనందంతో, అధికమైన ఆరోగ్యంతో తిరిగి వెళ్ళిపోయేవారు. నాకు నిజజీవనమైనటువంటి రాత్రి పూట జరిగే ఈ పని కంటే ఎక్కువ సంతృప్తికరంగా ఏదీ ఉండేది కాదు. దీని కంటే ఏదీ ఎక్కువ ఆనందింపజేసేది కాదు, రోజులో చేసే పనులన్నీ నిస్సారంగా, వెలవెలబోతూ వాస్తవంగా నిర్జీవంగా అనిపించేవి. నేను ఈ విధంగా పైకి వెడుతున్నప్పుడు తరచు నా ఎడమ వైపు, ఒక వృద్ధుడు నిశ్శబ్దంగా, నిశ్చలంగా నా వంక సాదరంగా ప్రేమతో, తన ఉనికితో నన్ను ప్రోత్సహించేవాడు. ఈ వృద్ధుడు, ఒక పెద్ద ముదురు రక్తవర్ణ వస్త్రమును ధరించి ఉండేవాడు, అది అతని వ్యక్తిత్వానికి సంకేతం — అని నాకు తరువాత తెలిసింది — అతడు మహా దుఃఖకారకుడు.

ఆ గాఢానుభవం, చాలా మట్టుకు వ్యక్తీకరించలేని వాస్తవికానుభవం. ఇతర భావాలతో నా మనస్సులో అది ఏ విధంగా విపులీకరించబడిందో, దానిని బహుశా ఈ విధంగా వర్ణించవచ్చు:

చాలా పర్యాయాలు పగలూ, రాత్రీ నా కనిపించేది, నేను లేదా నా చైతన్యం ఏమాత్రం అవయవం కాని నా హృదయంలో పూర్తిగా కేంద్రీకరించబడేది,అది అనుభూతి కూడా కాదు, అది దివ్య మహాప్రేమ, వ్యక్తిత్వరహితమై, శాశ్వతమైనది; ఈ మహాప్రేమగా, నాకు నేనుగా భూమి అంతటిలో ప్రతిదాని కేంద్రంలో నివసిస్తున్న అనుభూతి పొందేదానిని, అదే సమయంలో నేను అపారంగా పరచుకుని, అనంతమైన చేతులతో, జీవు లన్నింటినీ హద్దులు లేని దయార్ద్ర హృదయంతో చుట్టుముట్టి, దగ్గరగా పట్టుకుని, సమీకరించి, విశ్వం కంటే ఇంకా విశాలమైన నా వక్షం మీద ఒకరి పక్కన ఒకరు ఒదిగిపోగా నా కౌగిలి లాలనలో వారికి హాయిగా సేద తీర్చే దానిని....

ఫిబ్రవరి 22, 1914

మీకు సేవ చేయాలకునేవారు

మీకు యోగ్యమైన రీతిలో సేవ చేయాలనుకునేవారు తన్ను తాను దేనికీ బంధించుకుని ఉండకూడదు, మీతో ఇంకా ఎక్కువ ఎరుకతో సంసర్గమును కలుగు జేయగల పనులకు సైతం....

కాని మొత్తం పరిస్థితు లన్నింటి ఫలితంగా, భౌతిక విషయాలు సాధారణం కంటే ఇంకా ఎక్కువగా జీవితంలో స్థలం ఆక్రమించుకుంటూ ఉంటే, ఒకరు దానిలో మునిగిపోకుండా ఉండటం ఎలాగో, మీ ఉనికి యొక్క స్పష్టమైన దర్శనం హృద యాంతరాళం లోపల కలిగి ఉండటం ఎలాగో, ఏదీ అస్థిరపరచ లేనటువంటి ఆ నిర్మలమైన ప్రశాంతతలో నిరంతరం జీవించడం ఎలాగో తప్పకుండా తెలుసుకుని తీరాలి....

దేవా, ప్రతి చోటా కేవలం మిమ్ము మాత్రమే చూస్తూ ప్రతిదీ చేయడం, ఆ విధంగా ఉంటూ ఏ కార్యమును తలపెట్టినా ఆ కార్యమును అధిగమించి పైకి

పోవడం, విహంగంలా శీఘ్రంగా పైకెగరిపోయే మమ్మిలను భూభారానికి బందీలుగా ఏ సంకెలా బాధించకుండా ఉండాలని....

ఫిబ్రవరి 25-26, 1914

సమర్పణం పరిస్థితుల మీద ఆధారపడేది కాదు

ఓ ప్రభూ, జీవితాన్ని మీకు సంపూర్ణంగా అంకితం చేసుకున్నవారికి పంచిపెట్టబడిన అపార సంతోషానుభవాన్ని నేను తెలుసుకుంటున్నాను. అయితే, ఇది బాహ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉండేది కాదు, కాని ఒక వ్యక్తి ఉన్నటువంటి స్థితి మీద, దాని అధికతరమూ లేక అల్ప పరిమాణమూ అయిన జ్ఞానప్రకాశం మీద ఆధారపడి ఉంటుంది. మీ ధర్మానికి పరిపూర్ణంగా చేయబడిన సమర్పణ మొత్తం పరిస్థితుల తీవ్రతను సడలించి కొంత మార్పును తీసుకురాగలిగినదే కావచ్చును, అయినప్పటికీ ఇవి మాత్రమే ఈ పరిపూర్ణ సమర్పణ సుసాధ్యమునకూ, అభివ్యక్తమునకూ కారణాలు కానేరవు. నా ఉద్దేశంలో మీ ధర్మం అభివ్యక్తమయ్యేది కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కాదు, ఎల్లప్పుడూ అది అందరికీ సమానమే, ప్రతివానికీ ఆ అభివ్యక్తత వారి తత్త్వాన్ని బట్టి వేరుగా ఉంటుంది, అనగా, భౌతిక జీవితంలో ఆ క్షణంలో అతని కివ్వబడిన విధాయక కర్మ ననుసరించి.

కాని మార్పు లేనిది, సార్వజనీనమైనది మాత్రం, ఏ మాత్రమూ అంధకారం, అజ్ఞానం, స్వార్థపూరిత ప్రేమ లేదా దుష్టబుద్ధి అనేది వారిలో లేక కేవలం మీకు మాత్రమే సమర్పించుకున్న వారందరి సంతోషప్రదమైన ప్రశాంతత, తేజోవంతమైన, ఏ మార్పు లేనటువంటి స్వచ్ఛత.

ఓ ప్రభూ, ఈ దివ్య ప్రశాంతతకై అందరూ జాగరూకలగుదురు గాక.

ఫిబ్రవరి 27,1914

అవరోధాలన్నీ స్వయం తన ఆత్మలోనే ఉంటాయి.

అవరోధాలన్నీ స్వయం తన ఆత్మలోనే ఉంటాయి. ఇబ్బందులన్నింటినీ స్వయం తన ఆత్మలోనే చూడవచ్చు, స్వయం తన ఆత్మలోనే అంధకారమూ, అజ్ఞానమూ సమస్తం ఉంటాయి. మనం భూమండలమంతా ప్రయాణం చేయాలా, ఎక్కడ ఏకాంత సీమలకు వెళ్లి మనకి మనం కనపడకుండా పోవాలో, మన అలవాట్లన్నింటితో

తెగతెంపులు చేసుకోవాలా, అత్యంత కఠోరమైన జీవనం సాగించాలా, అయినప్పటికీ ఒక వేళ భ్రాంతిపూర్వకమైన ఏదో ఒక బంధనం మా చైతన్యాన్ని మీ చైతన్యం నుంచి వెనుకకు దూరంగా కొనిపోతే, ఒక వేళ ఏదైనా స్వార్థపూరిత బంధనం మమ్ములను మీ సమగ్ర సంసర్గంతో కూడిన దివ్య మహాప్రేమ నుంచి తెంపివేస్తే, బాహ్యపరిస్థితులన్నీ ఎలా ఉన్నప్పటికీ మేము ఏమాత్రమూ నీ దరిదాపులలో ఉండము. ఏవైనా పరిస్థితులు ఎక్కువ అనుకూలం లేక తక్కువ అనుకూలం అని అనుకోగలమా? నాకు సందేహమే; వాటి మీద మనకు ఉన్న మన అభిప్రాయం. అవి మన కొసగే పాఠాల ద్వారా అధికంగానూ లేక అల్పంగానూ లబ్ధిని పొందడానికి మార్గం సుగమం చేస్తుంది.

ఓ ప్రభూ, నేను మిమ్ము ఆవాహన చేస్తున్నాను! నేను పరిపూర్ణ ఎరుకతో, ఈ వ్యక్తిత్వమును సంఘటితపరచే వాటన్నింటి వశవర్తిని అయి ఉండేటట్లుగా అనుగ్రహించు, దాని వలన నా నుంచి నేను విముక్తిని పొంది, ఈ అనేక కణసముదాయముల ద్వారా నీవు మాత్రమే జీవించునట్లుగా, కార్యములను చేయునట్లుగా అనుగ్రహించు.

మహాప్రేమలో, మహాప్రేమతో, మహాప్రేమ కొరకు జీవించాలి, నీ అత్యున్నత అభివ్యక్తతతో సుస్థిరంగా ఐక్యమై ఉండటానికి....

మార్చి 1, 1914

కృతజ్ఞత, దృఢ విశ్వాసముల అవస్థ

బయలుదేరి వెళ్ళే కాలం దగ్గర పడుతున్న కొలదీ, నేను ఒక రకమైన ఆత్మ-సంవాదంలోకి ప్రవేశిస్తున్నాను; నేను ప్రేమభరితమైన పవిత్ర మనస్సుతో మా చుట్టూ ఉన్న వేలకొలది అల్పము అముఖ్యములైన వాటన్నింటికి, ఎన్నో సంవత్సరాలుగా నమ్మకస్తులైన స్నేహితుల పాత్రను పోషిస్తున్న వాటి వైపు మా దృష్టిని మరల్చుతున్నాను; మా బాహ్యజీవితానికి అవి చేకూర్చగలిగిన ఆహ్లాదమున కంతా నేను కృతజ్ఞతాపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను; ఓ ప్రభూ, విధివశాన మా చేతులలో గాక మరెవరి చేతులలోనైనా ఎంతకాలమైనా ఉండవలసిన అగత్యం వాటికి కలిగితే, ఆ చేతులు వాటికి కోమలత్వము కలిగించి, అంధ అచేతనా అవ్యక్త స్థితి నుండి బయటకు తీసుకువచ్చి నీ దివ్య మహాప్రేమకు తగిన రీతిలో అందించవలసిన మన్ననను తెలుసుకోవాలని నేను కోరుకుంటున్నాను.

నేను ఇప్పుడు భవిష్యత్తుకు మరలుతున్నాను, సాభిప్రాయమగు నా దృష్టి ఇంకా ఎక్కువ పవిత్రం అయింది. మా విధిరాత ఏమిటో నాకు తెలియదు, నేను పట్టించుకోను; బాహ్యాపరిస్థితులు ఏమాత్రం ముఖ్యమైనవి కావు; నేను ఆశించేది కేవలం ఇది మాకు నూతన అంతరంగ దశగా కావాలని, అందులో భౌతిక విషయాల నుంచి ఎక్కువగా విడివడి ఉండాలని, దాని అభివ్యక్తతకు ఇంకా ఎక్కువగా సూటిగా దానికి మాత్రమే నిశితంగా గురిపెట్టినటువంటి అంకితభావం కలిగి ఉండాలని; అది నీ కార్యోద్దేశానికి అధికతరమైన ప్రకాశంతో, అధికతరమైన ప్రేమతో, ఇంకా ఎక్కువ పరిపూర్ణంగా అంకితమైన దశగా కావాలని ఆశిస్తున్నాను.

నిశ్శబ్దమైన ఆరాధనలో నేను నిన్ను ధ్యానిస్తున్నాను....

మార్చి 3, 1914

బంధనమూ, ప్రేమానురాగాల మూలంగా జనించిన బాధకు ఒక చికిత్స

వారి బాధల వలన తీవ్రంగా బాధపడిన అనంతరం, నేను నీ వైపు మరలు తున్నాను, దానిని నయం చేయడానికి దానిలో అన్ని ప్రశాంతతలకూ, అన్ని ఆనందాలకూ మూలమైన ఆ దివ్య మహాప్రేమ రవంతను అందులోకి పుట్టించుతున్నాను. మేము బాధ నుంచి అవశ్యం దూరంగా పారిపోకూడదు, అంత మాత్రాన మేము దానిని తప్పక ప్రేమిస్తూ, పెంచి పోషించకూడదు, మేము దాని లోలోతుల లోకి కావలసినంత మట్టుకు పోవటం ఎలాగో తప్పకుండా నేర్చుకుని, దానిని మేము శాశ్వత చైతన్యానికి ద్వారాలను తెరవగలిగే శక్తిమంతమైన ఒక మీటగా తిప్పి, మీ మారపులేని పవిత్రత లోనికి ప్రవేశించాలి.

కచ్చితంగా ఇటువంటి ప్రబల విశ్వాసం, భౌతిక బంధనం ఏదైతే శరీరాలు వేరైనప్పుడు హృదయాలు పిండే వేదనకు కారణమో, అది, ఒక దృష్టిలో, మేము అశాశ్వతమైన బాహ్యారూపాల మీద, వాస్తవమైన మీ పరమావశ్యకమగు మహాఏకత్వము మీద మేము ధ్యానించినప్పుడు బాల్యచేష్ట అవుతున్నది; కాని మరియొక దృష్టిలో, మనుషుల లోని ఈ బంధనం, ఈ వ్యక్తిగత ప్రేమానురాగాల మూలంగా వారందరూ వారికి ఏ మాత్రం తెలియకుండానే ఆ మౌలికమైన ఏకత్వం వైపుకు ఎల్లప్పుడూ కదలిపోవడం, సాధ్యమైనంతవరకు, బాహ్యంలో సాక్షాత్కరించుకోవటానికి చేసే

ఒక ఎరుక లేని ప్రయత్నం కాదా? కచ్చితంగా, దాని మూలంగా, ఈ ఎడబాటు సమర్థవంతంగా ఈ బాహ్యచైతన్యాన్ని మించి అతీతంగా పోవటానికీ; ఈ పై పై బంధనాల స్థానంలో నీ శాశ్వత మహా ఏకత్వాన్ని పూర్ణసాక్షాత్కారంతో తిరిగి స్థాపించటానికి సాధనం కాదా? దీనిని నేను వారందరూ పొందాలని కోరుకుంటున్నాను, దీనిని నేను వారందరికీ సమధికోత్సాహంతో తీవ్రంగా ఇచ్చగిస్తున్నాను, అందువలననే, మీ విజయం తథ్యమనే గట్టి నమ్మకంతో, మీ గెలుపు తప్పనిసరి అని, వారి దుఃఖాన్ని మీకు అప్పగిస్తున్నాను, ఫలితంగా, దానిని ఆ కాంతితో ప్రకాశింపజేసి ఆ గాయాన్ని మాన్పవచ్చునని తలుస్తున్నాను.

ఓ ప్రభూ, ఈ సుందరమైన ప్రేమానురాగాలు, వాత్సల్యాలూ అన్నీ వైభవోపేతమైన జ్ఞానంగా పరివర్తన చెందగలిగేటట్లుగా అనుగ్రహించు.

ప్రతిదాని నుంచి అత్యంత శ్రేయస్కరమైనది ఆవిష్కరించబడాలని, నీ సంతోషప్రదమైన ప్రశాంతత పుడమిపై రాజ్యమేలాలని అనుగ్రహించు.

జెనివా, మార్చి 6, 1914

సర్వే సర్వత్రా నీ గృహమే

ఎవరైతే మీ కోసం, నీలో జీవిస్తారో వారు వారి భౌతిక పరిసరాలనూ, వారి అలవాట్లనూ, నడత తీరునూ, సాంఘిక వాతావరణమునూ, బహుశా మార్చుకుంటారు, కాని, ప్రతి చోటా వారు అవే పరిస్థితులను చూస్తారు; నిరంతరం వారు వారి మనస్సును మీ మీదే లగ్నం చేసి, వారిలో, వారి తలపులతో ఆ పరిస్థితులను తోడ్కొనిపోతారు, ప్రతి చోటా వారు సొంత ఇంటి వాతావరణానుభూతినే పొందుతారు, ఎందువల్లనంటే, ప్రతి చోటా వారు మీ ఇంటిలోనే వుంటారు గనక. ఇక ఏ మాత్రమూ అసాధరణతకూ, అనూహ్యమైనవాటికీ, ఆకర్షణీయమైన విషయాలకూ, దేశాలకూ వారు అబ్బుర పడరు; వారికి అన్నింటిలోను అభివ్యక్తమై వున్న మీ మహాసన్నిధి, మార్పులేని మీ వైభవం వారి నెప్పటికీ వదలిపోదనీ, అది అత్యల్ప ఇసుక రేణువులోనూ వాస్తవమనీ....

ఓ ప్రభూ, నా ప్రియ వల్లభా, నేను ఈ నావ మీద నిరంతరం పొందుతున్న అనుభవం, చాలా ఆశ్చర్యకరమైన ప్రశాంతతతో కూడిన ఆవాసంగా, మీ దివ్య మహాసాన్నిధ్య చైతన్యానికి మేలుకొనటానికి మేము జయించి వశపరచుకోవలసిన

ఉదాసీన అధోచేతనా అలల మీద తేలియాడుతూ, మీ ధర్మనియతి కోసం పయనిస్తున్న దేవాలయంగా అనిపిస్తున్నది.

ఓ అనిర్వచనీయ మహాశాశ్వతమా, నేను మిమ్మ తెలుసుకొనే రోజు ఎంతో పవిత్రమైనది.

భవిష్యత్తులో, చిట్టచివరక పుడమి మిమ్మ తెలుసుకొని, కేవలం మీ కోసమే జీవించే రోజు వస్తుంది, ఆ రోజు రోజులన్నింటి లోకి ఎంతో పవిత్రమైనది....

మార్చి, 9, 1914

నిశ్శబ్ద నిశీథిలో ప్రార్థన

ఈ నిశ్శబ్ద నిశీథిలో మీ మహాప్రశాంతి అన్ని విషయాల మీద రాజ్యమేలుతున్నది. నా నిశ్శబ్ద హృదయంలో మీ మహాప్రశాంతి ఎల్లప్పుడూ రాజ్యమేలుతున్నది; ఈ రెండు నిశ్శబ్దాలు ఐక్యమైనప్పుడు, మీ మహాప్రశాంతి ఎంత శక్తిమంతంగా ఉంటుం దంటే, ఏ రకమైన కలవరమూ దానిని నిరోధించలేదు. అప్పుడు నేను ఆలోచించినది, మా నావ మీద అనుక్షణం కాపలా కాస్తూ, రక్షకులుగా మా దారితెన్నులను కాపాడుతూ ఎవరైతే ఉన్నారో వారిని, నేను ఎంతో కృతజ్ఞతా భావంతో మీ మహాప్రశాంతత వారి హృదయాలలో ఉబికి పైకి వచ్చి, సజీవంగా ఉండాలని కోరుకున్నాను; ఆ తరువాత నేను ఆలోచించినది, ఎవరైతే నమ్మకంతో, చింతాముక్తులై, అచేతనా నిద్రలో శయనిస్తున్నారో వారిని, వారి దైన్యాలకూ, వారు ఆతురతతో నిద్ర నుంచి మేల్కొంచినప్పుడు వారిలో గుప్తంగా ఉండి పైకి లేచేటటువంటి వారి బాధలకూ జాలితో, నేను మీ మహాప్రశాంతతలోని రవంత వారి హృదయాలలో వసించాలనీ, జీవనంలోని ఆత్మశక్తి మరియు అజ్ఞానాన్ని దూరం చేసే జ్ఞానప్రకాశం వారిలో జాగృతమవ్వాలని కోరుకున్నాను. తరువాత నేను ఈ సువిశాల సముద్రంలో వసిస్తున్న గోచరమూ, అగోచరమూ అయిన వాటన్నింటినీ తలచి, మీ మహాప్రశాంతత వారి మీద పరచుకొని ఉండాలని నేను ఇచ్ఛగించాను. ఆ తరువాత ఎవరినైతే మేము మా వెనుక దూరంగా వదలి వచ్చామో, ఎవరి ప్రేమానురాగాలు మా వెంట మాతో వస్తున్నాయో వారిని తలచి, ఎంతో గాఢమైన వాత్సల్యంతో, మీ ఎరుక, కరగిపోని మహాప్రశాంతత వారికి ఉండాలని నేను కోరుకున్నాను; వారు అందుకోగలిగినంతగా సమృద్ధిగా మీ మహాప్రశాంతత ఉండాలని కోరుకున్నాను

తరువాత మేము ఎవరి చెంతకు చేరుకోబోతున్నామో, ఎవరైతే శిశువుల వలె అన్యథా చింతలతో మునిగిపోయి, అజ్ఞానంతో, స్వార్థపూరిత అహంకారంతో అల్ప ప్రయోజనాల నాశించి వైరంతో పోట్లాడుకుంటూ ఇబ్బందుల పాలవుతూ ఉన్నారో వారిని తలచి, ఎంతో తీవ్రతతో, అధికమైన ఆకాంక్షతో మీ మహాప్రశాంతతను, పూర్ణ ప్రకాశమును వారి కోసము అడిగాను. తరువాత మాకు తెలిసిన వారందరికీ, తెలియని వారందరికీ, రూపుదిద్దుకునే ఈ జీవిత మంతటికీ, ఈ రూపమును మార్పు చేసినదాని నంతటికీ, ఇంకా ఇప్పటికీ ఈ రూపంలో లేనిదాని నంతటికీ, వీటి కన్నింటికీ, ఇంకా నేను ఆలోచించ లేకపోయిన వాటి కన్నింటికీ, నా స్మృతిలో ఉన్నవాటి కన్నింటికీ, నేను మరచిపోయిన వాటి కన్నింటికీ, గాఢమైన ధ్యానంతో, మూగ ఆరాధనతో నేను మీ మహాప్రశాంతతను ఆవాహన చేస్తున్నాను.....

మార్చి 10, 914

బాహ్య పరిస్థితుల ప్రమేయం ఏముంటుంది

ఓ ప్రభూ, నా ఒకే ఆకాంక్ష మిమ్ము తెలుసుకోవటం, మిమ్ము ఇంకా బాగా ప్రతి రోజూ సేవించుకోవటం. బాహ్యపరిస్థితుల ప్రమేయం ఏముంటుంది? ప్రతి రోజు అవి ఇంకా ఎక్కువగా నిష్ఫలమైనవనీ, భ్రాంతిమయమైనవనీ నాకు అనిపిస్తున్నది, బాహ్యజీవితంలో మాకు ఏమి జరుగుతుందో అనేదాని గురించి నేను తక్కువగా, ఇంకా తక్కువగా ఆసక్తి కలిగి ఉంటున్నాను; కాని ఎక్కువగా, ఇంకా ఎక్కువగా నాకు చాలా ముఖ్యమని అనిపించిన ఒక విషయం మీద నేను తీవ్రమైన ఆసక్తితో ఉన్నాను: మీకు ఇంకా బాగా సేవ చేయడానికి, ఇంకా ఎక్కువగా మిమ్ము తెలుసు కోవాలని బాహ్యసంఘటనలన్నీ తప్పకుండా ఈ లక్ష్యానికే వచ్చి ఒక చోట చేరుకోవాలి; దానికి వాటి మీద ఉన్న మా వైఖరి మీదే సమస్తం ఆధారపడి ఉంటుంది. నిరంతరం అన్నింటి యందు మిమ్మే అన్వేషించడం, ప్రతి ప్రరిస్థితిలోను ఎప్పటికీ ఎక్కువగా మిమ్మే అభివ్యక్తం చేయాలని కోరుకోవటం, అటువంటి వైఖరిలోనే పరమోత్కృష్ట ప్రశాంతత, పరిపూర్ణ నిర్మలత్వం, నిజమైన సంతృప్తి ఉంటుంది. అందులోనే జీవితం వెలుగులను విరజిమ్ముతూ వెల్లివిరుస్తుంది, విస్తృతమౌతుంది, వ్యాప్తి చెందు తుంది, అది ఏ విధంగానంటే, గంభీరమైన అలలతో, దానినిక ఏ తుఫానూ ఎంత మాత్రమూ చిందరవందర పరచలేని విధంగా.

ఓ ప్రభూ, మీరే మా రక్షకులు, కేవలం మా సంతోషం, మీరే మా అత్యంత తేజోమయమగు ప్రకాశమవు, మీరే మా పవిత్ర ప్రేమ, మా ఆశ, మా దృఢశక్తి. మీరే మా జీవితం, మా అస్తిత్వ వాస్తవికత!

భక్తిపూర్వకంగా, ఆనందభరితమైన ఆరాధనతో నేను మీకు ప్రణమిల్లుతున్నాను....

మార్చి 12, 1914

భౌతిక పరిస్థితులు కొంచెం క్లిష్టమైన వేళ

భౌతిక పరిస్థితులు కొంచెం క్లిష్టమై, కొంత అసౌకర్యం కలిగేవేళ, ఆ వ్యక్తి జీవితం లేదా మృత్యువు, స్వస్థత లేదా అస్వస్థతల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా, అతడికి మీ మహదేచ్ఛకు పూర్తిగా ఎలా సమర్పించుకోవాలో తెలిస్తే, అప్పుడతని సమగ్ర అస్తిత్వం తక్షణం మీ ధర్మమగు ప్రేమ, జీవితాల సామరస్యతలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు, భౌతిక అనారోగ్యం తొలగిపోయి దాని స్థానంలో ప్రగాఢమైన, ప్రశాంతమైన నిశ్చల నీరవత్వంతో క్షేమకరమైన అస్తిత్వం విరాజిల్లుతుంది.

ఏ వ్యక్తి అయినా, ఒక కార్యమును చేపట్టినప్పుడు దానికి చాలా ఎక్కువగా భౌతికమైన సహనశక్తి ఆవశ్యకమైన తరుణాన అతడిని చాలా ఎక్కువగా నీరసపరచేది, అతడు ముందస్తుగానే దేనినైతే తాను ఎదుర్కొనబోతున్నాడో దాని ఇబ్బందులన్నింటినీ ఊహించుకోవడం మూలంగానే అనే విషయాన్ని నేను గమనించాను. ప్రతి క్షణం కేవలం అప్పటికప్పుడు ఎదురయ్యే ఇబ్బందిని మాత్రమే చూడటం చాలా తేలికైన పని; ఈ విధంగా చేయబోయే పరిశ్రమ చాలా తేలికవుతుంది, ఎందువల్లనంటే, అది వ్యక్తి కుండే శక్తీ, అతడికుండే నిరోధక శక్తీ అనే వాటి నిష్పత్తి మీద ఆధారపడి ఉంటుంది. శరీరం అద్భుతమైన ఉపకరణం, మన మనస్సుకు దానినే విధంగా ఉపయోగించుకోవాలో తెలియదు, దాని మృదుత్వాన్ని వర్ధిల్ల జేయటానికీ, అనేక విధాలుగా దానిని సులభంగా తీర్చిదిద్దటానికీ బదులుగా అది, దానిలో ముందస్తుగానే ఏర్పరచుకున్న భావాలు, అననుకూలమైన సూచనలతో ఒక విధమైన స్థిరత్వాన్ని తీసుకువస్తుంది.

కాని, ఓ ప్రభూ, పరమోత్కృష్టమైన విజ్ఞానం ఏమిటంటే, మీతో ఐక్యం కావటమే, మీలో దృఢవిశ్వాసం ఉంచడమే, మీ లాగా అయిపోవటమే; మీ సర్వ శక్తిత్వాన్ని

అభివ్యక్తం చేయబోయే మనిషికి అసాధ్యమనేది ఏదీ ఇక ఎంత మాత్రమూ ఉండబోదు....

మార్చి 17, 1914

ఒక ఇష్టాపూర్వక ఆశావాదివికా

నేను అర్థం చేసుకున్నదాని ప్రకారం, ఆదర్శదాయకమైన స్థితి, నిరంతరం మీ చైతన్యంతో ఎరుకలో ఉండటమే, అప్పుడు ఆ మనిషికి, ప్రతి క్షణం, దానంతటదే, ఏ పునరాలోచనావసరమూ లేకుండా, మీ ధర్మాన్ని అత్యుత్తమంగా వ్యక్తం చేయడానికి ఏమి చేయాలనేది కచ్చితంగా తెలుస్తుంది....

ఈ భూమి మీద జరిగే ప్రతి పనికీ మంచీ, చెడూ అనేవి రెండూ ఉంటాయి. అత్యంత దివ్య ధర్మమైనటువంటి ఆ మహాప్రేమను అత్యుత్తమంగా వ్యక్తం చేసే పనులు సైతం, ప్రపంచంలో అంతర్గతంగా ఇప్పుడున్న విధంగా, తమలో ఎంతో కొంత అస్తవ్యస్తతను, జ్ఞానవిహీనతను కలిగి ఉంటాయి. నిరాశావాదులుగా పిలవబడే కొంతమంది ప్రజలు, చాలా మట్టుకు ప్రత్యేకించి ప్రతిదానిలోని నైరాశ్యాన్ని గ్రహిస్తారు. దానికి వ్యతిరిక్తంగా, ఆశావాదులు, కేవలం సౌందర్య, సామరస్యతలనే చూస్తారు. బుద్ధిహీనతా, అజ్ఞానమూ అయినటువంటి ఏ ఉద్దేశమూ లేని ఆశావాదిగా ఉండే కంటే, ఇష్టాపూర్వకమైన ఆశావాదిగా కావటానికి ఆనందదాయకమైన గెలుపును సాధించటం సబబు కాదా? నిరాశావాదుల దృష్టిలో ఒకరు చేసే పని ఎప్పుడూ చెడ్డదే, అజ్ఞానంతోనూ లేక స్వార్థాహంకారంతోనూ చేసేది; వారిని ఏ విధంగా సంతృప్తిపరచగలం? అది అసాధ్యమైన పని.

దానికి ఒకటే మార్గం ఉంది; ఒకరు ఊహించగలిగినంతగా ఎంత సాధ్యమైతే అంత సమగ్రంగా మహోన్నతమైన, పవిత్రమైన జ్ఞానప్రకాశంతో ఐక్యమవటం, తన చైతన్యాన్ని సాధ్యమైనంత సంపూర్ణంగా ఆ కేవల మహాచైతన్యంతో తాదాత్మ్యం చేయటం, కేవలం ఆ మహాచైతన్యం నుంచే అన్ని ప్రేరణలు పొందడానికి గట్టిగా ప్రయత్నం చేయడం, ఫలితంగా తనకు సాధ్యమైనంత రీతిలో అత్యుత్తమంగా ఈ భూమి మీద దాని అభివ్యక్తత వర్ధిల్ల గలందులకై దోహదం చేయడం, దాని ఆధిపత్య శక్తిలో దృఢ విశ్వాసం ఉంచడం, అన్ని సంఘటనలను నిర్మల చిత్తంతో తిలకించడం.

ప్రస్తుత సృష్టిలో ప్రతిదీ తప్పనిసరిగా కలగలసిపోవడం మూలంగా, చేయదగ్గ అత్యంత వివేకమైన పని, ఏ వ్యక్తి అయినా తాను ఎంత బాగా చేయగలడో అంత బాగా చేయడం, ఎప్పటికి ఇంకా అధికతరమైన ప్రకాశం దిశగా గట్టిగా ప్రయత్నించడం, సమగ్ర పరిపూర్ణతను ఈ క్షణంలో సాక్షాత్కరించుకోలేమనే సత్యానికి తల ఒగ్గి తన మనసును సమాధానపరచుకోవడం.

అయినప్పటికీ, ఎంతో తీవ్ర గాఢావేశంతో మన మందరం చేరడానికి దుర్గమమైన ఆ పరిపూర్ణత కోసం ఎల్లప్పుడూ తప్పకుండా ఆకాంక్షిస్తూ ఉండవలసిందే కదా!...

మార్చి 23, 1914

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మార్చి 29, 1914

ఎవరినైతే మేము అవశ్యం తెలుసుకోగలమో, అవగతం చేసుకోగలమో, సాక్షాత్కరించుకోగలమో, సంపూర్ణ చైతన్యమో, శాశ్వత ధర్మమో, అటువంటి ఓ, దేవా, ఎవరైతే మాకు మార్గదర్శనం చేస్తూ, ప్రకాశింపజేస్తున్నారో, ఎవరైతే మమ్మలను చలింపజేస్తూ, అంతర్బుద్ధిని కలుగజేస్తున్నారో, అటువంటి ఓ దేవా, ఈ బలహీన ఆత్మలు దృఢత్వాన్ని పొందేటట్లుగా అనుగ్రహించు, ఎవరైతే భయం చెందుతున్నారో వారికి పునరాశ్వాసన కలిగించు. మీకు నేను వారిని అప్పజెప్తున్నాను, అంతే కాక మా మొత్తం భవిష్యత్తునూ మీకే అప్పజెప్తున్నాను.

CWM 1:112

శ్రీమాత


అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

నేను సాధించాల్సిన కార్యం గురించి నా కెలా ఎరుక కలిగింది.

నా కార్యం గురించిన జ్ఞానం నా కెప్పుడు కలిగిందో చెప్పడం కష్టం. నిజానికి నేను దానితోనే జన్మించా ననిపిస్తుంది. క్రమంగా మనసు, బుద్ధి పెరగినకొద్దీ ఆ చైతన్యం యొక్క పూర్ణత, నిర్దిష్టత కూడా పెరిగాయి. 11 నించి 13 సంవత్సరాల మధ్య వయసులో నాకు చైత్యపురుష సత్త మరియి ఆధ్యాత్మిక సంబంధితమైన కొన్ని అనుభవాలు దైవం యొక్క ఉనికి, మనిషి దైవంతో పొందే ఐక్యత గురించి ప్రకటించాయి అంతేకాక చైతన్యంలోను, కర్మలలోను అతడిని సమగ్రంగా సాక్షాత్కారింప చేసుకుని, ఆ దైవాన్ని ఈ పృధ్విపై దివ్యజీవనంలో అభివ్యక్తి చేయడంతో పాటు దాని సాఫల్యానికి కావలసిన ప్రయోగాత్మకమైన క్రమశిక్షణ నా శరీరం నిద్రావస్థలో ఉన్నప్పుడు అనేకమంది గురువుల ద్వారా అందించబడ్డాయి. ఆ తరువాత వారిలో కొందరిని భౌతికస్థాయిలో కలుసుకున్నాను. అనంతరం బాహ్య, ఆంతర్యాల అభివృద్ధి పెరుగుతుండగా, ఆ గురువుల్లోని ఒకరితో మాత్రం చైత్యపురుష సత్త, ఆధ్యాత్మిక అనుబంధాలు మరింత స్పష్టంగా, తరచుగా అనుభవంలోకి వచ్చాయి. అయితే అప్పటికి నాకు హిందువుల తత్వశాస్త్రాలు, వారి మతాల గురించి తెలియక పోయినా, నేను అతనిని 'కృష్ణ' అని సంభోదించేదాన్ని. ఆ తరువాత ఈ భూమిపై దివ్యకార్యాన్ని నెరవేరుస్తాననీ, ఈ భూమిపై అతడిని కలిసే రోజు వస్తుందని నాకు తెలిసింది.

1910 లో నా భర్త వంటరిగా పాండిచ్చేరి వచ్చినపుడు అత్యంత ఆసక్తికరమైన విపరీత పరిస్థితులలో అతడు శ్రీఅరవిందులను పరిచయం చేసుకోవడం జరిగింది. అప్పటి నుంచి మేమిద్దరము ఇండియాకు — ఏ దేశాన్ని నేను నా నిజమైన మాతృదేశంగా భావించానో ఆ దేశానికి తిరిగి రావాలనే గాఢంగా కోరుకున్నాము. 1914 లో మాకు ఆ ఆనందం లభించింది.

నేను శ్రీఅరవిందులను చూసిన వెంటనే, నేను కృష్ణ అని పిలుచుకున్న, నాకు బాగా తెలిసిన ఆ రూపంగా గుర్తించాను. అందువల్ల నేను ఇండియాలో,



మార్చి 30, 1914

...అనేక వేలమంది జీవులు ఇంకా గాఢ అజ్ఞానంలో మునిగి ఉన్నారన్న విషయం ముఖ్యం కాదు. ఈ పృధ్విపై అంధకారమంతా ప్రకాశంగా పరివర్తన చెందే ఓ రోజు తప్పనిసరిగా వస్తుందని చెప్పడానికి నిన్న మేము దర్శించిన, ఆ వ్యక్తియొక్క ఉనికి చాలు మీ (దైవం) దివ్యపాలన నిజంగా పృధ్విపై స్థాపించబడుతుందననటానికి.

ఓ ప్రభూ! మీరు ఈ అద్భుతం యొక్క దివ్యనిర్మాణ కర్త. ఆ విషయం గురించి ఆలోచిస్తున్నప్పుడు నా హృదయం కృతజ్ఞతతో, ఆనందంతో పొంగి పొరలుతోంది. నా ఆశకు అవధులు లేకుండా పోయాయి.

నా ఆరాధన అనిర్వచనీయం, నా పూజ్యభావన కడు నిశ్శబ్దం.

వారి సాన్నిధ్యంలో నా కార్యసాధన చేయాలని పూర్తిగా ఎందుకు అంగీకరించానో వివరించడానికి ఈ విషయం చాలు.

పాండిచ్చేరి, 1920

నూతన కాల ఆవిర్భావం

నేను ఇండియా వచ్చాను.... నాలో ఏదో శ్రీఅరవిందులను మొదటిసారి ఏకాంతంగా కలుసుకోవాలని కోరింది. 'ఆర్' ఉదయం వెళ్ళి మధ్యాహ్నానికి నేను కలవడానికి సమయం తీసుకున్నాడు. అప్పుడు శ్రీఅరవిందులు ఇప్పుడు రెండవ డార్మిటరీలో భాగంగా ఉన్న ఆ పాత అతిథి గృహంలో నివసించేవారు. నేను మెట్లెక్కి పైకి వెళ్ళాను.... వారు అక్కడ నా కోసం నిరీక్షిస్తూ మెట్ల పైన నిలిచి ఉన్నారు.... అది సరిగ్గా నేను దర్శించిన రూపం. దుస్తులు కూడా అదే విధంగా ధరించి ఉన్నారు. అదే ముఖతీరు శిరస్సు ఉన్నతంగా నిలిపి. వారు నా వైపు తిరగగానే వారి కళ్ళలో నేను అతడేనని నేను గుర్తించాను. ఈ రెండు విషయాలు ఒక్కసారి సంభవించాయి. (హఠాత్తుగా కలిగన 'షాక్'). ఆ అంతరంగ అనుభవం వెంటనే బాహ్యానుభవంతో ఏకమయింది! ఆ రెండు అనుభవాలు ఒకదానితో ఒకటి కలసిపోయాయి — నిశ్చయమైన 'షాక్' అది.

అయితే ఇది కేవలం నా దర్శనం యొక్క ఆరంభ దశ. ఆలాంటి వరుస అనుభవాల తరువాత — పాండిచ్చేరిలో ఓ పది నెలలు నివాసం, ఆ తరువాత ఐదేళ్ళ ఎడబాటు, మళ్ళీ తిరిగి పాండిచ్చేరి ఆగమనం, అదే ఇంట్లో, అదే విధంగా కలుసుకోవడం — అప్పుడు ఆ దర్శనం పూర్తయింది... నేను వారి పక్కనే నిలిచి ఉన్నాను. ఆ తెరిచి వున్న కిటికీ ద్వారా ఇద్దరం చూస్తూ; మళ్ళీ ఇరువురం ఒకేసారి, ఒకే క్షణంలో "ఇప్పుడు సాక్షాత్కారం సాధించబడుతుంది" అనే అనుభూతి కలిగింది. నేను నా దర్శనంలో స్పష్టంగా భావించినట్లుగానే, ఆ విషయం దృఢంగా నాలోకి అవరోహిస్తున్న అనుభూతి కలిగింది. ఆ క్షణం నించి చెప్పడానికి ఏమీ లేదు — మాటలు లేవు, ఏమీ లేదు. అది 'అదే' అని మాకు తెలిసింది.

"శిష్యునితో సంభాషణలు": డిసెంబరు 20, 1961

నేను శ్రీఅరవిందులను కలుసుకోడానికి ఇండియా వచ్చాను. శ్రీఅరవిందుల సన్నిధిలో నివసించడానికి ఇండియాలో ఉండిపోయాను. వారు దేహాన్ని త్యజించినపుడు వారి చేపట్టిన కార్యం నిర్వహించడానికి ఇక్కడే ఉండిపోయాను. అది పరమ సత్యాన్ని సేవించడం, మానవాళికి జ్ఞానాన్ని ప్రసాదించడం, పృథ్విపై దివ్యప్రేమ యొక్క పాలనను శీఘ్రంగా తీసుకురావడం.

ఫిబ్రవరి 21, 1968

పృథ్వి ప్రారంభాల నుండి ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు ఓ చైతన్య కిరణం అభివ్యక్తి కావడానికి సంభావ్యత ఉండిందో అక్కడ నేనున్నాను.

CWM 13:37

ఇప్పుడు నీతో మాట్లాడుతున్నది దైవం యొక్క విశ్వసనీయ భృత్యురాలు. ఈ పృథ్వి ప్రారంభాల నుంచి అనాది కాలంగా ఆ దైవం యొక్క విశ్వసనీయమైన సేవకురాలిగా, ఆ ప్రభువు తరఫున ఈ భృత్యురాలు మాట్లాడుతున్నది. పృథ్వి, మనుషులు ఉన్నంతవరకు, ఆ దివ్యవాక్కును బోధించడానికి ఈ భృత్యురాలు దేహంతో వుంటుంది.

CWM 13:37

నేను ఏ దేశానికి, ఏ నాగరికతకు, ఏ సంఘానికి, ఏ జాతికి చెందను, ఒక్క దైవానికి తప్ప.

నేను ఏ గురువుకు, ఏ పాలకునికి, ఏ చట్టానికి, ఏ సాంఘిక కట్టుబాటుకి విధేయత కలిగి ఉండను, ఒక్క దైవానికి తప్ప.

ఆ ఒక్క దైవానికి నా సర్వస్వాన్ని అర్పించాను, సంకల్పం, జీవితం, ఆత్మ. ఆతడి కోసం నా రక్తాన్నంతా బొట్లు బొట్లుగా ధారపోయడానికి సంసిద్ధతతో ఉన్నాను. ఒక వేళ అదే ఆతడి సంకల్పమైతే, సంపూర్ణ ఆనందంతో సమర్పిస్తాను. ఆతడి

సేవలో ఏదీ త్యాగం కాదు, కారణం అంతా సంపూర్ణ పరమానందమే.
CWM 13:38

శ్రీమాత

ఆమెలో అతడు పరిపూర్ణ సమర్పణను చూశాడు

...చాలా సంవత్సరాల తరువాత శ్రీఅరవిందులు, మిర్రాను చూసేదాకా సమగ్ర సమర్పణ అన్నదాన్ని తాను చూడలేదని తన సోదరుడు బరీంద్ర కుమార్ తో చెప్పారు. 'ఆమెలో అతడు సంపూర్ణ సమర్పణను, చివరకు శరీరం యొక్క జీవ కణాలలోను వ్యక్తమైన సమర్పణని చూశారు. అ విధంగా వారు అతిమానస అభివ్యక్తికి సరైన సమయం ఆసన్నమయిందిని భావించారు'.
Ref: M.P. Pandi (Edited) Breath of Grace p. 65

ఒక నేస్తం, కాని సంపూర్ణంగా తెలుసుకోగలుగుటకు మహోన్నతమైనది

'... ప్రారంభంలో శ్రీమాత మాలో పెద్దవాళ్ళకి శ్రీమాతగా అనిపించేవారు కాదు. మొదట్లో ఆమె మాకు ఓ దివ్య సౌందర్యమూర్తిగా గోచరించారు. మేం ఆమెను ఓ నేస్తంగా, ఓ తోడుగా స్వీకరించాము, మాలో అత్యంత సన్నిహితమైన వ్యక్తిగా, ఎందుకంటె మొదట శ్రీఅరవిందులు కూడా ఆమెను ఆ విధంగానే స్వీకరించినందుకు. రెండు ఆమె గుణాల కారణంగా... నేను శ్రీమాత గురించి విన్న మొదటి విషయం ఆమె గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తి అని. అప్పుడు ఆవిడకు ఇతర ప్రజ్ఞలున్నట్టుగా నాకు తెలియదు. తరువాత క్రమంగా తెలిసింది. మొదట ఆమె గొప్ప చిత్రకారిణి అని తెలుసుకున్నాను, ఆ తరువాత ఆమె సంగీతంలో కూడా అంత ప్రతిభ కలిగినదని తెలుసుకున్నాను. ఇంకా ఆశ్చర్యం కల్గించే విషయాలున్నాయి. ఉదాహరణకి ఆమెలో మేధాశక్తి కూడా అపారమై చాలా సమృద్ధమైనది. అనగా ఆమె విస్తృతంగా పఠించింది, అధ్యయనం చేసింది. గొప్ప విద్యాసంపన్నురాల వలెనే ఆమె కూడా మేధాపరమైన విషయ సముపార్జనలో ఉండేవారు. నేను మరింత ఆశ్చర్యపడిన మరో విషయం, ఆమె ఫ్రాన్సులో ఉండగానే భారతీయ గ్రంధాలైన గీత, ఉపనిషత్తులు, యోగసూత్రాలు, నారద భక్తి సూత్రాలు మొదలైన అనేక గ్రంధాలను

చదివి అనువదించారు. ఇదంతా నేను ఎందుకు చెప్తున్నానంటే, అద్భుతమైన విస్తృత మనోసంపదను పొందిన ఆమె, తన మనస్సును సంపూర్ణంగా శూన్యం చేసుకునే సమర్థథ కలిగి ఉండటం ఒక అసామాన్య విషయం. మాకు శ్రీమాత ఒక నేస్తంగా, ఒక తోడుగా, ఒక సహచరిణిలా ఉంటూ పూజ్యురాలిగా గౌరవంతో ఉన్నతంగా చూడబడుతున్న వ్యక్తి'...

(శ్రీఅరవిందులు) మరో వ్యాఖ్యానం చేశారు, బహుశ అంతటి సర్వ సమగ్ర సమర్పణను అంత సులభంగా చేయగల సమర్థత ఒక్క స్త్రీలకే ఉందేమో అని. దాని భావం గతాన్ని పూర్తిగా తుడిచివేయడం సద్గుణాలు, అవలక్షణాలతో సహా. శ్రీమాత ఇక్కడికి వచ్చినపుడు ప్రభువైన శ్రీఅరవిందులకు ఒక పసిబిడ్డ లాంటి నిజాయితీగల నిరాడంబరతతో సంపూర్ణ స్వీయ సమర్పణ చేసింది — తన నుంచి తన గతాన్ని, ఆధ్యాత్మిక విజయాలను, చైతన్యంలోని సమస్త వైభవాన్ని పూర్తిగా తుడిచివేసిన తరువాత గావించిన సమర్పణ.

మొదటిసారిగ శ్రీమాతను కలిసిన తరువాత శ్రీఅరవిందులు చేసిన మరో వ్యాఖ్యానం, మిర్రా జన్మతః స్వేచ్ఛను పొంది ఉన్నదని.

శ్రీ నళినీకాంత గుప్త: జ్ఞాపకాలు, పు'. 81-83

నూతన జీవితంలోకి తిరిగి జన్మనెత్తడం

నాకు నేను నూతనంగా మళ్ళీ జన్మించినట్లు అనిపించింది, ఆ పాత పద్ధతులు, గతంలోని అలవాట్లు ఇక ఏ మాత్రం ఉపయోగపడవని అనిపించింది. నేను ఫలితాలుగా అనుకున్నవి నాకు తర్ఫీదు మాత్రమే, అంతకన్న ఏం లేదు అని అనిపించింది. నేనింకా ఏమీ చేయలేదని, నేనింకా ఆధ్యాత్మిక జీవితం గడపలేదని, కేవలం ఆ మార్గంలోకి ప్రవేశించాయని, నా కేమీ తెలియదని, నేను దేనినీ రూపొందించలేనని, అసలు అనుభవమున్నది ఇంకా ప్రారంభం కావలసి ఉన్నదని అనిపించింది. అదెలా ఉండిందంటే నా గతం, అందులోని పొరపాట్లు, విజయాలతో సహా పూర్తిగా తొలగిపోయినట్లుగాను, ఏ కర్మగానీ, నేర్చుకుందుకు ఏ అనుభవం గాని, అలాగే సరిచేయడానికి ఏ పొరపాటు గాని లేని పసిబిడ్డ జీవితాన్ని ప్రారంభించడం కోసం అంతా తయారుచేసినట్లుగా అనిపించింది. నా మస్తిష్కంలో జ్ఞానం, విశ్వాసం, వ్యర్థమైన ఆలోచనలు అంతరించాయి. ఇప్పుడున్న ఈ స్థితికి నేను ఏ మాత్రం

సేవలో ఏదీ త్యాగం కాదు, కారణం అంతా సంపూర్ణ పరమానందమే.

CWM 13:38

శ్రీమాత

ఆమెలో అతడు పరిపూర్ణ సమర్పణను చూశాడు

...చాలా సంవత్సరాల తరువాత శ్రీఅరవిందులు, మిర్రాను చూసేదాకా సమగ్ర సమర్పణ అన్నదాన్ని తాను చూడలేదని తన సోదరుడు బరీంద్ర కుమార్ తో చెప్పారు. 'ఆమెలో అతడు సంపూర్ణ సమర్పణను, చివరకు శరీరం యొక్క జీవ కణాలలోను వ్యక్తమైన సమర్పణని చూశారు. అ విధంగా వారు అతిమానస అభివ్యక్తికి సరైన సమయం ఆసన్నమయిందిని భావించారు'.

Ref: M.P. Pandi (Edited) Breath of Grace p. 65

ఒక నేస్తం, కాని సంపూర్ణంగా తెలుసుకోగలుగుటకు మహోన్నతమైనది

'... ప్రారంభంలో శ్రీమాత మాలో పెద్దవాళ్ళకి శ్రీమాతగా అనిపించేవారు కాదు. మొదట్లో ఆమె మాకు ఓ దివ్య సౌందర్యమూర్తిగా గోచరించారు. మేం ఆమెను ఓ నేస్తంగా, ఓ తోడుగా స్వీకరించాము, మాలో అత్యంత సన్నిహితమైన వ్యక్తిగా, ఎందుకంటె మొదట శ్రీఅరవిందులు కూడా ఆమెను ఆ విధంగానే స్వీకరించినందుకు. రెండు ఆమె గుణాల కారణంగా... నేను శ్రీమాత గురించి విన్న మొదటి విషయం ఆమె గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తి అని. అప్పుడు ఆవిడకు ఇతర ప్రజ్ఞలున్నట్టుగా నాకు తెలియదు. తరువాత క్రమంగా తెలిసింది. మొదట ఆమె గొప్ప చిత్రకారిణి అని తెలుసుకున్నాను, ఆ తరువాత ఆమె సంగీతంలో కూడా అంత ప్రతిభ కలిగినదని తెలుసుకున్నాను. ఇంకా ఆశ్చర్యం కల్గించే విషయాలున్నాయి. ఉదాహరణకి ఆమెలో మేధాశక్తి కూడా అపారమై చాలా సమృద్ధమైనది. అనగా ఆమె విస్తృతంగా పఠించింది, అధ్యయనం చేసింది. గొప్ప విద్యాసంపన్నురాల వలెనే ఆమె కూడా మేధాపరమైన విషయ సముపార్జనలో ఉండేవారు. నేను మరింత ఆశ్చర్యపడిన మరో విషయం, ఆమె ఫ్రాన్సులో ఉండగానే భారతీయ గ్రంథాలైన గీత, ఉపనిషత్తులు, యోగసూత్రాలు, నారద భక్తి సూత్రాలు మొదలైన అనేక గ్రంథాలను

చదివి అనువదించారు. ఇదంతా నేను ఎందుకు చెప్తున్నానంటే, అద్భుతమైన విస్తృత మనోసంపదను పొందిన ఆమె, తన మనస్సును సంపూర్ణంగా శూన్యం చేసుకునే సమర్థత కలిగి ఉండటం ఒక అసామాన్య విషయం. మాకు శ్రీమాత ఒక నేస్తంగా, ఒక తోడుగా, ఒక సహచరిణిలా ఉంటూ పూజ్యురాలిగా గౌరవంతో ఉన్నతంగా చూడబడుతున్న వ్యక్తి'...

(శ్రీఅరవిందులు) మరో వ్యాఖ్యానం చేశారు, బహుశ అంతటి సర్వ సమగ్ర సమర్పణను అంత సులభంగా చేయగల సమర్థత ఒక్క స్త్రీలకే ఉందేమో అని. దాని భావం గతాన్ని పూర్తిగా తుడిచివేయడం సద్గుణాలు, అవలక్షణాలతో సహా. శ్రీమాత ఇక్కడికి వచ్చినపుడు ప్రభువైన శ్రీఅరవిందులకు ఒక పసిబిడ్డ లాంటి నిజాయితీగల నిరాడంబరతతో సంపూర్ణ స్వీయ సమర్పణ చేసింది — తన నుంచి తన గతాన్ని, ఆధ్యాత్మిక విజయాలను, చైతన్యంలోని సమస్త వైభవాన్ని పూర్తిగా తుడిచివేసిన తరువాత గావించిన సమర్పణ.

మొదటిసారిగ శ్రీమాతను కలిసిన తరువాత శ్రీఅరవిందులు చేసిన మరో వ్యాఖ్యానం, మిర్రా జన్మతః స్వేచ్ఛను పొంది ఉన్నదని.

శ్రీ నళినీకాంత గుప్త: జ్ఞాపకాలు, పు'. 81-83

నూతన జీవితంలోకి తిరిగి జన్మనెత్తడం

నాకు నేను నూతనంగా మళ్ళీ జన్మించినట్లు అనిపించింది, ఆ పాత పద్ధతులు, గతంలోని అలవాట్లు ఇక ఏ మాత్రం ఉపయోగపడవని అనిపించింది. నేను ఫలితాలుగా అనుకున్నవి నాకు తర్ఫీదు మాత్రమే, అంతకన్న ఏం లేదు అని అనిపించింది. నేనింకా ఏమీ చేయలేదని, నేనింకా ఆధ్యాత్మిక జీవితం గడపలేదని, కేవలం ఆ మార్గంలోకి ప్రవేశించాయని, నా కేమీ తెలియదని, నేను దేనినీ రూపొందించలేనని, అసలు అనుభవమున్నది ఇంకా ప్రారంభం కావలసి ఉన్నదని అనిపించింది. అదెలా ఉండిందంటే నా గతం, అందులోని పొరపాట్లు, విజయాలతో సహా పూర్తిగా తొలగిపోయినట్లుగాను, ఏ కర్మగానీ, నేర్చుకుందుకు ఏ అనుభవం గాని, అలాగే సరిచేయడానికి ఏ పొరపాటు గాని లేని పసిబిడ్డ జీవితాన్ని ప్రారంభించడం కోసం అంతా తయారుచేసినట్లుగా అనిపించింది. నా మస్తిష్కంలో జ్ఞానం, విశ్వాసం, వ్యర్థమైన ఆలోచనలు అంతరించాయి. ఇప్పుడున్న ఈ స్థితికి నేను ఏ మాత్రం

మొండితనం చూపకుండా పూర్తిగా సమర్పణ గావించడం నేర్చుకుంటే, నేను ఏమీ అర్థం చేసుకుందుకు ప్రయత్నించకుండా అజ్ఞానంతో ఉండే పసిపిల్ల వలె వుండటానికి అంగీకరిస్తే, ఏదో ఒక నూతన సంభావ్యత తెరుచుకుంటుందనిపించింది. నేనన్నది లేకుండా కచ్చితమైన సంపూర్ణ సమర్పణా భావంతో, ఓ తెల్లటి కాగితంపై నీ యోచన, నీ సంకల్పం, స్వేచ్ఛగా ఏ రకమైన వక్రత లేకుండా లిఖించబడుటకు వీలుగా ఇప్పుడు నేనుండాలని నాకు తెలుసు.

నా హృదయంలో నుంచి ఓ విస్తృత కృతజ్ఞతా కెరటం ఎగిసిపడుతున్నది. ఎట్టకేలకు ఎంతగానో ఎదురుచూసిన ఆ ముంగిట నిలిచినట్టుగా అనిపిస్తున్నది.

ఓ ప్రభూ! నేను తగినంత పవిత్రంగా, నిస్వార్థంగా నీ ప్రేమలో ఉత్సాహ వంతమైన విశ్వాసంతో ఉండి, దానిని దాటగల శక్తిని నాకు అనుగ్రహించు.

ఓహ్, ఏ అంధకారం, ఏ అవరోధం లేకుండా నీకు చెందడం, నీకే చెందడం....

ఏప్రిల్ 3, 1914

అనువాదం: డి. సత్యవాణి

ఇద్దరైన ఒక్కరు

చేతన తాదాత్మ్యం:

దివ్యజనని చేతన, నాదీ ఒకే విధమైనవి. ఒకే దివ్యచేతన యిద్దరి యందున్నది, ఎందుకనంటే అది ఇచటి క్రీడ కవసరం. ఆమెకు తెలియకుండా, ఆమె క్రియాశక్తి ఆమె చేతన లేకుండా యేదీ జరుగదు — ఎవరైనా నిజంగా ఆమె చేతనను అనుభూతి చెందితే, దాని వెనుక నేనున్నానని అతనికి తెలుస్తుంది, అతడు నన్ను అనుభూతి చెందితే, ఆమె చేతన అనుభూతి అని అతని కనుభూతమౌతుంది. ఆ విధంగా ఒక యెడబాటును కల్పించితే (వీటి మీద వారి మనస్సులు పెట్టిన బలీయమైన ధోరణులను నేను ఒక ప్రక్కన పెడ్తున్నాను) పరమ సత్యం తనను తానెలా ప్రతిష్ఠించుకొంటుంది — పరమ సత్యం దృష్టి నుండి చూస్తే అటువంటి యెడబాటెక్కడా లేదు.

CWSA 32:79

*

మార్గముల అభిన్నత:

దివ్యజనని మార్గానికి నా మార్గానికి మధ్య భేదమేం లేదు. అతిమానసిక పరివర్తనానికి, దైవసాక్షాత్కారానికి దారితీయు మార్గమే మాకున్నది, యెల్లపుడూ వుండేది కూడా అదే. అది చరమ దశలోనే కాదు, ప్రారంభం నుండీ కూడా ఆ రెండూ ఒకే మార్గం.

దివ్యజనని ఒక ప్రక్క, నన్ను దానికి వ్యతిరేకమైన మరో ప్రక్క లేదా పూర్తిగా భిన్నమైన మరో ప్రక్క నిలబెట్టడమనే విభజనను, వ్యతిరేకతను కల్పించే ప్రయత్నం యెప్పుడూ కూడా అనృతశక్తుల కుటిల ప్రయత్నం. సాధకుడిని పరమ సత్యాన్ని చేరకుండా ఆటంకపరచాలనుకొన్నప్పుడు అవి ఆలా అడ్డుపడతాయి. అటువంటి అసత్యాన్నంతటినీ నీ మనస్సు నుండి తొలగించివెయ్యి.

దివ్యజనని వెలుగు, క్రియాశక్తి, పరమ సత్యపు వెలుగు, క్రియాశక్తి అని తెలుసుకో. సదా దివ్యజనని వెలుగు, క్రియాశక్తితో సంపర్కంలో వుండు, అపుడే నీవు దివ్య పరమసత్యంలోని కెదుగుతావు.

CWSA 32:81

*

దివ్యజనని నుండి దేనిని పొందినా, అది నా దగ్గరి నుండి కూడా వస్తుంది — అందులో భేదం లేదు. అలాగే, నేను దేన్నైనా ప్రసాదిస్తే అది దివ్యజనని క్రియాశక్తి ద్వారా సాధకునికి చేరుతుంది.

CWSA 32:80

*

దివ్యజనని వల్ల నాకేం ప్రయోజనం లేదు, ఆమె సహాయం వల్ల నేనే ప్రయోజనం పొందలేను అని గనుక నీవు అనుకుంటే, నా వల్ల అంతకన్న యింకా తక్కువ ప్రయోజనమే వుంటుందని నీవు తెలుసుకుంటావు. కాని, ఎట్టి మినహాయింపులు లేకుండా, ఆమె నుండి వెలుగును, క్రియాశక్తిని వారు స్వీకరించవలసిందేనని వారి ఆధ్యాత్మిక పురోగతిలో ఆమెచే నడుపబడ వలసిందేనని, సరాసరి నా నుండి నాచే కాదని తెలుసుకో. నేను శిష్యులందరి గురించి చేసిన యేర్పాటును, ఏ సందర్భంలో గూడా మార్చే వుద్దేశ్యం నాకు లేదు. ఏ విధమైన తాత్కాలిక కార్యం కోసం నేనా

యేర్పాటును చేయలేదు. శిష్యుడు గనుక యెల్లపుడూ (ఆమె యెవరో, ఆమె శక్తేమిటో గుర్తుంచుకొంటూ) ఆమెకు ఉన్ముఖుడై, స్వీకరిస్తుంటే, యదార్ధమైన, ప్రభావం చూపే ఏకైక మార్గం ఆదొక్కటే గనుక ఆ యేర్పాటు జరిగింది.

CWSA 36:390

*

రెండు రూపాల్లో ఒకే దివ్యశక్తి

ఒకే పరాశక్తి రెండు రూపాలుగా దివ్యజనని, నేను నిలుస్తాం — కనుక కలలో నీవు చూచినది పూర్తిగా తర్క సమ్మతమే. ఈశ్వరుడు — శక్తి; పురుషుడు-ప్రకృతి, అవి దైవం యొక్క (బ్రహ్మం) రెండు పార్శ్వములు మాత్రమే.

CWSA 32:79

*

రెండు ప్రతిబింబాలు ఒకదానిలో మరొకటి కలిసిపోవడంగా వ్యక్తం చేయబడిన నాకూ, దివ్యజననికి గల అభిన్నత్వం (మేము ఒకటే అన్న గ్రహింపు) చాలా సామాన్య అనుభవం.

CWSA 27:690

*

దివ్యజనని, నేను ఒక్కటే, కాని రెండు దేహాల్లో వున్నాం. ఆ రెండు దేహాలూ యెల్లపుడూ ఒకే విధమైన పని చేయవలసిన ఆవశ్యకతేం లేదు. తద్విరుద్ధంగా, మేమిద్దరం ఒకటే గనుక, ఒకరు సంతకం చేస్తే సరిపోతుంది, ప్రణామం స్వీకరించడానికి, ధ్యానం కలిగించడానికి ఒకరం మాత్రమే క్రిందకు వెళ్తే యెలా సరిపోతుందో అలా.

CWSA 32:82

*

ఉన్నది ఒకే ఒక శక్తి

ప్రశ్న: శ్రీఅరవిందుల వైపుకు తిరిగినవాడు దివ్యజనని వైపుకు తిరిగకుండా వుండడం జరుగుతుందా? దివ్యజనని వైపుకు తిరిగిన యెవరైనా తప్పక శ్రీఅరవిందుల వైపుకు తిరుగుతారా?

సమా: దివ్యజనని — విషయంగా చెప్పినది యదార్థం. ఎవరైనా శ్రీఅరవిందుల వైపు తిరిగి వుండి, దివ్యజనని వైపుకు తిరుగలేదంటే అర్థం అతడు నిజంగా శ్రీఅరవిందుల వైపుకు తిరుగలేదన్న మాట.

CWSA 32:104

*

ఉన్నది ఒకే ఒకే శక్తి, అది దివ్యజనని క్రియాశక్తి — లేక ఇంకే విధంగా చెప్పాలని నీ వనుకొంటే, శ్రీఅరవిందుల క్రియాశక్తే దివ్యజనని అని చెప్పవచ్చు.

CWSA 32:105

*

దివ్యజనని శ్రీఅరవిందుల శిష్యురాలు కాదు. నా లాగానే ఆమెకు కూడా అదే సాక్షాత్కారం, అనుభవం వున్నాయి.

చాలా చిన్న వయస్సులోనే దివ్యజనని సాధన ప్రారంభమైంది. ఆమెకు పన్నెండు లేక పదమూడు సంవత్సరాల వయస్సులో, ప్రతి సాయంత్రం ఆమె వద్దకు అనేక మంది గురువులు వచ్చి, ఆమె కనేక ఆధ్యాత్మిక శిక్షణా విధానాలను గురించి చెప్పేవారు. వారిలో నల్లని ఛాయ గలిగిన, ఒక ఆసియా సంబంధిత రూపం ఒక టున్నది. మేం మొట్టమొదట కలుసుకొన్నపుడు, పూర్వ మెప్పటినుండో ఆమె చూస్తూ వుండిన ఆసియాకు సంబంధించిన నల్లని మేనిఛాయ గల రూపం నేనేనని ఆమె వెంటనే గుర్తించింది. ఒక ఉమ్మడి గమ్యం కోసం ఆమె నాతో కలిసి పని చేయడానికి రావడమనేది నిజంగా ఒక విధి నిర్ణయమే. దివ్యజనని భారతదేశానికి రాక పూర్వమే బౌద్ధమత సంబంధ యోగంలోనూ, గీతాయోగంలోనూ నిష్ణాతురాలు. ఆమె యోగం ఒక శ్రేష్ఠమైన సంయోజనం వైపు సాగుతోంది. అందుచేత ఆమె యిచటికి రావడం సహజమే. నా యోగానికి ఒక పటిష్ఠమైన రూపాన్నివ్వడానికి ఆమె సహాయం చేసింది, చేస్తూనే వుంది కూడా. ఆమె సహకారం లేకుండా యిది సాధ్యమయ్యేది గాదు.

ఈ యోగంలో వేయవలసిన రెండు గొప్ప అడుగులలో ఒకటి దివ్యజననిని ఆశ్రయించడం.

CWSA 32:36

శ్రీఅరవిందులు

*

నేను మొదట పని చేయడం ప్రారంభించినపుడు అనేక అంతర్దర్శనాలు కలిగాయి. (నాకు భారతదేశాన్ని గురించి యేమాత్రం తెలియదు, వింటున్నారా.... నాకేం తెలియదు.) సరే, ఇటువంటి అనేక అంతర్దర్శనాలలో, భౌతికంగా ఎలా కన్పిస్తున్నారో అలా శ్రీఅరవిందుల్ని దర్శించాను, కాని దివ్య తేజో సౌందర్యాలతో వున్నవారిని దర్శించాను. అంటే నా మొదటి పర్యటనలో నేను చూచిన అదే మనిషి, దాదాపు బక్క పలుచగా, పసిడికాంతుల కంచువర్ణంగల, చెక్కినట్లున్న రూపం గల, చిందర వందరగా వున్న గడ్డం, పొడుగాటి జుట్టు, ఒక అంచు భుజం పైగ వల్లెవాటుగా వేసుకొన్న పంచె ధరించిన ఆచ్ఛాదన లేని చేతులు, వక్షస్థలం, పాదాలు గల శ్రీఅరవిందులను చూచాను. ఆనాడు దానిని 'అంతర్దర్శన వస్త్రధారణ' అనుకొన్నాను! అంటే నా ఉద్దేశ్యం, నాకు నిజంగా భారతదేశం గురించి తెలియదు అని; భారతీయ పద్ధతిలో దుస్తులు ధరించిన భారతీయుల నెవ్వర్నీ చూడలేదెప్పుడూ. సరే, నేను వారిని చూచాను. సంకేతరూప అంతర్దర్శనాలు, ఆధ్యాత్మిక వాస్తవాలు అంటే యెలా వుంటాయో నాకు అనుభవాని కొచ్చింది. సాధించవలసి వున్న కార్యానికి సంబంధించిన ఒక యేకీకృత అవగాహన కలగి వుండడం అందుకోసం కలుసుకోవడం అనేవి పూర్తిగా నిర్ణయాత్మకమైన ఆధ్యాత్మిక అనుభవాలు వాస్తవాలు. ఈ అంతర్దర్శనాలలో ఇతఃపూర్వం నేనెన్నడూ భౌతికంగా చేయనటువంటి ఒక పనిని చేసాను, హిందువుల పద్ధతిలో నేను వారికి సాష్టాంగ దండ ప్రణామం చేసాను. ...నేనలా చేసినప్పుడు నా బాహ్య అస్తిత్వం "ఏమిటిదంతా?" అని ప్రశ్నిస్తోంది.

ఆ అంతర్దర్శనాన్ని గురించి నేను కాగితం మీద పెట్టాను.... కాని యెవరికీ చెప్పలేదు.... కాని నా కప్పుడు, అది భవిష్యత్తును సూచించే హెచ్చరిక అని, అటువంటిదేదో, యేదో ఒక రోజు సంభవిస్తుందనే అభిప్రాయం కలిగింది. అది చేతన వెనుక, క్రియాశీలంగా లేకున్నా, సదా నిలిచి వుంది.

ఇది సుమారుగా 1904 ప్రాంతంలో.

దివ్యజనని ఒక శిష్యునికి గతాన్ని గురించి చెప్పినట్లు 'శ్రీఅరవిందులు, దివ్యజనని' అనే గ్రంథంలో పుట. 29 లో కిరీట్ జోషి ఉటంకించారు

నా కేడేళ్ళప్పుడు (ఇంకా ముందే మొదలు పెట్టి వుంటాను, నాకు బాగా

గుర్తు లేదు)... కాని అయిదు సంవత్సరాల వయస్సు నుండి... నేను యెరుకతో మొదలుపెట్టాను. నేనేమిటో నాకు తెలియదనే మాట నిజం. నా మొదటి అనుభవం చేతనకు సంబంధించినది. అది యిక్కడ వున్నట్లు (శిరసు పైన అని సంజ్ఞ చేసి చూపిస్తారు). ఒక దివ్యవెలుగుగా,, ఒక దివ్యక్రియాశక్తిగా అక్కడ అనుభూతి చెందాను (అదే సంజ్ఞ) అయిదేళ్ళ వయస్సప్పుడు.

అదొక ఆనందదాయకమైన అనుభూతి — నా కోసమే తయారు చేయించిన ఒక చిన్న చేతులున్న కుర్చీలో నేనొక్కదాన్నే నా గదిలో కూర్చొనేదాన్ని. నేను... (అదేమిటో నాకు తెలియదు, చూడూ, ఏ మాత్రం తెలియదు — మానసికంగా సున్నా) ఇక్కడ (శిరస్సు పైన) చాలా బలీయమైన, చాలా ప్రకాశవంతమైన, దేనికో సంబంధించిన ఒక ఆనందకర అనుభూతి కలిగింది. అది దివ్యచేతన. "నేను జీవించవలసింది అందులో, ఉండవలసింది అలా" అన్న అనుభూతి కలిగింది. అన్ని మాటలతో గాదనేది సహజం, కాని. (దివ్యజనని ఊర్ధ్వం వైపు ఆకాంక్షను సంజ్ఞ చేసి చూపుతారు). అపుడు నేను దానిని క్రిందికి లాగేదాన్ని ఎందుకనంటే అది... అది యదార్థంగా నా మనుగడకు కారణం గనుక.

అది నా మొట్టమొదటి జ్ఞాపకం — అయిదేళ్ళ వయస్సులో, దాని ప్రభావం, బుద్ధి మీద గాక యెక్కువగా నైతికత మీద పడింది. అయినప్పటికీ అది బౌద్ధికానికి సంబంధించిన రూపాన్ని కూడా తీసుకొంది... చూడూ, నేను పైకి యితర పిల్లల లాంటిదాన్నే కాకపోతే కొంచెం మొండిఘటాన్ని. మొండి అంటే అర్థం, ఆహారం మీద ఆసక్తి లేదు, సాధారణ ఆటల మీద ఆసక్తి లేదు, చిరుతిళ్ళ కోసం స్నేహితుల యిళ్ళకు వెళ్ళడం యిష్టం లేదు, ఎందుచేతనంటే, కేకులు తినడం అంటే అసలే మాత్రం ఆసక్తి వుండేది గాదు! నన్ను శిక్షించడం చాలా కష్టం, నిజంగా దాన్ని నేను లెక్కచేసేదాన్ని కాదు, ఎందుకనంటే తినడానికి నాకేం పెట్టకపోవడం ఒక శిక్ష గాదు. ఒక ఉపశమనం. చదవడం నేర్చుకోవడం నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చేదాన్ని. నేర్చుకోడానికి నిరాకరించేదాన్ని. నాకు స్నానం చేయించలేక చాలా కష్టపడేవారు, ఎందుకనంటే నన్నొక ఆంగ్ల ఉపాధ్యాయురాలి రక్షణలో పెట్టారు, అంటే చన్నీళ్ళ స్నానాలు — నా సోదరుడు దాన్ని తేలికగా ఆంగీకరించాడు, కాని నేను గగ్గోలు పెట్టేదాన్ని! కాని తరువాత చన్నీళ్ళ స్నానం నాకు మంచిది కాదని తెలిసింది

(అని వైద్యుడు చెప్పాడు) కాని అది చాలా కాలం తర్వాత. కాబట్టి ఇప్పుడు నీకు అసలు దృశ్యం తెలిసిందిగా!

నా బంధువులతో గాని, ఆటలాడే తోటిపిల్లలతో గాని, లేక స్నేహితులతో గాని ఏదైనా బాగుండకపోతే, అంతా అసహ్యంగా, లేక దుస్సహంగా అనిపించేది — అన్ని రకాలైన అల్పమైన వికారం కలిగించే విషయాలు వచ్చి పడేవి. (నేను కొంచెం సున్నిత మనస్తత్వం గలదాన్ని, ఎందుకనంటే, జీవితానికి సంబంధించిన పరిస్థితులన్నీ తిరస్కరిస్తూ వుండే, సౌందర్య, సామరస్యాల ఆదర్శం నాకు సహజంగా, పుట్టుకతోనే అబ్బింది)... కాబట్టి నాకు విచారం కలిగినపుడు మా అమ్మకు, నాన్నకు తెలియకుండా జాగ్రత్త పడేదాన్ని, ఎందుకనంటే వాళ్ళు నన్ను చెప్పనివ్వరు పైగా మా అమ్మ చివాట్లు పెట్టేది — మొట్టమొదట ఆమె చేసే పనెప్పుడూ అదే. అందుకని నా గది లోనికి పోయి, నా చిన్ని కుర్చీలో కూర్చొని అక్కడ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ యేకాగ్రత నిలుపుకొనేదాన్ని... నాదైన రీతిలో. నాకు గుర్తే, కొన్నిసార్లు బహుశా విఫల ప్రయత్నాల తర్వాత, నాకు నేనిలా చెప్పుకొంటూ చాప చుట్టేసేదాన్ని, "నిజంగా నిన్ను కలత పెట్టేటట్లు ఫలానా ఫలానావాళ్ళు యేదో అన్నారని నీకు విచారం కలిగింది కదూ — కాని దానికే యేడ్వాలా? ఎందుకంత విచారంగా వున్నావు? అసలు చెడ్డవాడతనే గదా, అందుచేత అతడేడుస్తుండాలి. నీ వతని కేమీ చెడు చేయలేదు... అతని కేమైనా అసహ్యమైన విషయాలు చెప్పావా? ఆమెతో లేక అతనితో తగాదా పడ్డావా? లేదు కదూ, నీవేం చేయలేదు కదూ! అయితే సరే నీవు విచారించాల్సిన పని లేదు. ఏదైనా చెడు చేస్తే మాత్రమే విచారించాలి, కాని..." అక్కడితో ముగిసేది. నేనెప్పుడూ యేడ్వలేదు. ఒక స్వల్ప ఆంతరిక చలనం లేదా 'యేదో' "నీవేం తప్పు చేయలేదు" అని అనేది, ఇహ విచారం వుండేది కాదు.

కాని ఈ 'యేదో' కి మరో పార్శ్వం కూడా వుంది. అది నన్ను అధికారికంగా గమనిస్తూ వుండేది, నేనొక్క మాట చెప్పగానే, లేదా యేదైనా అధికంగా చేసినా, ఒక చెడు తలంపు రాగానే, మా సోదరుడిని ఆట పట్టించినా లేక మరేదైనా, ఎంత చిన్న విషయమైనా అది (కఠిన స్వరంతో) "జాగ్రత్తగా వుండు" అని హెచ్చరించేది. మొదట్లో దీనిని నిశ్శబ్దంగా యెదిరించేదాన్ని, కాని నెమ్మది నెమ్మదిగా అది నాకు బోధించింది: "విచారించొద్దు — సరిచేసుకో, చక్కదిద్దుకో". పరిస్థితులు

చక్కబడినపుడు — దాదాపు యెప్పుడూ చక్కబడేవి — నేనలా చేసేదాన్ని. అదంతా కూడా యేడు సంవత్సరాల వయస్సుగల బిడ్డస్థాయి గల తెలివితేటల్తో జరిగేది.

కనుక, అదీ చేతన అంటే.

తరువాత నేర్చుకోవడం, అభివృద్ధి చెందడం దశ వచ్చింది, కాని అది సాధారణ మానసిక స్థాయిలో — బడి కెళ్ళిన కాలంలో. జిజ్ఞాస, చదవను, వ్రాయను కోరిక కలిగించింది. అదెలా జరిగిందో చెప్పనా? దగ్గర దగ్గర యేడు సంవత్సరాల వయస్సప్పుడు, యేడు సంవత్సరాలకు కొంచెం తక్కువ వయస్సులో, నా కంటె 18 నెలల పెద్దవాడైన మా అన్న బడి నుండి తనతో పాటు పెద్ద చిత్రాలను యింటికి తీసుకొచ్చేవాడు (చిత్రాల క్రింద శీర్షిక లుండే, పిల్లల కోసం తయారుచేసే చిత్రాలు మీకు తెలుసుగా యీ కాలంలో వాటిని వాడుతున్నారు) వాటిలో ఒక దాన్ని నా కిచ్చాడు. "ఏం వ్రాసి వుందక్కడ?" అని అడిగాను. "చదువుకో" అన్నాడు. "ఎలాగో నాకు తెలియదు" నా సమాధానం. "అయితే నేర్చుకో". "సరే, అక్షరాలు చూపించు". ఒక ఎ, బి, సి, పుస్తకం కొనితెచ్చిపెట్టాడు. రెండు రోజుల్లోనే తెలుసుకొన్నాను, మూడో రోజున నేను చదవడం మొదలుపెట్టాను. అలా నేను నేర్చుకొన్నాను. "ఓహ్ ఓహ్ ఈ అమ్మాయి చాలా వెనకబడి పోయింది!" అన్నారు. "ఏడేళ్ళు అయినా చదువలేకపోతోంది — ఎంత చిన్నతనం!" అన్నారు. మొత్తం కుటుంబమంతా అసంతృప్తి చెందారు. ఇక చూడండి నేను నేర్చుకొని తెలుసుకోవాలంటే సంవత్సరాలు పట్టేదాన్ని ఒక్క వారంలోనే తెలుసుకున్నాను — అది వాళ్ళను ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొనేటట్లు చేసింది.

ఇప్పుడు పాఠశాలలో గడిపిన కాలం: నేను తెలివిగల విద్యార్థిని, దాని కున్నదొక్కటే కారణం, నేను అర్థం చేసుకోవాలనుకోవడం. ఇతరులు చేసేటట్లు కంఠతా పట్టి నేర్చుకోవడంలో నాకు ఆసక్తి లేదు. విషయాలను అర్థం చేసుకోవాలనుకొనేదాన్ని. నా కెటువంటి జ్ఞాపకశక్తి వున్నదో తెలుసా, శబ్దాలు, రూపాల విషయంలో అద్భుతమైన జ్ఞాపకశక్తి వుంది! కేవలం రాత్రి పూట ఒక పద్యాన్ని బిగ్గరగా చదివేదాన్ని, తెల్లవారేటప్పటికి అది నాకు తెలిసిపోయేది. నేనేదన్నా ఒక పుస్తకాన్ని అధ్యయనం చేసినా లేక చదివినా, అందులోంచి యెవరైనా ఒక భాగాన్ని గురించి చెప్తే "అఁ అవును – అది ఫలానా పుటలో వుంది" అని చెప్పేదాన్ని. అది ఆ పుటలో

వుండేది. ఏదీ మాసిపోయేది కాదు, అదంతా ఇంకా తాజాగానే వుంది. కాని ఇది అభివృద్ధికి సంబంధించిన సాధారణ కాలం.

అప్పుడు చాలా చిన్న వయస్సులో (యెనిమిది లేక పది సంవత్సరాల ప్రాంతంలో) నా చదువుతో పాటు బొమ్మలు వేయటం మొదలుపెట్టాను. పన్నెండేళ్ళొచ్చే సరికల్లా రేఖాచిత్రాలు వేయగలిగేదాన్ని. కళ, సౌందర్యాలకు సంబంధించిన అన్ని పార్శ్వాలూ, కాని ప్రత్యేకించి సంగీతం, చిత్రలేఖనం నన్ను పరవశింప జేసేవి. ఆ కాలంలో నేను తీవ్రమైన ప్రాణిక అభివృద్ధిని సాధించాను. నా చిన్నతనంలో లాగానే, ఒక ఆంతరిక దివ్యమార్గదర్శి సాన్నిధ్యంతో అది సాధ్యమైంది. సమస్తానికీ కేంద్రం అధ్యయనాలు. ఇంద్రియానుభూతులు, పరిశీనల అధ్యయనం, సాంకేతిక అధ్యయనం, తులనాత్మక అధ్యయనాలు రుచి, వాసన, శ్రవణాలతో వ్యవహరించే పరిశీలనలను మొత్తం అధ్యయనం చేయడం — అనుభవాల ఒక రకమైన వర్గీకరణ అది. ఇది జీవితపు అన్ని పార్శ్వాలకు విస్తరించింది., జీవితం తీసుకురాగలిగిన అనుభవాల కన్నింటికీ విస్తరించింది., అవన్నీ — విచారాలు, సంతోషాలు, యిబ్బందులు, బాధలు ప్రతిదీ — ఓహ్, మొత్తం అధ్యయనాల క్షేత్రమే! ప్రతిదాన్ని గురించి అభిప్రాయ మేర్పరచుకొంటూ, నిర్ణయిస్తూ, వర్గీకరిస్తూ, సర్దుబాటు చేస్తూ, వ్యవస్థీకరిస్తూ లోపల అంతరంగంలో ఈ మార్గదర్శకత్వం వహిస్తూ ఈ సన్నిధి వుండేది.

నేను థియోన్‌ను కలుసుకొన్నపుడు సచేతన యోగం ఆకస్మిక ప్రవేశం అనుభూతమైంది; అప్పుడు నా వయస్సు ఇరవై ఒకటి. జీవితాని కర్థమే మారిపోయింది. ఆసక్తికరమైన మార్మిక ఫలితాన్నిస్తూ ప్రాణికం అభివృద్ధితో ఒక అనుభవాల పరంపర చోటు చేసుకొంది.

తరువాత తీవ్రమైన మానసిక అభివృద్ధి, అత్యంత సంపూర్ణతకు చెందిన మానసిక అభివృద్ధి జరిగిన కాలం వుంది. దర్శనా లన్నింటినీ, భావగారడీ అంతా అ యా వ్యూహాల లోతులకు పోయి, వాటిపై అవగాహన పెంచుకొనే సవివరమైన అధ్యయనం కొనసాగింది. పది సంవత్సరాల తీవ్రమైన మానసిక అధ్యయనాలు నన్ను చేర్చాయి... శ్రీఅరవిందుల దగ్గరకు.

అలా, ఇంత సన్నద్ధతతో జరిగింది. ఇదంతా కూడా చేతనతో జరిగిందని చెప్పడానికి మాత్రమే ఈ వివరాలన్నీ మీకు తెలియజేస్తున్నాను. (చేతన అంటే

యేమిటో నాకు బాగా తెలుసు, దానిని గురించి వివరించడానికి ఏ మాటా లేక భావమూ నాకు తెలియనప్పుడే చేతన అంటే యేమిటో తెలుసు) చేతన దాని క్రియాశక్తి అంటే కార్యనిర్వహణా విధానానికి సంబంధించిన క్రియాశక్తితో జరిగింది. ఆ తర్వాత ప్రాణికాన్ని గురించిన సవివరమైన అధ్యయనం, లోతైన అభివృద్ధి జరిగింది. సమస్త భావాలతో యెచట గారడీ చేయవచ్చో, అ పతాక స్థాయీ వరకు పోయే మానసిక అభివృద్ధి జరిగింది. భావనలన్నీ సత్యమే, వాటిని సమన్వయం చేయవలసి వుంది, ఆ సమన్వయాని కావలగా ప్రకాశవంతమైనది, సత్యమైనదేదో వుంది అని అది వరకే అవగాహన కందిన ఒక పురోభివృద్ధ్యాత్మక దశకు చేరుకొన్నాను. వాటన్నింటి వెనుక ఒక నిరంతర చేతనా స్రవంతి వున్నది. నేనిక్కడి కొచ్చేనాటికి నేనున్న దశ. నేను శ్రీఅరవిందుల దగ్గర కొచ్చేనాటికి, అనుభవాల ప్రపంచమే నాదైంది, ఊర్ధ్వంలోనూ, అంతరంగంలోనూ దైవంతో సచేతన యేకత్వాన్ని పొంది వున్నాను — అదంతా కూడా సచేతనంగా సాక్షాత్కారమైంది, దానిని జాగ్రత్తగా లిఖించడం లాంటివి జరిగిపోయాయి.

అదే గ్రంథం: 47-51

అనువాదం: కె. వి. రావు



రోగము – నివారణ

శ్రీమాత ప్రవచనములు

అఖిల


అఖిల భారత పత్రిక

మార్చి 2015

రోగము — నివారణ

శ్రీమాత ప్రవచనములు

స్వస్థత చెందడం మంచిది.
అస్వస్థతను వర్జించడం ఉత్తమం.
శ్రీమాత



ఆశ్రమ ఆయుర్వేదిక విభాగములో శ్రీమాత

ఉపోద్ఘాతము

"శరీరం ఖలు ధర్మసాధనం" అన్నారు. బాగానే వుంది. కాని కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈ పాంచభౌతిక శరీరం అతి సుకుమారమైనది; వాతావరణ మార్పులనే తట్టుకోలేదు; ఇక ఆరోగ్యం సంగతి చెప్పనే అక్కరలేదు. ఈ దేహం రోగపీడితము. ఎన్ని రకముల వ్యాధులు దానిని బాధపెడతాయో లేక్కలేదు. "వైద్యోనారాయణో బ్రహ్మ" అన్న సూక్తి ననుసరించి దైవమే అందరికంట గొప్ప వైద్యుడని తెలుస్తోంది. మానవజాతి ఇంకా శైశవదశలోనే ఉన్నది. అది పరిపక్వము కావాలి. దేవుడు ఈ జాంతవికశరీరాన్ని ఇలా వదిలివేసేయడు గదా! ఈ సృష్టిని పరిణమింపచేసేందుకై తన శక్తిని ఈ భూలోకంలోకి పంపించాడు. దానిని మనము గుర్తించాలి. గ్రహించాలి. మనలో క్రియాశీలము గావించాలి. సుఖసామరస్యములతో తులతూగే దివ్యదేహమును పొందుటకిదే ఏకైక మార్గము.

సంపాదకుడు

1

భూలోక చరిత్రలో మన మిపుడొక మంచి ముహూర్తంలో, ఒక యుగసంధిలో వున్నాము. అనంతకాల వాహినిలో ఇది ఒక్క క్షణమే కావచ్చుకాని మానవజీవితంతో పోల్చిచూచినట్లైతే ఎక్కువే. ఒక నూతన సృష్టి రాబోతోంది. ఈ నూతన సృష్టి కోసం భౌతిక పదార్థం మారుతోంది. కాని మానవశరీరం తన జడత్వమువలన ఈ మార్పును తట్టుకోలేక దానిని ప్రతిఘటిస్తోంది. తత్కారణంగా ఇంతవరకు కనివిని ఎరుగని కొత్త కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. అవి వైద్యులకు కూడా లొంగుటలేదు.

దీనికి పరిష్కారమేమిటో కనుక్కోవాలి. సృష్టిని పరిణమింపజేస్తున్న ఆ దివ్యశక్తులతో మనం సహకరించాలి. ఎంతో నిశ్చలంగా, ప్రశాంతంగా, విశ్వాసపూర్వకంగా ఆ శక్తులను మనలోకి ఆహ్వానించాలి!

(CWM Vol. 16, p. 421)

భయమే మూలకారణం

వ్యాధికి భయమే మూలకారణమట. వైద్యులు వ్యాధులకు ఏవేవో కారణాలు చెప్పవచ్చు. కాని నిజమైన కారణం నీ అవచేతనలో దాగివుంటుంది. నీకు జబ్బు నయం కావాలంటే నీ జబ్బును గురించి అదేపనిగా ఆలోచించకూడదు. దైవానుగ్రహము వున్నది కనుక నీకింక భయమెందుకు? నీ సంరక్షణ అంతా ఆ దైవానికే వదిలేసేయాలి.

సంపాదకుడు

2

నీ బాధ లన్నిటికీ మూలకారణం భయమే. అందుకని నువ్వసలు భయపడకూడదు. నిజానికి నూటికి తొంభైపాళ్ళు రోగాలన్నిశరీరంలో దాగివున్న భయంనుంచే ఉత్పన్నమౌతాయి. శరీరానికి ఎంత చిన్నబాధ కలిగినా "అయ్యో ఏమైపోతుందో బాబోయ్" అని శరీరగత చైతన్యము ఆదుర్దాపడుతూ వుంటుంది. నీకు దైవానుగ్రహంలో నమ్మకం లేదనీ, నీ సమర్పణ ఇంకా అపరిపూర్ణంగా ఉన్నదని చెప్పేందుకు

ఇదే తార్కాణం! ఇక ఏమి జరుగనున్నదోనని దానికొకటే భయం. ఈ భయాందోళనల నేమాత్రం రానివ్వకూడదు.

నీ సుప్తచైతన్యంలోని భయం పైకి వచ్చినప్పుడు అది జబ్బుగా పరిణమిస్తుంది. అయితే నువ్వాభయాన్ని జయించగలవు. దైవానుగ్రహమనేది ఒకటి నిన్ను కాపాడుతోందనే విషయము నీ మనస్సుకు తెలుసు. అయితే అది నీ శరీరానికి కూడా తెలియాలి. నీ మనస్సుతో దానికి నచ్చచెప్పాలి. ఆ దైవానుగ్రహము నీలోను, నా లోను మనందరిలోను పనిచేసి మనని ఓ అద్భుతమైన స్థాయికి తీసుకుపోతుందనే విశ్వాసం నీ శరీరానికి కూడ కలగాలి. అది దైవేచ్ఛకు ఆధీనమైపోవాలి.

ఈ పాంచభౌతిక దేహాన్ని అచేతననుండి తప్పించి చైతన్యవంతం చేయాలి. మూలములో తను దైవమే అని, దైవము తన యందు చేయు ప్రక్రియకు అడ్డుతగల కుండా వున్నయెడల తన కేమియూ హాని జరగదనే నమ్మకం దానికి కలిగించాలి; భయం పూర్తిగా పోయేంతవరకు మళ్ళీమళ్ళీ ఈ ప్రక్రియను కొనసాగించాలి. అప్పుడు ఒక వేల జబ్బు చేసినా కూడ అది ప్రాథమిక స్థాయిలోనే ఉండి, వెంటనే తగ్గిపోతుంది.

(CWM Vol. 15, p. 151; 152)

3

నీకు జబ్బు చేసినప్పుడు ఏమాత్రం భయపడకుండా, నదురు బెదురు లేకుండా దానిని ధైర్యంగా ఎదుర్కోవాలి. వ్యాధి అనేది ఒట్టి తప్పుడుస్వరూపం అని, అది శరీరంయొక్క నిజస్వరూపమేం కాదనీ తెలుసుకోవాలి. “దైవానుగ్రహం నా యందుండి నన్ను రక్షిస్తున్నప్పుడు అది నన్నేం చేయగలదు?” అనే గాఢమైన నమ్మకంతో ప్రశాంతంగా వుండాలి. అప్పుడు నీ అంతరంగంలో నిక్షిప్తమైన దైవానుగ్రహము నీ అగాధాలలోకి కూడా చొరబడి నీ రక్తకణములను ఉద్దీపింప చేస్తుంది. అప్పుడా కణములు కూడా నిత్యాసత్యానందముల ననుభవించగలవు.

*

వ్యాధి నయమగుటకు రెండే రెండు నిబంధనలున్నవి. ఒకటి నిర్భయత్వము... భయం ఛాయలు కూడ నీ మీద పడేందుకు వీలులేదు. దైవసంరక్షణలో సంపూర్ణ

విశ్వాసము రెండవది. ఈ రెండు నిబంధలు తప్పనిసరి.

(CWM Vol. 15, p. 152; Vol.14, p.93)

4

నీ వేమాత్రమూ విచారించరాదు. దానిని గురించి అసలు ఆలోచించనే ఆలోచించకూడదు. ఒకవేళ ఆలోచించావో, దాన్ని నీవు ఆకర్షిస్తున్నావన్నమాట! ముఖ్యంగా నువ్వు భయపడినట్లయితే వ్యాధి ముదిరిపోయే అవకాశ మెక్కువవుతుంది. అలా కాకుండా నీవు పూర్తిగా జబ్బును గురించి మర్చిపోయి మరో పనిలో నిమగ్నమై నట్లయితే నీ జబ్బు నయమయ్యే అవకాశం ఎక్కువవుతుంది.

అలా కాకుండా నీవు పూర్తిగా జబ్బును గురించి మర్చిపోయి పనిలో నిమగ్నమై నట్లయితే నీ జబ్బు నయమయయ్యే అవకాశం ఎక్కువవుతుంది.

*

నీకు జబ్బు చేసినపుడు అందరి కళ్ళు నీమీద, నీ జబ్బుమీద ఉంటాయి. అందరు నిన్నెంతో శ్రద్ధగా చూస్తున్నప్పుడు నువ్వు నిన్ను నయం చేయగల అసలైన వైద్యుణ్ణి మరచిపోతావు. దేవుని సహాయం కోరాలని నీకు తట్టనే తట్టదు. "అందరూ నా మీద ఎంత శ్ధాభిమానాలు ఒలకపోస్తున్నారో చూసావా! ఈ రోగం రావటం కూడ ఒకందుకు మంచిదేలే" అనే ఘోరమైన యిరకాటంలో పడిపోతావు!

*

ఈ అల్పాల్పవిషయాలతో నువ్వు సతమతమైపోకూడదు. అవి అంత ముఖ్యమైనవేమీ కావు. వాటి పనల్లా నీలో మారుమూల దాగియున్న చీకటి ప్రదేశాలను ఎత్తి చూపటమే. నువ్వు ఆ చీకటిని చూసి, వెలుగును చూపించి ఆ అజ్ఞానాంధకారాలను పారద్రోలేం దుకే అలా జరుగుతుంది.

(CWM Vol. 15, p. 154; 155, 148, 145)

అనువాదం: డా. ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

ఆరోగ్యం: నువ్వు దానిని గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా ఆ విషయాన్ని దైవానికే వదిలివేసేయాలి.

జబ్బులను గురించి తలుచుకోకూడదు

మనది పాంచభౌతిక శరీరము. బాధలకు తట్టుకోలేదు. తీవ్రమైన దాడులకు అసలే తట్టుకోలేదు. మనిషిలో భయమేర్పడుతుంది. భయంవలన నువ్వే 'బాధ' అనే ఒక అవస్థను సృష్టిస్తావు. అది నిన్ను వేదిస్తూ వుంటుంది. కారణంవున్నా సరే, లేకపోయినా సరే. అలా కాకుండ నీ చేతనను ఎప్పుడూ అత్యుత్తమస్థాయిలో ఊర్ధ్వోన్ముఖముగా ఉంచిన యెడల నిన్నే జబ్బులు అంటవు. నీకే బాధారాదు.

సంపాదకుడు

5

కొన్ని శారీరకమైన బాధలు భరించడం చాలా కష్టమని మనం తరచు వింటూనే వుంటాము. అందుకని ముందరే మనకి భయం వేస్తుంది. అంతటితో ఆగదు. ఆ భయం ఒక సూక్ష్మరూపాన్ని సృష్టిస్తుంది. ఏమాత్రం అవకాశమున్నా అది బైటికి వచ్చి నిజంగా ఏ కారణం లేకపోయినా కూడ నిన్ను బాధపెడుతుంది.

సరే, నిజంగా బాధ కలిగిందనే అనుకుందాము. అప్పుడు నీ చైతన్యాన్ని ఊర్ధ్వదిశగా అనగా భగవంతునివైపుకి మరలించినట్లైతే, ఆ బాధ మాయమవుతుంది. అధోదిశగా అనగా అజ్ఞానంవైపుకు మరలిస్తే, బాధ కలగటమే కాదు. అది ఎక్కువవుతుంది కూడా. ఈ ఊర్ధ్వ, అధోముఖ ప్రయోగాలవలన నీ కొక విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. బాదకు శారీరక రుగ్మతతో ఎలాంటి ప్రమేయం లేదని, శారీరక పరిస్థితి ఏ విధమైన మార్పుచెందక నిలకడగా ఉన్నప్పటికీ, శరీరానికి కలిగే బాధ తీవ్రతరం కావచ్చు. లేదా అసలు బాధ అనేదే లేకపోవచ్చు. అంతా నీ చేతనాస్థాయిని బట్టి ఉంటుంది. చేతనను దైవోన్ముఖం చెయ్యటం అన్నిటికంటె మంచి పద్ధతి. అది వీలుకానియెడల నీ ఆలోచనలను బాధవైపు గాక, మరో పనిమీదగాని, నీకు ప్రియమైన వేరే విషయంపైకి గాని మరల్చినట్లయితే ఆ బాధ ఉపశమిస్తుందని చెప్పవచ్చు.

మనస్సును బాధనుండి దైవంవైపుకి మరల్చినప్పుడు ఆ బాధ తగ్గడమే కాకుండా, శరీరావయవాల్లోని ఏ లోపమయినా సులభంగా సరిచేయబడుతుంది. ఇదియే దైవత్వంలో ఉండే 'సత్' స్వభావం. ఈ విశ్వాసానికి ఆవల, పైన, వెనుక, అంతటా

ఆవృతమైవున్న స్వచ్ఛమైన పరతత్త్వం. దానితో సంబంధం పెట్టుకున్నట్లయితే మనం అన్ని దైహికబాధలను అధిగమించవచ్చు.
(CWM Vol. 15, pp. 156,157,158)

అనువాదం: ఏ. కైలాసపతి

6

బిడ్డా! ఇది నీ విశ్వాసానికి పరీక్షా సమయము, ఎన్ని కష్టాలు వచ్చినప్పటికి అది చెక్కు చెదరకూడదు. "నాకు జబ్బు తప్పకుండా తగ్గిపోతుంది." అనే గట్టి నమ్మకం కనక ఉన్నట్లయితే నీ జబ్బు నిజంగా మాయమైపోతుంది.

*

జబ్బు తగ్గవలెనంటే శాంతిసహనాలు చాలా అవసరం. జబ్బు తప్పకుండా తగ్గిపోతుందనే గట్టి విశ్వాసంతో ప్రశాంతంగా వుండాలి.

*

ప్రశాంతంగా వుంటూ ఏకాగ్రతవహించి, ఊర్ధ్వంనుండి ఏతెంచే దివ్యశక్తిని తన పనిని వారు చేయడానికి వదలడం స్వస్థత చేకూర్చడానికి నిశ్చితమైన మార్గం. ఈ ప్రక్రియయను సరైన సమయంలోఅవసరమైనంతవరకు దృఢమైన విశ్వాసంతో గట్టి సంకల్పంతో సక్రమంగా చేసినట్లయితే దానిని ఏ అస్వస్థత నిరోధించలేదు.
(CWM Vol. 15, pp. 161, 160, 172)

అనారోగ్యాన్ని ఆదరించకు. అప్పుడే అది నిన్ను వదులుతుంది.

7

ఎవరైతే దైవానికి సంపూర్ణంగా చిత్తశుద్ధితో అర్పించుకొని దైవానుగ్రహం మీద అచంచల విశ్వాసం కలిగి ఉంటారో అటువంటివారి విషయంలో జబ్బు చాలా ఆశ్చ ర్యకరమైన రీతిలో తగ్గిపోవచ్చు. కాని ఆమెలో ఆ లక్షణాలేమీ లేవు. ఆమె పూర్తిగా భయం. కోరికలు, కోరుకున్నది జరిగితీరాలనే పట్టుదలతో ఉంది. ఆమె నిరంతర ధ్యాస బాహ్యశరీరం మీదనే. పైగా అవి తన అవసరాలే అని డబాయిస్తుంది. ఇది చిత్తశుద్ధితోకూడిన అర్పణ కాదు గదా, దానికి పూర్తిగా విరుద్ధమైన విషయం.

*

ప్రపంచంలోని భౌతికవాదం, వాస్తవికతా దృక్పథావాదాలన్ని కూడ ప్రజలు దైవానుగ్రహాన్ని విస్మరించటం మూలాన ఏర్పడ్డవే. వారి వ్యాధి నయం అయితే "నన్ను నేనే నయం చేసుకున్నాన" ని అనుకుంటారు. ఏదయినా పురోభివృద్ధి జరిగితే, ఏదయినా ప్రణాళికను రూపొందిస్తే ఘంటాపథంగా 'నేనే దానిని చేసాన' ని విర్రవీగుతారు. అలాగే చాలా మంది మరేదైనా చేసినా కూడా అంతే. వారు కనుక అంతరంగంలోకి దృష్టి సారిస్తే అప్పుడు వారికి, వారేమీ చేయలేదని, అంతా దైవశక్తే చేస్తున్నదని తెలుస్తుంది.

*

My dear Child, వైద్యులను, మందులను మించిన మహాశక్తి ఒకటి ఉందనే మాట నిజమే. నీవు దాని మీద ప్రగాఢమైన విశ్వాసం ఉంచుతున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఆ శక్తే ఎన్ని కష్టాలొచ్చినా, ప్రమాదాలెదురైనా నిన్ను తప్పకుండా రక్షిస్తుంది. నీ విశ్వాసాన్ని పదిలంగా ఉంచుకో. అంతా సవ్యంగా జరిగిపోతుంది.

(CWM Vol. 15, p.165; vol. 4, p. 279; vol. 15, pp. 169,164)

ఎంత మొండి జబ్బైనా సరే దైవానుగ్రహంతో అది నయమైపోవలసిందే!

8

జయించి తీరాలనే ఇచ్ఛను నీలో జాగృతం కావాలి. కేవలం మనస్సులోనే కాకుండా నీ శరీరంలోని ప్రతి కణంలోను అది భాసించాలి. అది లేకుండా నీవు ఏమీ చేయలేవు. శారీరకమైన రుగ్మతను జయించాలనే ఇచ్ఛ నీలో వుంటే తప్ప ఎన్ని మందులు వేసుకున్నా అవి నిన్ను నయం చేయలేవు.

నిన్ను ఆవహించిన దుష్టశక్తి (adverse force) ని నేను నాశనం చేయగలను. వెయ్యిమార్లు చెయ్యగలను. కాని ప్రతిసారి నీలో ఒక ఖాళీ ఏర్పడుతుంది. అనేక శక్తులు లోపలికి తోసుకువచ్చేందుకు కాచుకొని వుంటాయి. ఏదో ఒకటి నీలోకి ప్రవేశిస్తుంది. అందుకని నేను చెప్పేదేమంటే జయించితీరాలనే ఇచ్ఛను జాగృతం చేసుకో.

*

నేను అతనికి చేయగలిగినదంతా చేస్తున్నాను. కాని అతను అదే పనిగా తాను జబ్బుపడ్డట్టుగా అనుకుంటున్నాడు. అతనెప్పుడూ ఆ ఆలోచనలతో సతమతమవుతూ, తన చుట్టూ ఒక బలమైన అస్వస్థత రూపాన్ని కల్పన చేసుకున్నాడు. ఈ విధమైన రూపకల్పనవల్ల అతను నానుంచి సహాయం అందుకో లేకపోతున్నాడు. దాన్ని కనక అతను వదిలివేస్తే, జబ్బు సగం తగ్గినట్లే. అప్పుడు అతన్ని నయం చేయడం తేలిక అవుతుంది.

(CWM Vol. 15, pp.158,166,159)

అనువాదం: డా. టి. ప్రసన్నలక్ష్మి

శరీరం స్వస్థత చెందేది, అది స్వస్థతచెందాలని నిర్ణయించుకున్నప్పుడు.

శాంతియే పరమౌషధము

శాంతినైశ్చల్యములు నీ మనస్సుకే కాదు, శరీరానికి కూడ వుండాలి. అప్పుడు నీ మనస్సే కాకుండా శరీరంకూడ కుదుటపడి దైవానుగ్రహమును గ్రహించగలుగుతుంది.ఇక రోగములు దాని నంటవు. తలనొప్పికి, కడుపులోనొప్పికి కూడ ఇదే మందు. నీ శరీరబాధ్యతను పూర్తిగా దైవానికి అప్పచెప్పుటయే పరమోత్తమమైన మార్గము.

సంపాదకుడు

9

వ్యాధులను గురించి నేను చెప్పే ఏకైక హితవు — 'శాంతి' ని నీలోకి ఆహ్వానించాలి — అంతే. ఎలాగైనా సరే, మనస్సును దైహికచింతన నుండి దూరం చెయ్యాలి. శ్రీఅరవిం దులవారి గ్రంథములు చదువు లేక ధ్యానము చేయి. అప్పుడే దైవకృప చక్కగా పని చేయగలదు. మందులు శరీరమునకు నమ్మికను మాత్రమే యివ్వగలవు.

*

అంతరంగంలోని ప్రశాంతతను పట్టుకొని దానిని శరీరకణాలలోకి కూడా చొప్పించాలి. అప్పుడు శరీరము శాంతినిస్తుంది. ఆరోగ్యము చేకూరుతుంది.

*

(కడుపునొప్పి ప్రేగుల జబ్బుతో బాధపడుతున్న ఓ సాధకునికి)

అది విశ్రాంతి లేనందువలన ఆందోళన చెందుతున్నందు వలన. అసలు సంగతేమిటి? జీర్ణాశయంలోకి శాంతిని, దివ్యప్రశాంతతను తీసుకొనిరా, అప్పుడు అంతా బాగుపడుతుంది.

*

తలనొప్పి తలతిరుగుడు – ఇలాంటి విషయాలను నివారించటమంత కష్టమేం కాదు. ఆ బాధ ఎంత భరించలేనిదైనప్పటికీ పైనుండి ఒక జ్యోతిని ఆహ్వానించండి. ఆ వెలుగు పైనుండి నీ శిరస్సులోనికి చొచ్చుకొనివచ్చి నిన్ను శాంతపరచగలదు. గట్టి పట్టుదలతో చేసినయెడల, ఈ తలనొప్పి, తలతిరుగుడు లాంటివన్ని చిటికలో మాయమైపోతాయి.

(CWM Vol. 15, pp.161,163,176)

10

అనారోగ్యం పాలవుటకుగాని ఆకస్మికంగా గాయపడుటం గాని, ఒక అపరాధం చేసినందు కోసం అనుభవించవలసిన శిక్షకు ఎలాంటి సంబంధం లేదు, అది ఒక పొరపాటుతో, ఒక సంపూర్ణ ఫలితం దక్కనందుకో సహజంగా సాధారణంగా తప్పక కలిగే పర్యవసానం. నిజానికి ప్రపంచంలో ప్రతి విషయం కూడ సామరస్యతతో కూడినది లేదా అన్నదానిపై ఆధారపడి వుంటుంది. సామరస్యతతో కూడిన స్పందనలు మధురమైన సంఘటనలకు దారితీస్తాయి, వాటికి ప్రోత్సాహ కాలపుతాయి. సామరస్యతలోపించిన స్పందనలు ఒక విదంగా పరిస్థితులను లోపభూయిష్టం — చేస్తాయి అనారోగ్యం, ఆకస్మికగాయాలు, మొదలగు అవాంఛనీయసంగటనలకు దారితీస్తాయి.

ఇదే నివారణ.

(CWM Vol. 16, pp.323-24; Vol. 15, pp.162,147)

11

మనిషి అంతరంగ పరిస్థితులే శరీరంలో అనారోగ్యానికి కారణాలు. ఆ దోషములను పరిహరించి పరిస్థితులను బాగుచేసినప్పుడుకానీ వ్యాధి పూర్తిగా, శాశ్వతంగా నిర్మూలం కాదు.

*

మనిషిలోని ఏదో ఒక అంగముయొక్క తప్పుడు భంగిమ వలననే శరీరంలో ఆ విభాగం దెబ్బతింటుంది.

*

మనకి సమత నేర్పేందుకే శారీరకబాధలు కలుగుతూ వుంటాయి. ఆ బాధలకు లొంగిపోకుండ మనలో ఇంకా పరిశుద్ధంగా భాసిస్తున్న విభాగాలను మనకి ఎత్తి చూపించేందుకు ఇలా జరుగుతుంది. సమతయే అనారోగ్యానికి మందు.

ముఖ్యమైన సూచన — సమత యనగా జడత్వము కాదు.

*

ఈ తికమకలు, గందరగోళం బదులు దివ్యసత్యమును, సామరస్యమును ఆహ్వానించు టయే మేలైన మార్గము.

*

దివ్యమైన సామరస్యత దివ్యానందములు పరమసత్యము. క్రమరాహిత్యము, దుఃఖము అంతా అసత్యము.

(CWM Vol. 15, p. 149,167, 176,172)

అనువాదం: సునీతిపంతులు

కోరికల వలన ముప్పు

కాన్సర్ ఎందుకని వస్తుంది? దీనికి అసలు కారణం యేమిటి? లోభత్వమే దీనికి అసలు కారణము. ఇది న్యాయమే కదా! నీది వున్నదాంతో తృప్తిపడే స్వభావం కాదు. ఇంకా ఇంకా కూడబెట్టుకోవాలని, భోగభాగ్యములు పెంచుకోవాలని ఉంటుంది. కాని అది నీ శరీరములో కొన్ని భాగముల పరిణామమును పెంచి వ్యాధిగా పరిణమిస్తుంది. అయితే ఈ కోరికలను ఎలా జయించాలి? అనేదే ప్రశ్న. "నీకు చేతకాకపోతే నన్ను పిలు" అని శ్రీమాత ప్రవచనము. మనిషి ఆరోగ్యానికి సౌమ్యంగా ఉండటము చాలా ముఖ్యము. అలాకాక ఇతరులను విమర్శిస్తూ వాళ్ళతో ఘర్షణ చెందుతూవుంటే నీ జీర్ణకోశం దెబ్బతిని, ఆరోగ్యం చెడిపోతుంది.

సంపాదకుడు

12

నీకు జబ్బు తగ్గాలంటే దురలవాట్లను, దుష్టవర్తనను మానేసేయాలి. ముష్టికోరికలను నీలోనుంచి పూర్తిగా బహిర్షరించాలి. ఎందుకని? కోరికలు నీ అవయవాలను రెచ్చకొట్టి వాటిని సరిగ్గా పనిచేయనీయవు కనుక. నీకు ఆరోగ్యం కావాలంటే ఇటువంటి పిచ్చివేషాలన్నింటినీ మానేసి నీ అంతరంగాన్ని పూర్తిగా ప్రక్షాళనము గావించాలి! ఒకవేళ నువ్వు ఆ పని చేయలేకపోతే నన్ను పిలు. నేను వెంటనే వచ్చి, నీకు సహాయపడగలను. నా సహాయముతో జయించలేనిది ఏమీ లేదని నీవు చెప్పినమాట ముమ్మాటికీ నిజం. అయితే నువ్వు నా సహాయమును చిత్తశుద్ధితో కోరి నేను నీలో చేయు

క్రియలను అన్ని పరిస్థితులలోనూఆమోదించాలి.

*

నీలో ఏదో దోషముండబట్టే మాంసపుగడ్డలు పెరుగతాయి. కొన్నికణములు ఇతరకణములతో పొత్తు కుదరక స్వతంత్రించి విపరీతంగా పెరిగిపోతాయి. మనిషిలో లోభత్వాన్ని సూచించేందుకు ఇంతకంటే తార్కాణం ఏమి కావాలి? అధికారం కోసం ప్రాకులాట. లౌకికసంపదల కోసం ఆశ, లేక సూక్ష్మ మైన కోరికలు ఇవన్నీ కూడ మనిషిలో లోభత్వాన్ని సూచిస్తాయి.

(CWM Vol. 15, p. 159,176,160)

13

ఆదునిక వైద్యశాస్త్రం చాలా విచిత్రమైనది. నిన్నటి ఔషధము నేడు విషము. అటులనే నేటి ఔషధములు భవిష్యత్తులో విషయములు కావని గ్యారంటీ ఏమున్నది? నేనొక ఫ్రెంచి డాక్టరుని. సుమారు 40,50 ఏళ్ళ క్రింద కలిసాను. ఆయన రోగులకు అలంకారికంగా వాడుకలో నున్న వివరణాపద్ధతినే అవలంబించు. అప్పుడైతేనే అది నీకు స్వస్థత నిస్తుంది. అని సలహా ఇచ్చేవాడు.

(CWM Vol. 8, p. 363-64; Vol.15,p. 156)

14

'ధమ్మపద' లో ఒక మంచి సూక్తి ఉన్నది. నీవెప్పుడూ దయగా సౌమ్యంగా ఉన్నట్లయితే నీకేవిధమైన బాధ కలుగదు. నవ్వుతూ, సంతోషంగా ఉన్నట్లైతే నీ సంతోషాన్ని నలుగురికీ వెదజల్లు తావు కూడ.

ఈ సందర్భంలో నేనొక విషయం నీకు గుర్తు చేస్తాను. నీ జీర్ణశక్తిని మనస్సులోని ఆలోచనలమీద ఆధారపడి వుంటుంది. కోపంతో చిందులు తొక్కుతూ ఎవరితోటీ ఏకీభవించకుండా ఎప్పుడూ కీడే ఎంచేవాళ్ళు కొంతమందివుంటారు. అట్టివారి జీర్ణకోశం దెబ్బతింటుంది. తిండి వంటబట్టదు. అప్పుడేమవుతుంది? ఏముందీ, ఏం అవ్వాలో అదే అవుతుంది. జీర్ణశక్తి చెడిపోవటం వలన వాళ్ళింకా కోపంగా ఇంకా క్రూరంగా

తయారవుతారు. మరి దీనికి పరిష్కారమో? ఒకటే మార్గం. నిన్ను నీవు పూర్తిగా నియంత్రించుకోవాలి. నిరంచరం నిన్ను నీవు గమనించుకుంటూ, సర్వస్వమైన సౌహార్ధ, సౌభ్రాత్ర, సర్వస్వములు నీలో వెల్లివిరుస్తూ వున్నట్లైతే నీ జీర్ణశక్తి బాగు పడుతుంది. దాంతోపాటు నీ ఆరోగ్యం కూడ కుదుటపడుతుంది.

(CWM Vol. 3, p. 292, Vol. 15, p. 175)

అనువాదం: డా. ఆర్.ఎల్. ఎన్.శాస్త్రి

దుష్టశక్తులు పొంచి వుంటాయి జాగ్రత్త!

తమాషా ఏమిటంటే నీ ఊహలే నీకు జరిగే ప్రమాదాలకు, బాధలకు కారణాలు. నీ ఊహలూరికే పోవు. అవి ఒక ప్రతిమారూపాన్ని సృష్టిస్తాయి. కొన్నాళ్ళకి ఆ ప్రతి రూపమే నిజరూపమౌతుంది. నిన్ను పీక్కొని తింటుంది. మంచివిషయాలను గురించి ఆలోచించినప్పుడు మంచి పర్యవసానమే కలుగుతుంది. నీ శరీరానికి కూడా తనదైన చైతన్యమొకటి వుంటుంది. దానిని నీవు ప్రేరేపించి సన్మార్గంలో పెట్టాలి. నీ మనస్సుతో దానిని ఏడిపించకూడదు.

– సంపాదకుడు

15

అస్వస్థతకు కారణాలు

అస్వస్థతను కలిగించే కారణాల్లో రెండు ముఖ్యమైన వాటిని గుర్తించాలి – అంతర్గతమైనవి, బాహ్యమైనవి. అంతరంగంలో ఒకచోట ప్రతిఘటించే స్వభావం ఉన్నా లేక ఒక భాగం దైవరక్షణకు స్పందించకపోయినా కలిగే స్థితి ఒకటి. ఏదో ఒక అంశం ఏరికోరి దుష్టశక్తులను ఆహ్వానించినా అస్వస్థత కలుగుతుంది. ఈ విధమైన పోకడలు ఏ కొద్దిగా ఉన్నా కూడ దుష్టశక్తులు నీ మీద పడి అనారోగ్యాన్ని కలుగజేస్తాయి.

నీలోనూ, నీ పరిసరాల్లోనూ వ్యాధికారక అంశాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఇంకా అన్ని వ్యాధులనూ కలిగించగల సూక్ష్మజీవులు నీతోబాటుగా ఉంటూనే ఉంటాయి. కాని వ్యాధులు అకస్మాత్తుగా వచ్చిపడటానికి కారణం ఏమిటో తెలియదు? దానికి ప్రాణశక్తి నీరసించిందిలే అని నువ్వు సమాధానం చెప్పుకుంటావు. ఆ నీరసం

ఎక్కడనుంచి వచ్చిందట? అసలైన కారణం వ్యక్తిలోని అసామరస్యం. దివ్యశక్తులను గ్రహించలేకపోవడమని నేను చెపుతాను. నీ జీవాధారమైన ఓజస్సునూ, తేజస్సునూ ప్రతిఘటించి వాటితో సంబంధాన్ని తెంపేసుకుంటే అలా జరుగుతుంది. దీన్ని వైద్యపరిభాషలో నిరోధకశక్తి లోపించడమంటారు. అది ప్రతికూలశక్తులకు అను కూలమవుతుంది. ఈ విధంగా ఓజశ్శక్తినీ తేజస్సునూ తెంపేసుకోవడం ఎందుకు జరుగుతుందంటే నీలో అనుమానం, వ్యాకులత, ఆత్మవిశ్వాసలోపం, స్వార్థపరత్వం పెరగటంవల్లనే అని చెప్పాలి. ఇవన్నీ అస్వస్థత కలిగించే బాహ్యకారణాలు. అంతేకాని సూక్ష్మక్రిములు వ్యాధులకు కారణంకావు.

(CWM Vol. 3, pp. 55-56; Vol. 15, p. 239)

16

ఊహించడమంటే మనసుతో సృష్టిచేయడమే కాబట్టి ఊహాకల్పనలను అవాస్తవాలని కొట్టిపారేయకూడదు. ప్రతి ఒక్క కల్పన కూడ మానసికస్థాయిలో వాస్తవమే! ఉదాహ రణకు ఒక నవల ఇతివృత్తం తీసుకుంటే అది భౌతికపరిధితో సంబంధం లేకపోయినా మానసిక స్థాయిలో ఒక ఉనికిని పొందింది కదా. మనందరం కూడా కొద్దిగానో, గొప్పగానో కల్పన చేయగల కథకులమే. నిజం చెప్పాలంటే మన జీవితం చాలావరకు మన ఊహలకు భౌతికంలో ప్రత్యక్షరూపాల్నిస్తూటుంది. ఎప్పుడైనా మనసు చిక్కబడలేక భయాందోళనకు లోనై వాటికి రూపమిచ్చి ఆపదలనూ, ప్రమాదాలనూ ఊహిస్తే నీ భవిష్యత్తును నువ్వే పాడుచేసుకుంటున్నావన్న మాట. అలాకాకుండా మంచిగా ఆలోచిస్తూ, మంగళకరమైన ఊహలు చేస్తే నీ ఆశయసిద్ధికి అవకాశాలు మెరుగుపడ తాయి. ఈ సత్యాన్ని బాగా అర్థం చేసుకున్న 'కూయే' మహాశయుడు రోగులలో ఆశాజనక మైన ఊహాశక్తిని పెంపొందించడం ద్వారానే రోగనివృత్తి చేసేవాడు. ఆయన దగ్గరకు ఒక వనిత వచ్చి వెంట్రుకలు రాలిపోతున్నాయని గోలపెడితే ఆ విధంగానే సలహా ఇచ్చాడు. ఆ సలహా మేరకు ఆమె ప్రతి రోజూ తను బాగుపడుతు న్నట్లు, తన శిరోజాలు చక్కగా పొడుగ్గా పెరుగుతున్నట్లు ఊహించుకోవడం మెదలు పెట్టింది. అలా రోజంతా తనకు తాను నమ్మచెప్పుకుంటూంటే ఆమె జుట్టు చక్కగా

ఆశ్చర్యం కలిగేటట్లు పెరిగింది. అదంతా స్వయంబోధనా మహాత్యమే.

(CWM Vol. 3, p. 156; Vol. 14, p. 186)

17

శరీరం వ్యాధిగ్రస్తమైనప్పుడు మందులు వాడవచ్చు. ఆ మందులు తగుపరిమాణంలో ఉండి అదనంగా లోనికి విషపదార్థాలు చేరనంతవరకూ దేహానికి విశ్వాసం కలిగించటానికి సహాయపడతాయి అంతే. కాని రోగనివారణ చేసేది మందులు కావు. శరీరమే తన వ్యాదిని నివారించుకుంటుంది. అది బాగుపడాలనుకున్నప్పుడు దానంతటదే వ్యాధినివారణ జరుగుతుంది. ఈ విషయాన్ని ఆధునికవైద్యులు కూడా ఇప్పుడు గుర్తిస్తున్నారు. "మా మందులు కొంతవరకు పనిచేస్తాయి. కానీ వ్యాధి నివారణ కావాలని నిశ్చయించేది మాత్రం శరీరమే". మందు వాడేటప్పుడు అది "ఇక నాకు బాగైపోతుంది" అనుకుంటుంది. అంతే! నివారణ జరుగుతుంది.

మందులు పని చేయవని కాదు. కానీ మితిమీరి వాడినప్పుడు అవి వికటించి మనిషిని పూర్తిగా నీరసింపచేస్తాయి. ఒకటి తగ్గితే దానికంటే ప్రమాదమైంది ఇంకోటి వస్తుంది. ఏది వచ్చినప్పటికీ కొంత ప్రయోజనం ఉంటుంది. దేహానికి కొంత విశ్వాసం కల్గిస్తాయి. ఇవి వాడాను కాబట్టి ఇక ఏమీ పర్వాలేదు. అనే నమ్మకం ఏర్పడి బాగుపడటానికి నిశ్చయించుకుంటుంది. బాగవుతుంది.

*

ఔషధానికి నివారించే గుణాన్ని కల్పించేది రోగి నమ్మకమే.

భగవంతుని కరుణాకటాక్షాలకుగల స్వస్థతాశక్తియందు మానవులకు సంపూర్ణవిశ్వాస ముంటే అది ఎన్నో వ్యాధులను అరికట్టగలదు.

(CWM Vol. 9, p. 123; Vol. 10, p. 325; Vol.5, p.383)

నీ అనారోగ్యంకోసం దివ్యానందాన్ని రాబట్టుకోవటం విస్మరించకు. ఎందుకంటే, ఏ అనారోగ్యానికైనా భగవత్పర మైన దివ్యానందాన్ని జ్ఞప్తికి తెచ్చుకొనుట, దానికై ప్రయత్నించుటకూడ కొంత ఊరటనిస్తుంది.

శ్రీమాత

“నేను చేయగలిగిననదంతా చేశాను. అయినా ఆ జబ్బు అలాగే ఉంది. అందుకే అన్నీ మానేశాను” అని నువ్వెప్పుడైతే చెపుతావో అప్పుడు నీవు చేయగలిగినదంతా చేయలేదని ఒప్పుకుంటున్నట్లే. అన్నీ చేస్తున్నప్పటికీ దోషం మిగిలి ఉందంటే నీలో ఇంతకాలం అణిగి లోపలున్నది పైకుబికి నీ పీకల మీదికి వచ్చిందన్న మాట. అప్పుడిక చేయవలసిందల్లా నీ అంతరంగంలోకి చూసి అక్కడున్న చీకటికోణాలన్నిటినీ వెతికి వాటిపైన ఒకింత ఆర్ధ్రిత వెలుగు ప్రసరింపచేయి. దానితో అవి సడలిపోయి నిన్ను విడిచి పెట్టేస్తాయి. నీవు అసాధ్యమనుకున్నప్పటికీ అదే ఆచరణ సాధ్యమనీ, ఆచరించవలసినదీ అని తెలుసుకో. అలా వాటిని వదిలేస్తే ఎంతోకాలం నిన్ను పట్టి పీడించగల రోగాన్ని ఒక్క నిముషంలో వదిలించుకోగలవు. అలా అని నేను మాట ఇవ్వగలను. కాని ఇది నీ నిజాయితీ మీద, విశ్వాసం మీదా ఆధారపడి ఉంటుంది. దాన్ని వదిలించుకోవాలని నిజంగా మనస్ఫూర్తిగా అనుకుంటేనే జరుగుతుంది.అదే న్నిటికీ వర్తిస్తుంది. చిన్నచిన్న శరీరబాధలు మొదలు తీవ్రమైన మానసిక రుగ్మతులదాకా ఇదే మార్గాన్ని అనుసరించి దూరం చేసుకోవచ్చు. సాధారణంగా నీ చైతన్యంలో కొంతభాగం “నాకీ బాధలు వద్దు” అనుకున్నప్పటికీ లోపలున్న అనేక భాగాలు మాత్రం అలా స్పందిచక నిర్లిప్తంగా ఉండిపోతాయి. పైగా జరిగేదేదో జరగనిమ్మని ఊరుకుంటాయి. అదంతా అజ్ఞానమే. స్వస్థతపొందవలసిన అవసరం ఉందని అవి అనుకోవు. లోకంలో జరిగేదంతా మంచే అని వాటి నమ్మకం.

(CWM Vol. 4, pp. 74, 108, 09)

ఒక అనారోగ్యంకారణంగా దెబ్బతిన్న శరీరంలోని ప్రత్యేక భాగమేదైతే వున్నదో అది అంతరంగంలో చోటు చేసుకొన్న సామరస్యతా లోపానికి సూచిక.

19

నీ శరీరానికే ఒక విధమైన అభిలాష ఏర్పడవచ్చు. తన వివిధ భాగాలు సమస్థితిలో తక్కగా ఉండి, ఒక రకమైన సమత ఏర్పడాలని కాంక్షించవచ్చు. ఆ విధంగా ఉండి వ్యాధిని దరిచేరకుండా చూచుకోవచ్చనీ, ఒకవేళ నీ కన్ను గప్పి ఏదైనా లోనికి ప్రవేశించినా వెంటనే దాన్ని నిరోధించి శరీరం స్వస్థతగా, సామరస్యంగా విధులు నిర్వహించేటట్లు చేసుకోవచ్చని అనుకోటమే దైహిక ఆకాంక్ష.

మనసు ఆలోచించినంతసేపూ శరీరానికి తనకంటూ ఒక చైతన్యం లేకుండా మూడువంతులు జడమయంగానే ఉండేపోతుంది. కాని సరీరానికి తనదైన చైతన్యం ఒకటి ఉంది. అది మనసుతో సంబంధం లేకనే తనను గురించిన ఎరుక కలిగి ఆకాంక్షతో నిండి ఉంటుంది. మన శరీరాన్నిగురించి మనం ఆలోచిస్తూంటే ఆసమయంలో దైహిక చైతన్యంలో లేనట్లే. తను పనిచేసే తీరుతెన్నులు దేహానికి బాగా తెలుసు. తన సమతాస్థితి ఎప్పుడుంటుందో, ఎప్పుడు అసమతౌల్యం కలుగతుందో దానికి తెలుసు. దేహంలో ఏ భాగంలోనైనా రుగ్మత కలిగితే ఏ చిహ్నాలు లేక పోయినా ఆసంస్పర్శ ద్వారా అది అనుభవించి తెలుసుకుంది. శరీరప్రక్రియలన్నీ సామరస్య పూరితంగా, సమతులంగా, జరగవలసిన రీతిలో జరిగిపోవటం దాని ఎరుకలో ఉంటుంది. అటువంటప్పుడు అది నిండుదనం, సంపూర్ణత పొందుతుంది. జీవించడం లోని ఆనందమేనన్నట్లు నల్లేరు మీద బండి సాగిపోతున్నట్లు నిలకడగానూ, నిండుగా శక్తివంతంగా జరిగిపోతుంది.

(CWM Vol. 5, pp. 293-94, 168)

> శరీరానికి భయం పొగొట్టాలంటే కఠినమైన క్రమశిక్షణ ఉండాలి. లేకపోతే దేహకణాలు వణికిపోతాయి. క్రమశిక్షణ ద్వారాను, యోగంవలనా భయాన్ని పొగొట్టుకోవాలి.

సాధారణమైన పరిసరాల్లో సాదాగా పెరుగుతూ, డంబదర్పాదులకు తావు లేకుండా, మనసును క్రుంగతీసే చదువులు లేకుండాపెరిగినప్పుడు నీకు జీవితంపై సంపూర్ణ విశ్వాసముంటుంది. చిన్న తనంలోనే కాకుండా కొంచెం పెద్దదై ముప్పయి ఏళ్ళు వచ్చేదాకా కూడా ఆవిధమైన విశ్వాసం నీకుంటుంది. ఇంకా నీ చుట్టూ గాబరా కల్గించే మనుషులూ ఏ కాస్త జలుబు చేసినా హడావడి పడి డాక్టర్లు, మందులు అని పరిగెత్తేవాళ్లు లేనప్పుడు సాధారమ పరిస్థితుల్లో నీకేదైనా సుస్తీ చేసినా, ప్రమాదం జరిగినా కూడా నీకేమీ కాదు. నీ శరీరమంటే నీకు మంచి విశ్వాసముండటంవల్ల అదే పోతుందిలే అని అనుకుంటావు. అలాగే పోతుంది కూడా. అది ఏదైనా తగ్గిపో తుంది. ఆవిధమైన విశ్వాసం కొంత మంది చాలాకాలం నిలుపుకుంటారు. శరీరానికి సహజమైనస్థితి అదే. జీవితమంటే సంపూర్ణమైన విశ్వాసముంటే నూటికి తొంభై తొమ్మిదిసార్లు ఏం వచ్చినా నివారణ జరిగిపోతుంది. ఏదైనా కొంచెం వచ్చినప్పటికీ అది ముదిరిపోదు.

అనారోగ్య వాతావరణంలో ఉన్నప్పుడు అంటే నీ దగ్గరున్న వాళ్ళంతా దుర్ఘటన లను, ఆపదలను గురించి ఎక్కువగా మాట్లాడుతూ వుంటే వాతావరణమంతా కలుషితమై పోతుంది. అప్పుడు సహజంగా నీ ఆలోచనలు కూడా పెడత్రోవపడతాయి. ఆ ఆలోచన ప్రభావం శరీరంపై పడుతుంది. అంతే తప్ప మామూలుగా నలభై యాభై ఏళ్ళు వచ్చేదాకా కూడా శరీరానికి మంచి ఆత్మ విశ్వాసముంటుంది. కొంతమందికి ఇంకా ఎక్కువ కాలమే ఉండొచ్చు. వారికి సాధారణంగానే జీవితం సమతౌల్యంగా గడపటం తెలిసి ఉంటుంది. నిజానికి శరీరానికి తన జీవితంపై మంచి నమ్మకం ఉంటుంది. దాన్ని చెడగొట్టేది ఆలోచనలు, ఆలోచనల మూలంగానే అనారోగ్యం, జబ్బులు అనే భావనలు ప్రవేశించి అంతా పాడైపోతుంది.

దానికి నిరపేక్షమైన విశ్వాసం అవసరం.

చైతన్యవంతమైన విశ్వాసం వేరు. భగవత్కటాక్షంలో విశ్వాసముండటమే చైతన్యవంతమైన విశ్వాసం. భగవంతుడు సర్వకాల సర్వావస్థలల్లోను తమను కాపాడతాడని విశ్వాసమున్న వారూ, ఆ విశ్వాసాన్ని ప్రతి నిముషం మరవకుండా మననం చేసుకునే వారూ అపాయాలు వచ్చినా సురక్షితంగా బయటపడతారు.

ఎన్ని కష్టాలు వచ్చినా చెక్కుచెదరకుండా ఉంటారు.
(CWM Vol. 5, pp. 297-98, Vol. 6,p. 340)

చేతనా స్థాయిలో మార్పు

నీ ఆరోగ్యం నీ చేతులలోనే వున్నది. ముందర నీ అంతరంగంలో ఆరోగ్యానికి సంబంధించిన చైతన్యమును పొందాలి. దానిని బాహ్యశరీరంలోకి చొప్పించాలి. కాని ఈ మనస్సు ఎంత చెడ్డదంటే అదెప్పుడూ కీడునే తల పెడుతూ వుంటుంది. ఒకసారి ఒక సాధకుడు శ్రీఅరవిందులకు ఈ విషయాన్నే విన్నవించుకున్నాడు. అప్పుడాయన తన సూక్ష్మ హస్తముతో అతని తలలో నుంచి దానిని తీసిపారవేయడం జరిగింది.

— సంపాదకుడు

21

ప్రశ్న: ఎవరైనా తన శారీరక లోపాలను సరిచేసుకోవాలని గానీ, దేహపరిస్థితిని బాగు చేసుకోవాలనిగానీ వ్యాధి నివారణ పొందాలని గానీ అనుకున్నప్పుడు ఏం చేయాలి? తను ఆశించిన ఫలితంపై ఏకాగ్రత వహించి తన సంకల్ప బలాన్నంతా వినియోగించాలా లేక దైవశక్తిని నమ్ముకొని ఎప్పుడో ఒకప్పుడు ఆ దైవమే తన పద్ధతిలో నెరవేరుస్తాడులే అనే విశ్వాసంతో ఉండాలా?

లక్ష్యం ఒక్కటే కాబట్టి సందర్భానుసారంగా వివిధ మార్గాల్లో ఫలితం సాధించవచ్చు. అన్నిట్లోకి ఫలప్రదమైనది ఏదీ అంటే అది నీ చేతనా స్థాయిని బట్టి, నీ సామర్థ్యంపైనా ఆదారపడి ఉంటుంది. పూర్తిగా నయమైపోయినప్పటి చైతన్యంగానీ మారిపోయినప్పటి చైతన్యంగాని నీలో ఉండవచ్చు. అప్పుడు నీలో ఉత్పన్న మైన శక్తి ద్వారా బాహ్య శరీరంలో కూడా మార్పు తీసుకునిరావచ్చు లేక ఈ విధమైన మార్పులు చేయగలశక్తిని గురించిన అవగాహన, దాన్ని ఉపయోగించగల నేర్పు నీకుంటే దాన్ని కావలసిన చోట వినియోగించి మార్పు తీసుకొని రావచ్చు. ఇది ఒక పద్ధతి. ఇదికాకపోతే నీ కష్టాన్ని దైవానికి విన్న వించుకొని ఆయన శక్తిపై విశ్వాసముంచుకో. నిన్ను బాగుచేసే బాధ్యతను ఆయనకే అప్పగించవచ్చు.

అయితే ఏం చేసినప్పటికీ ఏ పద్ధతి నవలంబించినప్పటికీ అందులో నీకెంత నైపుణ్యం ఉన్నప్పటికీ ఫలితాన్ని మాత్రం దైవానికే వదిలివెయ్యాలి. నీ ప్రయత్నం నీవు చెయ్యవచ్చు కానీ అది ఫలించటం, ఫలించకపోవటం మాత్రము దైవనిర్ణయమే. నీకర్తవ్యం అంతవరకే. ఫలితం కనిపిస్తే అది కేవలం దైవశక్తే గానీ నీ ప్రయత్నం ఎంత మాత్రముకాదు. ఇటువంటి విషయాలన్నీ భగవంతుణ్ణి కోరవచ్చా కోరకూడదా అనే కదా. నీ అనుమానం? శరీరగత లోపాలను తొలగింపచేయమని వేడుకోవటంలో ఔచిత్యమున్నది కదా. ఏమి కోరినప్పటికీ ఏప్రయత్నాలు చేసినప్పటికీ నీ శక్తియుక్తులన్నీ ఉపయోగించి చేస్తున్నప్పటికీ ఫలితం దైవకృపవల్లనే లభిస్తుందని తెలుసుకో. యోగమార్గాన్ని అనుసరించాలని నిశ్చయించుకున్న తర్వాత ఏం తేస్తున్నప్పటికీ అంతా సమర్పణ భావంతోనే చెయ్యాలి.

"ఇదే నా ఆకాంక్ష ప్రభూ! నాలోని లోపాలు తొలగించుకోవాలని నా శ్రాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ఫలితాన్ని నీకే వదిలివేస్తున్నాను. అంతా నీ దయ తండ్రి" అని అనుకోవాలి.

ప్రశ్న; "ఫలితముంటుందనే నా నమ్మకం. నాకు కావలసినదాన్ని నా దైవం తప్పక ప్రసాదిస్తాడు" అనుకోవటం మంచిదేనా?

అలాగే అనుకో. ప్రగాఢమైన నీ విశ్వాసాన్ని బట్టి నీవు తలచిన కార్యంపై భగవంతుని ఆమోదముద్ర పడిందని తెలుస్తుంది.అంచంచలమైన విశ్వాసమెక్కడుందో అక్కడే దైవసంకల్పమున్నట్లు అనుకోవచ్చు.

ప్రశ్న: "పూర్తిగా స్వస్థత చెందినప్పటి చైతన్యం" అంటే ఏమిటి?

అంటే సంపూర్ణ స్వస్థత పొందినప్పటి స్థితికి అనురూపంగా ఉండే స్థితి అన్న మాట. విడమర్చి చెప్పాలంటే పూర్తి స్వస్థత చెందటానికి ఏమి అవసరమని నీ ఊహ ప్రకారం మనసులో స్థిరరూపం ఏర్పడి ఉంటుందో దాని స్వరూపమన్న మాట. అదే సంపూర్ణ స్వస్థత చెందినప్పటి చైతన్యం అంతేకాని ఒకానొక చైతన్యసథితిని పొందితే స్వస్థత లభిస్తుందని మాత్రం కాదు.

(CWM Vol. 3, pp. 96-97, Vol. 5, p. 292)

దైవానుగ్రహమునందు అచంచలమైన విశ్వాసము కలిగి యుండుటకన్న మిన్నయైన మార్గము లేదు

సాధారణంగా విధి విరామం లేకుండా మనసులో ఆలోచనలు చెలరేగుతూ ఉంటాయి. వాటిని వదిలించుకోలేక మనుషులు పిచ్చెత్తిపోతూంటారు. ఒకాయన తల్లోనుంచి ఆ ఆలోచనలను శ్రీఅరవిందులు తొలగించడం నేను స్వయంగా చూశాను. అతను ఆలోచనలు తనను బాధపెడ్తున్నాయని శ్రీఅరవిందులతో చెపుతూండేవాడు. ఒకరోజు శ్రీఅరవిందులు తన చెయ్యి చాచి అతని తలలో ఆడుతున్న ఆ అంశాన్ని పురుగుని తీసినట్లు తీసిపారేశారు. ఇక అంతటా ప్రశాంతత, వెలుగు ఆయన ఏం మాట్లాడకుండా అలా చేయటం స్పష్టంగా కనిపించింది. అలాగే మరొకసారి విపరీతమైన బాధతో ఒక సాధకుడు వస్తే అలాగే శ్రీఅరవిందులు తన సూక్ష్మహస్తంతో గందరగోళం సృష్టిస్తున్న ఆ రాక్షసని తీసేశారు. (శ్రీమాత అభినయించి చూపుతారు)

*

వ్యాధి నివారణకు రెండు ఆధ్యాత్మిక మార్గాలున్నాయి. సత్యచైతన్యముల శక్తిని వ్యాధి సోకిన భాగంపై ప్రసరింపచేయడం ఒకటి. ఇలా చేసినప్పుడు ఫలితం వ్యక్తి యొక్క గ్రహణశీలతపై ఆదారపడి ఉంటుంది. శరీరానికి గ్రహించగలస్థితి ఏమాత్రం లోపించినా అనారోగ్యపరిస్థితి కల్పించిన మానసికాంశాన్ని కనుక్కొని దానిమీద పనిచేయాలి. ఇంకా కారణంశంపైనా, కార్యంపైనా ఒకేసారి పనిచేయగలిగితే, ఆ కారణాంశం కనక గ్రహణశీలకంగా ఉంటే రోగి సంపూర్ణంగా, శాశ్వతంగా స్వస్థత పొందుతాడు.

(CWM Vol. 9, 254; Vol..4 pp. 264-65)

స్వేచ్ఛానువాదం: డా. ఎ.ప్రభావతి, డా. వెంకటరామశాస్త్రి)

రోగాలకు మూలకారణం భయమే. భయాన్ని పోగొట్టుకుంటే రోగం మాయమైపోతుంది.

మంత్రములు మహిమాన్వితములు

"మంత్రాలకు చింతకాయలు రాలుతాయా" మొదలైన సామెతలను మనము మరీ అంత తేలికగా కొట్టిపారేయకూడదు. ఈ విషయాలు అనుభవరీత్యా తెలుసుకోవలసినదే. నువ్వు కదలకుండా కూర్చుని ధ్యానం చేసినప్పుడు నీ అంతరంగంలో నుంచి కొన్ని శబ్దములు వినపడవచ్చు. నీ మనస్సులో ఆలోచనలు తగ్గిపోయి సందడి సద్దుమణిగినప్పుడు నీ ఆత్మకు నోరు విప్పే అవకాశం వస్తుంది. నీకేదో వినబడుతుంది. అది నీ ఆత్మ పలికే భాష — నీ మంత్రం, నిన్ను రక్షించి కాపాడే తంత్రం. నువ్వు సచేతనుడవైనప్పుడు నీకు ఏ ఆపద వచ్చినా నీలోంచి ఓ మంత్రం పెల్లుబికి వచ్చి నిన్ను రక్షిస్తుంది.

— సంపాదకుడు

ఆపత్సమయంలో మంత్రోచ్చారణ అలవాటు చేసుకుంటే అద్భుతమైన ఫలితం కనిపిస్తుంది. ఏ మంత్రం వల్లించాలో నీకే తెలుస్తుంది; కష్టసమయంలో నీలోకి పెల్లుబికివచ్చి ఏమీ తోచని ఏమీ చేయని నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా నీకు స్ఫురిస్తుంది. కాని గుర్తు పెట్టుకొని కష్టాన్ని ఎదుర్కొవలసివచ్చినప్పుడల్లా వల్లించుకున్నట్లైతే అది అలవాటైపోతుంది. ఉదా: నీ వొంట్లో నలతగా ఉన్నట్లనిపిచిందనుకో — ఏం జరగబోతుందో, ఏం జరగబోతుందో అని ఆదుర్దాపడుతూ వుంటావు. అటువంటి సందర్భాలలో అది అయాచితంగా నిన్ను ఆదుకుంటుంది. అది రెండు మూడు శబ్దములకూర్పు కావచ్చును. అది నీ ఆత్మస్వరూపము. నీ లోపలినుంచి పెల్లుబికివచ్చేమంత్రం ఆ మంత్రం వల్లించినప్పుడల్లా నీలో ఒక పవిత్రమైన వాతావరణం ఏర్పడుతుంది. అప్పుడు నిన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఎంతటి ప్రమాదం వచ్చినా ఒకవేళ ఎవరైనా నిన్ను చంపేందుకు వచ్చినా కూడ నీకేం కాదు. అయితే ఏ మాత్రం భయపడకుండా వుండాలి. గజగజావణికిపోకూడదు. నీకేవిధమైన (మానసిక, ప్రాణిక, భౌతిక, సాంవేదిక) కష్టమొచ్చినా ఆ మంత్రశబ్దం నీలోంచి పెల్లుబికి వస్తుంది. నువ్వీ విధమైన ప్రక్రి.ను అలవర్చుకొన్నట్లయితే ఇకమీదట అది అప్రయత్నముగానే జరుగుతుంది. అప్పుడు నువ్వే చూస్తావు. నీకు ప్రమాదం.

ఎదురైనప్పుడల్లా నీ జిహ్వపై ఆ మంత్రం దానంతట అదే తారాడుతుంది. అప్పుడు ఫలితాలెంత అద్భుతంగా ఉంటాయో నీవే చూస్తావు.

*

నువ్వు హాయిగా నిద్రపోవాలంటే వెల్లకిలా పడుకోని నీ నరాల్ని కండరాల్ని ఏ మాత్రం బిగువు లేకుండా సడలించాలి. ఓ మెత్తని గుడ్డపీలికలా శరీరం తేలికగా వున్నట్లు అనిపించాలి. అదుపు లేని ఆలోచనలతో నిరంతరం పనిచేసే మెదడులోని కణజాలంవల్ల వ్యక్తి అలసిపోవడం కద్దు. కనుక ఏ విధమైన స్పందనలు గాని, యే వత్తిడిలేని పరిపూర్ణ ప్రశాంతతతో కూడిన విశ్రాంతి అవసరం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే.

తరువాత శిరస్సు మొదలు సిరిపాదం వరకు బాహ్యాభ్యంతర భాగాలన్నింటినీ నిర్మలం చేసుకొని, నిరహంకార నిరామయస్థితిలో సంపూర్ణ ఆత్మసమర్పణ చేసుకుని మంత్రం జపించడం మొదలుపెట్టాలి. ఆ మంత్రమే నీ హృదయంనుండి పెల్లుబికి ఒక ప్రార్థనగా వస్తుంది. కొంతసేపటికి మగతగా అనిపించి ఆ తరువాత ప్రశాంతంగా నిద్రపోతావు.

(CWM Vol. 4 pp, 389-90; Vol.15,p. 399)

సూక్ష్మదేహాన్ని ఛేదించి వ్యాధి ప్రవేశించుట

24

దైహిక కారణాలవల్లనో, మానసిక కారణాలవల్లనో, బాహ్యాంతరంగ కారణాలవల్లనో అస్వస్థత కలిగిందనుకో. అది పైకి వచ్చే ముందర లోపలిపొరల్లోనే రక్షాకవచమై రక్షిస్తున్న ఒక పొరను తాకుతుంది. ఈ పలుచని పొరని తేలికైన శరీరభాగం నాడీ కవచం అని వేరువేరు పేర్లతో పిలుస్తూ వుంటారు. అది వేడివస్తువుల చుట్టూఉండే ఉష్ణతరంగాలవలె కనపడీ కనపడకుండా వుంటుంది. బాహ్యజగత్తుతోడి సంపర్కమంతా దీని ద్వారానే జరగాలి. ఏ ఆపద వచ్చినా కూడా అది ముందర ఈ పొరను ఛేదించి నీలోకి ప్రవేశించాలి. ఈ కవచం ఉన్నంత వరకూ కలరా, ప్లేగు, మశూచి, వంటి ఎంత భయంకరవ్యాధులున్న ప్రాంతాలకైనా నీవు నిర్భయంగా వెళ్ళవచ్చు.

ఎటువంటి వ్యాధినైనా ఎదుర్కొని అది నీకు రక్షణ నిస్తుంది. అయితే ఈ విధ్యను కొంచెం ప్రయత్నం చేసి నీవు నేర్చుకోవాలి. నీకా పొరను గురంచి తెలిసినపుడు దాని అభిజ్ఞతిని పొందినపుడు బైటనుంచి ఏదైనా ఒక స్పందన వచ్చి ఆ పొరను తాకినట్లైతే నీకు వెంటనే తెలిసిపోతుంది. ఒక వార్నింగు వస్తుందన్నమాట. అది నిన్ను వ్యాధులనుంచి, ప్రమాదాలనించి రక్షిస్తుంది. అందుచేత దీనిచే పూర్తిగా అచ్ఛాదించబడి వున్నట్లైతే శరీరం అన్ని రుగ్మతలనుంచి కాపాడబడుతుంది. కాని విసుగు, అసంతృప్తిలాంటివి యే కొంచెమైనా చాలు. దీనిని గాటు పెట్టడానికి ఏ చిన్నగాటు పడినా వ్యాధి శరీరంలోకి ప్రవేశించవచ్చు. సరియైన ప్రాణిక సమతుల్యత వల్లనే వ్యాధి నిరోధకశక్తి పెంపొంది యెటువంటి వ్యాధులు దరిచేరవని వైద్యశాస్త్రం సహితం చెబుతుంది. చాలా సాధారణ జీవితం గడుపుతున్నవారిలో కూడా చాలామందికి ఎంత తినాలి? ఎంతసేపునిద్రపోవాలి? అన్న అవగాహన వుంటే వారికి నాడీకవచం సుదృఢంగా వున్నదనుకోవాలి. అందుచేతనే వారు యెటువంటి వ్యాధి బారిన పడకుండా వుంటారు. ఈ రక్షాకవచంలో బలహీనమైన కేంద్రాన్ని గమనించి జాగ్రత్తపడి, కొద్దిసేపు ధ్యానంచేసిఆ శక్తిని ఆవాహన చేసినట్లయిన పరిస్థితి చక్కబడుతుంది. అంతర ప్రశాంతత చాలు దానిని నిరోధించడానికి.

(CWM Vol. 3, p. 89; Vol.4, p. 63; Vol. 3, p. 88)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

25

ప్రశ్న: వ్యాధులు సూక్ష్మశరీరం ద్వారా మనలోకి ప్రవేశిస్తాయి. వాటిని నిరోధించటమెలా?

సుతిమెత్తని ఇంద్రియజ్ఞానంవలన వ్యాధి సూక్ష్మశరీరాన్ని తాకి లోనికి ప్రవేశించే ప్రయత్నం అనుభావ్యమౌతుంది. స్పష్టంగా స్పృశించినట్లు తెలియకపోయినా ఏదో ఒక అవ్యక్తభావన కలుగుతుంది. నిరాకరించగలిగే శక్తి అప్పటికి ఇంకా నీలో ఉంటుంది. ఆ సమయంలో తిరస్కరిస్తే జబ్బు తిరుగుమొహం పెడుతుంది. ఇందుకు కావాల్సినది సునిశిత ఇంద్రియజ్ఞానం. ఒక పద్ధతి ప్రకారం దృఢసంకల్పంతో ఈ ఇంద్రియజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. ముందు నీ సూక్ష్మశరీరావరణాన్ని

నీ యెరుకలోనికి రాబట్టుకోగలగాలి. ఆ చైతన్యాన్ని తగిన రీతిలో అభివృద్ధి పరచుకోగలిగితే వ్యాధి స్పర్శజ్ఞానం నీకు సులభంగా లభిస్తుంది.

ఏదో ఒక చిన్న చికాకు కలుగుతుంది. అది ఎలా ఎక్కడి నుంచి వస్తుందో చెలియదు. అలా అని బలవంతంగా నెత్తిన పడినట్లుగానూ ఉండదు. దానిని నీవు తెలసుకోగలిగి బలంగా త్రోసిపుచ్చగలుగుతే ఇంకేమి ఉండదు. అలా కాక నిశ్చైత్తన్యుడవుగా ఉంటే మాత్రం వెంటనే కాకుంటే మరికాస్సేపటిలో ఏదో ఒక సంకటం — ఏ నడుం నొప్పిలాంటిదో వస్తుంది. శరీరంలో అంతకు ముందున్న పొందిక, సామరస్యం సడలినట్లు, ఏదో తేడా వచ్చినట్లు అవగతమౌతుంది. ఆ సమయంలో సడలని విస్వాసంతో, నన్నేదీ స్పృశించలేదనే బలమైన నమ్మకం కలిగి ఉండాలి. ఏ మాత్రం జాప్యం లేకుండా ఇది వెనువెంటనే జరగాలి. అస్వస్థతను ఆలస్యంగా పసికట్టనప్పుడు నిశ్చలంగా కూర్చుని దివ్యశక్తిని ఆవాహనం చేసుకొని కలత చెందిన శరీరభాగంపై దృష్టిని సారించాలి.ఈ జాగ్రత్తలేవీ తీసుకొనకుండా మిన్నకుండిపోతే మాత్రం అస్వస్థత నీలో గూడుకట్టుకొని స్థిరపడటం ఖాయం. శారీరకస్థాయిలో ఏ అసౌకర్యం కలిగినా ఒకపద్ధతి ప్రకారం దానినుంచి విముక్తిపొందే ప్రయత్నం చేయాలి. సకాలంలో పద్ధతి ప్రకారం రోగనివారణ విధానాన్ని పాటించాలి. వైద్యవిధాన ప్రకారమే కాకుండ ఆధ్యాత్మిక శక్తి సహాయంతో కూడా రోగనివారణను వేగిరపర్చవచ్చు. దీనికో కార్యాచరణ విధానము ఉన్నది. ఇది నాలుగు దశలలో సాగుతుంది. తక్షణమే చర్య తీసుకోవటం మొదటిది. కొన్ని నిముషాలనంతరం తీసుకునే చర్య రెండవది. కొన్ని గంటల తర్వాత అయితే అది మూడవదశ. కొన్ని రోజులనంతరమైతే నాల్గవదశ . స్థిరపడిన సంకట నివారణ — శరీరగ్రహణశక్తికి, వ్యాధిగ్రస్త అంగముయొక్క ఇచ్ఛాశక్తికి లోబడి ఉంటుంది. వ్యాధి మనకి తెలియకుండానే లోనికి ప్రవేశించగలిగినదంటే వ్యాధిగ్రస్తమైన శరీరభాగం, వ్యాధితో లాలూచీ పడినట్లు భావించాలి.

(CWM Vol. 4, pp.267-70; Vol.3, p. 88)

అనువాదం: క్రరా వెంకటేశ్వర్లు

26

బాధనివారణ — 1

శారీరక అస్వస్థతను రెండు రకాలుగా నిరోధించగలం. ఒక పద్ధతిలో వ్యాధివల్ల కలిగే బాధానుభవానికి అతీతంగా ఉండటం. ఇక్కడ వ్యాధితాలూకు మూలకారణం నిర్మూలనం కాకపోవటంవల్ల బాధ మళ్ళీ మళ్ళీ అనుభవమయ్యే అవకాశం ఉంది. బాధని అదుపులో ఉంచి వ్యాధిని నిరోధించే మార్గం — బాహ్యాంతర పరిణామము ఇది. వ్యాధి మూలకారణం తెలుసుకొని నిర్మూలించటం శాశ్వత పరిష్కారం. ఇది అంతర పరిష్కారం. ఈ అవకాశం లేనప్పుడు మొదటిదే ప్రయోజనకరం. నిజానికిది కూడా సార్థక పరిష్కారమే.

ఉదా: కొంతమంది పంటినొప్పితో బాధపడుతూ వుంటారు. భరించలేని బాధ. “అమ్మో! నా వల్ల కాదు! ఈ బాధ భరించలేను.!” అని గొగ్గోలు పెడతారు. ఇలా చేసినందువల్ల ఏమి ప్రయోజనం లేదు. నాకీ బాధ వద్దు మొర్రో అంటే బాధపోతుందా? ఇక్కడ ఒక పరిష్కారమేమిటంటే — కదలక మెదలక బాధపట్ల నిర్లిప్తంగా వ్యవహరించడం. ఆ నిర్లిప్తత ఓ మత్తుమందల్లే పని చేస్తుంది. ఫలితంగా మొదడుకి, ఆ శరీరవయవానికి మధ్య లంకె తెగిపోతుంది. ఇలా కొంతసేపు ఉండగలిగితే బాధే మాయమైపోతుంది. ఇది తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఇందుకు జీవితంలో తరచు ఎన్నో సందర్భాలలో అవకాశాలు తటస్థపడుతూ ఉంటాయి. ఇలా కాకుండా బాధ మీదే దృష్టినంతా కేంద్రీకరించినట్లయితే, అది మరింత రెచ్చిపోతుంది. కొంతమంది అన్యమనస్కంగా ఉన్నట్లు ఉంటారు. కాని మనసు ఎంతోసేపు నిలువదు. వెంటనే అనుకోకుండా బాధకి లోబడుతుంది. సంబంధిత నరం బాధను మొదడుకి చేరవేయటం ద్వారా బాధ తెలుస్తుంది. ఆ నరాన్ని నిశ్చలం చేసి స్పందించకుండా నియంత్రిస్తే బాధ టక్కున ఆగిపోతుంది. బాధాతప్తమైన నరం నిద్రావస్థలో ఉన్న భావన కలుగుతుంది. ముందు చెప్పినట్లు మత్తుమందులా పనిచేస్తుంది. ఇందుకు అంతరంగ ప్రశాంతత, భగవద్విశ్వాసము జతపరుస్తే బాధ ఖాయంగా నయమౌతుంది.

పంటినొప్పి మెదడుకి చేరువగా ఉంటుంది. కాబట్టి యోగానికిది జటిలమైన సమస్య. చెడిన దంతం బాగుపడకపోవచ్చుగాని బాధను నివారించుకోవచ్చు.

సాదారణంగా సాధారణంగా దంతక్షయం అక్కడి నరంపై దెబ్బ కొడుతుంది. బాద కలిగించే నరాన్ని అదుపుచేసి అక్కడ స్పందనను నిరోధిస్తే, ఈ ప్రక్రియను నీవు నిరంతరంగా పట్టుదలతో సాగిస్తే దోషభూయిష్టమైన నరం వైదొలగిపోతుంది.. బాధ మాయమౌతుంది.

బంధాన్ని తెంచి బాధను తుంచివేయటం అత్యావశ్యకం. బంధం వల్లనే కదా బాధ!

ఉదాహరణకి — నువ్వు వేలు కోసుకుంటావు. అక్కడి నరం దెబ్బతింటుంది. వెంటనే ఆ నరం మెదడుకి ఇక్కడేదో జరగకూడనిది జరిగిందనే సమాచారం చేరవేస్తుంది. ఏమైందేమైందని నీవు గాబరా పడతావు. బాధ తెలుస్తుంది. ఉపశమనం చేస్తావు. బాద మరీ భరించలేనిదిగా ఉంటే బంధాన్ని తెంచి వేయి. "నీవు చేయవల్సిన పని నీవు చేసావు; నీ పని అయింది; ఇక నీవు శెలవు తీసుకో!" అని నరానికి నచ్చచెప్పు. ఇది నీవెంత చాకచక్యంగా చేయగలిగితే అంత సులువుగా బాధ పూర్తిగా మాయమై పోతుంది. ఇది అత్యుత్తమ పద్దతి. అయ్యో బాధగా ఉందే అని వాపోయే దానికంటె ఇది నయమే కదా!

(CWM Vol. 6, pp. 406-08; Vol.7, p. 149)

అనువాదం: క్రరా వెంకటేశ్వర్లు

27

సూక్ష్మ దేహమువద్ద నిఘా

అసలు వ్యాది రాకుండా నిరోదించడం ఎలా? ఒకవేళ వ్యాధి వచ్చినా దానిని నివారించటమెలా?

మామూలు వైద్యంద్వారా చికిత్స చేయవచ్చు. ఒక్కొక్కసారి అది పలిస్తుంది. ఏ పరిస్థితులలో అంతా సవ్యంగా ఉంటుందో, ఆ పరిస్థితులు తనకు ఇవ్వబడ్డాయని దేహం నమ్మినప్పుడు సాధారణంగా ఆ చికిత్స ఫలిస్తుంది. అంతా సవ్యంగా ఉంటుందని శరీరం నిర్ణయం తీసుకుంటే ఆ వ్యాధి నయమవుతుంది. అయితే, తనకు నయం కావలన్న సంకల్పం శరీరానికి లేనప్పుడు ఎన్ని ప్రయత్నాలు

చేసినా వ్యాధి నయం కాదు. అనుభవం ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఎంతటి ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికీ అయిదు నిముషాలలో నయం అయిన సందర్భాలు నాకు తెలుసు. ప్రాణాంతకమైన పరిస్థితి ఏమీ లేకపోయినా, అది ఉందనుకుని పదేపదే భావించటంవల్ల నిజంగానే ఆ వ్యాధి ప్రాణాంతకమైన సందర్భాలు నాకు తెలుసు. అట్టి వ్యక్తుల విషయంలో వ్యాది నయం అయ్యేటట్లు శరీరాన్ని ఒప్పించటం చాలా కష్టం.

ఇటువంటి సందర్భాలలో చాలా అప్రమత్తంగా విచక్షణతో శరీరాన్ని శోధించాలి. శరీరంలో ఒక భాగం వ్యాధి గ్రస్తం కావడంతో ఏదో ఆనందం పొందుతుందన్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనేక కారణాలున్నాయి. ఈర్ష్యవల్ల వ్యాధి వచ్చినవారు ఉన్నారు. ద్వేషంవల్ల రోగగ్రస్తులవుతారు. నిరాశవల్ల జబ్బు వస్తుంది. ఇవి బలమైన కారణాలు కావు. చైతన్యంలో ఓ చిన్న కదలిక అంతే. ఎప్పుడైనా, విసుగు చెంది — "ఏం జరుగుతుందో నీకు తెలుస్తుంది. నాకు ఇలా చేసినందుకు ఫలితం ఏమిటో తెలుస్తుంది. వస్తే రానీ . నాకు వ్యాధి వస్తుంది." అంటూంటారు. ఎవరూ బాహాటంగా తమకు తాము అలా అనుకోరు. కాని తమలో తాము తిట్టుకొంటారు. కాని లోపల ఎక్కడో ఏదో ఆవిధంగా ఆలోచిస్తుంది.

శరీరంలో చిన్నదో, పెద్దదో ఒక అపశ్రుతి, ఒక అవ్యస్థ ఏర్పడినట్లు కనుగొన్నప్పుడు రెండు పనులు చేయాలి. ఈ అపశ్రుతి ఒక ప్రకంపనాన్ని కల్గిస్తుంది. శరీరంలో, భౌతికచేతనలో అశాంతిని కల్గిస్తుంది. అది ఒక జ్వరం లాంటిది. జ్వరం కాకపోయినా, జ్వరంగా భావించి ఒక మూల పడుకోవడం వంటిది. కొంతమందికి మనస్సంతా అశాంతి. మొదట చేయవలసింది తనకు తాను ప్రశాంతపరచుకోవడం. ఈ చిన్న మూలలో (మొత్తం శరీరంలో కాకపోవచ్చును) పూర్తి ఎరుకతో మనస్సుకు శాంతి విశ్రాంతి తెచ్చుకోవడం . తరువాత శరీరంలో కలిగిన రుగ్మతకు కారణం తెలుస్తుంది. చాలా కారణాలుండవచ్చును. కాని ఈ రుగ్మతకు అసలు కారణం తెలుసుకోవడానికి యత్నించాలి. వెలుగు, విజ్ఞానం వత్తిడి ద్వారా ఆధ్యాత్మికశక్తి ద్వారా శరీరంలో సామరస్యాన్ని తిరిగి నెలకొల్పాలి. ఒకవేళ రుగ్మతకు లోనైన భాగం ప్రతిస్పందిస్తే, మొండిగా ప్రతిఘటించకపోతే, కొద్ది సెకండ్లలో వ్యాధిని నయం చేయవచ్చును.

ఎప్పుడూ అలా జరుగదు. ఒక్కొక్కసారి నేను చెప్పినట్లు దుష్టసంకల్పం వుంటుంది. శరీరం సమ్మె చేస్తుంది. వ్యాధి ఫలితాలు చవి చూడాలని కోరిక కలుగు

తుంది. దానికి మరికొంత కాలం పడుతుంది. ఒకవేళ దుష్టసంకల్పం ఏదీ లేకపోతే, కొంత కాలానికి ఆధ్యాత్మికశక్తి పనిచేస్తుంది. కొద్ది నిముషాల పిమ్మట లేదా కొన్ని గంటల పిమ్మట, లేదా కొద్ది రోజుల పిమ్మట వ్యాధి నెమ్మదిస్తుంది.

ప్రతికూలశక్తుల ప్రత్యేక దాడుల విషయంలో, శరీరంలోని అపస్వరం, అవ్యవస్థ మరింత క్లిష్టమవుతుంది. శరీరసంకల్పంతోనేగాక ఇంకా అనేక ఇతర అంశాలతో సంబంధం వుంటుంది. వాటిని దృష్టిలో పెట్టుకోవాలి. "నా మట్టుకు నాకు దుష్టసంకల్పం లేదని" ఎవరైనా అంటే ఆ వాదాన్ని నేను ఒప్పుకోను. చైతన్యం ఎప్పుడూ కూడా వ్యాధిగ్రస్తం కాకూడదని కోరుకుంటుంది. 'నాకు జబ్బు కావాలని' ఉన్మాదులు కోరుకుంటారు. వ్యాధి రావాలని చైతన్యం కోరుకోదు. శరీరంలో ఒకభాగం, లేదా ప్రాణికంలోని ఒక శకలం తప్పుదారి తొక్కి జబ్బు రావాలని కోరుకుంటుంది. ఎంతో శ్రద్ధతో పరిశీలిస్తే తప్ప, ఈ విషయం తెలియదు. నిజంగా హాని చేయాలని కోరే అసురశక్తుల వత్తిడి, దాడి దీని వెనుక వుంటే, పరిస్థితి (ఆరోగ్యం) సంక్లిష్టమవుతుంది. ఆధ్యాత్మిక తప్పిదం ద్వారా, హింస, ద్వేషం, క్రోధం, వ్యర్థపటాటోపం ద్వారా అసురశక్తులకు ద్వారం తెరుపబడుతుంది. వచ్చే పోయే కదలికల ద్వారా కూడా ద్వారం తెరుచుకుంటుంది. ఎప్పుడూ గమనిస్తూ అవకాశం కోసం ఎదురు చూసే దుష్టశక్తులు ఎప్పుడూ వుంటాయి. అందువల్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అయితే ఏదో ఒక కారణంగా ఒక దుష్టభావం రక్షణకవచాన్ని చీల్చివేస్తుంది. వ్యాధిని తీవ్రతరం చేస్తుంది. అధ్వాన్నస్థితికి తీసుకుని వెళ్తుంది. అటువంటి సందర్భంలో ప్రథమ సాదనాలు చాలవు. అప్పుడు నువ్వు చేయవలసింది మరొకటి వుంది. ఆధ్యా త్మిక ప్రక్షాళన చేసే శక్తిని చేర్చాలి. అది పరిపూర్ణమైన నిర్మాణాత్మకశక్తి . వినాశనాత్మకమైనది ఏదీ కూడా దానిముందు నిలబడలేదు. నీకీ శక్తి వుంటే, లేదా దానిని అడిగి సంపాదిస్తే, ఆ శక్తిని నీవు ఆ ప్రదేశంపై కేంద్రీకరిస్తే దుష్టశక్తి వెంటనే మటుమాయం అవుతుంది. ఈ శక్తి సమీపంలో ఏ విచ్ఛిన్నకర దుష్టశక్తి మనజాలదు. అందువల్ల నీ అనారోగ్యం మాయమైపోతుంది. దానితోపాటు దుష్టశక్తీ మాయమై పోతుంది. దానిని నిర్మాణాత్మక శక్తిగా మార్చవచ్చును. అది సాధ్యమే లేదా దానిని అదృశ్యం చేయవచ్చును. శూన్యంగా మిగల్చవచ్చు. ఆ శక్తితో వ్యాధిని నయం చేయవచ్చును. ఇక తిరిగి ఆ వ్యాధి వచ్చే అవకాశాలు పూర్తిగా తొలగిపోతాయి.

జీవితంలో అది తిరిగి కారుండా వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

(CWM Vol. 5,pp. 185-88; Vol. 15, p. 147)

అనువాదం: కె. యజ్ఞన్న

28, 29

శరీరావయవాలను సడలించుట

ప్రశ్న: స్వీకరణ సామర్థ్యాన్ని పెంచటమెలా?

సడలింపు చర్యలు:

మొదటి షరతు: సాధ్యమైనంత నిశ్శబ్దంగా ఉండటం. నీ అస్తిత్వములోని వేరువేరు భాగాలలోకి ఏదైనా ఒక శక్తి వచ్చి దాన్ని నీవు స్వీకరించలేకపోతే అవి ముడుచుకుపోతున్నట్లు గమనిస్తావు. ప్రాణికస్థితిలో మనస్సులో లేదా శరీరంలో కఠినం అయ్యేది ఏదో ఒకటి ఉంది. ఒక బిరుసుతనం ఉంది. అది దెబ్బ తీస్తుంది. అప్పుడు మానసిక, ప్రాణిక లేదా శారీరక బాధ అనుభవం అవుతుంది. కనుక మొట్ట మొదట చేయవలసింది నీ ఇచ్ఛను ప్రయోగించి ఈ ముడుచుకుపోవటాన్ని సడ లించాలి. విశ్రాంతుడవు కావటం ఎలాగో, అస్థిత్వంలో ఏ భాగంలోనైనా ఏర్పడే ఈ బిగువును సడలించడం ఎలాగో నీవు నేర్చుకోవాలి.

విస్తరణకు మార్గములు: ఈ సంకోచాన్ని సడలించే పద్ధతి మనస్సులోను, ప్రాణికస్థితిలోను శరీరంలోను వేరువేరుగా ఉంటుంది. కాని దాని మూలస్వరూపమొకటే. ఒకసారి ఒత్తిడిని సడలించిన తర్వాత నీకు నొప్పి తగ్గిపోయిందో లేదో అని మొదట చూస్తావు. అది ఒక చిన్న క్షణిక నిరోధకమని ఋజువవుతుంది. కాని బాధ కొనసాగి నట్లైతే, నీకు సహాయపడేదాన్ని తప్పక స్వీకరించవలసినదాన్ని స్వీకరించటం కోసం సామర్థ్యాన్ని అధికం చేయటం అవసరం అయినట్లైతే, ఈ సంకోచాన్ని సడలించిన తర్వాత నిన్ను నీవు విశాలం చేసుకోవటానికి ప్రయత్నించటం ఆరంభించు — నిన్ను నీవు విశాలం చేసుకుంటున్న అనుబూతి కలుగుతుంది. వీపు క్రింద ఒకచెక్క పెట్టుకొని నీటిమీద తేలిపోతున్నట్లు ఊహించటం కొంతమందికి ఉపయోగకరంగా

కనిపిస్తుంది. అప్పుడు వారు తమను తాము విశాలం చేసుకుంటారు. విస్తార జల రాసితో ఒకటి అయ్యేదాకా విశాలం అవుతారు. మరికొందరు ఆకాశంలో లక్షత్రాలతో ఏకమవాలని ప్రయత్నిస్తారు. కనుక అధికాధికంగా ఆకాశంతో తాము ఒకటి అయిపోయి విశాలం అవుతారు.

చేతనా పర్యాప్తి: ఇంకా కొందరికి ఈ మానసిక చిత్రాలతో అవసరం ఉండదు. వారి చైతన్యాన్ని గురించి వారు తెలుసుకోగలరు. అది అపారం అయ్యేవరకూ దాన్ని మరీమరీ విస్తారం చేస్తారు. భూమి అంత, విశ్వమంత పెద్దది అయ్యేటట్లు చేయగలరు. ఆ విధంగా చేస్తే ఎవరైనా నిజంగా స్వీకరణ సామర్థ్యంగల వారవుతారు. నేను చెప్పినట్లు ఇది శిక్షణకు సంబంధించిన విషయము. ఏది ఏమైనా తక్షణదృష్టిలో ఏదైనా వచ్చినప్పుడు అది చాలా బలంగా ఉందనిపించి తలనొప్పి కలుగజేసినపుడు దాన్ని సహించలేనప్పుడు పద్ధతి అదే — ఆ బిగువును సడలించాలి. ఆలోచనద్వారా కూడా చేయవచ్చు. శాంతిని నిశ్చలత్వాన్ని పిలవవచ్చు. (శాంతి, అనుభూతి, చాలావరకు ఇబ్బందిని తొలగిస్తుంది.) "శాంతి, శాంతి, శాంతి, నిశ్చలత్వం స్థిరప్రశాంతి" అంటూ అనేక అసౌకర్యాలు, నాభీ కేంద్ర సంకోచం వంటి ఎంతో అనిష్టమై, కొన్ని సార్లు వికారాన్ని కలిగించి ఉక్కిరిబిక్కిరి అయినట్లు తిరిగి శ్వాసించలేనట్లు అనిపించిన భౌతిక అసౌకర్యములు కూడా, ఆ విధంగా మాయమైపోతాయి. ప్రభావానికి లోనైంది నాడీకేంద్రం అన్నమాట! సులభంగా అది ప్రభావితం అవుతుంది. నాభీకేంద్రానికి ఏదైనా జరిగిన వెంటనే "స్థిరప్రశాంతి, స్థిరప్రశాంతి, స్థిరప్రశాంతి" అని నీవు అనాలి. ఒత్తిడి తగ్గేంతవరకూ నీవు అధికాధికంగా స్థిరప్రశాంతుడవు కావలి.

(CWM Vol. 4, pp. 265- 66; Vol. 10, p.323)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

ఏ కష్టమొచ్చినా సరే,' ఓం' 'ఓం', అని జపిస్తే, చాలు — అది మాయమైపోతుంది.

30

మనస్సు చేసే అభాసు

మానవజాతి తన మానసిక అపభ్రంశములను నిర్మూలన చేసినపుడు మాత్రమే, అతిమానస చేతనను అభివ్యక్తము చేయగలదు. అటు పిమ్మటనే మనస్సు నష్టపరచిన సహజమైన ఆరోగ్యాన్ని తిరిగి పొందగలదు.

మనస్సుయొక్క నిరంకుశత్వమే మానవజాతిని ఔషధములకు వైద్యులకు బానిసగా చేసినది. తత్కారణముగా భయంకర రోగములు అమితముగా పెరుగు చున్నవి.

అందుకు, మానవునకు మిగిలిన ఏకైక తరుణోపాయ మేమనగా, తాను తన మానసిక ఏలుబడి నుండి తప్పించుకొని దైవప్రభావమునకు ఉన్మీలనమగుటయే. పూర్ణశరణాగతిని పొందుట ద్వారా ఆ స్థితి చేజిక్కును.

(CWM Vol. 10 ,pp.326-27,323)

31

దృష్టిని శరీరమునందు కేంద్రీకరించరాదు

నేననేక పర్యాయములు దీనిని గమనించితిని... వాస్తవానికి వ్యక్తి తనకు తానుగనే అస్వస్థతకు గురిచేసుకొనును. అదే, చేతన కుంచించుకుపోవుట లేక విచ్ఛిన్నమైపోవుట ... ఈ మానసిక నిశ్చలతకారణంగా అంతా చెడుతుంది. ఎంత విచిత్రం! ఈ అహంకారమూలమైన మానసిక దౌర్బల్యం. శ్రీఅరవిందులు ముసలివారు అని పేర్కొన్నది దీనినే. అటులగాక ఎల్లెడలా చేతనానుగ్రహములే వెల్లివిరిసినఎడల అంతా ఆరోగ్యమే... అంతా మహాభాగ్యమే.

నేను చెప్పినట్లుగా జీవితంలోని చర్యలన్నింటికి అతిసామాన్యమైనవాడుతోసహా అహంకారందెబ్బతిన్నట్లైతే అదేమిటో నిశ్చితంగా నీకు తెలియాలంటే అది ఆరోగ్యం సమతుల్యత చెడిపోవటానికి దారి తీస్తుందని నిరూపించబడింది. దీనికున్న ఒకే ఒక

పరిష్కారం అహంకారం అంతరించాలి. సమాంతరంగా అనారోగ్యమంతా అంత రించాలి.

(CWM Vol. 11, pp.207,219; Vol. 14,p. 278)

అనువాదం: దామెర్ల వంకటేశ్వరరావు

32

బాధలు నేర్పే పాఠాలు

బాధ మనకి ఏదో పాఠం నేర్పడానికే వస్తుంది. మనం ఎంత త్వరగా ఆ పాఠం నేర్చుకుంటే దాని అవసరం అంత త్వరగా తీరపోతుంది. మనకి బాధ ఎందుకు వస్తుందో అనే రహస్యం తెలిసిపోతే, ఆ తరువాత బాధపడటం అసంభవం. ఎందుకంటే మనకి బాధకి కారణం, మూలం, దానిని అధిగమించించే మార్గం కూడా తెలిసిపోతాయి.

అహం అనే బందిఖానాలోంచి బయటపడి భగవంతునితో ఏకమై ఇంక ఎట్టి పరి స్థితులలో కూడ ఆయన నుంచి వేరుకాకుండ ఉండటమే బాధని అధిగమించే రహస్యం. ఇది తెలుసుకుంటే ఇంక బాధకి అస్తిత్వం ఉండదు కనుక అది మాయమై పోతుంది. అంతరాతరాల్లో, ఆత్మలో ఆధ్యాత్మిక జాగృతిలోనే కాదు. ఈ జ్ఞానం మన దైనందిన జీవితంలోను, బాహ్య శరీరంలో కూడా సర్వదుఃఖహారిణి.

ఈ రహస్యం తెలుసుకుని ఆచరిస్తే దానివలన తొలగని వ్యాధి కానీ, సంకటం కానీ ఉండదు. జీవియొక్క సూక్ష్మభాగాలలోనే కాక స్థూలశరీరంలోని కణాలుకూడా బాధనుంచి విముక్తి పొందుతాయి!

మనలోని ప్రతి కణానికీ దాని దివ్యత్వమును, దాని అస్తిత్వం వెనుక ఉన్న పూర్ణసత్యమును గురించి తెలియజేయగలిగితే, ప్రతి కణమూ ఈ విశాల విశ్వ మంతటితో సామరస్యము జెందినట్లయితే అన్ని వ్యాధులు తొలగిపోయినట్టలే.

ఇది సాధించాలంటే భయము, పిరికితనము ఉండకూడదు. శరీర అస్వస్థతకి ఏ మాత్రం భయపడకూడదు. పారిపోకూడదు. దానిని స్థిమితంతో, నిబ్బరంతో, ధైర్యంతో ఈ అస్వస్థత ఒక భ్రమ, మిథ్య, అసత్యము. అనే నమ్మకంతో ఉండాలి. ఎప్పుడైతే మనం పూర్తి విశ్వాసంతో, స్థిరచిత్తంతో భగవదనుగ్రహానికి లోబడతామో,

అప్పుడు ఈ భావన మన అంతస్సులో స్థిరపడ్డట్టే. అణువణువూ స్థిరపడి ప్రతి అణువు నీ ప్రతి కణాన్నీ అనంత ఆనందంలో పాలు పంచుకోనిస్తుంది.

... అంతా ఇది దైవంతో ఎలా ముడివడి వుంది అనే దానిపై ఆధారపడి వుంటుంది. అనగా సమర్పణా భావన ఏ మేరకు దైవపరమై వున్నదో అనే దానిపై ఒక అసౌకర్యాన్ని కన్నా మించిన భరించలేనంత బాధ లాంటిది. అది శరీరం భగవదాకర్షణ దిశగా మారడంతో అకస్మాత్తుగా అంతరిస్తుంది — అంతేగాక ఒక పరమ సుఖాన్ని కూడా సమకూర్చవచ్చు. ఈ అనుభవం నాకు చాలా సార్లు కలిగింది. నాకు సంబంధించి నంతవరకు చైతన్యంలోని నిజాయితీఎంత దృఢమైనదో అన్నదో ముఖ్యం — అంతా దైవేచ్ఛతో జరిగే కార్యమేనని. ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమైనంత వేగంగా ఫలవంతమగునట్లుగా అగి కదులుతుందన్న చిత్తశుద్ధి.

ఇంకా నేను చెప్పేదేమిటంటే, శరీరకణాలన్నీ తాము దైవసముదాయమునే అనుభూతి చెందేక్షణం వరకు తమ ఆధరువును దైవంలోనే అన్వేషించటం నేర్చుకోవాలి.

(CWM Vol.9, pp.41- 42; Vol. 11,p. 273-272)

అనువాదం: బి. వరలక్ష్మి

విజయదశమినాడు సెప్టెంబరు 29 1971

దుర్గాపూజ విజయదశమి

విజయం అంటే సామరస్యం. విజయం అంటే దైవం. ఇక శరీరవిషయంలో విజయం అంటే మంచి ఆరోగ్యం, ప్రతి ఒక్క బాధ. ప్రతి ఒక్క అస్వస్థత అసత్యం.

ఓ దేవా, నాకు తెలుసు. మనిషి మట్టితో ఆడుకునే స్థాయినుండి, సూర్య నక్షత్రమండలాలను తన హస్తాలలో తీసుకునే స్థాయి కెదిగి వాటి పాతరూపు రేఖలను, ధర్మాలను, ప్రక్రియలను పునర్నిర్మించే రోజు వస్తుందని. అప్పుడు బాధ, వైషమ్యాలు లోకంనుండి అంతరిస్తాయి. మనిషి మరోమారు పరమాత్మ నిజ ప్రతిరూపంగా కనబడతాడు.

(SABCL Vol. 5, p. 89)

శ్రీఅరవిందులు

*

పరమసత్యము స్వస్థత చేకురుస్తుంది.

*

శాంతి నైశ్చల్యములు రోగనివారణకు శ్రేష్ఠమైన ఔషధములు.

*

మంచి ఆరోగ్యం అంతరంగ సామరస్యతయొక్క బాహ్యప్రకటన.



శ్రీమాత యోగమార్గము

రెండవ భాగము

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2015

విషయసూచిక

మనకూ, ఈ విశ్వానికీ ఆధారంగా ఉన్న మహా చైతన్యశక్తిలో ఏకత్వానుభూతికై ప్రవేశించిన తరుణంలో అమ్మ అస్తిత్వాలకు సంబంధించిన మూడు విధాలైన ఎరుకను నీవు పొందుతావు. అతీతమైనది (మొదటిది), అన్నింటికీ మూలమైన పరాశక్తి, ఆమె లోకాల కన్నింటికీ పైన ఉంటుంది, ఈ సృష్టికి ఎప్పుడూ అభివ్యక్తమవని నిగూఢ మర్మానికీ అనుసంధాన కర్తగా ఉంటుంది. సార్వత్రికమైనది (రెండవది), విశ్వానికి సంబంధించిన మహాశక్తి, ఈ సమస్త ప్రాణులను సృష్టిస్తుంది, వాటిని తనలో కలిగి ఉంటుంది, వాటిలో ప్రవేశిస్తుంది, వాటికి ఆధారంగా ఉంటుంది, ఈ మొత్తం లక్షలాది ప్రక్రియలను, శక్తులను నడుపుతూ ఉంటుంది. ప్రత్యేక వ్యక్తిత్వం కలది (మూడవది), ఆమె ఈ రెండూ బృహత్తర విధానాల లోనూ తనకు సంబంధించిన ఉనికికి నిర్దిష్ట రూపధారణను ఇవ్వగలిగిన ఆధిపత్య శక్తిని కలిగి ఉండి, వాటిని సజీవంగా, మన దరికి చేరుస్తూ, మానవ వ్యక్తిత్వానికీ, దివ్యప్రకృతికీ మధ్యవర్తిత్వం నెరపుతుంటుంది.

CWSA 32:14

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

యోగమార్గంలో క్రొత్త దశ

ఒక క్రొత్తదశ ప్రారంభమయింది:

మేము మీ పవిత్ర అభయాలయ హృదయకుహరంలోకి ప్రవేశించి మీ సంకల్పాన్ని తెలుసుకోగలిగా మనుకుంటాను. నాలో ఒక మహదానందం, ఒక గాఢ ప్రశాంతి నెలకొన్నాయి. అయినా నాలోని అంతర నిర్మాణాలన్నీ ఒక నిరర్థక స్వప్నంలా అంతర్థాన మయిపోయాయి. ఇప్పుడు మీ అపారత ముందు ఇంకా ఒక ఆకారమూ, వ్యవస్థ, ప్రత్యేకత లేని అస్తిత్వంలా వున్నాను. గతమంతా తన బాహ్యరూపంలో అసందర్భమైనదిగాను, నిర్హేతుకమైనదిగాను కనిపించినప్పటికి ఆ సమయంలో అది ప్రయోజనకరమైనదని నాకు తెలుసు.

కానీ ఇప్పుడంతా మారిపోయింది. ఒక క్రొత్త దశ ప్రారంభమయింది.

ఏప్రిల్ 1, 1914

సమగ్రంగా మరణించుట — దాపరికం లేకుండా సమర్పించుకొనుట

...నా కిప్పుడు మీ స్వరం వినిపిస్తున్నట్లుగా వుంది. "నీ కెపుడూ సమగ్రంగా మరణించుట మెలాగో తెలియలేదు. ఎప్పుడూ నీలో ఏదో తెలుసుకోవాలనీ, చూడాలనీ, అర్థం చేసుకోవాలనీ అనుకుంటుంది. పూర్తిగా సమర్పణ చేసుకో. ఎలా అంతర్ధాన మయిపోవాలో నేర్చుకో. నిన్ను నా నుండి వేరుచేసే చివరి ప్రతిబంధకాన్ని ముక్కలు చేసేయ్. ఏ దాపరికమూ లేకుండా నీ సమర్పణని పరిపూర్తి గావించు." అయ్యో ప్రభూ! చాలా కాలంగా అలా కావాలనుకున్నాను. కానీ చేయలేకపోయాను. ఇపుడలా చేయగల శక్తిని మీరు నాకు ప్రసాదిస్తారా?

ఓ ప్రభూ! నా ప్రియమైన దైవాంశగల గురుదేవా! నన్ను ఆందోళనపరిచే ఈ ప్రతిరోధకతను త్రుంచివెయ్యి. నన్ను నా నుండి రక్షించు.

ఏప్రిల్ 7, 1914

'నేను' అనేది మరణించింది. కేవలం మీరు తప్ప మరేమీ లేదు

నాకు యికపై పరిమితులేమీ లేనట్లుగా అనుభూతి కలుగుతుంది. శరీరభావన ఏ మాత్రం లేదు. ఏ భావనలు, ఉద్రేకాలు, ఆలోచనలూ లేవు. ఉన్నదంతా ఒక

స్వచ్ఛమైన, నిర్మలమైన, నిశ్చల అపారత, ప్రేమ, వెలుగు, ఒక అనిర్వచనీయమైన సౌందర్యముతో నిండి అక్కడ ఉన్నది. ఇప్పుడు అది మాత్రమే నేను అనే భావన కలుగుతుంది. ఇప్పుడు 'నేను' పరిమితము, స్వార్థపూరితము అయిన పూర్వపు 'నేను' కన్నా ఎంత చిన్నదానినంటే మా భవితవ్యానికి పరమేశ్వరుడవైన ఓ ప్రభూ! ఈ 'నేను' — నీవో, నేనో అనేది నేను చెప్ప లేకపోతున్నాను.

అంతా ఒక శక్తి ప్రవాహము, ధైర్యము, శక్తి, సంకల్పము, అనంతమయిన మాధుర్యము, నిరుపమానమయిన వాత్సల్యము వలె ఉన్నది. ఈ చివరి రోజులలో మరింత బలీయంగా గతమంతా హతమై ఒక నూతన జీవనకాంతి క్రింద సమాధి అయిపోయింది. నేను ఈ పుస్తకంలో కొన్ని పుటలు చదివి వెనుకకు చూసిన ఆఖరి చూపు నాకా మరణం గురించి కచ్చితమైన నమ్మకం కల్పించింది. భారమైన బరువు నుండి తేలికబడి నన్ను మీ ముందు సమర్పించు కుంటున్నాను. ఓ దివ్యప్రభూ! ఒక పసిపాప వంటి సరళత్వంతో, అనాచ్ఛాదితంగా... ఇంకా కేవలం ఆ ప్రశాంత, నిర్మల గాఢత మాత్రమే నాకు స్ఫురిస్తుంది....

ప్రభూ! మీరు నా ప్రార్థనకు సమాధాన మిచ్చారు. నేను కోరుకున్నదానిని ప్రసాదించారు. ఈ "నేను" అంతర్థానమయిపోయింది. కేవలం ఒక వినమ్రమయిన ఉపకరణం మాత్రమే మీ సేవకై వినియోగించబడి — మీ అనంతమైన శాశ్వత తేజోకిరణాలు ఏకాగ్రమై ఆవిష్కరించబడిన కేంద్రంలో. మీరు నా జీవితాన్ని స్వీకరించి మీదిగా చేసారు. నా సంకల్పాన్ని మీ సంకల్పంతో ఐక్యం చేసారు. నా ప్రేమను మీ ప్రేమతో సమానంగా గుర్తించారు, నా ఆలోచనలను మీ పరమ చైతన్యంతో పూరించారు.

ఈ శరీరం సంభ్రమాశ్చర్యాలతో తన ఫాలాన్ని మీ పాదధూళిలో మౌన ఆరాధనా నివేదనతో వంచుతున్నది.

మీ అచంచల ప్రశాంతత యొక్క మహాద్భుత రోచస్సులో మీరు తప్ప. మరి అన్యమయిన దేదీ ఉనికిని కలిగి ఉండదు.

ఏప్రిల్ 10, 1914

ఒక ప్రత్యేక వ్యక్తిత్వపు భ్రాంతి

...కార్యాచరణలో వ్యక్తిత్వమనేది మీ సంకల్పము మీ శక్తుల అనివార్యమయిన,

ఆవశ్యకమయిన మధ్యవర్తి అవుతుంది.

వ్యక్తిత్వం మరింత దృఢమూ, సంకీర్ణమూ, శక్తివంతమూ, స్వతంత్రమూ అయినప్పుడు ఆ ఉపకరణం బాగా ఉపయుక్తమవుతుంది.. కానీ ఈ వక్తిత్వంయొక్క సహజ స్వభావం కారణంగా అది అతి తేలికగా తన ప్రత్యేకమైన ఉనికిని గురించి ఒక భయంకరమైన ఘోరభ్రాంతిలో పడి క్రమంగా మీకూ, మీరు పనిచేయదలచుకున్న కార్యరంగానికి మధ్య ఒక అడ్డు తెరగా మారుతుంది. ఆవిష్కరణ యొక్క ప్రారంభంలో కాక ఫలితాలను అందించేటపుడు అంటే ఒక విశ్వసనీయమైన సేవికలా మీకు చెందవలసినది మీకు కచ్చితంగా సమర్పించే మధ్యవర్తిగా కాక మీ కార్యానికి సమాధానంగా పంపబడిన శక్తులలో కొంత భాగాన్ని ఈ వ్యక్తిత్వం తన కోసం కేటాయించుకుంటుంది. 'ఈ పనిని చేసింది నేనే. నాకే కృతజ్ఞతలు చెందుతాయి' — అనే భావనలో ఉంటుంది.

ఒక ఉపద్రవకరమైన భ్రాంతి, అవిదితమైన అసత్యం, యిపుడే కనుగొనబడి ముసుగు తొలగించుకున్నాయి — కార్యఫలాన్ని కలుషితం చేసే ఒక కుటిలమైన చీడ వంటిది — ఫలితాలన్నింటినీ దోషపూరితం గావించేది.

ఓ దేవా, నా ప్రియమైన ప్రభూ! ఏకైక సత్యమా! ఈ "నేను" అనే భావనను తొలగించు. ఒక ఆవిష్కృతమైన విశ్వం ఉన్నంత వరకూ ఈ "నేను" మీ అవతరణకై అవసరమనే విషయం నాకు అవగతమయింది. ఈ "నేను" ను తగ్గించివేసినా, దుర్బలం చేసినా అది మీ ఆవిష్కరణకు అవసరమైన వనరులను పూర్తిగానో, పాక్షికంగానో ధ్వంసం చేస్తుంది. కానీ సమూలంగా, కచ్చితంగా అణిచి వేయవలసింది ఈ భ్రాంతితో కూడిన ఆలోచనలు, భావనలు. "నేను" వేరే అనే భ్రాంతి ఏ క్షణంలోను, ఎటువంటి పరిస్థితులలోను మేము విస్మరించ కూడనిది ఏమిటంటే మీకు బాహ్యంగా నేను అనే దానికి మనుగడ లేదని.

ఏప్రిల్ 17, 1914

ఏకత్వ స్థితి. నేనే మీరు — యనే నేను

ఒక పరిమితమయిన వ్యక్తిత్వంగా ఉండకుండా మీలో, మీ కార్యనిర్వహణలో మమేకమవటం. ఒక కేంద్రబిందువు ద్వారా ఆవిష్కృతమౌతున్న మీ శక్తులను అసంఖ్యాకంగా విస్తృతపరచడం, పరిమితులు, అడ్డంకు లన్నింటి నుండి విముక్తమవటం

నిబంధించే ఆలోచన లన్నింటిని అధిగమించటం, కార్యాచరణకు దూరంగా ఉంటూ కర్మ చేయటం, వ్యక్తులతోను, వ్యక్తుల కోసం పని చేస్తూ కేవలం, మీతో ఏకత్వాన్ని, మీ ప్రేమ, మీ జ్ఞానం, మీ ఉనికి యొక్క ఏకత్వాన్ని దర్శించటం.

ఓ నా దివ్యప్రభూ! శాశ్వత గురుదేవా, ఏకైక పరమ సత్యమా, మీ సేవ కోసం, మీ ఆవిష్కరణ కోసం, మీరు నిర్మించిన ఈ శారీరక సంకలనంలోని అంధ కారాన్ని తొలగించండి. అంతటా అదే చైతన్యాన్ని జాగృతం చేయగల పరమోన్నత చైతన్యాన్ని అందులో సిద్ధింప చేయండి. నిరంతరం మారిపోయే రూపాలను కాకుండా ఎల్లవేళలా, అన్నిటా, సర్వత్రా మీ అచంచలమైన ఏకత్వాన్ని ధ్యానింతును గాక.

ఓ ప్రభూ, మీ కోసం నా అస్తిత్వం గళమెత్తి నిగ్రహించలేని పిలుపు నిస్తున్నది. నా సమగ్ర చేతనలో నేను మీరుగా మారే వరమివ్వమని — ఎందుకంటే నిజానికి నేనే మీరు — మీరే నేను కాదా?

మే 4, 1914

మహోన్నతమయిన చివరి పరిత్యాగం

... ఈ ఉదయం నా హృదయపు లోతుల నుండి లోలోతులకు తీవ్రమైన అనుభవంతో సాగిపోతూ నేను మళ్ళీ ఎప్పటిలానే నా చైతన్యంతో మీది ఏకమై ఉండటం, కేవలం మీలోనే వసించి ఉండటం చూసాను. నిజానికి మీరు మాత్రమే జీవనాధారంగా వున్నారు, కానీ వెంటనే మీ సంకల్పం నా చైతన్యాన్ని బాహ్యంలోకి, నేను చేయవలసిన పని వైపు లాగింది. మీరు నాతో అన్నారు "నాకు అవసరమైన ఉపకరణంగా ఉండు" అని. ఇది మీ తోటి తాదాత్మ్యత నుండి చివరి పరిత్యాగం కాదు, మీ నుండి నేను వేరు కాదనే మధురమూ, నిర్మలమైన ఆనందం నుండి విడివడుట కాదు ప్రతి క్షణమూ మేధలోనే కాక, ఒక సమగ్రమయిన అనుభవంలో మీరే ఏకైక సత్యమని, తక్కినవన్నీ కేవల బాహ్యమైన రూపాలు, భ్రాంతులనే ఎరుకలోని ఆనందాన్ని పరిత్యజించటం కాదు ప్రభువూ, మేము దరిచేర లేనివాడవూ, అందరికీ సర్వోన్నత అతీతుడడవు, అవిదితమైనవాడవూ, శాశ్వతమయినవాడవు, సర్వోత్కృష్టమయిన సత్యానివీ నీవే.

ఓ పరమాద్భుత ఏకత్వమా! నేను మీలో అంతమైపోనీ.

మే 12, 1914

పనిలో అసహనం, తొందరపాటు నిరుపయోగం

అసహనంతో కూడిన విముఖత, తొందరపాటు నిష్ప్రయోజనమని మరింత ఎక్కువగా అనిపిస్తున్నది, అంతా నెమ్మదిగా వ్యవస్థీకరించబడుతుంది. అందువలన నేను మీకు ఏ విధంగా సేవ చేయాలో ఆ విధంగానే చేయగలగుతాను. ఈ సేవలో నా స్థానం ఏమిటి? చాలా కాలంగా నన్ను నేను యిలా ప్రశ్నించుకోవటం మానేసాను. దానికేమీ ప్రాధాన్యత వుంది? ఒకరు కేంద్ర స్థానంలో ఉన్నారా లేక ఆవరణ రేఖలో నున్నారా అనేది తెలుసుకోవటం అవసరమా? మీకు పూర్తిగా నివేదించబడి, మీ వలన, మీ కొరకే జీవిస్తున్నప్పుడు — మీరు అప్పగించిన బాధ్యతను మరింత బాగా నిర్వహించగలుగుతాను. తక్కిన దేనికీ ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. ఇంకా చెప్పాలంటే, ఈ విశ్వంలో మీ కార్యం వీలైనంత సంపూ ర్ణంగా చక్కగా నెరవేర్చినపుడు ఏ వ్యక్తి గాని లేదా ఏ వర్గం గాని దానిని సాధిం చిందనేది అప్రస్తుతం.

ఓ నా ప్రియమైన ప్రభూ! నా తలుపులు నిశ్చలంగా, నిశ్శబ్దంగా, నా హృదయం మందస్మితంగా, సమత, ప్రశాంతత, నీరవతలతో నన్ను నేను మీకు సమర్పించుకొని మీలో ఐక్యం కానీ. మీ కార్యం నెరవేరుతుంది. నాకు తెలుసు మీ విజయం తథ్యం.

ఓ ప్రియ ప్రభూ, అందరికీ నీ జ్ఞానప్రకాశపు మహోన్నత వరాన్ని ప్రసాదించు.

మే 13, 1914

ఏకత — అనేకతల మధ్య అతిమానస సంబంధం

ఒక శిఖరాన్ని చేరాక ఒక విస్తృతమైన భూమ్యాకాశాలు కలసినట్లు కనిపించే వలయరేఖను కనుగొన్నట్లుగా ఓ ప్రభూ! ఒక వ్యక్తి చైతన్యం మీ ఏకతకూ, దృశ్యమాన ప్రపంచానికి నడుమ ఉండే మధ్యంతర భూమికచే గుర్తించబడినపుడు, ఆ వ్యక్తి మీ అనంతత్వమూ, విశ్వావతరణ, రెంటిలో పాలు పంచుకుంటాడు. మీ సమర్థవంత మయిన శక్తిలో నిలచిన చైతన్యపు కేంద్రంలో ఉన్నట్లుగా మీ శక్తి కిరణాలను సోదర ఉపకరణాల మధ్య వున్న ఈ నిమ్న పరికరంపై ప్రసరిస్తారు.

ఈ విశ్వాతీత సీమల ఉన్నత శిఖరాల నుండి ద్రవ్యపదార్థపు ఏకత స్పష్టంగా

గోచరమవుతుంది. అయినప్పటికీ ఈ పదార్థ క్షేత్రంలో ఒక ప్రత్యేకమయిన ఉపకరణంగా పని చేసే దేహం, ప్రత్యేకంగా, కచ్చితంగా, విశిష్టంగా ఆ రాశి మొత్తంలోనూ ఒకే సమయంలో ఏకమూ, అనేకమూ అయి, ఎక్కడయితే శక్తులు సమానంగా సంచారం చేస్తాయో అటువంటి ఒక దృఢమయిన బిందువులా ఉంటుంది.

నిన్నటి నుండి ఈ అనుభూతి నన్ను విడువలేదు. ఏదో చాలా కచ్చితమైనదాని వలె అది నాలో స్థిరపడింది. ఎప్పటిలా మామూలుగా సాగే బాహ్య కార్యక్రమాలన్నీ యాంత్రికమై, మీ ఏకత్వంలో యింకా పూర్తిగా విలీనం కాని, ఒక అద్భుతంగా కూర్చబడిన కీలుబొమ్మలా, యింకా వ్యక్తిగతం కాని విశ్వచైతన్య సింహాసనపు ఔన్నత్యం నుండి నడిపించబడుతుంది. వ్యక్తిగత ఆవిష్కరణ యొక్క సూత్రాలన్నీ నాకు సుస్పష్టమయ్యాయి, కానీ అది ఎంత సమన్వయమూ, సార్వత్రికమూ, ఏక కాలంలో జరిగిందంటే సాధారణమయిన భాషలో వ్యక్తీకరించటం అసాధ్యం.

మే 15, 1914

అనువాదం: డా. సరోజా ప్రసాద్

ప్రశ్న: నేను దివ్యశక్తిని క్రిందకు పిలిచేటప్పుడు, శరీరంతో ఉన్న మాతపై ధ్యాసను కేంద్రీకరించాలా లేక విశ్వజనని యొక్క చైతన్యానికి తెరుచుకొని దానిపై కేంద్రీకరించాలా?

సమా: శరీరధారి అయిన శ్రీమాత నీ కేంద్రీకరణకు మూలాధారం కావాలి. నీవు పైనున్న విశ్వ చైతన్యాన్ని అందుకొనేటప్పుడు కూడా ఆమె చైతన్యం నుండే అందుకుంటావు.

5 మార్చి, 1934

ప్రశ్న: శ్రీమాత అవతరణకూ, అతిమానస అవరోహణకూ మధ్య ఏమైనా వ్యత్యాసముందా?

సమా: శ్రీమాత అతిమానసాన్ని క్రిందకు తీసుకురావటానికే వచ్చారు. అతిమానసం దిగిరావటం వలన శ్రీమాత సంపూర్ణ అవతరణ ఇక్కడ సాధ్య మవుతుంది.

25 సెప్టెంబరు 1935

అనువాదం: డా. సరోజా ప్రసాద్

ప్రేమ యొక్క హృదయము

సమస్తం లోకి వ్యాపించడం

నిజంగా నా ఉనికికి ఒక ప్రతీకగా నా దంటూ ఒక భాగంగా ఇస్తున్నారు. దానిలో బాహ్యాప్రయోజనం అందరి కోసం పనిచేయడం అన్నది సర్వోన్నతమైన సత్య సాక్షాత్కారం కంటే కూడా గొప్ప స్థానాన్ని కలిగి ఉంటుంది. నా జీవితంలో ఎదురవుతున్న పరిస్థితులన్నీ నిరంతరం మీ తరుఫుగా "అసమాన్యమైన ఏకాగ్రతతోనే దివ్య ఐక్యతను అనుభవంలోకి తెచ్చుకోలేవు, అందరిలో వ్యాపింప జేయడం ద్వారా పొందగలవు" అని మీరు చెబుతున్నట్లు నా కనిపిస్తుంది.

మీ ఇచ్ఛే నెరవేరు గాక — ఓ ప్రభూ!

నా కిప్పుడు బాగా అర్థమౌతుంది, ప్రస్తుత ప్రత్యేక వ్యక్తిత్వానికి సంబంధించినంత వరకు మీతో తాదాత్మ్యం చెందడం అన్నది కాదు చేరవలసిన గమ్యం. ఇది చాలా కాలం నుండీ నిరూపించబడిన వాస్తవం. అందు కే మీరు నా కెప్పుడూ "ఆనందభరిత ఏకోన్ముఖ తాదాత్మ్యతతోనే సంతోషించకు. ఈ భువిపై నీ కంటూ అప్పగించిన పనిని పూర్తి చెయ్యి" అని ఎల్లప్పుడూ తట్టి చెబుతున్నట్లు వుంటుంది.

వ్యక్తిగత కార్యాన్ని సమిష్టిగత కార్యంతో పాటు నిర్వహించడ మనగా అస్తిత్వం యొక్క అన్ని భాగాలు, అన్ని చర్యల గురించిన అవగాహన పెంచుకొని వాటిని చేపట్టి. చేతనను శిఖరాగ్ర స్థాయిలో నిశ్చితంగా ప్రతిష్టించడం, తద్వారా నియమిత కార్యాన్ని మీతో నిరంతరం సంబంధాన్ని సాధించే వీలు కలిపించడం.

ఏది నెరవేర్చబడాలో అది నెరవేర్చబడే వరకూ సంపూర్ణమైన తాదాత్మ్యత లోని ఆనందాలు అంది రావు.

మొదట మీతో తాదాత్మ్యం చెందడాన్ని గూర్చి అందరికీ ప్రబోధించాలి. తరువాత పనిని చేపట్టాలి. ఎవరైతే మీతో తాదాత్మ్యత చెందారో వారి జీవితంలో ప్రతి క్షణం వారి ద్వారా మీ ఇచ్ఛను సమగ్రంగా ప్రకటించే సందర్భమవ్వాలి.

ఈ దేహం మీ దివ్యప్రేమనే ప్రసరింప జేయు గాక

ఓ ప్రభూ, నిరంతరం మీ ధ్యాసలో వుంటూ మిమ్ములను నా ప్రతికణంలోనూ సిద్ధింప చేసుకుంటూ నన్ను కూడా మిమ్ములనుగా పరిగణిస్తూ, చరాచర వస్తుజాలంలో

నెలకొనివున్న వాడివిగా మీరే పరమ సత్యంగా మీరే సృష్టికి కారణంగా, లక్ష్యంగా పరిగణించే నాకు మీపై నా ప్రేమ దిన దిన ప్రవర్ధమానమౌతూ నేనంతా ప్రేమ మయమై, ఈ అసలు సిసిలైన ప్రేమనై, తత్కారణంగా మీతో సమగ్రంగా తాదాత్మ్యం చెందే వరం ప్రసాదించండి. ఈ ప్రేమ యింకా మరింకా తీవ్రతరం, సంపూర్ణం, తేజోవంతం, శక్తివంతమగు గాక, మీ వైపుకు సాగే పరితపనగా మిమ్ముల‌ను అవ తరింపజేసే సాధనమగు గాక. ఈ జీవుని లోని సర్వం — లోలోతుల్లో నుండీ చివరి బాహ్య స్థూలదేహ పదార్థం వరకూ అమల, గంభీర, నిరాసక్త దివ్యప్రేమ అగు గాక. సాకారమైన దైవరూపం మీ సంపూర్ణమైన, ఉదాత్తమైన ప్రేమతో రూపొం దును గాక. ఈ ప్రేమే జ్ఞానసంపదకంతా మూలాధారమై జ్ఞానసిద్ధిని ప్రాప్తింపజేయు గాక. మీ ప్రేమతో ఆలోచన సరళి స్పష్టతను పొంది క్రమబద్ధమై, ఉద్దీప్తమై రూపాంతరం చెందు గాక. ఈ జీవశక్తులన్నీ కేవలం మీ ప్రేమతో వ్యాప్తియై రూపుదిద్దుకొని దాని నుండే ప్రబలమైన స్వచ్ఛతను, దృఢమైన శక్తిని, నైతికతను పుణికి పుచ్చుకొను గాక. ఈ శక్తిహీనుడైన మధ్యాంతర జీవి తన బలహీనతనే అదనుగా చేసుకొని మీ ప్రేమతో నిండిన అంశాలతో తిరిగి తనను తాను తీర్చిదిద్దుకొను గాక. మండుతున్న కొలిమికి మల్లే వున్న ఈ శరీరం రోమ రోమం నుండీ ఈ దివ్యమైన, నిస్వార్థమైన, ఉదాత్తమైన, నిశ్చల ప్రేమను ప్రకాశింప జేయు గాక.....

మీ ప్రేమతో ఈ మస్తిష్కం పునర్ వ్యవస్థీకరించబడు గాక. చివరిగా మీ ప్రేమ పొంగి పొరలి, వరదలా సమస్త జీవుల్లోకి తనదైన ఊర్జవం, శక్తి, మాధుర్యం, తేజస్సులతో చొచ్చుకొనిపోయి వాటిని పునరుద్ధరించి, పరివర్తింప జేయును గాక. మీ ప్రేమలోనే శాంతి వుంది. మీ ప్రేమలోనే సంతోషం వుంది. మీ ప్రేమలోనే మీ సేవకుడి పని అనే యంత్రాన్ని నడిపించగల సర్వోత్కృష్టమైన మీట వుంది. మీ ప్రేమ విశ్వం కన్నా విశాలమైనది. యుగకల్పాల కన్నా శాశ్వతమైనది, అనంతమైనది. అది మీరే అయి వున్నది. అది మీరే కాబట్టి నేను మీ వలెనే వుండాలని కోరుకొంటున్నాను. అదే నేను, కారణం మీ నియమ శాసనం. అలాంటిది మీ సంకల్పం ఆలాంటిది.

మే 23, 1914

నిజంగా ప్రేమించడం నేర్చుకొనుట

ఓ నా దివ్య ప్రియ దైవమా. నన్ను ఈ బాహ్యమైన విషయాలన్నింటితో కలసి పోనివ్వకు. వీటి పట్ల నాకు ఆసక్తి లేదు. అవి నాకు రుచించవు. ఎందుకనగా పని చివరిదాకా సమగ్రంగా నెరవేర్చబడాలనేది మీ సంకల్పమని నా భావన గనుక. అయితే వాటిపై పూర్తి ధ్యాస వుంచి మీ శక్తులను వాటిల్లోకి ఎంత మేర సాధ్యమైతే అంత మేరకు చొప్పించితే సరిపోతుంది. వ్యక్తి చైతన్యంలోని నిజమైన వాస్తవికతలపై ఆధిక్యత చూపేలా వాటిని అనుమతించ కూడదు.

ఓ నా ప్రియమైన గురుదేవా, మిమ్ములను నేను కోరుకునేది, మీ గురించిన జ్ఞానం పెంపొందించుకొనడానికి మీలో మమేకమై పోవడానికి సర్వదా మరింత పవిత్రంగా, అంత కంతకూ విస్తారంగా, అమితంగా, తీవ్రంగా వర్ధిల్లే మహత్తర ప్రేమను మీ నుండి ఆశిస్తాను. ఈ దివ్య పదార్థ ప్రపంచంలో నీ అంతట నీవే నిండా మునిగి వున్నావనా నా ప్రశ్నకు మీ జవాబు? ఈ దివ్యపదార్థంలో మీ అంతట మీరు కలగలసిపోయి దీనిలో క్రమక్రమంగా చైతన్యాన్ని మేల్కొలపడానికి అంగీకరించినందు వలన, ఇదేనా మీతో పరిపూర్ణంగా ఐక్యమవ్వడం వలన కలిగిన పర్యవసానం? ఈ అంధకారంలో... ఈ అచేతనలో... "నీవు నిజంగా ప్రేమించడం నేర్చుకొనటానికి ప్రేమించాలి" ఏ విధంగా అసలు ప్రేమించగలవు నన్ను అన్నది మీ నుండి వచ్చే సమాధానం కాదా? ఓ నా ప్రభూ, నా ప్రియమైన ఆచార్యవర్యా, నేను మీకు చెందినదానినేనని, మీరేది సంకల్పిస్తున్నారో దానినే నేనెప్పటికీ కోరుకొంటానని మీకు తెలుసు. కానీ మీరు సంకల్పి స్తున్నదేమిటో అనే సందేహాన్ని నాలో తలెత్తనీయకు. ఏదో ఒక విధంగా నిశ్చల నీరవ హృదయ ప్రేమలో నన్ను ఉద్దీపింప జేయి. అందుకు అజ్ఞానానంధకారంలో మునిగిపోవుట అవసరమైతే అట్లాగే నన్ను కలిసిపోనీ. అయితే అది మీ ఇచ్ఛే అని నాకు కనీసం తెలుపనైనా తెలుపు. ఓ ప్రభూ! ప్రతిస్పందనగా దివ్యమైన మీ శాశ్వత సాన్నిధ్య ఆనంద గీతాలాపన నా హృదయంలో వినిపిస్తున్నది.

మే 24, 1914

మీ దివ్యకిరణాన్ని సుస్పష్టంగా, వర్ణ వక్రీకరణ లేకుండా తన గుండా సాగిపోనిచ్చే పారదర్శకమైన, స్ఫుటమైన స్ఫటికంగా వుండాలి, పరిపూర్ణ మవ్వాలి అనే కోరికతో గాక మీ కార్యమంతా ఎంత సంపూర్ణంగా నెరవేర్చబడాలో అంత సంపూర్ణంగా నెరవేర్చబడటానికి మా కోరిక. నేనెప్పుడైతే మిమ్ములను ఇది అడుగుతానో "ఆ నేను" ఆ సంభాషించే నేను, ఈ సమస్త పృథ్వి, పరిపూర్ణంగా పరమ శ్రేష్ఠ ప్రకాశాన్ని ప్రతిబింబిచగల విశుద్ధమైన వజ్రంగా నుండాలని ఆకాంక్షిస్తుంది. జను లందరి హృదయాలు నా హృదయంలో స్పందిస్తున్నాయి. వారి ఆలోచనలన్నీ నా ఆలోచనల్లో ప్రతిస్పందిస్తున్నాయి. ఒక సాధుజంతువు యొక్క సత్యమైన వినమ్రశీలమైన లేక మొక్కలోని చిరు ఆకాంక్ష... నా సులబ ఆకాంక్షలో సమ్మిళితమై సమస్తం మీ వైపుగా మీ ప్రేమను, మీ వెలుగును, గెలవడం కోసం, ఈ జీవవ్యక్తిత్వ శిఖరాలను అధిరోహిస్తూ మిమ్మ అందుకోడానికి మిమ్ములను మీ నిశ్చల దివ్యానందం నుండి కదిపివేసి మీరే ఈ వేదనలోని అంధకారంలో కంటూ చొచ్చుకుపోయి దానిని మీ దివ్యానందం లోనికి, మీ సర్వశ్రేష్టమైన శాంతి లోనికి రూపాంతరం చెందించాలని ఆకాంక్షిస్తుంది. తనను తాను యిచ్చివేసుకొనే అనంత ప్రేమతో ఈ ఉగ్రత తయారైంది. మీ పరిపూర్ణ సమ్మేళనంలో నుండి వెలువడిన హామీతోనే విశ్వాసభరితమైన నిర్మలత్వం చిరునవ్వులు చిందిస్తుంది. ఓ ప్రియమైన గురుదేవా, మీరే విజేత, మీరే విజయము, మీరే గెలుపు, మీరే దివ్యప్రేమను జయించిన విజయశక్తి, నీవే సాధనవు, నీవే విజేత గెలుపొందినవారు.

మే 25, 1914

సమస్తంలోనూ మీ దివ్యప్రేమను మేల్కొలిపే మీ హృదయాన్ని నేను, ఓ దివ్యప్రేమ విజయశక్తీ, మీరే సర్వశ్రేష్ఠమైన విశ్వగురువు. మీరే విశ్వవిధాత, దాని రక్షకులు, దానిని అల్లకల్లోలం నుండి పైకి వచ్చుటకు అనుమతించినవాడివి, ఇప్పుడు దానిని శాశ్వత లక్ష్యసాధన దిశగా నడిపించు. అంతటి వినమ్రత కలిగినదేదీ లేదు. కానీ నేను దానిలో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న మిమ్ములను చూస్తున్నాను. మీ సంకల్పానికి విరుద్ధంగా వున్న జీవి ఏదీ నాకు కనిపించలేదు, కానీ ప్రతిదానిలో

మీరే జీవిస్తున్నట్లు, పనిచేస్తున్నట్లు ప్రకాశిస్తున్నట్లు అనుభూతి చెందుతున్నాను.

ఓ నా ప్రియమైన దేవా! దివ్యప్రేమ సారమా, నేను మీ హృదయాన్ని, మీ ఉద్ధృత ప్రేమధారలు నా సమస్త అస్తిత్వము గుండా అన్నింటిలోనూ మీ ప్రేమను మేల్కొల్పడానికి ప్రవహిస్తుంది, లేదా ఉత్తేజపరచే మీ ప్రేమచైతన్యానికి అన్నింటినీ మేల్కొల్పాలి.

మిమ్ములను గుర్తించలేని వారందరూ, మిమ్ములను తెలుసుకోలేని వారందరూ, మీ సుఖప్రదమైన దివ్యశాసనంపై విముఖత పొందిన వారందరినీ నా ప్రేమహస్తాల్లోని తీసుకొని, ప్రేమతో నిండిన నా ప్రేమ హృదయపు ఊయలలో ఊపుతాను, మీ మహాద్భుత కాంతిప్రసరణ వారిలో ప్రవేశించి మీ ఆనందోత్సాహాల వారు పరివర్తన చెందునట్లుగా మీ దివ్యతేజానికి వారిని గురిచేస్తాను.

ఓ దివ్యప్రేమమయా, ఓ దీప్తివంతమైన దివ్య ప్రేమమూర్తీ, మీరు సమస్తం లోనికి జొరబడి, సమస్తాని రూపాంతరీకరిస్తారు.

జూన్ 1, 1914

నేను మీ అక్షయ ప్రేమను మాత్రమే తప్ప మరేమీ కాను


నేను మీ అక్షయమైన ప్రేమను కాక మరేమీ కాను. నే నన్నింటి లోనికి చొచ్చుకొని పోతాను. ప్రతి అణువు హృదయంలో వుంటూ పవిత్రీకరించే, రూపాంతం చెందించే ఆగ్నిని దానిలో రగిలిస్తాను. ఆ అగ్ని ఎప్పటికీ చల్లారదు. అది మీ దివ్యానందోత్సాహాల జ్వాలామయ వార్తాహరి, సమస్త పరిపూర్ణత్వాలను సిద్ధింప చేసుకొన్నది. అది ఏకాగ్రతతో ఎదుగుతూ మీ వైపుకు మరలి ఓ అవిదిత దివ్యతేజమా, పారవశ్యంతో నూతన అవతరణకై వేచి చూస్తుంది.

జూన్ 2, 1914

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

"ఇపుడు నీవు నీ అంతరాత్మకై జరిపే అన్వేషణ మానవుని కోసం గాని నీ కోసం కాదు.



నూతన శక్తి — నూతన సృష్టి గురించిన సందేశము

సర్వము దైవప్రసాదితము కాని నిమ్నప్రకృతి మాత్రం అజ్ఞానజనిత శక్తి. అందువలన అది పరమ సత్యము యొక్క శక్తి కానేరదు, కేవల సత్యాసత్యముల మిశ్రమము. శ్రీమాత వున్నది అజ్ఞానశక్తికి ప్రతిగా కాదు, పరమ సత్యాన్ని క్రిందికి తేవడానికై దిగివచ్చిన దివ్యశక్తికి ప్రతిగా, అజ్ఞానం నుండి వెలువడిన పరమ సత్యానికి బాసటగా.

ఏప్రిల్ 12, 1932 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

"భగవంతుడు మనిషిలా మారువేషం వేసుకొని విశ్వంలోని కవతరించి పని చేస్తాడు. ఎవరూ తెరువలేని భగవంతుని మార్మిక నివాస ప్రాంగణంలో ప్రవేశించే ద్వారాన్ని కనుగొంటాడు. కనుగొని అమృతుని చేరు బంగారు ద్వారాన్ని తెరుస్తాడు. అపుడు మానవుడైన మనిషి, మానవునిలా నడిచే భగవంతుని అనుసరిస్తాడు.

"భగవంతుడు మానవ మనస్సును స్వీకరించడానికి, మర్త్య అజ్ఞానాన్ని వలువలుగా ధరించి మూడడుగుల స్థలం కోసం వామనుడై, నిన్ను భగవంతునిగా అభివృద్ధి చేయ సాయం అందించడానికై నీ అంతరాంతరాల్లో వేచి వున్నాడు.

"మనిషి అజ్ఞానాన్ని అంగీకరిస్తూ ఆతనికి జ్ఞానాన్ని, వెలుగును నీవు అందించాలి. ఆతని విషాదాన్ని అంగీకరిస్తూ ఆతనికి ఆనందాన్ని నీవు అందించాలి"

శ్రీఅరవిందులు

సావిత్రి, పుట. 488

(ఈ అనువాదం శ్రీయతులు కోనేరు వెంకటేశ్వరరావు గారి 'సావిత్రి' తెలుగు అనువాదం పుస్తకం-7, యోగం, ఆశ్వాసం 3, 'ఆంతరసీమల లోనికి ప్రవేశం' నుండి సేకరించబడినది.)

భగవన్నివాసము: యజ్ఞవేదిక

ప్రభూ, నేను మీ ముందు మోకరిల్లి వున్నాను, దివ్యసంయోగ ప్రజ్వలితాగ్నిలో అర్పించబడే ఆహుతిలా...

ఆ విధంగా మీ ముందున్నది దేవాలయ మనబడే ఈ దేహము, అందులోనున్న సమస్తము, దాని దరి చేరినవారు, ఏదో విధంగా దానితో సంబంధమున్నవారితో సహా ఈ ప్రపంచమంతటితో పరస్పర సంబంధమున్నవారంతా, ఈ కేంద్రం నుండి ఈ మండుతున్న అగ్నిగుండం ఏదైతే మీ దివ్యప్రేమతో, మీ దివ్యతేజంతో అధికాధికంగా వ్యాప్తిచెంద బోతున్నదో దాని నుండి మీ శక్తులు ఈ పుడమి అంతటా అందరి హృదయాల్లోను, ఆలోచనల్లోను కనిపించి కనిపించకుండా ప్రసరిస్తాయి....

ఓ ప్రియమైన పిల్లలారా, అసంతుష్టులు, అజ్ఞానులు అగు మీరు, పెడసరము, ఉగ్రమైన స్వభావముగల మీరు, మీ శక్తియుక్తులను శాంతపరచండి. ఎందుకనగా ఇక్కడికి దివ్యప్రేమ యొక్క మధురమైన అనంతశక్తి అరుదెంచబోతున్నది. మీలోకి

చొచ్చుకపోయే వెలుగుయొక్క స్వచ్ఛమైన కాంతి ఆవిష్కరించ నున్నది. మాన వీయమైన ఈ ఘడియ, ఐహికమైన ఈ ఘడియ ఇతర ఘడియ లన్నింటిలోకి అంద మైనది. అందరూ దానిని తెలుసుకొని మీ కందించబడే సమృద్ధమైన వాతావరణంలో పరమానందభరితులై ఓలలాడాలి.

దుఃఖభాజిత హృదయాలు, వ్యాకులత, చికాకుతో ముడిబడిన కనుబొమలు, అవివేకము, అస్పష్టత, అజ్ఞానభరిత ద్వేషభావనతో రగులుతున్న మానవులారా, మీ తీవ్రతాపాన్ని శాంతపరచండి, తుడిచివేయండి. చూడండి. క్రొత్త వైభవోపేత సందేశం అరుదెంచింది. 'నేనిక్కడే వున్నాను.'

జూన్ 9, 1914

దైవనిర్ణయము: వాగ్దానము

మనం నిర్వహించవలసింది ఈ సృష్టి యొక్క యదార్థమైన కార్యాన్ని. నేటి వరకు అవిదితమైన వున్న దివ్యశక్తి సమృద్ధిగా ప్రకటిత మవటానికిగాను నూతన కార్యరంగాలను రూపొందించాలి, జీవి అనుసరించవలసిన నూతన విధానాలను తీర్చిదిద్దాలి. ఓ ప్రభూ, ఈ భగీరథ ప్రయత్నానికి నేను అర్పితమయ్యాను. కారణం, నా నుంచి మీరు కోరేది అదే గనుక. అయితే, మీరు నన్ను ఈ పని కోసం నియ మించారు గనుక అందుకు యోగ్యమైన విదివిధానాలను మీరే నాకు సమకూర్చాలి. అనగా ఈ కార్యసాఫల్యతకు అవసరమైన జ్ఞానసంపదను ప్రసాదించాలి. మా ప్రయత్నా లన్నింటిని ఏకీకృతం గావిస్తాము. ఈ దివ్యశక్తి ప్రకటితమవడానికి కావలసిన జ్ఞానం కోసం పడే నిరంతర తపనలో నా అస్తిత్వం యావత్తూ కేంద్రీకృతమవుతుంది. జీవికి మూలకేంద్రమయిన మీరు ఈ దివ్యశక్తి అంతటా చొచ్చుకుపోయి, ఆటంకా లన్నింటినీ అధిగమించి, రూపాంతరీకరించుటకు దానిని పూర్తిగా వెలిబుచ్చాలి. వ్యక్తిగత జీవితరంగాలతో మీరు ఖరారు చేసిన ఒడంబడిక ఇది. మీరు ఒక వాగ్దానం చేసారు. మీరు ఈ లోకంలోకి ఈ పనిని నిర్వహించగలిగిన మీ వాగ్దానాన్ని సఫలీకృతం చేయగలిగిన సమర్థులను పంపించారు. ఇప్పటి ఈ స్థితి మీ సమగ్ర సహాయాన్ని అర్థిస్తున్నది, ఏది వాగ్దానం చేయబడిందో అది సఫలీకృతమవటానికి.

మాలో ఈ జోడు సంకల్పాలు, ఈ రెండు ప్రసరణలు ఏకం కావాలి. వాటి కలయికతో వెలుగులు విరజిమ్మే విద్యుజ్యోతి కణం ఎగిసిపడాలి.

ఈ పని తప్పక నెరవేర్చబడాలి గనుక, అది అవశ్యం నెరవేర్చబడుతుంది.

జూన్ 14, 1914

అతిమానస శోభను ఆవరించిన ఉజ్వల కాంతి

భానుతేజంలా మీ వైభవోపేతమైన కాంతి పుడమిపై దిగి వస్తుంది, మీ కాంతి కిరణాలు ప్రపంచంలో వెలుగులు నింపుతాయి. ఉజ్వల కాంతి కేంద్ర శోభను అందుకొని ప్రదర్శించడానికి తగినంత స్వచ్ఛత, మృదుత్వం గల మూలద్రవ్యాలన్నీ తమంతట తాము ఒక్క చోట గుమికూడుతున్నాయి. ఈ సమాగమము ఏదో ఒక ఏకాభిప్రాయంపై చోటు చేసుకోలేదు, స్వచ్ఛందంగా జరిగినది, ఏ ప్రత్యేకమైన నిర్ణయానికి కట్టుబడినది కాదు, మీ శోభ ప్రసరితం కావాలని కోరుతున్నది, దేనిని ప్రదర్శించగలదో దానిని ప్రదర్శిస్తుంది. ఈ విభాజిత ప్రపంచంలో ఏ దివ్య కేంద్రమైతే ఆవిష్కరించబడాలో దానిని సమగ్రంగా పునః వ్యవస్థీకరించుటకు ఈ మూలద్రవ్యాలన్నీ ఏకమవుతాయి.

ఈ ఆశ్చర్యకరమైన ఆలోచనా సరళిలో అస్తిత్వంలోని కణాలన్నీ అనందోత్సాహంతో ఉప్పొంగుతాయి. దానిని గమనించి పరిపూర్ణమైన వాస్తవాంశం పారవశ్యత లోకి జారుకుంటుంది. ఏ విధంగా ఈ వాస్తవాంశాన్ని మీ నుండి వేరుగా గుర్తించాలి? అది మీరే — పూర్తిగా, ఆసాంతం, అత్యధికంగా — ఒక సమగ్రమైన తాదాత్మ్యతలో మీరే.

జూన్ 16, 1914

గతకాలపు కౌశల్యతలు, నూతన శక్తులు

నేటి వరకు ఊహించబడిన, సాధించబడినదాని నంతా నిజానికి ఏ స్థాయికి చెందినదై వుండాలో అని పరిశీలించినట్లయితే, అదంతా అతిసాధారణము, రసహీనము, సరిపోనిదని తెలుతుంది. గతకాలపు కౌశల్యతలు నేడు శక్తి హీనములు. నూతన శక్తులు మీ దివ్యసంకల్పానికి అనుగుణంగా పరివర్తన చెందుటకు మరొక బలీయమైన నూతన శక్తి అవసరం. "అర్థించు, అది తప్పక అయి తీరుతుంది" అని మీ సుస్థిర సమాధానం. ఓ ప్రభూ, ఈ జీవిలో ఒక అచంచలమైన ప్రశాంత స్థితిలో అవిచ్ఛిన్నమైన తీవ్రమైన, ఆవేశభరితమైన అభిలాషను తప్పక సృష్టించాలి. నిశ్శబ్దత, ప్రశాంతత

ఇక్కడ ఇప్పటికే అలముకొని వున్నాయి. అయితే వాటి ఆధిక్యత కూడా నిరంతరంగా కొనసాగాలి. ఓహ్, మీరు ఏమి సంకల్పించారో అవన్నీ సార్థకమవబోతున్నట్లుగా మీ హృదయం ఒక ఆనందగీతికను ఆలాపిస్తున్నది.... వీటి సారాంశాల అవశేషాల నుండి నూతన ఆవిష్కరణకు అనుగుణంగా నుండే కొంగ్రొత్తవి ఆవిర్భవించటానికి వీలుగా వాటిని నిర్మూలించండి. ఓహ్, ఏమి మీ తేజోమయ ప్రశాంతత యొక్క అపారత!

ఓహ్, ఏమి మీ సర్వోత్కృష్ట దివ్యప్రేమ యొక్క సర్వోతోముఖ శక్తి!

అంతే గాక మేమూహించిన వాటన్నింటిని మించిన దేదో ఆవిష్కరించబోతున్నదనే అనుభూతి లోని అనిర్వచనీయమైన మహదానందమేమని చెప్పాలి. ఆ మహత్తరమైన ఆలోచన మాకు ప్రసాదించు, ఆ దివ్య సందేశాన్ని మా కందించు, ఆ దివ్యశక్తిని మాకు సమకూర్చు.

...ఓ నూతన జన్మ నెత్తిన అవిదితడవైన పురుషా! ప్రపంచ ప్రదర్శనా రంగంలో ప్రవేశించు.

జూన్17, 1914

ప్రకటితమవటానికి దివ్యశక్తి సంసిద్ధమై వున్నది

ఈ దృశ్యంలో ఎంత నిండుతనముంది! వినయము, విధేయత, నిరాడంబరత, ఆత్మసమర్పణ, ఆదరాభిమానము, ప్రశాంతచిత్తము, చిరునవ్వు, సర్వజీవుల యందు ఏకత్వ భావన, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనుకోకపోవుట, అన్ని విషయాలలో ఏకీభావనతో వున్న ఈ జీవి మీ ముందు మోకరిల్లి వున్నది. అదే సమయాన ఇక్కడ విరాజిల్లుతున్న మీ దివ్యశక్తి యొక్క అసాధరణమైన సర్వతోముఖ సామర్థ్యం ప్రకటితమగుటకు వేచి యున్నది. అనుకూలమైన శుభఘడియ కోసం, అవకాశం కోసం నిరీక్షిస్తున్నది. ఇది మీ విజయవంతమైన సాటిలేని సార్వభౌమత్వ వైభవం.

ఇక్కడ దైవశక్తి ఆసన్నమయింది. భరోసాతో వేచి యున్న మీరు ఆనందంతో ఉప్పొంగండి, నూతన ఆవిష్కారం అతి దగ్గరలో నున్నది.

దివ్యశక్తి ఇక్కడ ఆసన్నమయింది.

ప్రకృతి అంతా ఆనందోత్సాహాలతో శ్రావ్యంగా ఆలపిస్తున్నది, పండుగ వాతావరణంతో పులకించి పోతున్నది. దివ్యశక్తి ఇక్కడ ఆసన్నమయింది.

మేలుకో, సజీవుడవై వుండు, ఆధ్యాత్మిక వికాసంతో దేదీప్యమానంగా ప్రకాశించు. మేలుకో, అందరి రూపాంతరీకరణ కోసం పోరాడు.

దివ్యశక్తి ఇక్కడ ఆసన్నమయింది.

జూలై 6, 1914

సర్వోన్నత దివ్యశక్తి యొక్క ప్రశాంతత ఇక్కడ నెలకొని వుంది.

ప్రశాంతత, పృథ్వీపై అంతా ప్రశాంతత....

అది అచేతన వలన కలిగిన నిద్రావస్థలోని ప్రశాంతత కాదు, లేక ఆత్మసంతృప్తితో ఏర్పడిన మాంద్యం వలన కలిగే ప్రశాంతత కాదు, అజ్ఞానంతో తనను తాను మరచినందు వలన, తేజోహీనమైన ఉదాసీనత వలన ఏర్పడే ప్రశాంతత కాదు. సర్వోన్నతమైన దివ్యశక్తి అవతరణ వలన కలిగిన ప్రశాంతత. సంపూర్ణ అన్యోన్య సంబంధాల వలన ఏర్పడిన ప్రశాంతత, సమగ్రమైన జ్ఞానోదయం వలన కలిగిన ప్రశాంతత.

ఎందుకు తనను తాను మానసికంగా పీడించుకొని బాధపడటం, ఎందుకు ఈ దుస్సహమైన పోరాటం, బాధాకరమైన ఏవగింపు, ఎందుకు ఈ వ్యర్థమైన ఎదిరింపు, ఎందుకీ అచేతన, ఈ మొద్దు నిద్ర? నిర్భయంగా మేలుకో, నీ లోని పరస్పర వైరుధ్యాలను సమాధానపరచు, నీ వివాదాలకు స్వస్తి పలుకు, కళ్ళను హృదయాలను తెరచి వుంచు, దివ్యశక్తి ఇక్కడ ఆవిష్కరించింది, అది దివ్యమైన పవిత్రతతో, తేజంతో, శక్తితో విరాజిల్లుతున్నది. అది ఒక అపరిమితమైన ప్రేమ, సర్వోత్కృష్ట శక్తి, నిర్వివాదమైన వాస్తవికత, ఒక అకల్మషమైన ప్రశాంతత, అవిచ్ఛిన్నమైన దివ్యానంద ప్రాప్తి, దివ్యాశీస్సు, తనదైన ఉనికి గలది, అపారమైన జ్ఞానసంపద యొక్క అనంతమైన పరమానందం... అంతే గాక అది ఇప్పటికీ చెప్పలేనంత అధికాధికమైనది, కానీ ఇప్పటికే ఊహ కందని ఊర్ధ్వ లోకాలలో సర్వోత్కృష్టమైన రూపాంతరీకరణ శక్తి గాను, పదార్థ ప్రపంచపు అచేతన లోతుల్లోను ఒక ప్రబలమైన స్వస్థత చేకూర్చే దివ్యశక్తిగాను పని చేస్తున్నది....

విను విను, ఓ తెలుసుకోగోరే వాడా,

చూడు, చూసి, ధ్యానించి, జీవితం కొనసాగించగోరే వాడా,

దివ్యశక్తి ఇక్కడ వున్నది.

జూలై 7, 1914

భౌతిక అస్తిత్వం యావత్తూ కరిగిపోయి అంతులేని ప్రేమాభిమానాలతో తిరిగి సంఘటితమగుటకు ఆరాటపడుతున్నది. ఓ ప్రభూ, అత్యున్నత దివ్యశక్తి, అమితమైన దివ్యానందముల సందేశాన్ని అందించటానికి దివ్య వార్తాహరుడిగా వస్తు ప్రపంచాన్ని స్పర్శించటానికి విచ్చేసిన మీరు సంపూర్ణ సాఫల్య స్థితి ఏ విధంగా నుంటుందనే భావనను కలిగిస్తారు. దానిలో మీ మహోన్నతమైన ఆదేశం నిశ్చయంగా నిక్షిప్తమై వున్నదని జీవి నమ్మినప్పుడు, అది కేవలం వాగ్దానం మాత్రమేనని, సంపూర్ణ సాఫల్యత యొక్క సంకేతమనే నమ్మకం కుదిరించి మీరు వైదొలగుతారు. ఎంత విచారకరం, మిమ్ములను పట్టి వుంచలేనంతటి వస్తు ప్రపంచం ఎంత దోషభూయిష్టమైనది! ఓ ప్రభూ, మీ సర్వోత్కృష్ట శక్తిని ప్రయోగించండి. మీ ఉనికి శాశ్వతమనే అద్భుతాన్ని సృష్టించండి.... ఎందుకింత తటపటాయింపు? మేము విజయ మొందాలి లేదా నశించాలి!...

విజయం, విజయం, విజయం! మాకు దివ్య రూపాంతరీకరణ విజయం కావాలి!

జూలై 11, 1914

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రీమాత, నేను ఒక్కటే, అయితే రెండు శరీరాలలో వున్నాము. రెండు శరీరాలు ఎల్లప్పుడూ ఒకే చర్య చేపట్టవలసిన అవసరం లేదు. అందుకు బదులుగా మేమిద్దరమూ ఒకటే గావున ఎలాగైతే ప్రణామ మందుకోటానికి గాని లేక ధ్యానం ప్రసాదించడానికి గాని ఒక్కరం క్రిందకి వెళితే సరిపోతుందో, అలాగే ఒక్కరే ఇద్దరికీ చిహ్నంగా నుంటే చాలు.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

CWSA 32:82

పృథ్వికై దివ్యజనని యోగము

మిమ్ములను కనుగొనుట ఒక అనంత మెట్ల వరుసలో మొదటి మెట్టు

అస్తిత్వపు స్థితులన్నింటి యందు, కార్యకలాప విధానా లన్నింటిలో, సమస్త వస్తువులలో సమస్త లోకాలలో మిమ్ములను దర్శించగలం, మీతో యేకం కాగలం, ఏలనన మీరు ప్రతి చోటునా, యెల్లపుడూ వుండనే వున్నారు. తన అస్తిత్వపు ఒక కార్యకలాపంలో, లేక జగత్తు నందలి ఒక రంగంలో మిమ్ములను దర్శించిన వ్యక్తి "నేను వారిని కనుగొన్నాను" అని ఇంక దేనినీ అన్వేషించడు. మానవుడు చేరుకొనగల శిఖరానికి చేరుకొన్నానని అతను భావిస్తాడు. ఎంత పొరపాటు! సమస్త స్థితులందూ, సమస్త విధానము లందూ, సమస్త వస్తువు లందూ, సకల లోకాల యందూ, సమస్త భూతములందూ మిమ్ములను ఆవిష్కరించుకోవాలి, మీతో యేకం కావాలి. ఏ అంశాన్నైనా విడిచివేస్తే, అదెంత అల్పమైనదైనా ఆ కలయిక పరిపూర్ణంగా కాలేదు. సాక్షాత్కారం సఫలమైనట్లు గాదు. అందుచేత మిమ్ము దర్శించుట అనేది ఒక అనంత మెట్ల వరుసలో మొదటి మెట్టు....

జూలై 12, 1914

నా బాధ్యత లన్నింటినీ మీ మీదే వేసుకొన్నారు!

ఇహలోక దైవ సాక్షాత్కారాలన్నీ మా దృష్టిలో, తేలికగా గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొంటాయి. మనల్ని మనుష్యులుగా చేసిన ఈ పరిమిత రూపంతో వున్న బాహ్య అస్తిత్వానికి తగిన నిష్పత్తిలోనే అవి ఉంటాయి. ఈ ఐహిక సాక్షాత్కారం ఏ విధంగా నీకు సాటిది, అది నీ ముందు యేపాటిది? అదెంతో సంపూర్ణం, పరిపూర్ణం, దివ్యం అయినదైనా గావచ్చు, అది విలువ లేనిదే గాక మీ శాశ్వతత్వంలో తెలియ జాలని ఓ క్షణమే. తద్వారా లభించే ఫలితాలు శక్తివంతం, అద్భుతమైనవి గావచ్చు, నీ వైపు సాగే అనంత మహాయానంలో అగ్రాహ్యమగు ఒక అణు సదృశ్యం. దీనిని మీ కార్యసాధకులు యెన్నటికీ మరువరాదు, మరచినవారు మిమ్ము సేవించుట కనర్హురలౌతారు....

ఓ నా ప్రియమైన గురుదేవా! దేనికైనా సరే తానే బాధ్యుడనని భావించడం, మీ సర్వోన్నత దివ్యసంకల్పాన్ని వ్యక్తిగతమైనదిగా చేయగోరడం యెంత పసితనపు

భావన! మీ హృదయంతో యేకమై అచట శాశ్వతంగా జీవిస్తూ వుండిపోతే చాలదా? అపుడు మా సమస్త బాధ్యతలనూ, మీ మీద వేసుకొంటారు, మాకు తెలియవలసిన అవసరం లేకుండానే మీ ఇచ్ఛ పని చేస్తుంది..... బాహ్య పరిస్థితుల ప్రమేయం లేకుండా, సమస్త సంగత్వం నుండి, అదెంత గొప్పదైనా, బౌద్ధిక భావబంధం నుండి స్వేచ్ఛ పొందిన సాక్షాత్కారమే యదార్థ విలువగల సాక్షాత్కారమౌతుంది. అటువంటి సాక్షాత్కారం మాత్రమే, మీతో సమగ్రంగా, అతి సన్నిహితంగా, నిశ్చయాత్మకంగా జరిగిన యేకత్వం అవుతుంది. అశాశ్వతమైన, అస్థిరమైన ప్రపంచంలో, మీ మారిపోవు క్షణిక అభివ్యక్తికి సంబంధించిన రక్షణ బాధ్యత తమదే. అది కొనసాగడానికి కావలసినదంతా, మంచిదనుకున్నదంతా మీరు చేయాలి. ఓ, నా ప్రియ గురుదేవా! సర్వేశ్వరా! నా బాధ్యత లన్నింటినీ మీరే తీసుకొన్నారు. మీ మహదానంద స్థితిని, మీ దివ్య సంపర్కపు పరమ ప్రహర్షాన్ని మాత్రమే నాకు మిగిల్చారు.

జూలై 17, 1914

అనంత స్తంభాకృతిగల పరం జ్యోతి

దేహస్పృహ కాని మరే యితర స్పృహ కాని లేదు, దేహ పాదపీఠం మామూలుగా యెచట నుండునో అచటి నుండి, శిరసుగల చోటికి, అచట చంద్రబింబాకారమున తయారగుటకు లేచుచున్న స్తంభాకృతి గల వెలుగు మాత్రమే వున్నది. అచటి నుండి ఆ స్తంభాకార వెలుగు, శిరసు పైకి, చాలా పైకి, కనులు మిరుమిట్లు గొలుపు, బహు వర్ణ రంజితమై వెలుగుచున్న అపరిమేయ సూర్యుని లోనికి విస్తృతమౌతూ పోతున్నది. ఆ సూర్యుని నుండి పృథ్వినంతా ఆవరించి వేస్తూ బంగరు కాంతి వర్షిస్తూ వచ్చిపడింది. తిరిగి అండాకార సజీవ వెలుగుగా రూపొందుతూ, శిరసు పైన గల కేంద్రాల లోనూ, శిరసులోని, కంఠ మండలి, హృదయ మండలి, నాభి యండలి, మూలాధార మండలి, ఇంకా క్రిందుగా వున్న, ప్రతి కేంద్రాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో, ఒక ప్రత్యేక కంపనం ప్రకారం మేలుకొలుపుతూ, వాటిలో కదలికను ప్రేరేపిస్తూ నెమ్మదిగా ఆ స్తంభాకార వెలుగు మరింత క్రిందికి దిగి వచ్చింది. మోకాళ్ళ స్థాయిలో ఆరోహణా, అవరోహణా ప్రవాహాలు రెండూ కలుసుకొన్నాయి, ఆ విధమైన ప్రసరణ, అవిరామంగా, మొత్తం అస్తిత్వాన్నంతా ఒక అపరిమేయ అండాకార సజీవ తేజస్సుతో ఆవరించి వేసింది.

తరువాత నెమ్మదిగా చేతన ఒక్కొక్క దశను దాటుకుంటూ ప్రతి లోకంలోనూ ఆగుతూ, దేహ చేతనకు తిరిగి వచ్చేంత వరకు క్రిందికి దిగి వచ్చింది. నా జ్ఞాపకము సరైనదైతే, దేహ చేతనను తిరిగి పొందడమనేది తొమ్మిదవ దశ. ఆ క్షణంలో దేహం యింకా బిర్ర బిగుసుకొని, చలనరహితంగా వుంది.

జూలై 21, 1914

విభిన్న యోగికానుభవాల లక్ష్యాన్ని సమన్వయపరచుట:

సాధారణంగా యోగ పరాకాష్టగా, యోగాన్ని పరిపూర్ణంగా సాధించినదానికి ఋజువుగా చూపబడే సమస్త అనుభవాలను ఒకదాని తర్వాత మరొకటిగా నాకు అనుభవమగునట్లు నన్ను మీరు తయారుచేసినట్లు నా కన్పించింది. ఆ అనుభవం అత్యంత స్పష్టం, సంపూర్ణం. ఆ అనుభవంలోనే అనుభవ ప్రభావం వల్ల కలిగే పర్యవసానాలున్నాయి. అది సచేతనమై సంకల్పించబడినదై ఒక క్రమపద్ధతిలో జరిగిన కృషి ఫలితమే గాని వూహించని విధంగా, యాదృచ్ఛికంగా ప్రాప్తించినది గాదు. అయినప్పటికీ అదెప్పుడూ దేనినీ పోలని అనుభవమే. ఒక పొడుగుపాటి రోడ్డుతో కలుపబడి ఒకదాని నుండి మరొకటి దూరంగా పెట్టబడిన మైలురాళ్ళ వలె ఒక్కొక్కటి గానే అనుభవాలు కలుగుతాయి. పైపెచ్చు అనంతమైన ఆరోహణను తెలుపు ఈ మైలురాళ్ళు యెన్నడూ ఒకదానిని పోలి మరియొకటి వుండదు. అవెప్పుడూ క్రొత్తగా వుండి ఒకదాని కొకటి సంబంధం లేనివిగా వుంటాయి... ఇంత వరకు సాధించిన వాటన్నింటి కన్న మరింత సంపూర్ణమైన, మరింత సుందరమైన ఒక నూతన సాక్షాత్కారాన్ని వాటి నుండి సంగ్రహించగలిగే విధంగా ఈ అగణనీయ అనుభవా లన్నింటినీ సమన్వయపరచే సామర్థ్యం లభించునట్లు ఈ జీవిని తయారుచేయు సమయం వస్తుందా? నాకు తెలియదు. ఒక అపురూపమైన అనుభవం, నాకు ప్రాప్తించక ముందు నేను ఆశించినట్లు నిలిచి వుండకుండా అంతర్ధానమైనపుడు, విచారించకుండా వుండడం యెలాగో మీరు బోధించారు. నేను సాధించిన పురోగతిలో అస్థిరతకు సంబంధించిన చిహ్నంగా ఆ అంతర్ధానము కన్పించలేదు. ఆ బాటపై వివిధ దశ లున్నవి. ఆ దశలలో అవసరానికి మించి యెక్కువ కాలము తాత్సారము చేయకుండా ముందుకు పోవుటను అది తెలియ చేయుచున్నది. ఈ అభివ్యక్తి సాధనం పరిమిత మైనదని మేం భావిస్తాం గనుకనే అది పరిమితమై యున్నదని మరి కొంచెం

తేటతెల్లమయ్యేటట్లూ, అది మిక్కిలి శక్తివంతంగా నీ అనంతత్వంలో పాలు పంచుకొంటుందనీ నీవు ప్రతిసారీ మరింత ఉత్తమంగా బోధించావు. అవధులు లేని సీమల లోనికి ద్వారాలను బార్లా తెరచివేస్తూ తన ఆవాస స్థానమైన ఉపకరణంతో ప్రతిసారి మీ అపరిమేయతకు సంబంధించిదేదో కొంత, సన్నిహిత బాంధవ్యాన్నేర్పాటు చేసుకొంటోంది.

జూలై 21, 1914

దివ్యజనని ఆత్మాహుతి

ఓ ప్రభూ! ఓ శాశ్వత గురుదేవా! క్రియాశక్తుల సంఘర్షణచే మానవులు నెట్టబడుచున్నారు. వారొక మహోన్నత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. వారు తమ జీవితాన్ని రక్తసిక్తమైన ఆహుతిగా అర్పిస్తున్నారు.

ఓ ప్రభూ, ఓ శాశ్వత గురుదేవా! ఇదంతా నిరర్ధకము గాకుండునట్లనుగ్రహింపుము, మీ దివ్య క్రియాశక్తి అక్షీణ ప్రచండ ప్రవాహాలు పృథ్వి యంతట విస్తరించి, దాని యాతనామయ వాతావరణం లోనికి పెనగులాడుతున్న ఊర్జాల లోనికి, సంఘర్షిస్తున్న, హింసాపూరితమైన అస్తవ్యస్త స్థితి లోనికి చొచ్చుకొనిపోవ అనుగ్రహింపుము. మీ దివ్యజ్ఞాన విశుద్ధప్రకాశం తరిగిపోని, మీ దివ్యప్రేమ మనుషుల హృదయాల నిండిపోయి, వారి అంతరాత్మల లోనికి ఇంకిపోయి వారి చేతనను ప్రకాశింప జేసి, మీ సార్వభౌమ్యాత్మక దివ్య సాన్నిధ్య వైభవాన్ని, ఈ అజ్ఞానం నుండి అస్పష్ట భయంకర శక్తివంతమైన నిశీధి నుండి ప్రకటితమౌనట్లు చేయుమో ప్రభూ! వారికి తెలియకుండా వారు చేసే ఆత్మబలిదానం, దాని వల్లనే ప్రభావవంతం కాగలందులకు, సచేతనంగా, సంపూర్ణంగా తెలిసి నా అస్తిత్వపు మొత్తం ఆత్మార్పణ చేసుకొంటూ మీ ముందు సాగిలబడింది.

ఈ నివేదనను స్వీకరించి, మా ఆక్రందనకు బదులు పలుకుతూ దర్శనమివ్వు!

ఆగస్టు 4, 1914

పృథ్విపై ఆసురిక శక్తులు విరుచుకు పడుతున్నాయి

... పెను తుఫానులా భయంకర శక్తులు, అంధకార శక్తులు, తీవ్రమైన, బలీయమైన అంధశక్తులు పృథ్విపై విరుచుకు పడుతున్నాయి. ఓ ప్రభూ! వాటిని ప్రకాశమయం

చేసే శక్తిని మాకు ప్రసాదించు. వాటి యందంతట నీ వైభవం వెల్లివిరిసి వాటి చర్యను రూపాంతరీకరించాలి. వాటి విధ్వంసకర పయనం తన వెనుక ఒక దివ్య బీజాన్ని విత్తిపోవాలి...

ఓ నా గురుదేవా! నా నివేదనను తిరస్కరించకు. సమృద్ధ సమర్పణలో పరిపూర్ణ అభివ్యక్తిలో నేను సంపూర్ణముగా మీ దాననగు అర్హతను నాకు ప్రాసదించు!

ఆగస్టు 8, 1914

మీ అనంత ప్రేమ విశాల వక్షస్థలాన్ని నేను

ఓ నా ప్రియమైన గురుదేవా? ఈ సమస్త అయోమయ ఆలోచనలందు, ఈ బాధాతప్త హృదయాల యందు ప్రవేశించు, అచట మీ దివ్య సాన్నిధ్యాన్ని వెలిగించు. ధరిత్రి నీడ తిరిగి దాని పైనే పడినందువల్ల అది పూర్తిగా భయభ్రాంతమైనది. అయితే ఈ ఛాయ నీ దివ్యతేజాన్ని మరుగుపరుస్తోంది. అదిప్పుడీ దయనీయమైన భువిపై విరుచుకు పడుతోంది, దాని పునాదులనే కదిలించి వేస్తోంది, దాని నిపుడు భయంకర అస్తవ్యస్త స్థితికి లోను చేస్తోంది. మీరు మరొకసారి అచట నడయాడి అచట దివ్యతేజము విస్తరిల్ల సంకల్పించరా?

ఓ మహిమోపేతమగు అజ్ఞేయమగు యేకైకమా! మీ ఆత్మ నింత వరకూ అభివ్యక్తము చేయని మీరు మీ మార్గములను సన్నద్ధము చేయు మమ్ము భువి పైకి పంపి, ఆ శుభ ఘడియకై వేచి చూస్తున్న మీకై ఈ జీవి యందలి అంశములన్నియు — "మీ యిచ్ఛయే నెరవేరు గాక" అని ప్రార్థించుచున్నవి, ఒక మహోన్నత, విజయోత్సాహముతో తమను తాము మీ కర్పించుకొంటున్నాయి...

ఈ విచారభరితమైన భువిని మీ కరుణామయ బలీయ బాహువులతో చుట్టి వేయుము. మంగళప్రదమగు మీ ప్రేమరస ఝరులతో దానిని పునీతము చేయుము.

మీ కరుణకు గల శక్తివంతములైన బాహువులు నేనే.

అవధులు లేని మీ ప్రేమ విశాల వక్షస్థలాన్ని నేనే... నా బాహువులు ఈ విచారమగ్న పృథ్విని చుట్టివైచి, దానిని నా ఉదార హృదయమునకు మెల్లగా హత్తుచున్నవి. సంక్షుభితాణువులపై మృదువుగా అత్యంత శుభకరమైన చుంబనం ముద్రితమైంది.

అది మహదాశ్వాసమును, స్వాస్థ్యమును కలిగించు దివ్యజనని ప్రేమపూర్వక చుంబనం.

ఆగస్టు 11, 1914

పృథ్వి అంతయు బాధతో మూలుగుతోంది

ఓ ప్రభూ, పృథ్వి యంతయూ ఆటుపోట్లుకు గురి యౌతున్నది. అది బాధతో మూలుగుతున్నది, వ్యధ చెందుతున్నది, నరకయాతన పడుతున్నది. దానికి సంప్రాప్తించిన ఈ బాధ అంతా నిరర్ధకం కాగూడదు. పుష్పింటి, పృథ్విని ఫలసాయంతో నింపివేయు సౌందర్యం, వెలుగు, ప్రేమ బీజములను మొలకలను ఈ రక్తపాతం త్వరగా మొలకెత్తించునటుల అనుగ్రహింపుము. ఈ అంధకార అగాధాల లోతుల నుండి పృథ్వి అస్తిత్వమంతా దానికి గాని, వెలుతురులను ప్రసాదించమని నీకు మొరపెట్టుకొంటున్నది, ఊపిరాడక కొట్టుకుంటున్నది, దానికి సాయం చేయరా!

ఓ ప్రభూ! విజయం సాధించడానికి మేమేం చేయాలి? మా మొరలాలకించండి ప్రభూ! ఏలాగునైనా మేం విజయం సాధించి తీరాలి. సమస్త నిరోధాన్ని తొలగించి వెయ్యి; దర్శన మివ్వు ప్రభూ

ఆగస్టు 21, 1914

సర్వకాల సర్వావస్థల యందు నిలిచి యుండు ఉషస్సును సంసిద్ధం చేయు నిశీధి

కంటి కంతయు అంధకారముగా కనిపించినప్పటికీ, ఓ ప్రభూ మీ కరుణ మా యందున్నది, అది మమ్మెన్నటికీ వీడిపోదు. మరింత పరిపూర్ణ ఉషస్సులను సిద్ధం చేయడానికి, కొన్ని సమయాల్లో నిశీధి ఆవశ్యకం. కాని ఈ సారి మమ్మెన్నడూ వీడిపోని ఉషస్సన్నిధిలో మమ్ము నిలిపినారు.

మా అత్యంత కృతజ్ఞతాపూర్వక, సమగ్ర సమర్పణ, నివేదనలను స్వీకరింపుము.... వెలుగేతెంచినది, దారి తెరచుకొన్నది. శ్రమాన్వితమైన గతానికి కృతజ్ఞతతో ప్రణమిల్లుతూ, మా ముందు మీచే తెరచి వుంచబడిన నూతన బాటపై మేము వేగంగా ముందుకు సాగిపోతాం. ఒక విశాల మరింత చేతనావంతమైన సాక్షాత్కార నూతన క్షేత్ర ప్రాంగణంలో ఓ ప్రభూ! మీ ముందు ఒక సమగ్ర సమర్పణాభావంతో,

ఆరాధనా పూర్వకంగా ప్రణమిల్లుతున్నాను

మాలో నివసిస్తున్నది మీరే నని, మరొక్కసారి మీరు మాత్రమే, అని అంటున్నాం. ఒక విశాల, మరింత పరిపూర్ణ సామ్రాజ్యానికి, మీ పరిపాలన కర్తృత గల సామ్రాజ్యానికి, మీరు మరోసారి సామ్రాట్టువి గావాలి.

ఆగస్టు 24, 1914

అనువాదం: కె. వి. రావు

శ్రీమాత: మనిషి — దైవము

దివ్యజననితో తాదాత్మ్యత

కొత్త విత్తనాలు చల్లి అద్భుతమైన గుత్తులతో కూడిన ధాన్యపు కంకులతో పంట పండించేందుకు వసుంధరను సిద్ధం చేయడానికి మరియు కొత్త జాతితో వెలిగిపోయే ఫలసాయాన్ని ప్రపంచానికి అందివ్వడానికి, ఈ భయంకరమైన అస్తవ్యస్తతలో, ఘోర మైన వినాశనంలో ఒక గొప్ప కార్యసరళిని, ఒక ఆవశ్యకమైన పెనుగులాటతో కూడిన పరిశ్రమను చూడవచ్చు.... దర్శనం సుస్పష్టంగా, కచ్చితంగా ఉంది. మీ దివ్య ధర్మప్రణాళిక ఎంత సరళంగా గీయబడిందంటే శాంతి తిరిగి వచ్చిందనీ, అది శ్రమజీవుల హృదయాలలో తనకు తానుగా ప్రతిష్ఠించబడిందనీ స్పష్టమౌతున్నది. ఇక ఏ విధమైన సందేహాలు, ఊగిసలాటలు లేవు, ఇక మీద ఎటువంటి పరితాపం లేక అసహనం లేదు. అన్నీ ఉన్నప్పటికీ వ్యతిరేకమైనవన్నీ ఉన్నప్పటికీ, ప్రతికూలంగా కనపడే, మోసపూరితమైన చుట్టుదారు లున్నప్పటికీ నిర్ధారించిన పని తనకు తాను సరళ మార్గంలో నిరంతరంగా నెరవేరుతూ ఉంటుంది. ఈ భౌతిక వ్యక్తిత్వాలకు, తాము ఏ పొరపాటు లేక నిర్దుష్టంగా, తప్పనిసరి అయిన ఫలితాల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా, స్పష్టంగా కనపడే తాత్కాలిక పర్యవసానా లెటువంటి వైనప్పటికీ, మానవజాతిని ముందుకు చాలా దూరంగా ఒక అడుగును వేసేటట్లుగా చేసి ఉంటారని తెలుసు. అనంతమైన పరిణామ క్రమంలో ఆ క్షణాలను పట్టుకోవడం అసాధ్యం. సర్వశ్రేష్టుడైన శాశ్వతుడా, వారు మీతో తమకు తాము ఐక్యమైపోతారు. ఓ విశ్వజననీ, అతీతంగా ఉన్న ఆ తత్ పదార్థంతోనూ మరియు ఏ తత్ పదార్థం

వ్యక్తమైన సమస్త సృష్టి అయినదో దానితోనూ పొందిన ఈ ద్వంద్వ తాదాత్మ్యత యందు వారు పరిపూర్ణ దృఢ విశ్వాసం యొక్క అనంతానందాన్ని చవి చూస్తారు.

శాంతి, ప్రపంచ మంతటా శాంతి....

యుద్ధం అనేది బాహ్యంలో కనపడేదీ మాత్రమే, సంక్షోభం ఒక భ్రమ, అక్కడ శాంతి ఉంది, చెక్కు చెదరని శాంతి ఉంది.

జననీ, ఓ ప్రియజననీ నేనెవరు, ఏకకాలంలో మీరు వినాశకారిణివీ, నిర్మాణ కర్తవూ....

మొత్తం విశ్వం మీ వక్షం మీద లెక్కకు మిక్కిలి జీవితాలతో వసిస్తూ ఉంటుంది, మరి మీ అపారతతో దాని అతి సూక్ష్మ అణువులలోనూ నివసిస్తూ ఉంటారు.

మీ అపారతలోని ఆకాంక్ష అభివ్యక్తంకాని దాని వైపుకు ఇంకా ఎక్కువ సంపూర్ణ తకూ ఇంకా ఎక్కువ పరిపూర్ణతల అభివ్యక్తతకై ఎలుగెత్తి అరిచి చెప్పటానికి మరలు తున్నది.

సమస్తం, ఏకకాలంలో, త్రయాత్మకమై, దివ్యదృష్టి కలిగిన మొత్తం చైతన్యంలో ప్రత్యేక వ్యక్తిత్వం, సార్వజనీనం, అనంతం.

ఆగస్టు 31, 1914

మీ ప్రేమ అవసరమైనవారి వైపు మరలండి

ఓ దివ్యజననీ, ఎంత తీవ్రోత్సాహంతో, ఎంత ఉద్రిక్తపూరితమైన ప్రేమతో నేను మీ వద్దకు గాఢమైన మీ చైతన్యంలోకి, ఉచ్ఛస్థాయిలో నున్న మీ మహనీయ పరిపూర్ణానందాల లోకి వచ్చానో, మీ బాహుపరిష్వంగంలో సుఖంగా లాలించబడి, మిమ్ము ఎంత తీవ్రమైన ప్రేమతో ప్రేమించానో, మొత్తం మీద నేను మీ వలెనే అయిపోయాను. అటువంటి మన మూగ పారవశ్య నిశ్శబ్దంలో, ఇంకా అపార అగాధాల లోతుల నుంచి ఒక వాణి వినవచ్చింది. ఆ వాణి ఇలా అన్నది, "నీ ప్రేమ అవసరమైన వారి వైపు మరలు". చైతన్యపు టంతస్తులన్నీ, క్రమ వరుసలో ఒకదాని తరువాత ఒకటిగా ఉన్నటువంటి లోకాలన్నీ కాన వచ్చాయి. కొన్ని వైభవంగా, ప్రకాశమానంగా ఉన్నాయి, క్రమబద్ధంగా, గజిబిజి లేకుండా ఉన్నాయి; అక్కడ జ్ఞానం దేదీప్యమానంగా ఉంది, అది సామరస్యతతో, బృహత్తరంగా వ్యక్తమవుతున్నది, ఇచ్ఛ శక్తిమంతంగా, అజేయంగా ఉంది. తదనంతరం, లోకాలన్నీ అధిక సంఖ్యలో అధికాధిక గందరగోళంతో

అంధకారంలోకి నెట్టబడ్డాయి, మహాబలశక్తి ఉగ్రమైంది, భౌతిక ప్రపంచం అస్పష్టమై, దుఃఖపూరితమైంది. అంతటా, అనంతమైన మా ప్రేమలో ప్రపంచం యొక్క దైన్యం, అజ్ఞానాల ఘోరమైన బాధానుభవాన్ని సంపూర్ణంగా మేము గ్రహించినప్పుడు, అజ్ఞాన బంధురమైన తీవ్ర పోరాటంలో చిక్కుబడిపోయిన మా పిల్లలను వారి లక్ష్యాన్నుంచి తప్పిపోయి, ఒకరి మీద ఒకరు కోపంగా దూసుకు పోతుండగా చూసినప్పుడు, దివ్యప్రేమ అభివ్యక్తమవాలని, ఈ పక్కదారులు పట్టిన మూలకణాల కేంద్రంలో రూపపరివర్తన గావించే శక్తిని మేము ఎంతో తీవ్రతతో ఇచ్ఛగించాము. అప్పుడు ఆ ఇచ్ఛ ఇంకా ఎక్కువ శక్తివంతంగా, సమర్థవంతంగా ఉండగలందులకై, మేము మీ వైపు తిరిగాము. ఓ ఊహించనలవికాని పరమోత్కృష్టమా, మేము మీ సహాయం కోసం వేడుకొంటున్నాం. ఆ మహా తెలియబడనిదాని అగాధాల లోతుల నుంచి మహనీయమైన, అసాధ్యమైన ఒక ప్రత్యుత్తరం వచ్చింది, భూమి రక్షించ బడిందని మాకు తెలిసింది.

సెప్టెంబరు 1, 1914

దివ్యాగ్ని కుండంలో పూర్ణాహుతి గావించబడిన దివ్యప్రేమ

గాడాంధకారం దట్టమై, ప్రబలంగా, విజయవంతంగా భూమి మీద అవతరించింది.... అంతా దుఃఖమయం, అపరిమితమైన భయం, భౌతిక ప్రపంచంలో వినాశనం, మీ ప్రేమ యొక్క ప్రకాశ వైభవం విచారసూచకమైన నల్లని వస్త్రాల ముసుగులో మరుగుపరచ బడిందేమోనని అనిపిస్తున్నది....

ఓ మధుర జననీ, నేను మీ అపారప్రేమలో లీనమైపోయాను, సమస్త సంజాతముల మహాప్రభువును తీవ్రంగా బతిమాలుకొనేదేమంటే, ఆయన మాకు త్రోవ చూపించాలని, ఆయన కార్యానికిపై మేము ధైర్యంగా అడుగులు వేయగలుగుటకు దారి కోసం మాకు జాడ తీయాలని.

కాలం ఒత్తిడి చేస్తున్నది: ఓ ప్రభూ, బాధతో గిజగిజ లాడుతున్న భూమికి సహాయపడటానికి దివ్యశక్తులు తప్పక దిగి రావాలి.

ఓ జననీ, మధుర జననీ, మీ పిల్లల నందరినీ, మీ విశాల వక్షస్థలానికి దగ్గరగా చుట్టివేసి హత్తుకున్నారు, మీ ప్రేమ వారల నందరినీ ఒకే రకంగా ఆచ్ఛాదిస్తున్నది.

నేను మీ ప్రేమను పరిశుద్ధం చేసే జ్వాల నయ్యాను.

తలపు లన్నింటినీ ఛేదించుకుంటూ పోయి, వాటిలో సడలిపోని విశ్వాసం కలిగిన సర్వోత్కృష్ట స్పష్టతను, ఎప్పుడూ తప్పిపోని దివ్యమగు విషయ పరిజ్ఞాన శక్తిని సృజిస్తుంది, ప్రతి తారతమ్య వైరుధ్యాల పైగా, అది పరమోత్కృష్ట వివేకమైన మీ జ్ఞాన సంపద నంతటిలో సుస్థిరం చేస్తుంది.

మీ శక్తి ఉవ్వెత్తున ఎగసిపడే కెరటం లాంటిది, అది సమస్త అస్తిత్వాలను ఆక్రమిం చుతూ, ఆటంకా లన్నింటినీ తొలగించివేస్తూ ఉంటుంది. మీ శక్తి జీవిత మంతటిలోను చొచ్చుకపోతూ, దానిలో ఎన్నడూ వీగిపోని అమోఘమైన దృఢత్వాన్ని, అజేయమైన దివ్యశక్తిని సృజిస్తుంది, ప్రతి తారతమ్య వైరుధ్యాల పైగా, అది అంతటిలో ప్రమోత్కృష్ట ఇచ్ఛ అయిన వశపరచుకొనే మీ శక్తిని సుస్థిరం చేస్తుంది.

సెప్టెంబరు 10, 1914

నూతన ప్రపంచపు వాగ్దానం

ఓ దివ్యమాతా, ఆరాధ్య దైవమా, మీ సహాయంతో అసంభవం అనేది ఏదైనా ఉంటుందా? సాక్షాత్కార సమయం ఆసన్న మైంది, పరమాత్మ ఇచ్ఛను మేము సమగ్రంగా నిర్వహించగలందులకై సహాయం చేస్తారని మీరు మాకు అభయప్రదానం చేసారు.

ఆలోచించలేని వాస్తవికతలకు, భౌతిక ప్రపంచపు పరస్పర సంబంధాలకు సమర్థు లైన మధ్యవర్తులుగా మమ్ములను మీరు అంగీకరించారు, మా మధ్య మీ నిరంతర సన్నిధి మీ క్రియాపూర్వక సహకారానికి సంకేతం.

ప్రభువు సంకల్పించారు, మీరు నెరవేర్చాలి:
ఒక నూతన కాంతి భూమి మీద మెరవాలి.
నూతన ప్రపంచం ఆవిర్భవించాలి,
చేసిన వాగ్దానాలన్నీ ఈడేరాలి.*

సెప్టెంబరు 25, 1914

* తదనంతరం, ఏప్రియల్ 1956 లో, అతిమానసం 29 ఫిబ్రవరి 1956 లో అభి వ్యక్తమైన పిమ్మట, శ్రీమాత ఈ ప్రతిని సవరించి ఈ క్రింది విధముగా వ్రాయడం జరిగింది.

ఓ ప్రభూ మీరు సంకల్పించారు, నేను నెరవేర్చాను:

ఒక నూతన కాంతి భూమి మీద మెరిసింది.

నూతన ప్రపంచం ఆవిర్భవించింది,

చేసిన వాగ్దానాలన్నీ ఈడేరినాయి.

CWM 15:95

24 ఏప్రియల్ 1956

భూమి మీద అతిమానసం అభివ్యక్తత ఇక ఎంత మాత్రమూ ఒక వాగ్దానము కాదు, కాని ఒక సజీవ ఘటన, ఒక వాస్తవికత.

అది ఇక్కడ పని చేస్తున్నది, దానిని గ్రుడ్డివారు, ఏ మాత్రం ఎరుకలో లేనివారు, ఏ మాత్రం ఇష్టపడనివారు సైతం తప్పనిసరిగా ఆమోదించి, గుర్తించే రోజు వచ్చి తీరుతుంది.

CWM 15:96

అదితి, దేవతల జనని

... మా దివ్యజనని మాతోనే ఉంది, పరమేశ్వరునితోనూ, సంపూర్ణ చైతన్యంతోనూ తాదాత్మ్యతకు మాకు వాగ్దానం చేసింది — అంతు తెలియని అగాధాల నుంచి అత్యంత బాహ్య ప్రపంచంలోని ఇంద్రియాల వరకు ఈ క్షేత్రా లన్నింటిలో, అగ్నిదేవుడు, పరిశుద్ధి చేసే తన జ్వాలతో అడ్డంకు లన్నింటిని ధ్వంసం చేస్తూ శక్తులను ఉద్దీపనం చేస్తూ ఇచ్ఛానుప్రేరేపణ చేస్తూ సహాయం చేస్తానని ఆశ్వాసన ఇచ్చాడు. అది సాక్షాత్కారతను వేగిరపరచగలదు. మా జ్ఞానంలో ప్రకాశమును పరిపూర్ణతను గావించుటకై ఇంద్రుడు మాతో వున్నాడు, సర్వోత్కృష్టమైన దివ్యానంద ప్రాప్తిని గొనివచ్చే దివ్యసోముడు మమ్ములను తన అపారతలో, సర్వోత్కృష్టతలో, అద్భుతమైన ప్రేమలో పరివర్తన చేశాడు...

ఓ దివ్య ప్రియజననీ, నేను మీకు తన్మయత్వంతో, అనిర్వచనీయమైన లాలిత్యంతో, అపారమైన విశ్వాసంతో ప్రణమిల్లుతున్నాను.

ఉజ్జ్వలమైన ఓ అగ్నీ, నా లోనే నివసిస్తున్నవాడా, మిమ్ము నేను పిలుస్తున్నాను. మీరు నాలో ఇంకా ఎక్కువగా నివసించాలనీ, మీ అగ్నికుండం ఇంకా ఎక్కువ అపారతను సంతరించుకోవాలనీ, మీ జ్వాలలు ఇంకా ఎత్తుకు ఎగసి, ఇంకా ఎక్కువ

శక్తివంతంగా ఉండాలనీ, ఇప్పుడిక అస్తిత్వం మొత్తం తీవ్రోత్సాహంతో మండే, పరిశుద్ధం గావించే చితి కావాలని నేను మిమ్ములను ఆవాహన చేస్తున్నాను.

ఓ ఇంద్రా, నేను మిమ్ము పూజించి, ప్రశంసిస్తున్నాను, మీరు నాతో ఐక్యం కావాలని, మీ ఆలోచనల అవధుల నన్నింటిని నిశ్చితంగా భగ్నం చేయాలని, దివ్య జ్ఞానమును నా మీద కురిపించి అనుగ్రహించాలని నేను మిమ్ము వేడుకుంటున్నాను.

ఓ మహనీయ ప్రేమా, నేనెన్నడూ మరే ఇతర పేరునూ నీకు వాడలేదు, కాని, నీవే నా అస్తిత్వ పదార్థం అయి ఉన్నావు, అటువంటి నిన్ను నేను నా అతి చిన్న కణాలలో సైతం కంపిస్తూ, నివసిస్తున్న అనుభూతిని, అనంత విశ్వంలోనూ, ఆవలా ఏ విధంగా పొందుతానో ఆ విధంగానే పొందుతున్నాను, ప్రతి శ్వాసలోనూ శ్వాసగా ఉంటున్న నీవు, అన్ని కార్యకారణాల హృదంతరాళాలలోనూ కదలుతుంటావు. శ్రేయోదాయకమైన వాటన్నింటి ద్వారా, బాధ లన్నింటి వెనుకా దాగి యుండి, ప్రకాశమాన మవుతుంటావు. ఎక్కువెక్కువగా ఎప్పుడు ఇంకా తీవ్రతలో వృద్ధిచెందే పరిమితి లేని ఒక వ్యవస్థను దేనినైతే నేను పెంచి పోషించా లనుకుంటున్నానో, అటువంటి నాకు ఇంకా ఎక్కువ వివేచనతో నేను సంపూర్తిగా నీ దానినే ననే అనుభూతిని పొందగలిగేటట్లుగా అనుమతిని ప్రసాదించు.

దీని నంతనూ, ఇంకా దీనిని మించినదానిని చేసిన ఓ పరమ ప్రభూ, మా ఆలోచనకు అంతిమ పరిమితీ, అజ్ఞేయుని ప్రవేశ ముఖద్వారపు టంచున నిలబడి ఉన్న ఓ సర్వోత్కృష్ట ప్రభూ, మీ పని పరిపూర్ణంగా నెరవేర్చబడ గలందులకూ, ఈ విశ్వం మహనీయ తాదాత్మ్యతలో పరమోత్కృష్ట సృష్టి వైపుకు ఒక అడుగు సుదూరంగా ముందుకు వేయగలందులకూ, ఆ ఊహాతీతమైనదాని నుంచి ఏదో ఒక విధమైన నవ్యమైన కాంతినీ, ఏదో ఒక విధంగా దేదీప్యమానమైన, ఇంకా ఎక్కువ సమగ్ర సాక్షాత్కారతను సాధ్యమయ్యే విధంగా ఉద్దీపింప జేయి.

ఇప్పుడిక నా కలం మూగబోతున్నది, నిశ్శబ్దంలో నేను ఆరాధిస్తున్నాను.

సెప్టెంబరు 20, 1914

దివ్యజనని వాగ్దానం

దివ్యజననీ, మీరు మాతో ఉన్నారు; ప్రతి దినమూ మీరు నాకు హామీ ఇస్తున్నారు, ఇంకా ఎక్కువ సంపూర్ణంగా, ఇంకా ఎక్కువెక్కువగా నిరంతరం వృద్ధిచెందే

తాదాత్మ్యతలో ఎంతో సన్నిహితంగా ఐక్యమై, మనం, మహా విశ్వపు పరమ ప్రభువు వైపుకూ, అతీతంగా ఉన్న ఆ తత్ వైపుకూ మహదాకాంక్షలో, నూతన మహా ప్రకాశం దిశగానూ మరలినాము. సమస్త పృథివీ మన చేతులలో వ్యాధిగ్రస్తమై, తప్పక నయం చేయబడవలసి నటువంటి, అమిత బలహీనత మూలముగా ఒకరికి ప్రత్యేక వాత్సల్యము కలిగినటువంటి శిశువులాగా ఉన్నది. శాశ్వత వికసనాల పరిణామ అస్తిత్వాల అపారతలో సాకబడి, ఆ పరిణామ అస్తిత్వాలము మనమే కాగా, ఎక్కడైతే సమస్తమూ పరిపూర్ణ మహాచైతన్యంలో, మార్పులేని ఉనికితో, అతీతంలో ఉన్న తెలియనిదాని సమస్తమునకూ అద్భుత ద్వారమై సాక్షాత్కారానుభవమునకు వస్తుందో, సద్దు లేక, సంతోషంతో, ఆ అచల మహానిశ్శబ్దమును మనం ధ్యానం చేద్దాము.

అప్పుడు ఆ ముసుగు చింపబడగా, అవ్యక్తమగు మహద్వైభవం బయటపడగా, వ్యాప్తిచెందిన అనిర్వచనీయ వైభవంతో ఆ అద్భుత కెరటాలను తీసుకురావటానికి మేము ప్రపంచం వైపుకు తిరిగాము.

అక్టోబరు 14, 1914

ఓ దివ్యజననీ, అవరోధాలన్నీ తొలగింపబడగలవు, శత్రువులు ఉపశమింపబడతారు: సమస్త పృథివినీ, మీ సర్వోత్కృష్ట ప్రేమతో మీరు ఆధిపత్యం వహిస్తారు, ప్రతి చైతన్యం మీ నిర్మలత్వంతో ప్రకాశించగలదు.

ఇది వాగ్దానం.

అక్టోబరు 17, 1914

శరీరంలోని ప్రతి అణువులోను కేవలం మీరే వసిస్తున్నారు

చాలా రోజులుగా, ప్రభూ, నా కలం మూగబోయి ఉంది.... అయినప్పటికీ మీరు నాకు గంటల కొలదీ మరచిపోలేని ప్రకాశమును అనుగ్రహించారు, గంటల పర్యంతం అత్యంత దివ్యచైతన్యము, అత్యంత భౌతికముల కలయిక సమగ్రంగా వృద్ధి పొందింది, గంటల పర్యంతం ప్రత్యేక వ్యక్తి అస్తిత్వమునకూ, సార్వజనీన విశ్వజననికీ మరియు సార్వజనీన విశ్వజననికి మీకు మధ్య తాదాత్మ్యత ఎంత సంపూర్ణంగా జరిగిందంటే ఏకకాలంలో ప్రత్యేక వ్యక్తి చైతన్యం తన ఉనికినీ, సమస్త విశ్వమందలి జీవమునూ, మార్పుకు ఆవల నుండే మీ శాశ్వతత్వమునూ గ్రహించ

గలిగింది. అవ్యక్త, అనంత ప్రశాంతతలో దివ్యానంద ప్రాప్తి అత్యున్నత శిఖరాగ్రమును చేరింది, చైతన్యం ప్రకాశమానమై, అపారమై, సంకీర్ణమై ఉన్నప్పటికీ ఏకమై ఉన్నది, సత్త్వం శక్తివంతమై, మృత్యువుకు అధిపతియై యున్నది. ఇదే క్షణకాలం మాత్రమే ఉండి వేగంగా మాయమైపోయే స్థితి ఏమాత్రం కాదు, సుదీర్ఘ ధ్యానం తర్వాత పొందింది కాదు, ప్రభవించిన వెంటనే హఠాత్తుగా అదృశ్యమయ్యేదీ కాదు; ఆ స్థితి అనంతత్వమును పూర్తిగా కలిగి దీర్ఘకాలం మనగలదు, ఆ క్షణాలు చటుక్కున జరిగినవి, అంతంలేనివి, అది ఇచ్ఛామాత్రంగా పొందగలిగిన స్థితి, అనగా స్థిరంగా, చిరకాలం ఉండేది, ఏదైనా అవకాశం అనుమతి నిచ్చిన వెనువెంటనేనూ, ఏదైనా నిర్దిష్టమైన మేధో లేదా ప్రత్యేక భౌతిక కార్యంతో అది నిమగ్నం కాని వెనువెంటనే అత్యంత భౌతిక చైతన్యం సంపర్కం లోకి వచ్చే స్థితి. పని అంతటిలో, నిరంతరం, మీ ద్వంద్వ స్థితి అయిన మహా అస్తిత్వం మరియు అస్తిత్వరహితమైన మీ అచల సన్నిధి స్ఫూర్తి ఉంటుంది, కాని అది చేసే పని మీద, ఆవశ్యకమైన ఏకాగ్రతతో అల్లబడిన పలుచని ముసుగు వెనుక ఉన్నదా అని అనిపించే విధంగా ఉంటుంది. అదే సమయంలో, ఏకాంతంలో ఉన్న కాలంలో తక్షణం అద్భుతమగు నిర్మలమూ, ప్రశాంతమూ, దివ్యమూ అయిన శక్తివంతమైన వాతావరణంతో ఆవరించి పోతుంది; అది అందులో మిళితమైపోయి ఉండిపోతుంది, తదుపరి జీవన వైభవం దాని పూర్తి సమృద్ధిలో, దాని పూర్తి సంకీర్ణతతో, దాని పూర్తి మహనీయ విలక్షణతతో తిరిగి మొదలవుతుంది; కోమలత్వం, వీర్యశక్తి, ఓజస్సులతో భౌతిక శరీరం దివ్యమౌతుంది. మనస్సు ఉత్కృష్టమైన తన ప్రశాంతమైన స్పష్టతతో, మీ దివ్య ఇచ్ఛాశక్తులకు మార్గదర్శనం చేస్తూ, తన ద్వారా ప్రసరింప జేస్తూ ఉంటుంది; అస్తిత్వం అంతా అంతులేని దివ్యానంద ప్రాప్తితో, ఎల్లలు లేని ప్రేమతో, సర్వోత్కృష్ట ఆధిపత్య శక్తితో, సమగ్ర జ్ఞానంతో, అనంత చైతన్యంలో ఆనందంతో ఉప్పొంగిపోతుంది.... అదిమీరే, కేవలం మీరు మాత్రమే వసిస్తున్నారు, తనదైన అతి చిన్న శరీరపదార్థ అణువులో సైతం.

ఆ విధంగా ఇహలోక సంబంధమైన మీ పనికి దృఢమైన ప్రాతిపదిక తయారు చేయబడింది, అపారమైన పెద్ద భవంతి క్రింది చట్ర నిర్మాణం పూర్తి గావించబడింది; ప్రపంచపుటన్ని మూలలా మీ దివ్యశిలలలో ఒకటి ఎరుక యొక్క శక్తితో, ఆకృతినిచ్చే ఆలోచనతో వేయబడింది; ఆ విధంగా సంసిద్ధం కావింపబడిన పృథివి తాను సాక్షాత్క

రించుకొనే ఘడియలో, మీ మహనీయ దేవాలయపు నూతనమూ, ఇంకా ఎక్కువ సంపూర్ణమూ అయిన అభివ్యక్తతను అందుకొనటానికి తయారుగా వుంటుంది.

నవంబరు 3, 1914

మీరు ప్రతిఘటనను జయించి తీరుతారు

ఒకే ఒక్క ముఖ్యమైన విషయం లక్ష్యాన్ని చేరటం; దారి ఏమిటనేది అల్ప ప్రాధాన్యాంశం. తరచు దాని గురించి ముందే తెలుసుకోకపోవడం ఉత్తమం. కాని, మనకు తెలియవలసినదల్లా, దైవకార్యానికి సమయమాసన్న మైనదా, లోతైన గాఢభావనా స్థితిలో తలంచిన పనిని సాక్షాత్కరించుకోగలమా అనేదే.

దీని కొరకు, ఓ ప్రభూ, మాకు మీరు హామీ ఇచ్చారు, అది ఎటువంటి హామీ అంటే, అది ఎంతో శక్తివంతమైన వాగ్దానం, మహాప్రకృతి, సార్వజనీనమగు మహా చైతన్యం దానిని బుహుశా చేయగలదనే... ఆ విధంగా మాకు దృఢమైన విశ్వాసం కలిగింది, అవశ్యం జరగవలసినది జరిగి తీరుతుంది. ఇప్పటి మన ఈ ప్రత్యేక అస్తి త్వాలను ఈ మహిమాన్వితమైన గెలుపులో, ఈ నూతన సృష్టిలో సహకరించాలని వాస్తవంగా విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇంకా మనం తెలుసుకోవలసినది ఏమున్నది? ఏమీ లేదు. కనుక, ఈ భయంకరమైన పోరాటమునకు, చిట్టచివరికి మీ ప్రణాళిక సాక్షాత్కారతకు, తెలియకనే, తోడ్పడే వైరి శక్తుల మీద భీకరమైన దాడికి మేము సాక్షుల మవుతామని మాకు ఎంతో గొప్ప నమ్మకం. మేము వ్యాకులతను పొందడం తప్పు, ఎందువల్లనంటే, అది ఏ విధంగా మీ ప్రణాళికకకు తోడ్పడుతుందో, ఏ విధంగా ప్రతిఘటన లన్నింటి మీద మీరు విజయం సాధించగలరో మాకు తెలియ జేయబడ లేదు. కారణం, మీ గెలుపు ఎంతో సమగ్రమైనది కావటం, మీకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిన ప్రతి ఆటంకం, ప్రతి దుష్టబుద్ధి, ప్రతి ద్వేషము ఇంకా ఎక్కువ విస్తృతము, ఎక్కువ సంపూర్ణమగు గెలుపుకు ఒక వాగ్దానం. ప్రతిఘటన లన్నింటి మొత్తంలో పృథ్వి మీద అభివ్యక్తమయే మీ పవిత్ర శక్తులలో వేటికి మీరు పని చేయటానికి అనుజ్ఞ నిచ్చారో వాటి పరిధిని ఒకరు పరీక్షించి అంచనా వేయగలరు. వాస్తవంలో వ్యతిరేకతంతా దేని కంటే ఈ శక్తులు చేయవలసిన విధాయక పనికి; అది అత్యంత జ్ఞానవిహీనమైన దుష్టశక్తులను తప్పక స్పృశించి, ప్రకాశవంతమైన ప్రశాంతతకు పరివర్తించాలి.

మీ పనికి కేంద్ర బిందువుగా ఏ మానవవ్యక్తినైనా మీరు ఎంపిక చేసినట్లైతే, ఆ మధ్యవర్తి తక్కువ అవరోధాలను, తక్కువ అపార్థాలను, తక్కువ ద్వేషాన్ని ఎదుర్కొన్నట్లైతే, మీరు అతనికి ఎటువంటి తీవ్రతా లేని పరిమిత విధాయక కర్మను అప్పగించారని అర్థం. అతడు అప్పటికే సంసిద్ధం కావించబడిన ఆదరణీయ మనుషుల సంకుచితమైన పరిధిలో పని చేస్తాడు కాని, భూ పదార్థం మీద గందరగోళ పరిస్థితుల లోనూ, విభ్రాంతికర పరిస్థితుల లోనూ ఉన్న అధిక సంఖ్యాకుల మీద మాత్రం కాదు.

ఓ దివ్య ప్రభూ, మీరిచ్చిన ఈ జ్ఞానాన్ని మేమందరము పంచుకొనెదము గాక, దాని వలన ప్రశాంతమయమమగు దృఢవిశ్వాసం మా హృదయాలలో రాజ్యమేలును గాక, బహుశా మేము, నిశ్చలమైన మీ సర్వోత్కృష్ట నిశ్చితత్వంలో, ఎరుక లేక, రూపపరివర్తనకు ఆకర్షితులై, దూరదృష్టి లేక అజ్ఞానంతో అనాలోచితంగా దూకుతూ, అది రూపపరివర్తన చేసే దివ్యప్రేమను నాశనం చేయగలుగుతుందనే విశ్వాసంతో ఉండేవాటి నన్నింటనీ వీరోచితంగా ప్రతిఘటించగలము గాక.

నవంబరు 15, 1914

ఓ మహిమాన్విత జననీ, ఎంత గొప్పది మీ సహనం!

ఏమని చెప్పను ఓ మహిమాన్విత జననీ, ఎంత గొప్పది మీ సహనం.దోషములను సవరించి సరిదిద్దటానికీ, భ్రమాత్మకమైన తమదైన జ్ఞానంతో వ్యక్తి తాను చేసే గతి నిర్దేశం వలన దారి తప్పిపోయిన దాని ఫలితంగా నిశ్చయాత్మకంగా తెలియనటువంటి అతడి పురోభివృద్ధిని వేగిరపరచటానికీ, కచ్చితమైన త్రోవకు జాడ తీసి, తప్పటడుగులు వేసి పడిపోకుండా నిలకడగా దాని మీద నడవటానికి కావలసిన బలమును ఇవ్వటానికీ, ఎరుకతో కూడిన మీ ఇచ్ఛ అభివ్యక్తమయ్యేందుకు మీరు ప్రయత్నించిన ప్రతిసారీ, చాలా మట్టుకు ఎల్లప్పుడూ అతడు మిమ్ములను అలసట కలిగించేదానిగా, ముందుచూపు లేని సలహాదారుగా మిమ్ములను పక్కకు నెట్టివేస్తాడు. అతడు మిమ్ములను తన అస్పష్టమైన, పొందిక లేనటువంటి ప్రేమతో సిద్ధాంతపరంగా ప్రేమించటానికి ఇష్టపడతాడు, కాని అతని దురహంకారపూరితమైన మనస్సు, మీ యందు నమ్మకం ఉంచటానికి తిరస్కరిస్తుంది, పూర్తిగా తనకు తానుగా దేశదిమ్మరిగా తిరగటానికి ఇష్టపడుతుంది కాని, మీ మార్గదర్శనంలో ముందుకు పోదామని చూడడు.

కాని, ఎప్పుడూ ఉండే చిరునగవుతో, అలసిపోని మీ ఔదార్యంతో, మీరు

సమాధాన మొసగారు, "మనిషిని దురహంకారానికి గురి చేస్తూ, దోషభూయిష్టం చేసే అతని మేధాసంపత్తి ఏదైతే వుందో, ఒకసారి అది జ్ఞానవంతమై, పరిశుద్ధమైతే గనక, అది అతనిని ముందుకు, సార్వజనీన ప్రకృతి కంటె ఉన్నతోన్నత స్థితికి, మన దివ్యప్రభువుతో సరాసరి ఎరుకతో కూడిన సంసర్గానికి తీసుకువెళ్ళగలదు, అంతే కాకుండా, 'తత్ ' తో జరిగే ఆ సంసర్గం వలన అది అతడిని సమస్త సృష్టి ఆవలకు సైతం చేరేందుకు దారి తీయగలదు. ఈ విభజించే మనస్సు, ఏదైతే నా నుంచి అతనిని వేరుగా ఉంచుతున్నదో, ఏదైతే అపారతతో, సంకీర్ణతతో వడిగా ఆరోహణకు సాధ్యం కలుగజేయదో అటువంటి విశ్వం మొత్తంతో అతని పురోభివృద్ధి సంకెళ్ళతో బంధింపబడకుండా, జాగు చేయబడకుండా, అతడు తప్పక అధిరోహించ వలసిన ఉన్నత శిఖరాలను శీఘ్రగతిన ఎక్కగలిగేటట్లు సైతం అతడిని చేయగలదు".

ఓ దివ్యజననీ, మీ వాక్కు ఓదార్పు నిస్తుంది, ఆశీస్సుల నిస్తుంది, ప్రశాంతతల నిస్తుంది, వికాసం కలుగజేస్తుంది, మీ అనంత జ్ఞానమును మరుగుపరుస్తున్న మడతను ఉదారవంతమైన మీ చేయి పై కెత్తి తొలగించగలదు.

వైభవోపేతమైన, పరిపూర్ణమైన మీ ధ్యానం ఎంత ప్రశాంతమైనది, ఉదాత్తమైనది, పరిశుద్ధమైనది!

నవంబరు 17, 1914

పూర్తి తెల్లకాగితమును పోలినట్లుగా పరమ ప్రభువు ముందు

ఎల్లప్పుడూ పూర్తి తెల్లకాగితమును పోలి మీ ముందు ఉంటాను, ఓ పరమ ప్రభూ, ఆ విధంగా ఉండటం వలన, మీ ఇచ్ఛ ఎటువంటి ఇబ్బందీ, ఏ కలగాపులగమూ లేక నాలో వ్రాయబడే అవకాశం ఏర్పడగలదు.

గత అనుభవాల స్మృతుల నెమరువేత సైతం ఒక్కొక్కప్పుడు మది నుండి ఊడ్చి వేయబడాలి, దాని వలన అవి ఈ పనిలో చాలా కాలం పాటు సాగేటటువంటి పునర్నిర్మాణమును అడ్డగించ లేవు, అది మాత్రమే పరస్పర సంబంధాలతో నిండిన ఈ ప్రపంచంలో మీ పరిపూర్ణ అభివ్యక్తతకు సమ్మతి నొసంగగలదు.

అత్యంత విలువైన అనుభవాల ఫలితాలను కోల్పోతామనే భయంతో బృహత్తరమూ, ఉత్కృష్టమూ అయిన ఒక చైతన్యాన్ని వదలివేసి, నిమ్నస్థితిలోకి పడిపోవట మనే విషయానికే ఒక వ్యక్తి తరచు అంటిపెట్టుకుని ఆ స్థాయిలోనే ఉంటాడు.

అయినప్పటికీ, తమరెవ్వరని అతడు దేనికైనా భయం చెందాలి? సంతోషదాయక మైన ఆత్మతో, జ్ఞానం ప్రకాశించే నుదుటితో, మీరు పరచిన జాడలో, త్రోవ మీద, అది ఎటువంటిదైనా, ఒక వేళ పరిమితమైన అతడి విచక్షణకు పూర్తిగా దుర్గ్రాహ్యమై నప్పటికీ, అతడు నడచిపోలేడా?

ఓ పరమ ప్రభూ, పాత ఆలోచనా చట్రాలను పగులగొట్టు, గత అనుభవాలను రద్దు చేయి, ఎరుకతో కూడిన సంయోజనమును మీరు అవసరమని తలిస్తే, కరిగించి వేయి, ఫలితంగా మీ పని ఇంకా ఇంకా బాగా నెరవేరే అవకాశం కలుగుతుంది, భూమి మీద మీ పరిచర్య పరిపూర్ణమవ గలుగుతుంది.

నవంబరు 20, 1914

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

దివ్యమాత త్యాగము

అంధకారంలోకి దూకిన దైవం

... ఈ ఘనమైన, అస్పష్టమైన పదార్థ హృదయంలో నుంచి పర్వతం నుండి వెడలే భయంకర జ్వాలలుగా మీ ప్రేమాగ్ని జ్వాలల కాంతి ప్రకాశాలు పెల్లుబికి ప్రసరించాలని మీరు కోరుతున్నారు. పాత భాషా సాంప్రదాయాలను విసర్జించి వాటి స్థానంలో మిమ్ములను అభివ్యక్తం చేయగల, అంతకు ముందెన్నడు వినిపించని ఓ మాటను వెలువరించాలని మీ కోరిక. ఈ దిగువ భువిపై నున్న స్వల్పమైన విషయాలు, ఆ పై విస్తృతిలోని అతి ఉన్నత విషయాల మధ్య కుదిరిన ఐక్యత సమగ్రం కావాలని మీ యిచ్ఛ. అందుకే ఓ ప్రభూ, నన్ను మతపరమైన ఆనందం నుంచి. ఆధ్యాత్మిక పారవశ్యత నించి విడగొట్టి పూర్తిగా మిమ్ములను మాత్రమే ఏకాగ్రతతో కొలిచే స్వేచ్ఛను నాకు అందకుండ చేసి, మీరు నాతో చెప్పారు, "సామాన్య మానవుల మధ్య సామాన్య మానవుని వలె పనిచేయి, అభివ్యక్తమయ్యే ప్రతి విషయం లోనూ వారి కంటె ఏ మాత్రం ఎక్కువ కావని తెలుసుకో; వారి జీవనవిధానా లన్నింటిలో పాల్గొను; ఎందుకంటే వారికి తెలిసినదానికి వారేమిటో వారికి తెలిసినదానికి మించి మీరు మీ లోపల ఆ శాశ్వత వైభవం యొక్క ఇటూ అటూ చలించని స్థిర

మైన జ్యోతిర్మయ ప్రకాశాన్ని మోస్తున్నారు. వాటితో మీరు కలిసి ఉండటం వల్ల ఆ ప్రకాశాన్ని వారి మధ్యన తేగలరు. మీ నుంచి ఆ ప్రకాశం అందరిపై ప్రసరించే వరకు, మీరు దానిని అనుభవించి సంతోషించడం అవసరమా? మీరు ప్రసాదిస్తున్నంత వరకు మీలో ప్రకంపిస్తున్న నా ప్రేమను అనుభూతి చెందవలసిన అవసరముందా? అందరికి ఉనికి యొక్క ఆనంద పారవశ్య మాధ్యమంగా మీరున్నంత వరకు దాని రుచిని మీరు చవి చూడాలా?

ఓ ప్రభూ, మీ సంకల్పం సమగ్రంగా నెరవేరుగాక, అదే నా ఆనందం, అదే నా ధర్మం.

జనవరి 11, 1915

అంతటా, అన్నింటా ఈ ప్రేమ ఉండనీ.

(నిశ్శబ్దంలో నేను విన్నది నిన్న సాయంత్రం వ్రాసుకున్నాను)

"అన్నింటినీ త్యజించి, జ్ఞానం మరియు చైతన్యంతో సహా మీ సమర్థతతో మీ కప్పగించన కార్యాన్ని నిర్వహించేలా మీ హృదయాన్ని తయారు చేయగలిగారు. ఏ విధంగా కొండ మీది నుంచి జాలువారే నీరు ప్రతిఫలం ఆశించకుండా సమృద్ధమైన వాగులుగా ప్రవహిస్తుంది కాని, ఎన్నడూ వెనుదిరగదు. అలుపెరుగని ఆ శక్తి గాఢ అంతరాల లోతుల్లో నుంచి తీసుకుంటుంది, బాహ్యం నుంచి కాదు. కాని మీరు ఇప్పటికే అంతరంగం ప్రేమ వ్యాప్తి యొక్క ఉన్నత ఆనందానుభూతిని పొందు తున్నారు. ఎందుకంటే ప్రేమే స్వయంతృప్తిని కలిగి ఉంటుంది, దానికి ఆదాన ప్రదానాల అవసరం లేదు. నిజానికి వ్యక్తిగత ప్రేమ విషయంలో కూడా ఈ విధంగానే వుంటుంది. అలాంటప్పుడు అనంతాన్ని ప్రతిబింబింప చేసే దివ్యప్రేమ విషయంలో అది ఎన్ని రెట్లు ఎక్కువ సత్యంగా ఉండాలి.

"అన్ని చోట్ల అన్నింటా, సర్వత్రా ఆ ప్రేమవు కావాలి. ఆ ప్రేమ మరింత విస్తారమై, ప్రగాఢమై, ఈ విశ్వమంతా మీ కార్యాలయం, మీ సంపత్తి, మీ కార్యరంగం మీ విజయక్షేత్రం కావాలి. అస్తిత్వం వ్యాప్తి చెందుటకు బలహీనమైన అడ్డంకులుగా ఉన్న ఆ అంతిమ హద్దులను పట్టుదలతో పడగొట్టేలా పోరాడండి, దివ్యప్రకాశ శక్తిచే ఇప్పటికే వెలిగించబడుతున్న ఆ చివరి చీకట్లను తొలగించండి.

గెలుపొందడానికి, విజయం పొందడానికి పోరాడు. నేటి వరకు వున్న ప్రతి

అవరోధాన్ని అధిగమించడానికి పోరాడు. నూతన జ్యోతి యొక్క ప్రకాశం వెల్లువికేలా, ప్రపంచానికి ఆవశ్యకమైన నూతన ఉదాహరణగా, బాహ్యాంతర అవరోధాలన్నింటితో పట్టుదలతో పోరాడు. అది నీ సాధనా సాఫల్యతకు బహుకరించబడిన అత్యంత విలువైన ఆణిముత్యం.

డిశంబరు 25, 1916

సమగ్ర సంపూర్ణ ఆత్మసమర్పణ బాట

ఎవరైనా వారి ప్రాణాన్ని మాత్రమే కాదు, వారి మరణాన్ని కూడా ఎలా సమర్పించుకోవాలో తెలుసుకోవాలి. వారి ఆనందాన్ని, విచారాన్ని, మన సంభావ్యత లన్నింటి సిద్ధిని ప్రసాదించే ఆ దైవం మీదే మనం అన్నింటికి ఆధారపడాలి. మనం ఆనందంగా ఉండాలా, మన మనలు జీవించాలా వద్దా, మనం సాఫల్యతా సిద్ధిలో పాల్గొనాలా వద్దా? అన్న ప్రతి విషయానికి ఆతడు మాత్రమే నిర్ణయకర్త, నిర్ణయాధికారి.

సమగ్ర ప్రశాంతత ఏదైతే నిరంతర ఆనందోత్సాహ స్థితికి అనివార్యమైన పునాదిగా నుండుట ఆవశ్యకమో అది ఈ ప్రేమ, ఈ ఆత్మసమర్పణల సమగ్రత, సంపూర్ణతలలో లభిస్తుంది.

మే 6, 1927

ఓ ప్రభూ, ఈ ప్రపంచంలో మీ దివ్యశాంతి, దివ్యానందం రాజ్యమేలాలని మీ దివ్య శక్తిని నాకు ప్రసాదించారు.

ఇప్పుడు ఈ అస్తిత్వం పృథ్వి నంతటిని శాంతియుతమైన ఆలింగనంతో కప్పివేసింది, ఒక ఆనంద సముద్రమై అంతటా వ్యాపిస్తోంది.

ద్వేషంతో పగతో నిండి ఉన్న మీలో, సముద్రతీరపు ఇసుక పైని గురుతులను కెరటాలు చెరిపివేసినట్లుగా, మీ హృదయాల్లోని తిరస్కారభావం తుడిచి వేయబడుతుంది. ప్రతీకారాన్ని పోషించే మీకు తల్లి తన బిడ్డకు జోలపాడుతూ ఊయల లూపినప్పుడు, ఆ బిడ్డ ఆత్మలో శాంతి ప్రవేశించినట్టుగా, మీ హృదయాల్లో శాంతి నెలకొంటుంది.

ఎందుకంటే విశ్వాన్ని పాలించే, ఆ దివ్యమాత తమ ధ్యానదృష్టిని ఈ పృథ్వి

వైపు మరల్చి దానిని ఆశీర్వదించారు.

నవంబరు 21, 1914

రక్షణ నిచ్చే దైవకృప

ఏ పాలకుడు శాసించలేని ఓ దివ్యశక్తి ఉంది. ప్రాపంచికమైన ఏ విజయము అందివ్వలేని ఓ దివ్యానందం ఉంది, ఏ జ్ఞానసంపదలలో లేని ఓ దివ్యప్రకాశం ఉంది, ఏ తత్వశాస్త్రము, ఏ విజ్ఞానశాస్త్రము సాధికారత సాధించలేని ఓ దివ్యజ్ఞానం ఉంది, తృప్తిపరచబడిన కోరిక వల్ల కూడా అనుభవించలేని ఓ పరమానందం ఉంది, ఏ మానవీయ సంబంధం చేత తీర్చబడని దివ్యప్రేమ దాహం ఉంది, ఎక్కడా దొరకని, మృత్యువు సైతం ఇవ్వలేని ఓ దివ్యశాంతి ఉంది.

అదే దైవకృప నించి వర్షించే — దివ్యశక్తి, దివ్యానందం, దివ్యప్రకాశం, దివ్యజ్ఞానం, పరమానందం, దివ్యప్రేమ, దివ్యశాంతి....

డిశంబరు 28, 1928

ఓ నా ప్రభూ, ప్రసన్నమూర్తీ, మీ కార్యాన్ని సాధించడానికి నేను పదార్థ మానపు ప్రపంచపు గాఢలోతుల్లోకి దూకాను. దుర్భరమైన అచేతనని, అసత్యాన్ని నా చేతితో స్పృశించాను, విస్మృతి యొక్క హెచ్చిన అస్పష్టతా నివాస స్థానాన్ని చేరాను. కాని నా హృదయంలో దివ్యస్మృతి ఉన్నది. నా హృదయం నుండి మిమ్ము చేరే ఓ పిలుపు దూసుకువచ్చింది. ఓ ప్రభూ, ప్రభూ, అంతటా మీ శత్రువులు విజయమొందినట్టు కన్పిస్తున్నారు. అసత్యం రాజ్యమేలుతోంది, ప్రపంచంపై సార్వభౌమత్వం చేస్తోంది. మీరు లేని జీవితం మృత్యువు, ఒక అంతులేని నరకం. దైవంపై గల విశ్వాసం, సంశయం ఆక్రమించింది, మీపై గల విధేయతను ప్రతిఘటన బయటికి గెంటింది, దైవంపై విశ్వాసం ఖర్చైపోయింది, కృతజ్ఞతా భావన ఇంకా ఉదయించ లేదు. గ్రుడ్డివైన గాఢావేశాలు, హత్యాప్రవృత్తులు, అపరాధ భావనాజనిత నిర్బలత్వం, ప్రేమ యొక్క మధురమైన ప్రేమధర్మాన్ని కప్పివేసి మూగపరిచాయి.

ప్రభూ, మీ విరోధుల గెలుపును మీరు అనుమతిస్తారా, అసత్యాన్ని, వికారాన్ని దుఖాఃన్ని విజయం పొందేలా చేస్తారా? ప్రభూ, గెలవమని ఆజ్ఞాపించు, అప్పుడు విజయం వరిస్తుంది. నాకు తెలుసు మేము అనర్హులమని, నాకు తెలుసు ప్రపంచం



1927 లో దివ్యజనని తరఫున శ్రీఅరవిందులు వ్రాసిన విషయం:

నేను కేవలం శ్రీఅరవిందుల మహాశక్తిని, నా బిడ్డ లందరి దివ్యజననిని. నా బిడ్డ లందరూ నా చేతన, నా అస్తిత్వపు సమానాంశములు. రూపాంతరం చెంది, సాక్షాత్కారం పొంది నపుడు శ్రీఅరవిందులకు, నాకు, సంబంధించిన ఒక పార్శ్వాన్ని అభివ్యక్తం చేయు సమాన హక్కు వారందరకూ లభిస్తుంది. ఒక సర్వ సామాన్య అభివ్యక్తి యను యేకైక భావన యందు అందరి ఐకమత్యమే నూతన దివ్యసృష్టిని అనుమతిస్తుంది. ప్రతి వ్యక్తీ తన వంతును అభివ్యక్తం చేస్తాడు, కాని మొత్తానికి సంబంధించిన భావన ఒక శక్తిగానే తప్ప, యే భాగమూ తానుగా సంపూర్ణం కాలేదు.

CWSA 32:84

ఇంకా తయారుగా లేదని, అయినా నేను మాత్రం మీ కృప మీద సంపూర్ణ విశ్వాసంతో మీ కోసం ఎలుగెత్తి పిలుస్తున్నాను. నాకు తెలుసు మీ కృప మమ్మ్మ రక్షిస్తుందని.

ఆ విధంగా, నా ప్రార్థన వడివడిగా మీ వైపు సాగింది. ఆ ఆగాధ లోతుల్లోంచి, మీ ప్రకాశమాన కాంతిలో వెలిగిపోతున్న మిమ్ములను చూసాను. మీరు నాకు కనిపించి ఇలా చెప్పారు.

“ధైర్యాన్ని వీడకు, దృఢంగా నుండు, దృఢవిశ్వాసంతో ఉండు — నేను వస్తాను.”

నవంబరు 24, 1931

కాంతివైపు నడిపించడానికి అంధకారంలోకి అవరోహణ

శ్రీమాత పరమోత్కృష్ట దివ్యచైతన్యము, దివ్యశక్తి, తాను సృష్టించిన దానినంతా మించినది....

కాని వ్యక్తిగతంగా కూడా శ్రీమాత ఈ అంధకారంలోకి దిగివచ్చి దానిని దివ్యప్రకాశం వైపు నడిపించడానికి అసత్యము, దోషభూయిష్టమైన దానిని పరమ సత్యంగా మార్చటానికి, ఈ మృత్యుమయ జీవితాన్ని దివ్యజీవనంగా మార్చడానికి ఆమె వచ్చింది. ఈ బాధామయ ప్రపంచాన్ని, దాని తీవ్ర విచారాన్ని, దుఃఖాన్ని ఆమె యొక్క పరమానంద పారవశ్యంతో అంతమొందించడానికి ఈ భువికి దిగి వచ్చింది. ఆమె తన బిడ్డల మీద ఉన్న ప్రగాఢ వాత్సల్యంతో అస్పష్టత అనే వస్త్రాన్ని ధరించడానికి అంగీకరించింది. అంధకారం మరియు అసత్య శక్తుల హింసాత్మక ప్రభావాలను, దాడులను భరించడానికి, తన ప్రతిష్టాత్మక ఉన్నత స్థాయి నించి దిగివచ్చింది. మరణ సదృశమైన పుట్టుకను అంగీకరించి జన్మబంధంలో ప్రవేశించింది; ఈ సృష్టి యొక్క బాధలు, దుఃఖాలు, కష్టాలు తనపై వేసుకుంది. ఆమె తప్ప వీటిని దివ్యప్రకాశం, దివ్యానందం, పరమ సత్యం మరియు శాశ్వత జీవనం వైపు మరెవ్వరు ఉద్ధరించ లేరని ఆమెకు తెలుసు.

CWSA 32:15-17

మార్గాన్ని తెరవడానికి ఆవిష్కరించిన అవతారం పడే ప్రయాస

మేము పడ్డ బాధలు, కష్టాలతో పోలిస్తే నీవి కేవలం చిన్నపిల్లల ఆటలు మాత్రమే.

నేను మా సందర్భాలను మీకు సంభవించినవాటితో సమానం చేయలేదు. నేను చెప్పింది, అవతారమనగా ఈ పృథ్విపై మానవులకు ఉన్నత చైతన్య మార్గాన్ని తెరవడానికి వచ్చిన వ్యక్తి అని — ఈ మార్గాన్ని ఎవ్వరు అనుసరించకపోతే ఆ విషయంపై మన భావన ఏదైతే, క్రీస్తు, బుద్ధుడు, శ్రీకృష్ణుడుకి కూడా కలిగిందో అది కూడా పొరపాటైనది గావాలి లేదా అవతారం గడిపిన జీవితము,చర్య మొత్తం, నిష్ప్రయోజనమైనా కావాలి. 'ఇందులో అనుసరించగల మార్గం లేదనీ, అనుసరించే సంభావ్యత లేదనీ, ఈ అవతారం పడే బాధలు, కష్టాలు, అవాస్తవమనీ కేవలం నటన అనీ అన్నట్లుగా వుంది — దైవానికి ప్రతినిధి అయిన వ్యక్తికి ప్రయాసపడే ఆవశ్యకత లేదు. ఈ రకమైన భావన, అవతారదశను పూర్తిగా అర్థరహితం చేస్తుంది. అలాంటప్పుడు అది అకారణము, అనవసరము, అర్థరహితము అవుతుంది. దైవం సర్వశక్తిమంతుడైనందున, ఈ పృథ్వి పైకి వచ్చే ప్రయాసపడకుండానే మనుషుల్ని ఉద్ధరించగలడు. అది ప్రపంచ ఏర్పాటులో భాగం అయినప్పుడు మాత్రమే అతడు మానవుల భారాన్ని తన పైన వేసుకొని, మార్గాన్ని తెరిచినపుడే అవతారాని కేమైనా అర్థముంటుంది.
CWSA 35:420

భవిష్యత్తుకు తేజోమయ మార్గాన్ని తయారుచేయుట

ఈ మార్గం నీకు, నీ లాంటి వారికి చాలా కష్టతరమైనదని అవతారాలైన శ్రీమాత మరియు నేను మాత్రమే చేయగలమని అంటున్నావు. ఇది విచిత్రమైన అపార్థం. ఎందుకనగా నీ ఆలోచనకు విరుద్ధంగా, ఈ బాట నిజానికి అతి సరళమైన, హంగు ఆర్భాటం లేని, అత్యంత సూటి అయిన మార్గం. మనసును, ప్రాణికాన్ని, శాంతింపజేయగల వారెవరైనా ఈ మార్గాన్ని అనుసరించగలరు. నీ సమర్థతలో పదో శాతం ఉన్నవారు కూడా ఈ మార్గాన్ని అనుసరించగలరు. ఒత్తిడి శ్రమ, కఠిన పరిశ్రమలతో కూడిన మరో మార్గం అతి కష్టమైనది. దానికి చాలా గొప్ప తపశ్శక్తి యొక్క ఆవశ్యకత ఉంది. ఇంక నాకు సంబంధించినంత వరకు, మేము అన్ని మార్గాల ద్వారా ప్రయత్నించవలసి వచ్చింది. అన్ని మార్గాలను అనుసరించవలసి వచ్చింది, కొండంత కష్టాలను అధిగమించడానికి ఆశ్రమంలో గాని, బయటకాని మరెవ్వరు ఎదుర్కోనంత మహాభారాన్ని కష్టమైన పరిస్థితులను భరిస్తూ, పోరాటం చేస్తూ, గాయాలను సహిస్తూ,

చిత్తడి నేలలను, ఎడారులను, అరణ్యాలను దాటుకుంటు, శత్రుసమూహాలను జయిస్తూ — నేను స్పష్టంగా చెప్పగలను, ఇలాంటి కార్యాన్ని మా కన్నా ముందెవరికీ చేయవలసి వచ్చి ఉండదు. మేం చేపట్టినటువంటి కార్యంలోని మార్గంలో నడిపించే నాయకుడు, దైవానికి మారుపేరుగా, దివ్యప్రతినిధిగా ఉండి, ఆ దైవాన్ని క్రిందికి తీసుకు రావాలి. దానితో పాటు మానవుల లోని ఎదుగుదల లక్షణానికి కూడా ప్రాతి నిధ్యం వహించాలి వారి భారాన్ని పూర్తిగా మోయాలి, ఒక లీలగానో, క్రీడగానో కాదు, పూర్తి నిజాయితీతో, అడ్డంకులు, కష్టాలు, ప్రతికూలతలతో కలవరపడక, అవరోధించబడక, నెమ్మదిగా పరిశ్రమతో విజయం పొందడమే, ఈ మార్గంలో విజ యవంతం కావడం. మాకు కలిగిన ఈ అనుభవం ఇతరులకు కూడా కలగాలనే ఆవ శ్యకత లేదు. ఎందుచేతనంటే మాకు సంపూర్ణ అనుభవం ఉన్నందువలన, మేం మిగిలిన వారికి సూటిగా ఉండే సులభమైన మార్గాన్ని చూపగలం — వారు మా మార్గాన్ని అనుసరించడానికి అంగీకరించినట్లయితే మేం పొందిన అనుభవానికి మేం అత్యధికమైన మూల్యం చెల్లించాము, అందుకే నీకు, మిగిలివారికి మేం పదే పదే చెబుతున్నాం: "చైత్యపురుషు దృక్పథాన్ని తీసుకోండి, సూటైన తేజోమయ మార్గాన్ని అనుసరించండి, దైవం బాహటంగా కాని రహస్యంగా గాని మీలో ఆధారంగా ఉంటాడు — రహస్యంగా అయినప్పటికి, మంచి సమయం చూసుకొని మీ ముందు నిలుస్తాడు — ఆ కఠినమైన, అవరోధాలతో కూడిన, ఆ చుట్టు తిరిగే కఠినమైన దారిపై పయనం కోసం పట్టు పట్టకు."

CWSA 32:94-95 — శ్రీఅరవిందులు

దివ్యమాత కార్యసాధనకై మానవ రూపధారణ

ఒక్క విషయం నేను కచ్చితంగా చెప్పగలను, అదే నేను ఎవరన్న విషయం. శ్రీఅరవిందులకు కూడా ఆ విషయం తెలుసు, అది వారు ప్రకటించారు. ఈ విషయంలో మొత్తం మానవాళి కున్న సందేహాలు కూడా ఈ సత్యాన్ని ఏ మాత్రం మార్చలేవు.

24 మే 1951

ప్రశ్న: దివ్యప్రభువు ఈ ప్రపంచాన్ని తయారు చేయమని అడిగినపుడు ఏం

జేయాలో మీ కెలా తెలిసింది?

దాని కోసం నేనేం నేర్చుకోవలసి రాలేదు, ఎందుకంటే ఆ పరమ ప్రభువు తన లోనే సర్వాన్ని ఇముడ్చుకుని ఉన్నాడు — సకల ప్రపంచ జ్ఞానాన్ని, దాన్ని తయారుచేసే శక్తిని, ఒక ప్రపంచం ఉండాలని ఆతను నిర్ణయించుకున్నపుడు, ముందుగా అతడు ఆ ప్రపంచ జ్ఞానాన్ని తీసుకువచ్చాడు. తరువాత దాన్ని తయారుచేసే శక్తిని తీసుకువచ్చాడు — అదే నేను — ఆ తరువాత నన్ను ఈ ప్రపంచం తయారు చేయమని ఆజ్ఞాపించాడు.

CWM 13:25 సెప్టెంబరు 1957

ప్రశ్న: మీరు మాలాగే ఎందుకొచ్చారు? మీ నిజరూపంతో ఎందుకు రాలేదు?

ఎందుకంటే నేను మీలాగా రాకపోయి ఉంటే, నేను ఎన్నటికి మీతో సన్నిహితంగా ఉండకపోదును. "నాలాగ తయారవండి" అని చెప్పలేకపోయి ఉందును.

27 సెప్టెంబరు 1957

శ్రీమాత

నళినీకాంత గుప్త జ్ఞాపకాలు

ప్రారంభంలో, శ్రీఅరవిందులు అమ్మను (మదర్) అని స్పష్టంగా 'మిర్రా' అనే పేరు తోనే సూచించేవారు. కాని కొంతకాలం తరువాత (అంటే కొన్ని సంవత్సరాల తరువాత) వారు 'మ' అనే ధ్వని దగ్గర కొంత సమయం ఆగి, చిన్న సంకోచంతో పూర్తి పేరు పలికేవారన్నది మేం గమనించాం. ఆ సమయంలో మా కది కొంత వింతగానే కనపించింది, కాని తరువాత మాకు కారణం తెలిసింది. శ్రీఅరవిందుల పెదవులు 'మదర్' అని పిలవబోయి, మేము ఇంకా తయారు కాలేదన్న ఉద్దేశ్యంతో మిర్రా అన్న పిలుపు దగ్గర ఆగిపోయేవారు. ఏ ప్రత్యేక దినాన ఏ క్షణంలో, ఏ శుభఘడియలో వారు 'మదర్' అన్న పదాన్ని తమ పెదవులతో పలికారో ఎవరికి స్పష్టంగా తెలియదు. కాని ఆది కాలంలో లిఖించబడని దివ్యక్షణం. ఈ పృథ్వి యొక్క, మానవుల యొక్క చరిత్రలో విధిలిఖిత క్షణం. ఆ పరమ పావన క్షణంలోనే ఈ పదార్థ ప్రపంచంలో, ఈ మానవుని బాహ్యాచైతన్యంలో శ్రీమాత యొక్క ప్రతిష్ఠాపన జరిగింది.

నళినికాంతగుప్త, జ్ఞాపకాలు పుటలు 83-88

శ్రీఅరవిందులను కలుసుకున్న లేదా తెలుసుకున్న ముందు నుంచే శ్రీమాత యోగం చేసేవారు. అయితే వారి సాధనా మార్గాలు స్వతంత్రమైనవి అయినా, ఒకే పద్ధతితో సాగాయి. వారు కలిసినప్పుడు ఆ సాధనను మరింత సంపూర్ణం చేసుకోడానికి ఒకరి కొకరు సహాయపడ్డారు. శ్రీఅరవిందుల యోగంగా తెలియ బడుతున్నది వారిద్దరు కలిసి సృష్టించినది. ఇప్పుడు వారిద్దరు సంపూర్ణంగా గుర్తిం చబడ్డారు – ఆశ్రమంలో సాధన, దానికి కావలసిన అన్ని ఏర్పాట్లు శ్రీమాత చేత స్వయంగా నిర్వహించబడ్డాయి. శ్రీఅరవిందులు ఆమె వెనుక ఉండి సహాయన్ని అందిస్తారు. ఇక్కడికి యోగాభ్యాసం కోసం వచ్చిన వారందరు, వారికి సహాయపడుతూ, వారి ఆధ్యాత్మిక జీవితాన్ని నిర్మించే శ్రీమాతకు సర్వ సమగ్ర సమర్పణ చేయాలి.


CWSA 32: 8182 శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

శ్రద్ధాంజలి

శ్రీయుతులు డా. అమరవాది వేంకటరామ శాస్త్రిగారు, 2014 డిశంబరు 24 న శ్రీమాతారవిందుల సన్నిధిని చేరుకున్నారు. శ్రీ వేంకటరామశాస్త్రి గారు 1933 జనవరి 12 న విజయవాడలో జన్మించారు. 'అఖిల' మాసపత్రిక ప్రారంభం నుంచీ శ్రీమాతారవిందుల రచనలకు అనువాదకులుగా వారు తెలుగు పాఠకలోకానికి సుపరిచుతులు. శ్రీ వేంకటరామశాస్త్రి గారు జియాలజీలో జర్మనీలో డాక్టర్ ఆఫ్ సైన్స్ గ్రహీతలు. ఆంధ్రా యూనివర్శిటీ జియాలజీ విభాగములో ప్రధానాచార్యులుగా పదవీ విరమణ చేశారు. ఆ కాలంలో జర్మన్ భాషను కూడా విద్యార్థులకు బోధ చేసేవారు. విశాఖవాసులకు హోమియోపతి డాక్టరుగా కూడా ఎనలేని సేవ చేశారు. తెలుగు భాషలో హోమియోపతిలో గ్రంథాలు రచించారు. శ్రీ వేంకటరామశాస్త్రి గారు శ్రీమాత ఆశీస్సు లందుకున్న ధన్యజీవులు. విశాఖపట్టణంలో శ్రీఅరబిందో సెంటరును చాలా కాలం పాటు నిర్వహించారు. శ్రీమాతారవిందుల రచనలను తెలుగులోకి అనువదించి తెలుగు పాఠకులకు చదువుకునే అవకాశం కల్పించారు. వారి సతీమణి డా. అమరవాది ప్రభావతి కూడా ఆ బాటలోనే నడుస్తున్నారు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అఖిల కార్యవర్గంతో పాటు, అఖిల పాఠకలోకం వారి స్మృత్యర్థం శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

సత్యమేవ జయతే



అఖిల

అఖిల భారత పత్రిక

మే 2015

విషయసూచిక

1932 ఏప్రిల్ 18

అతిమానసం స్వయంగా సత్యమై యుండడమేగాదు, అసత్యాన్ని పూర్తిగా తిరస్కరించేదికూడా. అసత్యానికి ఆశ్రయమిస్తున్న చేతన లోనికి అతిమానసం దిగివచ్చి, స్థిరపడి అభివ్యక్తం గావడమనేది యెన్నడూ జరుగదు.

అందుచేత, కేవలం ప్రాథమిక సోపానమే అయినప్పటికీ, అసత్యాన్ని జయించాలంటే అబద్ధాలు చెప్పడం, మానడం ప్రప్రథమ ఆవశ్యకత.

చివరకు అస్తిత్వమంతటిలో దాని సమస్తగతుల యందు, గమ్యాన్ని అసలు చేరుకోవాలంటే ఒక సంపూర్ణ, సమగ్ర చిత్తశుద్ధి నెలకొనేటట్లు చేయాలి.

The Mother

అనువాదం: కె.వి. రావు

సత్యమంటే?

శాస్త్రి వచనాలు

అంతఃశరీరంలో ప్రకాశవంతమై దివ్యతేజోవిరాజిత దేహంతో అలరారుతున్న ఆత్మను దేనినైతే తమ సర్వదోషాలను కఠోరతపస్సు ద్వారా హరింపజేయుటవలన ఋషులు దర్శించగలరో ఆ ఆత్మను, సత్యశీలత, ఆత్మ నిగ్రహము సమగ్ర జ్ఞానముతో దర్శించవచ్చును.

విజయవంతమయ్యేది సత్యమేగాని అనృతంకాదు. దేవతలు పయనించే బాట సత్యంచేత పరచబడింది. దానిననుసరించి ఋషులు సత్యముయొక్క దివ్యధామాన్ని అధిరోహిస్తారు.

మానసిక నిర్వచనానికి అతీతమైనది సత్యం

సత్యానికి మానసిక నిర్వచనం నీకు కావాలి. సత్యాన్ని మానసిక పరిభాషలో నిర్వచించలేము...

సత్యం ఇది అని చూపించలేం, నిర్వచించలేం... అలా జీవించవలసిందే. సత్యానికి తనను సంపూర్ణంగా అర్పించుకొన్నవ్యక్తికి, సత్యజీవితాన్ని కాంక్షించిన వ్యక్తికి, సత్యాన్ని సేవించాలని కాంక్షించిన వ్యక్తికి, చేయవలసివున్నదేమిటో ప్రతిక్షణం తెలుస్తూ వుంటుంది. అదొకరకమైన అంతః స్ఫూర్తి లేదా అంతర్వివేకం(అది చాలా తరచుగా మాటలు లేకుండా, కాని కొన్ని సమయాల్లో మాటల రూపంలో కూడా వ్యక్తం అవుతుంది.) ఆ క్షణంలో యేది సత్యమో దానిని క్షణక్షణానికి తెలిసేటట్లు చేస్తుంది. ఇదిగో, ఇదే చాలా ఆసక్తిని కలిగించే విషయం. చక్కగా నిర్వచించబడిన, చక్కగా వర్గీకరించబడిన, చక్కగా ఋజువుచేయబడిన విషయంగా నీవు సత్యాన్ని గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు! తెలుసుకొని ఇంక దేనికోసమూ వెంపర్లాడకుండా స్థిమితంగా కూచోవాలనుకుంటున్నావు. దాన్ని పట్టుకొని "ఇదిగో ఇదీ సత్యం" అని చెప్పి దానిని స్థిరపరచాలనుకుంటున్నావు. మతాలన్నీ చేసిన పనియిదే. అవి తమ సత్యాన్ని నిర్హేతుకంగా సిద్ధాంతీకరించాయి. కాని అది సత్యమెంత మాత్రం కాదు.

సత్యం సజీవమైనది, గమనం కలది, ప్రతీ క్షణం తనను తాను వ్యక్తం చేసుకొనేది,

పరాత్పరుని చేరుకొనే మార్గాలలో అదొకటి.

పరాత్పరుని చేరుకొనేందుకు ప్రతివ్యక్తికి అతనిదైన ఒక మార్గంవుంది. అన్ని ప్రక్కల నుండి ఏకకాలంలో ఆయనచెంతకు చేరగల కొంతమంది బహుశా ఉండి ఉండవచ్చు. కాని భక్తిద్వారా, శక్తిద్వారా, చేతనద్వారా, సత్యంద్వారా చేరగలవారు కూడా వున్నారు. ఈ పద్ధతిలో ప్రతీది పరమేశ్వరుని వలె సంపూర్ణం, బలీయం, అనిర్వచనీయం.

తన కర్మయందు పరమేశ్వరుడు సంపూర్ణం, బలీయం, అనిర్వచనీయం, అగ్రాహ్యం. ఇవే లక్షణాలు ఆయనయందాపాదితమైన వాటికి కూడా వుంటాయి.

ఈ విషయాన్నెరిగినవ్యక్తి, ఈ పద్ధతులలో దేనిని సేవించడానికైనా తనను తాను నియమించుకొన్న వ్యక్తి (జీవితంలో, కాలంలో, కాలగమనంలో దానిని వ్యక్తం చేసినవ్యక్తి) ప్రతిక్షణం సత్యమంటే యేమిటో తెలుసుకొంటాడు. ప్రతిక్షణం చేతన అంటే యేమిటో తెలుసకుంటాడు, ప్రతి క్షణం శక్తి అంటే ఏమిటో తెలుసుకుంటాడు. ప్రతిక్షణం ప్రేమ అంటే ఏమిటో తెలుసుకుంటాడు. బహురూపశక్తి, ప్రేమ, చేతన, సత్యం తననుతాను అసంఖ్యాకంగా, సృష్టిలో వ్యక్తం చేసుకొంటుంది, పరమేశ్వరుడు సైతం సృష్టిలో తనను తాను అసంఖ్యాకంగా వ్యక్తం చేసుకున్నట్టే.
CWM 15: 396, 97

సత్యాన్ని మనస్సు అస్తవ్యస్తం చేసిచూపుతుంది.

ప్రధానమైన సత్యాన్ని కనులకు మిరుమిట్లు గొలిపే అమలిన తెల్లని వెలుగు గల ఒక గోళంతో మనం పోల్చినట్లైతే, మానసిక మాధ్యమంలో, మానసిక వాతావరణంలో ఈ సమగ్ర తెల్లని వెలుగు, వేలవేల ఛాయలలోనికి రూపాంతరం చెందుతుంది. ప్రతిఛాయకు ఒక ప్రత్యేక వర్ణం వుంటుంది. ఎందుచేతనంటే, అవన్నీ ఒక దానినుండి మరొకటి వేరుపడిపోయాయిగనుక. ఈ మాధ్యమం తెల్లని కాంతిని అస్తవ్యస్తంచేసి దానిని అసంఖ్యాకమైన ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, నీలం వగైరా వివిధరంగులలో కనబడేటట్లు చేస్తుంది.ఒక్కొక్కసారి అవి ఒకదానికొకటి ఏ మాత్రం పొసగనివిగా కన్పిస్తాయి. తెల్లని గోళపు తెల్లని వెలుగు యొక్క అసంపూర్ణ అంశాన్ని గాకుండా అధిక లేక అల్పసంఖ్యాక చిన్నచిన్న వివిధవర్ణాల సూక్ష్మ వెలుగులను మనస్సు పట్టుకొంటుంది. వాటితో అది తెల్లని వెలుగును తిరిగి తయారు చేయలేదు.

అందుచేత అది సత్యాన్ని చేరుకోలేదు. అది సత్యంయొక్క అసంపూర్ణ అంశాలనుగాక ముక్కలు ముక్కలు గాబడిన సత్యాన్ని మాత్రమే పట్టుకొంటుంది. సత్యం వివిధ మూలకాలుగా విడిపోయిన స్థితి అది.

సత్యం ఒక పూర్ణం లేక సమగ్రం. దానికి ప్రతిదానితో అవసరంవుంటుంది. అస్తవ్యస్తం చేసే ఏ మాధ్యమంలో నుంచి నీవు చూస్తున్నావో ఆ మానసిక వాతావరణం అభివ్యక్తికి లేదా వ్యక్తంచేయడానికి లేదా సమస్త అంశాలను ఒకేసారి గ్రహించడానికి పనికిరాదు. అంతేగాదు, దానివల్ల అసలు ఉత్తమ అంశం అందకుండా పోతుంది. అందుచేత దానిని ఎంత మాత్రము సత్యం అనలేం. కాని సారతః అది కూడా యదార్థమైనదే అని చెప్పవచ్చు. మానసిక వాతావరణంలో అసలు సత్యంగా ఎంత మాత్రం నిలువలేనిది కాబట్టి అది అజ్ఞానం.

CWM 10:2

తర్కం సత్యానికి బద్ద విరోధి

ఒక భావం నుండి మరోభావాన్ని వెలికితీసే, ఒక సన్ని వేశంనుండి దానికి సంబంధించిన సమస్త పర్యవసానాలను సరిగా అంచనా వేసే కళ తర్కశాస్త్రం, కాని సత్యాన్ని వివేచించగల సామర్థ్యం తర్కానికి లేదు. నీ తర్కం నిర్వివాదమైనదే గావచ్చు. కాని నీ ప్రారంభ స్థానం సరైనది గాకపోతే, నీ తర్కం సరైనదైనంత మాత్రాన లేక తార్కికంగా ఆలోచించడం మూలాన, అంతిమ నిర్ణయాలు సరైనవి కాజాలవు. మంచివాడిని గనుక అధికుడననుకోవడం, ఋజువర్తనుడను గనుక అధికు డనను కోవడం కూడా ఆ కోవకు చెందినవే.

నీ మంచితనంపై నీకున్న అహం యితరులను చులకనగా చూచేటట్లు తయారు చేస్తుంది. నీ దృష్టి నుంచి చూస్తే నీ కంటె తక్కువ ఋజువర్తనులుగా నీ కెవరు కన్పిస్తారో వాళ్ళ యెడల చులకన భావం నీలో నిండిపోతుంది. అది నీ మంచితనానికెట్టి విలువా లేకుండా చేస్తుంది.

అందుకనే శ్రీఅరవిందులు తమ సుభాషితంలో, మంచివాడిని గనుక అధికుడననే తలపు మంచితనానికెలా బద్ధ విరోధియో అలా తర్కం సత్యానికి బద్ధవిరోధి అని చెప్పారు.

CWM 10:67

సత్యం స్వయం వ్యక్తం, దాన్ని విధించగూడదు

సత్యం స్వతహాగానే వుంటుంది, దాన్ని ప్రపంచంమీద యెవరూ విధించవలసిన పనిలేదు. మనుషుల అంగీకారంతో దానికవసరంలేదు. ఎందుకనంటే అది స్వయం సిద్ధం. మనుషులు దానిని గురించి చెప్పే దానివల్ల లేదా వాళ్ళు దానికెంతవరకు కట్టుబడి వున్నారనేదాని మీద అది జీవించదు. కాని యెవరైనా ఒక మతాన్ని స్థాపించాలంటే అతనికి చాలామంది అనుచరులుండాలి. ... మతాల గొప్పతనం వాటిని నమ్మే వాళ్ళ సంఖ్యను బట్టి వుంటుంది. కాని అనుసరించేవారు ఒక్కరూ లేకపోయినా సత్యం సత్యంగానే వుంటుంది. తమ యోగ్యతలను గురించి, గొప్పగా చెప్పుకొనే వాళ్ళ వైపు సగటు మనిషి ఆకర్షితుడౌతాడు. అంతేగాని అతను యెక్కడ సత్యం ప్రశాంతంగా అభివ్యక్తమౌతుందో అచటికి పోడు. స్వీయ యోగ్యతలను గొప్పగా ప్రకటించుకొనేవారికి, వాటిని గొంతెత్తి బిగ్గరగా చాటుకోవలసిన, వాటిని ప్రచారం చేసుకోవలసిన అవసరం వుంటుంది. ఎందుకనంటే అలాగాకపోతే వాళ్లు జనబాహుళ్యాన్ని ఆకర్షించలేరు. ప్రజలేమనుకుంటున్నారనేదాన్ని గురించి పట్టించు కొనకుండా జరిగిపోయే పని జనానికి పెద్దగా తెలియదు. అందుచేత తేలికగా అదె క్కువమందిని ఆకర్షించదు. సత్యానికెటువంటి ప్రచారం అవసరం లేదు. అది తనను తాను కనుమరుగు చేసుకోదు. అలా అని అది తనను గురించి తాను బహిరంగంగా ప్రకటించుకోదు. ఫలితాలెలావున్నా గుర్తింపును కోరదు, లేదా గుర్తించుకుపోవడా న్నుండి తప్పించుకోదు. ప్రపంచం అంగీకరించిందా లేదా అన్న దానివల్ల అది ఆకర్షణకు లోనవ్వదు లేదా బాధపడదు. స్వీయ అభివ్యక్తితోనే అది తృప్తి పడుతుంది.

CWM 10:83

సుగుణమే సత్యమని భ్రమిస్తారు.

ఒకరు ఆహారం, మరొకరు డబ్బు, ఇంకొకరు వ్యాపారం, మరికొందరు బంధు త్వాల విషయంలో .... ఇలా ప్రతివ్యక్తి "సత్యాన్ని సమర్థించేవాడే!" "నా అభిప్రా యాలు యదార్థమైనవిగాకపోవచ్చు!" అని యింతవరకు నాతో చెప్పిన వ్యక్తి ఒక్కరూ లేక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక్కడూలేడు! "నేను చూచే విధానం, లేదా అనుభూతిచెందే విధానం యదార్థమైనది గాకపోవచ్చు", అని ఒక్కడూ

అనలేదు. వాళ్ళంతా పూర్తిగా సత్యసంధులే!

కాదు, వాళ్ళంతా ఒకే పొరపాటు చేస్తున్నారు. వాళ్ళు సుగుణానికి గల పాత భావాన్నే సత్యం అని భ్రమిస్తున్నారు. నైతిక తప్పిదంలా వాళ్ళంతా ఒకే విధమైన పొరపాటు చేస్తున్నారు. అన్నింటినీ మించి, కొద్ది స్వచ్ఛమైన పదాల్లో, బాగా నిర్వచించే పదాల్లో సత్యాన్ని వ్యక్తపరచాలని వాళ్ళనుకొంటారు. అందుకని వాళ్ళు "ఇదీ సత్యం" అని అనగలరు "ఇదే సత్యం"కాబట్టి తక్కినదంతా అసత్యం అనేది మతాల గతకాలం నాటి దుస్థితి.

ఎన్నిసార్లు ... ఎన్ని సందర్భాలలో శ్రీఅరవిందులు (నేనుకూడా) "ఒక విషయం సత్యమైనప్పుడు, తద్వతిరేక విషయంకూడా అంతే సత్యం అని గట్టిగా గ్రహించు. దీన్ని గ్రహించినప్పుడు నీవు అర్థం చేసుకొనడం ఆరంభిస్తావు" అని చెప్పలేదు?

ఈ రోజు ఉదయంకూడా శ్రీఅరవిందులు (వాళ్ళు శ్రీఅరవిందుల పేరుతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేసారు) 'ది మదర్' పుస్తకంలో వ్రాసిన ఒక పాఠ్యాంశాన్ని ఉటంకిస్తూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసారు. అందులోవారు "దైవకృప కేవలం సత్యంలో మాత్రమే పనిచేయగలదు" — ఆ వాక్యం నేను మరచిపోలేదు. (అమ్మ నవ్వుతారు) శ్రీఅరవిందులు ఒకచోట "దైవకృప బదులు పలుకుతుంది. కాని అది అసత్యంలో కూడా బదులు పలుకుతుందని భావించకు."అని వ్రాసారు. ... అదొక గొప్పవాక్యం. ఆ మాత్రం వాళ్ళకు తెలియదా. వాళ్ళు సత్యాన్ని వశం చేసుకొన్నవాళ్ళు. అసత్యం యితరులకు !... దేనినీ అర్థం చేసుకోలేని గర్విష్టి మనస్సు, తనకున్న సర్వశక్తివంతమైన జ్ఞానంలో అలా భావిస్తూ, తనకు తాను భుజం తట్టుకొంటుంది.... ఎంత తమాషా!

(మౌనం)

అది సమస్త సాధ్యతల, సమస్త అసాధ్యతల, సమస్త సామర్థ్యాల, సమస్త అసమర్థతల గరిష్ఠ ప్రయోజనం. ఒక గరిష్ట శక్తిలో ఒక గరిష్ట ప్రయోజనం, గరిష్ట దివ్య కనికరంలో గరిష్ఠ ప్రయోజనం ఇంకా, ఒక దరహాసం హాస్యభావం ఓహ్! ఎంతో కరుణామయ పరిహాసం ఎంతో కనికరం నిండి వుంది. ఎంతో అద్భుతం.... ఎంతో ఆశించే ఈ మనస్సు, నిజంగానే అదొకపరమాద్భుత ఘటన, తనకు తెలియని దాని మంచిచెడు లెంచుతూ తాను చూడనిదాని మీద నిర్ణయాలు చేస్తూ అది కాలక్షేపం చేస్తుంటుంది. (ఒక శిష్యునితో సంభాషణలు, మార్చి22-1967)

సంపూర్ణ సత్యాన్ని తిరస్కరించడమే అసత్యం

ఈ పూర్ణం నుంచి దానికి సంబంధించిన ఏ అంశాన్నైనా విడగొట్టి తీసుకొని దానినే ఏకైక సత్యంగా ధృవీకరిస్తే అదెంత ప్రధానమైనదైనా లేక సర్వగ్రాహకమైనదైనా తప్పకుండా అసత్యమే అవుతుంది. నిర్వివాదమైన మూఢ నమ్మకం అంటే యిదే. అందుచేత అది అత్యంత ప్రమాదకరమైన అసత్యం. ఎందుచేతనంటే ప్రతీదీ తానే యేకైక, ప్రత్యేకతగల సత్యాన్ని అని గట్టిగా పలుకుతుంది. పారమార్థికము, లౌకికము, విభాజితము, పరిమితము అయినదానిని మాత్రమే గ్రహించగల మనస్సుకు, పూర్ణసత్యం, అనంత, శాశ్వతమగు సత్యం అచింత్యం. కనుక మానసిక స్థాయిలో పూర్ణ సత్యం అంఖ్యాక సత్య శకలాలుగా, పరస్పర వైరుధ్యంగల సత్యాలుగా విభ జించ బడుతుంది. అవన్నీ కలసి ఒక మొత్తంగా అయి, ఆ సత్యాన్ని సాధ్యమైనంత ఉత్తమంగా తిరిగి రూపొందించ తంటాలు పడ్తాయి. ఎందుకనంటే ప్రతి సత్య శకలం, యితర సత్య శకలాలను నెట్టివేసి, తానే యేకైక పూర్ణ సత్యాన్నని గట్టిగా వాదించ జూస్తుంది. ఆ యితర సత్యశకలాలు అసంఖ్యాకపూర్ణత్వంద్వారా, సృష్టిలో క్రమ క్రమంగా అనంత, శాశ్వత, నిరపేక్ష సత్యాన్ని వ్యక్తం చేయ యత్నిస్తాయి. ఆ విధంగా అవి పూర్ణసత్యాన్ని తిరస్కరిస్తాయి.

CWM 14:198

అసత్యం, అబద్ధం మధ్యవుండే భేదం

అసత్యం, అబద్ధం మధ్య చాలా పెద్ద భేదమే ఉంది. అబద్ధం ఆడినపుడు అతని నోటినుండి వెలువడే మాటలు అసలు వాస్తవానికి విరుద్ధంగా వుంటాయి. లేదా దానిని తిరస్కరిస్తాయి. ఉదా: నీవెక్కడికోవెళ్ళి, అచటకి వెళ్ళలేదని చెప్పావనుకో, లేదా యేదైనాచేసి, చేసానని వాస్తవాన్ని అంగీకరించకపోతే, అది అబద్ధం. కాని అబద్ధాలకు బలం వుండదు. ఒక్క గొప్పబలహీనతకు అబద్ధాలెప్పుడూ ఒక చిహ్నం. అదే అలవాటుగా మారితే, అదొకపెద్ద వక్రబుద్ధికి, కుటిలతకు చిహ్నం అవుతుంది.

అసత్యం అంతకంటె తీవ్రమైనది. ఇప్పుడున్నది ఉన్నట్లుగా తీసుకొంటే ప్రపంచం ఒక అసత్య స్థితిలో వుంది, అది శాశ్వత సత్యాన్ని తిరస్కరిస్తున్నది. అసత్యాన్ని ప్రధానంగా మూడు వర్గాలుగా విభజించవచ్చు.

1. సత్యాన్ని ఆకాంక్షిస్తూ, సత్యాసత్యాలను వివేచించడంలో ఆకాంక్షకు చిత్తశుద్ధి లేకపోతే, వాళ్ళెప్పుడూ యిబ్బందిలో పడి సత్యానికి దారితీసే మార్గంనుండి వైదొలగి పతనమౌతారు.

2. ఈ వర్గం ప్రమాదకరమైనది. దీనికి సంబంధించిన వాళ్ళు, సత్యాన్ని అసత్యాన్ని బాగా వివేచిస్తారు. సత్యం ఉత్తమమైనదనీ వారికి తెలుసు. కాని (అసత్యపు) ప్రలోభాన్ని నిలువరించగల బలం వాళ్ళకుండదు. ఎప్పుడూ కష్టాల్లో పడుతూ, దుఃఖభాజితులై సత్యమార్గంనుండి వైదొలుగుతారు.

3. చివరివర్గానికి సంబంధించినటువంటి వాళ్ళు అందరికంటె ప్రమాదకరమైన వాళ్ళు. వాళ్ళకు సత్యపు యెరుక వుంటుంది. కాని సత్యాన్ని గుర్తించ నిరాకరించి, బుద్ధిపూర్వకంగా అసత్యాన్ని కోరుకుంటారు. వాళ్ళకు సత్యమంటే ఒకరకమైన ద్వేషం వుంటుంది. అందుకని దాన్ని తీవ్రంగా తిరస్కరిస్తారు.

"సావిత్రి"లో వ్రాసినట్లు, వీరిని భగవంతుని పట్టికలో తప్పిపోయిన ఆత్మలు:

"కాలమందు ఆత్మకుగల యేకైక అవకాశమును కోల్పోవుచు
అలా శాశ్వతుని బాటపై అతడు పతనమై పోవచ్చు;'
నిరీక్షిస్తున్న దేవతల కాతని వార్తలందక
అంతరాత్మల పట్టికలో 'తప్పిపోయారు' అని నమోదుచేస్తారు."
(సావిత్రి పేజి. 239)

సత్యాన్ని తిరస్కరించి, అసత్యాన్నెంచుకునేవారు చాలా తక్కువమంది అనేది సంతోషించతగ్గ విషయమే.

శుభ సంకల్పం గలవాళ్ళు, శుభం చేకూర్చాలనుకునేవాళ్ళు శుభాకాంక్షగల వాళ్ళు అలాగే మిగిలిన శుభలక్షణాలు కలవాళ్ళు చాలామందే వున్నారు. అలా వున్నప్పటికీ వాళ్ళు అసత్యంలోనే నివసిస్తున్నారు, ఎందుకనంటే సత్యం కోసం పోరాడే బలం వాళ్లకులేదు. ఒక విరామమెరుగని జాగరూకతతో వాటి యెడల ప్రాతికూల్యత చూపకుండా పోనీ లెమ్మని విడచివేస్తే, నీవు అసత్యంలోనే నివసించక తప్పదు. ఎందుచేతనంటే ఈ ప్రపంచమే ఒక అసత్య ప్రపంచం

Mother You Said So

అనువాదం: కె.వి. రావు

సత్య మార్గం

సత్యానికి ఉపకరణం కావాలంటే?

సత్యానికి ఉపకరణంగా ఉండాలంటే మీరెప్పుడూ అసత్యాన్ని కాక సత్యాన్నే పలకాలి.. దీని అర్థం అందరికీ అన్నీ చెప్పి వేయమని కాదు. మాట్లాడటానికి నిరాకరించటం ద్వారా లేదా మౌనం వహించటం ద్వారా నిజాన్ని దాచి ఉంచడం సమ్మతమే. ఎప్పుడంటే వ్యక్తులలో దానిని స్వీకరించే సంసిద్ధతలేనపుడు, దానిని వ్యతిరేకించే వారున్నప్పుడు, ఆ నిజం అపార్థం చేసుకోబడుతుంది, లేదా దుర్వినియోగమవుతుందనుకున్నప్పుడు అలా చేయవచ్చు. ఇదే వక్రీకరించడానికి లేదా అసత్యానికి ప్రారంభం కావచ్చు. కాని అసత్యం పలకడమనేది వేరే విషయం. పరిహాసానికి కూడా అలా చేయటం కూడదు. అది మన చేతనను దిగజారుస్తుంది. చివరి విషయానికొస్తే, ఉన్నతమయిన స్థాయినుండి చూసినప్పుడు మనసుకు నిజమని తెలియటం సరిపోదు. ఎందుకనంటే మానసికమయిన అభిప్రాయం దోషపూరితం లేదా అసంపూర్ణం కావచ్చు. సత్యమైన చేతనలో నిజమైన జ్ఞానాన్ని కలిగి ఉండటం అవసరం.

SABCL 23:652

తలపులలో, వాక్కులలో సత్యం ప్రధానం

అవును, సాధకులకు వాక్కులో పరిపూర్ణ సత్యం చాలా ముఖ్యం. అది చేతనలోకి సత్యాన్ని తీసుకురావటానికి ఎంతో ఉపయోగపడుతుంది. అదే సమయంలో వాక్కును నిగ్రహించటం కూడా కష్టతరమే. ఎందుకంటే సాధారణంగా మనుషులు ఎలా అనిపిస్తే అలా మాట్లాడటానికి అలవాటుపడి ఉంటారు. వారికి తాము మాట్లాడేదానిని నియంత్రించడం, పర్యవేక్షించడం తెలిసిఉండదు. మాట్లాడటమనేది చాలా యాంత్రికంగా జరుగుతూ ఉంటుంది. దానిని మన ఉన్నత చైతన్య స్థాయికి తీసుకురావటం ఎప్పుడూ సులభం కాదు. అందువల్లనే మాట్లాడేటపుడు ఆచి తూచి మాట్లాడటం శ్రేయస్కరం. దానివలన వాక్కును కొంత సావధానంగా ఆలోచించి నిగ్రహించవచ్చు. నాలుక తన యిష్టం వచ్చినట్లుగా పరిగెత్తకుండా నివారించడం సాధ్యమవుతుంది.

SABCL 24:1553

వ్యక్తిత్వంలో చోటు చేసుకునే సాధారణ దోషం

మీరు చెపుతున్న వ్యక్తిత్వలోపం సర్వసాధారణం. మానవ స్వభావంలో అది దాదాపు సార్వత్రికం. అసత్యం చెప్పాలనే ప్రేరణ లేదా సత్యాన్ని అతిశయోక్తి గావించడం లేదా తక్కువచేసి చెప్పడం లేదా వక్రీకరించడం, తమ యిష్టాలను, కోరికలను నెరవేర్చుకొనటానికో, కొంత లాభాన్ని పొందటానికో తమను తాము గొప్ప చేసుకోవటం సర్వసాధారణంగా చోటు చేసుకొనేదే కాని నిజంగా స్వభావాన్ని మార్చుకోవటంలో సఫలత సాధించాలంటే కేవలం సత్యాన్ని పలకటమే అలవరచుకోవాలి.

స్వభావాన్ని మార్చుకోవటానికి తొలి అడుగు, దేనిని మార్చుకోవాలో దాని స్పృహ కలిగి ఉండటం. దానిని మార్చలేను, ఏమాత్రం అవకాశం లేదు. అనుకోకుండా నిరాశ చెందకుండా విషయాలను గమనించాలి. మార్పు తప్పక వస్తుందనే నమ్మకంతో ఉండటం మంచిది. మీ అంతరాత్మ జాగృతమై మిమ్మల్ని ముందుకు నడిపిస్తున్నంత వరకూ, శ్రీమాత చేతన, శక్తి మీలో పనిచేస్తూ అండగా ఉన్నంతవరకూ ఈ సృష్టిలో ఏదీ అసాధ్యం కాదు. ఇప్పుడదే జరుగుతున్నది. అన్నీ నెరవేరుతాయనే విశ్వాసంతో ఉండండి.

SABCL 24:1558

తెలియక అబద్ధం చెప్పటానికి, తెలిసి చెప్పటానికి మధ్య వ్యత్యాసం:

మీకు అసత్యమని తెలిసిన దానిని లేదా విశ్వసించిన దానిని సత్యంగా పలకటానికి, నిజానికి సత్యం కాకపోయినా, మీరు మనసా వాచా సత్యమని విశ్వసించి చెప్పటానికి ఎంతో వ్యత్యాసముంది. మొదటి విషయంలో పూర్తిగా సత్యస్ఫూర్తికి వ్యతిరేకంగా నడవటమయితే, రెండవది సత్యాన్ని గౌరవించటం అవుతుంది. మొదటిది ఉద్దేశ్య పూర్వకంగా అసత్యాన్ని ఆశ్రయించటమయితే రెండవది అధమం ఒక పొరపాటు లేదా అజ్ఞానం మాత్రమే.

ఇది సత్యం మాట్లాడటం లోని ఆచరణాత్మక పరమైన దృష్టి. ఉన్నత సత్యపు దృష్టిలో మనం విస్మరించ కూడనిదేమిటంటే ప్రతి చేతన స్తరానికి తనదైన ప్రమాణముంటుంది. మనస్సుకు సత్యంగా గోచరించేది, ఉన్నత చేతనకు కేవలం పాక్షికమైన

సత్యంగానే కనిపించవచ్చు. కానీ మనసు ఈ పాక్షికమైన సత్యంనుండే ఆవల ఉన్న విశాలమైన మరింత పరిపూర్ణమయిన సత్యాన్ని చేరుకోవలసి ఉంటుంది. అందుకు అవసరమయిన నమనీయత తెరుచుకొని ఉండటం, ఉన్నతమయిన దానిని గుర్తించటానికి సంసిద్ధంగా ఉండటం, తనకు సహజమైన నిమ్నత్వానికి అంటి పెట్టు కోకుండా ఉండటం, ప్రాణికమైన కోరికలు వ్యామోహాలు తనను వెలుగుకు అంధునిగా చేయనీయకుండా, విషయాలను వక్రీకరించి దారి తప్పించకుండా ఉండాలి. ఒకసారి ఉన్నత చేతన పనిచేయటం ప్రారంభించాక కష్టం శమించి, సత్యం నుండి మరింత మహత్తరమైన సత్యానికి స్పష్టమైన ప్రగతి సాధ్యమవుతుంది.
SABCL 24:1560

శ్రీ అరవిందులు

అసత్యవంతుల సాహచర్యంలో జాగ్రత్త

ఈ చిన్న అభ్యాసాన్ని ప్రయత్నించి చూడండి. మీ దినచర్య ప్రారంభమయ్యే టప్పుడు యిలా అనుకోండి, ఆలోచించకుండా నేనేమి మాట్లాడను. మీరు నమ్ముతారుకదూ మీరు మాట్లాడేదంతా ఆలోచించేమాట్లాడతారని, అది ఏ మాత్రం నిజం కాదు. చాలాసార్లు మీరు అనకూడదనుకున్నమాట బయటకు రావటానికి సిద్ధంగా ఉండటం గమనిస్తారు. మీరు ఆ మాట బయటకు రాకుండా అతికష్టంగా సచేతనమయిన ప్రయత్నం చేయవలసి వస్తుంది.

అబద్ధాలు ఆడకూడదని చాలా జాగ్రత్తగా ఉండే వాళ్ళు నాకు తెలుసు, కాని అకస్మాత్తుగా ఒక గుంపులో ఉన్నప్పుడు నిజం చెప్పేబదులు యాదృచ్ఛికంగా అబద్ధం చెబుతారు. వారికి అలా చేయాలనే ఉద్దేశ్యం వుండదు. అలా చెప్పేముందు ఒక్క నిముషం కూడా దాని గురించి ఆలోచించరు. కాని అలా వస్తుంది ఎందుకని? ఎందుకంటే వాళ్ళు అబద్ధాలు చెప్పేవారి సహవాసంలో ఉన్నారు. వాళ్ళు వొక అసత్యపూరితమైన వాతావరణంలో ఉండడంవలన ఆ వ్యాధి వాళ్లకి కూడా అంటుకొంటుంది,.

ఇలా క్రమంగా, నెమ్మదిగా సహనంతో, అన్నిటికన్నా ముందు, ఎంతో జాగరూకతతో, ఏకాగ్రతతో ఒక వ్యక్తి చైతన్యవంతమవుతాడు. తనను గురించి తాను

తెలుసుకోవడం మొదలుపెడతాడు. ఆ తరువాత తనపై తాను ఆధిపత్యాన్ని సాధిస్తాడు.

CWM 4:36-37

అసత్యంపై విజయం

ప్రస్తుతం దీన మానవాళి దాదాపు పూర్తిగా అసత్య ప్రభువుల కబంధహస్తాల్లో, చిక్కుకొని ఉంది. నిమ్న జీవశక్తి, నిమ్న ప్రాణికమేకాక మనిషి మనసు మొత్తం వారిని ఆమోదిస్తుంది. అసంఖ్యాకమయిన మార్గాలలో వారు అర్చించబడతారు. వీరి వంచన గ్రహించ వీలుగానిది. అనేకమైన మారువేషాలతో, దుష్ప్రేరణలతో వారి లక్ష్యాలను సాధించటానికి ప్రయత్నిస్తారు, ఫలితంగా మనుషులు వారి అసత్యాన్ని ఒక విలువైన ధనరాశిలా అంటిపెట్టుకొని, జీవితంలో అత్యంత సుందరమైన వాటికన్నా మించిన దానిగా అభిలషిస్తారు. దాని భద్రత గురించి భయపడుతూ, తమ లోలోతులలో దానిని దాచి ఉంచే జాగ్రత్త వహిస్తారు. కానీ దానిని వెలుపలికి తీసి దైవానికి సమర్పించకుండా వారి కెపుడూ నిజమైన ఆనందం దొరకదు. నిజానికి దానిని బయటకు తీసుకువచ్చి వెలుగులో ఉంచటమే ఒక మహత్తరమైన మార్పును కలుగజేసి అంతిమ విజయానికి మార్గం సుగమం చేస్తుంది. ఎందుకంటే ఒక్కొక్క అసత్యాన్ని బహిరంగ పరచటమే ఒక విజయం. ఒక్కొక్క పొరపాటును అంగీకరించడం ఒక్కొక్క అజ్ఞానాంధకార అసురులను కూల్చడం. ఎంతో నిజాయితీగా చేసినపుడు, అది తనకు తాను మెచ్చుకొనుట కావచ్చు, మరు నిముషం తప్పించుకోడానికి వ్యక్తపరచే పశ్చాత్తాపం కాకూడదు, పునరావృతం కాకూడదని చేసే శక్తిహీనమైన ప్రతిజ్ఞ కాకూడదు. అది గురువు రూపంలో ఉన్న దైవం ముందు ఒప్పుకోవటం కావచ్చు. వ్యక్తిగతంగా నేరుగా గురువుముందు ఒప్పుకున్నప్పుడు ఆ నిర్ణయం కేవలం మీది మాత్రమే కాదు, ఎందుకంటే మీరు నిజాయితీగా ఉంటే ఆ దైవాజ్ఞ మీకు అనుకూలంగా ఉంటుంది. అదేమిటో మీకు అవగాహన కలగడానికి నేను మొదటిసారి శ్రీఅరవిందులను పాండిచ్చేరిలో కలిసినప్పటి అనుభవాన్నొకటి మీకు వివరిస్తాను. నేను గాఢమయిన ధ్యానంలో నిమగ్నమయి ఉన్నాను, అతిమానసం లోకి చూస్తున్నాను. అక్కడి శక్తులు ఈ భూమిపై అవతరించవలసి ఉన్నా ఎందువలననో యింకా ఆవిష్కృతం కావటంలేదు. నేను చూసిన దానిని గురించి శ్రీఅరవిందులను

అడిగాను, వాటి అవతరణ జరుగుతుందా అని. ఆయన చాలా మామూలుగా చెప్పారు. 'అవును'. అని . వెంటనే అతిమానసం భూమిని తాకి అవతరణ సిద్ధించటం ప్రారంభం కావటం నేను చూసాను. సత్యాన్ని నిజంగా సిద్ధింపచేయగల శక్తికి నేను మొట్టమొదటిసారిగా సాక్షినయ్యాను. మీరు నిజాయితీగా ముందుకువచ్చి 'నేను, అసత్యం నుండి విడుదల కావాలను కుంటున్నాను,' అన్నప్పుడు ఇదే శక్తి మీలో సత్యాన్ని సాక్షాత్కారింపజేస్తుంది. మీకు 'అవును' అనే సమాధానం లభిస్తుంది.

CWM 3, P. 141- 42

అనువాదం: డా. సరోజాప్రసాద్

సత్యము — ఆచరణ

మాటలో, చేతలో నిజాయితీ

తడబడకుండా సత్యం పలకగలగాలంటే మనం చేసే పని ఏదైనా, దానిని చాటుమాటుగా చేయాల్సిన అవసరం లేకుండా నెరవేర్చడం ఎల్లప్పుడు ఉత్తమం. అందుకోసం అనుక్షణం మనం చేసే పనుల్లో మనం దైవ సమక్షంలో వున్నామని జ్ఞాపకముంచుకోవాలి.

నిజాయితీగా మాట్లాడాలంటే ఆచరణలో కూడా నిజాయితీగా వ్యవహరించడం అత్యవసరం. నిజాయితీగల మనిషి తన పలుకుల్లో అసత్యాన్ని, తన ఆచరణలో దంభాచారాన్ని వర్జించినవాడై వుండాలి.

సమత్వము, సత్యము

సమత్వమనగా మనుషుల పైన, వారి స్వభావంపైనా, వారి చర్యలపైనా, వారిని కదిపే శక్తులపైనా సమదృష్టి కలిగి వుండటం. మనిషిలోని ఆ లక్షణం ఇతరులపై ఆతనికుండే దృష్టిలోను, వివేచనాశక్తిలోను, మానసికంగా కలిగే పక్షపాత వైఖరి కారణంగా ఏర్పడే మనో దౌర్బల్యాన్ని తొలగించి సత్యాన్ని దర్శించగలుగుటకు ఉపకరిస్తుంది. వ్యక్తియొక్క మనో దౌర్బల్యం ఎల్లప్పుడు ఆతని కార్యాచరణనేగాక, దాని వెనుకనున్న, ప్రతికూలతలను, అవి అసలు లేనప్పటికీ, పసిగట్టినట్లు చేసి,

వ్యక్తి గత భావనను వక్రీకరిస్తుంది. ఆ కారణంగా వర్జనీయమైన అపార్థం చోటుచేసు కుంటుంది. దురభిప్రాయమేర్పడుతుంది. అత్యల్పమైన విషయాలు కూడా కొండం తలుగా మారుతాయి. తత్కారణంగా జీవితంలో యాభైశాతం పైగా ఈ రకమైన దురదృష్టకర సంఘటనలు సంభవించడం నేను గమనించాను. అయితే సాధారణ మానవజీవన గమనంలో వ్యక్తిగత భావన, మనోవికారం మానవస్వభావంలో తలెత్తడం నిరంతరం జరుగుతుంటుంది. అయితే, అవి ఆత్మరక్షణ కోసం అవసరమేమో! అయినప్పటికీ, ఆ సందర్భాలలో కూడా మనుషుల పట్ల, విషయాలపట్ల ఒక బలమైన, ఉదారమైన సమత్వ వైఖరి కలిగివుండటం అవసరమని నేననుకుంటాను. కాని ఒక సాధకునికి వాటన్నింటిని అధిగమించి, ఆత్మబలం ప్రసాదించే ప్రశాంతతలో జీవితం కొనసాగించటం ఆతని పురోగతికి అత్యావశ్యకము.

ఆంతరంగిక పురోగతికి అవశ్యమైన మొట్టమొదటి నియమం, ఇప్పుడుగాని, ఇదివరలోగాని స్వభావంలోని ఏభాగంలోనైనా ఒక తప్పుడు కదలిక చోటుచేసుకున్నదనే విషయాన్ని గుర్తించగలగడం. అది ఒక 'తప్పుడు' ఆలోచన, తప్పుడు భావన, తప్పుడు మాట, తప్పుడు పని ఏదైనా కావచ్చు. తప్పుడు అనటంలో అర్థం సత్యంనుంచి, ఉన్నత చైతన్యంనుంచి, ఆత్మోన్నతినుంచి, దైవమార్గంనుంచి తప్పిన నడత, ఒకసారి గుర్తించబడితే అది యదార్థమని నమ్మాలి, భిన్నార్థం కల్పించి, సమర్థించుకో కూడదు. నిజమని నమ్మి, దివ్యకృప, దివ్యతేజం, దిగివచ్చి తప్పుడు కదలిక స్థానంలో సత్యచేతన యొక్క సరైన కదలిక చోటుచేసుకొనేందుకు గాను దైవానికి ఆ తప్పుడు విషయాన్ని అర్పణ గావించాలి.

SABCL 23:662

శ్రీఅరవిందులు

దైవసంకల్పం తెలుసుకొనుట

ప్రశ్న: దైవసంకల్పమేమిటో మన మెలా తెలుసుకోవాలి.?

సమా: ఎవరికీ అది తెలియదు, అయితే అనుభూతి కలుగుతుంది. ఆ అనుభూతిని పొందటానికి ఎంత తీవ్రంగా ఎంత నిజాయితీతో ఇచ్ఛపడాలంటే ఎదురయ్యే ప్రతి ఒక్క అడ్డంకి తొలగిపోయేటంతగా. ఎంతకాలం అయితే నీకో అభిమానం, ఓ కోరిక, ఓ ఆకర్షణ, ఓ ఇష్టం వుంటుందో అవన్నీ అసలు సత్యాన్ని మరుగుపరు

స్తాయి.అందువలన మొట్టమొదట చేయాల్సిన పని ఏమిటంటే, నీ చైతన్యపు కదలిక లన్నింటిపైనా ఆధిపత్యం సంపాదించటానికి, వాటిని నియంత్రించటానికి, సరిదిద్దడానికి ప్రయత్నించడం: మార్పుచేయ వీలుగాని వాటిని, పరమసత్యం సమగ్రంగా, శాశ్వతంగా అభివ్యక్తమయ్యేవరకు వదిలి వేయాలి....

అవసరమైన దేమిటంటే, అస్తిత్వంలో నిరంతర జ్వాలలా వెలిగే ఒక అభిలాష, ఒక కోరిక, ఒక అభిప్రాయం, ఒక ఆకర్షణ కలిగిన ప్రతిసారి దానిని ఆ జ్వాలలో ఆహుతి గావించాలి. ఈ పని నీవు ఎడతెగకుండా చేసినట్లయితే, నిజచైతన్యకాంతి కిరణం నీ చేతనా పరిధిలో ఉదయించడం ప్రారంభమవుతుంది. మొదట్లో అది యిష్టాయిష్టాల, ఆకర్షణల, ఆసక్తుల, కోరికల, కోలాహలాలకు వెనుక మసక మసకగా నుంటుంది. అయితే నీవు వీటన్నింటి వెనుకకువెళ్ళి ప్రశాంతమయమైన, అలజడి చెందని, దాదాపు నిశ్శబ్దమైన ఆ నిజచైతన్యాన్ని కనుగొనాలి.

మనసు ఎప్పుడైతే మూగబోతుందో, వివేచించుటను ఆపివేస్తుందో, తన తెలివితేటలతో ముందుకు సాగుతుంటుందో, జీవితసమస్య పరిష్కరణ ప్రారంభ మవుతుంది. వ్యక్తి తప్పొప్పులను బేరీజు వేయడం మానాలి, ఎందుకంటే మనసు కేవలం కార్యాచరణకుపకరించే పరికరం లాంటిది. కాని సత్యజ్ఞానానికి ఉపకరించే పరికరం కాదు. సత్యజ్ఞానం అన్యత్ర సంప్రాప్తిస్తుంది.

వ్యక్తి ప్రతివిషయాన్ని విమర్శించటం మానుకుంటే, అతను అంతకు ముందెప్పుడు ఎరుగని పరమ సత్య జ్ఞాన సంపదకు చేరువ కాగలడు. దానితో లోకంయొక్క దుర్దశ పదింట తొమ్మిదివంతులు అంతరిస్తుంది.

CWM 4:3

సరైన వివేచనాశక్తి — పరమసత్యాన్ని తారుమారు చేయుట

జ్ఞానేంద్రియాలు వ్యక్తియొక్క మానసిక స్థితి ప్రభావానికి లోనైవుంటాయి. అందుకు కారణం కంటికి కనిపించినదానికి, మెదడు గ్రహించినదానికి మధ్య ఏదో గ్రహించ వీలుగానంతటి సూక్ష్మ మైన వ్యత్యాసం చోటుచేసుకోవటం. కంటికి కనిపించే దానిని మెదడు నాడీవ్యవస్థ ద్వారా గ్రహిస్తుంది. అందులో తర్కానికి తావులేదు. ఒక విధంగా చెప్పాలంటే అది రెప్పపాటులో జరిగేది. అయితే కంటికి కనిపించిన దానికి, మెదడులో దాని పరిమితిని తెలుసుకొనటానికై ప్రతిస్పందించే కణానికి మధ్య ఒక

చిన్న సన్నటి బాటవుంది. మెదడులో చోటు చేసుకొనే ఈ బేరీజు ప్రక్రియ మనోభావాలకు లోనౌతుంది. కంటికి కనిపించే దృశ్యానికి, మెదడు అంచనా వేసేదానికి మధ్య చోటు చేసుకొనే చిన్న కదలిక చాలాసార్లు ప్రతిస్పందనను తారుమారు చేస్తుంది. అది నిజాయితీకి సంబంధించిన విషయంకాదు. ఎందుకనగా గొప్ప నిజాయితీపరులు, అత్యంత ప్రశాంతచిత్తులు ఎవరైతే తీవ్రమానసికావేశానికి గురికారో, దాని అనుభూతిని లేశమాత్రమైనా పొందరో,అట్టివారుకూడా ఈ విధంగా ప్రభావితులవుతారు. వారు సైతం తారుమారు చేయగల ఈ చిన్ని కదలిక జోక్యాన్ని పసిగట్టలేరు.

కొన్నిమార్లు నైతిక సిద్ధాంతాలు కూడా మధ్యలో మిళితమై అంచనాను తారు మారు చేస్తాయి. అయితే ఈ నైతిక సిద్ధాంతాలన్నింటినీ మనం దూరంగా నెట్టివేయాలి. ఎందుకనగా నైతికత, సత్యము ఒకదానికొకటి బహుదూరం. (నేను ఇలా అనటం ఎవరినైనా కలవరపరిస్తే, క్షమించాలి. కాని విషయం అలాంటిది) అన్ని ఆకర్షణలను, వికర్షణలను జయించినప్పుడు మాత్రమే నీకు సరైన వివేచనాశక్తి కలుగుతుంది. ఎంతవరకైతే నిన్ను ఆకర్షించే విషయాలు, అసహ్యంచుకొనే విషయాలు వుంటాయో, అంతవరకు నీ జ్ఞానేంద్రియాలు సక్రమంగా పనిచేస్తున్నాయని కచ్చితంగా చెప్పలేము....

దేనినైనా యథాతథంగా, అనాసక్తంగా చూడడం అనగా వ్యక్తిగత అంశాలను జోడించకుండా, వ్యక్తిగత ప్రతిస్పందనలకు లోనుకాకుండా చూసి అంచనా వేయడం. వ్యక్తి ఏ విషయాన్నైనా వ్యక్తిగత భావాలతో కలుషితం కానివ్వకుండా గ్రహించడం నేర్చుకోవాలి.

దీనికి నేను మరో అంశం జోడిస్తాను. "సమగ్రపరచబడిన యంత్రం" సజీవ చైతన్యంయొక్క స్పష్టతలేకుండా ఏమీ చేయలేదు. చైతన్యం ఒక టిగా నున్నప్పుడు నీవు తాదాత్మ్యం చెందడంతో తెలుసుకోగలవు. అనగా, నీవు తెలుసుకోవాలనుకున్న లేక నిష్పక్షపాతంగా అంచనా వేయాలను కున్న మనిషితోనో, లేక వస్తువుతోనో నీ చైతన్యాన్ని ఏకీకరించడంతో నీవు ఆ మనిషితోనో లేక ఆ వస్తువుతోనో ఒక ఆంతరిక సంబంధం ఏర్పరచుకుంటావు. అప్పుడు నీకు దానిని గురించి కచ్చితమైన అవగాహన కలిగే వీలుంటుంది....

అదిగాక, నీ అవగాహనను వక్రీకరించేది, తారుమారు చేసేది ఎమిటంటే పర్యవ సానాలను గురించిన నీ ఆరాటం, నీ ఆతురత. ఒక సమగ్రమమైన, యదార్థమైన

అభిప్రాయం ఏర్పడాలంటే వాంఛారహితంగా ఏ విధంగా ఆచరించాలో ఏ విధంగా అమలుపరచాలో నీకు తెలియాలి. వేయిమందిలో ఒక్కరు మాత్రమే అది చేయగలరు. దాదాపు అందరికీ ఫలితం గురించిన ఆరాటం వుంటుంది. లేదా ఫలితం దక్కాలనే గాఢమైన కోరికవుంటుంది. ఫలితాలను గురించిన నీవు ఆరాటపడకూడదు. మామూలుగా పని నిర్వహించు, ఎందుకనగా నిర్వహించవలసిన కార్యం అదేనని నీవు ఇతఃపూర్వమే గ్రహించావు గనుక. నీకు నీవు ఇలా చెప్పుకో, "నేను ఇది చేస్తున్నానెందుకుకంటే నెరవేర్చవలసింది ఇదే కాబట్టి. ఆ తరువాత జరిగేదానితో నాకు సంబంధంలేదు."
CWM 4: 11-12

సత్యమైన ఆచరణ వివిధవ్యక్తులలో విభిన్నంగావుండవచ్చు

అందరిపట్ల ఒకే విధమైన ప్రవర్తన కనబరచాలంటే పరిస్థితి మరింత గందరగోళంగా నుంటుంది. వ్యక్తి చేసే ఆ గందరగోళం ఎలాంటిదంటే, దైవం అందరిని సమానంగా చూడాలని అతను అభిప్రాయపడినప్పుడు తలెత్తే విభ్రాంత పరిస్థితి లాంటిది. అది ఎలాగుంటుందంటే లోకంలో వైవిధ్యం వుండటం, సమానమైన వ్యక్తిత్వంగల ఇద్దరు, వుండటం నిష్ప్రయోజనం కారణం అది వైవిధ్యసూత్రానికి వ్యతిరేకం కాబట్టి, అన్నట్లుగా నుంటుంది.

ఈ విశ్వంలోని విషయాలన్నింటిపైన సమానమైన అవగాహన, ఐక్యతాభావన ప్రేమ, కనికరం వుండాలనే ఒక ఉదాత్తమైన వైఖరి నీ కుండాలని ఆశించవచ్చు. ఒకవేళ అలాంటి వైఖరి నీకు లేనప్పుడు అది ఏర్పడాలని ఆశించాలి. అయితే, అట్టి వైఖరిని కనబరచడం సందర్భానుసారంగా విషయంలోని వాస్తవికత, అవసరాన్ని బట్టి మారుతుంది. ఆచరించుటలోని ఉద్దేశ్యంగాని లేక మూలకారణంగాని ఒక్కటే అయినప్పటికీ కార్యాచరణ మాత్రం సందర్భాన్ని బట్టి, విషయంలోని నిజానిజాలను బట్టి అనుగుణంగానో లేక విరుద్ధంగానో వుండవచ్చు. అందుకోసం వ్యక్తికి కచ్చితమైన, అత్యున్నతమైన, అపారమైన, ఆవశ్యకమైన, యదార్థమైన, అనుకోని బాహ్య సంఘటనలతో ప్రభావితం కానటువంటి వైఖరి వుండాలి. అప్పుడు అతను అనుక్షణం సారభూతమైన సత్యాన్నే గాక ఆచరణలోని సత్యాన్ని కూడా చూడగలుగుతాడు. అయితే అది ఒక్కోవిషయంలో ఒక్కోవిధంగా నుంటుంది. అయినప్పటికీ మనం దేనినైతే, 'భావన' అని అనవచ్చో, ఆ పదం సరిపోనిది కానప్పటికీ, లేక వ్యక్తి ఆచ

రించే చేతనా స్థితి కార్యాచరణగావిస్తాడో అది ప్రధానంగా ఒక్కటే అయివుంటుంది.
CWM 8:405-07

నీ అస్తిత్వ సత్యశీలతకు అనుగుణంగా జీవితం గడపాలి

నీవు సంపూర్ణమైన నిజాయితీని కలిగి ఉన్నప్పుడు, నీవు నీ అస్తిత్వానికి వున్న ఉన్నతోన్నతమైన ఆదర్శానికి అనుగుణంగా జీవితం గడపటానికి నిరంతర కృషి సలుపుతుంటావు. అనుక్షణం నీవు ఆలోచించేదానిలోను, నీవు అనుభూతిచెందేదాని లోను, నీవు నెరవేర్చే కార్యంలోను, వీలైనంత సమగ్రంగా, సంపూర్ణంగా నిన్ను నీవు నీ అత్యున్నత ఆదర్శంతోనో లేక అస్తిత్వపు నిజాయితీతోనో పొంతన కలిగి వుండటానికి ప్రయత్నిస్తావు. అప్పుడు నీవు నిజమైన నిజాయితీగల స్థితిని అందుకున్నా వన్నమాట. నీవు ఆ విధంగా వున్నట్లయితే, నీవు నిజంగా వ్యక్తిగతకారణాలతోనో లేదా అహంకారపూరిత ఉద్దేశ్యాలతోనో వ్యవహరించకపోతే నీవు నీ ఆంతరిక సత్యస్ఫూర్తితో కార్యాచరణ గావించితే, అనగా నీవు సమగ్రమైన నిజాయితీని కలిగి వున్నట్లయితే, ప్రపంచం మొత్తం నిన్ను ఏవిధంగా బేరీజు వేసినా, పరిగణించినా, నీకు అంతా ఒక్కటే. అట్టి సమగ్రమైన నిజాయితీ స్థితిలో నీకు ఇతరులముందు ఉత్తముడిగా కనిపించాలనే అవసరముండదు, ఇతరుల ఆమోదం పొందాలనే తాపత్రయముండదు. ఎందుకనగా నీవు నీ సత్యచేతనతో సామరస్యత కలిగి వున్నప్పుడు నీకు కలిగే మొట్టమొదటి అనుభవమేమిటంటే, నీవు ఎలా కనిపిస్తావు, అనే విషయం అసలు పట్టించుకోవు. ఏ విధంగా కనిపించినా — ఉదాసీనంగా, నిరుత్సాహంగా, ముభావంగా, గర్వంగా — దానికి ప్రాముఖ్యత వుండదు. అయితే, నేను దీనిని మరీమరీ నొక్కి చెప్తున్నాను. నీవు తప్పకుండా నీజాయితీ కలిగి వుండాలి. అనగా, నీవు జీవించేది నీ ఆంతరిక ప్రధాన సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొనడానికే అనే విషయాన్ని ఎప్పుడూ మరువకూడదు.
CWM 4:13

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఒక అసత్యాన్ని, అది ఎంత చిన్నదైనప్పటికీ, మన నోటి ద్వారానో, లేక మన కలం ద్వారానో వ్యక్తపరచటానికి సమ్మతిస్తే, మనం దివ్యసందేశాన్ని అందించగల మెరుగైన వార్తాహరులం కాగలమని ఎలా ఆశించగలుగుతాం? దివ్యసత్యానికి నమ్మిన బంటుగా వుండేవారు అప్రమాణికమైన దాని నుండి, అతిశయోక్తి నుండి, నిమ్న స్థాయికి దిగజార్చే మార్పునుండి, తప్పుకోవాలి.

*

అసత్యాన్ని వర్జించటానికి ఆతృతతోనున్న వారికి మార్గం ఇది:

నిన్ను నీవు సంతోష పరచుకోవాలని ప్రయత్నించకు. అలాగే ఇతరులను కూడా సంతోష పరచాలని కూడా ప్రయత్నించకు. ఒక్క భగవంతుడినే సంతోష పరచాలని ప్రయత్నించు.

ఎందుకనగా దైవమొక్కడే పరమసత్యం. మానవమాత్రుడిగా శరీర ధారులైన ప్రతి ఒక్కరము దైవాన్ని దాచటానికి అతనిపై కప్పబడిన అసత్యమనే ఆచ్ఛాదన లాంటి వారమే.

దైవమొక్కడే తనకు తాను బద్ధుడై వుంటాడు. మనం ఏకాగ్రత వహించ వలసింది ఆతని పైనే కాని అసత్య ఆచ్ఛాదలనపై కాదు.

CWM 14:202

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ప్రపంచంలో దైవకార్యం

దైవం, ప్రపంచంలో దైవకార్యం, ఎల్లప్పుడూ మితిమీరిన దుష్టత్వానికి పరిమితిగా పనిచేస్తుంది. అదే సమయంలో మంచికి అపరిమితమైన శక్తిని ఇస్తుంది. ఈ అపరిమితమైన శక్తే, సృష్టిలో చెడు వ్యాప్తి చెందకుండా పరిమితి చేయడానికి ఉపకరిస్తుంది.

సహజంగానే, పరిమితమైన మానవ అస్తిత్వాల దృష్టికి చెడుకు పరిమితే లేదని, అది మితిమీరుతుంటుందని అప్పుడప్పుడు తలంచబడుతుంది. కాని ఈ మితిమీరి పోవటమనేదే పరిమితి. ఎల్లప్పుడూ, ఒకచోట అది ఆగిపోతుంది. కారణం ఒక సమయంలో దైవం ప్రకటితమై ఇలా అంటాడు, "నీవింక ఎంతమాత్రమూ ముందుకు పోలేవు." మహాప్రకృతియొక్క విధ్వంసాలేకాని లేక మానవుల రాక్షస ప్రవృత్తులే కాని, దైవం జోక్యం చేసుకుని, పరిస్థితులు ఇంకా ముందుకు పోకుండా అడ్డుకుంటుంది.

CWM 7:419-20

ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో, అతిమానసం అవతరణవలన ప్రపంచంలో ఎటువంటి మార్పు జరుగుతుందనే భావన కలిగించటానికి నిజంగానే తటస్థంగా ఉన్న విషయాలు సంపూర్ణతను సంతరించుకుంటాయి. అతి చిన్న తప్పుకూడా దాని పర్యవసానాదుల వలన చాలా ప్రభావకారి అవుతుంది. కొద్దిపాటి చిత్తశుద్ధి , కొద్దిపాటి ఆకాంక్షకూడా అద్భుతమైన ఫలితాలను ఇచ్చేదవుతుంది. జనులలో ప్రాధాన్యతలు తీవ్రస్థాయిలోకి వెళ్ళాయి. భౌతికదృష్టి కోణంనుంచి చూసినప్పటికీ అతి చిన్నతప్పుకూ, అత్యంత స్వల్పమైన విషయానికీ పర్యవసానాలు విపరీతంగా ఉంటాయి. ఆకాంక్షలో అతి తక్కువ చిత్తశుద్ధి కూడా అద్భుతఫలితాలను ఆవిష్కరిస్తుంది. ప్రాధాన్యతలు తీవ్రమైనాయి, కచ్చితమైనాయి....

...మొత్తాన్ని గురించి గ్రాహ్యమవుతున్నదేమంటే. ప్రతీదీ ఎరుకతో కూడిన ప్రపంచ ఆరోహణా దృక్పథంతో ఇచ్ఛగిస్తున్నది. చైతన్యం దైవం అవ్వాలని సమాయత్తమవుతున్నది. అది పూర్తిగా నిజం. తప్పులు అని మనం అనుకునేవి మొత్తం మీద సర్వసామాన్యమానవ చింతనలో భాగం, మొత్తం మీద, మొత్తంమీద.....

...సరే, దానిని చాలా సులువుగా తెలుసుకోవచ్చు. సృష్టి సమస్తం దైవాన్నే

కోరుకుంటున్నది తప్ప అన్యమును కాదు, దైవాన్ని అభివ్యక్తం చేయడం తప్ప మరేమి కాదు. అది చేసేదంతా, తప్పులని చెప్పబడే దాని వన్నీకూడా దైవాన్ని తప్పనిసరిగా అభివ్యక్తం చేయటానికి కేవలం ఉపకరణాలే కాని మనిషి అనుకునేటటు వంటివన్నీ దైవం కాదు, "ఇది అది కాదు," అనే అన్ని విధాలైన హద్దులతో కూడినది: మహా పరిపూర్ణపు అద్భుత ఆధిపత్యశక్తి, ప్రకాశము. అది నిజంగా ప్రపంచంలో మహా అద్భుతశక్తి, ఒక కొత్త అద్భుతమైన మహాఆధిపత్యశక్తి ప్రపంచంలోకి వచ్చింది. అది తప్పక తనకుతాను అభివ్యక్తం అవుతుంది. ఈ దివ్యసర్వశక్తిత్వమును తప్పక "అభివ్యక్తమయ్యేవిధంగా" తప్పక సిద్ధంచేసి తీరాలి. (ఒకరు ఆ విధంగా చెప్పదలచు కుంటే)....

...కాని అత్యావశ్యకమైన నిబంధన: అహంకారపాలన తప్పక ముగిసిపోవాలి. అహంకారం ఇప్పుడు అడ్డంకి. అహంకారం స్థానంలో దివ్యచైతన్యం పునః స్థాపన మవాలి.

CWM11:314-16

పాత కొత్త ధర్మాలమధ్య పెనుగులాట

ప్రపంచం తన దివ్యమూలమును మరచిపోయింది, స్వార్థపూరిత అహంకార శక్తులకు ప్రదర్శన స్థలంగా మారింది: కాని ఇప్పటికీ మించిపోయింది లేదు. అది మహాసత్యమునకు ఉన్మీలనమయ్యే అవకాశం ఉంది. తన ఆకాంక్షతో క్రిందికి పిలవవచ్చు. వేగంగా గిరగిరా తిరిగే యాదృచ్ఛిక సంభావ్యతలో మార్పు తీసుకు రావచ్చు. మనుషులు వారి సొంత మానసిక సన్నిహితత్వాల వల్లను, అనుభవాలు, సాధారణీకరణాల వల్లనూ సంఘటనలు యాంత్రికంగా ఒకదాని తరువాత ఒకటి జరుగుతాయని అనుకునేవన్నీ, వాస్తవంలో తమ ఇచ్ఛ జరిగేవిధంగా నేర్పుతో లోబరుచుకుని ఒకదాని బదులు మరియొకటి జరిగేవిధంగా చేసే ప్రాతినిధ్యం వహించే సూక్ష్మసంస్థల పనే.

ఎంతగా ప్రపంచం దివ్యం కానటువంటి ఈ సూక్ష్మసంస్థలకు లోబడిపోయి అవకాశం ఇస్తున్నదంటే, మహాసత్యం గెలుపు దాని కోసం పోరాడితేతప్ప సాధ్యమయ్యే పనికాదు. దానికి ఆ హక్కులేదు. దానిని అది పొందాలంటే అనృతమును, పెడదారిపట్టిన వక్రబుద్ధిని తనది కాదని నిరాకరించాలి. అందులో అతి ముఖ్యమైనటువంటి పేలవమైన

అభిప్రాయం, సమస్త విషయములు అంతిమంగా తమమూలములను దైవమునందే కలిగి ఉంటాయి కాబట్టి, వాటి తక్షణ క్రియాకలాపాలుకూడా సరాసరి దాని నుంచే వస్తాయని భావించడం. యదార్థమేమిటంటే ఇక్కడ నిమ్నమహాప్రకృతిలో దైవం విశ్వసంబంధమైన పలుచనైన అజ్ఞానముసుగుతో కప్పబడి ఉంటాడు. జరిగేదంతా సరాసరి దైవజ్ఞానంనుంచే బయలుదేరదు. ప్రతిదీ దైవేచ్ఛతో సమానం అని అనుకోవడం ప్రతికూల వైరి శక్తుల ప్రభావాలనుంచి అందే చాలా అనువైన సూచన, దాని వలననే సృష్టి తనకు సాధ్యమైనంతరీతిలో ఎంతో బలంగా అస్తవ్యస్తతకు, అసహ్యతకు గట్టిగా అంటిపెట్టుకోవలసివచ్చి, ఇప్పటి బలహీనస్థితికి కారణమైంది. అయితే ఏమి చేయవలసివుంది అని నీవు ప్రశ్నిస్తావు. మంచిది. దానికోసం మహా ప్రకాశమును క్రిందికి పిలు, మహా పరివర్తన శక్తికి ఉన్మీలుడవుకా. లెక్కించలేనన్ని మారులు దివ్య ప్రశాంతత నీ కొసగబడింది, కానీ అన్ని పర్యాయాలు నీవు దానిని కోల్పోయావు — కారణం ఏదో నీలోని ఒకటి దాని అల్ప స్వార్థపూరిత నిత్యకృత్యాన్ని సమర్పించ టానికి తిరస్కరించింది. నీవు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండకపోతే, నీ ప్రకృతి ఒకవేళ అవతరించే మహాప్రకృతితో నింపబడినప్పటికీ, ఉద్దీపన కలిగించని కుసంస్కారంతో కూడిన నీ అలవాట్లకు వెనుకకు మరలిపోతుంది. ఇది పాత క్రొత్త రూపాలమధ్య పెనుగులాటతో కూడిన తీవ్రసంఘర్షణ, యోగంలోని క్లిష్టత, కాని నీవు విశ్వాసంతో, నీకు దృగ్గోచరమవబడిన పరమోత్కృష్ట మహాశాంతి, మహాభద్రతలకు లోబడి ఉంటే, యాదృచ్ఛిక ఇచ్ఛాక్షేత్రానికి సంబంధించినవైన నీ అస్తిత్వ భాగాలు, ఎంత నెమ్మదిగా అయినా మార్చబడి దివ్యత్వాన్ని సంతరించుకుంటాయి.

CWM 3:163-64

ప్రపంచంలో దైవేచ్ఛ బాహాటంగా పనిచేయదు

ప్రపంచంలో దైవేచ్ఛ ఎల్లప్పుడూ బాహాటంగా పనిచేస్తూంటుందని అనుకోవడం పెద్ద తప్పు. జరిగేదంతా, వాస్తవంలో దివ్యంకాదు. పరమేష్టి ఇచ్ఛ సృష్టిలో నిమ్న శక్తుల కలయిక వలన దాని భావమును వ్యక్తీకరించటంలో అది వక్రీకరించబడింది. అవి దాని ప్రేరణను దోషభూయిష్టంచేసి, దానికి దివ్యంకానటువంటి ఫలితాన్నందిచే మాధ్యమం. జరిగిపోయినది సమస్తం వాస్తవంగా ఏదోషంలేని దాని భావవ్యక్తీకరణే అయి ఉంటే, అటువంటప్పుడు ప్రపంచంలో వక్రీకరణలకు ఏమని సమాధానం

చెపుతాం? ...విశ్వగతమైన అజ్ఞానమును దైవేచ్ఛ కలిగించలేదని కాదు. అది సర్వశక్తి మంతము, సంభావ్యతలన్నీ దానిలో అంతర్గతం. అది దేనినైనా కార్యరూపంలోకి తేగలదు, మౌలికమైన దాని దృష్టిలో నిగూఢావసర దర్శనమునుబట్టి అది దేనినైనా చేయగలదు. ప్రపంచమునకు మొదటి కారణం, సహజంగానే, దైవం అయినప్పటికీ, మనకున్న అల్పనైతిక విలువలతో మానసికంగా ఈ వాస్తవాన్ని అంచనా వేయకుండా ఉండటానికి తప్పక జాగ్రత్త పడాలి. కాని, ఒక్కసారి విశ్వ నియమాలు నిర్ధారించబడిన తర్వాత, అజ్ఞానంలో చిక్కుబడి ఉన్నదానినే దైవంయొక్క పురోగమనశీలమైన అభివ్యక్తతతకు, దానికి పూర్తిగా వ్యతిరేకంగా అనిపించే వాటన్నింటిలో ఆధారభూతమని అంగీకరించితే, అప్పుడు ఊర్ధ్వతరం, నిమ్నతరం అనేటటువంటి ఒక విధమైన విభజన చోటు చేసుకుంది. ప్రపంచచరిత్ర మహాసత్యము, మహా అనృతములమధ్య యుద్ధంగా మారిపోయింది. దానిలోని సూక్ష్మాంశాలు దైవంయొక్క పురోగమనశీలమైన క్రియాకలాపాలకు ఏమాత్రం ప్రాతినిధ్యం వహించకపోగా, నిమ్న స్థాయికిచెందిన మహాప్రకృతి పెద్దఎత్తున వాటిముందు ప్రదర్శించే ప్రతిఘటనలవలన అవి కృతకమై వక్రీకరణలైనాయి. అటువంటి ప్రతిఘటన అనేది అక్కడ లేని పక్షంలో, ప్రపంచంలో జయించటానికంటూ ఏమీ ఉండదు. కారణం ప్రపంచం సామరస్యతలో ఉంటుంది. ప్రస్తుతమున్న సంఘర్షణలకు బదులుగా అది ఒక పరిపూర్ణతనుంచి మరియొకదానికి నిరంతరంగా సాగిపోయే యాత్రగా ఉంటుంది. అదంతా ప్రమాద భరితమైన అపాయా లతో వివిధసంభావ్యతలతో కూడిన ఆట. అందులో దైవం వాస్తవికమైన వ్యతిరేకతను, వాస్తవమైన ఆటంకాలను, తరచు వాస్తవమైన తాత్కాలిక ఓటమిని అంతిమవిజయం పొందే దారిలో ఎదుర్కొంటాడు. ఇటువంటి ఈ మొత్తం ఆట యదార్థత, దానిని కేవలం పరిహాసపాత్రం కానీయదు. దైవేచ్ఛ మహాఅజ్ఞానంలోని హానికారక శక్తుల స్పర్శను పొందిన క్షణంలో అది వాస్తవంగా కృతకత్వానికి గురి అవుతుంది. అందు వలన ప్రపంచాన్ని మార్పు చెందించటానికి, మరియొకభిన్నమైన క్రమపద్ధతిని తీసుకు రావటానికి చేసే మన ప్రయత్నాలను అవశ్యం ఎప్పుడూ సడలించకూడదు. మనం దైవంతో సహకరించటానికి తప్పక జాగరూకులమై ఉండాలి. అంతేకాని ఎంతో శాంతంగా ఏది జరిగినా ఎల్లప్పుడూ మంచే జరుగుతుందని తలపోస్తూ ఉండకూడదు. అంతా వ్యక్తిగత వైఖరి మీద ఆధారపడి ఉంటుంది. పరిస్థితుల సమక్షంలో సరిగా అవి జరిగేసమయంలో నీవు సాధ్యమైనటువంటి అత్యున్నత వైఖరిని పెట్టుకుని

అనగా, నీ చైతన్యాన్ని నీకు అందుబాటులో ఉన్న అత్యున్నత చైతన్యంతో సంసర్గం చేయగలిగితే — అటువంటప్పుడు నీకు జరిగేదంతా తప్పకుండా మంచే జరుగుతుం దని అనుకోవచ్చు. కాని నీవు ఈ చైతన్యంనుంచి పడిపోయి క్రిందికి నిమ్నస్థాయిలోకి వచ్చిన వెనువెంటనే, అప్పుడు జరిగేదేదయినా, మంచిది కాదనేది సుస్పష్టం, కారణం నీవు నీ ఉత్కృష్టమైన చైతన్యంలో లేవు. శ్రీఅరవిందులు ఒకసారి చెప్పినట్లు, "ఏది జరగవలసివుండిందో అది జరిగింది, కాని అది ఇంకా బాగా జరిగే అవకాశం ఉంది." ఎందువల్లనంటే, అది ఏ వ్యక్తికి జరిగిందో అతడు అతని ఉత్కృష్టచైతన్యంలో లేడు. ఇంకొకవిధంగా జరిగే అవకాశం లేదు, కాని అతడు, దైవావతరణను తేగలిగితే, అప్పుడు సర్వసాధారణంగా పరిస్థితులు తప్పనిసరే అయినప్పటికీ, అది మరియొక విధంగా జరిగేటట్లుగా మార్పు చెందేది,.

సత్యానిదే ఆఖరిమాట

ప్రశ్న: ప్రియమైన మాతా, ఎప్పుడూ చెప్పబడేమాట మంచికీ, నిజానికే విజయం చేకూరుతుందని, కాని మనం తరచు జీవితంలో దానికి వ్యతిరేకమే చూస్తున్నాం. దుష్టులు విజయం పొందుతారు, ఏదో విధంగా కష్టాలనుంచి రక్షింప బడతా రనిపిస్తుంది.

ఎల్లప్పుడూ జనులు రెండువిషయాలను తికమక కావిస్తారు. అది సార్వజనీన, ఆధ్యా త్మిక దృష్టి కోణంలో, మహావాస్తవము, మహాసత్యానిదే ఆఖరిమాట అవుతుంది. కాని మనుషులు తాము అవగాహనచేసుకునే గుణాత్మకమైన మంచి మట్టుకుకాదు. దానికి తిరుగులేదు. అంటే ఏమిటి, చిట్టచివరికి దైవమే గెలుపొంది తీరుతాడు. అదే చెప్పబడింది. ఆధ్యాత్మిక జీవితం గడిపినవారందరూ చెప్పినమాట కూడా అదే — అది పూర్తిగా యదార్థం. మనుషులు, దానిని భావవ్యక్తీకరణ గావించేటప్పుడు అంటారు. "నేను చాలా మంచి బాలుడను, నేను నిజమని అనుకున్న దాని ప్రకారంగా నేను జీవిస్తాను కనుక, సమస్త సృష్టి నాకు మంచిగా ఉండాలి." (శ్రీమాత దరహాసం) మొట్టమొదటిగా ఒక వ్యక్తి తనకు తాను చేసుకొనే సొంత ప్రశంస సందేహాస్పదం, అంతేగాక ప్రపంచం ఇప్పుడున్న పరిస్థితులలో, అంతా కలగాపులగం. మహాసత్య ధర్మం సగం గుడ్డిదైన మానవచైతన్యానికి తనకు తానుగా అభివ్యక్తం కానేరదు. అది దానిని అర్థం చేసుకొనలేదుకూడా. ఇంకా స్పష్టంగా చెప్తాను, కచ్చితంగా

చెప్పాలంటే, అది పరమేశ్వరుని దార్శనికత, నిరంతరం తనను తాను సాక్షాత్కరించు కుంటున్నది, కాని దాని సాక్షాత్కారత కలగాపులగమైనా భౌతిక ప్రపంచంలోని అజ్ఞాన మానవదృష్టికి మంచి యొక్క విజయంగా గోచరించదు, మనుషులు అనుకునే మంచి సత్యము లాంటివాటికి. కాని (దానినే తమాషాగా చెబితే) అది ప్రభువు దోషం కాదు, అది మనుషులదోషం! వివరంగా చెప్పాలంటే నేను ఏమిచేసేది ప్రభువుకు తెలుసు, కాని మనుషులు దానిని అర్థం చేసుకోలేరు.

ప్రశ్న: సత్యప్రపంచంలో, బహుశా, అంతా ఇదే విధంగా వాస్తవంగా వుంటుందేమో కాని అది మరో విధంగా చూడబడుతుంది.

సమా: రెండూను, అందులో కొంత తేడా ఉంటుంది. ప్రపంచంలో ఇప్పుడున్న అజ్ఞానము, అస్పష్టతలు దివ్యకార్యకలాపానికి వికృత రూపాన్నిస్తాయి.; సహజంగానే, అది తప్పక మాయమైపోతూ ఉండవలసిందే, అయితే వాటిని మరియొక విదంగా చూడటం కూడా నిజమే.... దాని ప్రకారం, వాటి ఉనికికి మరియొక అర్థాన్నివ్వవచ్చు — రెండూ అక్కడ ఉన్నాయి, ఈ విధంగా (*ఒకదానితో ఒకటి కలిసిపోయినట్లుగా సంజ్ఞ*)

నీవు ఎల్లప్పుడూ ఈ విషయానికే తిరిగివస్తూ ఉంటావు, అది మనిషి చేసే న్యాయనిర్ణయం తప్పని — తప్పు ఎందువల్లనంటే, విషయాల మీద అతని దృష్టి తప్పు, అపరిపూర్ణం — తప్పనిసరిగా ఈ న్యాయనిర్ణయం చెడ్డఫలితాలను కలిగి ఉంటుంది.

ప్రపంచం నిత్యం మారుతున్నది, నిరంతరాయంగా. ఒక్క సెకను కాలం కూడా అది తాను తనలాగా ఉండటం లేదు. సర్వసాధారణమైన సామరస్యత ఇంకా ఎక్కువ పరిపూర్ణతతో తనకు తాను వ్యక్తమవుతున్నది; అందువలన ఏదీ అదే విధంగా ఉండిపోదు. అందుకు వ్యతిరేకంగా అన్నీ కనపడుతున్నప్పటికీ, మొత్తం అంతా ఎల్లప్పుడూ నిరంతరం పురోగమిస్తూ ఉంటుంది. కాని దైవసృష్టిలో సామరస్యత మరింత సామరస్యంగా మారుతున్నది, సత్యం మరింత యదార్థమవుతున్నది. అయితే, అది చూడటానికి ఒకరు తప్పక మొత్తాన్ని వీక్షించవలసి ఉంటుంది. కాని మనిషి చూసేది కేవలం... కనీసం మానవ క్షేత్రాన్ని కూడా కాదు, కేవలం తన వ్యక్తిగతక్షేత్రం మాత్రమే. చాలా చిన్నదైన, చాలా చిన్నదైన, సూక్ష్మాతి సూక్ష్మమైనది — అతడు అర్థం చేసుకొనలేడు.

అది, తనకు తాను సంపూర్తినొందుతూ వుండే ద్వంద్వవ్యవహారం. (కలిసిపోయి నట్లుగా చూపిస్తున్న అదే సంజ్ఞ), పరస్పర క్రియాకలాపాలతో కూడుకున్నది; సృష్టి తనకు తాను ఇంకా ఎరుక నొందినప్పుడు, దాని వ్యక్తీకరణ తనకు తాను పరిపూర్ణత నొందడమే కాక, ఇంకా అధికమైన వాస్తవికతగా రూపుదిద్దుకుంటుంది. ఆ రెండు గమనాలు జతగూడి వుంటాయి....

(మౌనం)

ఏమైనప్పటికీ, ప్రశ్నను వాస్తవరూపంలో పరిశీలిస్తే, ఏ ఋషిసత్తముడూ, ఏ కాలంలోనూ, నాకు తెలిసినంతవరకు, "మంచిగా ఉండు, నీకు బాహ్యంలో అంతా శుభంగా జరిగిపోతుంది" అని ఎప్పుడూ చెప్పలేదు — ఎందువల్లనంటే, అది బుద్ధి హీనత. అస్తవ్యస్తమగు ప్రపంచంలో, అనృతం తాండవించే ప్రపంచంలో, దానిని ఆశించడం సబబు కాదు. కాని నీవు నీ అస్తిత్వంలో ఉండవలసినంత చిత్తశుద్ధితో, పరిపూర్ణంగా జీవనం గడపగలిగితే పరిస్థితులు ఎటువంటివైనప్పటికీ నీవు అంతరంగ సంతోషాన్ని పొందగలవు, సంపూర్ణ సంతృప్తితో ఉండగలవు, ఎవరికీ, దేనికీ దానిని తాకగలిగిన సత్తా లేదు.

CWM 11:75-77

దైవ న్యాయం

నీవు ప్రసరింపజేసే ప్రకంపనలే నిన్ను వాటికి అనుగుణమైన ప్రకంపనలతో సంపర్కంలోకి తీసుకువస్తాయి. నీవు హాని కలిగించేటటువంటి, నాశనం చేసేటటువంటి ప్రకంపనలు ప్రసరింపజేస్తే, తప్పకుండా సహజంగానే నీవు వాటికి అనుగుణమైన ప్రకంననలను నీ చెంతకు ఆకర్షిస్తావు. అది నీకు అసలైన శిక్ష — ఆ మాటను వాడదలిస్తే; కాని అది ప్రపంచంలోని దివ్యవ్యవస్థకు ఏమాత్రమూ అనుగుణమైనది కాదు.

ప్రతి చర్యకూ దాని పర్యవసానాలుంటాయి, మంచి లేక చెడు, కాని బహుమానము, శిక్ష అనే భావన పూర్తిగా మానవ భావనే, అది ఏమాత్రమూ దివ్యసత్యము, దివ్యచైతన్యము పనిచేసే రీతికి అనుగుణంగా ఉండదు.

ప్రపంచాన్ని పరిపాలించే దివ్యచైతన్యం మానవసూత్రాల ప్రకారంగా శిక్షను, బహుమతిని ఇవ్వడం అనేది చేసి ఉంటే, ఈ భూమి మీద సుదీర్ఘకాలంగా మనుషులు ఉండి ఉండేవారు కాదు. మనుషులు దివ్యప్రకంపనలను వక్రీకరించకుండా ప్రసరింప

జేయడానికి కావలసినంత పరిశుద్ధులైతే, అప్పుడు ప్రపంచం నుంచి దుఃఖానుభవం రద్దు చేయబడతుంది.

అదొక్కటే మార్గం.

CWM 12:379

ఇక్కడ ఒక దివ్యచైతన్యం పని చేస్తున్నది. ప్రతి వ్యక్తి ఎప్పుడైతే ఈ దివ్యచైతన్యానికి వ్యతిరేకంగా వెళ్తాడో, ఆ విధంగా చేసిన ప్రతిసారి అతడు తన చైతన్యం నుంచి ఏదో ఒకటి నష్టపోతాడు. దానికి వ్యతిరేకంగా ఏదో ఒకటి చేసిన ప్రతిసారి అతడు కిందికి పోతాడు. ప్రతి వ్యక్తి ఈ దివ్యచైతన్యానికి అనుగుణంగా పనిచేసిన ప్రతిసారి తన చైతన్యంలో అతడు వృద్ధి పొందుతాడు.

CWM 13:51

దైవం తీర్పు

నీవేమనుకుంటన్నావు, దైవానికి అల్పమైన మానవసంబంధమైన న్యాయనిర్ణయం ఉంటుందనా! నీవు మానవసంబంధమైన భావాలను దైవం మీద ప్రక్షేపించనే కూడదు. నీవు చిత్తశుద్ధి లేనివాడవైతే, స్వయం నీ చైతన్యం మరుగున పడిపోతుంది. ఒక ఉదాహరణ తీసుకో, ఒక అసత్యాలు పలికే మనిషికి అతని చైతన్యం మరుగున పడిపోతుంది, కొంతకాలం తరువాత, అతడు ఇక ఎంతమాత్రమూ సత్యం నుంచి అనృతాన్ని వేరు చేసి చూడలేడు. అతడు ప్రతిబింబాలను చూసి వాటినే సత్యమని పిలుస్తాడు. దుష్టబుద్ధి కలిగినవాడు ఆకాంక్షను కోల్పోతాడు, సాక్షాత్కార సామర్థ్యాన్ని కోల్పోతాడు, అవగాహననూ, అనుభూతినీ, నిజమును గ్రహించే అవకాశమును కోల్పోతాడు. అదే శిక్ష.

ఒకరు తమకు దైవానికి మధ్య అడ్డుతెరలు, అవరోధాలు ఏర్పరచుకుంటారు. ఆ విధంగా అతను తనను తాను శిక్షించుకుంటాడు; దైవం ఉపసంహరించుకోడు; అతడు దైవాన్ని అందుకోవటానికి తనకు తానుగా అసమర్థుడవుతాడు. దైవం ఈ విధంగా బహుమతులు, శిక్షలు ప్రసాదించడు, అది ఆ విధంగా ఉండనే ఉండదు.

ఒకరు కపటం కలిగివుండే, దుష్టబుద్ధి కలిగి ఉండే ద్రోహి అయితే, వారు తమకు తాము తక్షణమే శిక్షించుకుంటారు. కుటిల జనులు తమను దుష్టబుద్ధులుగా

తెలియజేసే ఏవంత చైతన్యాన్ని కూడా నష్టపోతారు, వారు అచేతనలు అవుతారు. చివరకు వారు ఏ అవగాహన లేని వారుగా మిగిలిపోతారు.

CWM 4: 21

దైవం మానవ అభిప్రాయాల ప్రకారం నడచుకోడు

నా బిడ్డా, ఆలకించు, దైవం ఆయన చేసేపనులలో మానవ అభిప్రాయాల ప్రకారం పనిచేయడు. అది నీ బుర్రలోకి బాగా ఎక్కాలి. ఒక్కసారి పూర్తిగా. బహుశా అతడు మనం హేతువులు అని చెప్పే వాటి ప్రకారం కాకుండా పనులు చేస్తుంటాడు.

ఏమైనా కాని, ఒకవేళ ఆయనకు మానవహేతువుల మాదిరిగా వుండని కారణాలు వున్నట్లయితే కచ్చితంగా మానవులు న్యాయాన్ని అవగాహన చేసుకునే రీతిలో మట్టుకు ఆయన భావం వుండదు.

ఉదాహరణకు, నీవు సంపదకోసం వెంపర్లాడుతూ, మనుషులను మోసం చేసే ఒక మనిషిని ఊహించుకో.... నీ మదిలో న్యాయంగురించి నీవు ఏర్పరచుకున్న భావం ప్రకారం ఈ మనిషి ధనంలేకుండా పోయి, పేదవాడుగా మార్చివేయబడాలి. కాని, సాధారణంగా మనం దానికి వ్యతిరేకంగా జరగడం చూస్తాం. కాని అది సహజంగానే కేవలం బాహ్యంలో కనబడేవిషయం మాత్రమే. కనపడే వాటివెనుక వేరే, మరేదో ఉంది..... అతను దీనిని వేరే సంభావ్యతలతో మార్పిడి చేస్తాడు. ఆ వ్యక్తికి ధనం ఉండవచ్చు, కాని అతనికేమాత్రం మనస్సాక్షి ఉండదు. అంతేకాక యదార్థంలో ఎల్లప్పుడూ చాలా మట్టుకు జరిగేదేమంటే, అతను కోరుకున్న ధనం సంప్రాప్తమైన తరువాత, అతడు సంతోషంగా ఉండడు.... అది ఎంత ఎక్కువగా చేకూరితే సాధారణంగా అంత తక్కువ ఆనందంగా ఉంటాడు. అతడు తనకు సంప్రాప్తించిన సంపదవలన మానసిక క్షోభ అనుభవిస్తాడు.

నీవు బాహ్యంలో పొందిన విజయాలతో లేదా ఓటమిలాగా కనబడేదానితో న్యాయ నిర్ణయం చేయకూడదు. సర్వసాధారణంగా, చాలా మట్టుకు జరిగేదదే. ఎవరు ఏది కోరుకుంటే దానిని దైవం ఇస్తాడని మనం చెప్పవచ్చు. అన్ని బోధలలోకి అది అత్యుత్తమం. ఎందువల్లనంటే, నీ కోరిక అచేతనం, అస్పష్టత, స్వార్థపూరిత అహంకారాలతో కూడుకున్నదయితే, నీవు చైతన్యంలేమిని, గాడాంధకారాన్ని,

స్వార్థపూరిత అహంకారాన్ని నీ అంతరంగంలో అధికం చేసుకుంటావు. అనగా ఇది నిన్ను సత్యంనుంచి, చైతన్యంనుంచి, ఆనందంనుంచి బహు దూరంగా తీసుకు పోతుంది. మరి దైవం విషయంలో, సహజంగానే, ఒకే ఒక్కవిషయం యదార్థం — దివ్యచైతన్యం దైవంతో ఐక్యత. భౌతిక విషయాలను నీవు ముందుంచిన ప్రతిసారి నీవు ఎక్కువగా భౌతిక వాదివైపోయి, పూర్ణ విజయం నుంచి దూరంగా బహుదూరంగా వెళ్ళిపోతావు.

కాని దివ్యసత్యమునకు ఆ విధంగా పొందిన విజయం ఒక భయంకరమైన ఓటమే.... నీవు సత్యమునకు బదులుగా అనృతమును మార్పిడి చేసుకున్నావు!

కనబడేవాటిని, కంటికి కనిపించే విజయాన్ని చూసి న్యాయ నిర్ణయం చేయడం కచ్చితంగా పూర్తిగా అజ్ఞాన చేష్టే. ఎంతో మొండిమనిషి విషయంలో కూడా, ఎవరికైతే ప్రతీదీ ప్రత్యక్షంగా విజయమే అవుతుందో, అతనికి సైతం ఎల్లప్పుడూ ఒక ప్రత్యామ్నాయం ఉంటుంది. ఈ రకంగా మొండిగా మారిపోయిన అస్తిత్వం, రూపు దిద్దుకున్నముసుగు, చాలామందమైన, చాలా మందమైనటువంటి ముసుగు, బాహ్యచైతన్యం అంతరంగ సత్యాలమధ్య ఉన్నది. ఏదో ఒకరోజున, పూర్తిగా సహించలేనిదవుతుంది. దానికి సాధారణంగా ఎంతో ప్రతిఫలం చెల్లించవలసివస్తుంది — బాహ్యవిజయం.

CWM 6:238-239

శ్రీమాత

సత్యం మరియు మహాకర్మ యొక్క ఒక సంకీర్ణ సాలెగూడు

కర్మసూత్రం అంటే కేవలం జీవితంలో కంటికి కనిపించే అధర్మకృత్యాలకు రాబోయే జన్మలలో ఆచరణాత్మక న్యాయం జరుగుతుందనే మానవ భావన మాత్రం కాదు. ఒక న్యాయం లేదా న్యాయబద్ధత ప్రపంచశక్తి పనిచేసే వాటన్నింటిలో తప్పకుండా ఉంటుంది. మహాప్రకృతి ఆమె చేసే ప్రామాణికతల నిర్ధారణలోనూ, అతి సూక్ష్మ విషయాలలోను అత్యంత శ్రద్ధ కనబరుస్తుందనిపిస్తుంది. కాని మానవ జీవితంలో పరిగణనలోకి తీసుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. అక్కడ కూడా స్థితులు, స్థాయిలు, దిశలు ఉన్నాయి. మన అస్తిత్వపు పై స్థాయి మెట్టుమీది విషయాలు నిమ్నస్థాయిలో కూడా అదే విధంగా కనిపించటం లేక పూర్తిగా అదే

విధంగా ఉండటం జరుగదు. మొట్టమొదటి సర్వసాధారణ స్థాయిలో కూడా చాలా విషయాలున్నాయి. కేవలం నైతికత, ఆనందం మాత్రమే ప్రామాణికం కాదు. విశిష్టవ్యక్తులు విజయంతో, ఆనందంతో కూడిన ప్రతిఫలాన్ని అందుకోవాలని, దుష్టులైన వారు ఏదో ఒక సమయంలో, ఏదో ఒక జీవితంలో, భూమిమీద లేక స్వర్గంలో లేక నరకంలో పతనమైపోయి, బాధలను అనుభవించాలనేది న్యాయమైతే, బలవంతుడై శక్తి కలిగిన మనిషికూడా తాను పెంచి పోషించిన దృఢత్వానికి ప్రతిఫలం పొందడం, మేధోవంతుడు తాను సంపాదించిన నైపుణ్యానికి బహుమతిని పొందడం, అతని ఇచ్ఛ ఏ క్షేత్రంలో శ్రమించినా దాని శ్రమకు, దాని పనులకు తగిన ఫలాన్ని పొందడం న్యాయమే అవుతుంది. కాని నీవు చెప్పేది అది సముచితంగా, నీతిగా, నైతిక సూత్రాల ప్రకారంగా పనిచేయడంలేదనేగా?

కాని ఇచ్ఛ, చర్యలు, పర్యవసానాల విషయంలో సరియైన కార్యసరళి అనగా ఏమిటి? నేను మతనిష్ఠుడను, నిజాయితీ పరుడను కావచ్చు, కాని నేను మందమతిని, బలహీనుడను,అసమర్థుడను అయితే? నేను స్వార్థపరుడను, క్రూరుడను అయి ఉండవచ్చు, కాని నేను ఉజ్వలమైన వేగంతో కూడిన మేధస్సు, అవగాహన చేసుకొ గలిగిన మెదడు, అన్నింటిని ఉపయోగించుకుని ఫలితాలను రాబట్టగలిగే నైపుణ్యం, దృఢమైన సాహసోపేతమైన ఇచ్ఛను దాని అంతిమలక్ష్యంమీద స్థిరంగా ఉంచగలిగితే నాకు అప్పుడు పర్యవసానాలను ప్రభావితం చేసే అపరిపూర్ణత ఉన్నట్టు; కాని నాకు ఫలితాలను రాబట్ట గలిగిన శక్తులుకూడా ఉన్నాయి. సత్యం ఏమిటంటే, మహాప్రకృతిలో సామరస్యతతో కూడిన వాటి సంబంధాలను కచ్చితంగా కనుగొనటానికి ముందు, అక్కడ అనేక విధాలైన శక్తుల శ్రేణులు ఉండడంతో పాటుగా విభిన్న లక్షణాలతో కూడిన వాటి క్రియాకలాపాలను తప్పక చూడగలం. సంకీర్ణమైన ఒక సాలెగూడు చిక్కును మనం విడదీయాల్సి ఉంది. మొత్తంలోని భాగాలను మనం చూసిన తర్వాత, మూలకాలను వాటి సన్నిహితత్వాన్నీ పదార్థరాశి సముచ్ఛయంలో చూపిన తరువాత అప్పుడు మాత్రమే మనం మహాకర్మ దారి తెన్నులను తెలుసుకోగలం.

CWM. 13:374-75

ఏదైనా కాని, ప్రపంచంలోను, మనిషిలోను మంచికి మంచిని, చెడుకు చెడును, తిరిగి ఇవ్వడం జరిగితే, ఎరుకతో కూడిన ఏ నైతికోద్దేశం ఉన్నా, లేక ఉండకపోయినా, తరచు మంచికి ప్రతిఫలంగా చెడురావడం, చెడుకు ప్రతిఫలంగా మంచి రావడం

అనేది జరుగుతుంది. అంతేకాకుండా, స్వార్థరహితమైన సుగుణం లేదా దివ్యభరితమైన మంచి, ప్రేమ ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నప్పుడు వైరపూరితమైన ప్రతిక్రియలను మేల్కొలుపుతుంది. అత్తిల, ఛెంఘిజులు చివరి వరకు సింహాసనంపై వుండడం, సిలువమీద క్రీస్తువుండడం, సాక్రోటిసు తన కివ్వబడిన విషపదార్థం సేవించడం అనేవి ఏవీ మానవ ప్రకృతి ప్రపంచంలో నైతిక సూత్రాలకి కట్టుబడి అంతా మంచే జరుగు తుందనే వాదనకు ఎటువంటి స్పష్టమైన ప్రామాణికతా కాదు.

కచ్చితంగా ప్రపంచంలో దాని ప్రామాణికతల విషయంలో అంతకుమించిన సంకేతం అంటూ ఏమీ లేదు. వాస్తవానికి విశ్వంలోని విధివిధానంలో మంచినుంచి చెడు, చెడునుంచి మంచి వస్తాయి. నైతిక, ప్రాణిక ప్రమాణాలకు సరిపడే కచ్చితమైన లెక్క అంటూ ఉన్నట్టు కనబడదు. మనం చెప్పగలిగినదల్లా చేయబడిన మంచి ఏదైతే ఉందో అది లోకంలో మంచి సమాహారం మొత్తమునూ, మొత్తం మంచి యొక్క శక్తినీ ఎక్కువ చేయడానికి మొగ్గు చూపిస్తుంది. ఇది ఎంత ఎక్కువైతే, అంతగా మానవ సంతోషాలు మొత్తం ఎక్కువయే అవకాశం ఉంది. అదే విధంగా చేయబడిన చెడు, మొత్తం చెడునూ, మొత్తం చెడుయొక్క శక్తిని ఎక్కువ చేస్తుంది. ఇది ఎంత ఎక్కువగా వృద్ధి పొందితే, అంతే ఎక్కువగా మానవుల కష్టాలు ఎక్కువయే అవకాశం ఉంది. అంతిమ పర్యవసానంగా, మనిషి కాని లేదా దేశంకాని చేయబడిన చెడుకు ఫలితం అనుభవించవలసిందే, కాని తరచు బుద్ధికి అందే అంచనాలతో లేక అర్హతల ప్రామాణికతలతో మాత్రం కాదు. అదే విధంగా ప్రాణికపరమైన అదృష్ట దురదృష్టములను ఎల్లప్పుడూ సుస్పష్టంగా తెలియజేసేటటువంటి షరతులు ప్రకారం కూడా కాదు.

CWM 13:411-12

నైతిక విశిష్టతకు నిజమైన ప్రతిఫలం ఆత్మవృద్ధి

విశిష్టమైన నైతికతతో సరియైన విధంగా తన శక్తియుక్తులతో చేసే పనికి నిజమైన ప్రతిఫలం — అతను అనుకునేటట్లయితే, అతని బహుమతి, అతడు హక్కు భుక్తంగా అడగగలిగిన ఒకే ఒక బహుమతి — అతనిలోని నైతికబలం వృద్ధి అయి అతనికి ప్రతిఫలంగా తిరిగి రావడం, అతని నైతిక అస్తిత్వం మరింతగా వృద్ది పొందడం, ఋజుత్వం, న్యాయం, ప్రేమ, దయ, పరిశుద్ధత, సత్యం, బలం, ధైర్యం, అతను

తన పరిణామ అభ్యర్థనతో చేసే ఆత్మ-సమర్పణల యొక్క ఆత్మ వికసనం. దుష్టకర్మకు, నైతికంగా తప్పుడు మార్గాలకు శక్తిని వినియోగించినప్పుడు దక్కే నిజమైన ప్రతిఫలం — అతను అనుకునేటట్లయితే, అతని శిక్ష, అతనికి అవసరముంటే లేదా భయపడే దేమన్నా వుంటే, ఒకే ఒక జుల్మానా — వృద్ధి మందగించడం, అతని పెరుగుదల భ్రష్టత, కీర్తి తగ్గటం, కళంకం, ఆత్మకూ, తాను శ్రమిస్తున్న పవిత్ర, దృఢత్వ ప్రకాశవంతమైన అస్తిత్వమునకూ నైచ్యత. తన చేతలవల్ల అతను అంతరంగ ఆనందమును పొందవచ్చు, ఋజుమార్గమున అతడు ఆత్మలో నిశ్చలత్వమును, ప్రశాంతతను, సంతృప్తిని సుసంపన్నం కావించవచ్చు లేదా అంతరంగంలో దుస్స హనము, కష్టము, కలత, అసౌకర్యం, దాని పతనము లేక వైఫల్యం వలన వైక్లవ్యతను పొందవచ్చు, కాని అతడు భగవంతుడి నుంచి లేదా నైతిక ధర్మాల నుంచి దేనినీ హక్కుగా కోరలేడు. నైతిక ఆత్మ — కపటమైనది కాక నిజమైనది — జీవితంలో బాధలను, కష్టాలను, ఇబ్బందులను, అతి తీవ్రమైన భయాలను, దాని పాపాలకు శిక్షగా కాకుండా, ఒక సదవకాశంగా, ఒక పరీక్షాసమయంగా, దాని అభివృద్ధికి అనుకూల్యమైనదిగా, దాని శరీరదారుఢ్యానికి లేదా దాని సహజ బలశక్తికి పరీక్షా సమయంగా, అదృష్టమూ, బాహ్యావిషయాలన్నీ నైతిక వైశిష్టతకు బహుమతి నొందా లన్న పేరాశతో కాకుండా, ఒక సదవకాశంగా మరియు ఇంకా ఎక్కువ పరీక్షా సమయంగా అని కూడా అంగీకరిస్తుంది.

CWSA 13:418-19

మహాప్రకృతి ఉద్దేశం, ఆమె చేసే పనుల ఆధ్యాత్మిక న్యాయబద్ధత చిట్టచివరకు ఆమె శక్తులు ఎరుకతో ఆత్మను సత్యము, జ్ఞానముల దారులలో ముందుకు పోయే విధంగా మలుపు తిప్పటంలో గోచరమవుతుంది.... ప్రతి దశలోను అస్తిత్వలక్ష్యము, చైతన్యం అభివృద్ధుల ప్రకారం ప్రతిఫలాలను అందిస్తూ ఉంటుంది. మొట్టమొదట నైపుణ్యము, పనికి తగ్గ మేధస్సును ప్రతిఫలంగా అందిస్తుంది. మనలోని నైతిక మనస్సు అనుకునే విధంగా, ఇవ్వతగ్గవారికీ, ముఖ్యంగా సరియైన నైతికతను కలిగినవారికి మాత్రమే కాకుండా, ఇతరులకు జీవితంలో ఆమె బహుమతులు ఎందుకు అందించదనే విషయం, ఆమె అవసరాలు సంతృప్తికరంగా తెలియజేస్తాయి; కౌశల్యం, దారుఢ్యం కలిగినవారికి ఇచ్ఛాబుద్ధినీ, శక్తినీ, మేధస్సునూ ఇస్తుంది — తరువాత, ఎక్కువెక్కువగా సుస్పష్టంగా ఆసక్తి లేక బంధనాల నుంచి వేరుపడినవారికి

దురభిమానాల నుంచి విముక్తినీ, మానసిక సంతృప్తినీ, ఆత్మకు తన శక్తిసామర్థ్యాల ఎరుకతో కూడిన వినియోగమునూ, వివేకవంతమైన మార్గదర్శనమునూ ఇస్తుంది. అంతిమంగా, అన్నింటికీ కట్టకడన, ఒక పరమోత్కృష్ట ప్రతిఫలం, ప్రకాశమానమైన ఆత్మవృద్ధినీ, పరిపూర్ణ జ్ఞానం యొక్క సంతృప్తినీ, అత్యున్నత చైతన్యంలో దాని వికసనమునూ, తనదైనటువంటి స్వాభావికంగా తప్పక జరగవలసినదానినీ పవిత్రంగా ఈడేరుస్తుంది. అటువంటి ఆ వృద్ధి దివ్యజన్మ లేక ఆధ్యాత్మికంగా తనను తాను అధిగమించేటటువంటి దాని పరమోత్కృష్ట పురస్కారం ఏదైతే ఉందో అది ప్రాక్ మనస్సుకు ఎల్లప్పుడూ ఉత్తమోత్తమమైన లాభదాయినిగానే ఉంటున్నది — మానవ అజ్ఞానం నుంచి దివ్యమగు ఆత్మ-జ్ఞానంలోకి వృద్ధి పొందటం.

CWSA 13:436

శ్రీఅరవిందులు

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

14 ఆగస్టు 1971

సత్యం అనృతం కంటె అధిక బలమైనది. ప్రపంచమును పరిపాలించే ఒక శాశ్వతమైన ఆధిపత్యశక్తి ఉంది. దాని నిర్ణయాలే ఎల్లప్పుడూ ప్రాబల్యం వహిస్తాయి. దానితో కలిసిపో, అంతిమ విజయం నీకు తథ్యం.

*

ఎప్పుడైతే మనుషులకు వారు జీవించే అనృతం మీద ఏవగింపు కలుగుతుందో, అప్పుడు ప్రపంచం మహాసత్య సార్వభౌమత్వానికి సంసిద్ధమౌతుంది.

CWM 14:195

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఒక్క గెంతుతో సామరస్యాన్ని సాధించు

"ప్రొద్దుటి నుంచి ఒకటే సమ్మెలు, తగాదాలు. అంతా అస్తవ్యస్తం. గందరగోళం సృష్టించినవారే దాన్ని చక్కదిద్దాలనే ఆవేదన. ఇంతే, ఇట్లా జరగాల్సిందే. మంచి పేరు, నీతిసూత్రాలు ఇక చాలవు. అయినా అవి ఎప్పుడో కుప్పకూలాయిగా? వీటికి అతీతంగా వుండే దైవసంకల్పం, దాని వలన లభించే సామరస్యం మాత్రమే ఇందుకు దోహదపడుతుంది. మనం కోరుకునేది కూడా అదే. మామూలు సాంఘిక ధర్మాలు, కట్టుబాట్లను ప్రతిఘటించగలిగినవారే ఉన్నత చైతన్యం లేక 'సత్యచేతన' లోనికి ప్రవేశించగలుగుతారు. ఇది ఒక్కసారిగా సాహసంతో ముందుకు దూకటం లాంటిది.

పరిస్థితిని చక్కదిద్ది ఒక క్రమపద్ధతిని పునః ప్రతిష్ఠించాలనే వారంతా ఇంకా పాత విధానాలనే పట్టుకొని వెనకబడుతూనే వున్నారు; దేన్నీ సాధించ లేకపోతున్నారు. గతం గతః. మనం మాత్రం ముందుకు సాగిపోదాము. లేస్తేనే గదా పని ప్రారంభం అయ్యేది!

CWM 11:253-54

'అతి' ఎటు వైపు వున్నా అది హింస లాంటిదే. శాంతి, సామరస్యం, సమతౌల్యం ఉన్నప్పుడే సత్యం బయటపడేది; మనుగడ సాధించేది.

CWM 10:320

మనిషి సత్యంలో జీవనం గడిపినపుడే, వైరుధ్యాలన్నీ అధిగమించగలడు.

CWM 12:114

సత్యతత్పరత సామరస్యం పైన మాత్రమే ఆధారపడుతుంది

ఈ అవకాశాన్ని పురస్కరించుకొని మీకు ఒకటి చెప్పాలనుకుంటున్నాను నమ్మకంగా. ఆధ్యాత్మిక పురోగతి గాని, సత్య తత్పరతగాని సామరస్యం మీదనే ఆధారపడి వుంటాయి గాని విభేదాలు, విమర్శల పైన మాత్రం కాదు.

*

సంకుచితంగా వుంటే పురోగమించటం వీలుపడదు; పరిధిని విస్తృతం చేసుకున్నపుడే అది సాధ్యం.

వివిధ దృక్పథాలను ఏకోన్ముఖం చేయాలి. ఒకదానికి ప్రాముఖ్యత నిచ్చి మరొకదానిని విస్మరించ కూడదు. ప్రతిదానిని దాని నిజ దృక్కోణంలో నిలపాలి.

CWM 12:184

వ్యతిరేక భావాలకు, ఘర్షణలకు అతీతంగా వుండేదే సత్యం

సత్యతత్పరత ఏకపక్షంగా వ్యవహరించదు. ఘర్షణలకూ, వ్యతిరేక భావాలకూ అది అతీతంగా వుంటుంది. నిజానికి పురోగతిని సాధించాలనే ఒకే ఒక లక్ష్యం ఉన్నపుడే దేశాలన్నీ ఒకటి కాగలవు.

CWM 12:381

కొందరికి అనుకూలంగాను, కొందిరికి వ్యతిరేకంగాను వున్నంతకాలం మనం సత్యం యొక్క పరిధిలో లేనట్లే. హృదయంగమమైన విలువలను, ప్రేమను అందరికి నిల కడగా సమభావంతో అందించాలి గదా!

CWM 13:191

అసలు దైవకృప ఒక జాతికి వ్యతిరేకంగా పనిచేస్తుందని ఎందుకు విశ్వసిస్తున్నావు? కాదు, అది కేవలం సత్యం దిశగానే పనిచేస్తుంది. ఈనాటి పరిస్థితుల్లో సత్యాసత్యాలు అంతటా వున్నాయి. ఒక చోట వున్నవని, వేరొక చోట లేవనీ చెప్పలేము. ఒక విధంగా సత్యాసత్యాలను నిర్ణయించేది మన మనసేగా? అందువలన అవి అన్నిచోట్ల వున్నట్లేగా?

సత్యం విబేధాలకూ, సంఘర్షణలకూ అతీతంగా వుంటుంది.

CWM 13:381

మానవ జీవితం శుభాశుభ మిశ్రమం

జీవితంలో అంతా మిశ్రమమే. ఏదీ పూర్తిగా ఇది మంచిదని కాని, అది చెడ్డదని కాని చెప్పలేము. నేను వేటినీ సమర్థించలేను. శ్రీఅరవిందుల కార్యక్రమానికే నేను ప్రాధాన్యత ఇస్తాను. నా చేతన సహజంగానే అలాంటి కార్యక్రమాలకు దోహదపడే వాటినే సమర్థిస్తుంది. ఇందులో ఎవరు నన్ను సమర్థించినా స్వీకరిస్తాను. ఒకరిని

అక్కున చేర్చుకొని వేరొకరిని తిరస్కరించడం నావల్ల కాని పని. అందువల్లే వర్గపోరా టాలకు నేను అతీతంగా వుంటాను. నేను కేవలం దివ్యత్వం దిశగా పయనిస్తాను. దాని జయకేతనం రెపరెపలాడుతూ ఈ లోకంలో సమున్నతంగా ఉండాలనేదే నా ఆకాంక్ష. అది వర్గాలకు, శాఖలకూ అతీతమైనది.

CWM 13:51

సత్యం ఒక పక్షానికి చెందదు

నేను ఎవరినీ తప్పు పట్టటం లేదు; నేను ఎటూ చెందను. నా దృక్పథం ఇత రుల కంటె భిన్నంగా వుంటుంది. అది నా అంతరాత్మకు మాత్రమే తెలుసు. మాన వునితో సహా ప్రపంచంలో జీవజాలమంతా కొన్ని స్పందనలకు లోనై యుంటుంది. అందులో సింహభాగం అనృతం, అజ్ఞానం అస్తవ్యస్త విధానాలూ వుంటాయి కూడా. వీటిని ఛేదించుకుంటూ సమున్నత స్థరాల నుండి వస్తున్న సత్య, సామరస్య స్పందనలు ఇందులో ప్రవేశిస్తాయి.

ఈ దృష్టితో చూస్తే అహంకార మమకారాలు గాని, వేర్పాటుదోరణులుగాని తమ ఉనికిని కోల్పోయి కేవలం భ్రమలుగా మిగిలిపోతాయి. ఇప్పుడు మనం చూస్తున్న అస్తవ్యస్త పరిస్థితికి గందరగోళం కూడా తోడయితే మళ్ళీ సమతౌల్యం, సామరస్యం పునరుద్ధరించటానికి నేను కొన్ని ప్రత్యేక స్పందనలను ప్రవేశపెట్టాల్సి వుంటుంది. వీటి భారం వ్యక్తుల పైన మాత్రం పడదు. వారి 'విరసం' మాత్రమే అది ఛేదించాల్సిన లక్ష్యం.

నీ విషయానికి వస్తే, నీవు సహజంగానే సత్యం వైపు మొగ్గుతావని, మరేదీ సమర్థించవనిన్నీ అనిపిస్తుంది. అసలు అసత్యాన్ని, గందరగోళాన్ని ఎవరు సమర్థించినా అది అభిలషనీయం కాదు గదా?

CWM 17:238

ప్రశ్న: సత్యం ఏ పక్షాన ఉన్నా దైవకృప అందుకు సహకరిస్తుందా?

సమా: అవును

ప్రశ్న: రెండు వైపులా అసత్యమే ఉంటే దైవకృప దూరంగా వుండిపోతుందా?

సమా: కాదు: దాని పని అది చేసుకుంటూ ముందుకు పోతూనే వుంటుంది.

ప్రశ్న: అసలు ఈనాటి సంఘర్షణలు రెండవ ప్రపంచ యుద్ధకాలం లాంటివా?

ఆనాడు, నిజానికి, ఆ కృప ఏకపక్షంగానే సహకరించింది గదా — కనీసం స్థూలంగానైనా?

సమా: ఇందులో రెండు విభిన్న అంశాలు ఉన్నాయి గదా? 'దైవకృప', దాని ఫలితమైన 'విజయోత్సాహం'. ఈ రెండూ ఒకే స్థాయికి చెందినవి కావు కదా?

సత్యం క్రమంగా విజయపథంలో ముందుకు పోతుంటే మనం ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. వీటి సమగ్ర స్వరూపాన్ని దేశకాల పరిస్థితులే అర్థం చేసుకోగలవు.

CWM 13:381

చెప్పుడు మాటల నుండి దూరంగా వుండండి

ఇతరులు ఏం చేస్తున్నారని గాని, ఏం చెయ్యటం లేదని గాని చెప్పుకోవటం మంచిది కాదు. అట్లాంటి మాటలు వినటం కూడా దోషమే.

అవి పట్టించుకోవటమే శుద్ధ తప్పు.

ఖండించటమూ తప్పు క్రింద లెక్కే.

ఇదంతా శుష్కదండగ; మన చేతనను కించపరుస్తుంది. ఇట్లాంటి తప్పుడు అలవాట్లను మన వాతావరణం నుండి సమూలంగా తృంచివేస్తేనే తప్ప మన ఆశ్రమం దివ్యత్వాన్ని చేరుకోలేదు.

CWM 14:207

అనవసరంగా మాట్లాడిన ప్రతి మాట చెప్పుడు మాటల క్రింద లెక్కే

దురుద్దేశంతో కూడిన ప్రతి మాట, ప్రతి అపనింద వాక్యం చేతనను అధోగతి పాలు చేస్తాయి. ఇక మనం నీచమైన భాషను గాని, పదజాలాన్ని వాడామా అది ఆత్మహత్యా సదృశమే.

*

అజ్ఞానంలో పడి ఇతరులను గురించి చెడ్డగా మాట్లాడితే చేతనకే చెరుపు; అధోగతిలో పడ్డట్టే!

*

సత్యనిష్ఠ కోరుకునేవారు బాహ్యసంబంధాల గురించి పట్టించుకో గూడదు.

*

ఒకరికి అనుకూలంగా, వేరొకరికి వ్యతిరేకంగా ఉండటం సత్యం పరిధికి దూరంగా వున్నట్లే.

*

ఇతరులను ఎత్తి చూపటం, దూషించటం లాంటి అరాచకపు పనులు చేతలలోను, వ్రాతలలోను రానీయవద్దు; వాటిని విడిచిపెట్టండి. సత్యం నిజంగా జయించాలంటే, నూతన భావాలతో సమరం సాగించాలి; వ్యక్తిత్వాల కోసం కాదు.

CWM 15:205, 232, 268, 56

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

అసత్యానికి ఇదొకటే విరుగుడు

"మన చేతనలో భగవంతుని ఉనికికి గల పరస్పర విరుద్ధ భావాలను వదలించుకోవాలి."

అవును, అది నేను నొక్కి వక్కాణిస్తాను. అదే సత్యం. అసలైన సత్యం. ఎవరికి అర్థం అయినా కాకపోయినా అదే నిగూఢ సత్యం.

మనలోని దివ్యత్వం ఆవిష్కరింపబడటానికి గాని, మరుగు పరచటానికి గాని అడ్డువచ్చేవి ఏదైనా అవన్నీ అసత్యాల క్రింద లెక్కే!"

CWM 11:331

శ్రీమాత

అనువాదం కె. ఆర్. యల్. నరసింహారావు

సత్యాన్నే ఆశ్రయించు

సత్యానికి, అసత్యానికి మధ్య తేడా నెలా గుర్తించాలి

సత్యం యొక్క ప్రకాశం ఎల్లప్పుడు ప్రజ్వలిస్తూ, అది మనలోని చీకటి శక్తులను అణచి, నిరంతరం సత్యం యొక్క ప్రభావాన్ని ప్రసరింపజేయాలంటే, మనలోని ప్రేరణల ప్రారంభ కదలికలను, చర్యలను పరిశీలించి, అవి సత్యం నించి వచ్చాయో, అసత్యం నించి వచ్చాయో బాగా వివేచన చేసి తెలుసుకో. అసత్యం నించి వచ్చిన వాటిని తిరస్కరించి, సత్యం నించి వచ్చిన వాటిని ఆచరించాలి.

ఈ విచక్షణా జ్ఞానమే ఈ పృథ్వి వాతావరణంలో సత్యప్రకాశ అవతరణ ఫలితాలలో ప్రథమం.

నిజానికి సత్యం నించి వచ్చే ప్రేరణలు, అసత్యం నించివచ్చే ప్రేరణలకి మధ్య తేడా గుర్తించడం చాలా కష్టసాధ్యమైనదే – సత్యప్రకాశం ప్రసాదించిన ఈ ప్రత్యేకమైన బహుమానాన్ని గ్రహించితే తప్ప. ఆ విచక్షణా జ్ఞానం అందదు.

ఏమైనా, మనకు సహాయకారిగా ఉండడానికి మనం ప్రారంభంలో ఒక నిబంధనను ఆసరాగా తీసుకుని, ఏది శాంతి, విశ్వాసం, ఆనందం, సమత, విస్తృతి, ఐక్యత మరియు ఆరోహణాత్మక ఎదుగుదలకు తోడ్పడుతుందో దానిని సత్యం నుండి వచ్చింది గాను, ఏది అస్థిరతని, సందేహాన్ని, సంశయాన్ని దుఃఖం, వైషమ్యం, స్వార్థం, ఇరుకుతనం, తమస్సు, నిరుత్సాహం నిస్పృహ కలిగిస్తాయో అవన్నీ సూటిగా అసత్యం నించి వచ్చినవిగా తెలుసుకోవాలి.

CWM 12:302

సామరస్య లోపం, గందరగోళం, సత్యాన్ని ఎదుర్కొనేశక్తి లేనందువల్ల ఉత్పన్నమౌతాయి

ప్ర: ప్రస్తుతం ఆశ్రమంలో సహకారము, సయోధ్య ఆవశ్యకమని తెలుసు, కాని ఎంత ప్రయత్నించినా నేను విఫలమౌతున్నాను.

సమా : సత్యం యొక్క క్రియాచరణను అసత్యం అడ్డుకోవడం వలన ఈ ప్రపంచం అంతటా అసమగ్రత, అస్తవ్యస్తత వ్యాపించాయి. ఇక్కడ ఆశ్రమంలో సత్యం యొక్క

కార్యాచరణ మరింత ఎరుకతో, ఏకాగ్రతతో ఆచరించబడటం వలన, దాన్ని ప్రతి కూలించే శక్తులు కూడా అధికంగా ఉంటాయి.

ఇట్టి అల్లకల్లోల పరిస్థితిలో చాలా మంది వ్యక్తులు ఈ సంఘర్షణాత్మక శక్తుల చేత తోలుబొమ్మల్లా నడపబడతారు.

CWM 13:57

నీవు చెప్పినట్లుగా ఆశ్రమంలో పరిస్థితులు బాగా లేవు. బహుశా మరింత చెడుగానే ఉండొచ్చు. నేను శ్రీఅరవిందులు చెప్పినట్టే చెప్తాను: చైతన్య పరివర్తన జరగనంత వరకు నిజానికి ఏ మార్పు సాధ్యం కాదు.

నీవు కలగచేసుకుంటే మంచిదే! ఉదాహరణగా ఉండే ఆచరణగా మంచిదే. — కాని అది ఆ మరుసటి రోజుకే మరింత చెడుగా పరిణమిస్తుంది.

కనీసం మనం సత్యాన్ని అభివ్యక్తి కమ్మని పిలవలేము., ఎందుకంటే అసత్యం ఎంత తీవ్రంగా, విస్తృతంగా వ్యాపించిందంటే, దాని ఫలితం మొత్తం నాశనమవటానికి దారితీస్తుంది. అయినా దైవకృప అనంతం, అపారం, అది ఒకదారి చూపవచ్చు.

CWM 13:157


ఒకే ఒక్క రక్షణ ఉంది

ఆ దివ్యచైతన్యానికి క్షణమాత్రం మానవుల కున్నటువంటి చేతన లాంటింది వున్నట్లయితే ఈ ప్రపంచం అంతరించి ఉండేదని నా కర్థమైంది... మనకు చెడుగా కన్పించే విషయాల పట్ల మన సహజ సత్వర ప్రతిక్రియలు ఎలాగుంటాయంటే అసత్యమైన విషయాన్ని నాశనం చేయాలన్న ప్రతిచర్యలుగా వుంటాయి. అవన్నీ సత్వర ప్రతిచర్యలు — పరివర్తన చెందించాలని కాదు, నాశనం చేయాలని — నీ కర్థమైందా, ఆ రెండింటి మధ్య చాలా అంతరం ఉంది.

అవును.

అది అతి సహజం, అంటే అసత్యాన్ని వెంటనే నిర్మూలించాలన్న యోచన — అయితే అదే కదలిక ఆ పరాత్పరుని చైతన్యంలో ఒక్క క్షణం కలిగినా, ఈ ప్రపంచం అంతరించిపోయేది!

నీకు తెలుసా, వంచన, వంచనాత్మక చర్యలు ప్రతి చోట మంచి సంకల్పాలుగానే చూపబడుతున్నాయి. ఎవరైతే మరొకరిని వంచన చేయడాని కిష్టపడరు, కాని



మనం అసత్యాన్ని దైవానికి సమర్పిద్దాం, అప్పుడు అతడు దానిని ఆనం దమయసత్యంగా పరివర్తన చేయగలడు.

CWM 14:196

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

వారిని వారు వంచించుకుంటారో వాళ్ళు చాలా ప్రత్యేకమైన వ్యక్తులు. ఇవన్నీ నేను కనుక్కున్నవి కావు, నేను స్వయంగా దర్శించిన విషయాలు, అయితే అవి అరుదుగా, చాలా ప్రత్యేక స్థితుల్లో, కొన్ని సందర్భాల్లో కన్పిస్తాయి — కాని నాకు ఈ మొత్తం ప్రపంచం యొక్క, మానవ ప్రయత్నం యొక్క, మనుషుల యొక్క అన్నింటి సమిష్టికృషియొక్క అవగాహన, దర్శనం వుంది.... మనం వంచనలో జీవిస్తున్నాం.... అది భయంకరం!... మరింత బాధ కల్గించే విషయం మనిషి ఎదుటివారిని మోసంచేసేదాని కన్నా, తనను తానే ఎక్కువగా మోసం చేసుకుంటాడు.

(మౌనం)

దీని అర్థం, మనం దేన్నీ ఉన్నది ఉన్నట్టుగా చూడం.

(సుదీర్ఘ మౌనం)

ఒకే ఒక్క రక్షణ ఉంది: అది దైవాన్ని ఆశ్రయించి ఉండడం.

(పిడికిళ్ళు బిగించిన సూచన)

అంటే మనం దైవమని యోచిస్తున్నదాన్ని పట్టుకోడం కాదు, ఏది దైవమని భావిస్తున్నామో అది కూడా కాదు,... ఉండవలసినది ఒక ఆకాంక్ష... సాధ్యమైనంత నిజాయితీతో కూడిన ఆకాంక్ష, దానిని ఆశ్రయించి ఉండాలి.

CWM 11:261- 63

మనలను రక్షించేది ఒక్క సత్యం మాత్రమే

అంతరించే ముందు అసత్యం విపరీతంగా విజృంభిస్తుంది.

ఇప్పటికీ, మనుషులు విషాద సంఘటనల ద్వారానే పాఠం నేర్చుకుంటారు. వాళ్ళు సత్యానికి కళ్ళు తెరవడానికి ముందు ఆ వినాశనం జరగాలా?

అలా జరగకుండా ఉండేలా మిమ్మల్నందరిని కృషి చేయమని అడుగుతున్నాను.

ఒక్క సత్యమే మనలను రక్షించగలదు. వాక్కులో సత్యం, కర్మలో సత్యం, సంకల్పంలో సత్యం, సంవేదనలో సత్యం. సత్యాన్ని ఆచరించడమా, లేక నాశనం చెందడమా అన్న రెండింటికి మధ్య మనం ఎన్నుకోవాలి.

CWM 13:217

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి



అఖిల

అఖిల భారత పత్రిక – జూన్ 2015

విషయసూచిక

దైవానికి కృతజ్ఞత వ్యక్తపరచే ఉత్తమ విధానం, కేవలం ఆనందంగా ఉండడం.

*

దైవానికి మన కృతజ్ఞతా భావన చూపడానికి చక్కటి మార్గం ప్రశాంతతో కూడిన ఆనందంతో ఉండడమే తప్ప మరో మార్గం లేదు

CWM 14:154-55

శ్రీమాత

అనువాదం: డి సత్యవాణి

కృతజ్ఞత ఒక అరుదైన విశిష్ట గుణం

(కల్పిత కథ — పిల్లలకు, పెద్దలకు)

విశిష్ట గుణాలు

ఒకానొకప్పుడు దివ్యమైనటువంటి గొప్ప భవనం ఒకటి ఉండేది. దాని మధ్య భాగంలో ఒక రహస్యమైన పవిత్ర స్థలం ఉంది. ఆ భవనం గడపను దాటి ఏ జీవి ఎన్నడూ పోలేదు. అంతేకాక, ఆ మందిరం వెలుపలి వసారాలు సైతం మర్త్యులు చాలా మట్టుకు చేరలేనివి, ఎందువల్లనంటే, ఆ భవనం చాలా ఉన్నతమైన మేఘం మీద ప్రతిష్ఠితమై ఉన్నది, కాని కొద్దిమంది మాత్రమే, ఏ వయస్సులో వారైనా దానికి దారి కనుగొనగలరు.

అది దివ్యసత్య భవనం.

ఒక రోజు అక్కడ ఒక ఉత్సవం జరిగింది, మనుషులకు కాదు కాని, చాలా భిన్న మైన అస్తిత్వాలకు, పెద్ద, చిన్న దేవుళ్ళకు, దేవతలకు. వారంతా భూమి మీద విశిష్ట గుణాలుగా కీర్తించబడుతున్నవారు.

ఆ భవనం నడుమ నున్న ప్రదేశంలో, ఒక పెద్ద విశాలమైన చావడి వుంది. అక్కడి గోడలు, నేల, లోపలి పైకప్పు అన్నీ తమకు తాము స్వయంప్రకాశమై, అసంఖ్యాకంగా తళతళలాడుతూ జిగేలుమనే ఎర్రని కాంతులతో దేదీప్యమానమై ఉన్నాయి.

అది దివ్యమేథోచావడి. అక్కడి కాంతి ఎంతో సహజంగా మిరుమిట్లు గొలప కుండా, నేలకు ఆనుతూ, చాలా అందంగా ముదురు నీలవర్ణంలో ఉంది, కాని అది పైపైకి లోపలి పైకప్పు వరకు వెళ్ళే కొలదీ క్రమంగా తేటదనం సంతరించుకుని మెరుస్తున్నది. పొదగబడిన వజ్రాలు చాందినీల వలె వేలాడదీయబడి గిరగిరా తిరుగుతూ ఉన్నవి. వేల సంఖ్యలోని వాటి ముఖాల నుంచి మిరుమిట్లు గొలిపే కాంతికిరణాలు వాడిగా అంతటా పరచుకుంటున్నాయి.

విశిష్టగుణాలు వేటికవే వచ్చి చేరుతున్నాయి, కాని అవి అలతి సమయంలోనే అన్యోన్యం అనుకూలమైన గుంపులుగా ఏర్పడ్డాయి. కనీసం ఒక్కసారైనా అందరం ఒక చోట కలిసి ఉన్నామనే సంపూర్ణానందంతో నిండి ఉన్నాయి, ఎందువల్లనంటే, అవి సర్వసాధారణంగా చాలా విస్తృతంగా, చెల్లాచెదరుగా ప్రపంచంలో, లోకాలలో

అంతటా, ఎన్నో పరాయి అస్తిత్వాల మధ్య వేరుగా ఒంటరిగా ఉంటూ ఉంటాయి.

చిత్తశుద్ధి ఆ ఉత్సవానికి ఆధిపత్యం వహించింది. ఆమె లేతరంగులతో నీటివలె నిర్మలమైన వస్త్రాన్నీ, తన చేతిలో చతురస్రాకారంతో నాలుగు భుజాలు కలిగిన ఒక శుద్ధ స్ఫటికమునూ ధరించి ఉంది. దాని ద్వారా విషయాలను చాలా స్పష్టంగా, అవి సర్వసాధారణంగా కనపడే వాటి కంటే చాలా భిన్నంగా, వాటి వాస్తవికతలో చూడవచ్చు, ఎందువల్లనంటే, అక్కడ వాటి రూపం ఎటువంటి కృతకమూ లేకుండా ప్రతిబింబిస్తుంది.

ఆమెకు దగ్గరగా విశ్వసనీయమైన సంరక్షకులవలె ఇద్దరు నిలుచుని ఉన్నారు. ఒకరు వినయం, అతడు ఒక్కసారిగా నమ్రతను, అతిశయమును కలిగిన వినమ్రుడు గాను, మరియొకరు ధైర్యం, ఉన్నతమైన నుదురుతో, స్పష్టమైన కనులతో, దృఢమైన పెదవులతో, దరహాసంతో, ప్రశాంతతతో, దృఢసంకల్పచిత్తుడై కనపడుతున్నారు.

ధైర్యానికి పక్కన అతి సమీపంలో, తన చేతిని అతని చేతిలో ఉంచినదై ఒక స్త్రీమూర్తి నిలుచుని ఉన్నది. ఆమె పూర్తిగా ముసుగులో ఉండటం వలన, ఆ ముసుగులో నుంచి మెరుస్తూ అన్వేషిస్తున్న ఆమె కళ్ళు మాత్రమే కనపడుతున్నాయి. ఆమె వివేకం.

వారందరిలో దాతృత్వం, ఒకరి తర్వాత మరియొకరిని కలుస్తూ, ఎల్లప్పుడూ ప్రతివారికి వారి దగ్గరనే ఉంటున్నదనే అనుభూతిని కలిగిస్తూ, ఒకే మారు జాగరూకతనూ, ప్రశాంతతనూ కలిగినదై చురుకుగా వున్నా విచక్షణాయుతంగా తాను ఆ గుంపుల గుండా తిరుగుతున్నప్పుడు తన వెనుక ఒక ప్రకాశవంతమై మిరుమిట్లు లేని హాయిని గొలిపే కాంతిని వదలి వెళ్ళుతున్నది. ఆమె వెదజల్లే కాంతి, ఆమెకు ప్రియస్నేహితురాలు, విడదీయరాని తన సహచరిణి, కవల సోదరి అయిన ధర్మం యొక్క అతి సూక్ష్మ మైనటువంటి, కంటికి కనపడని ఒక తేజస్సు ద్వారా ఆమెను చేరుతున్నది.

దాతృత్వం చుట్టూ పరివేష్టించిన దేవతా సమూహంలో వెలుగు లీనుతూ రక్షణ కోసం వెంట ఉండేవారిలో దయ, ఓరిమి, కోమలత్వం, ఉత్సుకత మొదలైనవారు చాలామందే ఉన్నారు.

అందరూ అక్కడ ఉన్నారు లేక అలా అని వారు అనుకుంటున్నారు, కాని,

అప్పుడు అకస్మాత్తుగా, ఆ బంగారు వాకిలి ముందు, ఒక ఆగంతకురాలు దృశ్య మానమయింది.

ద్వారం ముందు కావలికై నియమింపబడిన కాపలాదారులు, ఎంతో అసమ్మతితో, ఆమె ప్రవేశానికి అనుమతించారు. ఇంతకు ముందెన్నడూ వారు ఆమెను చూడలేదు, ఆమె వేషభూషణాలలో వారిని ప్రభావితం చేసేది ఏమీ లేదు.

వాస్తవానికి ఆమె చాలా యుక్తవయస్సులో ఉన్నది, చిన్నది; ఆమె ధరించిన ధవళ వస్త్రాలు అత్యంత సామాన్యమై, చాలా మట్టుకు హీనంగా ఉన్నాయి. సిగ్గుతో, కలవరపాటుతో కూడిన తొట్రుపాటుతో ఆమె కొన్ని అడుగులు ముందుకు వేసింది.

అప్పుడు, అంత పెద్ద ప్రజ్ఞాశాలులైన బృందంలో అభ్యంతరకరంగా ఉన్నానను కొనే కలవరపాటుతో, కొంత తడబాటుతో, ఎవరి వైపుకు వెళ్ళాలో తెలియని అవస్థలో ఆమె ఉంది.

తన సహచరులతో స్వల్ప పరామర్శల తరువాత వివేకం, వారి అభ్యర్థన మేరకు ముందుకు అడుగులు వేసి, ఆ అపరిచిత వైపుకు తరలి వెళ్ళింది. తరువాత, మామూలుగా కలవరపాటుకు లోనైనవారు చేసే విధంగా, తన గొంతు సవరించుకుని, ప్రతిసమాధానం చెప్పడానికి ఆమెను ఉద్యుక్తురాలను చేస్తూ, ఆమె వైపు తిరిగి మాట్లాడసాగింది,

"ఇక్కడ గుమిగూడిన మేమందరము ఒకరికొకరం మా పేర్లు, గుణగణాలతో పరిచయస్థులం. నీవు రావడం చూసి ఆశ్చర్యచకితుల మవుతున్నాం, ఎందుకనగా మాకు నీవు అపరిచితవు, కనీసం మేము నిన్ను ఇంతకు మునుపు చూసినట్లుగానూ లేదు. నీవు దయ వుంచి నీ వెవరో మాకు చెప్పగలవా?"

ఆ వచ్చిన ఆగంతకురాలు నిట్టూర్చి, సమాధానమిచ్చింది, "ఆహా, అంతే కదా! ఈ గొప్ప భవనంలో నేను అపరిచితగా కనపడటంలో నేనేమీ అంతగా ఆశ్చ ర్యపడటం లేదు, ఎందువల్లనంటే, ఎక్కడైనా నన్ను చాలా అరుదుగా ఆహ్వాని స్తుంటారు.

నా పేరు కృతజ్ఞత."

CWM 2:5-7

స్వార్థరహితమై, ఏ ప్రయోజనాన్ని ఆశించని ఆత్మగమనం

జంతువులకు పూర్తిగా ప్రాథమిక మనస్తత్వం ఉంటుంది. మానవ అస్తిత్వాలవలె అవి పునరుక్తమయ్యేటటువంటి ఎడతెగని అనేక ఆలోచనలతో పీడించబడుతూ ఉండవు. ఉదాహరణకు, వాటికి దయ చూపించినప్పుడు వాటికి ఏ ప్రేరణా లేకుండా అప్రయత్నంగా వెనువెంటనే కృతజ్ఞతా భావం కలుగుతుంది, కాని మనుషులలో, నూటికి తొంభైయెనిమిది మంది, తర్కించడం మొదలుపెట్టి, మంచిగా ఉండటం వలన ఉపయోగం ఏముంటుందని తమను తాను ప్రశ్నించుకుంటారు. మానసిక కార్యకలాపం వలన చేకూరే గొప్ప అనర్థాలలో ఇది ఒకటి. జంతువులు వాటి నుంచి విముక్తమై ఉంటాయి, నీవు వాటి యందు దయను చూపించితే అవి నీకు ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా ఉంటాయి, ఏ ప్రేరణా లేకుండా అప్రయత్నంగా. అంతేకాక వాటికి దృఢవిశ్వాసం ఉంది. కనుకనే వాటి ప్రేమ అటువంటిది, అది దృఢమైన బంధంగా రూపుదిద్దుకుని, నీకు దగ్గరగా ఉండాలనే ప్రబలమైన ఆవశ్యకతగా మారిపోతుంది.

అంతేకాక మరి ఏదో ఉంది. యజమాని నిజంగానే మంచివాడైతే, జంతువు విశ్వాసం గలది అయితే, చైత్యం, ప్రాణిక శక్తుల మధ్య మార్పిడి ఉంటుంది. ఆ మార్పిడి జంతువుకు తీవ్రమైన ఆనందాన్ని ఎంతగానో ఇస్తూ, అద్భుతంగా ఉంటుంది. అవి ఆ విధంగా నీకు చాలా దగ్గరగా ఉన్నప్పుడు, నీవు వాటిని పట్టుకున్నప్పుడు, ఆ ఆనందానుభూతి వాటి అంతరంగంలో సంతోషంగా ప్రతిస్పందిస్తుంది. ఒక వ్యక్తి వాటికి ఒసగే శక్తిని — బలమైన ఆప్యాయత,. వాత్సల్యం, రక్షణలు, ఇంకా అటువంటి వాటన్నింటి వలన — అవి అనుభూతి పొందుతాయి, అవి వాటిలో గాఢమైన బంధాన్ని సృష్టిస్తాయి. కొన్ని ఉన్నత జంతువులలో కుక్కలు, ఏనుగులు, గుర్రాలలో సైతం అది ఇంకా చాలా తేలికగా, పూర్తిగా సుస్పష్టంగా ఆవశ్యకమైన ఆరాధనను జనింపజేస్తుంది (వాస్తవానికి మానసిక తర్కాలు, వాదనలు ఎన్నైనప్పటికీ దానికి భంగం కలిగించలేవు), అవి ఏ ప్రేరణా లేకుండా అప్రయత్నంగా వచ్చేవి, అంతస్సారంలో అవి చాలా పవిత్రమైనవి, అవి ఒక విధంగా చాలా అద్భుతమైనవి.

మనస్సు దాని ప్రాథమిక స్థాయిలో మనిషిలో పనిచేయడం మొదలుపెట్టి, దాని మొదటి అభివ్యక్తతలో చాలా చక్కగా ఉన్న ఎన్నో విషయాలను పాడు చేసింది. సహజంగానే మనిషి ఉన్నత స్థాయికి చేరడం జరిగి, తన మేధస్సును

సరిగా ఉపయోగించడం జరిగితే, అప్పుడు విషయాలు ఇంకా ఎక్కువ అధికతరమైన విలువలను సంతరించుకోగలవు. కాని, వాటి రెండింటి మధ్య ఒక దారి ఉంటుంది, అందులోకి వెళ్ళడం జరిగితే, అతడు తన మేధస్సును అత్యంత నీచ స్థితిలోకి దిగజార్చి, దానిని చాలా తక్కువగా ఉపయోగించుతూ, దానిని తన పన్నాగాలకూ, ఆధిపత్యానికీ, మోసం చెయ్యడానికీ ఉపకరణం కావిస్తాడు. ఆ విధంగా అది చాలా అసహ్యంగా తయారవుతుంది. నా జీవితంలో, ఎంతోమంది జనులకంటే, చాలా ఉన్నతమైన జంతువులను చూశాను, అటువంటి నీచమైన పన్నాగాలూ, మోసం చేసి లాభం పొందాలనే కోరికా కచ్చితంగా వాటిలో లేవు. అయినప్పటికీ వాటికి తగులుకొనేవీ కొన్ని ఉన్నాయి — మనిషి సంపర్కంలోకి వచ్చినప్పుడు అవి వాటిని తమలోకి ఆకర్షిస్తాయి — అవి లేనివీ కొన్ని ఉన్నాయి.

స్వార్థరాహిత్యంతో కూడిన గమనం కలిగినది, లాభనష్టాలు ఎంచనిది ప్రపంచంలోని చైత్య చైతన్యరూపాలలో అత్యంత రమణీయమైన వాటిలో ఒకటి. కాని, ఒక వ్యక్తి ఉన్నతోన్నతంగా మానసిక కార్యకలాపాల అంతస్తులు ఎగబాకుతున్నకొలదీ, అది చాలా అరుదుగా ఉండడం జరుగుతుంది. ఎందువల్లనంటే, మేధస్సుతో పాటు నైపుణ్యం, తెలివితేటలు, అవినీతి, లాభనష్టాల బేరీజులు అన్నీ తయారవుతాయి. ఉదాహరణకు గులాబీ వికసిస్తే అది దానంతటదే అప్రయత్నంగా విచ్చుకుంటుంది. అది ఎందువల్లనంటే అందంగా ఉండటంలోని ఆనందం పొందటానికి, మధుర సుగంధ పరిమళాలు వెదజల్లడానికి, జీవించడంలోని సంతోషాన్ని వ్యక్తపరచడానికి. అది లాభనష్టాలు బేరీజువేయదు, దానివల్ల అది ఎటువంటి లాభమూ పొందదు. అది దానిని ఎంతో అప్రయత్నంగా, ఏ ప్రేరణాలేకుండా, అస్తిత్వపు ఆనందం, నివసించడంలోని ఆనందం పొందడానికై చేస్తుంది. ఒక మానవ అస్తిత్వాన్నే తీసుకుందాం. కొంతమందిని మినహాయించి చాలామట్టుకు, అతడి మనస్సు క్రియాశీలమైన మరుక్షణం, అతడు తన అందంనుంచి, తెలివితేటలనుంచి లాభం పొందటానికి ప్రయత్నిస్తాడు. అది తనకి ఎంతో కొంత ప్రయోజనం తీసుకు రావాలని కోరుకుంటాడు. అది మనుషుల పొగడ్తలతో కాని లేక ఇంకా చాలా నీచంగా దానినుంచి లాభాలను పొందటానికి సిద్ధమవుతాడు. పర్యవసానంగా, చైత్య దృక్పథంలో మానవ అస్తిత్వాల కంటే గులాబీపువ్వు అధికంగా ఉత్తమమైనదవుతున్నది.

CWM 5, P. 240-41 అనువాదం: డా. త్రిపురాదిభట్ల ప్రసన్నకృష్ణ

కరుణ, కృతజ్ఞత మానసిక సత్తాకి చెందిన లక్షణాలు

కరుణ, కృతజ్ఞత, ఇవి ప్రధానంగా మానసిక సత్తాకు చెందిన సద్గుణాలు. మానసిక సత్తా మన నిత్యజీవితంలో పాలు పంచుకున్నప్పుడు, మన ఎరుకలోకి ఇవి వస్తాయి.

ఈ సద్గుణాలకు ప్రాణిక, భౌతికసత్తాలు ఒక బలహీనతగా అనుభూతి చెందుతాయి. ఎందుకనగా ఈ కరుణ, కృజ్ఞత స్పందనాలను స్వేచ్ఛగా ప్రకటింపబడకుండా ప్రాణిక, భౌతిక సత్తాలు అణచివేస్తాయి, ఎందుకంటే ప్రాణిక, భౌతిక సత్తాలు అధికారం, బలం, దర్పంపై ఆధారపడతాయి. ఎప్పటిలాగే బుద్ధి, తగినంతగా శిక్షణ పొందనపుడు ప్రాణిక సత్తాతో కలసి మెలసి ఉండటమే కాక, భౌతిక నైజానికి బానిసగా కూడా ఉంటుంది. ఎందుకంటే దాని సూత్రాలు, పాక్షిక ఎరుకతో కూడిన దాని పద్ధతులు ఎంతగా వివశుల్ని చేస్తాయంటే, బుద్ధి సంపూర్ణంగా వాని నర్థం చేసుకోదు. మొట్ట మొదటిసారిగా బుద్ధి మానసిక కదలికలకు మేల్కొన్నప్పుడు దాని అజ్ఞానంవల్ల వాటిని వక్రీకరిస్తుంది. కరుణను జాలిగాను లేక దానంగాను; కృతజ్ఞతను బదులు తీర్చుకునే కోరికగాను, తరువాత కొంచెం కొంచెంగా దానిని తాను గుర్తించి, ఆరాధించగలిగే తన సామర్థ్యం గాను, సత్తాలో మానసిక ఎరుక చాలా బలంగా ఉన్నప్పుడు మాత్రమే ఏ రంగంలోనైనా సహాయం అవసరం ఉన్న వారందరిపైనా కరుణ, దైవకృప, దైవసాక్షాత్కారం ఎక్కడ ఏ రూపంలో దర్శన మిచ్చినా దాని పట్ల కృతజ్ఞతా భావం ప్రకటింపబడతాయి. అది వాని సహజమైన వెలుగుతో నిండిన స్వచ్ఛతతో ప్రకటించబడుతుంది; కరుణను ఉదాసీనత లేదా తక్కువవారిపట్ల చూపే ఔదార్యంలోను, కృతజ్ఞతలోను ఏమాత్రం తక్కువ లేదా న్యూనతాభావంతోను కలుషితం కాకుండా.

CWM 15:27

స్వచ్ఛమైన కృతజ్ఞతా స్పందనాలు, ప్రేమస్పందనాలు ఒకలాంటివే

బాగా నా చిన్నతనంనుండి (5 సం. అప్పటి జ్ఞాపకాలు), 80 సం. దాటినా నేనెప్పుడూ అత్యంత ప్రతీకారం, అసంతృప్తి, కృతఘ్నత, దైవంపట్ల కృతఘ్నత వీటితో నిండి ఉన్న వ్యక్తులమధ్య తరచు ఉండేదానిని. దైవంపట్ల కృతఘ్నత కలిగి

వుండడం నాకు చాలా బాధ కలిగించేది, తీవ్రశత్రుత్వం, ఎందుకంటే అన్ని రకాల బాధలను భగవంతుడు అనుమతిస్తున్నాడని అతని పట్ల గాఢ శత్రుత్వం వారిలో ఉన్నందుకు భరించరానిదిగా వుండేది.

అజ్ఞానంవల్ల దైవం పట్ల శత్రుత్వం — గాఢ శత్రుత్వం, కొన్నిసార్లు మేధోరూపాలను, వ్యక్తిగతరూపాలను తీసుకుంటుంది. ఇది ఘర్షణను ఇంకా కష్టతరం చేస్తుంది. దీని నెప్పుడూ వ్యక్తిగతంగా తీసుకోరాదు. ఇది తప్పు. ప్రపంచ ఉద్యమాలు ఏవీ ఒక వ్యక్తికి చెందినవి కావు. మనిషి అజ్ఞాన చైతన్యం దానిని వ్యక్తిగతంగా తీసుకుంటుంది. అవి లౌకికమైన దృక్పథాలు, మానవ బుద్ధితో వస్తాయి. అలా ఉండదు జంతువులలో, అతి క్రూరంగా కన్పించే జంతువులలో కూడ. అందుచే ఒక సుహృద్భావం ఉన్నది నాకు జంతువులపై. ఈ నైజం మనిషిలో లేదు.

(సుదీర్ఘ మౌనం)

అయినప్పటికి, అన్ని స్పందనలకంటె బహుశా అత్యంత ఆనందాన్ని ఇచ్చేది, అహంకారంతో కలుషితంకాని ఆనందాన్ని ఇచ్చేది కృతజ్ఞత — యధేచ్ఛగా ఒక ధారలా వెలువడే కృతజ్ఞత.

అది చాలా ప్రత్యేకమైనది. అది ప్రేమకాదు, ఆత్మ సమర్పణా కాదు, అది అంతా ఆనందమయం, నిండైన ఆనందం.

ఇది ప్రత్యేకమైన స్పందన. తనతో తప్ప మరేదానితోను పోల్చలేని స్పందన. అది నిన్ను విశాలపరుస్తుంది. ఉత్సాహంతో నింపుతుంది. ఎంతో తీవ్రమైనది.

నిశ్చయంగా అది మానవ చైతన్యానికి అందుబాటులో ఉండే అన్ని స్పందనలకన్న ఎక్కువగా నిన్ను నీ అహంకారంనుండి బయటకు తేగలదు. కృతజ్ఞత ఫలాపేక్ష లేనిది కాగలిగినప్పుడు ఆ స్పందన ప్రధానంగా ప్రపంచ అస్తిత్వానికి ఏ స్పందన కారణమై ఉంటుందో, ఆ స్పందన అవుతుంది. అప్పుడు దానికి ఉండే పెద్ద పెద్ద ఆటంకాలు, అడ్డంకులు, అన్నీ క్షణంలో అదృశ్యమౌతాయి. (ఈ కృతజ్ఞతా స్పందనపై సుదీర్ఘంగా శ్రీమాత ధ్యానిస్తారు.)

స్వచ్ఛమైన ఇట్టి స్పందనలో నీవు ప్రవేశించగలిగినపుడు నీవు వెంటనే తెలుసుకుంటావు, ఈ స్పందన లక్షణం ప్రేమస్పందనలక్షణం ఒకటే నని.

దీనికి ఆశ లేదు. ఇది ఒక వస్తువు నుండి వేరే వస్తువుకు పోయేదికాదు. లేదా క్రిందినుండి పైకి పోయేదికాదు. (గుండ్రంగా తిరుగుతుందని శ్రీమాత సైగ చేస్తారు.)

ఒకే మారు సంపూర్ణంగా జరుగుతుంది. దీని అర్థం ఏమంటే, ఈ స్పందన అస్తిత్వానికి రెండు ధృవాలు (అహంకార కేంద్రాలు) అవసరంలేదని.

ఇది స్వచ్ఛంగా ఉన్నప్పుడు ఒక ధృవంనుండి వేరొక ధృవానికి వెళ్ళదు, లేదా వేరే ధృవంనుండి ఈ ధృవానికి రాదు. స్వచ్ఛమైనపుడు ప్రేమస్పందనలకు కూడా ఇదే లక్షణం వుంటుంది. వీటికి రెండు ధృవాల అస్తిత్వం అవసరం లేదు.

అది (ప్రేమ, కృతజ్ఞత) తనకు తానుగా ఉంటుంది, తన అస్తిత్వం ఆనందంకొరకు. (ఇలా నేను చెప్పడం దాని స్వచ్ఛతను పాడుచేస్తుంది ప్రేమ లాగే.)

మనుష్యులు పదేపదే చెబుతారు విసుగుపుట్టేలా, రెండుధృవాలు లేనిదే దేనికీ అస్తిత్వం లేదని ఈ రెండు ధృవాలే ప్రపంచ అస్తిత్వానికి కారణమని, అంతా వీని చుట్టూ తిరుగుతూ ఉంటాయని (శ్రీమాత తల ఊపుతారు) కాని అది అలా లేదు. దీని అర్థం మానవుడు తన సాధారణ బాహ్య ఎరుకతో దీనిని మించి ఏదీ అర్థం చేసుకోలేడు. అక్కడ ఉన్నాం మనం . అదే మనకు తెలుసు. కాని దీని సారమేమంటే (శ్రీమాత మరల తల ఊపుతారు) ప్రేమ అలా లేదు.

చిట్టచివరిగా నేను చెప్పేదేమంటే స్వల్పంగా రంగు వేయబడిన ప్రధానమైన ప్రేమ స్పందనే 'కృతజ్ఞత'

(శ్రీమాత ధ్యానం)

ఒక అంతేవాసితో శ్రీమాతసంభాషణలు, డిశంబరు 21, 1963

మా హృదయాలను నింపు "మీ ప్రేమ" ఆనందంతో,
మా మనసులపై వరదలా సాగనీ "మీ కాంతి",
అనుమతించు మమ్ములను మీ విజయం సఫలం చేయుటకు

CWM 1:178

శ్రీమాత

అనువాదం: యస్.వై. సామయాజులు.

మీ జీవితం కృజ్ఞతతో నిండి ఉండాలి

దినచర్యను దైవానికి కృతజ్ఞతతో ఆరంభించు

ప్రతి ఉదయం నిద్ర లేవగానే, మీ దినచర్యను ఆరంభించుటకు పూర్వమే మానవజాతిని ఉద్ధరించడానికై మార్గదర్శకులుగా, శిక్షకులుగా తమ సహచరులను అత్యున్నత పరివక్వతా శిఖరాలను అధిరోహించుటకు, నిరాడంబరంగా, సోదర భావనతో సహకరించడానికి సర్వకాల సర్వావస్థల యందు విచ్చేసే ఈ గొప్ప కుటుంబ సభ్యులకు, ఈ మానవజాతి రక్షకులకు, ప్రేమాదరాభిమానాలు నిండిన కృతజ్ఞతాపూర్వక అభినందనలను తెలపాలి. ఆ విధంగా మేల్కొనగానే సంపూర్ణ విశ్వాసంతో, కృతజ్ఞతతో మీ ఆలోచనలను వారిపై కేంద్రీకరించుట వలన సమకూరే ప్రయోజనకరమైన ఫలితాలను వెంటనే అనుభవించ గలుగుతారు. మీ అర్థనకు ప్రతిస్పందనగా వారి సమక్షంలో నున్నట్టి అనుభూతి కలుగుతుంది, వారి ప్రేమ, ప్రకాశాలు మిమ్ములను ఆవరించి ప్రోత్సహిస్తాయి. అప్పుడు మరింత బాగా అర్థం చేసుకోవడానికి, మరింత బాగా ప్రేమించడానికి, సహకరించడానికి మీరు ప్రతిదినం చేసే ప్రయత్నం మరింతగా ఫలవంతమవుతుంది, సులభతరమవుతుంది. మీరు ఇతరులకు అందించే సహాయం మరింత సార్థకమవుతుంది, మీ హృదయాలు అచంచలమైన ఆనందభరిత మవుతాయి.

CWM 2:115-116

దైవానుగ్రహానికి, ప్రేమకు కృతజ్ఞత కలిగి వుండాలి

ఎవరైనా వ్యక్తులు జీవితాలను, చర్యలను, హృదయాలను యథాతథంగా, అనగా ఉన్నవి ఉన్నట్లుగా, మార్పుచెందనివిగా గమనించినట్లయితే, దైవానుగ్రహం లోకంపై వర్షింపజేసే అపారమైన ప్రేమకు, క్షణక్షణం అది లోకాన్ని దివ్యానంద తీరాలకు కొనిపోవుటకు పడే ప్రయాసకు, మానవ హృదయాల ప్రతిస్పందన ఎంత పేలవంగా వుంటుందో, అవి ఎంతటి ఉదాసీన వైఖరి, ఏవగింపు, తృణీకార భావన కలిగి వున్నాయో అర్థమైనప్పుడు, విస్తుపోవడంలో ఆశ్చర్యం లేదు. జనులు సాధార ణంగా పాపాత్ములన్నా, మందబుద్ధులన్నా, వికృతాకారులన్నా, జీవితంలో ఓడి పోయినవారన్నా, విఫలులైనవారన్నా సానుభూతి కనబరుస్తారు — నిజానికి ఇది

దుర్మార్గాన్ని, ఓటమిని ప్రోత్సహించినట్లవుతుంది కదూ!

సమస్యను ఈ దృక్కోణంలో పరిశీలించినవారికి, బహుశా, ద్వేషానికి ప్రతిగా ప్రేమను పంచాలనే అవసరంపై పట్టుదల అంతగా నుండదు. ఎందుకనగా, తనపై వర్షిస్తున్న దివ్యప్రేమకు మానవ హృదయం స్వచ్ఛందంగా ప్రేమపూరితమైన, అర్థవంతమైన, ప్రశంసాయుతమైన కృతజ్ఞతా భావనతో ప్రతిస్పందించినట్లయితే, విషయాలు శీఘ్రంగా మార్పుచెందుతాయి.

CWM 3:187

అంతా సవ్యంగా నున్నప్పుడే కృతజ్ఞత కలిగి వుండాలి

మనుషులకు ఏదో ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు తప్ప దైవానుగ్రహం ఏ విధంగా పని చేస్తుందో తెలియదు. అనగా, ఏదో అపాయం వాటిల్లబోతున్నదనో లేక అది ఎదురైనా, దాని బారిన పడకుండా తప్పించుకున్నామనో అర్థమైనప్పుడు మాత్రమే అది వారికి నిజంగా తెలిసేది. కాని, ఉదాహరణకు ఒక ప్రయాణమో లేక ఏదో ఒక కార్యక్రమమో ఎలాంటి దుస్సంఘటన చోటు చేసుకోకుండా గడచిపోతే, అందుకు కారణం కేవలం అపారమైన, మహిమాన్వితమైన దివ్యానుగ్రహమే. అనగా, సందర్భాలు ఎంత పొందికగా క్రమబద్ధం గావించబడతాయంటే, ఎలాంటి అవాంతరాలు సంభవించే అవకాశం లేశమాత్రం లేనంతగా వుంటాయి. అయితే, అది వారికి అతి సహజమైనదిగానే అనిపిస్తుంది. జనులు ఎప్పుడైతే జబ్బునపడి త్వరగా కోలు కున్నట్లయితే, వారు కృతజ్ఞతా భావనతో నిండిపోతారు; కాని వారు ఆరోగ్యంగా నున్నప్పుడు కూడా దైవానుగ్రహం పట్ల కృతజ్ఞత కలిగి వుండాలని అనుకోరు. కృతజ్ఞత వున్నా లేకపోయినా ఆరోగ్యంగా వుండడం అత్యాశ్చర్యకరం కదా! సామూహికంగా చోటు చేసుకొనే ప్రమాదాలలో ఆసక్తికరమైన విషయ మేమిటంటే, నిష్పత్తి — మనుషులకు ప్రమాదం వలన కలిగిన వైకల్యమందు హెచ్చుతగ్గులు — మనుషుల విభిన్న నైతిక, మానసిక పరిస్థితుల సంయుక్త ఫలితంగా ఏర్పడిన సమతుల్యత లేక సమతుల్యతా లోపం.

CWM 5:406

దైవానుగ్రహం స్వీకరించుటకు అత్యుత్తమ విధానం కృతజ్ఞత

ప్రశ్న: కృతజ్ఞతా పూర్వకంగా దైవానుగ్రహాన్ని ఎలా స్వీకరించాలి?
సమా: ఆహ్! ప్రప్రథమంగా మీకు అది అవసరమనే భావన కలగాలి.

అది ముఖ్యమైన అంశం. మీ అంతరంగంలో ఒక అణకువ లాంటిది కలగాలి. తద్వారా దైవానుగ్రహం వినా తాము నిస్సహాయులమని, వాస్తవానికి అది లేనప్పుడు తాము అసంపూర్ణులుగా, శక్తిహీనులుగా మిగిలిపోతామనే భావన మీలో ఉదయించాలి. ప్రారంభానికి ఇది ప్రధానమైన విషయం.

ఇది మీకు చక్కగా అనుభవంలోకి రావలసిన విషయం. చూడండి, ఏమీ ఎరుగని జనాలు సైతం తాము అతి క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్నామని లేక తాము ఎదుర్కొంటున్న గడ్డు సమస్యనొకదానిని అధిగమించాలని, లేక నేను మీకు ఇప్పుడే చెప్పినట్లుగా అధిగమించవలసిన ఒక మనోప్రవృత్తి లేక వారిని కలవరపరచే సందర్భమేదైనా సంభవించిందని గ్రహించినప్పుడు, వారు అయోమయంలో పడిపోతారు. వారికి ఏమి చేయాలో తెలియదు. వారి బుద్ధిగాని, సంకల్పశక్తిగాని, వారి మనోభావాలు గాని, వారికి ఉపకరించవు. ఏమి చేయాలో తెలియక సతమవుతున్నప్పుడు, ఒకటి సంభవిస్తుంది. వారి అంతరంగంలో ఒక విధమైన పిలుపు, ఒక ప్రేరణ, తాము చేయలేని పనిని చేయగలిగే దానిని స్వాగతించే పిలుపు, ఒక ఆక్రందన, తాను నిర్వర్తించలేని పనిని నిర్వర్తించగలిగే సమర్థతగల దానికోసం ప్రగాఢమైన వాంఛ. ఇది మొదటి నిబంధన. ఆ తరువాత దైవానుగ్రహమొక్కటే దానిని నెరవేర్చగలదనే ఎరుక మీకు గలిగితే, మీరున్న క్లిష్టపరిస్థితుల నుండి దైవానుగ్రహమొక్కటే మిమ్ములను రక్షించగలదు, పరిష్కారం చూపగలదు, బయటపడటానికి శక్తినీయగలదు అనే అవగాహన మీకు ఏర్పడితే, ఒక సహజసిద్ధమైన ఆకాంక్ష మీలో ఉదయిస్తుంది, విమోచనను కలిగించే చేతన ఒకటి మీలో మేల్కొంటుంది. మీరు పిలిచినా, గాఢంగా కోరినా, సమాధానమందుతుందనే ఆశ ఏర్పడినా, మీరు సహజంగానే దైవానుగ్రహానికి ఉన్ముఖులవుతారు.

అటు పిమ్మట మీరు దీనిపై అత్యంత శ్రద్ధ వహించాలి. (శ్రీమాత తమ వ్రేలును పెదవులపై పెట్టుకుంటారు) అనగా మౌనంగా ఉండాలని సూచన. దైవానుగ్రహం ప్రతిస్పందిస్తుంది. మిమ్ములను కష్టాలనుండి గట్టెక్కిస్తుంది. మీ సమస్యలకు

పరిష్కారం సూచిస్తుంది, లేదా మీ కష్టాలనుండి విముక్తి నొందటానికి సహాయపడుతుంది. అయితే ఒక్కసారి మీరు కష్టాలనుండి బయటపడితే, దైవానుగ్రహం మిమ్మలను గట్టెక్కించిందనే విషయం మరవవద్దు. అందుకు మీకు మీరే సాయపడ్డారని అనుకోవద్దు. ఎందుకనగా ఈ సందర్భంలో ఇదే ముఖ్యమైన విషయం. చాలామంది కష్టం గడచిపోగానే "తుట్టతుదకు, నన్ను నేను బాగానే కష్టాలనుండి బయట పడేసు కున్నాను." అంటారు.

అలా అనుకుంటున్నప్పుడు నీవు ద్వారాన్ని మూసి గడియవేసుకొన్నట్టు. చూడు, ఇక మీదట మీరు మరింకేమీ అందుకోలేరు. ఈ రకమైన అంతరంగ మూర్ఖత్వం తొలగిపోవాలన్నా, దైవానుగ్రహం లేకుండా మీకై మీరు ఏమీ చేయలేరనే అవగాహన కలగాలన్నా, మీకు మరో మారు ఏదో ఒక దుర్భరమైన మనస్తాపం ఒక తీవ్రమైన కష్టం కలగవలసిన అవసరముంటుంది. ఎందుకనగా, మీరు శక్తి హీనులనే అవగాహన పెంపొందినపుడే మీరు కొద్దిగానైనా తెలుసుకొని, మిమ్మలను మీరు మలచుకో గలుగుతారు. కాని ఎంతకాలం వరకు మీరు ఏమి చేసినా అది మీ నేర్పరితనం, మీ సామర్థ్యం వల్లనే నెరవేరిందని అనుకొంటారో, నిజానికి మీరు ఒక్క ద్వారాన్ని మాత్రమే మూసినట్లుగాదు. అన్ని ద్వారాలను ఒకదాని తరువాత ఒకటి మూసి, గడియ వేసారన్నమాట. మిమ్మలను మీరు ఒక కోటలో మూసివేసుకొని వేరేదీ ప్రవేశించ వీలులేకుండా చేసుకున్నారన్నమాట. గొప్ప చిక్కు ఏమిటంటే, వ్యక్తి అతి తొందరగా మరచిపోతాడు. తమ స్వంత సమర్థతతో సంతృప్తి చెందానని అనుకోవడం సహజం కదా!

(CWM 6: 322,33)

సామాన్యమైన దుస్సంఘటనలు, మహాకాళి చురక

ప్రశ్న: మహాకాళి మందలింపులా వేసే చురక యొక్క లక్షణ మేమిటి?

సమా: అది నిన్ను సంతోషపరుస్తుంది. హృదయంలో ప్రేమాదరాభిమానాల అను భూతిని కలిగిస్తుంది. నీవు సంపూర్ణంగా సంతృప్తి చెందుతావు.

ప్రశ్న: ఎవరైనా దానిని గాఢంగా కోరాలా లేక అది సహజంగానే వస్తుందా?

సమా: అవును, కోరాలి. ఆ కోరిక చిత్తశుద్ధితో కూడినదై వుండాలి. అభివృద్ధి చెందాలని

నిజంగా కోరాలి. ఎవరైనా మన స్ఫూర్తిగా "అవును, నేను అభివృద్ధి చెందాలి." అని చిత్తశుద్ధితో పలకాలి....

"ఏది ఏమైనా కానీ, నేను అభివృద్ధిచెందాలనేదే నా కోరిక." అప్పుడు అది లభ్యమవుతుంది. అయితే నేను చెప్పినట్లుగా, అది ఒక మహదానందభరితమైన అపార శక్తితో అవతరిస్తుంది. ఎవరైనా ఒక నిర్ణయానికివచ్చి, తమలో ఏదో అవలక్ష ణాన్ని ఆపాలని నిశ్చయించుకున్నప్పుడు, తాను చేసిన తెలివిమాలిన పనినితిరిగి చేయనని లేదా ఏదో ఒక పనిని నెరవేర్చక తప్పదు అని తెలిసినా అది అసాధ్యమని లేక కష్టతరమని అనుకున్నప్పటికీ నెరవేర్చాలని నిశ్చయించుకొన్నప్పుడు, ఆ నిర్ధారణలో తన సంకల్పశక్తిని మొక్కవోని నిజాయితీతో జోడించినప్పుడు, తప్పకుండా ఒక తీవ్రమైన మందలింపు లాంటి చురక తగిలి నిన్ను ఆ పనిని నెర వేర్చడానికి తరుముతుంది. అది ఒక చురక, అయినా, నీవు ఆనందంతో ఉప్పొంగి పోతావు. పరమానంద భరితుడవౌతావు. అది ఒక దివ్యానుభూతి. చూడు, ఇక్కడ (శ్రీమాత హృదయాన్నిచూపిస్తారు) ఒక దివ్యానుభూతి కలుగుతుంది.

పూర్తిగా అజ్ఞానాంధకార స్థితిలోను, బాహ్య, యాంత్రిక , భౌతిక, చేతనా వస్థ స్థితిలోను వున్న కారణంగా ఎదురయ్యే దుస్సంఘటనలు సాధ్యమైనన్ని తెలివిమాలిన తప్పిదాలను చేయించడం మూలాన వాటి పరిణామాలు సహజంగానే సంభవిస్తాయి. సంభవించడం ఖాయం. తప్పనిసరిగా ఇలాంటి స్థితిలో ఎదురయ్యే సంఘటనలకు, ఏది ఏమైనా సరే మిమ్ములను మీరే నియంత్రణలో నుంచుకోవాలని, సత్యచేతనలోనే మనుగడ సాగించాలని, అభివృద్ధి చెందాలని నిశ్చయించుకొన్నప్పుడు జరిగే సంఘ టనలకు, చాలా వ్యత్యాసముంది. అవి ఎంతో అర్థవంతంగా నుంటాయి. వాటిలో మీరు దేదీప్యమానంగా మెరుస్తున్న సత్యాన్ని మిమ్ములను సక్రమంగా నడిపించడానికి చేతిలో ఒక దీపంలా మీ మార్గాన్ని ప్రకాశవంతం గావించే వెలుగును స్పష్టంగా చూడ గలుగుతారు. అటుపైన ఒక బండరాయి మీపై బడి మిమ్ములను నుజ్జు నుజ్జుగా నలగగొట్టినట్లుగా ఎంతమాత్రం వుండదు. అది ఒక దేదీప్యమానమైన విజయ సూచిక.

అందుకనే అందరూ అనే విధంగా మొదట వేయబోయే అడుగుకే ప్రయత్నం అవసరమని. మొదట అడుగు అనుటలో అర్థం: ఒక అధమస్థాయి నుండి మొదట ఉన్నత స్థాయికి ఎదగమని, ఆ తరువాత అంతా మార్పు చెందుతుంది.

అయితే వ్యక్తి నిమ్నస్థాయినుండి పూర్తిగా బయటపడాలి. అక్కడే ఆగిపోకూడదు. ఒక పాదమిక్కడ, ఒక పాదమక్కడా పెట్టే ప్రయత్నం చేయకూడదు, ఎందుకంటే అది ప్రయోజనకారి కాదు.

బిడ్డలారా, అదీ విషయం.

CWM 6:.325-26

మీ తప్పిదాలను మీకు ఎత్తి చూపేవారి పట్ల కృతజ్ఞత కలిగి వుండాలి

మానవాళి పురోగతికి ఉపకరించే శాస్త్రి గ్రంథాలన్నీ మీ తప్పిదాలను మీకు ఎత్తి చూపే వారిపట్ల అత్యంత కృతజ్ఞతా భావన కలిగి వుండాలని ఘోషిస్తున్నాయి. ఆ కారణంగా అలాంటివారి సహవాసం మీరు నిరంతరం కోరాలని సూచిస్తాయి. విధానపరంగా ఈ పద్ధతి స్వాగతించ తగ్గది. ఒక తప్పిదం మీకు చూపబడిందంటే, అది ఒక అరుదైన నిధి మీకు చూపబడిందన్నమాట. అనగా నీవు స్వయంగా నీలో ఒక తప్పిదాన్ని, అసమర్థతను, అవగాహన లోపాన్ని, బలహీనతను, కాపట్యాన్ని, నీ పురోగతిని ఆటంకపరచే దేనినైనా గమనించిన ప్రతీసారి, నీవు ఒక అద్భుతమైన నిధి నిక్షేపాన్ని కనుగన్నట్టన్నమాట.

విచారపడి, ఓహ్, ఇంకా మరొక తప్పిదమా, అని చింతించే బదులు, నీ వొక అద్భుతమైన దానిని అంటుకున్నట్లుగా సంతోషించాలి. ఎందుకనగా నీ పురోగతిని ఆటంకపరచే వాటిలో ఒకదానిని పట్టుకోగలిగావు. ఒక్కసారి చేజిక్కితే దానిని పెరికి వేయాలి! యోగాభ్యాస శిక్షణ పొందేవారికి అవాంఛనీయమైన దేదైనా వున్నదని తెలుసుకున్న క్షణాన్నే దానిని తొలగించే శక్తి, నిర్మూలించే శక్తి వారికి ఉన్నదని భావిస్తారు.

ఒక తప్పిదాన్ని కనుగొనటమంటే, ఒక ఇష్టమైన వస్తువును స్వంతం చేసుకోవడం లాంటిది. అది ఎలాగుంటుందంటే, ఒక అణు మాత్రమైనా కాంతి హీనతను తొలగించిన క్షణంలోనే ఆ స్థానాన్ని ఒక వెలుగుల వెల్లువ ఆక్రమించినట్లుగా నుంటుంది.

ఒక యోగ సాంప్రదాయాన్ని అనుసరిస్తున్నప్పుడు, మీలో ఈ బలహీనతకు, ఈ అనైతికతకు, ఈ సంకల్పరాహిత్యానికి చోటివ్వకూడదు. వాటి ఉనికి సూచించే దేమంటే జ్ఞానంతోపాటు శక్తి సమకూరలేదని. ఏ విషయమైనా ఆ విధంగా వుండకూడదు అని తెలిసినాకూడా, దానిని ఆ విధంగానే కొనసాగనీయడం బలహీనతకు సంకేతం.

ఇది ఏ శిక్షణానియమావళి కూడా అంగీకరించదు. అది సంకల్పశక్తి కొరవడిన కారణంగా హద్దులు మీరిన కపటనాటకమవుతుంది. ఏ విషయమైనా ఆ విధంగా నుండకూడదని తెలిసిన ఆ క్షణంలోనే అది ఆ విధంగా ఏ మాత్రం కొనసాగకూడదని నిర్ధారించవలసింది మీరు, ఎందుకనగా జ్ఞానము శక్తి ఈ రెండు మూల అర్థం ఒకటే, అనగా అభివృద్ధి చెందాలనే ప్రధాన సంకలల్పానికి వ్యతిరిక్తమైన దుష్టసంకల్పం యొక్క నీడ కూడా నీ అస్తిత్వపు ఏ భాగంపైనా పడనీయకూడదు. అలా చేయకపోతే ఏ హానికరమైన దానినైతే నిర్మూలించాలనుకున్నారో దానిని నిర్మూలించడానికి మిమ్ములను ధైర్యసాహసాలు కోల్పోవునట్లు చేసి శక్తిహీనుడిగా నిర్వీర్యుణ్ణి చేస్తుంది.

అజ్ఞానంతో పాపం చేయడం పాపం అనిపించదు. అది లోకంలో సర్వసాధారణంగా వుండే దుష్టత్వంలో భాగం, కాని తెలిసినప్పుడు సైతం పాపం చేయడం ఉపేక్షించ రానిది. దాని వలన తెలియవచ్చేది ఏమిటంటే దుష్టసంకల్ప మూలకం నీలో ఎక్కడో పండులో నుండే క్రిమిలాగా దాగి వున్నదని, దానిని ఎంత ప్రయాసకైనా ఓర్చి, వెంటాడి నిర్మూలించాలి. ఎందుకనగా అలాంటి సందర్భంలో ఏ మాత్రపు మెతకతన మున్నా అదే కష్టాలకు మూలకారణం అవుతుంది. కొనసాగనిస్తే కొంతకాలానికి సరిదిద్దడానికి కూడా వీలుపడదు.

అందువలన ప్రధానమైన విషయమేమిటంటే, ఎవరైనా నీకు తెలియని నీలోని తప్పిదాన్ని ఎత్తి చూపినప్పుడు సంతోషించు, విచారించే బదులు ఆనందించు, ఆ ఆనందంలో ఉండకూడనిదానిని తొలగించడానికి కావలసిన బలాన్ని పుంజుకో.

CWM 3:220-22

కృతజ్ఞతా పూర్వక ప్రార్థన అత్యుత్తమమైన ప్రార్థన

ప్రార్థన అనేది ఏదో ఒక స్పష్టమైన విషయం గురించి చాలావరకు బహిర్ముఖంగా చేయబడేది. ఎల్లప్పుడు దానికై ఒక ఆచార నియమావళి రూపొందించిచబడి వుంటుంది. వ్యక్తికి ఒక గాఢమైన కోరిక వుండొచ్చు. దానిని ప్రార్థనా రూపంగా మలచవచ్చు. కాని తీవ్రమైన కోరిక అన్ని విధాలా ప్రార్థనను మించినది. అది వ్యక్తికి దగ్గరైనదే కాక అంతకుమించి అతను తన వ్యక్తిగత విషయాలను విస్మరించి తాను ఏ మాది రిగా వుండాలని, లేక చేయాలని అనుకున్నాడో ఆ ఆలోచనలలోనే జీవింపజేస్తూ, చేయకోరినదానినంతా దైవపరం గావిస్తుంది. మీరు ఏదైనా అర్థించడానికి ప్రార్థించ

వచ్చు. మీకు భగవంతుడు ప్రసాదించిన దానికి కృతజ్ఞతను చిత్తగించమని కూడా ప్రార్థించవచ్చు. ఆ ప్రార్థన అతి శ్రేష్టమైనది. దానిని కృతజ్ఞతా నివేదన చర్య అన వచ్చు. భగవంతుడు మీపై చూపిన కృపా కటాక్షాలకు అతను మీకోసం చేసినదానికి, అతనిలో మీరు చూసినదానికి ప్రశంసాయుతంగా స్తుతించవచ్చు. ఇదంతా ఒక ప్రార్థనా రూపం దాల్చవచ్చు. అలాంటిది నిశ్చితంగా అత్యుత్తమమైన ప్రార్థన, ఎందుకనగా అది కేవలం వ్యక్తిగత విషయాలకు చెందినది కాదు, నిస్వార్థమైనది.

CWM. 5: 141

శ్రీమాత

అద్భుతమైన దైవానుగ్రహాన్ని ఎప్పుడూ విస్మరించకూడదు

'ఆశ్రమవాసి' అని నిర్వచించుటలో అర్థం అతను తన జీవితాన్ని దైవానుభూతి సిద్ధికి అంకితం చేసుకొనుటకు నిశ్చయించుకున్నవాడని. అయితే తన నిర్ణయానికి కట్టుబటి వుండడానికి అతను తన అంకిత భావనలో చిత్తశుద్ధి, విశ్వసనీయత, వినయము, కృతజ్ఞత కలిగి వుండాలి. అందుకు కారణం, ఆ లక్షణాలు కలిగి వుండడం అన్ని రకాల అభివృద్ధికి ఆవశ్యకం. ఇక అభివృద్ది ఒక దృఢమైన, శీఘ్రతరమైన అభివృద్ధి పరిణామ క్రమంయొక్క పురోగమన వేగాన్ని అనుసరించుటకు అత్యావశ్యకం. ఈ లక్షణాలు కొరవడిన వ్యక్తికి కొన్ని సార్లు అభివృద్ధి చెందినట్లుగా తోచినా అది నామ మాత్రమే, కేవలం పైకి కనిపించడానికి ఒక నటన. అదను దొరికిందంటే పేక మేడలా కూలిపోతుంది.

చిత్తశుద్ధి కలగాలంటే అస్తిత్వంలోని అన్ని భాగాలు భగవదాకాంక్షలో ఏకమవాలి. అందుకు ఒకటి సుముఖంగా మరొకటి విముఖంగానుండకూడదు. ఆకాంక్ష చిత్తశుద్ధి కలిగినదై దైవాన్ని దైవంకోసమే కాని పేరుప్రతిష్టలు అధికారం లేక స్వాతిశయంకోసం కాకూడదు.

అంకిత భావనలో దృఢత్వం, విశ్వసనీయత వుండాలి. ఒకరోజు అమితమైన విశ్వాసంతోను, మరొక రోజున, పరిస్థితులు అనుకూలంగా లేనందున విశ్వాసం కోల్పోయి, రకరకాల సందేహాలకు తావివ్వకూడదు. సందేహించడమంటే "ఏమీ కాదు ఫర్వాలేదులే," అనే భావనతో ఆడే ఆట లాంటిది కాదు. అది బొట్టు బొట్టుగా ఆత్మను హరించే విషం.

వినయంతో నుండటమంటే తాను ఏమిటో అనే అంశంపై సరైన అవగాహన కలిగి వుండడం. తాను ఎంతటి ఘనకార్యాలు సాధించినవాడైనా, దైవం అతని నుండి ఆశించినదానికి అతనెలాగున్నాడో అనేదానితో పోలిస్తే, అతను సాధించిన దంతా నిష్ప్రయోజనమని తెలుస్తుంది.

అన్నింటిని మించి, దైవాన్ని అతని చిద్విలాసాలను ఎంచడానికి తాను అసమర్థుడిని అని మనస్ఫూర్తిగా భావించాలి.

ఈ అద్భుతమైన దైవానుగ్రహమేదైతే ప్రతి ఒక్కరిని వారి వ్యక్తిత్వము, అజ్ఞానము, అవగాహనారాహిత్యము, అహంకారము, అసమ్మతి, విముఖతలను లెక్క చేయకుండా వారివారి దివ్యగమ్యానికి అతి దగ్గరి మార్గంలో చేరవేస్తుందో దానికి కృతజ్ఞులమై వుండాలి, ఎప్పటికి మరవకూడదు.

White Roses, P. 189, 233, 17, 35

శ్రీమాత

అనువాదం: అందులపాటి కైలాసపతి, జానకి

స్వయం సంకల్పానికి అనుగుణంగా నడుచుకొనే వ్యక్తికి కృతజ్ఞతాభావన వుండదు. అందుకు కారణం అతను అభిలషించినది అతనికి లభ్యమైనప్పుడు తన సంకల్పశక్తియే అందుకు కారణమని భావిస్తాడు. అతనికి లభ్యమైనది అతను కోరనిదైతే, తీవ్రంగా నిరసించి, బాధ్యులు ఎవరని తాననుకుంటాడో వారిపై నింద మోపుతాడు. దైవం — మనిషి, ప్రకృతి, ఏదైనా కానీ.

CWM 14, P. 155

శ్రీమాత

అనువాదం: అందులపాటి కైలాసపతి, జానకి

కృతజ్ఞతా మార్గం

నిశ్చలమైన విధేయతకు మరియు కృతజ్ఞతాపూర్వక విధేయతకు మధ్య తేడా

ప్రశ్న: క్రితం సారి ఆ గ్రంథంలో చెప్పినది "దైవం మీద, వారు విశ్వసించి కొలిచే దైవం మీద విశ్వాసం ఉన్నవారు సమగ్రంగా దైవానికి చెందినవారు; వారి జీవితంలోని సంఘటనలన్నీ దివ్యసంకల్పం యొక్క అభివ్యక్తిగా భావించి వారు వాటిని నిశ్చల విధేయతతో అంగీకరించడమే కాకుండా, కృతజ్ఞతా భావనతో స్వీకరిస్తారు, ఎందుకంటే వారికేమి జరిగినా అది వారి మంచికే జరుగుతుందని గట్టిగా నమ్ముతారు".

నిశ్చల విధేయతకు మరియు కృతజ్ఞతాపూర్వక విధేయతకు మధ్య ఉన్న భేదం ఏమిటి?

సమా: నిశ్చలమైన మరియు కృతజ్ఞతాపూర్వకమైన విధేయత? నిన్నెవరైనా ఆజ్ఞాపించినప్పుడు, నీవు వారికి వశపడటానికి నిశ్చయించుకున్నావు కాబట్టి నీవు సమాధానపడి ఆ పని చేస్తావు — నీకు సంతోషం లేకపోయినా, ఆనందం కలగక పోయినా, నిరుత్సాహంగా, యాంత్రికంగా చేస్తావు, "నన్నీ పని చేయమన్నారు, నేను చేస్తున్నాను" అన్న నిరాసక్తతతో పని చేస్తావు. దాని అర్థం నీవు నీ కప్పచెప్పిన పనిని అర్థం చేసుకుందుకు ప్రయత్నించవు, ఇష్టపూర్వకంగా ఆ పనిని చేయాలని ప్రయత్నించవు, ఇదే నిరాసక్త విధేయత. నీవు నీ విధిని అంగీకరిస్తావు. నీవు ఫిర్యాదు చేయకపోవడం, ఫిర్యాదు చేయకూడదని నీవు నిర్ణయించుకోవడం వల్లనే. అందువల్లనే నీవు ఫిర్యాదు చేయలేదు, లేకపోతే చేసి ఉండేవాడివి.

కృతజ్ఞతాపూర్వక విధేయత విషయంలో, అసలు ఆ ఆజ్ఞ ఎందుకివ్వబడిందో తెలుసుకోవడం, దాని అంతరార్థం, దాని విలువ గ్రహించడం, నీ కప్పచెప్పబడిన పనిని నీ శక్తి మేరకు చేయడానికి ప్రయత్నించడం, నిన్ను దైవానికి మరింత చేరువ చేసే అనుభూతి నివ్వగలదన్న జ్ఞానము, ఆనందంతో సంతృప్తి చెందుతావు. సంతృప్తి, సంతోషాలతో నీవు సంపూర్ణంగా సహకరిస్తావు. నిశ్చల విధేయతకు, కృతజ్ఞతాపూర్వక విధేయతకు మధ్యగల భేదం ఇలా వుంటుంది.

ప్రశ్న: నిశ్చల విధేయత ఆనందాన్ని ఇవ్వదా?

సమా: సాధారణంగా ప్రతి ఒక్కరు, వారి గురించి వారు గొప్పగా అనుకుంటారు! స్వాతిశయంతో, వారికి వారు ఒక అసాధారణమైన పనిని చేస్తున్నట్టు భావిస్తారు. వారు ప్రశ్నించరు, అర్థం చేసుకొనుటకు ప్రయత్నించరు. విధేయులై ఉంటారు, నిరాసక్తత కలిగి వుంటారు. వారిని వారు ఆ చేస్తున్న పని మంచిదా కాదా, అని కూడా ప్రశ్నించుకోరు: అధికులమని భావిస్తారు: గర్వంతో పొంగిపోతారు. ఇలాంటి మనుషులు ఇక్కడ చాలామంది ఉన్నారు.

ప్రశ్న: అయితే ఇది నిజమైన విధేయత కాదు, అవునా?

సమా: ఆ మరొక విధానమే కొంచెం మంచిదనుకుంటాను. కనీసం ఇందులో తాను పని ఎందుకు చేస్తున్నాడో అర్థం చేసుకుంటున్నానన్న తృప్తి ఉంది. అర్థం చేసుకోవడం వల్ల ఆ పనిలో ఆనందంతో పాటు, ఆ పని చేస్తున్నానన్న భావన ద్వారా శక్తిని పొందుతాడు. అదే ఆ మొదటి సందర్భంలో మరింతగా ఒదిగి ఒదిగి, ఆ నిరంకుశ అధికారి క్రింద నలిగిపోతున్నట్లుగా భావిస్తాడు.

CWM 6:63-64

శ్రీమాత

*

ఉత్తమమైన పద్ధతి ఆ దివ్యకృపని నీలో పని చేయనివ్వడమే, ప్రతికూలత లేకుండా, ఎన్నడూ కృతఘ్నతతో ఎదిరించకుండా — దాని గమ్యమైన ప్రకాశం, శాంతి, ఐక్యత, ఆనందాల వైపు సాగే మార్గాన్ని అనుసరించాలి.

*

దైవకృప వెనుకకు మళ్ళే అవకాశం వుండే మనుషులు అసలు వుండరు. దైవకృప నుంచి తమకు తాముగా తప్పుకొనేవారు చాలామంది.

SABCL 23:613

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

దైవకృప (పరమోన్నత జ్ఞానం) యందు పరిపూర్ణ విశ్వాసం

ఆత్మార్పణ యందు ఒక మహనీయ పరిశుద్ధత, ఒక గొప్ప తపన ఉండాలి. అంతేగాక మనకేవి మంగళకరమో, దానంతటి గురించీ మనకు తెలిసినదాని కంటే దైవకృప, పరమోన్నత జ్ఞానానికి బాగా తెలుసుననే పరిపూర్ణ విశ్వాసం వుండాలి. అప్పుడు తన ఆకాంక్షను దానికి నివేదించినట్లయితే, తగినంత తపనతో యదార్థంగా ఆకాంక్షను సమర్పించినట్లైతే, ఫలితాలు అద్భుతంగా వుంటాయి. కాని వాటి నెలా చూడాలో తెలుసుకొని వుండాలి. ఎందుచేతనంటే సాక్షాత్కారాలు జరిగినపుడు, అవి చాలా సహజమని చాలామంది అనుకొంటారు. అది యెలా, యెందుకు జరిగిందో చూడాలని కూడా అనుకోరు. "అవును, సహజంగా ఆలాగే జరుగుతుంది" అని వాళ్ళలో వాళ్ళు అనుకొంటారు. అందుచేత వాళ్ళు ఆనందాన్ని... కృతజ్ఞత ఆనందాన్ని కోల్పోతారు. ఎందుకనంటే ఆ విశ్లేషణతో చివరకు అతడు దైవకృప యెడల కృతజ్ఞతతో నిండిపోయి దానికి కృతజ్ఞతలు తెలుపుకొంటే, దానికది తుది మెరుగులు దిద్దుతుంది. అంతేగాక జరుగవలసిన రీతిలోనే కచ్చితంగా అన్నీ జరుగుతున్నాయనీ, యెలా వుండాలో అలాగే వుంటున్నాయనీ, ఉండవలసినంత ఉత్తమంగా వుంటున్నాయనీ ప్రతి దశలోనూ తెలుసుకోగలిగిన స్థాయి కతడు చేరు కొంటాడు.

CWM 7:239

దైవీసంపర్కం పొందడానికి అత్యంత శక్తివంతమైన సాధనాలు

రెండు ప్రధానమైన విషయాలున్నాయి. తనను పురిగొల్పే విషయంలోనికి, అటూ యిటుగా, పూర్తిగా తనను తాను నిమగ్నం చేసుకొనేందుకు వీలుగా తన అధికమో లేక అల్పమో అయిన జడత్వం నుండి బయటపడవేసే ఉత్సాహం కలిగించే సామర్థ్యం వుండాలి. ఉదా: కళాకారునికి తన కళ మీద, శాస్త్రవేత్తకు తన శాస్త్రం మీద ఉండే ఉత్సాహం లాంటిది వుండాలి. సాధారణంగా దేనినైనా సృజించే లేక నిర్మించే ప్రతి వ్యక్తికీ ఒక ఉన్మీలనం వుంటుంది, అతనిలో ఉత్సాహాన్ని నింపే ఒక ప్రత్యేక శక్తి, ఒక ప్రత్యేక శక్యత వుంటుంది. ఉన్మీలనం క్రియోన్ముఖమైనపుడు

అతని అస్తిత్వంలో యేదో మేలుకొంటుంది. అపుడతడు చేసే పనిలో దాదాపు అతని అస్తిత్వమంతా పాలు పంచుకొంటుంది.

తదుపరి విషయం: స్వాభావికంగానే తమలో కృతజ్ఞతాభావం గలవాళ్లు కొందరుంటారు. ప్రతిస్పందించాలనే ఒక తృష్ణ గలవాళ్ళు, సానుభూతితో, అంకితభావంతో, సంతోషంతో, మొత్తం జీవనం వెనుక, జీవితంలోని ప్రతి అల్పాంశం వెనుక, ప్రతి చిన్న సంఘటన వెనుక గల సర్వోత్కృష్ట సౌందర్యం, అనంత దైవకృపలను సంవేదించే వాళ్లున్నారు.

జ్ఞానం లేనివాళ్ళు నాకు తెలుసు, అంటే దేన్ని గురించీ తెలియని, అక్షరం ముక్క రాని, పూర్తిగా సాధారణ మనస్కులు అయినప్పటికీ, అర్థం చేసుకొని, తనను తానిచ్చివేసుకొనే కృతజ్ఞతతో నిండిన, కృతజ్ఞత చూపగల సామర్థ్యం వున్నవాళ్ళు నాకు తెలుసు. వాళ్ళకు వాళ్ల చైత్యపురుషునితో సంపర్కం చాలా తరచుగా కలుగుతూ వుంటుంది, వాళ్ళ సామర్థ్యాన్ననుసరించి, ఆ సంపర్కం దాదాపు యెప్పుడూ సచేతనంగా — బాగా తెలిసేటట్లు గాదు, కొంచెంగా — అంటే వాళ్ళ నెవరో నడిపిస్తున్నారనీ, వాళ్ళ కెవరో సహాయం చేస్తున్నారనీ, వాళ్ళను వాళ్ళు మించిపోయేటట్లు ఉద్ధరిస్తున్నారనే అనుభూతి కలవాళ్ళు నాకు తెలుసు. ఈ రెండు పద్ధతులూ యెక్కువగా జనాన్ని సన్నద్ధం చేస్తాయి. జనం వీటిలో యేదో ఒక సామర్థ్యంతో జన్మిస్తారు. వాళ్ళు గనుక కష్టపడితే అవి క్రమంగా వాళ్ళలో అభివృద్ధి చెందుతుంది, విస్తరిస్తుంది.

విచారకరమైన, తుచ్ఛమైన అహంకారం నుండి నిన్ను బయట పడవేసేదేదో అది నీ ఉత్సాహ సామర్థ్యం. ఉదాత్త కృతజ్ఞత నుండి, కృతజ్ఞతా ఔదార్యం నుండి, అల్పతర అహంకారం నుండి, కృతజ్ఞతలు తెలపడం ద్వారా తనకు తానుగా బయట పడుతుంది. ఈ రెండూ నీ చైత్యపురుషునిలోని దైవంతో సంపర్కం లోనికి ప్రవేశించడానికి అత్యంత శక్తివంతమైన, తక్కువ శ్రమతో యెక్కువ ప్రయోజనం కలిగించే సాధనాలు. ఇది చైత్యపురుషునితో అనుసంధానం కలిగించేదిగా — భద్రమైన, దృఢమైన అనుసంధానం కలిగించేదిగా ఉపయోగపడుతుంది.

CWM 7:418-19

కృతజ్ఞత లేని భక్తి అసంపూర్ణం

నీకు భక్తి వుంది, అదే సమయలో అహానికీ నీవు ఆశ్రయమిస్తున్నావు. నీ అహం నిన్ను భక్తిపూర్వకంగా అన్ని రకాలైన పనులూ, భయంకర అహంకారిక పనులు చేసేటట్లు చేస్తోంది. అంటే నీవు నిన్ను గురించే ఆలోచిస్తున్నావు గాని యితరులను గురించి కానీ, ప్రపంచాన్ని గురించి కానీ, పనిని గురించి కానీ, నీవేం చేయవలసి వుందో దానిని గురించి కానీ గాక, నీ భక్తిని గురించే నీవు ఆలోచిస్తున్నావు. నీవు బ్రహ్మాండమైన అహంకారివిగా తయారైనావు. ఏదో కారణంతో నీవు భగవంతుని నుండి ఆశించే ఉత్సాహంతో దైవం నీ భక్తికి బదులు పలుకడం లేదు. అందుచేత నిరాశ చెంది నేనింతకు ముందు చెప్పిన మూడు రకాలైన కష్టాల్లో పడిపోతావు. దైవం కర్కోటకుడు అని గానీ, — ఎందుకనంటే ఇదివరకటిలాగ అతడు ఇంకెంత మాత్రం తమకు సన్నిహితంగా లేడనీ, సౌమ్యంగా లేడనీ, అతడు వెనక్కు తగ్గాడని దైవాన్ని దూషించే ఉత్సాహవంతులైన భక్తుల కథలు అనేకం మనం చదివాం. "నన్నెందుకని దూరంగా పెట్టావు? ఓ నిర్దయుడా, నన్ను విడచిపెట్టాశావు!"... అని బయటకనే సాహసం చేయలేకపోయినా లోపల లోపల అనుకొంటారు. లేకపోతే, "నన్ను దూరం పెట్టేంత తీవ్రమైన పెద్ద తప్పు నేనేదో చేసి వుంటాను" అనైనా అనుకొంటూ కుంగిపోతారు.

భక్తిని సదా వెంటనంటి వచ్చే మరో విషయం కూడా వుంది... అది, దైవం ఉన్నాడనే కృతజ్ఞతా భావానికి సంబంధించినది. దైవం వున్నాడనే వాస్తవం నిజంగా నిన్ను ఒక ఉదాత్తానందంతో నింపివేసే ఒక అద్భుత కృతజ్ఞతతో నిండిన అనుభూతి. దైవం అయినది, ఈ జగత్తులో యేదో వున్నదనీ, మనం చూచే జుగుప్సాకరమైనది మాత్రమే గాదు, దైవం కూడా యిక్కడున్నాడని, ఉంటాడనే కృతజ్ఞతా భావానికి సంబంధించిన ఒక భావం సదా భక్తితో కలసి వుంటుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దైవ అస్తిత్వానికి సంబంధించిన ఈ మహోదాత్త సత్యతతో ఏ చిన్న విషయమైన సంపర్కం కలిగించిన ప్రతిసారీ, హృదయం యెంతో తీవ్రమైన, యెంతో అద్భుతావహమైన సంతోషంతో, సమస్తం యెంతో అత్యున్నత మహదానంద రుచిని చూపే దేననే కృతజ్ఞతతో నిండిపోతుంది.

కృతజ్ఞత కలిగించే ఆనందంతో సమానమైన ఆనందాన్నివ్వగలిగింది మరొకటి

లేదు. ఒక పక్షి కలకలారవం విన్నా, ఒక సొగసైన పుష్పాన్ని చూచినా, ఒక పసిపాపను చూచినా, ఒక ఔదార్యం నిండిన చర్యను గమనించినా, ఒక ముచ్చటైన వాక్యాన్ని చదివినా, అస్తమిస్తున్న సూర్యబింబాన్ని చూచినా, అటువంటిదేదైనా సరే, అకస్మాత్తుగా ఈ ఆనందం నిన్నావహిస్తుంది, ఈ విధమైన భావావేశం — నిజానికి యెంతో ప్రగాఢ, తీవ్ర భావావేశం — ప్రపంచం దైవాన్ని అభివ్యక్తం చేస్తోంది, ఈ ప్రపంచం వెనుక యేదో వుంది, అది దైవం అనే భావావేశం నిన్నావహిస్తుంది.

అందుచేత కృతజ్ఞత లేని భక్తి కచ్చితంగా అసంపూర్ణం అనీ, భక్తితో పాటు కృతజ్ఞత కూడా వుండి తీరాలనీ, నేను గ్రహించాను.

CWM 8:39-40

పరివర్తనకు తలుపు తెరిచేది కృతజ్ఞత

ప్రశ్న: అమ్మా ! చేతనను మార్చుకోవడం యెలా?

సమా: ఔదార్యం నిండిన ఒక చర్యను గమనించినపుడు, అసాధారణమైన విషయం విన్నపుడు, ఒక సాహసకృత్యాన్ని లేక ఔదార్యతను, లేదా అంతరాత్మ గొప్పదనాన్నీ స్వయంగా చూచినపుడు, ఒక ప్రత్యేక ప్రతిభ చూపించినవానిని, లేక అసాధారణమైన, అందమైన రీతిని పని చేసినవానిని కలుసుకొన్నప్పుడు, అతనిలో ఒక విధమైన ఉత్సాహం, లేక ప్రశంసా భావం లేదా కృతజ్ఞత ఆకస్మికంగా పెల్లుబికి ఒక నూతన చేతనాస్థితి లోనికి, ఒక వెలుగు, ఒక ఆర్ద్రిత, అదివరకు తెలియని ఆనందం లోనికి ద్వారం తెరుస్తుంది. మనకు మార్గం చూపే సూత్రాన్ని పట్టుకొనే దారి అవుతుంది అది కూడా. వేలాది మార్గాలున్నాయి, కాకపోతే, మెలకువగా వుండాలి, గమనిస్తూ వుండాలి.

CWM 8:405

కృతజ్ఞత నిశీధులను కుంచింప జేస్తుంది.
కృతఘ్నత వెలుగును మసకబారుస్తుంది

చీకటి కాలాలు తరచుగా వస్తుంటాయి, అది సామాన్యమే. ఇవి ఆధ్యాత్మిక నిశీధులు. పగటి వెలుగులు ఒకదాని తర్వాత ఒకటిగా మారుతూ వస్తుంటాయి అని తెలుసుకొని, దాన్ని గురించి విచారపడకుండా మౌనం వహించడం మంచిది. నీవు ప్రశాంతంగా

వుండాలంటే దైవం అందించే సాయానికి, అతని యెడల హృదయంలో కృతజ్ఞత నిలుపుకోవాలి. ఏదేమైనా, ఒక చురుకైన, ప్రభావవంతమైన చికిత్సా విధానం వుంది. నీ హృదయంలో పరిశుద్ధం చేసే జ్వాల, పురోగతికై ఆకాంక్ష, తపన, ఆవేశపూరిత పవిత్ర భావం, సదా ప్రజ్వరిల్లుతూ వుండేటట్లు చూసుకోవాలి. చిత్తశుద్ధి కలవారందరి హృదయంలో ఈ అగ్ని రాజుకొంటుంది. కృతఘ్నత తన బూడిదతో ఆ అగ్నిని ఆచ్ఛాదించ నివ్వకు.

CWM 14:246-47

*

తనకేం కావాలో, తనకేది లేదో దానిని గురించే అహం ఆలోచిస్తుంది. ఇదే దాని నిరంతర వ్యాపకం.

తనకేం లభించిందో అంతరాత్మకు తెలుసు, దానికి అనంత కృతజ్ఞత తెలుపుతూ అది జీవిస్తుంది.

CWM 14:257

*

నీ చాపల్యాలకు సంతృప్తి కలిగితే చాలు, తక్కిన ప్రపంచం మొత్తం నాశనమైపోయినా సరే!

తన సిద్ధాంతాలను అన్నింటి మీద విధించాలని చూచే అహంకారిక మనస్సు ధోరణి అలా వుంటుంది.

దైవం దృష్టిలో సిద్ధాంతాలు, కోరికలు అన్నీ ఒకటే. కోరికలు ప్రాణిక చాపల్యాలైనట్లే, సూత్రాలూ, నియమాలూ మానసిక చాపల్యాలు.

CWM 14:342

*

మన కృతజ్ఞత దైవానికే అర్పితం

ప్ర: అమ్మా! మనిషి యెడల, దైవం యెడల మన కృతజ్ఞతను చూపించే ఉత్తమమైన మార్గమేది?

సమా: నీవు మనిషినీ, దైవాన్నీ కలిపి యెందు కడుగుతున్నావు?


తత్త్వతః మనిషి దైవం అనేది యదార్థమే. కాని ప్రస్తుతం, కొన్ని అరుదైన



కృతజ్ఞతా విశుద్ధ జ్వాల మన హృదయంలో ఆర్ద్రీతతో, మధురంగా, తేజోవంతంగా, సమస్త అహంకారాన్ని, సమస్త అంధకారాన్నీ రూపుమాప సదా జ్వలిస్తూ వుండాలి. సాధకుని అతని గమ్యానికి చేర్చు పరాత్పరుని కృపకై తపించు కృతజ్ఞతా జ్వాల అది. అతనిలో కృతజ్ఞత అధికమైనకొద్దీ, ఈ కృపాకటాక్ష చర్య నతడు గుర్తించడం కూడా అధికమై కృతజ్ఞత చూపితే, అంతగానూ మార్గం నిడివి తగ్గిపోతుంది.

White Roses: 17 — శ్రీమాత

అనువాదం: కె. వి. రావు



కృతజ్ఞత:

దైవం నుండి స్వీకరించిన దివ్యకృపను ప్రేమపూర్వకంగా గుర్తించడం, దైవం నీ కోసం చేసిన, చేస్తున్న సమస్తాన్నీ వినమ్రంగా గుర్తించడమే కృతజ్ఞత.

దైవానికి ఋణపడి వున్నాననే అప్రయత్న అనుభూతి దైవం నీకు చేస్తున్నదానికి తక్కువ అనర్హుడివిగా తయారయ్యేటట్లు, నీకు సాధ్యమైనంత ఉత్తమంగా నీవు చేసేటట్లు చేస్తుంది.

CWM 14:154

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

మినహాయింపులు తప్ప, తనలో వున్న దైవాన్ని గురించి మనిషి కస్సలు తెలియదు. ఈ అచేతనలోనే పదార్థ ప్రపంచ అసత్యత వుంది.

మన కృతజ్ఞత దైవం వైపు కేనని నీ కిదివరకే వ్రాసాను. మనుషుల విషయంలో, శుభకామనా ప్రవృత్తి, సదవగాహన, పరస్పర సహాయ సహకారాలుండాలి.

దైవం వైపు సంపూర్ణ కృతజ్ఞతను, ప్రగాఢంగా, తీవ్రంగా నిరంతరం అనుభూతి చెందాలి. సంతోషంగా, ప్రశాంతంగా ఉండడానికి అదొకటే ఉత్తమమైన మార్గం.

దైవానికి కృతజ్ఞతను వ్యక్తం చేయడానిక గల యదార్థమైన పద్ధతి ఆతనితో తాదాత్మ్యత ననుభవించడమే.

CWM 16:313-14 శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

గ్రహీ త ఎవరైనప్పటికీ, కానుక ఏదైనప్పటికీ, ప్రత్యక్ష గ్రహీత కానుకను కాదన్నా, ఔనన్నా అంతిమమున ఔనని స్వీకరించునది సర్వోత్తముడే, అంతటా వ్యాపించి యున్న అనంతుడు మాత్రమే. విశ్వపరిధిని దాటి వ్యాపించియున్న దైవము యిక్కడ కూడా ఉన్నాడుకదా! ఆయన ప్రపంచమున సంభవించే సర్వ సంఘటనలయందు, ముసుగులో మనయందు కప్పబడినా, సర్వత్రా వ్యాపించి యున్నాడు. ఆయన విశ్వసాక్షిగా, విశ్వగ్రహీతగా ఒక కర్మసాక్షిగా ఉన్నాడు. మన చేత చేయబడిన కర్మలు, మన ప్రయత్నాలు, మన తొట్రుపాటులు, పాపకర్మలు, ఎరుక ఉన్నా లేక పోయినా కలిగే సాధక బాధకాలు, మోసముద్వారా కన్నవి, కలిగే ప్రాప్తి ఫలితములు, ఆ దేవదేవుని చేతనే పర్యవేక్షించబడుచున్నవి. ఆయన ప్రదర్శించే అసంఖ్యాక రూపాల్లోనున్న సర్వాంతర్యామికే తిరిగి సమర్పించబడుచున్నవి. ఏ రూపాన్నైనా ధ్యానిస్తూ, ఏభావమునైనా ప్రకటిస్తూ ఆయనను సమీపిస్తే, తిరిగి అదే భావనను అదే రూపమును కనబకుస్తూ త్యాగాన్ని స్వీకరిస్తారు.

CWM 23:110

మన చేతనకు చెందిన ప్రతి కదలికను, ప్రతి క్షణమును నిరంతరాయముగా పరమాత్మకు సమర్పించవలసిందే అను తీర్మానమును సంకల్పించాలి. మన కర్మ పరిమాణమున అతి స్వల్పమైనదైనా, ఘనమైనదైనా, అసాధారణమైనదే అయినా ఆయనకు సమర్పించబడ దగ్గవనీ భావించాలి. లోనా పైనా మన వ్యక్తిగత స్వభావము

తదేక భావనతో, మన పరిధికి ఆవలనున్న ఒక విశేష అస్తిత్వానికి — అది మన అహంకన్నా గొప్పదేనని నమ్మికతో — అంకితమై ఉండాలి. కనుక ఎటువంటిదైనా కావచ్చు, మన చేతనే బహూకరింపబడవచ్చు — అయితే ఆ విషయము ప్రధానము కాదు. కాగా అన్ని జీవరాసులయందు అంతర్యామిగా నున్న దివ్యాత్మ కే సమర్పణ చేస్తున్నామనే ఎరుక ఆ చర్యలో నుండాలి.

CWSA 23: 24:111

శ్రీఅరవిందులు

కృతజ్ఞతను తెలుపుటకు ఉత్తమోత్తమ మార్గము

అహంకారమును జయించి మనము పరిణామము చెందుటకు తగు విధముగా నిరంతరము ప్రయత్నము చేయాలి. కృతజ్ఞతనుతెలుపుటకు యిదే ఉత్తమ మార్గము. మానవుని అహంకారము, యింతవరకు ఎవ్వరూ పరిణామము చెందలేదు అనే కుంటిసాకు చూపి, పరిత్యజింపబడనీయదు. అదే నీచ స్వభావమున్నవారి బలమైన వాదన. కానీ యితరులు ఏంచేస్తే తనకేమని, తాను మొదట పరిణామము చెందవలెననే లక్ష్యమును పాటించాలి.

ఐతే, సుఖశాంతులను పొందటానికి ఏకైక మార్గం అహంకారమును విడనాడాలనే సూత్రమును వ్యక్తులు తెలుసుకుంటే, తాము ప్రయత్నము చేస్తామని అంటారు. ఈ విధమైన నమ్మిక వారిలో ఉదయించాలి.

ప్రతివారికి మరీమరీ ఏమని విజ్ఞప్తి చేయాలంటే:

నీలో నున్న అహంకారాన్ని రద్దు చెయ్యి. అప్పుడు శాంతి నీలో తనకుతాను గా స్థిరపడుతుంది. శ్రద్ధతో కూడిన ఆకాంక్షకు దైవసహాయము ఎల్లప్పుడూ అందుతుంది.

CWM 16: 428

పూర్ణ విశ్వాసము మరియు కృతజ్ఞతలతో దైవమునకు సమర్పణ చేయుట

జీవితంలో మనకు కష్టాలు ఎందుకొస్తాయంటే, మనకు కావలసిన సహాయంకొరకు, పూర్ణవిశ్వాసంతో, ఒక్క దైవముపైన మాత్రమే ఆధారపడము. ఈ వాస్తవాన్ని మన భౌతిక చేతన ప్రధానంగా ఆకళింపు చేసుకోవాలి.

దైవము మాత్రమే, విశ్వప్రకృతియొక్క పని విధానము నుండి మనల్ని విడుదల చేయగలదు. రానున్న నూతన సంతతి ఆవిర్భావమునకు, దాని ప్రగతి కొరకు ఈ విముక్తి, జరుగవలసిన అనుల్లంఘనీయమైన షరతు.

పూర్ణ విశ్వాసంతో, కృతజ్ఞతతో, దైవానికి మనం సమర్పించుకున్నప్పుడు మాత్రమే కష్టాలను అధిగమించ గలం.

CWM 16, 438

కృషి ద్వారా ప్రాప్తించు ప్రేమ, ఆనందము కొరకు ప్రయత్నించు

ప్రశ్న: శ్రీమాత! ముందుకంటే, ఒక విషయం బాగుండాలని ప్రయత్నించునపుడు ఒక్కొక్కమారు అందులో పురోగతి కనిపించదు, ధైర్యము కోల్పోతాము. ఏం చేస్తే ఉత్తమం అవుతుంది?

సమా: అధైర్యపడకూడదు! నిరాశపడితే ముందుకు పోలేవు. మొట్టమొదట నీకు నీవు చెప్పవలసిందంతా ఏమంటే, నీవు నీ కృషిలో ప్రగతిని సాధిస్తున్నావో లేదో చెప్పలేని స్థితిలో నున్నానని. చాలసార్లు స్థబ్దతలోనున్నట్లు గోచరించే స్థితి ఒకటి వస్తుంది. అది దీర్ఘ మైనదేగాని అంతము లేనిది మాత్రము కాదు. అది ముందడుగు వేయడానికి చేయు ప్రయత్నము, ఒక ఏర్పాటు మాత్రమే! ఒకానొక కార్యం తల పెట్టినపుడు అది ఎటువంటి పురోగతి లేక వారాలు, నెలలు దొర్లిపోయి, మనం పడి గాపులు పడివుంటాము. కాని అదంతా ఏమీ కాదనిపించేటట్లు ఇన్నాళ్ళు కేవలం రంగం తయారుచేస్తున్నామనేటట్లు హఠాత్తుగా ఒక పరిష్కారం లభిస్తుంది, అనేక చిక్కులు వీడినాయన్నట్లు తోస్తుంది.

తలిమ్మా విషయాలపట్ల యోగసాధనలో ఏ భావన కలిగి ఉంటామో అదే రీతిలో ప్రయత్నం పట్ల ప్రేమ ఉండాలన్నట్లుగా ప్రగతి కొరకు ప్రయత్నం చేయాలి. కర్మఫలం ఏమైనా, ఒక ప్రయత్నం వలన లభించు ఆనందము, పురోగతికై చూపే ఆకాంక్ష తృప్తి నిస్తాయి. యోగమార్గమున వ్యక్తి చేయు ప్రతి ప్రయత్నమును అందువల్ల వచ్చే ఆనందముకొరకు చేయాలి. అంతేగాని తను ఆకాంక్షించే ఫలితాన్ని దృష్టిలో పెట్టుకొని చేయరాదు.... జీవితంలో గాని, ఎల్లప్పుడు చేసే పనిపాట్లలోగాని రాబోయే ఫలితం మనకు చెందదు. మనము ఎప్పుడూ సరియైన దృక్పథంతో ఉండాలంటే, కర్మను తప్పక నిర్వర్తించాలి, స్పందించాలి. యోచించాలి, చేసే

ప్రయత్నాన్ని సహజంగా చేయాలి, ఎందుకంటే అలాగే మనం చేయాలి. మరి రావలసిన ఫలితాన్ని ఎదురుచూస్తూ కాదు.

ఫలితం గురించి ఆలోచించుట ప్రారంభించగనే, దైవంతో బేరసారాలకు దిగుతాము. ఇక మనం చేసే ప్రయత్నం నుండి శ్రద్ధ జారిపోతుంది. ప్రగతిని సాధించాలని ప్రయత్నం చేస్తావు. నీ అంతరంగంలో దాని అవుసరాన్ని గుర్తిస్తావు కాబట్టి ప్రయత్నం చేయటం ప్రగతిని సాధించటం అనేది తప్పనిసరి ఆవశ్యకములు. కాబట్టి ఈ ప్రయత్నాల్ని నీలో నున్న దివ్యచేతనకు ఒక కానుకగా అర్పించాలి. విశ్వమునందు వ్యాపించి యున్న చైతన్యం కూడా అదే, అప్పుడు కృతజ్ఞతను తెలియజేయడం మరి నిన్ను నీవు సమర్పించుకోవటం అనేది నీ స్వభావంగా మారుతుంది. ఆ స్థితిలో ప్రగతిని సాధించటమా లేదా అనే విషయం అంత ముఖ్యమని తోచదు. పురోగతిని సాధించుటకు సమయమాసన్న మైందని నిర్ణయింపబడితే నీవు ప్రగతిని సాధిస్తావు. అంతేకాని ప్రగతిని సాధించాలని నీవు కోరితే మాత్రము సాధించలేవు.

నీవు పురోగతిని చెందాలని అభిలషించి, నిన్ను నీవు నిగ్రహించుకొని, కొన్ని లోపాలను, కొన్ని అసమగ్రతలను, అవలక్షణాలను, అసంపూర్ణతలను అధిగమించాలని, నీవు చేసే ప్రయత్నానికి సత్వర ఫలితాలు రావాలని ఆశించినా, నీ ప్రయత్నంలో శ్రద్ధ లోపించి, అదంతా తుదకు ఒక వ్యాపార ఒడంబడికగా పరిణమిస్తుంది. నీవు అంటావు, "నేను ఒక ప్రయత్నం చేయబోతున్నాను, అందుకు ప్రతిగా నాకు యిది కావాలి!" అంటే నీది సహజ ధోరణి కాదు. నీ చర్య అసంకల్పితము ఎంత మాత్రము కాదన్నమాట.

ఇక్కడ రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. ఒకటి, ఫలితం ఎలా ఉండాలని నిర్ణయించగలిగే సమర్థత మనకు లేదు. రెండు, మన నమ్మికను దైవమునందు నిలిపి యిలా అంటే...

"నాకున్న దాన్నంతటిని సమర్పించాలను కుంటున్నాను, నే నివ్వగలిగేది ప్రయత్నము, ఏకాగ్రత. కాగా అందుకు ప్రతిగా నా కేమి అనుగ్రహించాలను విషయము దైవమే తెల్పాలి, లేక ఏమైనా నాకు అసలు అనుగ్రహించాలా మరి ఫలితము ఎట్లుండవలెనను విషయము కూడా నాకు తెలియదు"

మనలో ఒక మార్పును తీసుకురాబోయే ముందు, రూపాంతర పరిణామము సాధించే ముందు మార్గ నిర్దేశనము యివ్వబడిందా లేక మార్పు ఏ రూపమును

పోలియుండవలెనో నను కల్పన కలిగిందా? లేనే లేదు. కాబట్టి అదంతా ఒక ఊహా గానము. మరి పొందదలచిన ప్రయత్నాన్ని కూడా చాలా పరిమితం చేస్తాము. ఎంత అంటే, అది ఏదో తక్కువ స్థాయికి చెందినదో, నీచమైనదో, తేలికపాటిదో, అప్పటికేది ప్రస్తుతమనబడునో అటువంటి రూపమును చెందుతుంది. ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేము. తెలియదు. ఎట్లుండాలనే కల్పన కూడా ఉండదు దాన్ని తరువాతే తెలుసుకొంటాము.ఒక మార్పు సంభవించునప్పుడు సింహావలోకనం చేసి అంటాము:

" అహ్! అదే... అదే దిశగా ప్రయత్నం చేసేవాడిని" — ఏమైనా అసలు విషయం తరువాతనే తెలుస్తుంది. ముందున్నదంతా, ఒక అస్పష్ట ఊహాగానమే, చాలా పేలవంగా ఉంటుంది. కుర్రకారు భావనలా ఉంటుంది. మనం గనుక వాస్తవ ప్రగతితో ఈ భావనను సరిపోలిస్తే!

అంచేత మనం అనవలసిందేమంటే:

మనకు ప్రధానంగా ఆకాంక్ష ఉంది. కాని ఏ ఫలితమును మనము సాధించాలో మనకు తెలియదు. దైవము మాత్రమే అది తెలుసుకొనగలుగును.

తదుపరి దైవముతో యిలా చెప్పామనుకోండి:

"నా ప్రయత్నము అంతా మీ కొరకేకాని, నా ప్రయత్నమునకు ప్రతిఫలంగా నేను ప్రగతిని సాధించాలి. అలా జరుగకపోతే మీకు నేను ఏమి యివ్వను". ఇది అంతా ఒక బేరం అవుతుంది. అంతే!

*

మరోలా చేయలేనపుడు ఒక అసంకల్పిత చర్య తడుతుంది. ఆ చర్యనే సదుద్దేశంతో, సమర్పణా భావంతో చేసినట్లయితే దానికి నిజంగా కొంత విలువ వుంటుంది.

(CWM: 316-18) శ్రీమాత

ఓ కృతజ్ఞతా! మూత బడిన అన్ని తలుపులను తెరిపించి కాపాడే అనుగ్రహాన్ని లోపలిదాకా చొరబడనిచ్చేది నీవే.

శ్రీమాత

అనువాదం: డా. దామెర వెంకటేశ్వరరావు

శ్రీఅరవిందులను కృతజ్ఞతా పూర్వకంగా జ్ఞప్తి చేసుకొనుట

శ్రీఅరవిందుల స్మృతిపై ధ్యాస నిలపాలి:

ఈ సాయంత్రం "ప్రశ్నలు- జవాబులు" ఉండవు. శ్రీఅరవిందులను గుర్తించుకోవడం ఎలా అనే అంశంమీద నేను ధ్యాస నిలుపుతాను. వారు మనకు చేసిన, చేస్తున్న సత్కార్యానికి వారి జ్ఞాపకాలను ఎలా సజీవంగా వుంచుకోవాలో తెలుసుకుందాము.

నిజానికి శ్రీఅరవిందుల చేతన ఇంకా సజీవంగా, ప్రకాశవంతంగా, క్రియాత్మకంగా పనిచేస్తూనే వుంది. దీన్ని సాధించి చూపటానికే ఆయన భూమ్మీద అవతరించారు. వారి సత్కార్యం ఇంకా కొనసాగుతూనే వుంది. రేపే వారి జన్మ దినోత్సవం. చరిత్రలోనే ఇది చిరస్మరణీయమైన సుదినం.

CWM 9:172

శ్రీఅరవిందుల బోధనలను బాగుగా అర్థం చేసుకొని ఆచరణలో పెట్టాలి:

నిజానికి వారి బోధనలను ఇంకా బాగా అర్థం చేసుకొని ఆచరించటమే వారికి మనం అర్పించగల నిజమైన నివాళి. ఇదే సరియైన కృతజ్ఞతాభావం. వారు భూమ్మీద ఆవిష్కరింపజేసిన వెలుగు, విజ్ఞానం, శక్తి అసామాన్యమైనవి. వారి బోధనలు మనలను ఉత్తేజపరచి మార్గదర్శనం చేయుగాక!

మనం ఇప్పుడు సాధించలేనివి రేపు సంభవించవచ్చునుగదా! అందరం సరియైన, తీవ్రమైన వైఖరిని అవలంబిద్దాం. అదే శుభకరమైన నూతన సంవత్సరారంభం అవుతుంది.

CWM 12:16

మన జీవితాలను మన ఆదర్శాలను అందరికీ అదర్శప్రదంగా మార్చుకున్నప్పుడే శ్రీఅరవిందులకు నిజమైన కృతజ్ఞత ప్రకటించినవారమవుతాము. వారి మార్గం

అనుసరించాలంటే కొన్ని అత్యావశ్యకమైన లక్షణాలు, సద్గుణాలు మనలో వుండాలి.

CWM 13:28

నిజమైన 'ఆశ్రమవాసి' అనేవాడు దివ్యజీవనం ద్వారా పరమాత్మ సేవలో తన జీవితాన్ని అర్పించుకొనేవాడే అనేది సరియైన నిర్వచనం అవుతుంది. ఇందుకు నాలుగు సద్గుణాలు కావాలి. అవి తప్పని సరి. లేకపోతే అసలు అభివృద్ధే ఉండకపోవచ్చు. లేక ప్రారంభంలోనే ఆటంకాలు, అంతరాయాలు ఎదురు కావచ్చు. ఆ సద్గుణాలే నిజాయితీ, విశ్వాసము, నమ్రత, కృతజ్ఞత.

ప్రశ్న: శ్రీమాతా, "నిజమైన ఆశ్రమబిడ్డ" అనిపించుకోవాలంటే ఏ సద్గుణాలు అవసరం?

సమా: అవి నిజాయితీ, ధైర్యం, క్రమశిక్షణ, సహనం, దైవంపై అచంచల విశ్వాసం, దైవానుగ్రహంపై అప్రతిహత నమ్మకం, వాటితో అంటిపెట్టుకొని అంకురిత ఆకాంక్ష, అనంతమైన సహనం కూడా అవసరమే.

శ్రీమాత

అనువాదం: కె.ఆర్.ఎల్. ఎన్. రావు

నీవు నిత్యం నీ ప్రార్థనలను వ్రాసిపెట్టుకో. నీ ఆకాంక్షను, కృతజ్ఞతను, భక్తి విశ్వాసాలను, సాధించాలనుకున్న అభివృద్ధిని మరవద్దు. కొన్ని వాక్యాలు వ్రాసినా చాలు. క్రమేణా నీకే అర్థమవుతుంది. నాతోనూ, నీ దైవంతోనూ ముఖాముఖీగా మాట్లాడుతున్న భావన కలుగుతుంది. ఒక విధమైన ఆత్మీయత నీలో జనిస్తుంది.

అనువాదం: కె. ఆర్. ఎల్. ఎన్. రావు

కృతజ్ఞతా సూత్రాలు

మీకు కలిగిన కష్టాలన్నిటికీ కృతజ్ఞులై ఉండండి. అదే భగవంతుడికి దగ్గర దారి.

*

మీ హృదయం ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. అంటే దాని నెప్పుడూ కృతజ్ఞతతో నింపి ఉంచండి.

కృతజ్ఞతా భావన భగవంతుణ్ణి చేరుకోవటానికి కచ్చితమైన మార్గం.

*

నేనిచ్చినది సంతోషంగా స్వీకరించటం స్వార్థం కాదు. అహంకారానికి ఆనందభరితమైన కృతజ్ఞతను మించిన చికిత్స లేదు.

*

మీకు భగవంతుడు ఏమి యిచ్చాడో దానిని ఎల్లప్పుడూ సంతోషంగా స్వీకరించండి.

*

మీలో కృతజ్ఞతా భావాన్ని సదా నింపి ఉంచుకోవటం కష్టమే. కొంత సమయం వరకు అది ఎంతో తీవ్రంగా నుంటుంది. అటు తరువాత వుండదు. మీరు ఎంత కృతఘ్నులయినా భగవంతుడు అన్నీ సహిస్తూనే ఉంటాడు. ఎందుకంటే ఆయనకు పూర్తిగా అన్నింటి యొక్క — ఎలా? ఎందుకు? ఎక్కడనుండి? అనే సమాచారం తెలుసు గనుక. నువ్వొక పనిని ఎందుకు చేస్తున్నావో ఆయనకు తెలుసు. జరుగుతున్న కార్యాచరణ అంతా తెలుసును గనుక ఆయన అన్నింటిని సహించగలడు.

*

ఒక వ్యక్తి ఔన్నత్యం ఆ వ్యక్తి కృతజ్ఞతా పరిణతిని బట్టి కొలువబడుతుంది.

CWM 14:25, 154-55

శ్రీమాత

అనువాదం: డా. సరోజాప్రసాద్

దైవ సందేశము



అఖిల

అఖిల భారత పత్రిక – జూలై 2015


విషయసూచిక

విజ్ఞప్తి: ఏ విషయమైతే లిఖించబడి, సంతకం చేయబడిందో, ఆ విషయం అంగీకరించబడి, ఆమోదించబడిందని ఆ సంతకం తెలియజేస్తుంది. దానికి తోడు, సంతకం చేసినవారి పేరులో నున్నటువంటి అతీంద్రియశక్తి యొక్క వాస్తవికతను కూడా ఆ సంతకం రూఢీ పరుస్తుంది. శ్రీమాతగాని, శ్రీఅరవిందులుగాని ఏదైనా సంతకం చేసారంటే అది కేవలం లాంఛనప్రాయం కాదు. వారి ఇతర చర్యల మాదిరిగానే వారి సంతకం కూడా భూలోకానికి, మానవజాతికి ఒక అపూర్వమైన ఆశీర్వాదం, ఒక దివ్యానుగ్రహం, ప్రస్తావించబడిన విషయం ఈడేర్చబడుటకు వారి పేరులో నున్న అతీకశక్తి యొక్క ధృవీకరణ. అంతేగాక ఒక దైవికమైన, ఉన్నతమైన, పై స్థాయికి చెందిన జీవితాన్ని ఆకాంక్షిస్తున్న వ్యక్తికి, మానవజాతికి అనుకూల్యతను చాటడం, మంత్రగర్భితమైన వారి వాక్కుపై భగవంతుని ఆమోదముద్ర వేసి దాని శక్తిని ఇనుమడింప చేయటం. శ్రీమాత తమ సంతకంలోని గమనించతగ్గ విషయాన్ని "భగవంతుని వద్ద నుంచి అరుదెంచే దైవానుగ్రహ వార్తాహరి" అని వివరించారు.

ఈ సంచికలో, వివిధ సందర్భాలలో శ్రీమాత స్వదస్తూరిలో వ్రాయబడి, సంతకం గావించబడిన కొన్ని సందేశాలను ప్రచురిస్తున్నాం. ఆ కారణంగా ఈ సంచిక ఒక ప్రత్యేకతను ఆపాదించుకున్నది; మాసంలో ప్రతి దినం అంతఃకరణతో విశ్లేషించి, ధ్యాస నిలుపడమే గాక, రోజువారీ జీవనంలో ఆచరించతగ్గ ఆలోచన ప్రస్తావన గలది.

పాఠకులు శ్రీమాత ప్రవచనాల సారాన్ని ఆస్వాదించి, తమ దినచర్యలో భాగంగా మననం చేసుకోగలరని ఆశిస్తున్నాము.


MIRA.


tail
the other wing
the bird
one wing
The bird of Grace messenger from the Supreme

అమ్మ సంతకం

ఇది అమ్మ సంతకం యొక్క రేఖాప్రతిరూపం. "మహా శాంతివిహంగ భూలోక అవరోహణ" అని దీని భావం. దాని రెక్కలు భూమి వైపుగా ఒరిగి వున్నాయి. అది భూమికి దిగివస్తున్నది. దాని రెక్కలు ఏ కోణంలో ఒరిగి వున్నాయో, అది ఏ విధంగా పృథ్వీతలం వైపు దిగివస్తున్నదో చూడు. దాని రాక మహాశాంతిని కొని వచ్చుటకు; అది మహాశాంతి వార్తాహరి, మహాశాంతి విహంగం పృథ్విపైకి దిగివచ్చుట. గమనించావా?...

ఇప్పుడు, ఈ పక్షి ఈ సంతకానికి ఎలా పోలి వున్నదో వివరిస్తాను. చూడు, ముందుగా ఇక్కడ తోక యొక్క రెండు కొసలు వున్నాయి. దానిని నేను రెక్కలా పొడిగించాను. అది ఒక వంపు తిరిగిన రేఖలా కనిపిస్తుంది. నీవు పక్షుల తోకలను చూసి వుంటావు. అవి ఈ విధంగా వుంటాయి....

ఆ విధంగా, తోకయొక్క ఈ రెండు కొసలు ఒక రెక్క కలిసి పక్షియొక్క ఒక భాగం. ఇది మరొక రెక్క. ఆ రెక్కలు విశాలమైనవి. ఇవి కన్నులు, ఈ రెండుచుక్కలు వాటికి సంకేతాలు. ఇక్కడ తల వుంది.

పక్షి దూరంగా కనిపించినట్లుగా వుంటుంది. అందువల్ల మెరిసే కళ్ళు మాత్రమే కనిపిస్తాయి గాని ఆకారం పూర్తిగా కనిపించదు. దాని రెక్కలు విశాలమైనవి, ఈ మాదిరిగా ఒక పక్కకు ఒరిగి వున్నాయి. అందువల్ల దాని శరీరం మరుగుపరచబడింది. దాని శరీరం కనిపించదు, దాని విశాలమైన రెక్క వెనుక దాచబడింది. దూరంనుంచి చూస్తే దాని కళ్ళు, ముక్కు మాత్రమే కనిపిస్తాయి. అందుకు కారణం కళ్ళు మాత్రమే మెరుస్తుంటాయి గనుక. కళ్ళు ఆత్మకు ప్రతిబింబాలు. కళ్ళే ముఖ్యమైనవి. ఆ కారణంగా విషయం ఈ విధంగా నుంటుంది: తోక ఒక రెక్కతో కలుస్తుంది. ఇది మరొక రెక్క, ఈ రెండు చుక్కలు కళ్ళు.

ఇది మహాశాంతి విహంగం భూమికి దిగివచ్చే దృశ్యానికి సంకేతాత్మక ప్రతి రూపం. ప్రతిసారి పక్షి పూర్తి రూపాన్ని చిత్రించే బదులు దాని సంకేతాత్మక రేఖా చిత్రాన్ని నేను రూపొందించాను. ఎగురుతూ భూమి వైపుగా దిగివస్తున్న పక్షి దృశ్యం నీవు స్పష్టంగా చూడగలవు. అది ఇంకా దూరంగా వుంది కాని ఏదో ఒక నాడు భూమిగి దిగివస్తుంది. అప్పుడు అంతటా ప్రశాంతియే. ఇదీ నా సంతకంలో

గమనించదగ్గ విషయం.

ఆ పక్షి మరో ప్రపంచం నుండి మహాశాంతిని ఇక్కడికి కొనితేవడానికి క్రిందకు వస్తున్నది.

(మోనా సర్కార్ వ్రాసిన 'Luminous Notes' నుండి శ్రీమాతతో సంభాషణల అనువాదం)

Do not take my words for a teaching. Always they are a force in action, uttered with a definite purpose, and they lose their true power when separated from that purpose.

నా మాటలను ఒక ఉపదేశంగా తీసుకోకు. అవి ఎల్లప్పుడూ క్రియాశీల శక్తియుక్తమై ఒక కచ్చితమైన ప్రయోజనం కోసం ఉచ్చరించబడతాయి. వాటిని ఆ ప్రయోజనానికై ఉద్దేశింపబడినవిగా గాక వేరుగా భావిస్తే అవి వాటి యదార్థశక్తిని కోల్పోతాయి.

CWM 13:53

In the night as in the day be always with me.

In sleep as in waking let me feel in me always the reality of your presence.

Let it sustain and make to grow in me Truth, consciousness and bliss constantly and at all times.

Sri Aurobindo

ప్రార్థనలు


ఒక నిత్య ప్రార్థన

పగటి పూట నున్నట్టుగా రాత్రిళ్ళు కూడా నాతో వుండు. మేల్కొని వున్నప్పటిలాగే నిద్రలో కూడా నీ ఉనికి యొక్క ప్రత్యక్ష అనుభూతి నాలో కలుగనీ.

అది నాలో నిర్విరామంగా కొనసాగనీ, అది మహాసత్యాన్ని, దివ్యచేతనను, మహదానందాన్ని నాలో ఎడతెగకుండా ఎదగనీయనీ.

శ్రీఅరవిందులు

Let the Dawn of the New Year be for us also the Dawn of a new and better life.



ఒక నూతన సంవత్సర ప్రార్థన

నూతన సంవత్సరారంభం మనకో నూతనమైన, మేలైన జీవితానికి ఆరంభమగు గాక

CWM 15:182

*Let us work as we pray,
for indeed work is the body's
best prayer to the Divine.*

పని శారీరక ప్రార్థన

మనం ప్రార్థిస్తూనే పనిని నిర్వర్తించెదము గాక. పని అంటే దైవాన్ని గురించి చేసే అత్యుత్తమమైన శారీరక ప్రార్థన

CWM 14:299

The prayer of the cells
in the body.

Now that, by the effect of the Grace, we are slowly emerging out of inconscience and waking to a conscious life, an ardent prayer rises in us for more light, more consciousness,
"O Supreme Lord of the universe, we implore Thee, give us the strength and the beauty, the harmonious perfection needed to be Thy divine instrument upon earth."

M.

శరీర కణాల ప్రార్థన

దైవానుగ్రహ ప్రభావంతో మనం అజ్ఞానమయస్థితి నుండి నెమ్మదిగా ఒక చేతనామయ జీవనంలోకి మేల్కొంటున్నందున, ఒక అధికమైన వెలుగుకై, మరింత ఉన్నతమైన చేతనకై మనలో ఒక తీవ్రమైన ప్రార్థన ఉత్పన్నమవుతుంది: "ఓ జగత్ ప్రభూ, ఈ పృథ్విపై మీకు దివ్యమైన ఉపకరణాలుగా నుండటానికి అవసరమైన సామరస్యపూర్వక సమగ్రతను, శక్తిని, చక్కదనాన్ని ప్రసాదించమని వేడుకొంటున్నాము."

CWM 11:91

Is the aim of life to be happy?

This is just putting things topsy-turvy.

The aim of human life is to discover the Divine and to manifest It. Naturally this discovery leads to happiness; but this happiness is a consequence, not an aim in itself. And it is this mistake of taking a mere consequence for aim of life that has been the cause of most of the miseries which are afflicting human life.

ముఖ్యోద్దేశం

జీవిత లక్ష్యం

సుఖసంతోషాలను పొందటమే జీవితం యొక్క లక్ష్యమా?

ఈ భావన కేవలం అసలు విషయాలను తలక్రిందులు చేయటమే.

మానవజీవిత లక్ష్యం దైవాన్ని కనుగొని ఆ దైవత్వాన్ని వ్యక్తపరచటమే. ఈ ప్రక్రియ సుఖసంతోషాలకు దారితీస్తుంది; అయితే సుఖసంతోషాలు పర్యవసానమేగాని స్వయంగా పరమార్థం కాదు. ఈ విధంగా కేవలం ఒక పర్యవసానాన్ని జీవిత పరమార్థమని పొరపడటమే మానవజీవితాన్ని దుఃఖభాజితం గావించే అనేకానేక దురదృష్టకర పరిస్థితులకు మూలకారణ మవుతుంది.

CWM 12:311-12

There is a purpose in life — and it is the only true and lasting one — The Divine

Turn to Him and the emptiness will go.

Blessings

యదార్థమైన, శాశ్వతమైన జీవిత ప్రయోజనం

జీవితానికి ఒక ప్రయోజనముంటుంది — అదొక్కటే యదార్థమైనది, శాశ్వతమైనది — దైవికమైనది. దైవం వైపు మరలు, నిస్సారభావన తొలగిపోతుంది.

ఆశీర్వాదాలు

CWM 14:6

1951

Lord, we are upon earth to accomplish Thy work of transformation. It is our sole will, our sole preoccupation. Grant that it may be also our sole occupation and that all our actions may help us towards this single goal.

ఏకైక లక్ష్యం

ప్రభూ, మేము భూమిపై మీ రూపాంతరీకరణ కార్యక్రమాన్ని నిర్వర్తించడానికే వున్నాము. అదే మా ఏకైక సంకల్పం. ఆ లక్ష్యసాధనలోనే మేము నిమగ్నులమై వున్నాము. అదే మా ఏకైక వృత్తి అగుటకు, మా చర్యలన్నీ ఆ లక్ష్యసాధన కుపరించేలా అనుగ్రహించు.

CWM 13:8

Freedom does not come from outer circumstances but from inner liberation. Find your soul, unite with it, let it govern your life and you will *be free*

blessings

స్వేచ్ఛ

నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటి

స్వేచ్ఛ అనేది అంతరంగ విముక్తి వలన తప్ప బాహ్యపరిస్థితుల వలన సమకూరదు. నీ ఆత్మను కనుక్కో, దానితో తాదాత్మ్యం చెందు, అది నీ జీవితాన్ని శాసించనీ — నీవు స్వేచ్ఛను పొందుతావు.

ఆశీర్వాదాలు

CWM 14:188

All that happens
is to teach us one
and the same lesson. –
Unless we get
rid of our ego
there is no peace
either for ourselves
or for the others –
And without ego
the life becomes
such a wonderful
marvel!...
love M

అహంభావమున్నంత వరకు శాంతికి తావు లేదు

జరిగేదంతా మనకు ఆ పాఠం నేర్పడానికే. మనం మన అహంభావం త్యజించితే తప్ప మనకుగాని, ఇతరులకుగాని, శాంతి చేకూరదు. అహంభావరహిత జీవితం ఎంత ఆశ్చర్యకరమైన అద్భుతమౌతుంది!...

ప్రేమతో

CWM 17:294

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

Never worry –
Do with sincerity all
you do and leave the
results to the Divine's
care.

ఎప్పుడూ దిగులు పడవద్దు

నీవు చేసేదంతా చిత్తశుద్ధితో చేయి,

ఫలితాలు దైవానికే వదిలివేయి.

CWM 14:222

5-3-59

Turn your mind completely away from your difficulty, concentrate exclusively on the Light and the Force coming from above; let the Lord do for your body what He pleases. Hand over to Him totally the entire responsibility of your physical being.

<u>This is the cure.</u>

With my blessings

వ్యాధి నివారణ

నీ మనస్సును ఇక్కట్ల నుంచి పూర్తిగా దూరంగా మరల్చు, పైనుంచి వచ్చే మహాప్రకాశము, మహాశక్తుల మీద ప్రత్యేకించి ఏకాగ్రం చేయి, మహాప్రభువు నీ శరీరానికి ఏమి చేయడానికి ఇష్టపడతాడో ఆయనను దానినే చేయనీయి, నీ భౌతిక అస్తిత్వం పూర్తి బాధ్యతను మొత్తం ఆయనకే అప్పజెప్పు.

ఇదే నివారణ.

నా ఆశీస్సులతో

CWM 15:150

Be simple,
Be happy,
Remain quiet,
Do your work as well as you can,
Keep yourself always open towards me –
This is all that is asked from you.

సాధన

రోజువారీ కార్యక్రమం

నిరాడంబరంగా ఉండు,
సంతోషంగా ఉండు,
ప్రశాంతతను కలిగి ఉండు,
నీవు చేయగలిగినంత చక్కగా నీ పనిని నెరవేర్చు, నిన్ను నీవు ఎల్లప్పుడూ నాకు ఉన్మీలనం కావించుకుని ఉండు. ఇంత మాత్రమే నీ నుంచి ఆశించేది.

CWM 13:77

What you are not able to do today, you will achieve tomorrow. Persevere and you shall conquer.



పట్టుదల — గెలుపు

ఈ రోజు నీవు చేయలేనిది, రేపు నీవు సాధించగలవు. పట్టుదలతో ఉండు, నీవు గెలిచి తీరుతావు.

CWM 14:163

To express Harmony,
of all Things
Simplicity
is the best.

సామరస్యత — నిరాడంబరత

సామరస్యత అభివ్యక్తీకరణలో,

నిరాడంబరత అన్నింటిలోకి అత్యుత్తమం.

CWM !4:151

Love is not sexual intercourse

Love is not vital attraction and interchange.

Love is not the hearts hunger for affection.

Love is a mighty vibration coming straight from the One, and only the very pure and very strong are capable of receiving and manifesting it.

To be pure is to be open only to the Supreme's influence and to no other.

ప్రేమ — పవిత్రత

ప్రేమ లైంగిక సంపర్కం కాదు.
ప్రేమ ప్రాణికమైన ఆకర్షణ, ఇచ్చిపుచ్చుకోలు కాదు.
ప్రేమ మానసిక ప్రీతి కోసం పడే హృదయోద్వేగం కాదు.
ప్రేమ ఏకం నుంచి సరాసరి వచ్చే గొప్ప ప్రకంపన;
కేవలం ఎంతో పవిత్రులు, అతి దార్ఢ్యులు మాత్రమే దానిని అందుకొనుటకూ, అభివ్యక్తతకూ సమర్థులు.
పవిత్రంగా ఉండటమంటే కేవలం పరమేశ్వరుని ప్రభావమునకు మాత్రమే ఉన్మీలనమవటం, మరి ఏ ఇతరమునకూ కాదు.

CWM 14:25-26

Do you know what is true love?

There is only *one* true love, the love *from* the Divine, which, in human beings, turns into love *for* the Divine.

Shall we say that the nature of the Divine is Love.

నిజమైన ప్రేమ

నిజమైన ప్రేమ ఏమిటో నీకు తెలుసా?

ఉన్నది కేవలం ఒకటే నిజమైన ప్రేమ, దైవం నుంచి పొందే ప్రేమ. అదే, మానవులలో దైవం ఎడ ప్రేమగా మరలుతుంది. దైవం యొక్క ప్రకృతి మహాప్రేమే అని మనం చెప్పుకోవచ్చు.

CWM 12:305

Love is with all,
working for the
progress of each
one equally —
but it triumphs
those who care
for it.

Love

అందరి యెడల మహా ప్రేమ

అందరి యెడల మహాప్రేమతో, ప్రతి వ్యక్తి పురోభివృద్ధికీ సమానంగా పనిచేస్తూ — కాని, అది ఘనవిజయమందేది, ఎవరైతే దానిని గురించి శ్రద్ధ వహిస్తారో వారికే.

ప్రేమతో

CWM 17:272

From the standpoint of Yoga it is not so much what you do but how you do it that matters most.

మనం ఎలా చేస్తామో అనేదే మనం ఏమి చేస్తామనే దానికన్నా ముఖ్యం

యోగ దృక్పథంలో నీవు ఏం చేస్తావనేది అంత ప్రాముఖ్యమైనది కాదు, కాని నీవు దానిని ఎలా చేస్తావనేది అత్యంత ప్రాముఖ్యమైనది.

CWM 14:36

No joy can be greater
than that of serving the Divine

ఏ సంతోషమూ దైవానికి సేవ చేయడం కన్నా అధికతరమైనది కాజాలదు.

CWM 14:104


Above all preferences
we want to be at the
service of the Divine.

దైవానికి సేవ చేయటంలోని ఆనందం

మన ఇష్టములు, అయిష్టముల కన్నింటికీ అతీతంగా దైవసేవాబద్ధులం కావాలని మేము కోరుకుంటున్నాం.

CWM 14:104

He who lives to serve
the Truth is not affected
by outward circumstances.



మహాసత్య సేవనం

ఎవరైతే మహాసత్యమునకు సేవ చేయటానికి జీవిస్తారో వారు బాహ్యపరిస్థితులకు ప్రభావితులు కారు.

CWM 14:232

To come closer to the Truth, you must often accept not to understand.

మహాసత్యమునకు చాలా దగ్గరగా

మహాసత్యమునకు చాలా దగ్గరగా చేరటానికి, నీవు తప్పకుండా తరచు అవగాహన చేసుకోకుండా ఉండటానికి ఔదలదాల్చు.


CWM 14:197



OM Tat Sat Jyoter Aravinda

ॐ तत् सत् ज्योतिररविन्द

What Sri Aurobindo represents in the world's history is not a teaching, not even a revelation; it is a decisive action direct from the Supreme




శ్రీఅరవిందులు

పరమేశ్వరుని నుంచి నిశ్చయాత్మకమైన చర్య

ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందులు ప్రాతినిధ్యము వహించింది బోధకు కాదు, దివ్యజ్ఞాన మందించుటకు కూడా కాదు; అది సరాసరి పరమేశ్వరుని నుంచి వచ్చిన నిశ్చయాత్మకమైన చర్య.

CWM 13:4

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ


Sri Aurobindo
is constantly
among us and
reveals himself
to those who are
ready to see and
hear him

Blessings


శ్రీఅరవిందులు నిరంతరము మనతోనే ఉన్నారు

శ్రీఅరవిందులు నిరంతరము మనతోనే ఉన్నారు. సిద్ధంగా వున్నవారికి ఆయనను వినటం, వీక్షించటం కూడా జరుగుతుంది.

ఆశీర్వాదాలు.

CWM 13:11

Lord, this morning Thou hast given me the assurance that Thou wouldst stay with us until Thy work is achieved, not only as a consciousness which guides and illumines but also as a dynamic Presence in action. In unmistakable terms Thou hast promised that all of Thyself would remain here and not leave the earth atmosphere until earth is transformed. Grant that we may be worthy of this marvellous Presence and that henceforth everything in us be concentrated on the one will to be more and more perfectly conse-crated to the fulfilment of Thy sublime Work.



ప్రభువు యొక్క నమ్మకమైన వాగ్దానం

ప్రభూ, నీవు తలపెట్టిన కార్యం ఫలించేవరకూ మాతోనే వుంటానని ఈ ఉదయం మాకు మాట యిచ్చావు. కేవలం దారి చూపే కాంతిపుంజంలానే కాకుండా, కార్యక్రమాన్ని ముందుకు నడిపించే శక్తిగా కూడా మాతో వుండగలనని వాగ్దానం చేశావు. ప్రపంచం రూపాంతరం చెందేవరకూ భూ పరిధిలోనే సంపూర్ణమైన నీ ఉనికి అందుబాటులో వుండగలదని నిర్ద్వందంగా హామీ యిచ్చావు. ఇందుకు మమ్ములను అర్హులుగా చేయుము. ప్రభూ! అద్భుతమైన నీ చేతనతో నీవు ఆశించిన ఈ దివ్యచేతనా కార్యక్రమం సఫలమయ్యేవరకూ మా సర్వశక్తులూ ఆ సంకల్పం దిశగా కేంద్రీకృతమయ్యేలా ఆశీర్వదించు.

CWM 13:6

The importance of
Savitri is immense.
Its subject is universal.
Its revelation is prophetic.
The time spent in its
atmosphere is not wasted.
Take all the time necessary
to see this exhibition. It
will be a happy compensation
for the feverish haste men
put now in all they do.

10-2-67.

“సావిత్రి” ఘనత — శ్రీఅరవిందులు మానవాళికి అందించిన బహుమానం

“సావిత్రి” యొక్క ప్రాధాన్యత విశేషమైనది. అది విశ్వజనీనం, దాని సందేశం భవిష్యవాణి. దాని ప్రభావంలో ఉన్నంతసేపూ కాలానికే విలువ వచ్చినట్లు. ఎంత సమయమైనా వెచ్చించి ఇది మాత్రం గమనించండి. మానవాళి ఈనాడు ప్రతి విషయంలో ఎదుర్కొనవలసి వస్తున్న “తొందరపాటు” అనే రోగానికి ఇది దివ్యౌషధం!

CWM 13:26



ఏ దోషమూ లేనివారు ఇతరుల అభిప్రాయాలను లెక్కపెట్టరు.


శ్రీమాత

Since the beginning of the earth, wherever and whenever there was the possibility of manifesting a ray of consciousness, I was there.

శ్రీమాత

అనాది నుండి శ్రీమాత ప్రపంచమందు వున్నారు

అనాది నుండి ప్రపంచంలో ఎక్కడెక్కడ చైతన్య కిరణాలు ప్రసరించే అవకాశం ఉందో అక్కడ నేనూ వున్నాను.



Written in Japan – February 1920.

I belong to no nation, no civilisation, no society, no race, but to the Divine.

I obey to no master, no ruler, no law, no social convention, but to the Divine.

To Him I have surrendered all, will, life and self; for Him I am ready to give all my blood, drop by drop, if such is His Will, with complete joy; and nothing in His service can be sacrifice, for all is perfect delight.

పరమమైన సమర్పణ

నేను ఏ యొక్క జాతికిగాని, నాగరికతకుగాని, సంఘానికి లేక తెగకు చెందినదాన్ని కాదు: దివ్యత్వమే నా ఉనికి

నన్ను శాసించే శక్తులు ఏవీ లేవు. పై అధికారికిగాని, ఒక చట్టానికిగాని లేక సాంఘిక కట్టుబాట్లకుగాని నేను విధేయురాలను కాను. నేను కేవలం దైవానికే సంబంధించి వుంటాను.


నా ఇచ్ఛ, జీవితం, ఆత్మ, నా సర్వస్వం నేను ఆ పరాత్పరునికే అర్పించాను. నా రక్తంలో ప్రతి బిందువు తర్పణంగా అర్పించటానికి నేను మహాదానందంతో సంసిద్ధంగా వున్నాను. ఆయన కోసం నేను ఏది చేసినా అది బలిదానం కాదు; అది ఆనంద ప్రారవశ్యం!

CWM 13:138

When in your heart and thought you will make no difference between Sri Aurobindo and me, when to think of Sri Aurobindo will be to think of me and to think of me will mean to think of Sri Aurobindo inevitably, when to see one will mean inevitably to see the other, like <u>one and the same Person</u>, — then you will know that you begin to be open to the supramental force and consciousness.

నీ హృదయంలోగాని, భావనలోగాని, మాలో విభేదాన్ని చూడొద్దు. శ్రీఅరవిందులను తలిస్తే నన్ను తలచినట్లే! అలా ఎప్పుడు భావిస్తావో, ఏ ఒకర్ని చూచినా ఇద్దరినీ చూచినట్లని అనిపిస్తుందో — అంటే ఒకే వ్యక్తి రెండు రూపాల్లో కనపడ్డట్టు — అప్పుడు మాత్రమే నీవు అతిమానస చేతనకు, శక్తికి దగ్గరలో వున్నట్లు భావించు.

CWM 13:32


1955


No human will can finally prevail against the Divine's Will. Let us put ourselves deliberately and exclusively on the side of the Divine, and the Victory is ultimately certain

నీకుగా నీవు దైవసంకల్పానికి అంటిపెట్టుకొని వుండు

1955

మానవుల కోరికలు దైవేచ్ఛను ఎన్నడూ శాసించలేవు. సత్సంకల్పంతో కేవలం దైవం వైపే మనం దృష్టి సారించుదాము. అప్పుడే మనకు విజయం తథ్యం

CWM 15:171



24th April 1956

The manifestation of the Supramental upon earth is no more a promise but a living fact, a reality.

It is at work here, and one day will come when the most blind, the most unconscious, even the most unwilling shall be obliged to recognise it.

భూమిపై అతిమానసచేతన ఆవిర్భావం సత్యం

ఏప్రిల్ 24, 1956

భూమిపై అతిమానసచేతన ఆవిర్భవించటం కేవల వాగ్దానం కాదు. అది సజీవ సత్యం.

అతిమానసచేతన ఇప్పుడు కూడా పనిచేస్తూనే వున్నది. వెలుగు చూడలేని అంధులు సైతం ఏదో ఒక రోజు దాన్ని గమనించగలరు. అచేతనలో పడి విముఖంలో కొట్టుమిట్టాడేవారు కూడా దాన్ని గుర్తించగలరు.

CWM 15:96

1947

At the very moment when everything seems to go from bad to worse, it is then that we must make a supreme act of faith and know that the Grace will never fail us.

దైవకృప మనలను ఎన్నడూ వర్జించదు

అన్నీ చెడునుండి మరింత చెడు వైపుకు పోతున్న సందర్భంలోనే విశ్వాసంతో పని చేయాలి; దైవకృప మనలను వర్జించదని దృఢంగా విశ్వసించాలి!.

CWM 15:169



కాంతిరేఖలు

1. దురాశ వద్దు. అన్నిటి కంటే మించి ఏదీ కావాలనుకోకు. ప్రతి క్షణం సర్వశక్తులు సమీకరించటానికి సిద్ధంగా వుండు

25 ఫిబ్రవరి 1957

2. విశ్వంలో నీ స్థానాన్ని కేవలం ఆ పరాత్పరుడు మాత్రమే నిర్దేశించగలడు.

2 మే 1957

3. ప్రపంచం అనే "బృందగానం" లో నీ స్థానం ప్రభువైన ఆ పరమాత్మ ఇప్పటికే నిర్దేశించియే యున్నాడు. అది ఎట్టిదైనా అందరితోబాటు నిన్ను కూడా ఉన్నత శిఖరాలకు చేర్చగలదు.

17 మే 1957

4. 'సత్యజీవనం' లో నీదైన ఉనికి ఇప్పటికే నిర్దేశించబడి యున్నది. దీన్ని ఎవరూ మార్చజాలరు. కాకపోతే ఈ గమ్యాన్ని చేరే మార్గం మాత్రం కేవలం నీకే వదలి వేయబడింది.

19 మే 1957

5. పరిణామంలో ఉన్నత శిఖరాలను చేర్చగల మార్గాలలో ప్రతి వ్యక్తి తనకు అనుకూలమైనదానిని ఎంచుకునే స్వేచ్ఛ వుంది. అత్యున్నత శిఖరాలను చేరటానికి గాని లేదా వెన్నుచూపి, తేలికగా వుంటుందని అనేక వంపులతోనూ, అనంత పునర్జన్మలతోనూ కూడి యుండగల అధోమార్గాన్ని ఎంచుకోవటానికి గాని నీకు స్వేచ్ఛ ఉంది.

23 మే 1957

6. రానున్న యుగాలలో ఎప్పుడైనా కాని, లేక ఈ జీవితకాలంలోనే కాని నీవు సుస్థిరమైన, ఎప్పటికీ మారని నిర్ణయం తీసుకోవచ్చు. దాన్ని వెనక్కు తీసుకోనక్కర లేదు. మధ్య మధ్య దాని దృఢత్వాన్ని సడల నీయకుండా జాగ్రత్తపడితే చాలు. అట్లా కాని నాడు నువ్వు స్థిర నిర్ణయం తీసుకున్నట్లే కాదు! లేకుంటే సత్యాసత్యాల మధ్య క్షణానికో నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది.

23 మే 1957

7. మాట వరసకు ఏ ధృడనిర్ణయం నీవు తీసుకోకపోయినా ప్రస్తుత మహత్తర క్షణాలను గమనించగల అదృష్టభాగ్యం నీకు కలిగినా ఇప్పుడు అవతరించిన దైవకృప నిన్ను తప్పక అంతిమ లక్ష్యం చేర్చగలదు.

23 మే 1957

8. అస్తిత్వంలో ఏ తేడా వచ్చినా నిజాయితీ లోపించినట్లే!

9. పాంచభౌతిక దేహానికీ, సత్యంలో వుండగల నీ ఉనికికీ మధ్యన అగాధం వస్తే అది నీ నిజాయితీకి గొడ్డలిపెట్టు.

10. నీ యదార్థమైన ఉనికికీ, భౌతిక ఉనికికీ మధ్య ఉండగల అగాధం అనేక ప్రతికూల భావాలతో నిండి వుంటుంది. అందులోని భయం మరణ సదృశం; అనుమానం వినాశకరం!

11. నీదైన ఉన్నత సత్యాన్ని మరుగుపరచే ఏ ఆకర్షణకూ లొంగిపోకు. అదే చిత్తశుద్ధి.

17 అక్టోబరు 1958

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

సవరణ

మే నెల సంచిక 32 వ పేజీలో "దైవం మానవ అభిప్రాయాల ప్రకారం నడచుకోదు" అనే శీర్షిక క్రింద రెండవ పేరాలో పొరపాటు చోటుచేసుకొంది. అందుకు పూర్తి బాధ్యత వహిస్తూ, ఆ పేరాకు బదులు ఈ క్రింద పొందుపరచబడిన పేరాను చేర్చి చదవుకొనవలసినదని నా మనవి:

"ఏమైనా కానీ, ఒక వేళ ఆయనకు సహేతుకమైన కారణాలు వుంటే అవి కచ్చితంగా ఆయనకు మానవులు న్యాయాన్ని అవగాహన చేసుకొనే రీతిలో మట్టుకు ఆయన భావం లేదు".

సంపాదకుడు



అనంతతత్వ వదనారవిందము

అఖిల

అఖిల భారత పత్రిక – ఆగష్టు 2015

బౌద్ధములో నీలికమలం ఇంద్రియ సంవేదన, వివేకము, విషయ పరిజ్ఞానాలపై జీవాత్మ యొక్క విజయానికి చిహ్నం. సాధారణంగా ఇది 'పరిపూర్ణ పరిజ్ఞానం' ఆకృతిని ప్రతిబింబించే వికసీ వికసించని మొగ్గ మాదిరి — పాక్షికంగా మాత్రమే విచ్చుకున్నందున దాని మధ్య భాగం కనిపించనిది — రూపకల్పన గావించ బడింది. నైలు నదిలో పుష్పించే నీలికమలం ఈజిప్టు దేశానికి చెందిన మొక్క లన్నింటిలోకి అతిపూజనీయమైనదిగా గణుతి కెక్కింది. ఈ మొక్క, వెలుగును ప్రసాదించు, 'రా' గా ఆ దేశంలో పిలవబడే సూర్యభగవానునికి సంబంధించినదిగా పరిగణించబడింది. భారతదేశపు వివిధ సాంప్రదాయాలలో ఈ నీలికమలానికి అనే కమైన అత్యంత విలువను, పవిత్రతను సూచించే అర్థాలు ఇవ్వబడ్డాయి.

1972 సం.రం శ్రీఅరవిందుల శతవార్షికోత్సవ సందర్భంగా శ్రీమాత ఈ విషయానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చారు. స్వయంగా ఆమె మాటల్లో:

> "ఎర్రని కమలం శ్రీఅరవిందుల పుష్పం. అయితే, వారి శతవార్షికోత్స వాన్ని పురస్కరించుకొని వారి భౌతికదేహకాంతిని బోలు వర్ణంగల నీలి కమలాన్ని, భువి పైన దైవసాక్షాత్కార శతవార్షికోత్సవ చిహ్నంగా ఎన్నుకొందాం."
>
> 21 డిసెంబరు, 1971

CWM 13:16

అనువాదం; అందుగులపాటి కైలాసపతి

విషయసూచిక

ఈ సాయంత్రం ప్రశ్నలకు సమాధానమిచ్చే బదులు మనము శ్రీఅరవిందుల స్మృతిని ధ్యానించాలని నా కోరిక. ధ్యానం, ఆ స్మృతి మనలో సజీవంగా నుండగలిగే విధానంపైన, నిరం తర తేజోమయమైన, సజీవమైన, క్రియాశీలమైన చేతనలో వారు ఈ అపూర్వ అతిమానస ఆవిష్కరణ తప్పక సిద్ధిస్తుందని లోకానికి చాటడమే గాక దానిని సిద్ధింప జేసుకొనుటకు, ఆ సాధన కొనసాగించుటకు వారు ఇంత వరకు చేసిన, ఇంకా చేస్తున్న కృషి కోసం వారి ఆగమనానికి కృతజ్ఞతాపూర్వక నివేదనగా సాగాలి.

CWM 7:172

శ్రీమాత

*

రెండు విషయాలు నీవు ఎన్నటికీ తప్పకుండా మరువకూడదు. శ్రీఅరవిందుల దయ, శ్రీమాత ప్రేమ. ఈ రెండింటితో నీవు నిలక డగా, ఓరిమితో, శత్రువులను ఏ షరతులూ లేకుండా నిశ్చితంగా తరిమివేసేవరకూ, ఎప్పటికీ గెలుపు సాధించే వరకూ పోరాటం సాగిస్తూనే ఉండగలవు.

బాహ్యంలో ధైర్యం, అంతరంగంలో ప్రశాంతత, దైవానుగ్రహం మీద నిశ్చలమైన అచంచలమైన ప్రగాఢ విశ్వాసం.

CWM 15:81

శ్రీమాత

కొన్ని జ్ఞాపకాలు

శ్రీఅరవిందుల దివ్యతేజః పుంజం

...ఆలకించు, నేను జపాను నుంచి వచ్చినప్పుడు నాకు కలిగిన అనుభవం: నేను సముద్రంలో బోటు మీద ఉన్నాను, దేనిని గురించి ఆలోచించకుండా (సహజంగానే నా అంతరంగ జీవితంతో తీరిక లేకుండా ఉన్నాను, కానీ భౌతికంగా బోటు మీదే ఉన్నాను), అప్పుడు ఒక్కసారిగా, అసంగతంగా, పాండిచ్చేరి నుంచి రెండు నాటికల్ మైళ్ళ దూరంలో ఉండగా, గాలి లక్షణం, నేను ఇంకా ఏమని చెప్పగలనంటే, వాతావరణం యొక్క భౌతిక లక్షణం, ఎంతగా మారిపోయిందంటే, మేము శ్రీఅరవిందులను పరివేష్టించియుండే దివ్యతేజఃపుంజంలోకి ప్రవేశిస్తున్నట్లుగా నాకు తెలిసింది. అది భౌతిక అనుభవం, నేను హామీ ఇవ్వగలను, ఎవరికైతే తమ చైతన్యం కావలసినంతగా మేల్కొని ఉందో వారూ అదే అనుభవాన్ని అనుభూతి చెందగలరు.

నాకు వ్యతిరేక అనుభవంకూడా వచ్చింది. నేను ఇక్కడికి వచ్చిన చాలా సంవత్సరాల తర్వాత నేను కారులో బయటకు వెళ్ళాను. నేను చెరువును దాటి కొద్ది దూరం వెళ్ళగానే, నాకు ఒక్కసారిగా వాతావరణం అంతా మారిపోతున్నట్లుగా అనిపించింది: అక్కడేమో సమృద్ధి, బలం, కాంతి, శక్తి ఉండగా అవన్నీ తగ్గి కుంచించుకు పోయాయి..... ఆ తర్వాత ... ఏమీ లేదు. నేను మానసిక, ప్రాణిక చైతన్యాలలో లేను, నేను పూర్తిగా భౌతిక చైతన్యంలో ఉన్నాను. సరే, ఎవరైతే సున్నితమైన భౌతిక చైతన్యంలో సున్నితత్వాన్ని పొంది వుంటారో దానిని వారు తప్పకుండా పూర్తిగా వాస్తవికంగా అనుభూతి పొందుతారు. నేను మీకు ఆశ్వాసన ఇస్తున్నాను. మనం 'ఆశ్రమం' అని పిలిచే చోటులో శక్తి పూర్తిగా ఘనీభవించి దగ్గరకు ఒత్తబడి ఉన్నది. అది నగరంలో ఉన్న మాదిరిగా ఉన్నటువంటిది కాదు. పల్లె ప్రదేశాలతో పోలిస్తే ఇంకా తక్కువ.

CWM 4: 223-24

శ్రీఅరవిందుల ప్రశాంతత యొక్క ఆధిపత్యశక్తి

మీకు గుర్తుండే ఉంటుంది, అతి పెద్ద తుఫాను వచ్చిన ఆ రాత్రి, అప్పుడు

అంతటా భయంకలిగించే శబ్ధం, కుమ్మరిస్తున్నవర్షం. నేను అప్పుడు శ్రీఅరవిందుల గదికివెళ్ళి, గది కిటికీ తలుపులు వేయటానికి సహాయపడాలని అనుకున్నాను. తలుపు తెరిచానో లేదో, ఆశ్చర్యంగా, నేను శ్రీఅరవిందులను ప్రశాంతంగా తన మేజాబల్లవద్ద కూర్చుని వ్రాసుకుంటూ చూశాను. ఆ గదిలో ఎంత ప్రశాంతత ఉందంటే, బయట తుఫాను భీభత్సం జరుగుతున్నదని కలనైనా ఎవరూ ఊహించలేరు. కిటికీలన్నీ విశాలంగా తెరవబడి ఉన్నాయి. ఒక్క వర్షపుచుక్క కూడా లోనికి రావడంలేదు.

CWM 3:155

శ్రీఅరవిందుల వాక్ శక్తి

నేను శ్రీఅరవిందులను మొదటిసారి కలిసినప్పుడు నా అనుభవాన్ని మీకు చెప్పాలి. నేను తీవ్ర ఏకాగ్రతలో ఉన్నాను. అతిమానసంలో విషయాలను, అవి ఏవిధంగా ఉండాలో, ఎందుకు అవి అభివ్యక్తమవడం లేదో అనే విషయాన్ని గమనిస్తూ, నేను గమనించిందేమిటో వారికి చెప్పి అవి అభివ్యక్తమవుతాయా అని అడిగాను. వారు మామూలుగా అవుతాయి అన్నారు. తక్షణమే నాకు అతిమానసం భూమిని తాకి సిద్ధిస్తున్నట్లుగా కనిపించింది. నిజమైన దానిని వాస్తవంచేసి చూపగలిగే శక్తిని మొదటిసారి చూశాను.

ఆర్య రచన

తనకు తానే ఏ ప్రేరేపణ లేకుండా తక్షణమే చేయడం అంటే అర్థం ఆలోచించకపోవడం, వ్యవస్థీకరించకపోవడం నిర్ణయించకపోవడం, వ్యక్తిగత ఇచ్ఛతో ప్రయత్నించి సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నించకపోవడం. తనకుతానే ఏ ప్రేరేపణా లేకుండా తక్షణమే జరగడమనేది నిజంగా ఏ విధంగా ఉంటుంది అనే దానికి నేను రెండు ఉదాహరణలు ఇవ్వబోతున్నాను. ఒకటి: దాని గురించి మీకందరికీ ఎటువంటి సందేహం లేకుండా తెలిసిన విషయం, శ్రీఅరవిందులు 1914 లో ఆర్యకు వ్రాయడం మొదలుపెట్టిన సమయమది, ఆయనచేత వ్రాయబడినది మానసిక జ్ఞానంనుంచి వచ్చినది కాకపోవడమే కాకుండా, మానసిక సృష్టి కూడా కాదు: ఆయన తన మనస్సును నిశ్శబ్ద పరచి టైపుమిషనువద్ద కూర్చున్నారు,

పైనుంచి, ఉన్నత సీమలనుంచి, వ్రాయవలసినదంతా క్రిందికి వచ్చింది. అంతా తయారై, ఆయన కేవలం తన వేళ్ళను టైపుమిషనుమీద కదపవలసి వచ్చేది, అది వ్రాయబడింది. ఇటువంటి మానసిక నిశ్శబ్దతలో అది జ్ఞానాన్ని తనగుండా ఆమోదిస్తుంది — వ్యక్తీకరణ సైతం పైనుంచి తనగుండా సాగిపోయే విధంగా మొత్తం ఆర్యను ఆయనే వ్రాసారు, ప్రతినెలా 64 పేజీలు, ముద్రణలో. అందు వలననే, ఎన్ని పనులున్నా దానిని ఆయన చేయగలిగారు. అది ఒకవేళ మానసి కంతో నిర్మాణమయేటట్లయితే, అది పూర్తిగా అసాధ్యమైన విషయమే అవగలదు.
CWM 8:281

శక్తుల సంకలనం

...ఇటువంటి పుస్తకాలలో (శ్రీమాత 'యోగసంయోజనం' పుస్తకాన్ని చూపి స్తారు.) దివ్యజ్ఞానాన్ని బహిర్గతం చేసే పుస్తకాలలో, ఆచ్చోట ఎల్లప్పుడూ శక్తులు సమీకరించబడి ఉంటాయి — చాలా తరచుగా ఉన్నత జ్ఞానానికి చెందిన ఆధ్యా త్మిక శక్తులవి. ప్రతి పుస్తకం, అందులో ఉండే మాటల ననుసరించి, కొద్దిగా ఈ శక్తుల సంకలనంలాంటిదే. జనులకీవిషయం తెలియదు. ఎందుకంటే, వారికి వాటిని ఉపయోగించడం తెలియకపోవడం వలన, కాని విషయం మట్టుకు అదే. అదే విధంగా ప్రతి చిత్రంలోనూ, ఛాయాచిత్రంలోను, అక్కడ ఒక సంకలనం ఉంటుంది. అది ఎవరి చిత్రానికి సంబంధించినదో దానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తియొక్క శక్తుల, ఆయన ప్రకృతియొక్క, ఆయనకి గనక శక్తులు ఉన్నట్లయితే ఆశక్తుల సమీకరణం కొంత ఉంటుంది. ఇప్పుడు నీవు గనక చిత్తశుద్ధిని కలిగి యుండి, ఆకాంక్షతో ఉంటే, నీనుంచి ఒక స్పందన బయలువెడలుతుంది. నీ ఆకాంక్ష స్పందన బయలుదేరి, పుస్తకంలో ఉన్నదానికి అనుగుణమైన శక్తిని కలుపు తుంది. నీకు సమాధానమిచ్చేది ఒక ఉన్నతోన్నత చైతన్యం.

ప్రతీదీ దాని అంతర్నిహిత శక్తితో నిండి ఉంటుంది. మొత్తంలోని ప్రతి మూలకం మొత్తంలో ఉన్నదాని అంతర్నిహిత శక్తినంతా కలిగిఉంటుంది. దీని వివరణ కొంత కష్టదాయకం, కాని నీవు ఒక ఉదాహరణతో అంతా తెలుసుకో గలవు. జనులు ఇంద్రజాల విద్యను సాధన చేసే తరుణంలో వారికి వ్యక్తియొక్క గోరు లేక వెంట్రుకముక్క ఉంటే అది వారికి సరిపోతుంది. కారణం ఆ కాస్తలో,

అంతర్నిహితంగా, ఆవ్యక్తి అస్తిత్వంలో ఉన్నదంతా అందులో ఉంటుంది. ఒక పుస్తకంలో కూడా అంతర్నిహితంగా — వ్యక్తపరచబడనిది, అభివ్యక్తం కానిది — ఆ పుస్తకం వ్రాసిన వ్యక్తిలో ఉన్న జ్ఞానం ఉంటుంది. ఈ విధంగా శ్రీఅరవిందులు సంపూర్ణ గ్రహణశక్తికీ, జ్ఞానానికీ, ఆధిపత్యశక్తికీ ప్రాతినిధ్యం వహించారు.

కనుక, ఆయన ప్రతి ఒక్క పుస్తకమూ ఏకకాలంలో ఒక ప్రతీక, ఒక మూర్తి ప్రాతినిధ్యత. ఆయన ప్రతి పుస్తకమూ ప్రతీకగా, అంతర్నిహితంగా ఆయనలో ఉన్నదానిని కలిగి ఉంటుంది.

కనుక, నీవు ఆ పుస్తకంమీద ఏకాగ్రత వహిస్తే, నీవు ఆ పుస్తంకంద్వారా, దాని మూలానికి వెళ్ళగలవు. అంతేగాక, ఆ పుస్తకంలో ఉన్నదానిని మించి ఇంకా ఎక్కువగా అందుకోగలుగుతావు.

CWM 8:261-62

శ్రీఅరవింద గ్రంథ పఠనం

ఏది ఏమైనప్పటికీ, నేను ఎల్లప్పుడూ కొద్దికొద్దిగానే మనస్సును నీవు ఎంత ప్రశాంతంగా ఉంచగలుగుతావో అంత ప్రశాంతంగా ఉంచుతూ, అర్థం చేసుకోవడానికి ఏ మాత్రం ప్రయత్నించకుండా, తలను ఎంత నిశ్శబ్దంగా ఉంచగలవో అంతగా ఉంచుతూ, ఏం చదువుతున్నావో అందులో ఉన్నశక్తి లోలోతులలోకి గాఢంగా పోయేటట్లుగా చదవమని సలహా ఇస్తాను. ప్రశాంతతలోనూ, నిశ్శబ్దంలోనూ అందుకోబడిన ఈ శక్తి ప్రకాశంతో దాని పని అది చేసుకుపోతుంది. అవసరం అయితే, అవగాహనార్థమై, మెదడులో అవసరమైన కణాలను సృష్టిస్తుంది. ఆ విధంగా దానినే కొన్ని నెలల తరువాత తిరిగి చదవడం జరిగినప్పుడు, అప్పుడు వ్యక్తమయ్యే తలంపు చాలా సుస్పష్టంగానూ, సన్నిహితంగానూ ఉండటాన్ని గ్రహించుకోగలుగుతావు. ఒక్కొక్కప్పుడు అది కేవలం పూర్తిగా బాగా తెలిసిన విషయంగా ఉంటుంది.

నియమబద్ధంగా చదవడం చాలా మంచిది. ప్రతిరోజు కొద్దిగా, సాధ్యమైతే ఒక నిర్దిష్ట సమయంలో; ఇది మెదడు గ్రాహ్యతను సులువుచేస్తుంది.

CWM 12: 203

నేను శ్రీఅరవిందులతో సంభాషించేటప్పుడు, మేమెన్నడూ నడుమ వచ్చే అనేక భావాల ద్వారా సంభాషించవలసిన అవసరం కలిగేదికాదు. ఆయన ఒకటి చెప్పేవారు, సుదూరమైన దాని అంతిమఫలితాన్ని నేను చూసేదానను. మేమెల్లప్పుడూ అదేవిధంగా మాట్లాడుకొనేవారము. ఒకవేళ ఏ వ్యక్తీ అయినా ఆ సమయంలో ఉండటం జరిగితే, అతడు అంటాడు, "వాళ్ళు దేనిగురించి మాట్లాడుకుంటున్నారు!" కాని మీకు పూర్తి వాక్యంతో ఎంత స్పష్టంగా ఉంటుందో అదే విధంగా ఉండేది, తెలిసిందా. నీవు దానిని ఒక మానసిక అలౌకిక అద్భుతం అనవచ్చు. అది అటువంటి అలౌకిక అద్భుతమేమీ కాదు, అది కేవలం శ్రీఅరవిందులకు సంపూర్ణంగా మానసిక ప్రక్రియయొక్క దృష్టి ఉండడం మూలంగానే సాధ్యపడింది. అందువలన మేము చాలా విలువైన సమయాన్ని క్రమానుగతంగా అన్ని దశలగుండా పోతూ ఉండవలసిన ప్రక్రియలో వృధా చేయవలసిన అవసరం కలిగేది కాదు. ఎందువల్లనంటే దానిని అనుసరించగలిగిన సామర్థ్యం ఉన్న ఏ వ్యక్తికైనా అది అతనికి చాలా సహజంగానూ, హేతుబద్ధంగానూ ఉంటుంది, కాని వాస్తవ జ్ఞానం లేనివారికి అది ఒక 'అలౌకిక అద్భుతం'.

CWM 4:85

రోగాన్ని మాన్పే దృష్టి

నా దగ్గర చాలా ముద్దొచ్చే చిన్నపిల్లి ఒకటి ఉండేది. అది పూర్తిగా నాగరికమై, ఆశ్చర్యాన్ని కలిగించేది. అది ఇంట్లోనే జన్మించింది. దాని అలవాట్లు అన్ని పిల్లులకు ఉన్నట్లే ఉండేవి. అంటే, ఏదైనా కదలుతుంటే, అది దానితో ఆడేది. అటువంటి సమయంలో ఒకరోజు, ఇంట్లో ఒక పెద్ద తేలు ఉంది. దాని అలవాటు ప్రకారం అది తేలుతో ఆడటం మొదలుపెట్టింది. తేలు దానిని కుట్టింది. కాని అది అసాధారణమైన పిల్లి. అది నావద్దకు వచ్చింది. అది చాలా మట్టుకు చనిపోయే స్థితిలో ఉంది. కాని అది తన పంజాను అది కుట్టినచోటును చూపించింది. అది అప్పటికే వాచిపోయి చాలా భయంకరమైన స్థితిలో ఉంది. నేను ఆ పిల్లిని చేతిలోకి తీసుకున్నాను. అది నిజంగా ఎంతో ముద్దుగా ఉంది. నేను దానిని మేజాబల్లమీద

ఉంచి శ్రీఅరవిందులను పిలిచాను. నేను ఆయనతో అన్నాను, కికీని తేలుకుట్టింది, అది తప్పక కోలుకోవాలి. ఆ పిల్లి మెడచాచి శ్రీఅరవిందులవంక చూసింది. దాని కళ్ళు అప్పటికే పాలిపోయి తేలిపోతున్నాయి. శ్రీఅరవిందులు దాని ముందు కూర్చున్నారు. ఆయన కూడా దానిని చూశారు. అప్పుడు మేమిరువురం ఆ చిన్ని పిల్లి క్రమంగా కోలుకోవటం ప్రారంభించడాన్ని చూశాం. ఆ పిమ్మట ఒక గంట తరువాత, అది తన కాళ్ళతో గెంతువేసి పూర్తిగా నయమై వెళ్ళి పోయింది....

CWM 4:237-38

వ్యాధిని నయం చేసే హస్తం

వ్యాధి నివారణకు ఆధ్యాత్మికంగా రెండు[1] పద్ధతులున్నాయి. ఒకదానిలో చైతన్యశక్తినీ, సత్యాన్ని, వ్యాధిగ్రస్త భౌతిక ప్రదేశంమీద చొప్పించడం. ఈ పద్ధతిలో దాని మీద ప్రసరించిన దాని ప్రభావం సహజంగానే ఆ వ్యక్తి దానిని ఎంతమట్టుకు గ్రహించగలడు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఆ వ్యక్తి గ్రహించడానికి సమర్థుడైతే, వ్యాధిగ్రస్త భాగం మీద చైతన్యశక్తి ప్రసరింపజేయబడుతుంది. దాని ఒత్తిడికి స్వస్థత చేకూరుతుంది. ఇక్కడ ఉన్నవారిలో చాలామంది శ్రీఅరవిందులు ఏవిధంగా నయం చేసేవారో చెప్పగలరు. అది ఒక హస్తం వచ్చి, బాధను తీసుకువెళ్ళిపోవడం లాంటిది. అది అంత స్పష్టమైన విషయం.

CWM 4:264

గడియారాల చిలిపిచేష్టలు

ఇంకొక కథ శ్రీఅరవిందులు అలవాటుగా గదులలో పైకి క్రిందికి నడిచే రోజులకు సంబంధించినది. ఆ విధంగా ఆయన అనేక గంటలు నడిచేవారు. అది ఆయన ధ్యానపద్ధతి. ఆయనకు కేవలం సమయం ఎంత అయింది అని తెలుసు

---

[1] ఇతర సందర్భాలలో, ఒకవేళ శరీరం పూర్తిగా గ్రాహ్యతలేనిదైనప్పుడు లేదా దాని గ్రహణ సామర్థ్యం చాలకపోయినప్పుడు వారికి వ్యాధిని కలిగేటట్లు చేసిన మానసిక స్థాయితో సంప్రదించి, అంతరంగంగా, దాని మీద పని చేయడం జరుగుతుంది.

కోవాలని ఉండేది, కనుక ఆయన ఏక్షణంలోఅయినా సమయం ఎంత అయిందో తెలుసుకోవటానికి ప్రతి గదిలోను ఒక గడియారం ఉంచడం జరిగింది. అక్కడ అటువంటివి మూడు గడియారాలున్నాయి. నేను పనిచేసే గదిలో ఒకటి ఉంది. చెప్పాలంటే అది వారి ప్రారంభ స్థలం. ఒకరోజు ఆయనవచ్చి 'టైమెంతయింది' అని అడిగారు. ఆయన గడియారంవైపు చూడగానే అది ఆగిపోయింది. ఆయన ప్రక్క గదిలోకి వెళ్తూ, నేను టైము అక్కడ చూస్తాను. అని అన్నారు. గడియారం ఆగిపోయి ఉంది. ఇంతకు ముందు గడియారం ఏక్షణాన్న ఆగిపోయివుందో అది అక్కడే ఆగిపోయిఉంది — కొన్ని సెకన్ల తేడాతో. ఆయన మూడవగదికి వెళ్ళారు... గడియారం ఆగిపోయి ఉంది. ఆ విధంగా ఆయన మూడుసార్లు నడిచి చూశారు. గడియారాలన్నీ ఆగిపోయి ఉన్నాయి. అప్పుడు ఆయన నా గదికి తిరిగివచ్చి "కాని ఇది అసాధ్యం! ఇది ఒక చెత్త జోక్!" అని అన్నారు. అంతే, గడియారాలన్నీ ఒకదాని తరువాత మరియొకటి తిరిగి పనిచేయడం మొదలుపెట్టాయి.

CWM 4:275-76

క్రూరత్వం శ్రీఅరవిందులకు అత్యంత అసహ్యమైన విషయం

శ్రీఅరవిందులకు అత్యంత అసహ్యం కలిగించే విషయాలలో క్రూరత్వం ఒకటి. కాని ఆయన ఎప్పుడూ చెప్పేవారు, అది తీవ్రతకు వక్రీకరణ. ఒకరు దానిని చాలా మట్టుకు తీవ్రమైన ప్రేమకు వక్రీకరణ అని చెప్పవచ్చు. అది రాజీ పద్ధతిలో సంతృప్తి చెందనిది, అతి మితిమీరి కోరుకుంటుంది — ఆ విధంగా అని సమర్థనీయం అవుతుంది. నేనెప్పుడూ అనుకుంటాను. క్రూరత్వం హింసతో సంతోషం పొందడంలాగా, ఉద్రేకంతో నిండిన మితిమీరిన గాఢమైన ఇంద్రియ సంవేదనకు ఉగ్రత ఆవశ్యకమవుతుంది. మందమైన తామసిక పొరను చీల్చుకొని పోవటానికి — తమస్సు అనుభూతి పొందగలగాలంటే ఏదో ఒక విధమైన మితి మీరిన పోకడలు అవసరం అవుతాయి.

CWM 10:105-06

మనస్సులో అలౌకిక అద్భుతాలు

శ్రీఅరవిందుల విషయంలో కేవలం నాతో ఆయన అనేక పర్యాయములు చెప్పినవే తెలుసు. జనులు 'అలౌకిక అద్భుతం' అనే పదంతో కేవలం భౌతిక లేక ప్రాణికప్రక్రియలో అస్వాభావికంగా జరిగేవాటికే పేరు పెడతారు. ఈ విధంగా అస్వాభావికంగా జరిగేవి ఎల్లప్పుడూ వాస్తవం తెలియని లేదా హేతు బద్ధత లేని వాటితో కలగాపులగం అయి ఉంటాయి. కాని శ్రీఅరవిందులు మన స్సులో చేసిన అలౌకిక అద్భుతాలు లెక్కకు మిక్కిలివి. కాని సహజంగానే వాటిని కేవలం నీవు చాలా సూటి అయిన, చాలా చిత్తశుద్ధి కలిగి, చాలా పరిశుద్ధ దృష్టి ఉంటేనే చూడగలవు. చాలా కొద్దిమంది మాత్రమే వాటిని చూడగలిగారు. కాని ఆయన తిరస్కరించారు — ఇది నాకు తెలుసు — ఆయన ఏదైనా ప్రాణిక లేదా భౌతికమైన అలౌకిక అద్భుతాలు చేయడానికి తిరస్కరించేవారు. కారణం ఈ కలగాపులగం వలన. ప్రపంచం ఇప్పుడున్న పరిస్థితులలో నా అనుభవం ప్రకారం సూటిగా చేయబడే అలౌకిక అద్భుత కార్యం అది. భౌతికంకానీ, లేదా ప్రాణికం కానీ, తప్పనిసరిగా అనృతానికి సంబంధించి ఆమోదయోగ్యం కాని అనేక విధములైననటువంటి చాలా మూలకాలను లెక్కలోకి తీసుకోవలసిన ఆవశ్య కత ఉంది. అవి తప్పనిసరిగా అనృతానికి సంబంధించిన అలౌకిక అద్భుతాలు.... ఈ రోజులలో మనుషులు అలౌకిక అద్భుతాలు అనిపించేవన్నీ చాలా మట్టుకు ఎల్లప్పుడూ సూక్ష్మ ప్రాణిక జీవులు చేసేవే లేదా ఆ సూక్ష్మ ప్రాణిక జీవులతో సంబంధం కలిగిన మనుషులు చేసే వే, అందువల్ల అది కలగాపులగం- అది కొన్నింటి వాస్తవికతనూ సత్యదూరమైన కొన్నింటి సత్యాలను ఆమోదిస్తుంది. అది పనిచేయటానికి ఇదీ ఆధారం. అందువలన అది ఆమోదయోగ్యం కాదు.

CWM 10:158-59

దివ్య పరిత్యాగం

ఒకరోజు నేను మామూలుగా శ్రీఅరవిందులకు ఏం జరుగుతుందో చెబుదామని వెళ్ళాను — మేము వాస్తవంలో ఒక విధంగా చాలా కుతూహలం కలిగించే విషయానికి చేరుకున్నాము. బహుశా నా విషయంలో జరిగిన దానికి

నేను కొద్దిగా ఉత్సుకతను ప్రదర్శించాను. అప్పుడు శ్రీఅరవిందులు నా వంక చూసి... అన్నారు. "నిజమే, ఇది ఊర్ధ్వ మనోసృష్టి. ఇది చాలా కుతూహలమైన విషయం. చాలా బాగా చేశావు. ప్రపంచమంతటా నిన్ను ప్రసిద్ధి చేయగలిగే అలౌకిక అద్భుతాలు చేయగలవు. నీవు భూమిమీద అన్ని సంఘటనలను క్రింది మీదు చేస్తూ మరల్చగలవు. యదార్థంగా..." ఆ తరువాత ఆయన నవ్వి ఇలా అన్నారు."

"అది గొప్ప విజయం, కాని అది ఊర్ధ్వమనోసృష్టి, కాని అటువంటి విజయాన్ని మనం ఆశించటంలేదు. మనం అతి మనస్సును భూమిమీద స్థాపించాలని అనుకుంటున్నాము. నూతన ప్రపంచాన్ని దాని సమగ్ర స్వరూపంతో కూడిన అతిమానసిక ప్రపంచాన్ని సృష్టి చేయడానికి తక్షణ విజయాన్ని ఎలా పరిత్యాగం చేయాలో ఒకరు తప్పక తెలుసుకోవాలి."

నేను నా అంతరంగ చైతన్యంతో వెంటనే అర్థం చేసుకున్నాను. కొన్ని గంటల తరువాత ఆ సృష్టి లేకుండా పోయింది.... ఆ క్షణంనుంచి మేము తిరిగి మరోవిధంగా, ఇతర మూలాల మీద పనిచేయడం మొదలుపెట్టాము....

CWM 149-151

సావిత్రి గురించి శ్రీమాత

ఇవి ఆయన (శ్రీఅరవిందుల) అనుభవాలు. వాటిలో ఆయన జీవించారు. అవి వాస్తవాలు, విశ్వాతీత సత్యం. ఆయన ఈ అనుభవాల నన్నింటినీ ఒకరు సంతోషం లేదా దుఃఖాలను భౌతికంగా అనుభవించినట్లు అనుభవించారు. ఆయన అచేతన అనే గాఢానుభవంలో నడిచారు. మృత్యువు సామీప్యంలో కూడా నడిచారు. దుర్గతిలో ఉండే బాధలను ఓర్చుకున్నారు. బురదనుంచి, ప్రపంచ దైన్యాన్నుంచి బయటకు వచ్చారు, సర్వోత్కృష్టసమృద్ధిలో నవజీవనానికి, దివ్యానందంలో ప్రవేశించటానికి, ఆయన ఈ సీమలనన్నింటినీ దాటారు, వాటి పర్యవసానాలు భరించారు. ఒకరెవరూ ఊహించలేని విధంగా భౌతికంగా బాధపడ్డారు. ఓర్చుకున్నారు. ఈ రోజువరకు ఏ ఒక్కరూ ఆయనలాగా బాధ ననుభవించలేదు. బాధను పరమాత్మతో సంయోగపు ఆనందంగా పరివర్తన చేయటానికి ఆయన బాధను ఆమోదించారు. అది ఒక విధంగా అసదృశం, ప్రపంచ

చరిత్రలో పోల్చలేనిది. అది ఒక విధంగా ఎన్నడూ జరగనిది. ఆయన అజ్ఞేయంలో దారిని వేసిన మొదటివ్యక్తి. దాని మూలంగా బహుశా మనం అతిమనస్సువైపు దృఢ విశ్వాసంతో నడవగలం. ఆయన మన పనిని సులువు చేశారు. సావిత్రి పూర్తిగా ఆయన దివ్యపరివర్తన యోగం, ఈ దివ్యయోగం భూ-చైతన్యంలో మొదటిసారి ప్రత్యక్షమైంది.

మోనాసర్కార్

శ్రీఅరవిందుల నిశ్శబ్ద వరం

నేను చాలా సందర్భాలలో శ్రీఅరవిందులు ఒకానొకరికి నిశ్శబ్దాన్ని ప్రసాదించడం చూశాను. అతడి మనస్సును నిశ్శబ్దపరిచారు. ఆ వ్యక్తి ఆయన దగ్గరకు నిరాశతో విచ్చేసి, "కాని నేను జడమతినై బుద్ధిహీనుడనయ్యాను," అని అనడం మొదలుపెట్టాడు. ఎందువల్లనంటే అతని ఆలోచన పూర్వంవలె ఉద్వేగంతో లేదు. మనుషులు స్వేచ్ఛను కోరుకుంటారు. కాని వారు వారి బంధనాల సంకెళ్ళతో ప్రేమలో ఉంటారు. ఒకరెవరైనా వాటిని తొలగించబోతే, ఒకరెవరైనా వారికి నిజమైన ముక్తిమార్గం చూపించాలనుకుంటే, వారు భయపడతారు. తరచుగా వారు తమ అనంగీకారాన్ని సైతం తెలియబరుస్తారు.

CWM 9, 28

సూక్ష్మభౌతిక హస్తం

నేను దీనిని శ్రీఅరవిందులు ఒకరెవరి తలలోనో చేయడం చూశాను. ఎవరో ఒక వ్యక్తి ఆలోచనలవలన ఇబ్బందికి లోనవుతున్నానని మొరపెట్టుకుండేవాడు. అది ఎలా ఉందంటే ఆయన హస్తం ముందుకు వచ్చి, నాట్యం చేస్తున్న స్వల్పమైనటువంటి నల్లని బిందువును పట్టుకుని తరువాత ఈ విధంగా (చేతి ముని వేళ్ళతో సంజ్ఞ) ఎవరైనా కీటకాన్ని పట్టుకొని ఏరిపారవేసినట్లు, ఆయన దానిని దూరంగా విసిరివేశారు. జరిగింది అంతే. అంతా నిశ్చలం, ప్రశాంతం, ప్రకాశం.... అది ఈ విధంగా స్పష్టంగా ద్యోతకమయింది, తెలుస్తున్నదా, ఆయన ఏమీ మాట్లాడకుండా దానిని తీసివేశారు — పని పూర్తయిపోయింది.

విషయాలన్నీ పరస్పరం సన్నిహితంగా ఒకదానిమీద మరియొకటి ఆధారపడి

ఉంటాయి. ఇంకా నేను ఒకవ్యక్తి ఆయన వద్దకు తీవ్రమైన నొప్పితో వచ్చిన సందర్భాన్ని చూశాను. "అబ్బా, ఇక్కడ చాలా బాధగా ఉంది! అమ్మో చాలా బాధ! అమ్మో!..." ఆయన ఏమీ మాట్లాడలేదు, ఆయన ప్రశాంతంగా ఉండి పోయారు. ఆయన ఆ వ్యక్తి మీద దృష్టి సారించారు, అప్పుడు నేను చూశాను, నేను ఏదో ఒక సూక్ష్మభౌతిక హస్తం ముందుకు వచ్చి, అస్తవ్యస్తతతోను, గందర గోళంగాను చిందులేస్తున్న చిన్ని బిందువును చేత పట్టటం చూశాను. దానిని ఆయన ఈ విధంగా తీసేశారు.(అదే సంజ్ఞ), అంతే, అక్కడంతా తొలగిపో యింది.

"ఆహా, ఆహా! చూడండి నా నొప్పిపోయింది."

CWM 9, 253-54

జైలును దైవంతో కలయిక స్థలంగా మరల్చడం

నేను మహా అజ్ఞానంలో నిద్రిస్తున్నప్పుడు నేను ధ్యానం చేయటానికి పూర్తిగా పుణ్యపురుషులుండే స్థలానికి చేరాను. నాకు వారి సాన్నిధ్యం భరించలేనిదై, ఆ చోటు జైలుగా గోచరించింది. నేను మేల్కొన్నప్పుడు భగవంతుడు నన్ను జైలుకు తీసుకువెళ్ళి, దానిని ధ్యాన మందిరంగా, ఆయన తోటి సమావేశ స్థలంగా మార్చివేసాడు.

తలపులు, సూక్తులు, నెం. 46.

శ్రీఅరవిందులు

...శ్రీఅరవిందులు ఇక్కడ ప్రస్తావిస్తున్నది ఆలీపూర్ జైలులోని ఆయన అనుభ వాలను. కాని ఇక్కడ ఈ సూక్తులలో చాలా కుతూహలం కలిగించే విషయం, ఆయన రెండింటిమధ్య తారతమ్యతను మనకు చూపిస్తున్నారు. ఒకవంక, కేవలం ఆయన శరీరం మాత్రమే దానిని ఉంచబడిన భౌతిక జైలులో అది బంధింపబడగా, ఆయన ఆత్మ మాత్రం సామాజిక లోకాచారాలు, దురభిప్రాయాలనే సంకెళ్ళతో దాని కాళ్లు బంధింపబడకుండా, ముందస్తు భావాలకు, సిద్ధాంతాలను వల్లె వేసే, పరిమితులనుంచి స్వతంత్రంగా ఉండి, దైవంతో సూటిగా, చైతన్యవంతమైన సంపర్కంతో పూర్ణయోగంయొక్క మొట్టమొదటి దివ్యజ్ఞానం పొందటం,

మరొకవంక, సాంప్రదాయక సైద్ధాంతిక భావాలమీద ఆధారపడిన ఆధ్యాత్మిక జీవితానికి తమను తాము అంకితం చేసుకోవటానికి సాధారణ జీవితాన్ని త్యాగం చేసినప్పుడు జనులు తరచు తమను తాము అంతరంగానికే పరిమితం చేసు కుంటూ జీవితాన్ని బహిష్కరించే సంకుచిత సూత్రాల మానసిక జైలు.

CWM 10: 68-69

శ్రీమాత

అతిమానసిక ఏకత్వం

మీకు తెలుసా, ఖైదీలలో నారాయణుని, కాపలాదారులలో నారాయణుని అంతటా ప్రతిచోటా నారాయణుని దర్శించిన ఆయన ప్రసిద్ధ అనుభవం?...

అది పరమోత్కృష్టం. ఏకత్వం

ప్ర: అది అతిమానస అనుభవమా, లేక...

అది అతిమానసమే....

అవును, అతిమానస అనుభవం, దానిని ఆయన నారాయణ అని పిలిచారు.


ప్ర: అది అతి మానసమా, ఊర్ధ్వ మానసం కాదా?

కాదు, కాదు

శ్రీఅరవిందులు వివరించినట్లు అది గీతోపదేశం లాంటిది. ఊర్ధ్వ మానసం కాదు. కాని అతిమానసం, అది ఏకత్వం, ఏకత్వానుభూతి.

Conversations with a disciple, September 26, 1962

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



మనం నిన్నటిరోజున ఎవరిని గురించి తెలుసుకున్నామో వారు ఈ భూమిపై వున్నారు. వారి ఉనికి ఒక్కటే చాలు, భూమిపై అజ్ఞానాంధకారము జ్ఞానజ్యోతిగా పరివర్తన చెంది దైవపాలన ప్రతిష్ఠించబడే రోజు ఒకటి తప్పక వస్తుందనటానికి,

CWM 1:113

శ్రీమాత

దివ్యత్యాగం

నిష్క్రమణలోని అంతరార్థం

లోకంలోను, మనుషులలోను విషయాలను గ్రహించగల శక్తి లోపించటమే శ్రీఅరవిందులు తమదేహంగురించి తీసుకున్న నిర్ణయానికి కారణం. అయితే, ఒక్కవిషయం మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. భౌతిక స్తరంలో జరిగిన దేదైనా ఏ విధంగాను వారి బోధనలోని సత్యాన్ని తారుమారు చేయదు. వారు చెప్పిన దంతా పరమసత్యం, ఆ విధంగానే నిలిచిపోతుంది. కాలగమనంలో చోటు చేసు కొనే సంఘటనలు ఆ విషయాన్ని విస్తృతంగా నిరూపిస్తాయి.

CWM 13:7

నీవు ఆశ్రమంలో పంచుతున్న కరపత్రం అనువాదాన్ని వినగానే బాధతో దిగాలు పడ్డాను. మనలను గురించి తమను తాము సంపూర్ణంగా అర్పించుకున్న మన ప్రభువైన ఆ త్యాగమూర్తిపట్ల అంత అవగాహనా రాహిత్యము, అగౌరవము, అవిశ్వాసము నీకున్నాయని నేను ఎన్నడూ ఊహించలేదు. శ్రీఅరవిందులు అవిటి వారు కాలేదు. దేహం వదిలే కొన్ని గంటలముందు వారు తమ పక్కపైనుంచి లేచి చాలా సేపటివరకు తమ కుర్చీలో కూర్చున్నారు. తమ చుట్టూ ఉన్నవారితో ఎంతో ఉదారంగా, ఉల్లాసంగా మాట్లాడారు. శ్రీఅరవిందులు తమ దేహం త్యజిం చడంలో ఏ నిర్భంధానికి లోనుగాలేదు. శరీరత్యాగం చేయాలనే నిర్ణయానికి వారు ఎంచుకున్న కారణాలు మానవ మనస్తత్వం అందుకోలేనంత ఉన్నతమైనవి, విలక్షణమైనవి.

అర్థం చేసుకోలేనప్పుడు చేయాల్సిన పని ఒక్కటే, గౌరవ పూర్వకంగా మౌనం పాటించడం.

CWM 13:7-8

శ్రీఅరవిందులు తమ శరీరాన్ని త్యజించడమనే చర్య ఒక ఉత్కృష్టమైన నిస్వార్థ చర్య. తద్వారా వారు సమిష్టి అనుభవం సిద్ధించే ఘడియ త్వరలో రావాలని తమ స్వంత శరీరంలో పొందుతున్న సిద్ధిని పరిత్యజించారు. ఈ లోకం మరిం

తగా ప్రతిస్పందించి వున్నట్లయితే ఆ త్యాగం అవసరమయ్యేది కాదు.
CWM 13:9

శ్రీఅరవిందుల వాగ్దానం

ఇప్పుడు ఇక్కడవున్న మనందరికీ శ్రీఅరవిందుల వాగ్దానం ఏదైతే సహజం గానే ఆసక్తికరమైనదిగా అనిపిస్తున్నదో అది ఏమిటనగా మానవ సమాజంలోని కొందరు ఉన్నత వర్గస్తులు ఎవరైతే ఆధ్యాత్మికంగా ఎదగటానికి అవసరమైన నియమ నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నారో వారు అతిమానసశక్తి, చైతన్యము, వెలుగుల ఆసరాతో పశుప్రాయులుగా కాక, అతిమానవులుగా వారి శరీరాలను పరివర్తన చెందించగల సమయం ఆసన్న మయిందని.

శ్రీఅరవిందులు వాగ్దానం చేసింది అతిమానసశక్తి భూమిపై సాక్షాత్కరించ బోతున్నదనే ఎరుకపై ఆధారపడి, వాస్తవానికి ఆయనలో అతిమానసశక్తి చాలా కాలం క్రిందటే ఆవిష్కరించిందని వారికి తెలుసు, దాని ప్రభావాలు ఏమిటో కూడా వారికి తెలుసు.

ఇప్పుడు అది విశ్వవ్యాప్తంగా అభివ్యక్త మైనందున, రూపాంతరీకరణ చెంద టానికి అవకాశం మరింత అధికమయిందని నేను నిక్కచ్చిగా చెప్పగలను. ఎవ రైతే నియమనిబంధనలను పాటించారో లేక ప్రస్తుతం పాటించబోతున్నారో వారంతా ఈ పరివర్తన చెందే మార్గంలో వున్నారనుటలో సందేహం లేదు.

శ్రీఅరవిందులు తమ 'యోగసమన్వయము' అనే గ్రంథంలో విశదీకరించిన నియమనిబంధనలను మరింత విపులంగా అతిమానస ఆవిర్భావంపై వారి వ్యాసా లలో మరింతగా వివరించారు. అందువలన అప్పుడు అది ఫలప్రదం కావడ మొక్కటే మిగిలింది.
CWM 8:222

ఈ ప్రపంచం కోసం శ్రీఅరవిందులు ఎంతటి మహాద్భుత త్యాగం చేసారో జనానికి తెలియదు. దాదాపు ఒక సంవత్సరం క్రితం నేను కొన్ని విషయాలు చర్చిస్తున్నప్పుడు నా దేహాన్ని త్యజించాలనే భావన నాకు కలిగిందని సూచిం చాను. వారు గట్టిగా దృఢంగా "వద్దు అది ఎప్పుడూ జరుగదు. రూపాంతరానికి అది అవసరమైనట్లయితే, నేను వెళ్ళిపోవచ్చు. నీవు మాత్రం అతిమానస అవరో

హణకు, రూపాంతరీకరణకు మన యోగాన్ని సఫలీకృతం చేయాలి" అని చెప్పారు.

CWM 13: 8

ఆయన తన దేహంలో అతిమానసశక్తిని అత్యధిక మోతాదులో కూడబెట్టుకున్నారు. వారు దేహత్యాగం చేసిన వెంటనే... చూసారూ, వారు తమ పక్కపైనే పండుకొని వున్నారు, నేను వారి ప్రక్కనే నిలుచున్నాను. వారిలోని అతిమానసశక్తి ఒక ఘనీభవించిన పదార్థ రూపంగా అది — ఎంత బలమైన అనుభూతి అంటే ప్రత్యక్షంగా చూడగలిగినంతగా — వారి శరీరంనుండి నా శరీరంలోకి ప్రవేశించింది. నేను ఆ ప్రవాహంయొక్క స్పర్శానుభూతిని పొందాను. అది అసాధారణమైనది, అత్యద్భుతమైనది, ఒక అపురూపమైన అనుభవం. ఆ విధంగా చాలా సమయం (శ్రీమాత శక్తి తమలోకి ప్రవహిస్తున్నట్లుగా సంజ్ఞ చేస్తారు.) నేను వారి మంచం ప్రక్కనే నిలుచుని వున్నాను. ఆ అనుభవం కొనసాగింది....

CWM 8:322

శ్రీఅరవిందులు అతి మానస చైతన్యాన్ని ఒక మానవ శరీరంలో మూర్తీభవింపజేసి, గమ్యాన్ని చేరడానికి ఏ విధమైన మార్గం అనుసరించాలి, దానిని అనుసరించే పద్ధతి ఏమిటి అన్న వివరాలనే గాక, తమ వ్యక్తిగత అనుభవాన్ని జోడించి మనకు ఒక నమూనాను అందించారు. ఒక విధంగా ఈ పనిని ఈడేర్చ వచ్చునని అందుకు సమయం ఆసన్న మయిందని రుజువు చేసారు.

CWM 12: 72

శ్రీఅరవిందులు భూమిపై అరుదెంచింది ఎందుకు

శ్రీఅరవిందులు భూమిపై అరుదెంచడానికి కారణం అతిమానస ప్రపంచం ఆవిష్కరింపబడుతుంది అనే వార్తను చాటడానికి. వారు ఆ వార్తను చాటటమే కాదు, అతిమానసశక్తికి ఆవిష్కరణలో పాక్షికంగా ఒక నిర్దిష్ట రూపకల్పన గావించారు. దానికి తోడు దానిని ప్రకటించడానికి మనం చేయాల్సిన పనిని మచ్చుగా చూపించారు. ఇక మనం చేయాల్సిన దేమిటంటే వారు చెప్పిన దానినంతా అధ్యయనం చేసి, వారు చూపిన దృష్టాంతాన్నిఅనుసరించి ఆ నూతన సాక్షాత్కారానికి మనలను మనం సిద్ధపరచుకోవడం.

ఇది జీవితానికి ఒక వాస్తవికానుభూతిని కల్పించి, మనకు ఎదురయ్యే ఆటంకా లన్నింటినీ అధిగమింప జేస్తుంది.

ఆ నూతన సృష్టికోసం మనం జీవించాలి. నిత్య యవ్వనంగా నిలవాలి, బలంగా ఎదగాలి, ప్రగతి పథంలో పయనించాలి.

CWM 12:205

శ్రీఅరవిందులు ప్రాణత్యాగం చేసింది మనం దివ్యచైతన్యంలో తిరిగి జన్మిం చాలని.

CWM 13:16

తమ రూపాంతరీకరణ కార్యానికి సంపూర్ణ సహకారాన్ని అధికంగా అందించడా నికై తన భౌతిక జీవితాన్ని త్యాగం చేసిన ఆ మహనీయుడి సమక్షంలో మనం నిలుచున్నాము.

వారు ఎల్లప్పుడూ మనతో వున్నారు. మన మేమి చేస్తున్నామో వారికి తెలుసు. మన ఆలోచనలు, మన భావనలు, మన చర్యలు అన్నీ వారికి తెలుసు.

CWM13:8

వారి శరీరంలోని అతిమానస శక్తి

ఎంతమేరకు శ్రీఅరవిందులు తమ దేహాన్ని అతిమానస శక్తితో రూపాంతరం చేసుకొనుటలో కృతకృత్యులయ్యారని నన్ను తరచుగా ప్రశ్నిస్తుంటారు.

ప్రశ్న: అవును మాతా. దానిని గురించి మేము ఆశ్చర్యపడుతుంటాము. కాని మాకు నిజంగా తెలియదు.

సమా: మీ అల్పమైన బుద్ధితో ఎలా తెలుస్తుంది? ఎవ్వరూ అదేమిటో అర్థం చేసుకోలేరు, వారు ఏదో అనుభవానికి లోనైతే తప్ప, కాని నేను మీకు చెప్తాను. వారు తమ దేహంలో అతిమానసశక్తిని గణనీయంగా ప్రోగు చేసుకున్నారు. ఎంతటి అసాధ్యమైన కార్యము!... మీకు జ్ఞాపకముందికదూ. వారు దేహాన్ని వదిలినప్పుడు ఆ దేహం దాదాపు అయిదు రోజులవరకు అద్భుతంగా విరాజిల్లు తుండింది, పరిపూర్ణప్రకాశంతో. వారు తమ అతిమానసశక్తిని నాలోకి ప్రవేశింపజేసి నప్పటికీ నిష్క్రమణకు పూర్వమే వారు నాకు అన్నీ ఇచ్చివేసారు. అయినప్పటికీ వారి దేహం వైభవోపేతమైన అతిమానసశక్తిని ప్రసరిస్తూనే వుండింది.... నీకు

తెలుసా. ఆ క్షణంలో, ఆ ఆఖరిక్షణాల్లో నేను వారి పక్కవద్దనే నిలుచుని వున్నాను. నాలోకి అతిమానస వెలుగు భౌతికంగా ఒక రాపిడితో ప్రవేశించడం నేను బాగా చూసాననటం అతి శయోక్తి కాదు. అది అంత యదార్థంగా నుండింది. నా చర్మ రంధ్రాలగుండా ఈ విధంగా ప్రవేశిస్తుండింది. (సంజ్ఞ చేస్తారు.)

అత్యంత ఉదారమైన త్యాగము

మొట్టమొదటిసారిగా ఒక వ్యక్తికి దైవానుగ్రహంపై — ఒక అచంచలవిశ్వాసం కలుగుతుందో, వారు ఈడేర్చిన మహత్కార్యం గురించి కనీసమైన ఆతురతను కనబరచకుండా వారు తమలో తాము ప్రోగుచేసుకున్న చైతన్యం అమోఘం. వైవిధ్యము, అనూహ్యము అయిన సిద్ధులతో వారు అందుకున్న స్థాయి అసాధారణమైనది.

దానికి తోడు వారు తీసుకున్న ఒకే ఒక నిర్ణయం, తాము తలపెట్టిన అతి మానస శక్తి ఆవిష్కరణకై చేసేపనిని వేగవంతం చేయడానికై సూక్ష్మభౌతిక స్థితిని చేరి అధిక సమర్థవంతంగా నిర్వర్తించాలని, తాము తమ శరీరాన్ని వద లటం. మరుక్షణమే వారు తమ దేహాన్ని త్యజించి, ఇంకా ప్రతిఘటిస్తున్న సూక్ష్మ ప్రపంచ క్షేత్రాన్ని స్వాధీన పరచుకొనుటకు తమను తాము ప్రయోగించు కున్నారు. వారు తమ దేహాన్ని వదలటానికి కారణం జీవితం యొక్క అవాస్తవికత అనే అంశంపై అవగాహన కలగటం కాదు, పరమసత్యాన్ని భూమిపై ఆవిష్కరింప చేయటం కోసం అనువైన పరిస్థితులను కల్పించడానికి గాను, పర్యవసానాలను లెక్కచేయకుండా రూపాంతరీకరణ కార్యక్రమం సక్రమంగా కొనసాగటానికి. అందులో విజయం తప్పక సాధిస్తాననే విశ్వాసంతో వారు ఇతర బంధాలనుండి విముక్తి పొందారు. పైనుంచి అందిన ఒక ఆదేశాన్ని ఒక ఆజ్ఞాపనగా భావించి, ఆ నిర్ణయం తీసుకోబడింది. ఎన్నడూ, ఎవ్వరూ చేయని త్యాగం ఇది. కాదు, అది పరమోత్కృష్టమైన దివ్యపారవశ్యతలోకి ఆత్మార్పణ గావించడం. అది శ్రీఅరవిం దులు మాత్రమే చేయగలినది — కేవలం ఆపరమాత్మునిలోనే లయమై పోవు టకు తనను తాను నిర్మూలించుకోవటం.

వాగ్దానం చేయబడినదల్లా వాస్తవమవుతున్నది.

ఎంత అసాధ్యం! ఏమాశక్తి, ఏమా చేతన. ఏమా జ్ఞానము, ఏమా కారుణ్యము, వారిలోనున్న ఆ తేజమునేమనాలి....

వారు నన్ను ఆజ్ఞాపించారు. "భూమిపై నా కార్యమైన రూపాంతరీకరణను నీవు తప్పక నెరవేర్చాలి.... నా సహాయం వుంటుంది." అందువలన నేను ఆలోచించే పని ఏ మాత్రం లేదు. నేనేమీ రూపకల్పన గావించలేదు, కాని అంతటి శ్రమతో వారు చేపట్టిన పని పూర్తి అయ్యే వరకు కొనసాగించమని వారు నన్ను ఇప్పుడు ఆజ్ఞాపించిన ఆ కార్యనిర్వహణలో దృఢవిశ్వాసంతో మునిగి పోయాను. నేను ప్రశ్నించను. వారు కోరినదేదో అది నెరవేరాలి, అయితే వారు లేనిదే నేను ఏమీ చేయలేను.

అడుగడుగునా నా ప్రయత్నానికి ఆసరాగా, నన్ను ముందుకు నడపడానికి, నాకు మార్గదర్శనం చేయడానికి, ఎప్పుడైనా సంశయానికిలోనైతే దానిని నివృత్తి గావించడానికి వారు నాతో వున్నారు.

ఊహించినదంతా, వాగ్దానం చేయబడినదంతా, ఇప్పుడు వాస్తవరూపం దాలుస్తున్నది.

ఇక దైహిక రూపాంతరీకరణ ఇకపై ఏ నిష్ప్రయోజనమైన ఎండమావి కాదు. అది ఒక యదార్థం. ఒక వేర్లూనిన, వృద్ధి చెందుతున్న, జ్యోతిర్మయమైన భవిష్యత్తు దిశగా, నిలకడగా ఎదుగుతున్న ప్రక్రియ. ఇప్పటికే శరీరం ఆ వినూత్న కాంతికి ఎంత ఆశ్చర్యజనకంగా ప్రతిస్పందిస్తున్నదంటే.....

(ఒక శిష్యునితో సంభాషణ)

శ్రీఅరవిందులు ద్వారాలను తెరుస్తారు

నా కార్యం సులభతరం కావడానికి శ్రీఅరవిందులు అన్ని ఏర్పాట్లను చేసారు. ఈ అచేతనా క్షేత్రాన్ని వెల్లడి చేయటానికి శ్రీఅరవిందుల వద్ద బీగం వున్నది. దాని ద్వారం తెరవడానికి ఆ బీగాన్ని ఉపయోగించి నా మార్గాన్ని తేజోమయం చేసారు. ఆ జడమైన, అంధకార బంధురమైన భౌతికపదార్థ వాతావరణంలో దివ్యశక్తిని, దివ్యతేజాన్ని, దివ్యానందాన్ని జొప్పించడానికి నేను నెమ్మదిగా ప్రవేశిస్తాను. ఆ పదార్థ వాతావరణంలో ఎప్పుడైతే పరివర్తన చెందించే ప్రకాశం ప్రసరించిందో ఆ పదార్థాన్ని సంఘటిత పరచే అణువుల్లో ఒక నూతన

చేతన జాగృతమవుతుంది. ఆ విధంగా ఈ కార్యాచరణ కొనసాగుతుంది, విస్తరిస్తుంది, వృద్ధి చెందుతుంది., అర్థమయిందా", శ్రీఅరవిందులు ఈ భౌతిక పదార్థంయొక్క అంతరాత్మ, యావత్ మానవజాతియొక్క అభిలాష. ఆ పదార్థం లోని దివ్యతేజం వారే. ఆ పదార్థంలో మూర్తీభవించిన అధి ఆత్మ వారే. శ్రీఅరవిందులు పరమ ప్రమాణమైన దాని నుండి తమను తాము వేరుచేసుకొని తమపై ఈ అచేతన, అజ్ఞానమనే బరువులను వేసుకొని ఈ పదార్థంలో వాటిని దివ్యజీవనానికి జాగృతం చేయడానికి దానిలో ప్రవేశించారు. అందుకోసం వారు దైవాన్ని, దైవానుగ్రహాన్ని తమ కార్యాచరణలో సహకరించడానికి ఈ భూమిపై అవతరించమని ఆవాహన చేసారు. అందుకనే వారి పిలుపు నందుకొని నేను ఒక భౌతిక దేహంతో ఈ పదార్థంలోకి ఈ బాధాతప్తమైన, దుఃఖభాజనమైన, మృత్యుముఖంలో క్రుగ్గుతున్న లోకంలోకి దిగివచ్చాను. మా ఇద్దరి ఈ కలయికతో దివ్యజీవనమనే మహాద్భుతాన్ని క్రమక్రమంగా ఈ లోకం దర్శిస్తుంది. వారి కారణంగానే నేను దిగిరావడం జరిగింది. క్రిందనున్న భౌతిక పదార్థంలో ఉదయించిన ఈ తీవ్రమైన అభిలాషను దేనినైతే వారు పైకి పంపించారో దానికి ప్రతిస్పందనగా దైవానుగ్రహం దిగివచ్చింది. అది ఈ భూమికి ఎంతటి అదృష్టవంతమైన ఘడియ! ఈ విశ్వమంతా ఒక మహనీయమైన అమితోత్సాహంతో దాని ఉనికిగల లక్ష్యం దిశగా వికసించి మహాద్భుతమైన అభివృద్ధిని సాదించగలిగే అపూర్వ తరుణం. సమస్య పరిష్కారానికై ప్రపంచానికి అందిన ఈ సహాయంతో, పట్టుదలతో సాధించాలనే మా సంకల్పంతో సాధ్యపడని దేదైనా వుంటుందా! ఇది ఆ క్షణం....

కేవలం శ్రీఅరవిందుల మూలంగానే నేను ఈ కార్యం సాధించగలను. ఈ కార్యంలో అధికభాగం వారే నెరవేరుస్తారు. వారు నన్ను ఆహ్వానిస్తారు, వారే ద్వారాలను తెరుస్తారు. ఇక నేను ఈ అచేతన యొక్క అగాధ లోతుల్లోకి ప్రవేశించి నిద్రాణమైయున్న అచేతన అణువుల్లో జ్యోతిని వెలిగిస్తాను. వాటిని వికసింపచేయడానికి రవ్వంత శక్తిని జోడించి అవి మరింత ఎక్కువ ఆకాంక్షించడానికై వాటికి దివ్యప్రేమను అందిస్తాను. ప్రతి ఒక్కఅణువును ఈ విధంగా ఉధృతపరుస్తాను.

The Supreme P.2

ప్రశ్న: శ్రీమాతా, దైవానికి, శ్రీఅరవిందులకు మధ్యన వున్న వ్యత్యాసమేమిటి?

సమా: సారభూతమైన వ్యత్యాసం ఏమీలేదు. దైవం సర్వాంతర్యామి అయితే శ్రీఅరవిందులు ఒక భాగం, అయితే, వారిలో సర్వోత్కృష్టుడైన దైవంయొక్క చైతన్యం వున్నది. వారు దైవాంశ సంభూతులు.

ప్రశ్న: ఈ క్షణాన శ్రీఅరవిందులు ఎక్కడనున్నారు?

సమా: శ్రీఅరవిందులు ఎక్కడ వుండాలని కోరుకుంటే అక్కడ వుంటారు. ఎందు కనగా వారు సర్వస్వతంత్రులు. అయితే, వారికి సూక్ష్మభౌతిక స్థాయిలో (భౌతి కమైన పృధ్వికి అతిదగ్గరలోని క్షేత్రం) ఒక శాశ్వత నివాసం వున్నది. వారిని చూడగోరువారు అక్కడకు వెళ్ళి వారిని చూడగలరు.

ప్రశ్న: వారికి ఏ ఆకారం వున్నది?

సమా: ఆ సూక్ష్మ భౌతిక స్థాయిలో వారికి ఈ భూమిపై నున్నట్టి ఆకారం లాంటిదే వున్నది, అయితే అది అజరామరమైన పరమశాంతి మయమై వున్నది....

(White Roses, p. 45)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అవతారపురుషుడు: శ్రీఅరవిందులు

ఒక శాశ్వతజన్మ:

ప్రశ్న: ప్రపంచచరిత్రలో శ్రీఅరవిందుల జన్మను ఒక "శాశ్వత" జన్మగా మీరు వర్ణించారు. "శాశ్వత" అంటే ఖచ్చితమైన అర్థమేమిటి?

జవాబు: చేతనకు గల నాలుగు ఆరోహణా భూమికల పైన నాలుగు భిన్న విధా లుగా ఆ వాక్యాన్నర్థం చేసుకోవచ్చు.

1. భౌతికంగా : ఆ జన్మ పర్యవసానం ప్రపంచానికి శాశ్వతమైన ప్రాముఖ్యం కలిగివుంటుంది.

2. మానసికంగా: జగచ్చరిత్రలో శాశ్వతంగా గుర్తుండిపోయే జన్మ అది.

3. అంతరాత్మికంగా : భువిపై యుగయుగంలోనూ శాశ్వతంగా తిరిగి తిరిగి సంభవించే జన్మ అది.

4. ఆధ్యాత్మికంగా: భువిపై శాశ్వతుని జన్మ అది.

పృథ్వీచరిత్ర ప్రారంభమైనప్పటినుండీ, పృథ్వీరూపాంతరీకరణపై యేదో ఒక రూపంతో యేదో ఒక పేరుతో శ్రీఅరవిందులు అధ్యక్షత వహించి వున్నారు.

CWM 13:10

శ్రీఅరవిందుల జన్మను గురించి — వారి జన్మదిన సందర్భంలో — నేను పలికిన మాటలకు సంబంధించిన ప్రశ్న అది, నేను వారి జన్మను 'శాశ్వత జన్మ' అన్నాను.' శాశ్వతం' అంటే అర్థం యేమిటని నన్నడిగారు.

కేవలం వాచ్యార్థం తీసుకుంటే పెద్ద విశిష్టతేంలేదు అన్నమాట నిజమే. ఒక భౌతికపరమైన అవగాహన, ఒక మానసిక అవగాహన, ఒక అంతరాత్మిక అవగాహన, ఒక ఆధ్యాత్మిక అవగాహన కలిగించే వివరణ యెలా వుంటుందో — వాస్తవానికి వున్నది — నేనిప్పుడు వివరించబోతున్నాను. భౌతికంగా దానర్థం, ఈ జన్మ పర్యవసానాలు భూమి వున్నంతవరకు వుంటాయి. మొత్తం భువి ఉనికి కొనసాగినంతకాలం శ్రీఅరవిందుల జన్మ పర్యవసానాలు అనుభూతమౌతాయి. కాబట్టి దానిని కొంచెం కవితా ధోరణిలో 'శాశ్వతం' అని చెప్పాను.

మానసికంగా ఆ జన్మకు సంబంధించిన స్మృతి శాశ్వతంగా నిలిచిపోతుంది. యుగాలపర్యంతం శ్రీఅరవిందుల జన్మ ఆ జన్మకు సంబందించిన సమస్త పర్యవసానాలతో సహా గుర్తుండిపోతుంది.

అంతరాత్మికంగా జగచ్చరిత్రలో యుగయుగంలోనూ శాశ్వతంగా పునరావృతమౌతుండే జన్మ అది. ఒక నియత కాలంలో యుగయుగంలో పృథ్వి చరిత్రలో సంభవించే అభివ్యక్తి ఆ జన్మ. అంటే జన్మ నూతనమైనదై, పునరావృతమౌతూ, పునరుద్భవమైన ప్రతీసారీ, బహుశా మరింతగా — మరింత సంపూర్ణంగా, మరింత పరిపూర్ణమైనదానిని — తీసుకొస్తూంటుంది. కాని అవతరణ అభివ్యక్తికి, ఒక భౌతిక దేహంలోజన్మకు సంబంధించిన అదే ప్రేరణ వుంటుంది.

పూర్తిగా ఆధ్యాత్మిక దృక్కోణంనుండి చూస్తే భువిపై శాశ్వతుని జన్మగా చివరకు దానిని గురించి చెప్పవచ్చు. ఒక భౌతిక రూపాన్ని అవతారం ధరించిన ప్రతిసారీ, అది శాశ్వతుడు స్వయంగా భువిమీద జన్మించడమే అవుతుంది.

CWM 9: 178-79

ఒక అతిమానసిక నూతనజాతి ఆవిర్భావాన్ని, ఒక నూతనప్రపంచ ఆవిర్భావాన్ని ప్రకటించటానికి భువిపై కేతెంచిన పురుషోత్తముని ఒక రూపమే శ్రీఅరవిందులు.

మన సంపూర్ణ చిత్తశుద్ధితో, సంపూర్ణ ఆకాంక్షతో మనమంతా అందుకు సంసిద్ధులమగుదాం.

CWM 13:19

నీ హృదయంలోనూ, ఆలోచనలోనూ నాకూ శ్రీఅరవిందులకూ మధ్య భేదం లేకుండా చేసుకోగలిగినప్పుడు, శ్రీఅరవిందులను గురించి చింతించినపుడు నన్ను చింతించినట్లనిపించినపుడు, నన్ను చింతించినపుడు శ్రీఅరవిందులను చింతించినట్లు అనివార్యంగా అన్పించినప్పుడు, ఒకర్ని దర్శించినప్పుడు అని వార్యంగా మరొకర్ని దర్శించినట్లనిపించినపుడు, ఒకే ఒక విధమైన వ్యక్తి మేమి ద్దరం అని అనిపించినపుడు, అప్పుడు నీవు అతిమానసిక్రియా శక్తి చేతనలకు తెరచుకొన నారంభిస్తున్నావని తెలుసుకొంటావు.

CWM13:32

పరిణామ నిత్యత్వంలో సంభవించే ప్రతి అవతారం, మరింత పరిపూర్ణ ఉపలబ్ధిని ప్రకటించునది, సంపూర్ణమైన ఉపలబ్ధి సిద్ధిస్తుందని ముందుగా సూచించేది.

అయినప్పటికీ, భవిష్యదవతారానికి వ్యతిరేకంగా గతానికి సంబంధించిన అవతారానికే దైవత్వాన్నారోపించే ధోరణి మనుష్యులకెప్పుడూ వుంటూనే వుంది.

ఇప్పుడు, మరల ప్రపంచం రేపు సాక్షాత్కరింపజేసుకోవలసిన దానిని ప్రక టిస్తూ, శ్రీఅరవిందులు అవతరించారు. వారికన్నా ముందే వచ్చి వెళ్ళినవారి సందేశానికి యెదురైన వ్యతిరేకతే వీరి సందేశానికి కూడా యెదురౌతోంది.

కాని వారు వెలువరించిన దాని సత్యాన్ని రేపటిరోజు ఋజువుచేస్తుంది. వారి మహాకార్యం తప్పక ఫలప్రదమౌతుంది.

CWM13:22

ప్రశ్న: దైవం అంటే ఏమిటి?

జవాబు: నీవు శ్రీఅరవిందునిలో దేనిని ఆరాధిస్తున్నావో అదే దైవమంటే!

CWM13:27

అవతార ద్వివిధ కార్యం:

శాశ్వతుని, పరాత్పరుని దృక్పథంనుండి చూస్తే సమాంతరమైన ప్రాము

ఖ్యతగల విషయాలు రెండు ఉన్నాయి.

సాక్షాత్కారం యదార్థమైన సాక్షాత్కారం అవ్వాలంటే, ఆ రెండూ సమంగా అత్యావశ్యకం.

ఒక ప్రక్క — పృథ్విపై అవతారంవలె పురుషోత్తమ చేతనను సంకల్పాన్ని రూపకల్పన చేసిన – శ్రీఅరవిందులు నన్ను దేనినిగా ప్రకటించారో ఆ పరమమైన జగజ్జనని విషయం వున్నది, మరోప్రక్క, సమగ్ర సాధన ద్వారా నా దేహంలో నేను దేనిని నిజం చేసుకుంటున్నానో ఆ విషయం వున్నది. నేను పరమ దివ్యజన నిగా ఉండగలను. ఏ విధమైన సాధనా చేయను. వాస్తవానికి శ్రీఅరవిందులు వారి దేహంలో వున్నంతకాలం సాధన చేసింది వారైతే, దాని ప్రభావాలు స్వీకరిం చింది నేను. ఈ ప్రభావాలు అప్రయత్నంగా వాటంతట అవే బాహ్య అస్తిత్వంలో స్థిరపడిపోయాయి. కాని దానిని సాధించింది, సాధిస్తున్నది వారే — నేను కాదు. నేను కేవలం వారి సాధనకు ప్రపంచానికి మధ్య ఒక వారధిగా మాత్రమే నిలిచాను. వారు తమ దేహాన్ని త్యజించినపుడు మాత్రమే నేను సాధనను స్వీకరించ వత్తిడికి లోనయ్యాను. అది వరకు నేను చేస్తూండిన దానిని మాత్రమే గాక — వారి సాధ నకు ప్రపంచానికి మధ్య వారధిగా నిలబడడం — సాధనను కూడా నేనే కొనసాగిం చవలసివచ్చింది. వారు నిష్క్రమించినప్పుడు వారు స్వయంగా అదివరకు తమ దేహంలో వుండి చేస్తున్న దాని బాధ్యతనుకూడా నా మీదకు మరల్చినారు. అది కూడా నేను చేయవలసివచ్చింది. కాబట్టి యిక్కడ రెండుసంగతులున్నాయి. కొన్ని సందర్భాలలో ఒకవిషయం రెండో దానికన్న ప్రబలమౌతుంది. మరికొన్ని సందర్భాల్లో ఆ మరొకటి మొదటి విషయాన్ని అధిగమిస్తుంది. ఆ రెండూ ఒక సంపూర్ణ పరిపూర్ణ ఉపలబ్ధిలో కలిసిపోవ ప్రయత్నిస్తూంటాయి. పరాత్పర సృష్టి కర్త్రిణియొక్క శాశ్వత, అనిర్వచనీయ అమర్త్య దివ్యచేతన, సర్వదా అధిక మౌతుండే పురోగతివైపు ఆరోహణకై పెనుగులాడుతుండే పూర్ణయోగ సాధకుని చేతన, అనేవి ఆ రెండు సంగతులు....

నన్ను, కాలాతీత జగజ్జననిగానూ, శ్రీఅరవిందులను అవతారంగానూ చూచే వాళ్ళు, మా శక్తి అప్రతిహతమైనదికాదు అంటే ఆశ్చర్యపోయారు. ఏదైనా ఒక విషయం "అలా వుండడానికి" మేము "తథాస్తు" అని మాత్రం అంటే సరిపోదని తెలిసి ఆశ్చర్యపోయారు. ఇలా యెందుచేతనంటే సమగ్ర సాక్షాత్కారంలో

రెండూ యేకం గావడం తప్పని సరి, అంటే శాశ్వతుని స్థాయినుండి ఉత్పన్నమై వచ్చేశక్తి, పరిణామ వికాసం ద్వారా జరిగే సాధననుండి ఉత్పన్నమై సాగేశక్తి ఈ రెండూ యేకమై ఒకటిగా అయి పోవాలి.

Conversations with a disciple oct.10, 1958

మానవజాతి భారాన్ని భరించే దైవకారుణ్యం

ప్రశ్న: ఆశ్రమంలో చాలామంది మీద తనకు గౌరవం లేదని ఒకరు నాతో చాలా సార్లు చెప్పాడు

జవాబు: అసలు ప్రణాళిక యేమిటంటే, భువి అంతా తన అన్ని రూపాలలోనూ రూపాంతరీకరణకు యేమాత్రం సిద్ధంగా లేనివాటితో సహా తప్పక సన్నద్ధం చేయబడాలి. ఆ అనుసంధానాన్ని మేము సుస్థిరంగా కలిగించాలంటే భువిపై వున్న సకలాంశాలకు ప్రాతినిధ్యం వహించే ఒక ప్రతీక తయారుగావాలి. జగత్తుకు ఒక సంకేత రూపం భూమి, అలాగే భూమికి సంకేతంగా ఒక బృందం యేర్పడాలి.

1914 లో శ్రీఅరవిందులు, నేను ఈ విషయాన్ని గురించి చర్చించాం, యెందుకనంటే మాకు రెండు సంభావ్యతలు కన్పించాయి. మేం యిప్పుడు చేస్తూన్నదానిని కొనసాగించడమా లేక అతిమనస్సును సిద్ధింపజేసుకొనేంతవరకు మాత్రమేగాక భౌతిక పరివర్తన కూడా ఆరంభమయ్యేవరకు జనజీవనంనుండి విడివడి, యేకాంతంలోనికి ఉపసంహరించుకోవడమా అనేది చర్చించాం. మనం మనల్ని జనజీవనంనుండి వేరు చేసుకోగూడదని శ్రీఅరవిందులు మంచి నిర్ణయం తీసుకున్నారు. ఎందుచేతనంటే, ముందుకు పోయినకొద్దీ సాధకుడు అధికాధికంగా విశ్వమయుడవుతాడు, తత్పర్యవసానంగా... సందర్భమేదైనప్పటికీ, ఆ భారాన్ని అతని మీదే వేసుకొంటాడు.

Conversations with a disciple sep 20,1960

శ్రీఅరవిందులు, చిట్టచివరి అవతారం:

ప్రశ్న: ఒకసారి అతిమానసచేతన పటిష్టంగా ప్రతిష్టితమైతే భూమిపై అవతారాలు యింకా జన్మించవలసిన అవసరం వుంటుందా?

జవాబు: భూమిపై జీవిస్తున్న జీవులయందు అతిమనస్సు ఆవిర్భవించినపుడు ఈ ప్రశ్నకు సమాధానంచెప్పడం తేలిక అవుతుంది.

శ్రీఅరవిందులు చిట్టచివరి అవతారం అని నేనెప్పుడూ వింటున్నాను, కాని వారు బహుశా ఒక మానవ దేహంలో చిట్టచివరి అవతారం.

CWM 10: 253

శ్రీఅరవిందులు గతానికిగాని, చరిత్రకుగాని చెందినవారు గాదు. తనను తాను సాకారం చేసుకొనేందుకు ముందుకు సాగిపోతున్న బృహత్తర భవి ష్యతు శ్రీఅరవిందులు.

CWM 12:210-11

శ్రీఅరవిందుల నెవరు అర్థం చేసుకోగలరు? వారు విశ్వమంత విశాలురు, వారిబోధన అనంతం....

వారికి కొంచెం దగ్గరవ్వాలంటే వారిని త్రికరణ శుద్ధిగా ప్రేమించాలి. ఎట్టి మినహాయింపులు లేకుండా తనను తాను వారి కర్పించి వేసుకోవాలి. ఆ విధంగా శ్రీఅరవిందులు ముందుగా సూచించిన ప్రపంచ రూపాంతరీకరణానికి తోడ్పడేం దుకు ప్రతి వ్యక్తి తన సమర్థత మేరకు చేయగలిగినదంతా చేయాలి.

CWM 12:397

శ్రీఅరవిందులు, శ్రీకృష్ణుడు

శ్రీఅరవిందులు జీవించి వున్నప్పుడు, నేను హాలులో సమావేశమైన జనానికి ధ్యానమునందించడానికి క్రిందకు వెళ్తూన్న రోజులు నా కింకా గుర్తున్నాయి. హాలులో స్తంభాల పైన అంచులు వున్నాయి. వాటిపైన దేవతలు — శివుడు, కృష్ణుడు, లక్ష్మి, త్రిమూర్తులు — అందరూ చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు వచ్చి కూర్చునేవాళ్ళు. వాళ్ళంతా క్రమం తప్పకుండా ప్రతిరోజు ఈ ధ్యానాల్లో పాల్గొ నేందుకు వచ్చేవాళ్ళు. అదొక సుందరమైన దృశ్యం. కాని వారికి మనలాగ పురుషోత్తమునిపై ఆరాధనా భావం వుండేది కాదు. ఆ విధమైన భావనతో వారి కుపయోగం లేదు — వారిలో ప్రతి ఒక్కరికీ తమదైన అస్తిత్వ ప్రకారం తనకే చెందిన స్వకీయ శాశ్వత దివ్యత్వపు పూర్తి యెరుకవుంది. తాను తక్కినవారి అందరి ప్రతిరూపం ధరించగలనని ప్రతి వారికి చాలా బాగా తెలుసు. వారొక

ప్రత్యేక సమాజానికి చెందిన వారమని భావిస్తారు. కాని అంతరాత్మిక సంబంధ జీవితం అందించే ఆ లక్షణాలు — ప్రగాఢ ప్రేమ, ప్రగాఢ సానుభూతి, సైకమత్య భావన వారిలో యే ఒక్కటీ లేదు.

1926 లో నేనొక విధమైన అధిమానసిక సృష్టి చేయ మొదలుపెట్టాను. అంటే నేను అధిమనస్సును యిక్కడ భువి మీదున్న పదార్థం లోనికి తీసుకొచ్చాను. ఈ దేవతలందర్నీ అవతరించమనీ, ఒక దేహంతో తమంత తాముగా మమేకం కమ్మనీ అడిగాను. సరే, శ్రీఅరవిందులతో సర్వదా హితంగా వుండే శ్రీకృష్ణుడు వారి దేహంలోనికి సమ్మతించి రావడం నేను ఈ కళ్ళతో చూచాను. అది నవంబరు 24 వ తేదీన...

అది ఇలా జరిగింది. శ్రీఅరవిందుల దేహంలోని కవతరించడానికి శ్రీకృష్ణుడు అంగీకరించాడు. అవతరించడానికి ఒకదేహంలో కట్టువడి వుండిపోవడానికి, కేవలం దేహంలోనికి వచ్చి పోతుండే దాని చుట్టూ తిరుగుతుండే ప్రభావానికి మధ్య చాలా పెద్ద భేదం వుంది. అర్థం చేసుకో. దేవతలెప్పుడూ సంచరిస్తూంటారు. మనంకూడా మన అంతరంగ అస్తిత్వాలలో వంద వేల ప్రదేశాలలో యేక కాలంలో పోయి వస్తూ, పనిచేస్తూంటామనేది స్పష్టమే. సందర్భానుసారంగా రావడానికి, ఒక దేహానికి శాశ్వతంగా కట్టుబడి వుండిపోవడానికి అంగీకరించడానికి మధ్య — ఒక శాశ్వత ప్రభావానికి ఒక శాశ్వత సాన్నిధ్యానికి మధ్య బేధం వుంది.

Conversations with a disciple sept 2, 1961

శ్రీఅరవిందులు, శివుడు

అలాగాక, శివుడు నిరాకరించాడు. "లేదు, నీ పని నీవు పూర్తిచేసిన తర్వాత మాత్రమే నేనొస్తాను. ఇప్పుడున్నట్లుండే ప్రపంచంలోనికి నేను రాను, కాని సహాయం చేయడానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు. ఆ రోజున అతను నా గదిలో నిలబడి వున్నాడు. అతని శిరస్సు గది పైకప్పును తాకేంత యెత్తుగా వున్నాడు! అతడు అతనికే ప్రత్యేకమైన వెలుగులో, ఎరుపు, బంగారం రంగుల మేళవింపుగల వర్ణ తళతళలలో తానమాడుతున్నాడు. అదొక అద్భుత దృశ్యం! అతడు తన సర్వోత్కృష్ట చేతనను అభివ్యక్తం చేసేటప్పుడు యెలా ఉంటాడో అచ్చు అలాగే వున్నాడు. ఒక అద్భుతజీవి. నేను లేచి నిలుచున్నాను... అప్పు

డతడు "లేదు, నన్ను నేనొక దేహానికి కట్టిపడవేసుకోలేను, కాని నీవేది కోరితే అది నీకిస్తాను" అన్నాడు. ఒకే ఒక్క విషయం (అదంతా కూడా మాటలు లేకుండానే జరిగిన సంభాషణ అనేది వాస్తవం) "భౌతిక అహంను వదిలించుకోవాలనుకుంటు న్నాను' అని అన్నాను.

సరే, తరువాత ఏ జరిగిందో చూడు బాబూ! అసాధారణ సంఘటనొకటి జరి గింది. ఓ క్షణం తరువాత శ్రీఅరవిందులను చూడ్డానికి వెళ్ళి, చూడండి ఏం జరిగిందో! నాకొక వింతైన అనుభూతి కలిగింది. (అమ్మ నవ్వుతారు) జీవకణానికి ఎంతమాత్రం కలిసికట్టుగా లేవు! అవి చెల్లాచెదురైపోతున్నాయి" అన్నాను. వారు నావంక చూచి చిరునవ్వుతో "అప్పుడే కాదు", అన్నారు. ఆ వెంటనే ఆ ప్రబావం అంతర్థానమై పోయింది.

కాని నేను కోరుకొన్నదాన్ని శివుడు నాకిచ్చాడు.

మరి శ్రీఅరవిందులేమో "అప్పుడే కాదు" అన్నారు.

Conversations with a disciple

శ్రీకృష్ణునితో, శ్రీఅరవిందులతో నడక

శ్రీఅరవిందులున్నప్పుడు, గతంలో డార్మిటల్ అనెక్స్ అనే యింట్లో నేను నివసించాను. ఆ యింటి కొక పెద్ద వరండా వుంది. ఆ వరండాలో నేను అటూ యిటూ ఒంటరిగా పచార్లు చేస్తూంటే శ్రీఅరవిందులు తన గదిలో పనిచేసు కుంటూండేవారు. కాని నేనెప్పుడూ ఒంటరిగా కాదు. భగవంతునిగా తెలిసిన కృష్ణుడు, ఆ కృష్ణుడు యెప్పుడూ నాతో వుండేవాడు. కాని అతడు చాలా ఎత్తుగా, చాల అందంగా వుండేవాడు. జుగుప్సాకరమైన నీలం రంగులో, బూడిద వర్ణంగా వుండే నీలంరంగులో మాత్రం కాదు.అలాంటి రంగులో కాదు. ఎల్లప్పుడూ, యెప్పుడూ మేమిద్దరం కలిసి పచార్లు చేస్తూండేవాళ్ళం. ఇద్దరం కలసి నడుస్తూండేవాళ్ళం. అతడు నాకు కొంచెం వెనుకగా వుండేవాడు, (వెనుకకు సైగచేసి చూపారు, మెడ, బుజాలకు, దాదాపు దగ్గరగా వెనుకగా) నేను కొంచెం ముందుండే దాన్ని, నా శిరస్సు ఆయన భుజం మీదఉన్నట్లుగా వుండేది. (నా శిరస్సు ఆయన భుజం మీద అని ఉన్న అనుభూతి నాకు లేదు, కాని అదలాకన్పిం చేటట్లుండేది.) అలా మేం నడిచేవాళ్ళం, సంభాషించుకుంటూండేవాళ్ళం. అలా

ఒక సంవత్సరంపాటు ప్రతిరోజు తెలుసా, జరిగింది. ఆ తర్వాత ఆగిపోయింది. తర్వాత నేను ఆయను అప్పుడప్పుడు మాత్రమే చూచేదాన్ని (మేం క్రొత్త నివాసానికి మారినప్పుడు ఆయన్ను చూసాను.) కొన్ని సమయాల్లో నేను బాగా ఆలసిపోయినప్పుడు ఆయనొచ్చేవాడు. నేను ఆయన భుజం మీద వాలి నిదు రించేదాన్ని. శ్రీఅరవిందులు తమను చూపించుకొనేదలాగేనని నాకు బాగా తెలుసు.

నేనిచటికొచ్చినప్పుడు (ప్రస్తుతం అమ్మగది) శ్రీఅరవిందులు నిష్క్రమిం చారు. నా మంత్రాన్ని జపిస్తూ నేను పచార్లు చేయడం మొదలు పెట్టాను. శ్రీఅరవిందులు వచ్చి, కృష్ణుడు నిలిచినట్లు అదే చోటున నిలిచేవారు (తలవెనుక అన్నట్లు సంజ్ఞ) నేను నడుస్తూంటే వారు అదే చోటున వుండి నడుస్తూండేవారు. మేమిద్దరం రోజు తర్వాత రోజుగా నడుస్తూండేవాళ్ళం. అదెంతో ఘనిష్టం, యెంతో అద్భుతంగా వుండేది. ఈ జనాన్ని, బాహ్యవిషయాలను యెందుకు పట్టించుకోవడం, యెల్లప్పుడూ యిలాగే వుండిపోవాలని వుంది అని అనుకోవడం మొదలు పెట్టాను. వారు నా ఆ లోచనను పసిగట్టారు. "ఇహనుంచి నేను రాను." అని రావడం మానేసారు. "సరే మంచిదే." అనుకొని పురుషోత్తముని ఉద్దేశించి నా మంత్రాన్ని జపించడం మొదలుపెట్టాను. మరో రూపంలో గాక స్వయంగా పురుషోత్తముడే వచ్చి నాతో పచార్లు చేయాలని యెంతో ప్రయత్నించాను.

Conversations with a disciple june 18, 1968

పురుషోత్తముని వాగ్దానం, దివ్య ఆశ్వాసం

ప్రభూ! నీ కార్యం సాధించబడేవరకు నీవు మాతోనే, మాకు మార్గం చూపించే, వివేకవంతం చేసే చేతనగా మాత్రమే గాక, కర్మలో క్రియాశీలియైన ఒక దివ్యసన్నిధిగా వుంటానని ఈ రోజు ఉదయం మాకు ఆశ్వాసమిచ్చావు. అపార్థం చేసుకొనేందకు కవకాశం లేని మాటలలలో, నీ సమస్తం యిచటనే వుంటుందని, భూమి రూపాంతరీకరించబడేంతవరకూ భూవాతావరణాన్ని విడిచిపెట్టనని మాకు వాగ్దానం చేసావు. ఈ అద్భుతమైన దైవసన్నిధికి మేము అర్హులమయ్యేటట్లు అనుగ్రహించు. నీ మహోత్కృష్ట దివ్యకార్యం ఫలప్రదమై

య్యేందుకు మాలోని సమస్తం, మరింత పరిపూర్ణంగా సమర్పణమయ్యే యేకైక సంకల్పం మీద కేంద్రీకరించేటట్లు మమ్మనుగ్రహించు.

CWM:13:6

కనిపించేవాటితో మనం గాబరా పడకూడదు. శ్రీఅరవిందులు మనలను విడనాడ లేదు. శ్రీఅరవిందులు ఇక్కడే వున్నారు, ఎప్పటిలాగే, సజీవంగా. వారి కార్యానికి అనుచితమైన సంపూర్ణ చిత్తశుద్ధితో, కుతూహలంతో, ఏకాగ్రతతో నెరవేర్చడం మన విధి.

శ్రీఅరవిందులు మన మధ్యే యెల్లపుడూ వుంటున్నారు. వారిని చూడడానికి, వారిని వినడానికి యెవరు సంసిద్ధంగా వున్నారో వారికి తమను తాము వ్యక్త పరచుకొంటున్నారు.

CWM:17:7-11

ఊర్ధ్వానికీ, నిమ్నానికీ వెళ్లి రాగలిగి పైనున్నదానిని భౌతికంలోనికి తీసుకు రానిచ్చే అవిచ్ఛిన్నతను సాధించగలిగే కార్యం చేతన లోపల జరుగుతుంది. ఆ కార్యనిర్వహణ కుద్దేశించబడిన వ్యక్తి అవతారం. అతను చెరసాలలో బందీయై యెవర్నీ చూడకపోయినా, బయటకు వెళ్లకపోయినా అతడా కార్యాన్ని నిర్వహిస్తాడు. ఎందుచేతనంటే అది చేతనలో జరిగే పని. అతిమనస్సు, భౌతికజీవి మధ్య అనుసంధానాన్నేర్పాటు చేసే కార్యం అది. అతనికి యెవరి గుర్తింపు తోనూ అవసరం లేదు. ఈ సచేతన అనుసంధానాన్నేర్పాటు చేయడానికి అతనికి బాహ్యమైన యే శక్తితోనూ పని లేదు. ఎలాగోలా ఒక్కసారి ఈ సంబంధం యేర్ప డిందంటే ఒక నూతనసృష్టి రూపంలో బాహ్యప్రపంచంలో దాని ప్రభావం పడు తుంది. ఒక నమూనా నగరం రూపంలో మొదలై ఒక పరిపూర్ణ ప్రపంచంతో ముగుస్తుంది.

CWM 3:179

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు



పురుషోత్తముని శాశ్వతావతారం శ్రీఅరవిందులు. వారు మనందరితో యెల్లపుడూ వుండనే వుంటున్నారు. కేవలం వారిని ప్రేమించడం అనే అత్యవసర కార్యాన్ని నెరవేర్చినట్లైతే మన మంతా వారితో నిత్య సంపర్కంలో వుండగలం.
White Roses: 3

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

శ్రీఅరవిందులు నిరంతరము మనతోనే ఉంటారు

ప్రశ్న: ఎవరో ఒకాయన శ్రీఅరవిందులవారి గదిని మరోసారి దర్శించి, కొంత తడవు అక్కడ ధ్యానము చేయాలని కోరారు.

జ: అటువంటి గొప్ప అవకాశమును పొందదలిస్తే అతని యొక్క అర్హతలు, యోగ్యతలు ఏమిటి? మరోసారి దర్శించాలనే కోరిక బాగుంది, అందరూ శ్రీఅరవిందులవారి గది దర్శనమునకు రావచ్చు. అయితే అక్కడ కూర్చొని ధ్యానము చేయుటకు అనుమతిని పొందాలంటే ఆ వ్యక్తి శ్రీఅరవిందుల కార్యమునకు అసాధరణ సేవ చేసి ఉండాలి.

ప్రశ్న: మధుమయి మాతా, శ్రీఅరవిందులవారి గదిలో కూర్చొని, ధ్యానము చేయుటకు అనుమతి నివ్వాలంటే, శ్రీఅరవిందుల కొరకు అసాధారణ సేవ చేసి ఉండాలని అన్నారు. దాని అర్థమేమిటి శ్రీమాతా? ఎంత సేవ చేస్తే మీరనుకున్నంత అవుతుంది?

జ: ప్రభువు కొరకు సేవ చేయటము అంటే, తనకున్న దాని నుండి లేక తనకు కలుగబోవుదాని నుండి లేక తన స్థితిగతుల నుండి ఆయనకు కొంతలో కొంతైనా అర్పించాలి. అంటే మన యొక్క కలిమి లేక ఆస్థి నుండి కొంత భాగాన్నో, లేక మనము చేసే పనిపాట్ల నుండి కొంత ధారపోయటం లేక క్రియాశీల పనులన్నింటినీ ధారపోయటం, ఎటువంటి దాపరికము లేకుండా సర్వస్వాన్ని ఆయనకు సమర్పించటం అన్ని చేయాలి; అందువలన ప్రభువు మన యొక్క స్వభావాన్ని తన అరిచేతుల్లో పెట్టుకొని దాన్ని దైవీప్రకృతి తరహాలో పరిణమింప చేస్తారు. కాని చాలమంది ఉన్నారు, వారు ఏమాత్రము అర్పించకనే, పరిగ్రహించుటకు మాత్రమే వేచి ఉంటారు. ఇటువంటివారు స్వార్థపరులు, వీరు శ్రీఅరవిందుల గదిలో ధ్యానము చేయుటకు అనర్హులు.

CWM 13: 29-30

శ్రీఅరవిందులు తమ 90 వ జన్మదినమునాడు ప్రసాదించిన గొప్ప బహుమానము

పదిగంటలకు, ఆగష్టు 15 న ధ్యానము జరుపబడెను. 9.45 నిముషములకు

నిశ్శబ్దమాధ్యమమున నేను వేదిక యొద్ద కూర్చుని ఉంటిని. అప్పుడు శ్రీఅరవిందులు వచ్చారని అనలేను, ఎందుకని అంటే ఆయన నిరంతరము యిక్కడ ఉంటారు. కాని ఈ సారి ప్రత్యేకంగా దర్శన మిచ్చారు.... అది భౌతిక తలమున చాలా ఎత్తుగా పెరిగి ఆశ్రమప్రాంగణ హద్దులను దాటి యిక్కడ వాళ్ళు ఆయన్ని ఎరిగిన విధంగా కాలుపై కాలువేసి కూర్చున్నారు. అతిశయోక్తి కాదు, ఆశ్రమ ప్రహరీగోడ మీదే కూర్చున్నారు, అందువల్ల ధ్యానము చేయువారు మూయబడకుండా అందరూ ఆయనలోనే ఉన్నారు. వాస్తవముగా అలానే కూర్చున్నారు. ఆ యొక్క సన్నిధి, నాకు అధి భౌతికమునందు, ఏదైనా రాపిడి వలన కలిగే స్పర్శలా అనుభూతి కలిగింది. అచ్చంగా అది ఒక భౌతిక రాపిడి. అదే మాదిరి ఆయన కూర్చున్న తీరును గమనించాను. ఎలా ఉన్నారంటే బాగా ఎత్తుగాను, అందుకు తగ్గ శారీరక సౌష్టవము ఉన్నది. తరువాత ఆయన మెల్ల మెల్లగా క్రిందకు దిగారు. ఆ విధముగా దిగుటవలన ఒత్తిడి — ఒరపిడి ఒరవడి కలుగుట కద్దు. మెల్లమెల్లగా అక్కడ నున్న వారి మధ్య సంచలనము కలుగని రీతిలో దిగారు. ఇక అలాగే కుదురుకొని ఒక అరగంటకు పైబడే కూర్చున్నారు. కదలక మెదలక తనలో నున్న వారిపై ఏకాగ్రత నిలుపుతూ ఆసీనులై ఉన్నారు. వారంతా ఆయనలోనే వున్నారు.

చిరునవ్వు చిందిస్తూ, నేనిక్కడే కూర్చుని ఉన్నాను... నిజానికి నవ్వుతూనే ఉన్నాను. అక్కడ ప్రతిచోట ఆయన సన్నిధిని స్పర్శించగలరు! వారిలో ఎంతో శాంతము కనిపించింది! ఎంత ప్రశాంతత! ఎంత బలశక్తి!... అంతే కాదు, శాశ్వతత్వము, విశాలత, సమగ్రత కలబోసిన వదనము వారిది. ఒక రకంగా ఊహిస్తే, అనుకున్నదంతా నెరవేరి సఫలమైనట్లు, శాశ్వతత్వమును సాధించామా అన్నట్లు భావనాతృప్తి కలుగుతుంది. ఆ సన్నివేశము ఎంతో శ్లాఘనీయంగా నుండెను. పరమ మూర్ఖుడే ఆ అనుభూతిని పొందలేడు. ఆ తరువాత ఆయన ఉన్నపాటుగా నిష్క్రమించేరన్నట్లు గాక, మెల్లగా, అతిమెల్లగా ఆవిరి అయి పోయినట్లు వెళ్ళిపోయారు. తరువాత మామూలు పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడక్కడే ధ్యానం సల్పడానికి మనుషులు పోగయ్యేవారు. సాధారణమైన కార్యక్రమాలు ప్రారంభమైనాయి.

ఆ సంఘటనకు, కొందరైన స్పందించి ఉంటారని నేను భావించాను. కాని

వారు పూర్తిగా అర్థము చేసుకొని ఉండరు. ఎందుచేతనంటే వారికి అటువంటి సంఘటనల గురించి తగు అవగాహన లేనందువలన మరి, ఆయన తమలోకి దిగుతున్నారనే ఎరుక కలిగి ఉండవచ్చును. కారణము, ఆ మధ్యాహ్నము, అంతా చల్లబడి పోయింతరువాత (ఆయన ఎప్పుడూ యిక్కడే ఉంటారు. కాక పోతే జరిగిన సంఘటనను పోలి యుండదు) అనుకున్నారు:

"అయ్యో సుందరమైన ఒక సంఘటన ముగిసిపోయిందే! ఆగస్టు 15 జరిగి పోయిందే, ఒక మనోహర ఘట్టం అదృశ్యమైపోయిందే" అనే విచార ఛాయలు నలుమూలలా వ్యాపించగా అందరూ నొచ్చుకున్నారు. అదంతా నేను వర్ణించినట్లే జరిగింది. ఎంతో కొంత ఆ విధంగానే... వాస్తవమే. దాన్ని ఎలా చెప్పాలో నాకు తెలీదు. కాని వాస్తవంగా జరిగిందనే భావన నెలకొంది.ఆయనను తన అతిమానస వెలుగులో తరచు నేను దర్శించాను. ఆయన అనేకమార్లు వచ్చారు. (నేను బాల్కనీ మీదకు వచ్చినపుడు వస్తూండేవారు. కొన్నిసార్లు సమాధిపై కనిపించే వారు. చాలా పర్యాయములు వచ్చేవారు.) పరిమాణమున ఆయన రూపురేఖలు పెద్దవిగా కనిపించేవి. కూర్చొనగా, ఆయన రూపం ప్రహరీ గోడలను దాటి కని పించే విధంగా పెంచారు. ఎంతగానంటే చేతితో తడిమితే తెలిసేటంతగా, అటుపైన గొప్పవిశ్వాసం, సంతోషం యదార్థమనే భావన కూడా కలిగాయి. అసలు సందేహమే పొటమరించలేదు, సరిగదా అంతా విజయవంతమైనట్లే తోచింది.

అంతవరకు జరుపుకొన్న జన్మ దిన సంబరాల కంటే ఈ ఆగస్టు 15, జన్మదిన వేడుక అతిగొప్ప సంబరము.

(నిశ్శబ్దము)

ఆయనలో తనదైన రీతిలో నున్న ఆప్యాయత, వైభవము, పరిపూర్ణత, ప్రశాంతత గొప్పగా కనిపించాయి. ఆయన తన శరీరములో నున్నప్పటికంటే ప్రస్ఫుటంగాను. శక్తివంతముగాను వికసించాయి.

నాలో ఆ చిత్రమే నిలిచిపోయింది. ఆయన తమ గదిలో నున్నపుడు అదే రూపము, ఇక నేనెప్పుడూ వారిని దర్శించినా అదే రూపము! ఒకప్పుడు నేను ఏదో పనిలో నున్నప్పుడు అంతసేపు వారు నా వెనుక నున్నట్లే ఉండి నడిపించు చున్న అనుభూతిని పొందేదాన్ని. ఈ రూపమున్నదే యిది అంతకన్నా బలమై

నది. చాలా బలమైనది. ఈ రూపాన్ని చూస్తూ... వ్యక్తులు ముగ్ధులయ్యేవారు. ఇక తప్పుకోవాలన్నా మార్గము కనిపించేది కాదు. అది అలా ఉండేది — ఒక పరిపూర్ణ వాస్తవమైన స్థితి.
(శ్రీమాత ఒక శిష్యునితో జరిపిన సంభాషణ)

ఆగష్టు 18, 1962

శ్రీఅరవిందులు ఆది భౌతిక తలముననే ఉంటారు.

మూలాధారాన్ని కనుక్కునేందుకు అంతః సత్తయొక్క లోతైన గుహలోనికి ప్రవేశించాలి, శోధకుడు మున్ముందు ఒక భూమికనుండే ఒక భూమికకు అవరోహణ చేయాలి. ఒక చేతన నుండి మరో చేతనను దాటుకుంటూ, అనుభూతులన్నింటినీ పొందుతూ ముందుకు సాగిపోయి లోలోతులలో నెలకొనియున్న నిర్మల ప్రశాంతతను కనుక్కోవాలి. ఈ సత్త యొక్క అపార ప్రశాంతతలోనున్న అంతర్యామిని దర్శించటానికి బాహ్యప్రపంచపు గందరగోళమునకు దూరముగా, దుఃఖము ఆవేదనలకు దూరముగా, తెరలతెరల ఉద్రేకములకు దూరాతి దూరముగా, భ్రమలకు భావనలకు దూరముగా మరి ఎక్కడ అహం మనజాలదో అక్కడకు చాలా జాగ్రత్తగా సాధకుడు ప్రవేశించాలి. చేతనను అంతర్ముఖము చేయుటకు, అనగా ఎక్కడ సర్వశక్తివంతమైన దివ్యశక్తి ప్రతిస్పందించునో, ఏ శక్తి సర్వమును నడిపించునో, అక్కడకు వెళ్ళవలసి వస్తుంది గనుక తెలుసుకొని చేయవలసింది ఉంది కనుక యింకా లోతుగా వెళ్ళాలి. అక్కడ చలన ముండదు. భావన ఉండదు, అహం ఉండదు, మరేమీ కాకుండా కేవలం ఆనంద కెరటాలు మరియు అన్నింటికి మూలమున సమభావంతో కూడి ఉండే ప్రకంపన ఉంటుంది. తరువాత అచంచల పరిపూర్ణశాంతితో ఐక్యము చెందాలి.... చేతన కేంద్రీయ అస్తిత్వముతో అబేధమును సాధించి, దివ్యానందానుభూతిని పొందాలి. కాగా అచట ద్వంద్వ మనేది లేదు, అస్తిత్వమనేది లేదు, యిక ఏమీ లేదు — ఇక ఆపై శాశ్వతమైన దివ్యజ్యోతితోను సర్వవ్యాపియైన దివ్యత్వము తోను, సర్వముతానేయైన ఒకే ఒక్కనితోను మనలో అంతర్యామి అనబడే ఆత్మ తోను ఐక్యతనొందాలి

ఈ పరమపావన జ్వాలయొక్క లోతుల్లో శ్రీఅరవిందులు నివసిస్తారు — బ్రహ్మానందభరితుడు, సర్వశక్తిమంతుడు, అజేయుడు, సార్వభౌముడు,

సర్వాంత ర్యామి, సర్వశక్తిమంతుడు,సర్వజ్ఞుడు, అతి ప్రియతముడు, యజమాని, లక్ష్యము — సర్వోన్నత ప్రభువు కూడా ఆయనే.

శ్రీఅరవిందుల నామ మహిమ

శ్రీఅరవిందులను మనసారా పిలిస్తే, ఆయన యిక్కడ నుండి జవాబిస్తారు. (హృదయ కేంద్రమును చూపిస్తారు) ఆ నామస్మరణకే ఆయన చేతన స్పంది స్తుంది., ఆయన నామము అక్కడ ప్రతిధ్వనిస్తుంది. ఎందుచేతనంటే ఆయన యొక్క "గుర్తు" అక్కడ ఉంది. అగాధాల్లో నివసించేది ఆయనే..... ఈ సృష్టి అంతా ఆయన వల్లనే సజీవమై వుంటుంది.

విశ్వాన్ని కంపించేది ఆయనే. ఆయన వల్లనే అది స్పందిస్తోంది. విశ్వమం తటా, ప్రతిదానియందు ఆయన ఉన్నారు. ఆయన మూలముననే అది సచేత నమై కంపిస్తోంది.

ఆనందము రూపమున ఆయన నామ మహిమ విస్తరించి, అంతటా చొచ్చు కొనిపోయి అన్నింటిని శుద్ధి చేస్తుంది. ఉత్తమోత్తమమైనది, వాస్తవమైనది, మరియు శాశ్వతమైనది అగు ఆయన నామ మహిమ ప్రతిధ్వనిస్తుంది. ఆయన నామ మహిమ వలన సృష్టికి ఒక అర్థం ఏర్పడుతుంది. అది, ఈ విశ్వాంతరాళ మున ప్రతి వస్తువు యందును దాగియున్న దైవముయొక్క ఉనికిని తేటతెల్లము చేయాలి.... ఆయన్ని దర్శించటమే ఒక శాశ్వత క్రీడ. ఆయన్ని ఆకళింపు చేసుకొ వడం అంటే పరిపూర్ణ పవిత్రత యొక్క చెదరని శాంతిని అనుభవించుటయే. ఆయన్ని దర్శించటమంటే శాశ్వత ఆనందాన్ని అనుభవమునకు తెచ్చుకున్నట్లే. ఆయన్ని పిలవటం అంటే అనంతముయొక్క తలుపులను తెరచినట్లే. శ్రీఅరవిం దుల నామము వెనుక యింత ఘనత ఉంది. (శ్రీమాత పారవశ్యంలోకి వెళ తారు)

అనంత జ్వాలలో ఒక సన్నిధిగా, ఒక పనికి అంకురార్పణం చేసి చైతన్య వంతము చేయు శక్తిగా, అన్నింటికి ప్రశాంతతను ప్రసాదించి మృదుమధురము చేయు శాంతముగా, అన్నింటిని శుద్ధిచేస్తూ, పొంగి ప్రవహించే ఆనందదాయి నిగా క్షాళనగావించి, ప్రకాశింపజేయు దివ్యవెలుగుగా, అంగీకారాన్ని తెలియ జేసే ప్రకంపనగా నేనక్కడ ఉంటాను.

శ్రీఅరవిందులు ప్రోత్సహించి భారము వహించే శక్తిగా నుంటే, నేను ఒక మార్గదర్శిగా ఉంటాను. నిజానికి మేము యిద్దరు వ్యక్తులుగా కనిపించినా, వ్యక్తిత్వము మాత్రము ఒకటే. ఒకరు సాక్షిగా నిలబడితే రెండవవారు కర్మిష్టి, శక్తి.

ఆ విషయాన్ని గ్రహించనంతకాలము ఏవ్యక్తీ ఏమీ అర్థము చేసుకొనలేడు....

చూడు నాయనా, ఎవరైతే శ్రీఅరవిందులను నన్ను ఒకే వ్యక్తిత్వమని ఒక్కటే అని గుర్తిస్తారో అట్టివారికి సత్యాన్వేషణలో ఎదురయ్యే నిరోధములు అడ్డగింపులు, కష్టాలు, వంచనలు, తొలగింపబడును అని ఈ జన్మలోనే గాక మరణాంతరము రానున్న జన్మల్లోను, యుగాంతము, తొలగింపబడును.

అవును, అటువంటి వారికి దైవము సర్వశక్తివంతునిగా వెనుక నిలిచి వుంటాడు. కేవలం పునశ్చరణ గావించాలి. "మాతా —శ్రీఅరవింద, మాతా — శ్రీఅరవింద"....

అది చాలు. (మళ్ళా శ్రీమాత పారవశ్యంలోకి వెళతారు.)

The Supreme, pp. 62-64

కొసమెరుపు

శ్రీఅరవిందుల జాలి

అది ప్రాతఃకాలమున ఐదుగంటల సమయం. అలవాటు ప్రకారం శ్రీమాత శ్రీఅరవిందులు నివాసముంటున్న పవిత్ర గృహానికి వెళ్ళాను. వారి అనుగ్రహము వలన ఆ ఇంటిని శుభ్రపరచవలసిన పని నాకు అప్పగించారు. ఆనందదాయకమైన ఈ పనిని నేను నిర్వర్తించుటకు ఆమె తలుపులు ఆమెయే తెరిచెడివారు.

కాని ఒకనాడు తలుపు తెరుస్తూ శ్రీమాత అలాగే నిల్చుని ఉన్నారు. శ్రీఅరవిందులనామాన్ని ఉచ్ఛరిస్తూ ఆమె ఒక సూచన చేసారు. శబ్దము చేయకుండా ప్రశాంతముగా నుండాలని, ఎందుకంటే ఒక పిచ్చుక ఎదుటి ద్వారము పెద్ద తలుపు మీద కూర్చొని విశ్రమిస్తున్నదని, దాన్ని చెదరగొట్టరాదని ...

ఆ సూచనను దైవాజ్ఞగా భావించి నిశ్శబ్దత పాటిస్తానని సంకల్పించాను. మరి నేను లోపలికి ప్రవేశించాను. శ్రీమాత వెళ్లిపోయారు. నేను చప్పుడు చేయకుండా, కిమ్మనకుండా ఆ పెద్దద్వారము ప్రక్కనుండే వెళ్ళిపోయాను.

కదలకుండా మెదలకుండా ఆ పిచ్చుక అక్కడే కూర్చుంది. ఎంతో ఆశ్చర్యము, ఆనందము నాకు కలిగాయి.

నేను చలించిపోయాను. మన దివ్యగురుదేవుడు ఎంత కరుణామయుడు. రాత్రి సమయమున ఆ హాల్లోనే ఆయన ఇటు-నటు నడుస్తూండేవారు. అది ప్రశాంత వాతావరణమునకు నిలయము... ఆ వాతావరణములో ఈ పిచ్చుక విశ్రాంతి తీసుకోవడం ఆయన గమనించారు. ఆయన కరుణకు పాత్రులైనవారు ఒక్కమానవులు మాత్రమే కాదు, సమస్త జీవరాసులు, చిన్నా పెద్దకు కూడా ఆయన ప్రేమకు వారి విశ్వవ్యాప్త హృదయములో స్థానమున్నది.

మనమంతా ఎంతో అదృష్టవంతులము. ఆయన ఉనికి వలన ఈ భూమండలము ఎంతో దశమంతురాలైంది. ఆయన సజీవ జగత్ప్రభువు యొక్క స్వరూపము. ఆయన తమ ఉన్నతోన్నత శిఖరాలనుండి, మన వైపు వంగి మనల్ని తమ ప్రేమపూరిత హృదయమున భద్రముగా నుంచుతూ పోషిస్తారు.

(శ్రీపూజాలాల్ జ్ఞాపకాలనుండి.)

*

డిసెంబరు 8, 1950

వారి శరీరాన్ని పునరుజ్జీవింపజేయమని నేనడిగినప్పుడు వారు స్పష్టమైన సమాధాన మిచ్చారు. "నేను ఒక ప్రయోజనార్థం ఈ శరీరాన్ని వదిలాను, దానిని తిరిగి స్వీకరించను. మొదటిసారి అతిమానస విధంగా నిర్మితమయ్యే అతిమానస శరీరంలో మళ్ళీ ప్రకటితమవుతాను."


CWM 13:9

శ్రీమాత

అనువాదం: డా. దామెర వెంకటేశ్వరరావు

మంత్రము

(బీజాక్షర దైవోపాసన)



అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2015

విషయసూచిక

పాఠకులకు మనవి

శ్రీఅరవిందులు అంటారు: "ప్రగాఢమైన ఆధ్యాత్మిక వాస్తవికతను ఛందోబద్ధంగా వ్యక్తపరిచేది మంత్రము. అది ఎప్పుడు సాధ్యపడుతుందంటే, మూడు అతి తీవ్రమైన ఛందోబద్ధమైన వాక్యాలు కలిసి లయబద్ధంగా, అత్యంత ఉదాత్తమైన పదజాలంతోను, దృఢమైన ఆలోచనాసారంతోను, విడదీయ రానటువంటి ఏకైక వాక్కుగా, అందంగా అల్లబడి, అంతరాత్మ సదృశమైన సత్యాన్ని వ్యక్తపరచిన ప్పుడు" అది పరమ సత్యదర్శనం వలన కలిగి పారవశ్యతలో, ఆరాధనాభావనలో, పెల్లుబికిన అంతరాత్మ వాణి, మంత్రము యొక్క గుప్త జన్మస్థానం అత్యున్నత అంతరిక్షం. అందుకు అంతరాత్మయే సాక్షి, కారణం. మంత్రము పరిమిత మానవబుద్ధి పరిధిని అధిగమించి, అనంతమైన, హద్దులులేని క్షేత్రంలోనికి అధి రోహిస్తుంది. అందువలన మంత్రము కేవలం అపార అర్థగర్భితమైన కొన్ని సంస్కృత పదాలను మించినది. మంత్రము ఏ భాషలోనైనా వుండవచ్చు. ఎందు కనగా అది నక్షత్రాలను మనోవాచామ గోచరుడగు భగవంతుని కంఠమాలగా అల్లే అనంత నిశ్శబ్ధతలో ఆవిర్భవించినది. దాని అర్థ గాంభీర్యత సామాన్య అర్థ భావముల పరిధిని అధిగమించి, ఆకాంక్ష, ప్రేమ అనబడే రెక్కల ప్రకంపనాల పరిసరాలను చేరి, శ్రోతను పరమ సత్య దివ్యధామానికి కొనిపోతుంది, లేదా సృష్టి యొక్క అనేకానేక ముసుగుల వెనుక మరుగునపడి వున్న దివ్యవైభవాన్ని కొంతవరకు అతనికి వెల్లడి చేస్తుంది.

ఈ సంచికలో శ్రీమాతారవిందుల మంత్రభరితమైన వ్యాఖ్యలు, రచనల ద్వారా మనకు ప్రకటితమైన సత్యాలను వెల్లడి చేయడానికి ప్రయత్నించాము.

సంపాదకుడు



శ్రీమాత

మంత్ర సిద్ధాంతం

భౌతిక ప్రపంచంలో శబ్దానికి శక్తి వుంది

శబ్దాని కొక శక్తి ఎప్పుడూ వుంది, మనం అనుకొనేదాని కంటే యెక్కువ శక్తే వున్నది. అదొక మంచిశక్తి గావచ్చు, చెడుశక్తి కావచ్చు. మనం కాదనలేని ప్రభావాన్ని చూపించగల కంపనాలనది సృష్టిస్తుంది. శబ్దానికున్నంతగా, భావానికి శక్తి లేదు. భావానిక్కూడా శక్తి వుంది కాని అది దాని స్వస్థానంలోనే — అలా గాక శబ్దానికి పదార్థ ప్రపంచంలో గూడా శక్తి వుంది.

ఈ విషయాన్ని మీకొకసారి వివరించి చెప్పాననుకొంటున్నాను. ఉదా: యథాలాపంగానూ, మామూలుగానూ ఏమాత్రం విచారణ చేయకుండా, ఏమీ విలువ నివ్వకుండా చాలామంది యేదో పని మీద మాటల నుపయోగిస్తుంటారు అని మీకు చెప్పాను. "బోన్ జూర్" "గుడ్ డే" అనే మాటలను గురించి మీకు వివరించా ననుకొంటున్నాను, కాదా? జనం ఒకరి నొకరు కలుసుకొన్నప్పుడు "బోన్ జూర్" అని చెప్తుంటారు. అలా చెప్తున్నపుడు యేమీ ఆలోచించకుండా యాంత్రికంగా చెప్పేస్తారు. ఆ మాటను సంకల్పించి, యెదుటివానికి నిజంగా శుభం కలిగించే రోజవ్వాలని ఆకాంక్షించితే మంచిదే. "శుభదినం" అని నీవనే మాట చాలా ప్రభావం చూపే, నీవు ఆ మనిషిని ముఖాముఖి కలుసుకొన్నపుడు చెప్పేదాని కంటే యెంతో అధిక ప్రభావం చూపే విధానం ఒకటుంది.

పైకేమీ అనకుండా "ఆహ్! అతనికి శుభం కలగాలని ఆశిస్తున్నాను" అని నిజంగా అనుకొంటే అది అతనికి మరింత ఘనిష్ఠమైన ప్రభావం చూపుతుంది.

మాటలో మాటగా చెప్తున్నాను, శాపాల విషయంలో జరిగేదదే. ఎవరికైనా కోపం వచ్చి అవతలి వ్యక్తికి చెడు జరగాలన్నపుడు కూడా అంతే. వాళ్ళ చెంప చెళ్ళు మనిపించినదాని కంటె బాగా హాని — కొన్ని సందర్భాలలో చాలా యెక్కువ హాని — చేస్తుంది. బాగా సున్నిత మనస్సు గల మనుష్యుల విషయంలో అది వాళ్ళ జీర్ణక్రియను అస్తవ్యస్తం చేస్తుంది, గుండె లదిరేటట్లు చేస్తుంది, యెందుకనంటే వినాశకరమైన ఒక దుష్టశక్తిని నీవు అన్న మాటలో చొప్పించావు.

మాటలో ప్రభావం లేదని గాదు. ప్రతి వ్యక్తీ ఆంతరికశక్తి మీద, సహజంగా, ఆ ప్రభావం యెక్కువగా ఆధారపడి వుంటుంది. భౌతికసాధనాలను అందు కుప

యోగిస్తే తప్ప, బలహీనులు, యెరుక లేనివాళ్ళు పెద్దగా యేదీ చేయలేరు. నీకున్న బలం పరిధిలో ముఖ్యంగా నీకు శక్తివంతమైన ప్రాణికమున్నపుడు నీవు చెప్పేదాని మీద నీకు గొప్ప నియంత్రణ వుండాలి లేకపోతే నీవు చాలా అపకారం చేయగలుగుతావు. అజ్ఞానంవల్ల, నీవు కోరుకొనకుండానే, నీకు తెలియకుండానే అలా చేయడం జరుగుతుంది.

CWM 7:343-44

మాటలకు శక్తి మూడు విభిన్న మూలాల నుండి వస్తుంది

ప్రతి రోజూ నీవు అనవసరంగా యెన్ని మాటలు మాట్లాడుతున్నావో నీకు తెలియజెప్పడం అనవసరంగా కన్పిస్తోంది. ఈ చెడు అలవాటును గురించి అందరికీ తెలిసినా దాన్ని సరిజేసుకోవడానికి కొద్దిమందే ఆలోచిస్తారు.

కాని అవసరమైన మాటలు కూడా మనం పలికేవాటిల్లో వుంటాయి. అంటే మాటల వెనుక సరియైన ఆలోచన నెలా పెట్టాలో మనకు తెలిస్తే యితరులకు సహాయపడాలనే మన కోరికను బయటపెట్టే అవకాశం మనకు తరచుగా లభిస్తుంది.

ఒకటి రెండు మాటలు మాట్లాడి మనకు తెలిసినవారి చుట్టూ ఒక ప్రయోజనకరమైన మానసిక వాతావరణాన్ని నిలుపడం ద్వారా వారికి యదార్థంగా సహాయపడే అవకాశాన్ని చాలా తరచుగా కోల్పోతాం. ఈ ఉపేక్షాభావాన్ని లేకుండా చేసుకోవడం వల్ల చాలా వుపయోగం వుంటుంది.

అధిక జనాభాలో దాదాపు యెల్లపుడూ వుండే, సున్నిత విషయాలను సరిగా గమనించక విడిచివేయు అస్పష్ట స్థితిని మన మనస్సులు విడిచివేయాలి, అలా అయితేనే ఆ ఉపేక్షాభావం లేకుండా పోతుంది, తిరస్కరించబడుతుంది.

ఈ మగతను క్రమంగా మనంతట మనం వదలించుకొంటే ఒక మాటను పలికేటప్పుడు, అది పూర్తిగా ప్రభావం చూపేటట్లు, దానికుండే కచ్చితమైన అర్థం, దాని యదార్థ ఆంతరిక భావం యేమిటో విచారించగలిగేటట్లు మనల్ని మనం కట్టడి చేసుకోవాలి.

ఈ విషయాన్ని ద్రుష్టిలో వుంచుకొని చూస్తే మాటలకు క్రియాశీలమైన శక్తి మూడు విభిన్న ఆధారాల నుండి లభిస్తుందని చెప్పగలం. ఆ మాటలోనే మొదటి

రెండూ వుండడం చేత అది శక్తుల నిక్షేపంలా తయారౌతుంది. మనం దానిని పలికినపుడు ఆ మాట వ్యక్తం చేసే లోతైన భావాన్ని సమగ్రంగా జీవించడమనే వాస్తవికతలో మూడో ఆధారం వుంది. ప్రభావం కల ఈ మూడు కారణాలను ఒక చోటికి చేర్చి కలుపగలిగితే, సహజంగా మాట శక్తి చెప్పుకోదగినంతగా యినుమడిస్తుంది.

1. భావం యొక్క స్వీయక్షేత్రంలో ఉత్పన్నమయ్యేదాని అత్యంత సూక్ష్మ కంపనం, భౌతిక ప్రపంచంలో పరిపూర్ణ కంపమానమైన వాస్తవరూపం ధరించేటట్లు చేసే కొన్ని పదా లున్నాయి.

మనం గనుక, భావ కంపనాలకు, ధ్వని కంపనాలకు మధ్య గల సారూప్యతను క్షుణ్ణంగా పరిశీలించినట్లైతే అత్యంత సాధారణమైన భావాలను వ్యక్తం చేసే, అనేక లిపి లేని వాడుక బాషలలో, దాదాపు ఒకే అర్థంగల పరిమిత సంఖ్యలో వున్న బీజాక్షరాలను తెలుసుకొంటాం (భాషకు గల ఈ మూలాన్నీ లిపి గల భాషల మూలం అనుకొని అయోమయానికి లోను గాకూడదు. లిపి గల భాషలు పూర్తిగా భిన్న స్వభావం కలవి. అవి విభిన్న అవసరాలకు తగినట్లుంటాయి).

2. వందల సంవత్సరాల పాటు కొన్ని పరిస్థితులలో పునశ్చరణ చేయబడిన యితర మాట లున్నాయి. వాటికి రూపకల్పన చేసిన వారందరి మానసిక శక్తులతో నిండిన మాటలవి.

ఊర్జం యొక్క నిజమైన నిక్షేపాలవి.

3. పలికీ పలకగానే వాటిని ఉచ్ఛరించేవాని సజీవభావం ఫలితంగా విలువను సంతరించుకొనే మాటలు ఉన్నాయి.

ఒక ఉదాహరణతో నేనిప్పుడు చెప్పినదాన్ని వివరించడాని కిక్కడొక శక్తివంతమైన మాట వుంది. ఎందుచేతనంటే అది త్రివిధ వర్గాల లక్షణాలను కలుపుతుంది: అది సంస్కృతాక్షరం "అ, ఉ, మ" — 'ఓం'.

దైవం సర్వవ్యాపకతను తెలియజేయడానికి భారతదేశంలో ఆ పదాన్నుపయోగిస్తారు. ఆ దేశంలో ప్రతి ధ్యానంలోనూ, ప్రతి జపంలోనూ, ప్రతి యోగవిధానంలోనూ ఆ అక్షరాన్ని జతపరుస్తారు.

మరే యితర శబ్దానికన్న ఈ శబ్దం "ఓం", శాంతి, ప్రసన్నత, నిత్యత్వాల అనుభూతిని అధికంగా రేకెత్తిస్తుంది.

పైపెచ్చు, శతాబ్దాల తరబడి దానిని పునశ్చరణ చేస్తున్నవారందరూ అది వ్యక్తం చేసే భావం చుట్టూ ప్రోదిచేసిన మానసిక శక్తులతో ఈ అక్షరం నిండి వుంది. ముఖ్యంగా హిందువులు ఆవాహన చేసే దివ్యసత్యంతో మనకు సంపర్కం కలిగించే యదార్థ శక్తి ఆ 'ఓం' కున్నదని విశ్వసిస్తారు.

ప్రాచ్యులకు మతపరమైన మనస్సు, ఏకాగ్రత వహించు అలవాటు వుంది. వారిలో కొంతమంది పూర్తి ప్రభావం చూపగల విధంగా ఆ అక్షరాన్ని తయారు చేయడానికి అవసరమైన దృఢనమ్మకాన్ని దాని మీద పెట్టకుండా పలుకుతారు. అలాంటి అర్థాన్నే యిచ్చే పదంతో, కొంతవరకు అదే విధమైన ధ్వనిగల పదం 'టావో' తో చైనా దేశస్థులు గూడా అలాంటి ప్రభావాన్నే పొందుతారు.

మన పశ్చిమదేశాల భాషలు పెద్దగా భావాన్ని వ్యక్తీకరించలేవు. వాటి ప్రస్తుత రూపంలో ఆ భాషలు తమకు జన్మనిచ్చిన మూలాలకు చాలా యెడమై పోయాయి. అయితే మన సజీవమైన చైతన్యవంతమైన శక్తిచే ఒక పదాన్ని సజీవం చేయవచ్చు.

పైగా సర్వసామాన్య వాడుకలో వున్నవాటి అన్నింటికీ, ప్రయోజకత్వం కలిగించే సూత్రాలను మనం జోడించగలం.

మంత్రోపదేశానికి సంబంధించిన కొన్ని పురాతన విధానాలలో ఈ సూత్రాల నుపయోగించారు, అవి కుశలప్రశ్నలకు వుపయోగపడ్డాయి. వాటి నెలా భావించాలో తెలిసినవాని నోటి నుండి వాటికి చర్య జరిపే ప్రత్యేక శక్తి లభించేది. మార్గంలో తొలి అడుగు వేస్తున్న శిష్యులను, క్రొత్తగా ఉపదేశం పొందేవారిని "సమతా శాంతులతో వర్ధిల్లుదువు గాక" అని దీవించేవారు.

నిరంతర పురోగమనాత్మక, ఆంతరిక, బాహ్య వైఖరివల్ల తమ ప్రగాఢ శాశ్వత శుభేచ్ఛను తెలిపినవారందరూ " మీకు సర్వోన్నత శుభం కలుగు గాక" అని దీవించబడ్డారు.

కొంతమంది బోధకులలో, ముఖ్యంగా ఉన్నత శక్తులు వ్యక్తపరచేవారిలో ఈ పదం యధార్థమైన వరాలు ప్రసాదించే శక్తి కలిగి వుండేది. ఉదా: స్వస్థత చేకూర్చే శక్తిని ప్రసారం చేయగల శక్తి వారి వాక్కు కుండేది.

CWM 2:66-68

వాక్కు మూలం

వాక్కు అంటే పలికిన పలుకులుగాని, మాటలుగాని కాదు. "వెలుగు ప్రత్యక్షమౌ గాక, వెలుగు ప్రత్యక్షమైంది" అని చెప్పే పురాతన సంప్రదాయాలున్నాయి. వాక్కు అంటే మంత్రమే, కాని అది అత్యంత ప్రత్యేకత గలది. సంకల్పం ఆత్మలో రూపం ధరించి, పదార్థంలోనికి దిగిరాదలచుకొని సరాసరి పదార్థంపై చర్య జరుపాలనుకొన్నపుడు అది శబ్దాన్నుపయోగించుకొంటుంది. అది మాటనేగాక శబ్దాన్ని, శబ్ద కంపనాన్ని — పదార్థం మీద, పదార్థంలోపల సరాసరి పనిజేయడానికి వుపయోగించుకొంటుంది. అది వ్యతిరేక దిశగల కదలిక. నీవిపుడు, మాటలలో భావం రూపుదిద్దుకొనే క్షేత్రంలో వున్నావు. అచటి నుండి పైకి లేచి, నిశ్శబ్ద నీరవభావం రూపాన్ని సంపాదిస్తావు. తిరిగి అచటి నుండి యింక పైకి పోయి దివ్యక్రియాశక్తిని సంపాదిస్తావు. భావం యొక్క అసలు మూలమైన దివ్యచేతన అయినటువంటి దివ్యక్రియాశక్తిని సంపాదిస్తావు. ఆ విధంగా అది రూపం దిద్దబడినది గాక — వ్యక్తం చేయడానికి రూపం దిద్దబడినది గాక — సంపూర్ణ చేతనయే అవుతుంది. అంటే నీవు సరిగ్గా వెనుదిరిగి మూలాని కెగబ్రాకినట్లవుతుంది. అచటి నుండి ఆ వెలుగును వెలుగులోనే నీవు వశం చేసుకొని ఈ చేతనను చేతనలోనే వశం చేసుకొని పదార్థంపై ప్రభావం చూపి ఒక ఫలితాన్ని కలుగచేయా లనుకొంటే, ఈ సంకల్పం, పై స్తరం నుండి క్రింది స్తరం లోనికి దిగి వస్తుంది. అది అధికాధికంగా పదార్థంగా తయారవుతుంటే, అది తనకు తాను స్పష్టంగా మాటలలో లేక ఒక్క మాటలో అయినా స్పష్టీకరించుకొంటుంది. అది పదార్థాన్ని తాకినపుడు ఒక శబ్దరహిత మాటగా వుండడానికి బదులు, శబ్దాలతో ఉచ్ఛరించ దగిన మాటగా తయారవుతుంది. అంటే సరాసరి పదార్థం మీద పని చేసే కంపనం అవుతుంది. కాని క్రిందికి తిరిగి రావడాని కతడు మొదట పైనున్న ఉన్నత స్థితిలోనికి తనను తానుద్ధరించుకొనక తప్పదు. క్రిందికి దిగివచ్చి ఇది చేయాలంటే అతడు నిశ్చల నీరవ చేతనకు చేరుకొని వుండాలి. అది పైనుంచే తప్పక రావాలి, అతడు పలికే ఈ పదానికి మూలం పైనే వుండాలి గాని, మధ్యంతర సీమ దేనిలోనూ గాదు. అప్పుడే అది మంత్రవాక్కు అవుతుంది. అందుచేత

నేను చెప్పింది తప్పక చేసి తీరాలి — అదంత తేలిక విషయం గాదు.

CWM 6:98-99

శ్రీమాత

మార్మికుల వ్యవస్థలో మంత్రవాక్కు

భారతీయ యోగవిధానాల్లో సాక్షికంగా నిలిచివున్న మార్మికుల వ్యవస్థలో మంత్రవాక్కు ఒక శక్తి. మంత్రవాక్కు సృష్టి చేస్తుంది. ఎందుకంటే సమస్త సృష్టి ఒక వ్యక్తీకరణ, సమస్తం అది వరకే అనంతుని రహస్య ఆవాసంలో వున్నది, 'గుహా హితమ్'. దానిని సక్రియాత్మక చేతనచే ఇచట పైకి కన్పించేటట్లు తీసుకు రావడం మాత్రమే జరుగుతుంది. వేదవాదానికి సంబంధించిన కొన్ని ఆలోచనా విధానాలు, లోకాలు, రూపం దిద్దుకొనక ముందు, వాగాధిదేవత శబ్దాన్ని ప్రథమ కంపనంగా సృజించిందని భావిస్తాయి. వేదంలోనే పవిత్ర ఛందస్సులను "అనుష్టుప్, త్రిష్టుప్, జగతీ, గాయత్రీ" లను, వస్తువులు పోతపోయబడిన వైశ్వ గతి లయలకు సంకేతాలుగా ఆదరించిన ఉదంతాలు వున్నాయి.

అయినపుడు వ్యక్తపరచడం ద్వారా మనం సృజిస్తున్నాం అన్న మాట. మంత్రం వల్ల తమలోనే మనుష్యులు దేవతలను సృష్టిస్తారని కూడా చెప్పారు. మంత్రవాక్కుచే మన చేతనలో సృష్టించినదానిని, అక్కడనే అది మనలో ఒక భాగమైపోయేటట్లు, మన ఆంతర జీవితంలో మాత్రమే గాక, బాహ్య భౌతిక ప్రపంచం మీద కూడా ప్రభావం చూపించేటట్లు, మంత్రవాక్కుచే అక్కడే స్థిరంగా వుండిపోయేటట్లు చేయగలం. వ్యక్తపరచడం ద్వారా రూపం కల్పిస్తాం, ధృవీక రణ ద్వారా ప్రతిష్ఠిస్తాం. వ్యక్తీకరించే శక్తిగా వాక్కును "గాయిః" లేక "వచస్" అంటాము, ధృవీకరణ శక్తిగా "స్తోమ" అని అంటాము.

CWSA 15:270-72

మనం మాట్లాడే భాష

మహావాక్కును ప్రయోగించే అతిమనస్సు, సృష్టి చేసే "భగవద్వాక్కు". మహావాక్కుకు బీజ-శబ్దాలున్నాయి — వేదాక్షరాలైన "అ, ఉ, మ" లను, తాంత్రి కుల బీజ-శబ్దాలను, అది సూచిస్తుంది — వాటిలో వస్తువుల సూత్రా లుంటాయి.

మనిషి మహోన్నత శక్తిసామర్థ్యాలకు వచ్చే ప్రకాశమాన, దైవప్రేరిత పలుకు వెనుక మహావాక్కు రూపాలున్నాయి. ఇవి జగత్తులోని వస్తువుల రూపాలను శాసిస్తాయి. మహావాక్కుకు స్వీయ లయ లున్నాయి — ఎందుకనంటే అదొక అస్తవ్యస్త కంపనం గాదు, కాని మహనీయ వైశ్వ లయగా మారిపోతుంది — ఆ లయల ననుసరించి అది నిర్మించే ప్రపంచ ధర్మం, అమరిక, సామరస్యత, ప్రక్రియలు వుంటాయి. ప్రాణమే స్వయంగా భగవంతుని ఒక స్వర లయ....

ఆ మహావాక్కు మన సంభాషణ యొక్క భాష, సారతః స్వ.యంగా శాశ్వతుని మహాశక్తి, తన మహోత్కృష్ట గతులలో ఆతని రూపం యొక్క భాగం, శాశ్వతమై వుండే ఆధ్యాత్మిక దేహం "బ్రహ్మణోరూపమ్".... మానవభాష నిమ్నస్థాయికి చెందిన వ్యక్తీకరణ, మహా అయితే దివ్య మహావాక్కు ఛాయ, బీజ-శబ్దాల సరియైన లయల ఛాయ మాత్రమే. శాశ్వత చింతనుడు, సమరసుడు, సృష్టి కర్త, సర్వజ్ఞుని, సర్వశక్తివంతుని తెలియజేయు శబ్దరూపాలు. అత్యున్నత దైవప్రేరిత భాష దేనినైతే మానవ మనస్సు చేరగలదో లేక పొందగలదో, ఏ విధంగానూ విశ్లేషించ నలవిగాని విధంగా పరమోత్కృష్ట సత్యాన్ని వ్యక్తం చేసే వాక్కు, అత్యంత శక్తివంతమైన అక్షరం లేక మంత్రం కూడా అసలు దానికి యెంతో యెంతో దూరానున్నదాని వ్యక్తీకరణ మాత్రమే సుమా!

CWSA 18:32-33

వాక్కు యొక్క పరమ నిగూఢ శక్తి

ప్రాచీన వైదిక సిద్ధాంతం, వైదిక అనుష్ఠానం, మంత్రాన్నుపయోగించి మాట కుండే ఈ సృజనాత్మక శక్తిని విస్తృతం చేసింది. మన అస్తిత్వపు నిగూఢ లోతుల నుండి జన్మించిన శక్తి వాక్కే మంత్రం. మనస్సు కంటే లోతైన ఒక చేతనచే పొదగబడి హృదయంలో రూపొందించబడినదేగాని, మొదట బుద్ధిచే అది నిర్మితం కాలేదు. దానిని మనస్సు చిక్కించుకొని, తిరిగి జాగృత మానసిక చేతన దానిపై యేకాగ్రత వహించి తరువాత నిశ్శబ్దంగా లేక నోటి మాట ద్వారా — నిశ్శబ్ద వాక్కు బహుశః నోటిమాట కన్నా అధిక శక్తివంతమైనదనే అభిప్రాయం వుంది — కేవలం సృష్టి కార్యం కోసమే బయటకు రువ్వబడింది అనేది మంత్రం సిద్ధాంతం. మంత్రం మనలో విషయగతమైన (అంటే వ్యక్తి అంతరంగంలో మాత్రమే తెలిసే)

నూతన స్థితులను సృజించడం మాత్రమే గాకుండా మన అంతరాత్మిక అస్తిత్వాన్ని గూడా మారుస్తుంది. అంతకు ముందు మనలో అందుబాటులో లేని జ్ఞానాన్ని శక్తిసామర్థ్యాలను బయల్పరుస్తుంది. మంత్రా న్నుపయోగించేవారిలోనే గాక అదే విధమైన ఫలితాలను యితరుల మనస్సులలోనూ ఉత్పత్తి చేయడం మాత్రమే గాకుండా భౌతిక భూమిక మీద కూడా, మానసిక, ప్రాణిక ప్రభావాలలో, చర్యలలో ఫలితాలు చూపించగల కంపనాలను కూడా మంత్రం సృజించగలదు.

వాస్తవానికి సాధారణంగా కూడా, ప్రతి నిత్యం, గంట గంటకూ మన మీద, యితరుల మీద పనిచేసే ప్రాణిక, భౌతిక కంపనాలను పోలి వుండేటట్లుగా పర్యవసించి, భౌతిక ప్రపంచంలో చర్యలను, రూపాలను పరోక్షంగా సృజించడంతో అంతమయ్యే భావకంపనాలను, భావరూపాలను మాటచే మనలో మనం పుట్టిస్తూనే వున్నాం.

మనిషి మనిషి మీద నిశ్శబ్ద పదం, లేక నోటిమాట ద్వారా చర్య జరుపుతూనే వున్నాడు. ఆ విధంగా అతడు తక్కిన వైశ్వప్రకృతిలో సైతం, తక్కువ ప్రత్యక్షంగా, తక్కువ శక్తితోనే అయినప్పటికీ నిరంతరం చర్య జరుపుతూనే వున్నాడు. కాని మనం తెలివితక్కువగా బాహ్య ప్రాపంచిక రూపాలలో, దృగ్గోచర విషయాల్లో బందీలమై దాని సూక్ష్మ అభౌతిక ప్రక్రియలను పరీక్షించే శ్రమ చేయడం లేదు, వెనుకగా వున్న ఈ విజ్ఞాన క్షేత్రాన్నంతా యెరుగని అజ్ఞానులుగానే మిగిలిపోయాం.

వాక్కు కుండే ఈ రహస్య శక్తిని యెరుకతో ఉపయోగించుకొనడానికి వేద కాలంలో మంత్రాన్ని తీసుకొన్నారు. దాని కాధారంగా వున్న సిద్ధాంతాన్ని, ప్రతిరూపం వెనుక వుండే శబ్దరూప సృజనాత్మక కంపనానికి సంబంధించిన మన ఊహాత్మక సిద్ధాంతాన్ని రెంటినీ కలిపి తీసుకొంటే, ఆదియందు సృష్టించబడిన మహావాక్కుభావనను అర్థం చేసుకోవడం మొదలుపెడ్తాం. సాదృశ్యరూపాలను సృజించే లేక రూపమార్పులను కలిగించే శబ్ద కంపనాలను మనం యెరుకతో ఉపయోగించుకొన ప్రయత్నిద్దాం. కాని ప్రాచీనుల దృష్టిలో, భౌతికస్తరం సృష్టిలోని అన్ని స్తరాలలోకి అల్పమైనది.

CWSA 18:30-32

ప్రేరితమైన దివ్యదృష్టి

వైదిక కవులకు మంత్రం అంటే ఒక దివ్యప్రేరణ, దివ్యప్రకాశం గల దృష్టి, ఒక సాక్షాత్కారంతో భావిదృష్టి గల ఆలోచనతో కూడిన దర్శనం కలిగించే, బరువైనదే కాని అవసరం వున్న ఆధునిక పదం. భగవంతుడు, ఆత్మ, మనిషి, ప్రకృతి, జగత్తు, జీవితం, వస్తువు, ఆలోచన, అనుభవం, ఆచరణకు సంబంధించిన బరువైన కాని అవసరం వున్న ఆధునిక పదం మంత్రం. అది మహనీయ అంతరాత్మ లయ, చందస్సుల రెక్కలపై తేలియాడుతూ వచ్చిన తలంపు. ఎందుకనంటే, దర్శనంను, శ్రవణం నుండి వేరు చేయలేం. అవి ఒకే చర్య. వ్యక్తిలో సత్యం జీవించడాన్ని — సాక్షాత్కారానికి మనమిచ్చే అర్థం — ఏ ఒక్కదాని నుండీ విడదీయలేం. సృష్టించువానిలో లేదా మానవ మాధ్యమంలో దివ్యవాక్కు ఆకారం తీసుకొనే అంతర్దృశ్య, శ్రవణంల వ్యక్తీకరణ అంతరాత్మలో దాని సన్నిధి, మనస్సుపై దాని పెత్తనానికి ముందుగా గాని దానితో పాటుగా గాని రావాలి. మంత్రం హృదయం ద్వారా వెలువడుతుంది, ఆలోచించే మనస్సుచే దానికి శాశ్వతుని దైవత్వపు వాహిక రూపాన్ని ఇస్తుంది, ఆ రూపం లోనికి మలచబడుతుంది. అది దర్శనమైన ఈ శాశ్వతుని దివ్యసత్యం యొక్క ఒక మోము లేక ఒక రూపం మాత్రం. కవి — ద్రష్ట పలుకును వినగల యుక్తుడైన బాహ్యశ్రోత మనస్సులో గూడా వాక్కు ఒక నిజమైన మహామంత్రమైతే ఈ మూడూ (భావం, దర్శనం, శ్రవణం) ఒకటిగా అవ్వాలి; అంతరాతరంలోని సత్య దృష్టి సత్యశ్రవణంతో పాటు రావడం జరగాలి, దాని అంతరాంతర ఆత్మను, మనస్సు వశం చేసుకోవాలి, మహావాక్కు లయతో గూడిన సందేశం, మహాసత్యానికి సంబంధించిన మనోదృష్టి, అంతరాత్మ స్వగృహం లోనికి మంత్రం రావడంతో పాటు లేక దాని ననుసరించి వెంటనే జరగాలి.

CWSA 26:217-18

మార్మిక అక్షరం “ఓం”

సమస్త వాక్కు, సమస్త భావం మహిమాన్వితమైన “ఓం” — ఓ మహా వాక్కు, బ్రహ్మం నుండి కుసుమిస్తూ వెలువడినవే. ఇంద్రియగ్రాహ్యమైన

వస్తురూపంలో అది అభివ్యక్తమౌతుంది. దీని రూపములు, వస్తువులు, దర్శనీయ, స్పర్శనీయ ఆకారాలలో, దాని సృజనాత్మక ఆత్మ-భావన సచేతన క్రీడలో అభివ్యక్తమౌతుంది, అనంతుని ఆత్మ-నిష్ఠమై వున్న సర్వజ్ఞశక్తి వెనుక అభివ్యక్తమౌతుంది. "ఓం" వస్తువు, భావన, రూపనామాల సర్వోత్కృష్ట సాధికారిక మూలం, బీజం, యోని — అది అదే, సమగ్ర, సర్వోత్కృష్ట అగ్రాహ్యం. ఆది మహా యేకత. పురుషోత్తమునిలో, సమస్త అభివ్యక్తికి పైన కాలాతీత స్వయంభువైన మహామార్మికత అది. కాబట్టి ఈ యజ్ఞం యేకకాలంలో కర్మ, భక్తి, జ్ఞానం.

ఆ విధంగా దాని నెరిగే, ఆరాధించే, అంతరాత్మ తన కర్మలను అన్నింటినీ ఒక మహనీయ ఆత్మార్పణలో తన అస్తిత్వాన్నంతా, భగవంతుడే సర్వం, సర్వం భగవత్తత్వమే అని అర్పిస్తుంది. ఈ ప్రపంచాన్ని పెంచి పోషిస్తూ, తన బిడ్డలను రక్షించు జగత్పిత భగవంతుడు అని అది తెలుసుకొంటుంది. తన వడిలో మనలను పొదవుకొని తన ప్రేమ మాధుర్యాన్ని మనపై అపారంగా కురిపించి, తన సుందర రూపాలచే ఈ ప్రపంచాన్ని నింపివేసే దివ్యమాతగా అది భగవంతుని తెలుసుకొంటుంది. దేశ, కాల, సంబంధాలలో పుట్టుకొచ్చే, వెలువడే, సృజించబడేదంతా యెవని వల్ల జరుగుతోందో ఆతనిని ప్రప్రథమ మహా సృష్టికర్తగా అది తెలుసుకొంటుంది. విశ్వానికి, ప్రతి వ్యక్తికి కావలసినదాన్నంతా సమకూర్చే యజమాని, శాసకునిగా అతనిని తెలుసుకొంటుంది. శాశ్వతునకు తనను తాను సమర్పించుకొన్నదానిని ప్రపంచం, విధి యెదురు చూడని సంఘటనలు భయపెట్టలేవు. బాధ, కీడు, అతనిని తబ్బిబ్బు చేయలేవు. దర్శించు అంతరాత్మకు భగవంతుడు మార్గం, తాను దారి తప్పడం జరుగని మార్గం. భగవంతుడు అతని ప్రయాణగమ్యం, ప్రతిక్షణం ఆతని ప్రజ్ఞావంతమైన అడుగులు అతనిని చేర్చే గమ్యం భగవంతుడు. తన సమస్త అస్తిత్వపాలకుడని, తన స్వభావాని కాధారభూతుడని, ప్రకృతి — అంతరాత్మ నాధుడని, దాని ప్రేమికుడు, శ్రేయోభిలాషి, అతని సమస్త ఆలోచనలు, చర్యలకు అంతరంగ సాక్షి ఆ దేవుడని ఆతనికి తెలుసు. భగవంతుడాతని నివాసగృహం, దేశం, అతని అన్వేషణలకు, కోరికలకు ఆశ్రయం, సమస్త జీవుల తెలివైన, సన్నిహిత, దయాళువైన మిత్రుడు. దృగ్గోచరమై మనుగడ సాగిస్తున్న సమస్తం యొక్క సృష్టి, స్థితి, లయలు ఆతని దృష్టికి, అనుభవానికి నిరంతరం పునరావృతమయ్యే దాని వ్యవస్థలో తన ఐహిక ఆత్మా

భివ్యక్తిని ముందుకు దెచ్చి, నిలిపి, ఉపసంహరించు యేకైకు డాతడే; ఆతడొక్కడే పుట్టి, నశించిపోతున్నట్లుగా కన్పించే సమస్తానికీ అవినాశి బీజం, మూలం, వాటి అనభివ్యక్తస్థితిలో వాటికి శాశ్వత విశ్రాంతి నిచ్చుతావు అతడే. సూర్యుని వేడిలో, జ్వాలలో మండుతుండేది అదిగో ఆతడే. అదిగో ఆతడే అతివృష్టి, అనావృష్టి, ఈ సమస్త భౌతిక ప్రకృతీ, ఆమె కార్యాలూ కూడా. మృత్యువు ఆతని ముసుగు. అమృతత్వం ఆతని ఆత్మావిష్కరణం. మనం అస్తి అంటున్నదంతా ఆతడే. మనం నాస్తి అని భావించేదంతా అనంతునిలో రహస్యంగా వుండనే వుంది, అని ర్వచనీయుని మార్మిక మహిమాన్విత అస్తిత్వపు అంశమే అది.

CWSA 19:328-30

శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

ఎల్లప్పుడూ శ్రీమాతను పిలువు

ప్రధానమైన విషయమేమిటంటే శ్రీమాతను గురించిన పిలుపు. ఆ పిలుపు కారణంగా దివ్యప్రకాశమెప్పుడైతే ప్రకటితమౌతుందో అప్పుడు దానిని ఆమోదించాలి. అజ్ఞానజనిత ప్రేరణను, కోరికను తిరస్కరించి, తనను తాను వాటి నుండి వేరు చేసుకోవాలి. అయితే ఎవరైనా ఈ పనులను విజయవంతంగా నెరవేర్చలేకపోతే, అప్పుడు అమ్మను పిలవాలి, ఇంకా ఇంకా పిలవాలి.

CWSA 31:134

అపాయం సంభవించినపుడు, మొట్టమొదట చేయాల్సింది శ్రీమాతను పిలవడం. అది తక్షణ రక్షణను కల్పిస్తుంది.

CWSA 31:134

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ప్రతివారు తమ మంత్రమును తప్పక తెలుసుకోవాలి

ప్రతివారు, వ్యక్తిగతంగా, తనమీద పని చేసే ఒకదానిని తప్పక తెలుసుకోవాలి. నేను కేవలం భౌతికక్షేత్రంలో జరిగే పనిని గురించి మాత్రమే మాట్లాడుతున్నాను. కారణం, మానసికంగా, ప్రాణికంగా జీవుని అంతరంగ విభాగాలన్నింటిలో, ఆకాంక్ష ఎల్లప్పుడూ అప్రయత్నంగా దానంతటదే వస్తుంది. నేను కేవలం భౌతికక్షేత్రాన్ని మాత్రమే ఉద్దేశించి మాట్లాడుతున్నాను.

భౌతికం పునఃపునః జరిగే ఒకదానికి ఎక్కువగా ఉన్మీలన మవుతుందనిపిస్తుంది. ఉదాహరణకు — ఆదివారాలు మనం వినిపించే సంగీతం, అందులో మూడుమంత్రాలు వరుసగా ఒకదాని తరువాత ఒకటి ఉన్నాయి. మొదటిది చండీమంత్రం, సార్వజననియగు జగజ్జననికి సంబంధించింది:

యాదేవి సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా
యాదేవి సర్వ భూతేషు శక్తిరూపేణ సంస్థితా
యాదేవి సర్వ భూతేషు శాంతి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్యై నమస్యై నమోనమః

రెండవది శ్రీఅరవిందులకు సంబోధన చేసినది (చివరలో నా పేరును ఉంచారని అనుకుంటున్నాను) నేను చెప్పబోయే మంత్రంలో అది చేరింది:

ఓమ్ నమో నమః శ్రీమిరాంబికాయై
ఓమ్ నమో భగవతే శ్రీఅరవిందాయ
ఓమ్ నమో నమః శ్రీమిరాంబికాయై

మూడవది శ్రీఅరవిందులకు సంబోధన చేసినది: 'నీవే నా ఆశ్రయం',
శ్రీఅరవింద శరణం మమ.

ఈ మంత్రాల విషయంలో, ప్రతీదీ నీవు వాటితో ఏమీ చేయదలచుకున్నావో అనే దానిమీద ఆధారపడి ఉంటుంది. నేను చిన్నమంత్రానికే సుముఖం, ప్రత్యేకించి రెండు విధాలుగా, బహుసంఖ్యలో, అప్రయత్నంగా తనకు తానుగా నీవు పునశ్చరణ చేయాలనుకుంటే, ఒకటి లేక రెండు పదాలు, మహా అయితే మూడు. ఎందువల్లనంటే, నీవు వాటిని అన్ని సందర్భాలలో తప్పక ఉపయోగించగలిగి

ఉండాలి. ఉదాహరణకు, ఒక ప్రమాదం జరగబోయే సమయంలో, అదీ ఏ ఆలోచనా లేకుండా ఏ పిలుపూ లేకుండా ఉబికి రావాలి. అది అస్తిత్వాన్నుంచి అప్రయత్నంగా, తనంత తానుగా, ప్రతిబింబంగా, కచ్చితంగా ఒక ప్రతిబింబంలాగా; అప్పుడా మంత్రానికి సంపూర్ణ శక్తి ఉంటుంది.

నాకైతే, ప్రత్యేకించి ముందుగానే దేనిలోను నేను నిమగ్నమై ఉండని లేక ఏ ఇబ్బందులు లేని రోజులలో (నేను మామూలుగా ఉన్నప్పుడు వాటిని సాధారణ దినాలని అనగలను), నేను చేసే ప్రతీదీ శరీరకదలికలన్నీ, నేను ఉచ్ఛరించే పదాలన్నీ, నా హావభావాలన్నీ ఈ మంత్రంతో అనుసంధానమై, ఆధారమై లేక వరుసగా ఆవృతమై ఉన్నట్లుగా ఉంటాయి. ఓం నమో భగవతే.... ఓం నమో భగవతే... ఎప్పుడూ, ఎల్లవేళలా, ఎల్లవేళలా, ఎల్లవేళలా.

అది సాధారణ స్థితి. అది సూక్ష్మ భౌతికంకంటే చాలా మట్టుకు ఎక్కువ భౌతికమైనటువంటి తీవ్రతతో కూడిన వాతావరణాన్ని సృష్టిస్తుంది.... మాధ్యమం చాలా మట్టుకు జ్వలించకుండా వేడి లేకుండా అంతటా వెలుగును ప్రసరించే కిరణాలు. దానికి గొప్ప కార్యదక్షత ఉంటుంది, చాలా గొప్ప కార్యదక్షత ఉంటుంది. అది ఒక ప్రమాదాన్ని నివారించగలదు. అది నీలో ఎల్లవేళలా అనుగమించి ఉంటుంది, ఎల్లవేళలా.

.... కనుక నీకు అవసరమని అనిపిస్తే — అక్కడ కాదు, నీ తలలో కాదు, కాని ఇక్కడ (శ్రీమాత ఆమె హృదయం మధ్యను సూచిస్తారు.) అది వస్తుంది. ఒక రోజు, నీవు పదాలను ఆలకించటంగాని, లేదా అది నీ హృదయంనుంచి ఉవ్వెత్తున ఉబికి పైకి రావటంకాని జరుగుతుంది.... అది జరిగినప్పుడు, నీవు దానికి అంటిపెట్టుకుని ఉండాలి.

Conversations with a disciple: September 16, 1958

అప్రయత్నంగా తనంతట తానుగా అంతరంగంలోనుంచి ఉవ్వెత్తున ఉబికి పైకి వచ్చిన మంత్రం సజీవత్త్వం కలిగి ఉంటుంది

ఎవరూ నీకు నిజమైన మంత్రాన్ని ఇవ్వలేరు. అది ఏదో ఇవ్వబడేది కాదు. అది అంతరంగం నుంచి పైకి ఊటలాగా వచ్చేది, అది అవశ్యం హఠాత్తుగా ఉవ్వెత్తున ఉబికిపైకి రావాలి. అప్రయత్నంగా తనంతట తానుగా సమృద్ధి కలిగిన

దానిలాగా, నీ అస్తిత్వానికి తీవ్రంగా అవసరమైనదిగా — అప్పుడు దానికి ఆధిపత్యశక్తి ఉంటుంది. ఎందువల్లనంటే, అది ఏదో బాహ్యంనుంచి వచ్చింది కాదు, స్వయం అది నీ ఆర్తి.

నా విషయంలో, నేను చూశాను. నా మంత్రానికి అమృతత్వముంది. ఏమి జరిగినా, దానిని గనక ఉచ్ఛరించడం జరిగితే పరమేష్టిదే పైచేయి అవుతుంది. అది ఇక ఎంత మాత్రమూ నిమ్న ధర్మానికి లోబడి ఉండదు. పదాలు అప్రస్తుతం, వాటికే అర్థమూ ఉండకపోవచ్చు — పరులకు, నా మంత్రం అర్థరహితమైనది, కాని నాకు అది సంపూర్ణంగా, దట్టించబడిన అర్థం కలిగినది. ఇంకా అది ప్రభావవంతమైనది, కారణం అది నా ఆర్తి, నా సమస్త అస్తిత్వపు ఆకాంక్ష.

ఓం: వివరణ

అ — ఆత్మశక్తి, సాంద్రత, బాహ్యం, విరాట్

ఉ – ఆత్మశక్తి సూక్ష్మత, అంతర్గత ఆత్మశక్తి నిగూఢ అతి చేతనా సర్వశక్తిత్వం, ప్రజ్ఞ

ఓం నిరపేక్షం, తురీయం

— మాండూక్యోపనిషత్. 2-IX 16-17

మంత్రం యొక్క ఆధిపత్యశక్తి

గురువు చేత ఇవ్వబడిన మంత్రం కేవలం మంత్రాన్ని కనుగొన్నవారి అనుభవాన్ని సాక్షాత్కరించుకొనే ఆధిపత్యశక్తి. ఆధిపత్యశక్తి స్వయంచాలకంగా (తనంతటతానుగా పనిచేసేది) అక్కడ ఉంటుంది. ఎందువల్లనంటే, శబ్దం అనుభవాన్ని కలిగి వుంటుంది. దానిని ఒకసారి నేను పారిస్‌లో చూశాను. అది నాకు భారతదేశం గురించి ఏ మాత్రం తెలియని కాలం, పూర్తిగా ఏమీ తెలియదు, కేవలం ఎప్పుడూ ఉండే అర్థం పర్థం లేని మాటలు మాత్రమే. నాకప్పుడు మంత్రం అంటే ఏమిటో కూడా తెలియదు. అప్పుడు, హిమాలయాలలో యోగాభ్యాసం చేశానంటూ తన అనుభవాలు వివరించడానికి వచ్చిన ఒక వ్యక్తి ఉపన్యాసానికి (అది ఏమంత ఆసక్తికరంగా కూడా లేదు, ఏ విధంగానూ) నేను వెళ్ళాను. ఆ సమయంలో, ఉపన్యాసం మధ్యలో అతడు ఒక్కసారిగా ఓం శబ్దాన్ని ఉచ్ఛరించాడు. హఠాత్తుగా గది మొత్తం కాంతితో నిండిపోయింది. అంతా

సువర్ణమయం, కాంతిప్రకంపనాలతో ... బహుశా కేవలం నేను మాత్రమే దానిని గమనించి ఉంటాను. అప్పుడు నాలో నేను అనుకున్నాను. 'బాగుంది'! తరువాత దాని గురించి నేనేమీ ఆలోచించలేదు, నేను ఆ ఉదంతం మరచిపోయాను. కాని అది ఏవిధంగా జరిగిందో, అదే విధంగా ఆ అనుభవం రెండు లేక మూడు మారులు వేరు వేరు దేశాలలో, వేరు వేరు మనుషులతో పునరావృతమయింది. ప్రతిసారి అక్కడ ఓం శబ్దం ఉంది. హఠాత్తుగా ఆ స్థలం అంతా అదే కాంతితో నిండిపోవడం చూశాను. కాబట్టి నాకు అర్థమైంది, ఆ శబ్దం వేల వేల సంవత్సరాల ఆధ్యాత్మిక ఆకాంక్ష ప్రకంపనలను కలిగి ఉందని. దానిలో అచ్చట పరమేశ్వరుని దిశగా మనుషుల సమస్త-ఆకాంక్ష ఆ శబ్దంలో నిక్షిప్తమై ఉంది. ఆ ఆధిపత్యశక్తి స్వయంచాలకంగా అక్కడ ఉంది, ఎందువల్లనంటే, అది అనుభవంలోకి వచ్చింది గనుక.

Conversations with a disciple: May 11, 1963

గురువు - మంత్రము

ప్రశ్న: కాని ఇది ఎలా సాధ్యం, మంత్రంలో స్వయంచాలికంగా, అనుభవం యొక్క ఆధిపత్యశక్తి నిక్షిప్తమై వుండేటట్లయితే, గురువు ద్వారా నీకు ఇవ్వబడితే తప్ప మంత్రానికి ఎటువంటి ఆధిపత్యశక్తి ఉండదని ఎలా చెప్పబడింది?

సమాధానం: ఆ శక్తి స్వయం నీలో లేనట్లైతే, సహజంగానే! ఒక వేళ ఉదాహరణకు వాస్తవంలో ఎవరైనా నావద్దకు వచ్చి, ఒక మంత్రం కోసం అడిగినట్లైతే, నేను వారికి తమ మంత్రాన్ని స్వయం తమ అంతరంగంలో కనుగొనాలని చెప్పను.

నేను ఆ సందర్భంలో చెప్పింది ఆత్మతో సంపర్కం కలిగి ఉన్నవారికి వర్తిస్తుంది. కాని తమ ఆత్మలో ఎరుకతో సంపర్కంలో లేనివారు తమ మంత్రాన్ని తెలుసుకోలేరు. వారి తల మాటలకోసం వెతుకుతుంది. దానివల్ల ఉపయోగమేమీ లేదు. నేను అనేది ఏమంటే మంత్రం తప్పక అంతరంగంనుంచి ఉబికి రావాలి — కాని వారికి ఏది ఉబికి రాదు. వారు తెలుసుకోలేరు; ఏ మాత్రం అవకాశం లేదు. అటువంటి సందర్భంలో గురువు స్వయం తన ఆధిపత్య శక్తిని అందజేస్తాడు.

ప్రశ్న: నిజమే, కాని ఉదాహరణకు ఒక మంత్రాన్ని పుస్తకంలో చదివినప్పుడు

దానిలో ఏ శక్తి లేదని చెప్పబడుతున్నది. అది ఎలా సాధ్యం, అందులో ప్రకంపన ఉంది కదా?

సమా: కాని, నీకు అంతర్గతంగా నీలో ఆ ఆధిపత్యశక్తి ఉండి, పుస్తకం చదివినప్పుడు నీకు ఆ శక్తి అనుభూతి అవుతుంది. (శ్రీమాత దరహాసం) అవసరమైనదేమంటే, అనుభూతినీ, అనుసంధానమునూ చేయగలిగే సామర్థ్యం.

ఆఖరున, గురువు మట్టుకు ఏం చేస్తాడు? అతడు కలుపుతాడు. (కూడలి సంజ్ఞ) అతడు ఒక కొక్కెం తప్ప మరేమి కాదు. అతడు ఇచ్చేది 'తన' ఆధిపత్య శక్తిని కాదు.(అని అతడు అనుకుంటాడు, అది నిజం కాదు): అతడు ఒక కొక్కెం. అతడు నిన్ను ఆధిపత్యశక్తి సంపర్కంలోకి తీసుకువస్తాడు — అతడు లేనిదే ఆ సంపర్కం నీకు లేదు. కాని ఎవరికైతే గురువు అవసరంలేదో వారు గురువు లేకుండానే సంపర్కంలోకి వస్తారు.....

...ప్రాథమికంగా, గురువుయొక్క ఆధిపత్యశక్తి పని ఖాళీలను పూరించడమే! నిన్ను సంపర్కంలోకి తీసుకోవడానికే: నీవు ఉన్నతసీమలో ఉన్నప్పుడు, నిన్ను మహా అత్యుత్తమమైన దానితో సంపర్కంలోకి తీసుకురావడానికి లేదా అంతరంగంలోని నీ చైత్య అస్తిత్వంలో లేక నిన్ను పరమేశ్వరునితో సంపర్కంలోకి తీసుకురావడానికి — కాని అది ఎక్కువమంది చేయలేరు.

Conversations with a disciple:july 10, 1963

ఆకాంక్షయందు చిత్తశుద్ధి — మంత్రము

దానిలో ఉన్న పదాలు, అవి తమకు తాముగా దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయో, వాటితోపాటు ఏ ప్రకంపనలను అవి తీసుకువస్తాయో అనేదే అంతా కాదు.... నా మాటల అర్థం "కేవలం ఆ పదాలు మాత్రమే సహాయం చేస్తాయి" అని అనడం పూర్తిగా సరికాదు, కాదు, అది కానే కాదు. కాని అవి వాటితో తోడుగా కలిసి ఉండే దానిని సమకూరుస్తాయి. తోడుగా ఉండే సూక్ష్మ మైన, భౌతిక ప్రకంపనలు ఏవైతే ఒకానొక స్థాయిని లేదా అనుభవాన్ని నిర్మించాయో, ఆ మాటల ఉనికికి, ఈ మహాశాశ్వత జీవన గమనానికి మధ్య ఒక విధమైనటువంటి సన్నిహితత్వాన్ని స్థాపించాయో, వాటిని సమకూరుస్తాయి, తరంగాల మాదిరి కదలాడే ఆ ప్రకంపనలు.

సాధారణ పరిభాషలో మంత్రప్రకంపన అనేది శరీరం ఒకానొక స్థాయికి చేరడానికి సహాయంచేసేది — కాని ప్రత్యేకించి 'ఇదే' మంత్రం కాదు: అది ఒక మంత్రానికీ, శరీరానికీ మధ్య ప్రత్యేకమైన సంబంధాన్ని చేసేటటువంటిది (అది నిజమైన శక్తివంతమైనదైయుండాలి), అది అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా తనంత తానుగా ఉవ్వెత్తున ఉబికి పైకి వస్తుంది. శరీరం నడక మొదలుపెట్టగానే, అది ఆ మహాపదాల లయతో బద్ధమై కదులుతుంది. ఆ మహాపదాల లయ చాలా సహజంగా ఒక విధమైన ప్రకంపనను తీసుకువస్తుంది. తిరిగి అది ఒక స్థాయికి చేరేటట్లు చేస్తుంది.

కాని ప్రత్యేకమైన ఈ మహాపదాలేనని మాత్రమే ఏకపక్షంగా చెప్పడం పరిహాసాస్పద మవుతుంది. ఏది లెక్కలోకి వస్తుందంటే ఆకాంక్షయందు చిత్తశుద్ధి, కచ్చితమైన వ్యక్తీకరణ, ఆధిపత్యశక్తి; అనగా, మంత్రం ఆమోదించబడుటతో సమకూరే ఆధిపత్యశక్తి. ఇది చాలా కుతూహలం కలిగించే విషయం: సర్వోత్కృష్ట మహా ఆధిపత్యశక్తిచే ఆ మంత్రము ఒక ప్రభావవంతమగు ఉపకరణంగా ఆమోదించబడింది, కనుక స్వయంచాలకంగా అది ఒక విధమైన శక్తినీ, ఆధిపత్యశక్తినీ కలిగి ఉంటుంది. ఒక వ్యక్తిని సరాసరి దివ్యసాక్షాత్కారం దిశగా నడిపించే ఒక మంత్రం, మరియొక వ్యక్తికి నిరుత్సాహం, నిర్జీవమును కలుగజేసే దవుతుంది.

Conversations with a disciple:May 31, 1962.

కష్టాలలో నీమంత్రాన్ని పునశ్చరణచేసే అలవాటును పెంచుకో

నీవు ఆటను ఆడుతున్నప్పుడు, హఠాత్తుగా ఏదో తప్పు జరుగుతున్నదని తెలిస్తే — నీవు తప్పులు చేయటం, పరాకు, అప్పుడప్పుడు వ్యతిరేకించే ధోరణులు నీవు చేసేదానికి అడ్డంగా రావడం — అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా తనకు తానుగా ఆ క్షణంలో, మంత్రంవలన పిలువబడినట్లుగా, పదాన్ని పునశ్చరణచేయడం అనే అలవాటును నీవు అభివృద్ధిచేసుకుంటే, దానికి అసాధారణ ఫలితం ఉంటుంది.

నీవు నీ మంత్రాన్ని ఎంచుకో; బదులుగా లేదంటే, వాస్తవంలో ఒక రోజున అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా తనంతతానుగా నీవు కష్టంలో ఉన్న ఆ క్షణంలో అది నీకు వస్తుంది. విషయాలు చాలా ఇబ్బందికరంగా మారిన ఒక సమ

యంలో, నీకు ఒక విధమైన తీవ్రపరితాపం, ఆందోళన, ఏమి జరుగుతుందో నీకు తెలియని పరిస్థితిలో, హఠాత్తుగా అది నీలో ఒక్కసారిగా అట్టడుగునుంచి పైకి విరజిమ్ముతుంది. ప్రతివారికి అది వేరువేరు రీతిలో ఉండవచ్చు. కానీ నీవు దానిని గుర్తించి, నీకుకష్టం ఎదురైన ప్రతిసారి దానిని పునశ్చరణచేస్తే, అది ప్రబలమైన దవుతుంది. ఉదాహణకు, నీవు జబ్బుపడబోతున్నావని అనుభూతి కలిగితే, నీవు చేసేపని సరిగాచేయడంలేదనే అనుభూతి కలిగితే, ఏదో దుష్టశక్తి నీపై దాడి చేయబోతున్నదని అనిపించినపుడు, అప్పుడు... కాని అది తప్పక అస్తిత్వంలో అప్రయత్నంగా తనంతట తానుగా వచ్చేదవాలి, నీవు దాని గురించి ఆలోచించే అవసరంలేకుండానే తప్పక నీ అట్టడుగునుంచి పైకి విరజిమ్మేదై యుండాలి. నీవు నీ మంత్రాన్ని ఎంచుకున్నావు, ఎందువల్లనంటే, అది నీ ఆకాంక్ష దాని అప్రయత్నంగా తనంతతానుగా వ్యక్తీకరించింది; అది ఒక పదం కావచ్చు, రెండు లేక మూడు పదాలు కావచ్చు. ఒక వాక్యం కావచ్చు, అది ప్రతి ఒక్క వ్యక్తి మీద ఆధారపడి ఉంటుంది, కాని అది ఒక శబ్దం, తప్పక నీలో ఒక విధమైన స్థితిని మేల్కొలుపేది. అప్పుడు, నీకు అది కలిగితే, నీవు ప్రతిదానినుంచి ఏ కష్టమూ లేకుండా బయటపడగలవని నీకు నేను ఆశ్వాసన ఇస్తున్నాను. ఒక వేళ అది నిజంగా, వాస్తవంగా నీవు అపాయంలో ఉన్నప్పుడు, ఒక దాడి, ఉదాహరణకు, ఒకరెవరైనా నిన్ను చంపాలను కుంటున్నప్పుడు, అటువంటప్పుడు, ఏమాత్రం ఉద్రేకం చెందకుండా, ఏ మాత్రం కలవరం చెందకుండా, నీవు ప్రశాంతంగా నీ మంత్రాన్ని పునశ్చరణ చేస్తుంటే, ఎవరూ నిన్నేమీ చేయలేరు. సహజంగానే, నీకు నీవు తప్పక నిజంగానే ప్రభువై యుండాలి; అస్తిత్వంలో ఒకభాగం ఆకులాగా అల్లల్లాడుతూ ఉండకూడదు; లేదు, నీవు తప్పక దానిని సంపూర్తిగా, చిత్తశుద్ధితో చేయాలి. అప్పుడది సర్వశక్తివంత మవుతుంది. నీలోనుంచి అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా తనంతతానుగా పదం వెలువడటం అత్యుత్తమం: చాలా కష్టంలో (మానసిక, ప్రాణిక, భౌతిక, భావోద్వేగపూరితమైనవైనాసరే), అది హఠాత్తుగా నీలోనుంచి ఉవ్వెత్తున ఉబికి పైకి వస్తుంది, రెండు లేక మూడు మాటలు, ఇంద్రజాలంలో వాడే మాటలలాగా, నీవు వాటిని గుర్తుపెట్టుకోవాలి, వాటిని కష్టాలు ప్రాప్తించిన సమయాలలో పునశ్చరణ చేయడం అలవాటు చేసుకోవాలి. నీవు ఆ అలవాటు చేసుకుంటే, ఒక రోజున అది అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా

తనంత తానుగా వస్తుంది: కష్టం సంప్రాప్తించినప్పుడు, అదే సమయంలో మంత్రం వస్తుంది. అప్పుడు ఫలితాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కాని అది తప్పక కృతకమైనదికాని లేక ఏదో నీవు నీ విచక్షణతో నిర్ణయించినదికాని కాకూడదు: "నేను ఈ పదాలు వాడతాను"; లేక ఎవరో నీకు చెప్తారు, — "ఓ, నీకు తెలుసా, ఇది చాలా మంచిది" బహుశా అది అతనికి చాలా మంచిదే కావచ్చు, కాని ప్రతివారికి కాదు.

CWM 4: 388-89

నిద్రకుముందు నీమంత్రాన్ని పునశ్చరణచేయి

నీవు వెల్లకిలా పడుకుని, అన్ని కండరాలను, అన్ని నరాలను సడలించు — అది తేలిగ్గా తెలుసుకోతగినదే — నేనేమంటానంటే పక్కమీద ఒక గుడ్డపీలికలాగా: ఏమీ మిగిలి ఉండదు. నీవు అది మనస్సుతో సహా చేయగలిగితే, నీవు పక్కమీదకు వెళ్ళినదానికంటే, లేచినప్పుడు నిన్ను చాలా నీరసానికి గురిచేసే అన్ని రకాలైన ఆ అర్థంపర్థంలేని కలల పీడ తొలగిపోతుంది. అది ఏ నియంత్రణా లేక కొనసాగుతూ ఉండే మెదడులోని జీవకణాల కార్యకలాపం. అది ఒకరిని చాలా నీరసానికి గురి చేస్తుంది, కనుక, పూర్తి విశ్రాంతి, ఒకవిధమైన సంపూర్ణ ప్రశాంతత ఏ ఉద్వేగమూలేక, కదలకుండా నిలిచిపోయేస్థితి.

కాని ఇది కేవలం ప్రారంభం మాత్రమే. దాని తరువాత ఎంతగా పూర్తిగా సాధ్యమవగలదో అంతగా, నీ ప్రతిఅంశాన్ని పైనుంచి క్రిందివరకు, బాహ్యం నుంచి అంతరంగంవరకు, ఒక నిర్మూలనంచేయడం జరగాలి, పూర్తిగా ఎంత సాధ్యమైతే అంతగా, అహంకారంయొక్క నిరోధాన్నంతటినీ. అప్పుడిక నీవు నీ మంత్రాన్ని పునశ్చరణచేయడం మొదలుపెట్టు — నీ మంత్రం, నీకంటూ ఒకటి ఉంటే, లేక ఏదైనా పదం, నీమీద ఆధిపత్యశక్తి కలిగినది, హృదయంనుంచి అప్రయత్నంగా ఏ ప్రేరణాలేకుండా తనంతతానుగా ఎగసిపడే ఒకపదం, ఒక ప్రార్థనలాగా, నీ ఆకాంక్షనంతటినీ కూడగట్టగలిగేపదం. దానిని కొన్ని సంఖ్యల మారులు పునశ్చరణ చేసిన చరువాత, అలవాటుగా నీవు చేయగలిగినట్లైతే, సమాధిలోకి (మైమరుపు స్థితిలోకి) ప్రవేశిస్తావు.ఆ సమాధినుంచి నీవు నిద్రలోకి జారుకుంటావు. ఆ సమాధి ఎంతసేపు ఉంటే అంతసేపు ఉండనిచ్చిన తరువాత, పూర్తిగా, సహ

జంగా, అప్రయత్నంగా ఏ ప్రేరేపణా లేకుండా నీవు నిద్రలోకి జారుకుంటావు. కాని నీవు ఈ నిద్రనుంచి బయటకు వచ్చినప్పుడు నీకు ప్రతిదీ గుర్తు ఉంటుంది. నిద్ర సమాధికి కొనసాగింపులాగా ఉంటుంది.

ప్రాథమికంగా, నిద్రయొక్క ఒకే ఒక్క ఉద్దేశం సమాధి ఫలితాన్ని శరీరం జీర్ణించుకొనే శక్తిని కలిగించడం, ఆ విధంగా దాని ఫలితం ప్రతిచోటా అందుకోగలగటంతో పాటు, సహజంగా రాత్రిపూట తయారయే విషకారక రసాయనాలను బయటకు తోసివేయటానికి శరీరానికి శక్తినివ్వటం. నీవు నిద్రనుంచి మేల్కొని లేచినప్పుడు, నిద్రనుంచి వచ్చే మందకొడితనంతో కూడిన బరువు జాడ కూడా ఉండదు: సమాధి ప్రభావం కొనసాగుతూ ఉంటుంది.

సమాధిలోకి ఎన్నడూ వెళ్ళనివారు కూడా, నిద్రపోయే ముందు ఒక మంత్రాన్ని, ఒక పదాన్ని, ఒక ప్రార్థనను పునశ్చరణ చేయడం మంచిది, కాని ఆ పదాలలో తప్పక జీవం ఉండాలి. అంతమాత్రాన అదంతా మేధోప్రాధాన్యతను కలిగి ఉండాలని నేననడంలేదు, అటువంటిదేమీ లేదు, కాని ఒక ప్రకంపన ఉండాలి. అప్పుడు దాని ప్రభావం శరీరం మీద అసాధారణంగా ఉంటుంది. అది కంపించడం, కంపించడం, కంపించడం మొదలుపెడుతుంది.... నిద్రలోకి పోవాలని కోరుకుంటున్నట్లుగా నీవు ప్రశాంతంగా ఉండిపోతావు. శరీరం ఎక్కువెక్కువగా ప్రకంపిస్తుంది, ఎక్కువెక్కువగా, ఎక్కువెక్కువగా, నీవు అలా ఉండిపోతూ ఉంటావు.

అది తమస్సుకు నివారణ

శ్రీమాత

CWM 15: 378-80

శబ్దంలో ఒక ఆధిపత్యశక్తి ఉంది

నా జపానికి ముఖ్యకారణం ఇది. శబ్దంలో దానంతటదానికే ఒక ఆధిపత్యశక్తి ఉంది. శరీరాన్ని ఆ శబ్ద పునశ్చరణకు ఒత్తిడి చేస్తే, అదే సమయంలో దానిని ప్రకంపనాలను అందుకోవటానికి బలవంతం చేసినవాడవవుతావు. కాని నేను గమనించినదేమంటే, శరీరంలో జరిగేపని ఏదైనా కలవరానికిలోనైతే (ఒక బాధ, ఒక అస్తవ్యస్తత, వ్యాధిమొదలవటం) నేను నా మంత్రాన్ని ఒక విధంగా పునశ్చరణ చేస్తాను — అయితే పదాలుమాత్రంఅవే, మంత్రమూ అదే, కాని ఒక ఉద్దేశంతో

చెప్పబడుతుంది, అన్నింటినీమించి సమర్పణా భావంతో కూడిన గమనం, బాధను, అస్తవ్యస్తతను సమర్పించడం, ఒక పిలుపు, ఉన్మీలనం అవుతున్నట్లుగా, దానికి అద్భుతమైన ఫలితం ఉంటుంది. మంత్రం సరిగా ఎలా పనిచేయాలో అదే పద్ధతిలో పనిచేస్తుంది, ఈ విధంగానే, మరేవిధంగానూ కాదు. కొంత తడవు తరువాత ప్రతిదీ చక్కదిద్దబడుతుంది. అదే సమయంలో, సహజంగానే, ఆ అస్తవ్యస్తత వెనుక ఏముందో కచ్చితమైన దాని జ్ఞానం, దానిని సరిచేయటానికి నేను ఏమి చేయవలసివుందో అదీ నాకు ఇవ్వబడుతుంది. కాని, దీనికంటే ముందు, మంత్రం సరాసరి బాధమీద పనిచేస్తుంది.

ఓమ్ — మంత్రం చేసేపని

'ఓమ్' అనేది మంత్రం, తురీయంనుంచి బాహ్యంలో భౌతికసీమవరకు ఉన్న దాని నాలుగుక్షేత్రాలలో వ్యక్తపరుపబడే బ్రహ్మచైతన్యపు శబ్ద-ప్రతీక. మంత్రం విధివిధానం అంతరంగ చైతన్యంలో ప్రకంపనలను సృజించడం, అది మంత్రం దేనికి ప్రతీకనో దానిని సాక్షాత్కరించుకోవడానికి సంసిద్ధంచేస్తుంది. దానిని అది తనలో తనకు తానే వాస్తవంగా కలిగిఉంటుందని భావించబడింది. 'ఓమ్' మంత్రం అన్ని భౌతిక విషయాలలోను, మనకు ఇప్పుడు పైన ఉన్న అతిచేతన అయిన కారణసీమ లోని ఒకే చైతన్యపుదర్శన, అనుభూతులకు చైతన్యం ఉన్మీలనమయే దిశగా ముందుకు నడిపించవలసి ఉంది. చివరగా, విశ్వస్థితికి పైన ఉన్న సర్వోత్కృష్ట విమోచనమైన అతీతం వైపుకు నడిపించవలసి ఉంది. ఎవరైతే ఈ మంత్రమును ఉపయోగిస్తారో వారికి, చిట్టచివరిది, సర్వసాధారణంగా, ప్రధానంగా పూర్వమే నిర్దేశించుకుని నిమగ్నమైఉండే కార్యక్రమం.

SABCL 23, 745

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

దైవనామమే మంత్రముగా

దైవనామస్మరణ నిరంతరం కొనసాగాలి

మరణావస్థ దశలో మదిలో మెదిలే ఆలోచనలు మరియు మానసిక స్థితిపై గీత ఎక్కువ ఉనికి నిస్తుంది. చేతనయొక్క స్వయంసృజనాశక్తి అనగా ఏమిటో గుర్తించలేకపోతే, ఆ ఉనికిని అర్థంచేసుకోవటం కష్టం. ఆలోచన, అంతర్దృష్టి, విశ్వాసము, శ్రద్ధతో కూడిన ఏ స్థితి అయితే స్వచ్ఛందంగా, సంపూర్ణంగా, సుస్పష్టంగా స్థిరత్వమేర్పరచుకుంటుందో ఆ విధంగానే మన అంతఃసత్తె మార్పు చెందుటకు మొగ్గుచూపుతుంది.... క్లిష్టమైన మానవజీవిత చరమాంక తరుణంలో మనకున్న చేతనాస్థితియొక్క ప్రాశస్త్యం నిరూపించబడుతుంది. అయితే, మన గత జీవనశైలి, ఆలోచనా సరళి మరణశయ్యపై చేసే స్మరణకు విరుద్ధమైనట్లయితే, ఆ స్మరణకు ప్రయోజనం సమకూర్చేశక్తి వుండదు. ఈ విషయంలో గీతలో ప్రతిపాదించబడిన ఆలోచనా సరళికి, బాగా వ్యాప్తిచెందివున్న మతపరమైన సిద్ధాంతాలు సూచించే సంతృప్తికరమైన, సుళువుగా పాటించతగిన విధానాలకు సామ్యం లేదు. అంత్యక్రియలుగా మతగురువులు జరిపించే అర్థరహితమైన సాంప్రదాయ కర్మకాండకు కూడా పొంతనలేదు.

ఒక క్రైస్తవుడు హీనమైన బ్రతుకు గడిపి మరణించిన తరువాత, మంచి ఏ మాత్రమున్నా దాన్ని కొండంతలు చేసి ఉన్నతిని ఆపాదించు ఆచారము వంటి విషయములతో కూడా సరిపోల్చ బడదు. లేక, కాశీనగరమున, పవిత్ర గంగానది ఒడ్డున ముందు జాగ్రత్తగానో లేక మరణించినవాని ఆత్మకు ఉత్తమగతులు సంప్రాప్తించుటకు చేయు అంత్యక్రియలతోనూ అవి సరిపోల్చబడవు. వ్యక్తికి మరణ మాసన్నమగు క్షణమునకు ముందే, జీవుడు తను దైవాధీనమగుటకు, భౌతిక జీవితము గడుపు కాలమున, ఆత్మ ప్రతిక్షణము అంతరంగ దిశగా లగ్నమై ఉంటూ ఉండాలి, "సదా తద్భావ భవితః."

అందుకే గీతాచార్యు డేమన్నాడంటే, "అన్ని వేళలా నన్ను భజిస్తూ పోరాడు. ఎందుకనగా నీ మనస్సును, బుద్ధిని నా యందే నిలిపి నాకు వాటిని అర్పించినచో "మమర్పిత మనోబుద్ధి" నీవు తప్పక నన్నే చేరగలవు. నిరంతరము ఆయన్నే స్మరిస్తూ చైతన్యమును ఆయన యందే లగ్నము చేస్తూ, యిక

ఏ ఇతర దిశగా నిక్షేపము చెందక సాధన చేస్తుంటే ఆతడు దివ్యత్వము చెందుతూ పురుషోత్తముని చేరును".

CWSA 19:295-96

జీవితాన్నంతా ఒక నిరంతరాయ యోగంగా మలచుకో

సత్తను దైవముతో పూర్తిగా ఒకటి చేయడానికి, అంటే, అన్ని విషయాల్లోనూ ఒక సహజమైన పొందికను ఈ యిరువురు మధ్య సాధించి, జీవిత కాలమంతా ఆ పద్ధతిలో కొనసాగాలంటే, ధ్యానము, ఆలోచనలను మాత్రమేగాక తన ప్రతి పనిని, కాయకష్టమును, పోరాటమును దైవచింతనతో నింపాలి. "నన్ను స్మరించి పోరాడు" అంటే, మొదటి నుంచి మనస్సులో నున్న భగవంతుని ఉనికికి సంబంధించిన తలంపును క్షణకాలమైనా ఈ ప్రాపంచిక విషయాల పరస్పర ఘర్షణలో తలమునకలై విస్మరించ కూడదు. అయితే అది చాలా కష్టముతో కూడినది, దాదాపు సాధ్యపడదనిపిస్తుంది. అటుపైన దైవస్మరణ మధ్య మధ్యలో వచ్చి పోయే టటువంటి మానసిక క్రియగా కాక మన కార్యాచరణల సహజ లక్షణంగా, ఒక విధంగా చేతన యొక్క సారాంశముగా మారుతుంది. పురుషోత్తమునితో జీవుని యొక్క ఆధ్యాత్మిక సంబంధము స్థిరపడుతుంది. జీవితమంతయు ఒక యోగము కావడము, జీవుడు తన యొక్క సహజత్వాన్ని తన వశంలో ఉంచుకొనుట సాధ్యపడుటయే గాక శాశ్వతమైన ఏకత్వం స్వయం సిద్ధమవుతుంది.

CWSA 19:300

నీకు కొంత సమయము చిక్కినపుడు

నీకు తీరిక సమయం ఉన్నపుడు, పారవశ్యతలోకి ప్రవేశించి ఒక మంత్రాన్ని పదే పదే జపించు. అది: 'ఓమ్' లేక 'ప్రభో' లేక 'శ్రీమాతా' కావచ్చు. నీ హృదయాంతరాళమున ప్రవేశించి అచ్చట దైవముయొక్క హృదయంలో ఆశ్రయం పొందు, ఎందుచేతనంటే, ఆయన హృదయం సుతి మెత్తనిది, అతి మధురమైనది, అతి లలితమైనది....

ఎప్పుడైనా నీవు స్థైర్యం కోల్పోయినట్లైతే, అందుకు కారణమైనదాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తావు, మరో విషయం గురించి పట్టించుకోవు. అప్పుడు

ఒక్కసారి నీలోనికి వెళ్ళు, వెళ్ళి ఆ ప్రభువును పిలు. వెంటనే ఫలితము దక్కక పోవచ్చు గాని క్రమేణా లభిస్తుంది.

దైవము చర్మచక్షువులకు కానరాడు. మొట్టమొదట నీవు ప్రభువు హృదయములో ఉన్నట్లు అనుభూతిని పొందాలి. సాధారణంగా యిటువంటి అనుభూతిని పొందటానికి సమయం పడుతుంది.

కొన్ని ఏళ్ళు ఈ సాధనలో గడిపినా, చాలామంది ఈ స్థితికి చేరుకోలేరు. ఆద్యంతాలు రెండున్నూ దైవమే అను సత్యాన్ని మరువ వద్దు. ఈ ప్రపంచము ప్రభువునే మరచిపోయింది. జనులు మూఢులైనారు. అంచేత, కష్టాలు, కడగండ్లు నిరంతరం వారిని వెంబడిస్తున్నాయి.

Mother You said so

హానికర శక్తుల నుండి తప్పించుకొనుటకు ఉత్తమ మార్గము

హానికర శక్తులను తప్పించుకోవాలన్నా, వాటి దుష్ట సలహాలను పెడచెవిని పెట్టాలన్నా, దైవనామస్మరణ మొక్కటే దిక్కు; ఆహారము తీసుకొనేటపుడు, నిద్రపోయేటపుడు, ఏ పనిలో నున్నా సరే! ఏమని చేయాలి — "నాకు దైవమే కావాలి, యితరమైనదేదీ వద్దు". నీవు అనారోగ్యమునకు లోనైనపుడు, మరేదైనా చెడు నీకు సంభవించినపుడు, యిక నీవు నీ లక్ష్యమును చేరకుండా ఆటంకపరచే వాటిని తొలగించమని దైవాన్ని ప్రార్థించు. నీ పిలుపు సరియైన చిత్తశుద్ధితో కూడినదైతే, ఉన్న పాటున అడ్డంకులు మటుమాయ మౌతాయి. నిరంతరము ప్రార్థించే అలవాటును చేసుకొంటే నీవు చేసే ప్రార్థనలు నిజమౌతాయి. ఎందు చేతనంటే, దైవము ప్రతి ఒక్కరి హృదయాంతరాళమున ఎల్లప్పుడూ ఉండును. ఆయన అన్ని నిజమైన ప్రార్థనలను వింటాడు; అన్నింటినీ గమనిస్తాడు.

Mother You said so

దైవనామస్మరణయొక్క ఘనత

నామస్మరణ, అందువలన కలిగే రక్షణ గురించి నీకు కలిగిన అనుభూతి అందరిదీ — ఎవరైతే విశ్వాసము మరియు నమ్మకముతో స్మరిస్తారో వారికి కలిగే అనుభూతి అదే. ఎవరు హృదయ మూలము నుండి తమకు రక్షణ కావాలని

వేడుకుంటారో, అది వృధా పోదు. నీ విశ్వాసమును దెబ్బతీయు బాహ్య స్థితి గతులకు ఎన్నడూ అవకాశము నీయకు. ఎందుకనగా నీ లక్ష్యమును చేరుటకు, ఈ విశ్వాసము నిచ్చునంతటి బలమును మరి ఏది కూడా ఈయజాలదు. విజ్ఞానము, తపస్సుల యొక్క బలము ఎంతైనా కావచ్చు. విశ్వాసముతో పోలిస్తే వాటికి ఆదుకునే శక్తి తక్కువే! ఈ ప్రయాణము నందు విశ్వాసమే ఊతనిచ్చే బలమైన చేతికర్ర.

Letters 8-10-1936 p. 195

దైవనామస్మరణ ఎందుకు చేస్తామంటే రక్షణకు, ఆరాధనకు, భక్తిప్రపత్తులు పెరగటానికి, అంతఃశ్చేతన తెరచుకోటానికి, దైవసాక్షాత్కారం పొందటానికి. అధోచేతన యందు, ఏ మేరకు పరివర్తన అవసరమో ఆ మేరకు దైవనామస్మరణ సమర్థవంతమౌతుంది.

SABCL 23:746

ఏ నామముతో జపించినా, జవాబిచ్చే దివ్యశక్తి శ్రీమాతయే. ప్రతి నామము ఒక ప్రత్యేక దైవాంశనే సూచిస్తుంది. ఆ మేరకే అది పరిమితము, కాని శ్రీమాత యొక్క శక్తి విశ్వవ్యాప్తము.

SABCL 23:747

అనువాదం: దామెర్ల వెంకటేశ్వరరావు

మరో మాటలో చెప్పాలంటే, మంత్రము ఒక సూటి అయిన, ఉన్నతోన్నతమైన, ప్రచండమైన, అత్యాధిక దైవికమైన భారంగల ఛందోబద్ధమైన పదం. అది అంతర్దృష్టి, దివ్యజ్ఞానంతో గూడిన దివ్యావేశంతో నిండి వుంటుంది. మనసుకు నిజ ఆత్మదర్శనంతోను, దాని ఉనికితోను, తత్సంభంధిత విషయాల ఆంతరిక యదార్థతతోను, దాని వాస్తివికతతోను, సజీవ పరమసత్యం నుండి ఆవిర్భవించిన దేవతల దివ్య ఆత్మస్వరూపాలతోను ఆత్మస్థైర్యాన్ని కలుగజేసే పదమౌతుంది, లేదా పరిమితమైన దానినంతా ఆవరించి, అందులోని ప్రతి ఒక్క అంశలోకి తనదైన అనంతత్వ వెలుగును, వాణిని కొనితెచ్చే ఛందోబద్ధమైన పదజాలమవుతుంది.

CWSA 26:218

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

జపానుష్ఠాన విధానం

సాధారణంగా జపానుష్ఠానం ఫలప్రద మవటానికి అనుసరణీయమైన రెండు నియమాలలో, కేవలం ఒకదానిని పాటించితే సరిపోతుంది. ఒకటి, దేనినైతే ఏకాగ్రంగా జపిస్తున్నామో దాని ప్రాధాన్యతను మనసులో నిలుపుకొని, లేక ఏ దేవత నుద్దేశించి జపం సల్పుతున్నామో ఆ దేవత లక్షణాన్ని, శక్తిని, సౌందర్యాన్ని, ఆకర్షణను చేతనలో నిలుపుకొని పునశ్చరణ గావించి నట్లయితే, అది మానసిక విధాన మవుతుంది. రెండు, భక్తిపారవశ్యతలో హృదయ కుహరం నుండి పెల్లుబికి లేక గుండెల్లో ఖంగుమని ప్రతిధ్వనించి సజీవమై సాగినట్లయితే, అది మానసికోద్వేగ విధానమవుతుంది. అయితే, మనస్సైనా లేక ప్రాణికమైనా దానికి ఆలంబన గావాలి లేక పోషణ నివ్వాలి. ఒక వేళ అది మనసులోని ఆర్ద్రతను ఆవిరిచేసి, ప్రాణికాన్ని అస్థిరపరచినట్లయితే, ఆలంబనను, పోషణను రెండింటినీ కోల్పోవలసి వస్తుంది. అయితే మరొక మూడో మార్గం కూడా వుంది — ఆ మంత్రశక్తిపైన గానీ, మంత్రనామంపైన గానీ సంపూర్ణ విశ్వాసంతో కొనసాగించడం. అయితే, అలాంటప్పుడు ఆ శక్తి వ్యక్తిలోని అంతర్ జీవిని ఆకస్మికంగా, ఏ క్షణంలోనైనా, దైవం యొక్క ఉనికికి లేక స్పర్శకు ఉన్మీలనమవడానికి తగినంత ప్రభావం చూపే వరకు విశ్వాసం సడలకూడదు. కాని, ఈ ప్రభావం నిరాటంకంగా కొనసాగాలంటే మనసుకు ఒక నిశ్చలమైన గ్రహణశక్తి అవసరం. ఫలితం కోసం పెనుగులాడినా, లేక పట్టుబట్టినా గ్రహణశక్తికి నిరోధ మేర్పడుతుంది. ఆ కారణంగానే ప్రయాస పడటం కన్నా, ప్రయత్నించడం కన్నా, మానసిక ప్రశాంతత నిలుపుకోవడం అవసరమని, నేను నొక్కి చెప్పాను. ఆత్మశక్తి, మనసు గ్రహణశక్తిని పెంచుకొనటానికి ఈ ప్రశాంతస్థితి ఆవశ్యకం. ఆ గ్రహణశక్తి ఎంత సహజమైనదిగా నుండాలంటే కవిత్వానికి, సంగీతానికి వ్యక్తి ఎంత సహజంగా స్పందిస్తాడో అంత సహజమైనదిగా నుండాలి. నీవు నీ కవితావ్యాసంగం ఆపేయమని నేను కోరకుండా వుండటానికి కారణం కూడా అదే — అది సన్నాహ ప్రక్రియకు దోహదపడుతుంది కాని ఆటంకపరచదు. అందుకు కారణం అది గ్రహణశక్తిని వృద్ధిపరచడం కోసం సరియైన స్థితిని కల్పించడానికి, అంతరంగంలో నున్న భక్తిప్రపత్తులను వెలికి తీయ

డానికి ఒక సాధనగా ఉపకరిస్తుంది. శక్తినంతా జపతపాదుల అనుష్ఠానంలో గడపటం అధిక శ్రమతో కూడిన పని. ధ్యాన మననాదులను ఫలప్రదంగా అనుష్ఠించుటకు అలవాటు పడినవారు సైతం వాటిని సడలనీయకుండా కొనసాగించటానికి కష్ట పడతారు. పై నుండి అనుభవ తరంగాలు నిరాటంకంగా ప్రవహిస్తుండే సమయాల్లో తప్ప వారికి కూడా అది సులభతరం కాదు.

SABCL 23:745

శ్రీఅరవిందులు

గాయత్రీ మంత్రజపము

గాయత్రీమంత్రశక్తి అతి పవిత్రమైన మహాసత్యము యొక్క దివ్య చైతన్యకాంతి. గాయత్రి ఒక దివ్యజ్ఞాన మంత్రము.

*

గాయత్రి మహాసత్యము యొక్క దివ్యకాంతిని అస్తిత్వపు స్తరాలన్నింటిలోకి కొని తెచ్చే మంత్రము.

*

నీవు ప్రస్తుతం అనుసరిస్తున్న అనుష్ఠాన పద్ధతులను గాని లేక గాయత్రిమంత్ర జపాన్ని గాని మానివేయాల్సిన అవసరం లేదు. హృదయంలో ఏకాగ్రం చేయడం ఒక విధానం, మస్తిష్కంలో (తలపై భాగంలో) ఏకాగ్రం చేయడం మరొక విధానం. ఈ రెండున్నూ ఈ యోగంలో చేర్చబడ్డాయి. ఎవరికి ఏ విధానం సహజమైనది, సులభతరమైనది అని అనిపిస్తుందో వారు దానిని పాటించవచ్చు. హృదయమందు ఏకాగ్రం చేయటంలో ధ్యేయం, అచ్చట నున్న కేంద్రాన్ని (హృదయకమలం) దివ్యమాత సమక్షము యొక్క అనుభూతి హృదయంలో పొందటమే కాక దైవంలో భాగమైన అంతరాత్మ లేక చైత్యపురుష సత్తను గురించిన అవగాహన పెంచుకోవడం. మస్తిష్కంలో ఏకాగ్రం చేయటంలో ధ్యేయం దివ్య చైతన్యస్థాయికి ఎదిగి శ్రీమాత దివ్యకాంతిని లేక ఆమె దివ్యశక్తిని అన్ని నాడీకేంద్రాలలోకి కొనితేవడం.

SABCL 23:747

శ్రీఅరవిందులు

ప్రణవాక్షర జపము

ప్రణవాక్షర జపానికి[1] తనదైన ప్రత్యేకశక్తి ఒకటి ఉన్నదనే భావన వుంది. అయిన ప్పటికీ, దాని అర్థం పై ఏకాగ్రం చేస్తే తప్ప ఆ శక్తి పూర్తిగా పనిచేయదు. కాని నాకున్న అనుభవమేమిటనగా ఈ విషయాల్లో ఒక నిర్దిష్టమైన నిబంధన అంటూ ఏమీ లేదు. ఫలితం చాలా మటుకు సాధకుని చేతనాస్థాయి పైన లేక ఆతని ప్రతిస్పందన తీవ్రత పైన ఆధారపడి ఉంటుంది. కొందరి పట్ల దాని ప్రభావమే ఉండదు, కాని కొందరి విషయంలో ఏకాగ్రం చేయకపోయినా శీఘ్రమైన, శక్తివంత మైన ప్రభావం చూపుతుంది. మిగతావారి విషయంలో ఎలాంటి ప్రభావం కలగా లన్నా ఏకాగ్రం చేయటం అవసరం.

SABCL 23:748

నేను నామోచ్ఛరణను శ్వాసను తీసుకోవడంతో జతపరచటాన్ని ప్రోత్సహించ లేదు, ఎందుకనగా, అది ప్రాణాయామం చేసినట్లుగా నుంటుంది. ప్రాణాయామం చాలా శక్తివంతమైనది, కాని అనాలోచితంగా ఆచరించినట్లయితే అది ప్రతిబం ధకా లేర్పడటానికి దారి తీయవచ్చు, అంతేగాక కొన్ని జటిలమైన సందర్భాల్లో శారీరక అస్వస్థత కూడా కలిగించవచ్చు.

SABCL 23:747

శ్రీకృష్ణ నామ జపము

ప్రశ్న: శ్రీకృష్ణుని అస్తిత్వం ఏదైతే మన ప్రభువైన శ్రీఅరవిందులు మరియు వారి పరాశక్తి అయిన శ్రీమాత రూపం ధరించిందో, ఆ శ్రీకృష్ణ నామాన్ని పునశ్చరణ చేయటంలో హాని ఏమీ లేదని నేననుకుంటాను.

సమా: అందులో హాని లేదు; అది ఈ యోగంతో పొసగనిది కాదు, విరుద్ధమైనది కూడా కాదు.

CWSA 35: 827

---

1 ప్రణావాక్షర జపమనగా ఆధ్యాత్మిక అక్షరమైన 'ఓం' జపించడం.

జపానుష్ఠాన శక్తి

మంత్రజపం ఊర్ధ్వస్తరాల నుండి వచ్చే శక్తికి మన చేతనను ఉన్మీలనం చేస్తుంది. ఒక మంత్రం భౌతికచేతనను మార్పు చెందిస్తుందని నేను నమ్మను. అది నిజంగా, సమర్థవంతమైనదైతే, అది చేసేది ఏమిటనగా చేతనను తెరచి, దాని లోకి, ఆ మంత్రం ఏ శక్తికైతే సంకేతంగా ఉన్నదో, ఆ శక్తిని కొనితెస్తుంది.

*

సక్రమంగా అనుష్ఠించినట్లయితే, మంత్రజపం పైనుంచి ప్రసరించే ప్రకాశం, జ్ఞానం మొదలగువాటికి తెరుచుకోవడానికి ఒక సాధన అవుతుంది. ఆ కార్యం నెరవేరిన వెంటనే సాధన కూడా ముగిసిపోతుంది.

*

నీవు ఆ దాడిని తప్పించుకున్నావని, అందుకు జపానుష్ఠానము నీకు తోడ్పడింద నేది చాలా మంచి వార్త. దీనితో పాటు గత అనుభవం కూడా జోడించినప్పుడు తెలియవచ్చేదేమిటంటే జపానికి విచారము, నిష్ప్రయోజకత్వంతో గతంలో నున్న అనుబంధాన్ని అధిగమించగలిగితే, జపం దాని సహజ ధర్మమైన సరియైన చైతన్య వికసనం గావించగలదు, ఎందుకనగా జపానుష్ఠానం చేయడంలో ఉద్దేశం అదే గనుక. మొదట అది చైతన్య ప్రకంపనలలో మార్పును కలిగించి, దానికి మెరుగైన స్థితిని, మెరుగైన ప్రతిస్పందనలను కలిగేటట్లు చేసి, తదుపరి అను ష్ఠానదేవత యొక్క బలాన్ని లేక సాన్నిధ్యశక్తిని సమకూరుస్తుంది. గతంలో చాలా సార్లు జపానుష్ఠానంతో నీవు నీ పాత ప్రేరణలను విసర్జించి, శాంతిని తిరిగి పొందగలిగానని, చేతనను సక్రమ మార్గంలో పెట్టగలిగానని వ్రాసావు. ఇప్పుడు అది నీవు దుఃఖానికి, నిర్వేదానికి లోను కాకుండా కాపాడింది. ఈ చివరి దురదృష్ట కర పరిస్థితులు కూడా పాత ప్రేరణల లాగే సడలిపోయి నీ ప్రకృతి అంతలో నిశ్చలమైన ప్రశాంతత నెలకొనుట ఆరంభమవుతుందని ఆశిద్దాం.

CWSA 35:827-29

శ్రీఅరవిందులు

యాంత్రికమైన జపానుష్ఠానం సైతం అవచేతనపై ప్రభావం చూపుతుంది

అయితే, పరిపూర్ణమైన సిద్ధిని కోరే మనలాంటివారికి ఈ మంత్రాలు, ఈ నిత్య జపానుష్ఠానాలు నిజంగా ఉపకరిస్తాయా లేక అవి కూడా మనలను అచేతనలో బందీలను చేస్తాయా?

ఈ మంత్రపారాయణ, జపానుష్ఠానం మనకు క్రమశిక్షణ నిస్తుంది. ఆలోచనా విధానాన్ని గాడిలో పెట్టే దానికన్నా స్వభావాన్ని అంతర్గతంగా క్రమబద్ధం చేస్తుంది.

అది ఇంచుమించు ఒక భౌతికమైన శిక్షణ.అంతకు మించి జపం అవచేతన పైనా, అసత్తుపైనా, పదార్థంపైనా, శరీరకణాలపైనా వ్యవస్థీకృత ప్రభావాన్ని చూపుతుంది. అందుకు సమయం తీసుకున్నా, పట్టు సడలకుండా ప్రయత్నించడం మూలన, కాలక్రమేణా ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు, పియానోపై నిత్యాభ్యాసం కాలానుగుణంగా నైపుణ్యం పెంచినట్టు. నీవు యాంత్రికంగా పునశ్చరణ చేస్తుంటావు. ఎట్టకేలకు చివరికి నీ చేతులు చైతన్యంతో ఉత్తేజితమవుతాయి — శరీరమంతా చైతన్యంతో నిండిపోతుంది.

Conversations with a disciple: Sept 20, 1960

శ్రీఅరవిందుల గాయత్రి

(తత్ సవితుర్ వరం రూపం జ్యోతిః పరస్య ధీమహి, యన్నః సత్యేన దీపయేత్)

అత్యంత శుభప్రదమైన (అత్యుత్తమమైన) సావిత్రి రూపంపై, మనలను సత్యప్రకాశంతో వికసింపచేసే ఆ పరాత్పరుని తేజస్సుపై ధ్యానం చేద్దాము.

ఇది శ్రీఅరవిందుల 'గాయత్రి' — సాంప్రదాయబద్ధమైన ఋగ్వేద ప్రవచిత గాయత్రిని తన నూతన అతిమానస పూర్ణయోగ సిద్ధి కోసం లేక దివ్యసత్యాచేతన సార్ధకత కోసం శ్రీఅరవిందులచే సవరించబడినది.

White Roses: 232

శ్రీమాత

అనువాదం అందుగులపాటి కైలాసపతి

పూర్ణయోగంలో నియమబద్ధమైన పద్ధతులంటూ ఉండవు

ఈ యోగసాధన ఏ రకమైన మానసిక బోధన ద్వారా కాని, సాధనలోని ధ్యానరీతుల ద్వారా కాని, లేదా మంత్రం లేదా మరే ఇతర పద్ధతుల ద్వారా కాని కొనసాగదు. ఇది ఆకాంక్షతో అంతర్ముఖము లేక ఊర్ధ్వముఖమైన స్వీయ-ఏకాగ్రతతో, ఓ ప్రభావానికి ఉన్మీలన మవడంతో, అనగా మన పైన ఉన్న దివ్యశక్తికి దాని కార్యాచరణకి తెరుచుకొనటంతో, హృదయంలో దివ్య ఉని కికి తెరుచుకుని ఉండడంతో, ఈ విషయా లన్నిటికి విరుద్ధమైన వాటిని త్యజించ టంతో ప్రారంభమవుతుంది. విశ్వాసం, ఆకాంక్ష మరియు సమర్పణ — వీటి వల్ల మాత్రమే మనంతట మనం ఈ సాధనకు తెరుచుకోగలం.

SABCL 23:505

పూర్ణయోగంలో నిర్దిష్టమైన మంత్రం ఉండదు

ఈ యోగంలో నిర్దిష్టమైన మంత్రం ఉండదు. మంత్రాలపై ఊనిక ఉండదు. అయితే సాధకులు వారి కేదైనా మంత్రం సహాయపడుతుందని అనుకుంటే, అది వారికి సహాయపడినంత కాలం వారు ఆ మంత్రాన్ని ఉపయోగించుకోవచ్చు. ఇక్కడ తప్పనిసరిగా ఉండవలసిన ఊనిక చైతన్యంలో ఒక ఆకాంక్ష పైనా, మనస్సు, హృదయం, సంకల్పం సమస్త అస్తిత్వం పైనా ఏకాగ్రత వహించటం. 'ఓం' మంత్రాన్ని సరైన పంథాలో ఉపయోగించినపుడు (యాంత్రికంగా కాకుండా), ఊర్ధ్వముఖంగాను, బహిర్ముఖంగాను విశ్వచైతన్యానికి తెరచుకోడా నికి, అవరోహణకు కూడా చాలా సహాయపడుతుంది.

SABCL 23:745

శ్రీమాత నామం ఒక మంత్రం

ఒక నిబంధనగా ఈ సాధనలో ఉపయోగించే మంత్రం — శ్రీమాత పేరు లేదా నా పేరు శ్రీమాత పేరు కలిపి మాత్రమే. హృదయంలో ఏకాగ్రత, శిర స్సులో ఏకాగ్రత రెండున్ను ఉపయోగించవచ్చు — దేని ఫలితం దానిదే.

మొదటిది చైత్యపురుషను ఉన్మీలనం చేసి భక్తిని, శ్రీమాతపై ప్రేమను, ఐక్యతలను కలిగిస్తుంది, హృదయంలో ఆమె ఉనికిని, స్వభావంలో ఆమె శక్తిని స్థిరపరుస్తుంది. మరొకటి మనసుని ఆత్మసాక్షాత్కారానికి, ఉన్నత మానస చైతన్యానికి, దైహికమైన దానిని త్యజించి ఉన్నత చేతనాస్థాయికి ఎదగటానికి, శరీరంలో ఉన్నత చైతన్య అవరోహణకి ఉన్మీలనం చేస్తుంది.

SABCL 23:746

పూర్ణయోగంలో ఏ మంత్రము ఇవ్వబడ లేదు

మేము సాధారణంగా ఏ మంత్రము ఇవ్వము. ధ్యానంలో దేన్నైనా పునశ్చరణ చేసేవారు శ్రీమాత నామాన్ని పిలుస్తారు.

27 June 1936

శ్రీమాత నామం తప్ప మరే మంత్రం లేదు

భారతదేశంలో గురువు శిష్యుడిగా ఎవరినైనా అంగీకరించగానే అతడికి మంత్రదీక్ష ఇచ్చి దాన్ని జపించమంటారు. మాకు శ్రీమాత నామం తప్ప మరే మంత్రం లేదు. కాని మేం సాధారణంగా పనులు కేటాయిస్తాం. వారిని ఆకాంక్షించమని, తిరస్కరించమని శ్రీమాతకు తెరుచుకుని ఉండమని చెప్తాం.

CWSA 32:139

ఇక్కడకు వచ్చి మంత్రదీక్ష తీసుకోడం అవసరం అన్న నీ స్నేహితుని అభిప్రాయం పూర్తిగా పొరపాటు. ఈ యోగంలో ఏ మంత్రం ఇవ్వడం జరగదు. అంతరంగంలో శ్రీమాత చైతన్యానికి తెరుచుకుని ఉండడమే ఈ యోగంలో ప్రారంభదీక్ష. అది ఆకాంక్ష వల్ల, మనోప్రాణికాల్లో అస్థిరత, అస్థిమితాలను తొలగించుకోవడంవల్ల సాధ్యమౌతుంది. ఇక్కడకు రావడం దాన్ని పొందే మార్గం కాదు. అనేకలు ఇక్కడకు వస్తారు కాని ఏం పొందలేరు లేదా కష్టాలను పెంచుకొని యోగమార్గానికి దూరమౌతారు. ఇంకా సిద్ధం కాకపోయినా, సిద్ధపడినట్టు అనిపించకపోయినా ఇక్కడికి రాక నిరుపయోగం. గాఢమైన కోరిక ఒక్కటే తయారుగా

ఉన్నారని చెప్పడానికి రుజువు కాదు. అంతరంగంలో సిద్ధపడినపుడు ఇక్కడికి రావడం ఇబ్బంది ఉండదు.

CWSA 32:333

శ్రీమాతను ఆవాహన చేసి ఆమెపై ధ్యానించు

నీ ఉత్తరాని కిచ్చిన సమాధానంలో శ్రీఅరవిందులు, నీవు నీ హృదయంలో శ్రీమాతపై ధ్యానం చేస్తూ, ఆమెను ఆవాహన చేయమని చెప్పారు — ఆమెను జ్ఞాపకం చేసుకుంటూ, నీ జీవితాన్నంతటినీ ఆమెకు సమర్పించాలి, ఆలోచనలు, ఆచరణలతో సహా. నీ కిష్టమైతే ఆమె నామాన్ని నీవు జపించవచ్చు. ఇష్టపడితే నీ అస్తిత్వాన్ని శుద్ధపరచమని, నీ స్వభావాన్ని మార్చమని ఆమెను ప్రార్థించవచ్చు.

లేదా ముందుగా పైనుంచి, ఆమె శాంతి, నిశ్చలతలను క్రిందికి రమ్మని పిలుస్తూ ధ్యానం చేయవచ్చు. ఆ తరువాత ఆమె శక్తిని, ప్రకాశాన్ని, ఆనందాన్ని, క్రిందికి ప్రసరించమని ధ్యానం చేయవచ్చు. అది ఎల్లప్పుడు శిరస్సుకు పైగా ఉంటుంది — కాని మానవమనసుకు అందని అతిమానసశక్తి — ఆకాంక్షచేత, ఏకాగ్రత వలన మానవ మనసుకు దాని ఎరుక కలుగుతుంది, అప్పుడు ఈ ఆధారం దానికి తెరుచుకుంటుంది, ఆ విధంగా అది క్రిందికి అవరోహణ చేసి మనో ప్రాణ శరీరాలలోకి ప్రవేశిస్తుంది.

CWSA 32:155

శ్రీఅరవిందులు

శరీరసాధనకి మంత్రం ఆవశ్యకత ఉంది

ఈ శరీరసాధనకి మంత్రం అవసరమని నేను గ్రహించాను. శ్రీఅరవిందులు ఏ మంత్రం ఇవ్వలేదు. బాహ్యమైన ఏ పద్ధతులపై ఆధారపడకుండా సాధకులు వారి సాధనని వారు స్వయంగా చేసుకోవాలని వారు చెప్పారు. ఇప్పుడు మన మున్న స్థాయికి వారు చేరి ఉంటే, పూర్తిగా మానసికమైన పద్ధతి సరిపోదని, జపం అవసరమని, అందుకు కారణం శరీరం మీద సూటిగా పనిచేయగలిగినది ఒక జపం మాత్రమేనని గ్రహించి ఉండేవారు. నేనే అందువల్ల ఒంటరిగా ఒక

పద్ధతి కనిపెట్టవలసి వచ్చింది. నేనే స్వయంగా నా మంత్రాన్ని కనుగొన్నాను. అయితే ఇప్పు డంతా తయారుగా ఉంది కాబట్టి, పదేళ్ళలో చేయవలసిన పనిని కొద్ది మాసాలలో చేయగలిగాను. ఇందులో ఉన్న కష్టం అదే, దీనికి సమయం కావాలి....

నేను నా మంత్రం ఎల్లవేళలా జపిస్తూ ఉంటాను — నా మెలుకువలోను, నిద్రలోను సైతం. నేను నా నిత్యకృత్యా లాచరిస్తున్నపుడు, అంటే దుస్తులు ధరించేటప్పుడు, నేను ఆహారం తీసుకునే సమయంలో, నేను పని చేసేటప్పుడు, నేను ఇతరులతో సంభాషిస్తున్నప్పుడు... అది నాతోనే ఉంటుంది, నా వెనక, నేపథ్యంలో సదా, ఎల్లప్పుడు ఆ మంత్రం నాలోనే ఉంటుంది.

నిజానికి మంత్రం కలిగి ఉన్నవారికి, లేనివారికి మధ్య భేదం వెంటనే చూడ వచ్చు. మంత్రం లేనివారికి ధ్యానం, ఏకాగ్రతల యందు గాఢమైన అలవా టున్నా, వారి చుట్టూ ఒక అస్పష్ట, అనిర్వచిత వాతావరణం, కలవరం ఉంటాయి. అదే జపం అభ్యసించేవారికి దాని వలన ఓ కచ్చితమైన లక్షణం, స్థిరత్వం సమ కూరుతుంది. అది ఓ రక్షణ కవచ మవుతుంది, వారిలో ఓ చురుకుదనాన్ని కలిగి స్తుంది.

శిష్యునితో సంభాషణలు: మే 19, 1959

కొన్ని మంత్రాలతో శ్రీమాత అనుభవాలు

నా దగ్గర మంత్రాల గిడ్డంగి వున్నది. అవన్నీ నాకు సహజంగా వచ్చినవే, బుద్ధిలోంచి పుట్టినవి కావు. అవి సహజంగానే నా లోంచి వెలువడ్డాయి, వేదం ఉద్భవించిన చందంగా....

అది ఎప్పుడు ప్రారంభమైందో నాకు తెలీదు — చాలా కాలం క్రితం, నే నిక్కడికి రావడానికి పూర్వం, కొన్ని ఇక్కడికి వచ్చాక వచ్చినవి కూడా ఉన్నాయి. నా విషయంలో నా కొచ్చిన మంత్రాలన్నీ సంక్షిప్తమైనవి, ఉదాహరణకి, శ్రీఅర విందులు భౌతికంగా ఇక్కడ ఉన్నప్పుడు — ఏ క్షణంలోనైనా, ఏ కష్టంలోనైనా, మరి దేనికైనా ఎల్లప్పుడూ ఈ విధంగా వచ్చేది: "ప్రభూ" అన్న నామం సర్వ సాధారణంగా, అనాలోచితంగా — "ప్రభూ!" అని. తక్షణం ఒక సంబంధం ఏర్పడేది.

పాండిచ్చేరికి రాకపూర్వం నా దగ్గర ఒక ఫ్రెంచి మంత్రం ఉండేది. అది 'దయామూర్తీ, దివ్య కారుణ్యామూర్తీ' అన్నది. దాని అర్థం సాధారణంగా బోధ పడదు — అది మొత్తం ఒక కార్యక్రమం, ఓ సార్వత్రిక కార్యక్రమం. శతాబ్ది ప్రారంభం నుండి ఈ మంత్రాన్ని పునశ్చరణ చేస్తున్నాను. అది ఆరోహణా మంత్రం, ఆత్మసాక్షాత్కార మంత్రం. ఇప్పుడది అదే విధంగా రావటం లేదు. అది ఒక స్మృతిగా వస్తుంటుంది. కాని అది ఉద్దేశ్యపూరకంగా వచ్చేది, చూసావూ. ఎందుకంటే నే నెల్లప్పుడు 'దివ్యకారుణ్యామూర్తి, దయామూర్తి' అనే చెప్పేదాన్ని, కారణం, నేను అప్పటికే అంతటా, అన్నిటా ఉన్నది దైవమని అర్థం చేసు కున్నాను. ఇది దైవమని, ఇది దైవం కాదని భేదభావాన్ని మనకి మనమే ఏర్పర చుకున్నాం.

నే నెల్లప్పుడు ఆ సంస్కృత మంత్రాన్ని శ్రవణం చేస్తాను:

"ఓం నమో భగవతే".

ఆ మంత్రం నా చుట్టు ఎల్లవేళలా ప్రకంపిస్తుంటుంది. నా ప్రతి కణంలోను నిండి ఊర్ధ్వముఖంగా అధిరోహింప జేస్తుంది. అలాగే నారదుని మంత్రం కూడా: నారాయణ, నారాయణ... (అది నిజానికి ఒక ఆజ్ఞ, దాని అర్థం. ఇప్పుడు నీవు నేను కోరినట్టు చేయాలి), కాని అది హృదయజనితం కాదు....

శిష్యునితో సంభాషణలు: సెప్టెంబరు 16, 1958

ఓం నమో భగవతే

ప్రస్తుతానికి నా అన్ని సూత్రాలు లేదా మంత్రాలను మించి అత్యంత సూటిగా ఈ శరీరంపై పని చేసేది, అన్ని కణాలను ముట్టడించి సత్వర ప్రకంపనలు గావించేది ఈ సంస్కృత మంత్రం 'ఓం నమో భగవతే' అన్నది.

నేను ఏకాగ్రతలో ధ్యానంలో కూర్చున్న వెంటనే, ప్రశాంతమైన ఒక్క క్షణం లభించగానే, ఈ మంత్రంతో మొదలవుతుంది. అప్పుడు నా శరీరం దానికి ప్రతిస్పందిస్తుంది., నా శరీరజీవకణాలు స్పందిస్తాయి, ప్రకంపించడం ప్రారంభిస్తాయి.

అది ఇక్కడ నుండి పైకి లేచింది (శ్రీమాత నాభిపద్మం సూచిస్తారు) ఈ విధంగా: "ఓం నమో భగవతే, ఓం నమో భగవతే, ఓం నమో భగవతే". అది

అసాధ్యంగా నుండింది. ఆ ధ్యానంలో ఉన్న పావుగంటలోనూ అంతా దివ్యప్రకాశంతో నిండిపోయింది! తీవ్రస్థాయిలో అది స్వర్ణచ్ఛాయ లీనే కంచులా ఉండింది. (కంఠం స్థాయిలో ఇంచుమించు ఎర్రగా నుండింది.) మరింత ఉన్నతస్థాయిలో అది క్షీరస్ఫటికమణి లాంటి ధవళ ప్రకాశంతో ఉండింది: "ఓం నమో భగవతే, ఓం నమో భగవతే, ఓం నమో భగవతే". ఇంతకు ముందు రోజు, (నేను మేడ మీది స్నానాల గదిలో ఉన్నాను) అది ఒక్కసారి నా శరీరమంతా వ్యాపించింది. ఆ శక్తి ప్రకంపనాలు నన్ను చుట్టాయి. అది అదే విధంగా పైకి అధిరోహించింది, జీవకణాలన్నీ మహత్తరశక్తితో కంపించాయి! నేను అంతా ఆపివేసాను, అన్ని కదలికలను ఆపాను. దానిని పెరగనిచ్చాను. ఆ ప్రకంపనలు విపరీతంగా వ్యాప్తి చెందాయి, మరింత విస్తృతి చెందాయి, పెరుగుతున్న ధ్వనికి అనుగుణంగా ఓ ప్రగాఢ ఆకాంక్ష శరీరంలోని కణాలన్నింటా నిండింది... మొత్తం శరీరమంతా పొంగినట్లుగా — అది ముంచెత్తినట్లుగా వుండింది. అంతా పగిలిపోతుందేమో అనుకున్నాను.

సర్వసంగ పరిత్యాగులైనవారు సంపూర్ణంగా అదే అనుభవంలో జీవిస్తారని అర్థమయింది.

దానికి ఎంతటి పరివర్తనాశక్తి ఉంది! అది అలాగే కొనసాగితే, ఏదో ఒకటి సంభవిస్తుందనిపించింది... అంటే శరీర జీవకణాల సంతులనంలో మార్పు లాంటిది జరగవచ్చని భావించాను.

ఓ శిష్యురాలితో సంభాషణలు: సెప్టెంబరు 16, 1958

సావిత్రి — రూపాంతరీకరణ మంత్రం

అప్పుడు సావిత్రి ఒక దివ్యజ్ఞానోదయమని చెప్పవచ్చు, అది ఒక ధ్యానం, అనంతమైన, శాశ్వతమైన, దైవానికై చేసే అన్వేషణ. ఈ శాశ్వతత్వం పై ఆకాంక్షతో పఠించినట్లయితే, ఆ పఠనమే ఆ శాశ్వతత్వానికి మార్గదర్శిగా ఉపకరిస్తుంది. సావిత్రి పఠనం నిజంగా దైవాన్ని సాక్షాత్కరింప చేసుకోడం. యోగంలోని ప్రతి అడుగు ఇక్కడ వ్రాయబడింది, ఇతర యోగ రహస్యాలతో సహా! నిజాయితీతో, చిత్తశుద్ధితో ప్రతి పంక్తిలో వెల్లడైన విషయాన్ని అర్థం చేసుకొన్నప్పుడు, తప్పక వారు చివరికి అతిమానసయోగం యొక్క రూపాంతరీకరణ స్థాయిని చేరగలరు.

అది నిజంగా ఒక పొరపాటుపడని అపూర్వమైన మార్గదర్శి, అది నిన్నెన్నడు వద లదు. ఈ మార్గాన్ననుసరించేవారికి, వారి సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది. సావిత్రిలోని ప్రతి పంక్తి ఒక మంత్రం వంటిది; అది ఇప్పటిదాకా మానవుని జ్ఞాన సముపార్జనను అధిగమించినది. నేను మళ్ళీ చెప్తున్నాను, ఇందులోని పదాల అభివ్యక్తి, వాటి కూర్పు ఏ విధంగా ఉందంటే, వాటి లయబద్ధ ధ్వనితరంగాల ఛందోబద్ధత నిన్ను నాదమూలానికి కొనిపోతుంది.... అదే 'ఓం'.

(*శ్రీమాత చెప్పగా, మోనాసర్కార్ చే వ్రాయబడింది: కాంతిసందేశాలు*)

'ఓం నమో భగవతే

నాకు సంబంధించి ఈ మూడు మాటల యొక్క అర్థం:

ఓం — నేను పరాత్పరుని ప్రార్థిస్తున్నాను

నమో — నేను దైవానికి నమస్కరిస్తున్నాను.

భగవతే — నన్ను దైవంగా తీర్చిదిద్దు.

ఈ మంత్రానికి అంతటిని ప్రశాంతపరచగల శక్తి ఉందని నేను భావిస్తాను.

CWM 12:446-47

శ్రీఅరవిందులు మరియు శ్రీమాత నామం యొక్క శక్తి

ఎవరైనా శ్రీఅరవిందులను నమ్మికగా పిలిచినట్లయితే, హృదయంలోంచి (శ్రీమాత హృదయాన్ని సూచిస్తారు) వారు బదులిస్తారు. వారి నామం ద్వారా, వారి చైతన్యంతో వారి హృదయం ప్రతిస్పందిస్తుంది. వారి ముద్ర అక్కడ ఉంది కాబట్టి (సూచన), అది వారి నామంతో ప్రతిధ్వనిస్తుంది. హృదయం లోతుల్లో ఉన్నది వారే, అస్తిత్వమంతా వారి వలననే జీవిస్తోంది, వారి వలననే స్పందిస్తూంది. ఈ మొత్తం విశ్వమంతా వారి వలననే ప్రతిస్పందిస్తున్నది. వారు స్వర్వవ్యాప్తమై ఉన్నారు, అంతటా వారి ఉనికి ప్రతిస్పందిస్తున్నది, అంతటా వారి ఉనికి సచేతనమై ఉన్నది.

వారి నామోచ్చరణలోని ఆనందం అంతటా చొచ్చుకొని, సర్వాన్ని పవిత్రీకరి స్తుంది., శాశ్వతమైన యదార్థమైన, మహనీయమైన ఆ దివ్యానంద పారవశ్యంలో ఖంగుమని అంతటా ప్రతిధ్వనిస్తుంది. వారిని సాక్షాత్కరింప చేసుకోవడమంటే

శాశ్వతానందాన్ని కనుగొనడమే. ఈ సృష్టికే వారి నామం ఒక అర్థాన్ని కలుగ జేస్తుంది.

ఈ విశ్వంలోని ప్రతి ఒక్కదానిలో స్వతఃస్సిద్ధంగా దాగి ఉన్న దైవాన్ని తిరిగి కనుక్కోవడం, ఆతనిని గుర్తించడం అనేది నిరంతరంగా కొనసాగే క్రీడ. ఆతని అనుభూతిని పొందటమనగా సంపూర్ణమైన పరమ పవిత్రతలోని స్థిరమైన దివ్యప్రశాంతిని అనుభవించడం. ఆతని సాక్షాత్కారం పొందటమనగా శాశ్వత దివ్యానందాన్ని పొందగలగటం. ఆతనికై పిలుపు అనగా అనంతత్వ ద్వారాలను తెరవడం. ఇదే శ్రీఅరవిందుల నామం వెనుక నున్న శక్తి.

...అవును, నా బిడ్డా, నన్ను, శ్రీఅరవిందులను ఎవరైతే గుర్తిస్తారో — నిజానికి, అది ఒకే చర్య, ఒకే గుర్తింపు, వారికి అన్ని అడ్డంకులు, అన్ని కష్టాలు, అన్ని బంధనాలు, సత్యపథం వైపు నడిచే మార్గమధ్యంలో అవరోధాలన్నీ తుడిచిపెట్టుకపోతాయి, శాశ్వతంగా తొలగించబడతాయి — ఈ జీవితంలోనే కాక మరణా నంతరం, రాబోయే జన్మల్లో కూడా — శాశ్వతంగా

అవును, అలాంటి వారి ప్రభువు సర్వశక్తి సమన్వితుడు
వారు చేయాల్సింది కేవలం పునశ్చరణ:
"మాతా — శ్రీఅరవిందా, మాతా శ్రీఅరవిందా"... (పారవశ్యకతలో)
అది చాలు.

Supreme, p. 82

అనువాదం: డి. సత్యవాణి

'ఓమ్' అను మహాపదము అనశ్వరమైనది. 'ఓమ్' అనగా విశ్వమే, 'ఓమ్' వివరణ యిదే. భూత భవిష్య వర్తమానములు — జరిగినది, జరుగుచున్నది, జరుగబోవునది అంతా — 'ఓమ్'. ఆ విధంగానే కాలాతీతమై వున్నదంతా కూడా 'ఓమ్' మాత్రమే.

CWSA 18:193

శ్రీఅరవిందులు



అఖిల

అఖిల భారత పత్రిక — అక్టోబరు 2015

విషయసూచిక



పాఠకులకు గమనిక

ఈ సంచికలో తాంత్రిక విధాన ప్రస్తావన వున్న వ్యాసాలను కొంత మెలకువతో చదవాలి. ఇందులో గమనించవలసిన మొదటి విషయం ఏమిటనగా ఈ వ్యాసాలు తాంత్రిక విధానంలోని సంక్షిప్త సారాంశాన్ని కొంత స్పర్శిస్తాయి తప్ప సమగ్ర వివరణ నీయలేవు. రెండవది, శ్రీఅరవిందుల యోగవిధానంలో కొంత భాగం తాంత్రిక సూత్రాలు చోటుచేసుకున్నా — దివ్యమాతకు ఉన్మీలనం, దివ్యమాత కీలకపాత్ర లాంటివి — శ్రీఅరవిందుల యోగం కూడా తాంత్రిక పద్ధతిలో కొనసాగిందని అర్థం చేసుకోకూడదు. మూడవది, కొన్ని విషయాలను – 'Evening Talks' నుండి సంగ్రహించబడినవాటిని — సందర్భానుసారంగా గ్రహించాలి. ఆ మాదిరిగానే 'శక్త్యోపాసన' లోని విషయాలు పూర్వం 'Yogic Sadhana' అను శీర్షిక క్రింద 'ఉత్తర యోగి' అనువారు వ్రాసినట్లుగా ప్రచురించబడినవి. ఆ 'ఉత్తర యోగి' శ్రీఅరవిందులే, కాని 'నాగై జప్త' అనబడే యోగి ఒకరు శ్రీఅరవిందులు పాండిచ్చేరికి రాకపూర్వమే, వారి భవిష్య ఆగమనాన్ని సూచిస్తూ వారికి ఈ నామకరణం చేసారు. ఈ విషయాన్ని గురించి శ్రీఅరవిందులు వ్రాసిన వ్యాసం యొక్క చివరి భాగం ఈ సంచిక 27 పేజీలోని చివరి అంశంగా ప్రచురించబడింది.

మరొక విషయం. ఈ సంచికలోని అనువాదాలు ఈ మాసపు 'All India Magazine' లోని ఆంగ్లవ్యాసాల వరుస క్రమంలో లేవు. శీర్షికల కివ్వబడిన పేర్ల లోను, వాటి క్రింద వ్రాయబడిన విషయాలలోను, కొన్ని అనివార్య కారణాల వలన, కొంత మార్పు చోటు చేసుకున్నది. సమయాభావం వలన ఆంగ్లవ్యాసాలకు అనుగుణంగా అనువదించబడకపోయినా, అసలు సారాంశంలో మార్పు లేదు.

సంపాదకుడు

(1)

దేవీ స్తుతి

"జననీ, విశ్వకారిణీ,
శబ్ద బ్రహ్మాత్మక ఆనంద రూపిణీ!
ఆది పరాశక్తివి నీవు విశ్వకర్త్రిణివి.
త్రిమూర్తులను సృష్టి-స్థితి-లయాలను సృజించావు.
అనాదివైనా నిత్య యువ్వనంలో వుంటావు
పర్వతరాజ కుమారీ, సుకుమారీ
వేదమాతవు నీవు, వర్ణనాతీతవు నీవు
నిరంతర జ్ఞానులు, ధ్యానులు సైతం
తెలియ లేరు నిన్ను ఎన్నటికీ.
మాతా! వర్ణనాతీతా!"

ఈ స్తోత్రం తంత్రశాస్త్రం లోనిది. దివ్యజనని వర్ణనతో ఇది ప్రారంభమై, వర్ణనాతీత చిన్మయ రూపంతో ముగుస్తుంది.

విశ్వజనీనత అనేది ఒక తంత్రశాస్త్ర రహస్యం. వర్ణించగల సత్యం, వర్ణనాతీత సత్యం ఇందులోని విభాగాలే, ఆరాధనీయాలే. కేవలం దేహాత్మ భావానికే పరిమితం కాకుండా స్వీయ నిబద్ధతతో కూడిన జ్ఞాన పరాకాష్టకూ ఇవి నిదర్శనాలే.
CWSA 1:574-75)

తాంత్రిక విధానం వెనుకనున్న సిద్ధాంతము, తత్వము రెండు పార్శ్వాలు, ఒకే సత్యం

వేదవిజ్ఞానము సత్యానికి ఒక పార్శ్వమైతే, పరాశక్తిపై ఊనికగల తంత్ర విజ్ఞానం రెండోది. తంత్రం శక్తికి ప్రతీక, కాని మన యోగంలో అన్ని పక్షాలకూ అవకాశం వుంది. మనందరకు సులభంగా తెలిసిన 'సాకార' భావన కంటే అందులో అంతర్లీనంగా వుండే తత్వానికి ఇందులో ప్రాధాన్యత మెండు. వేదాంతం దివ్యమైన విజ్ఞానపు ముఖ్యసూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వటం వలన అందులో వున్న ఆధ్యాత్మిక విజ్ఞానానికీ, అనుభూతులకూ 'ఆర్య' లో చోటు కల్పించాము.

తంత్రశాస్త్రము సారూప భావనలకూ, వ్యవస్థీకృత కర్మకాండకు అధిక ప్రాధాన్యత నిస్తుంది. దీనికంతా యథాతథంగా మన పూర్ణయోగంలో స్థానం లేదు. పూర్ణయోగం తనదైన ప్రతిరూపాలను, కొన్ని వ్యవస్థీకృత పద్ధతులను, శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవలసి వుంటుంది. చైతన్యపు ఆరోహణ దాని కేంద్రస్థానాల నుండే జరగాలి. ఇందుకు తంత్ర విజ్ఞానము తోడ్పాటు కూడా కొంత అవసరమే. అందువలన దీనికి కూడా నేను ప్రత్యేక స్థానాన్ని ఇచ్చాను. యదార్థం ఏమిటంటే శ్రీమాత శక్తితో మాత్రమే ఇది సాధ్యపడుతుంది.

SABCL 22:72-73

శ్రీమాత — భగవద్గీత

భగవద్గీత ముఖ్యంగా ఈశ్వరవాదానికి సంబంధించిన దివ్యత్వాన్ని ప్రబోధిస్తుంది. ఇందులో దివ్యజనని ప్రమేయం పెద్దగా వుండదు. ఇందుకు కారణం ప్రాపంచిక లేక భౌతిక విషయాసక్తికి అది ప్రాధాన్యం ఇవ్వకపోవటమే. తాంత్రిక సాంప్రదాయం పరాశక్తి లేక ఈశ్వరి పై ఊనిక నిచ్చి సర్వము శ్రీమాతపై ఆధారపడునట్లు భావిస్తుంది. కారణం దాని లక్ష్యం లోకధర్మాన్ని తన పరం గావించి అంతటికీ శ్రీమాతను అండగా నిలిపి తద్వారా పరమార్థాన్ని సిద్ధింప చేసుకోవడం. నిమ్నప్రకృతిని అధిగమించి దానికి అతీతంగా వుండే అత్యున్నత స్థితిని సాధ్యపడేలా చేసుకోవటమే దాని లక్ష్యం. కాని తంత్రయోగంలో దివ్యజనని యొక్క కృపకు పాత్రులవటమే అసలైన సాధన. దీన్ని సాధించలేనపుడు తంత్ర యోగం విఫలమౌతుంది.

SABCL 25:65-66; CWSA 32:156

తంత్రయోగపు పార్శ్వాలు

మానవ ప్రకృతి కేంద్రీకృతమైన సంఘటిత శక్తిగాను, చలనాత్మకంగాను వుండగలిగిన యోగవిధానం మన దేశంలో ఆచరణలో వుంది. అదొక ప్రత్యేక ప్రక్రియ. ఇతర విధానాలకు భిన్నంగా వుంటుంది. ఇదే తాంత్రిక విధానం. కొన్ని కారణాల వలన తాంత్రిక విధానం దాని విలువ, గౌరవాన్ని కోల్పోయి ఇప్పుడు నిరాదరణకు గురి అయింది. వామాచార మార్గాన్ని అనుసరించేవారు

పుణ్యపాపాల మార్గం వదలి భోగలాలసత్వం, హద్దులేని అసాంఘిక కార్యక్రమాలకు చేరువౌతారు. కాలక్రమేణా ఇదే దాని అసలైన విధానంగా మారిపోయింది.

నిజానికి తాంత్రిక విధానం కూడా ఒక విధంగా సత్యాన్వేషణ పైననే ఆధారపడి యుండేది ప్రారంభంలో. ఇప్పుడు మనం చూస్తున్న దక్షిణ, వామాచార మార్గాలు రెండూ ఈ అంతర్గత భావన పైనే ఆధారపడ్డవే. వామ, దక్షిణ అనేవి అనాది నుండీ ప్రతీకలే. ఒకటి జ్ఞానమార్గాన్ని ప్రబోధిస్తే, రెండవది భోగమార్గాన్ని ప్రబోధిస్తుంది. అంతర్గత శక్తులను ఒక పద్ధతిలో అదుపులో పెట్టటం ద్వారా ఒకటి, విశృంఖల ఆనందహేలలో వ్యక్తపరచడం ద్వారా మరొకటి ప్రకటితమౌతాయి. సాధకుని అంతర్గత శక్తులను వ్యక్తీకరించి ఆత్మకు స్వేచ్ఛనూ, ఆనందాన్నీ ప్రసాదిస్తాయి. అదే విధంగా ఇవి కూడా కొన్ని అవరోధాలకు లోనైనప్పుడు ఆశించినదానికి భిన్నమైన రూపాలలో వ్యక్తమై పతనానికి కూడా దారితీస్తాయనేది కద్దు.

(యోగసమన్వయం, పుట 43)

తంత్రమార్గానికి కేంద్ర భావన:

ఇది ఇలా వుండగా అసలు విషయానికి వచ్చి తంత్రప్రక్రియ యొక్క మూల సూత్రాలను గురించి ఆలోచిస్తే తాంత్రికత వేదమార్గానికి భిన్నమైనదనేది గమనించవచ్చు.

ఇంతవరకూ మనం చర్చించుకున్న విధానాలన్నీ వేదాంతమార్గంలో సాగుతున్నవే. వాటి మూలం జ్ఞానానికి సంబంధించిన శక్తి; కేవలం మేధాశక్తికి మాత్రమే సాధ్యమయేది కాదు. హృదయగతమైన ప్రేమకూ, అంచల విశ్వాసానికీ సంబంధించినది; కర్మలో వ్యక్తపరచగల ఇచ్ఛాశక్తిది. ఇందులో 'పరమాత్మ'గా తెలియబడే 'పురుషుడు' యోగిరాజు, ఎరుగగలిగి ఆకర్షించగల అధిపతి.

తంత్రప్రక్రియ ఇందుకు భిన్నంగా 'ప్రకృతి' గా తెలియబడే శక్తి. తన ఇచ్ఛాబలంతో ప్రపంచాన్ని నడిపిస్తుంది. ఈ ఇచ్ఛాశక్తి వెనుక దాగియున్న రహస్య విధానాలను తాంత్రిక యోగులు అనుసరించి ఆ విధంగా ఆధిపత్యాన్ని సాధించి చివరకు ముక్తులై బ్రహ్మానందానికి చేరువౌతారు. భౌతికప్రకృతివలన సహజంగా ఎదురయ్యే కష్టనష్టాలకు దూరంగా వుండాలనుకోకుండా వాటిని

నేరుగా ఎదుర్కొని, అనుభవంలోనికి తెచ్చుకొని ఆ విధంగా వాటిని లోగొని చివ రకు విజయం సాధించిన వారౌతారు.

కాని అనేక సందర్భాలలో తాంత్రిక యోగులు వారి అసలైన లక్ష్యాలను మరచిపోయి ఒక యాంత్రిక భౌతికానుభవాలకూ, మార్మికశక్తుల ఆకర్షణకు లోనౌ తారు. ఇవి సక్రమ మార్గాలలో ఉపయోగపడితే సత్ఫలితాలను ఇవ్వగలవు కూడా. కాని వక్రమార్గాలలో ప్రయోగించినపుడు అవి చాలా హాని చేస్తాయి; సాధకుని అసలు లక్ష్యం నుంచి వేరు చేస్తాయి.

తాంత్రిక యోగంలో మనకు సత్యాన్వేషణలోని ఒక పార్శ్వమే కనిపిస్తుంది. అది శక్తిపూజకు సంబంధించినది. దీన్ని వారు ఒకే ఒక సాధనాశక్తిగా భావిస్తారు. వేదాంతవాదులు మాత్రం ఇదంతా ఒక భ్రమ అని చెపుతారు. నిశ్చల మౌన ముద్రలో 'పురుషుడే' చిత్ శక్తి కల్పించే భ్రమను తొలగించి విముక్తిని ప్రసాదించ గలడని వారు భావిస్తారు.

కాని మన 'పూర్ణయోగం' లో చైతన్య స్వరూపమైన పరమాత్మయే అన్నిటికీ అధిపతి. ప్రాకృతిక (జీవ) ఆత్మ కేవలము ఆయన యొక్క 'నిర్వహణా శక్తి' మాత్రమే. అనంతము, చైతన్యము అయిన పరిశుద్ధుడు 'పురుషుడు'. ప్రకృతి చిత్ శక్తి. ఇది 'పురుషుని' చైతన్యానికి ఒక సంకేతము. 'ప్రకృతి' 'పురుషులు' (అంటే నిశ్చలత, చలనము) రెండు విభిన్న ధృవాల మధ్యలో ఉంటాయి.

ఇచ్ఛాశక్తి మన చైతన్యపు ఉనికిలో లీనమై యుంటుంది. ఆ విధంగా నిశ్చల తను సంతరించుకుంటుంది. 'పురుషుడు' తన శక్తిని కర్మలో ప్రతిఫలింప జేసిన పుడు కర్మ, దాని వలన సృష్టి, అందుండి ఆనందము లభిస్తాయి. ఆనందమే పరి ణామానికి పరమావధి. ఇది సాధన, తపస్సుల ద్వారానే సాధ్యం. 'పురుషుని' చేతనయే తనలోని అనంత శక్తిని సంతరించుకొని మనలో విజ్ఞానాన్ని పెంపొంది స్తుంది. అనంతశక్తి నుండి ఉద్భవించే విజ్ఞానశక్తి కూడా అనంతమే. అందువలన అది తనదైన శైలిలో తన లక్ష్యాన్ని సాధించుకోగలదు.

ఏతావాతా అన్ని యోగాలలో తపస్సు అనంత శక్తివంతమైనది అని అందరూ గ్రహించారు. మానవ జీవితం గురించి మాట్లాడేటప్పుడు దీనినే తీవ్రమైన ఇచ్ఛ, తీవ్రమైన విశ్వాసం అని చెప్పవచ్చు. ఆ ఇచ్ఛ జ్ఞానసారమైనపుడు అన్నీ సాధ్య మౌతాయి. విశ్వాసం మాత్రం సత్యచేతన యొక్క క్రిందనూ, అసంకల్పిత

చేతనలోనూ వుండటం వలన అది పైకి రావటం ప్రశ్నార్థకమే. ఇదే విషయం భగవద్గీతలోనూ చెప్పబడింది:

"మానవుడు దేన్ని సంకల్పించి దృఢవిశ్వాసంతో వుంటాడో, చివరకు దాన్నే పొందగలుగుతాడు".

యద్భావం, తద్భవతి.

CWSA 23:44

శ్రీఅరవిందులు

భావానువాదం; కె. ఆర్. యల్. నరసింహారావు

భగవంతుడు స్త్రీగా

భగవంతుడు ఒక స్త్రీ అని నేను తెలుసుకున్న తరువాత, ఎంతో దూరం లోని ప్రేమను గురించి కొంత తెలుసుకున్నాను. కాని నేను ఒక స్త్రీనైనా ప్రభువును ప్రియతముడుని సేవించిన తరువాత మాత్రమే ప్రేమను గురించి నేను పూర్తిగా తెలుసుకోవడం జరిగింది.

CWM 10:329

స్త్రీని దేవతగా ఆరాధించడం

విద్యాః సమస్తా స్తవదేవి భేదాః

స్త్రియా సమస్తా సకలా జగత్సు

"ఓ దేవీ, సర్వశాస్త్రములు, సకల లోకములలోని సమస్త స్త్రీలు నీ విభిన్న భాగములే" దీని తాత్పర్యం. ఎక్కడైనా సజీవమూర్తిలో స్త్రీత్వం గోచరించితే, అప్పుడు మనకు ప్రపంచ-ఆధారభూతమైన దైవం యొక్క మాతృ సహజమైన ఆత్మ పూర్తి ఉనికి ఉంటుంది. ఆ దేవి తన సమస్త అంశలతో, కళలతో స్త్రీమూర్తిలో ఉన్నది; స్త్రీమూర్తిలో మనం దుర్గ, అన్నపూర్ణ, తార లయిన మహావిద్యలను దర్శించాలి, అని తంత్రంలో చెప్పబడింది. అవలన్ మహాశయుడు తన ప్రస్తావన లోని వాక్యంలో ఇలా పేర్కొన్నాడు, "ఒకరు ఎక్కడైనా స్త్రీ పాదాలను చూడటం

జరిగితే, అతడు తన గురువును పూజించిన విధంగా ఆ పాదాలను తన హృదయంలో భక్తితో పూజించాలి". ఆ విధంగా హిందూమతంలోని శాక్తమార్గంలోని ఆలోచన స్త్రీలోని దైవత్వం విషయంలో ఏ విధమైన వెసులుబాటుకూ ఆస్కారం లేకుండా, వేదాంతం ప్రకటించిన విధంగా మనిషిలోని నిగూఢమైన దైవత్వాన్ని పూర్తి చేసింది: కాని మనం ఆచరణలో చాలా అనుకూలంగా అది కేవలం పురుషులకే అన్వయమన్న రీతిలో ప్రవర్తిస్తాం. వాస్తవంలో, మనం భిన్నంగా రెండు విధాలుగా అభివ్యక్తమైన దానిలోని పరిపూర్ణ సమానత్వమును ఖండించినప్పటికీ, దానిని మనం నిశ్శబ్దంగా ప్రక్కకు పెట్టేస్తాం.

CWSA 1:571

దివ్య మహాశక్తి — దివ్య మహా ఆధిపత్యశక్తి

ప్ర: దివ్యమహాశక్తికీ, దివ్యమహా ఆధిపత్యశక్తికీ మధ్యగల తేడా ఏమిటి?

దివ్య మహా ఆధిపత్యశక్తి కేవలం దివ్యమహాశక్తిలో ఒక భాగం; దివ్య మహా ఆధిపత్యశక్తి దివ్య మహాశక్తి యొక్క ఒక విశేష లక్షణం. శ్రీఅరవిందులు దివ్యమహాశక్తి అనే పదాన్ని వాడతారు. ఇక్కడ చిత్-తపస్ అనేది దాని భావార్థం, సృష్టిని చేసే ఆధిపత్యశక్తి, సృష్టిని చేసే చైతన్యం; పర్యవసానంగా దివ్య మహాఆధిపత్యశక్తి మహాశక్తిలో ఒక భాగం మాత్రమే.

దివ్యజనని, ఆమె అంశలకుగల సంబంధం

ప్ర: ప్రియమైన మాతా, మహాసరస్వతి నలుగురిలో చిన్నది ఎలా అయింది?

కారణం, ఆమె చేయవలసిన పని చివరన వచ్చింది; కనుకనే ఆమె చివరన వచ్చింది. (నిశ్శబ్దం) వారంతా అదే క్రమపద్ధతిలో అభివ్యక్తమయ్యారు. ఈ అంశలు జగజ్జనని విశేష లక్షణాలు వంటివి, పని ఆవశ్యకతను బట్టి ఒకరి తర్వాత మరియొకరు క్రమపద్ధతిలో అభివ్యక్తమయ్యారు; ఇందులో పరిపూర్ణతా ఆవశ్యకత చివరిది, కనుక ఆమె అందరికంటే చిన్నదయింది.

ప్ర: కాని, ఈ నలుగురు ఎవరికి వారు స్వతంత్రులు కదా?

కొంతమట్టుకు, కాని పూర్తిగా కాదు. అది ఎల్లప్పుడు అదే విధంగా ఉంటుంది. అక్కడ ఉన్న స్వతంత్రత ఒక్కొక్కప్పుడు సంపూర్ణంగా ఉన్నట్లు

అనిపిస్తుంది, అదే సమయంలో చాలా సన్నిహితమైన లంకెను కలిగిన స్థితి. అది ఆ విధంగా ఉన్నప్పటికీ కూడా, చెప్పాలంటే, నిరపేక్షం. కేంద్రచైతన్యం, అనగా, ఈ భౌతికప్రపంచంలో మహాశక్తి అని మీకు తెలుసు కదా. అందువల్ల విభిన్న కార్యకలాపాలను నియంత్రించగల ఆధిపత్యశక్తి ఆమెకు ఎల్లప్పుడూ ఉంది — అవటానికి వారు పూర్తిగా స్వతంత్రులైనా, తమ ఆకాంక్షల ప్రకారం పని చేయగలిగినా. అయినప్పటికీ ఆమె వారిని నియంత్రించగలదు....

ఉదాహరణకు, కాళినే తీసుకో. కాళి జోక్యం చేసుకోవాలని నిర్ణయించుకుంటే, అప్పుడు, మహాశక్తి విషయాల మీద సహజంగానే ఇంకా ఎక్కువ సంపూర్ణమైన సర్వసాధారణ దృష్టి కలిగినదవటం మూలంగా, జోక్యం చేసుకోవటానికి అది తగిన సమయం కాదని లేదా వేళకు చాలా ముందే అయినటువంటిదని, అంటూ, ఆమె చాలా తేలికగా మహాకాళి మీద ఒత్తిడి తీసుకురాగలిగి ఆమెను, "శాంతంగా ఉండు", అని చెప్తుంది. అప్పుడు ఆమె దానికి తలయొగ్గి శాంతం వహిస్తుంది; అయినప్పటికీ ఆమె పూర్తిగా స్వతంత్రంగా పని చేస్తుంది.

CWM 6:289

మహాశక్తి సంఖ్య

ప్ర: మాతా, నీ ప్రతీకలో 12 రేకలు పన్నెండు అంతరంగ స్థాయిలకు ప్రాధాన్యత వహిస్తాయి, అవునా?

అవి ఒకరు ఏ విధంగా కోరుకుంటే ఆ విధంగా వాటి ప్రాధాన్యత ఉంటుంది, తెలిసిందా. పన్నెండు: అది మహాశక్తి, అదితి సంఖ్య. కాబట్టి అది ప్రతిదానికీ వర్తిస్తుంది.; ఆమె చేసే పనులన్నింటికీ పన్నెండు దృక్పథాలున్నాయి. ఇంకా అక్కడ ఆమె పన్నెండు విశిష్ట లక్షణాలున్నాయి, ఆమె పన్నెండు ఆధిపత్యశక్తులు, ఆమె పన్నెండు దృక్పథాలు, ఇంకా ఆమె అభివ్యక్తమయ్యే పన్నెండు లోకాలున్నాయి. ఇంకా పన్నెండుతో ఎన్నో ఉన్నాయి. ప్రతీక విషయానికే వస్తే, పన్నెండు దానికదే ప్రతీక. అది సృష్టి అభివ్యక్తతకు ప్రతీక, రెండు విధాలైన పరిపూర్ణత, సృష్టిలోని అంతస్సారంలోనూ, అభివ్యక్తతలోనూ.

ప్ర: ప్రియమైన మాతా, ఆ పన్నెండు దృక్పథాలేమిటి?

ఆహా, నా బిడ్డా, ఇది నేను మరియొక చోట ఎక్కడో వివరించాను, కాని ఇప్పుడది

నాకు జ్ఞాపకము లేదు. ఎందువల్లనంటే అది ఎల్లప్పుడూ ఒక ఎంపిక; ఒకరు ఏమి చెప్పదలచుకున్నారో దాని ననుసరించి యుంటుంది. ఒకరు ఈ పన్నెండు దృక్పథాలనూ ఎంచుకోవచ్చు లేక మరి వేటినైనా లేక వాటికి మరి వేరే పేర్లనూ ఇవ్వవచ్చు. ఒకే దృక్పథానికి ఎన్నో రకాలైన పేర్లను పెట్టవచ్చు. ఇది మానసిక సిద్ధాంతాల మీద స్థిరపడి ఉన్నది కాదు.

(నిశ్శబ్దం)

సృష్టిని ఒకరు చూసే దృక్కోణం మీద, ఒక రోజున నేను పన్నెండు దృక్పథాలను వివరించగలను; మరియొక రోజున, నేను నా పరిశీలనా కేంద్రాన్ని మరియొక చోటికి మార్చడం మూలంగా, నేను మరి పన్నెండింటిని వివరించవచ్చు, అవి కూడా అంతే సత్యమైనవి.

CWM 6

సర్వోత్కృష్ట దేవత, మహాశక్తి చర్యలు, సోపానాలు

సమస్తమూ సర్వోత్కృష్ట దేవత, పరమేష్ఠి, ఆదిమహాశక్తి ద్వారా సృష్టి అయ్యింది, సమస్తమూ ఆమె నుంచే బయలుదేరుతుంది, సమస్తమూ ఆమె వలననే నివసిస్తుంది, సమస్తమూ ఆమెలోనే నివసిస్తుంది, ఆమె సైతం అన్నింటిలోనూ వసిస్తుంది. సమస్త వివేక జ్ఞానములు ఆమె వివేక జ్ఞానములే; సమస్త ఆధిపత్యశక్తీ ఆమె ఆధిపత్యశక్తియే, సమస్త ఇచ్ఛ, శక్తులు ఆమె ఇచ్ఛా శక్తులే, సమస్త చేష్టలు ఆమె చేష్టలే, సమస్త కదలికలు ఆమె కదలికలే, సర్వజీవులు ఆమె ఆధిపత్య ఉనికిలోని భాగములే. సర్వోత్కృష్ట దేవతవి ఏడేడు అంతస్తులు, అవి దివ్యాతీతమైన, విశ్వ ఆదిశక్తికి ఆరోహణా, అవరోహణా మెట్లు. ఊర్ధ్వంలో మూడేడు సర్వోత్కృష్ట సచ్చిదానంద సోపానలున్నాయి — త్రిః సత్త పదమా పరాని మాతృః; — మధ్యన దివ్యమహాసత్యం మరియు బృహత్ లోకం, మహద్ బ్రహ్మ, సత్యం ఋతం బృహత్ ఉన్నది; దానికి కింద మూడేడు ఆరోహణా, అవరోహణా మెట్లు, ఈ భూ ఉనికిలో పరిణామ ప్రపంచానికి సంబంధించినవి ఉన్నాయి.

ఈ మూడు వర్గీకరణలు వరుసగా అతిమానసం లేక మహాసత్యమనస్సు దాని ఏడు సూర్యులతో; జీవితం దాని ఏడు కమలలాలతో; భూమి దాని ఏడు మణిమయ-కేంద్రాలతో. తాంత్రిక సంప్రదాయం ప్రకారం ఏడు కమలాలూ ఏడు

చక్రాలు, మనస్సు నుంచి అవరోహణా, ఆరోహణా క్రమంలో (సహస్ర దళం, ఆజ్ఞా, విశుద్ధ, అనాహత), జీవనంలోని శక్తి ద్వారా జీవితమును కొనసాగించేది (మణిపూర, స్వాధిష్ఠాన), జీవితం కింద నుంచి పదార్థం వరకు (మూలాధారం).

ఈ జీవన కేంద్రాలన్ని వాటికవే జీవితంలోని మహాసత్య కేంద్రాలు. ఆ ఏడు గురు సూర్యులు సైతం ప్రతివారూ కూడా ప్రకాశవంతమైన దివ్య-మానసం ఉని కిలో జ్వలిస్తూ ఉండే మహాసత్యహృదయాలు; కాని ఈ కమలాలు మాత్రం ముసు గులో ఉన్నాయి, చిక్కనై, అజ్ఞానం వలన తమవైన తాంత్రిక శక్తుల లోపల మూయబడి ఉన్నాయి. భూ-మాత మణిమయ — కేంద్రాలు ఏడు ప్రకాశవంత మైన మహాసత్య హృదయాలు, అవి మహాపదార్థంలో ఉన్నాయి; కాని అవి అంధకారంలో బందీ అయి ఉన్నాయి, చలనరహితంగా శిలాజములై, ముసుగు వేయబడి, చిక్కనై, భౌతిక అచేతన యొక్క కఠినత్వం, అంధకారం, జడత్వం వలన తమ సొంత తాంత్రిక శక్తులలో మూయబడి ఉన్నాయి.

ప్రకాశవంతమై, జ్వలించేటటువంటి అతిమానస సూర్యుల అవతరణతో ఈ ఆధిపత్యశక్తుల కన్నింటికీ విమోచనం కల్పించి, వసుధలో మహా అచేతనా అంధ కారంలో వేలా మరియు అతని పాణీల (వీరు రాక్షసులు, వార అనుయాయులు) సొరంగంలో దాగి ఉన్న ఎనిమిదవ మహా సత్యభాస్కరుని విడుదల చేయటం జరగవలసి ఉంది, పుడమితల్లిని ఆమె సొంత దివ్యత్వానికీ, ధరిత్రి — ఉనికిని దాని సహజమైన సచ్ఛమైనటువంటి మహదానందపు ప్రకాశం, సత్యం, జీవితం, పరమానందాల దిశగా తిరిగి స్థాపించటానికీ మొట్టమొదటి అడుగు.

యోగంలో చక్రాలు

మన యోగప్రణాళికలో ఈ కేంద్రాలకు ప్రతిదానికి ఒక నిర్దుష్టమైన మానసిక ప్రయోజనం, సర్వసాధారణమైన క్రియాకలాపం ఉంది. అవే వాటి ప్రత్యేక ఆధి పత్యశక్తులకు, కార్యాచరణకు ఆధారమవుతున్నాయి. మూలాధారం భౌతికం కిందికి అధోచేతన వరకు పరిపాలిస్తూ ఉంటుంది; ఉదరం కింది కేంద్రం — స్వాధిష్ఠానం — నిమ్నప్రాణికాన్ని పరిపాలిస్తూ ఉంటుంది; నాభి కేంద్రం — నాభి పద్మం లేదా మణిపూరం — విస్తృతతర ప్రాణికాన్ని పరిపాలిస్తూ ఉంటుంది; హృదయకేంద్రం — హృత్పద్మం లేక అనాహతం — భావోద్వేగాల అస్తిత్వాన్ని

పరిపాలిస్తూ ఉంటుంది; కంఠస్థ కేంద్రం — విశుద్ధం — అభివ్యక్తం చేసే బాహ్యంలో ఉండే మనస్సును పరిపాలిస్తూ ఉంటుంది; కనుబొమల మధ్య ఉండే కేంద్రం — ఆజ్ఞాచక్రం — క్రియాశీల మనస్సును, ఇచ్ఛను, దృష్టిని, మానసిక రూపమును పరిపాలిస్తూ ఉంటుంది; సహస్రదళ పద్మం — సహస్రదళం — ఇది పైన ఉన్నతోన్నత మనస్సును ఆజ్ఞాపిస్తూ ఉంటుంది, ఇంకా ఉన్నతోన్నతమైన ప్రకాశవంతమైన మనస్సునూ కలిగి ఉంటుంది, దాని అత్యున్నతంలో అంతర్బుద్ధికి ఉన్మీలనమై దాని ద్వారా లేక సూటిగా వరదలాగా వచ్చే ఊర్ధ్వమనస్సును కలిగి మిగిలినదాని నంతటితో సంసర్గం లేదా తక్షణ సంబంధాన్ని కలిగి ఉండ గలిగినది.

*

కేవలం యోగసాధనలో మాత్రమే చక్రముల గురించి ఒకరు మాట్లాడగలరు. సాధారణ మానవులలో చక్రములు తెరుచుకుని ఉండవు, కేవలం వారు సాధన చేసినప్పుడు మాత్రమే అవి తెరుచుకోగలవు. ఎందువల్లనంటే చక్రము లనేవి అంతరంగ చైతన్యకేంద్రాలు, సహజసిద్ధంగా అవి సూక్ష్మశరీరానికి సంబంధించినవి.

అందువలన సాధారణ మానవులలో అవి కార్యకారకంగా ఉండటమనేది చాలా తక్కువ — ఎందువల్లనంటే వారిలో బాహ్యచైతన్యం చాలా చురుకుగా ఉంటుంది.

*

చైతన్యకేంద్రాలు (వాటికి 'కేంద్రాలు' అనే పదాన్ని వాడటం జరిగింది) చక్రాలు. వాటి ఉన్మీలనం వలన యోగచైతన్యం లేదా అంతరంగ చైతన్యం అభివృద్ధి చెందుతుంది — లేని పక్షంలో నీవు సాధారణ బాహ్యచైతన్యానికే అంటిపెట్టుకుని ఉండటం జరుగుతుంది.

*

ఒకరు చైత్యకేంద్రం గుండా గాని లేక ఏ ఇతర కేంద్రం గుండాగాని పోవటం జరగదు (సాధనా క్రమంలో). కేంద్రాలు సాధన ఒత్తిడి మూలంగా తెరుచుకుం

టాయి. కేంద్రంలోకి మహాశక్తి అవరోహణ లేదా ఆరోహణ చేస్తుందని నీవు అనవచ్చు.

*

కేంద్రాలకు ఆధారం వెన్నెముక, వెన్నెముక ద్వారానే తాంత్రికసాధనలో కుండలిని పైకి లేస్తుంది.

*

సహస్రదళం లేక సహస్రారం లేక శిఖరాగ్ర కేంద్రం

వేయిరేకల కమలం తలపైన ఉంది. అది ఏడవది, అత్యున్నతమైనటువంటి కేంద్రం.

ఎవరైతే సాధారణంగా కేవలం శరీరంలోని కేంద్రాలనే పరిగణనలోకి తీసుకుంటారో, వారు ఆరుకేంద్రాలనే లెక్కించి, సహస్రారంను వదలివేస్తారు. విశదమయేదేమంటే, ఉన్నతోన్నతమైన అంతర్బుద్ధి, ప్రకాశమానమైన మనస్సు, ఊర్ధ్వమనస్సులు సహస్ర పద్మం గుండానే వాటి కిరణాలను ప్రసరింప జేస్తాయి.

*

సాధారణ మనస్సు, అతిమనస్సుల మధ్యలో ఉన్నవాటి నన్నింటినీ సహస్ర దళం శాసిస్తుంది. — కనుక తప్పనిసరిగా దాని ఉన్మీలనం చాలా కాలం తీసుకుంటుంది.

కాని దానికదే తెరుచుకోవటం ఒక సంబంధాన్ని లేక ఒక సంసర్గాన్ని మాత్రమే కల్పిస్తుంది — ఆ కేంద్రంలో నివసించాలంటే ఒకరు మనస్సును దాటిపోవలసినటువంటి ఆవశ్యకత ఉంది; ప్రధానంగా ఆధ్యాత్మిక ఆత్మలో నివసించ గలిగి ఉండాలి.

*

అతిమానసం శరీరంలో వ్యవస్థీకృతమై లేదు, కనుక దానికి వేరు కేంద్రం లేదు; కాని మనస్సుకు పైనుంచి వచ్చేదంతా తన ప్రసరణకు సహస్రారమును ఉపయోగించుకుని, ఆ విధంగా అక్కడ మరి దేనినో ఉన్మీలనం చేస్తుంది.

*

భ్రుకుటి కేంద్రం గనక తెరచుకున్నదంటే దానర్థం కచ్చితంగా శిరస్సు మీది కేంద్రం కావలసినంతగా తప్పక తెరుచుకుని ఉన్నదనీ, కనీసం దానికిపైన ఉన్న

ఉన్నతోన్నతమైన శక్తిని తన గుండా ప్రసరణ జరగడానికి ఆమోదించినదనీ. చైత్యం విషయం మరియొక విధంగా ఉంటుంది — అది కేంద్రాల వెనుకగా ఉంటుంది, దాని ఉన్మీలనానికి పట్టే కాలం మానవ వైరుధ్యాలను బట్టి మారుతూ ఉంటుంది — వాస్తవంలో, అది ఉన్మీలనమవటం వంటిది కాదు, అది చైత్య అస్తిత్వం ముందుకు రావటం వంటిది. ఈ యోగంలోని సాధారణ నిబంధన పైనుంచి కిందికి రావడం, సంసిద్ధమయ్యే స్థితిలో మాత్రం ఇందులో కొన్ని తేడాలుండవచ్చు. ఉదాహరణకు, హృదయకేంద్రపు పాక్షిక ఉన్మీలన మొదట ఉండవచ్చు. ఉన్నతోన్నతమైన ప్రాణిక కేంద్రం మొదట క్రియాశీలం కావచ్చు, కాని దానర్థం ఎక్కువ సంఘర్షణ మరియు ప్రయాస.

*

చైత్య అస్తిత్వం హృదయ కేంద్రం వెనుకగా ఉంది — కనుల మధ్య ఉన్న కేంద్రం: అంతరంగ (తాంత్రిక) ఆలోచన, ఇచ్ఛ, దృష్టి. ఈ అంతరంగ లేదా అతీంద్రియ దృష్టిని సాధారణ జనులు చైత్యదృష్టి అని అంటారు.

*

మూడవ కన్ను అక్కడ (నుదుటి మధ్యలో) తెరుచుకుంటుంది — అది అతీంద్రియ దృష్టికి, ఆ దృష్టితో సహా వెడలే ఆధిపత్యశక్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది — అది ఆజ్ఞాచక్రంతో సంబంధం కలిగి ఉంటుంది.

జీవితానికి సంబంధించిన ఏడు కేంద్రాలు

1. మెదడు మీద ప్రాపకం కలిగి శిరస్సు పైన ఉన్న వేయిరేకల కమలం. మహాజీవనం — మహామనస్సులో అతిమానసానికి ఆధారం లేక దన్ను; ప్రకాశమానమగు మహామనస్సును ఉత్తేజితం చేసే కేంద్రం.
2. నుదుటి యందు కనుబొమల మధ్య ఉన్న కేంద్రం. ఇచ్ఛ, దృష్టి, అంతర్గత మానసిక రూపకల్పన, చురుకైన క్రియాశీల మహామనస్సు.
3. కంఠంలోని కేంద్రం, వాక్కు, బాహ్యమనస్సు, సమస్త బాహ్య వ్యక్తీకరణ, రూపకల్పన.
4. హృదయ — కమలం. బాహ్యపరంగా, భావోద్వేగాల మనస్సు, ప్రాణిక మానసికం. అంతరంగ హృదయంలో చైత్యకేంద్రం.
5. నాభికేంద్రం. అసలైన విస్తృతతర ప్రాణికం. జీవశక్తి కేంద్రం.

6. నాభికి, మూలాధారానికి మధ్యన ఉండే కేంద్రం. నిమ్నప్రాణికం; పైన ఉన్న కేంద్రాలనూ భౌతికాన్ని కలిపేది.
7. చివరి కేంద్రం లేదా మూలాధారం. ప్రాణికానికి భౌతికమైన ఆధారం; భౌతికంలోకి ప్రారంభస్థానం.

కిందనున్నదంతా భౌతిక అథోచేతన.

Record of Yoga:1342

కేంద్రాలు లేక చక్రాల విధులు

కేంద్రాలు లేక చక్రాల వెనుక ఏడు ఉన్నాయి —

1. శిరస్సు అగ్రభాగంపైన వేయి-రేకల కమలం.
2. నుదుటి మధ్యలో — ఆజ్ఞాచక్రం (ఇచ్ఛ, దృష్టి, క్రియాశీల ఆలోచన)
3. కంఠస్థ కేంద్రం — బాహ్యమనస్సు
4. హృదయ కమలం — భావోద్వేగాల కేంద్రం. దీని వెనుక ఉన్నదే చైత్యం.
5. నాభి — ఉన్నతోన్నత ప్రాణికం (అసలైనది).
6. నాభి కింద — నిమ్నప్రాణికం
7. మూలాధారం — భౌతికం.

ఈ కేంద్రాలన్నీ శరీరం మధ్యలో ఉన్నాయి; అవన్నీ వెన్నెముకకు జోడించ బడి ఉన్నాయని తలచబడింది; కాని వాస్తవానికి ఇవన్నీ సూక్ష్మశరీరం, సూక్ష్మ దేహంలో ఉన్నాయి — చైతన్యం మెలకువగా ఉన్నపుడు ఒకరికి వీటి కార్యకలాపాలన్నీ భౌతిక శరీరంలో ఉన్న అనుభూతి కలిగినప్పటికీ.

*

వేయి-రేకల చక్రం లేదా ఉన్నతోన్నత (శిరస్సు) కేంద్ర కమలం: ఇచ్ఛ, జ్ఞానాలు.

నుదుటిలోని కమలం: మహదేచ్ఛ, దృష్టి, మానసిక క్రియాశీలత,

కంఠంలోని కమలం: వ్యక్తీకరణ — బాహ్యమనస్సు

హృదయ కమలం: భావోద్వేగం, క్రియాశీల ప్రాణికం

(హృదయం వెనుక చైత్య అస్తిత్వ పీఠం)

నాభి కమలం: మహా ఉన్నతోన్నత ప్రాణికం.

ఉదరం కింది కమలం: మహా నిమ్నప్రాణికం

నెన్నెముక చివర కమలం (మూలాధారం): మహా భౌతిక చైతన్యం.

*

అతిమానసపు సప్త సూర్యులు

1. అతిమానస సృష్టిని ప్రభవింపజేసే అతిమానస మహాసత్యం, మహాజ్ఞానం — మహా ఆధిపత్య శక్తి సూర్యుడు. సహస్రదళం లోనికి అవతరణ.
2. మహాజ్ఞాన మహా ఆధిపత్యశక్తిని క్రియాశీల దృష్టిగా ప్రసరింపజేసే సృష్టికీ, స్థాపనకూ, అతిమానసిక సృష్టి వ్యవస్థీకరణకూ ఆజ్ఞాపించే అతిమానస ప్రకాశ, మహదేచ్ఛ — మహా ఆధిపత్యశక్తుల సూర్యుడు. ఆజ్ఞాచక్రం, నుదుటి మధ్యన ఉన్న కేంద్రం లోనికి అవతరణ.
3. మహా జ్ఞాన — మహా ఆధిపత్య శక్తుల రూపధారణను చేసేటటువంటి అతి మానసకి సృష్టి అభివ్యక్తత, అమరికలకై శక్తి నిచ్చే అతిమానస మహా వాగ్ సూర్యుడు. కంఠస్థ కేంద్రం లోనికి అవతరణ.
4. అతిమానస సృష్టికి ప్రాణం పోసి, సామరస్యపరచడానికై మహాజ్ఞాన — మహా ఆధిపత్య శక్తుల మహదాత్మను బహిర్గతం చేసే అతిమానస మహాప్రేమ, మహా సౌందర్యం, పరమానందముల సూర్యుడు. హృత్పద్మం లోనికి అవ తరణ.
5. అతిమానస సృష్టికి ఆధారమవటానికై ఆధిపత్యశక్తిగా, జీవితానికి మూలమై క్రియాశీలమై ఉండే అతిమానస మహాశక్తి సూర్యుడు. నాభీ కేంద్రం లోనికి అవతరణ.
6. గమనాత్మక శక్తులను వ్యాపింపజేస్తూ, వాటిని వాస్తవిక రూపముల లోనికి జాలువార్చే జీవన-తేజః పుంజాల (మహా ఆధిపత్య-మహాకిరణాల) సూర్యుడు. చిట్టచివరన ఉన్న దాని ముందు ఉన్న కేంద్రం లోకి అవతరణ.
7. అతిమానసిక జీవితమునకు రూపధారణను కల్పించి, అతిమానసిక సృష్టి స్థిరముగ నిలుపుటకు అధికారమును కలిగిన అతిమానస మహాపదార్థ — మహా గతిశక్తి మరియు మహారూప — మహా బలశక్తి సూర్యుడు, మూలా ధారంలోనికి అవతరణ.

Record of Yoga:1341

బంగారు కాంతి

నీ బంగరు కాంతులు కిందికి నా శిరస్సు లోనికి దిగి వచ్చినాయి
మసకబారిన మనోకక్ష్యలు మారిపోయినవి సూర్య-స్పర్శతో
మహా వివేకపు అతీంద్రియ అంతస్తుకు తెలివైన ప్రత్యుత్తరముగా
ఒక నిశ్చల ప్రకాశము మరియు నొక జ్వాలగా.

నీ బంగరు కాంతులు కిందికి నా కంఠం లోనికి దిగివచ్చినాయి,
నా వాక్కు సమస్తం ఇప్పుడు ఒక దివ్యసరాగమై
నా ఏకతాళం ఒక నీ స్తుతి గీతమై
అమృతత్వ రసపానము లైనాయి నా పలుకులు.

నీ బంగరు కాంతులు కిందికి నా హృదయం లోనికి దిగి వచ్చినాయి
తట్టుచున్నది నా జీవితమును నీ చిరంతనత్వముతో;
ఇప్పుడది వృద్ధి నొందినది నీవు కొలువై యున్న దేవళముగ
దాని తీవ్ర భావోద్వేగము లన్నియు కేవలము నీకే ఉన్ముఖం.

నీ బంగరు కాంతులు కిందికి నా పాదముల లోనికి దిగివచ్చినాయి;
నా ప్రపంచం ఇప్పుడు నీ క్రీడాస్థలమూ, నీ పీఠమూ.

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

Collected Poems
p. 134: The Golden light.

శక్త్యుపాసన

శక్తికి షరతులు

చిత్తంలో అపరిశుద్ధత, ఆలోచనలో, దృక్పథంలో అహంకారం, కోరిక యొక్క ప్రభావం — ఇవన్నీ శక్తిని స్వతంత్రంగా, సంపూర్ణంగా పని చేయనివ్వవు, ఏ శక్తి యొక్క సిద్ధినీ ఫలప్రదం కానీయవు. అలాంటి పరిస్థితులలో, వాటి వల్ల అప్పుడప్పుడు మాత్రమే శక్తియొక్క ఉపయోగం, మరియు శక్తియొక్క ప్రభావం ఉండవచ్చు, కాని అవి పెద్దగా ఉపయోగపడవు. అవి మనసుకు కేవలం దాని సంస్కారాలను, అలవాట్లను, పద్ధతులను వదలుకుందుకు తర్ఫీదిచ్చి, ఆ విజ్ఞానమయ శక్తిని అంగీకరించేటట్టు చేయవచ్చు; లేదా తాంత్రికమైన కొన్ని నిర్ణీతమైన పద్ధతుల (క్రియల) ద్వారా కొన్ని అల్పశక్తులను క్రమపద్ధతిలో, సమర్థవంతంగా పనిచేయనీయ వచ్చు. అయితే అవి పూర్ణయోగసాధకులకు వర్జనీయము.

జ్ఞానానికి షరతులు

సంపూర్ణమైన అంతఃకరణ శుద్ధిచేతనే, ముఖ్యంగా కోరికను త్యజించి, బుద్ధిని విశుద్ధపరచి, మనసులో పరిపూర్ణ నిశ్చలతను నిలిపి, చివరిగా విజ్ఞానశక్తుల యొక్క పరిపూర్ణమైన కార్యాచరణ ఉన్నప్పుడు మాత్రమే పరిపూర్ణ జ్ఞానము, త్రికాలదృష్టి ప్రాప్తిస్తాయని గుర్తించాలి. యోగినులు మరియు సాధకులు కాని అనేకమంది చేత ఈ ఉన్నత శక్తులు అసంపూర్ణంగా, క్రమరాహిత్యంగా ఆచరించబడటం ఎల్లప్పుడూ సంభవమే. చాలా మంది పరోక్షంగా ఈ శక్తులను కలిగి వుంటారు. ·

Record of Yoga:21-22

తాంత్రిక సాధనలో సరైన యోగమార్గానుసరణ

ఈ సాధనకు సరైన పద్ధతి, చాలామంది చేసేదానికి భిన్నమైనది, మీరు చేసినదానికి కూడా భిన్నమైనది. అందరు సాధకులు సామాన్యంగా శరీరం నించి, ప్రాణం నించి మొదలుపెట్టి, క్రమంగా చిత్తం మరియు మనసుతో చేస్తూ చివరికి

బుద్ధి మరియ సంకల్పంతో పూర్తి చేస్తారు. నిజానికి అసలైన పద్ధతి సంకల్పంతో మొదలుపెట్టి... శరీరంతో పూర్తి చేయడం. సంకల్పంతో ప్రారంభించేవారికి ఆసనం, ప్రాణాయామం, కుంభకం, చిత్తశుద్ధి లేదా ఆలాంటివి ఏవి ముందుగా అభ్యాసం కోసం చేయవలసిన అవసరం లేదు. యోగానికి సంబంధించి శ్రీరామ కృష్ణులు అది చూపడానికే వచ్చారు.

"శక్తియొక్క ఉపాసన ముందు చెయ్యి", "శక్తిని పొందు అప్పుడామె నీకు సత్ ని ఇస్తుంది". యోగం చేసేవారికి మొదట కావలసిన సాధనాలు సంకల్పం మరియు శక్తి. అందువల్ల వారెప్పుడూ చెప్పేవారు "నీవే బ్రహ్మమని గుర్తుంచుకో". అదే అతడు స్వామి వివేకానందకు ముఖ్య సందేశంగా ఇచ్చారు. నేనే ఈశ్వరుడిని అని నీవు అనుకుంటే — నీవు శుద్ధుడవు, సిద్ధివి మరియు అన్నీ కాగలవు, లేదు అని నీవు అనుకుంటే — దానికి పూర్తి వ్యతిరేకంగా కూడా అవగలవు. ప్రథమావశ్యకత నిన్ను నీవు విశ్వసించడం, రెండవది దైవాన్ని విశ్వసించడం, మూడవది కాళీమాతను విశ్వసించడం; ఎందుకంటే ఇవే విశ్వాన్ని రూపొందించినవి.. ముందుగా సంకల్పాన్ని బోధన చెయ్యి, సంకల్పం ద్వారా జ్ఞానానికి బోధించు, జ్ఞానం ద్వారా చిత్తాన్ని శుద్ధపరచు, ప్రాణాన్ని (ప్రాణికశక్తుల్ని) నియంత్రించు, మరియు మనసును నిశ్చలం చేయి. ఈ పరికరాలన్నింటి ద్వారా శరీరాన్ని అమరత్వ సాధనంగా మార్చు. అది అసలైన యోగం, దాన్నే 'మహా పంథ' అంటారు. అదే అసలైన, వాస్తవమైన, ఒకే ఒక తంత్రమార్గం. వేదాంతం బుద్ధితో ప్రారంభమౌతుంది, తంత్రమార్గం శక్తితో ప్రారంభమౌతుంది.

Record of Yoga:1372

శక్తి నీలోనే ఉంది

ఎలా మొదలుపెట్టాలన్నది ప్రశ్న. శక్తి నీలోనో ఉంది. ఆమె పనిని ఆమెను చేయనీ, నీవు సరైన దృక్పథం కలిగి ఉండటం వలన ఆమెకు సహకరించగలవు. నీవే శక్తివి, అనుమతించేవాడివి, భోక్తవు, భర్తవు. అనుమతించేవానిగా ఆజ్ఞాపించు, శక్తిగా ఆమె పనిని ఫలించేదాకా పర్యవేక్షించు, భోక్తగా ఫలితాన్ని అనందించు, భర్తగా ఆధారాన్ని సరిగ్గా పోషించడంలో సహాయపడు. తామసిక ఉదాసీనత వల్ల గాని, రాజసిక ప్రతికూలత వల్ల గాని దాన్ని పాడుచేయకు. నీ సంకల్పం

ఆచరణలో ఎన్నటికీ విఫలమవ్వదని విశ్వసించు. నీవే జ్ఞాతవు; నీ చేతనకు తనకు తానుగా అందివ్వబడిన జ్ఞానాన్నంతా స్వీకరించు. ఇక్కడ నేను వర్ణించిన దృక్పథాన్ని అలవరచుకుని, నీ వ్యక్తిగత సాధనలోని లేక నీ జీవితంలోని ప్రతి కార్యాచరణకు ఉపక్రమించు. నీకు మరింక చెయ్యాల్సినది ఏమీ లేదు. మిగిలి నది కాళీ మాత చేస్తుంది. కష్టమని అనుకోకు, ఆతృతపడకు, కంగారుపడకు, నీ ముందు శాశ్వత సర్వస్వం పరుచుకుని ఉంది, ఎందుకు త్వరపడతావు? ఒక్కటే విషయం, తామసికంగా ఉండడం గాని, వృథా కాలయాపన కానీ చేయకు.

Record of Yoga

స్థూల, సూక్ష్మ, శరీరాల మధ్య పరస్పర సంపర్కం

ఈ రోజు నేను శక్తి లేదా సంకల్పం గురించి మాట్లాడుతాను, అదే యోగానికి పునాది కాబట్టి. శక్తి సహస్రదళంగా శిరస్సు పైన మకుటం మీద ఆసీనమై ఉంటుంది, ఆ క్రియాశక్తి స్థానం నుండి అది పని చేస్తుంది. దాని క్రింద మెదడు పైభాగంలో ఉన్నత బుద్ధి స్థానం, దాని క్రిందుగా మెదడు యొక్క మధ్యస్థానంలో తార్కిక లేదా నిమ్నబుద్ధి స్థానం, దాని క్రిందుగా మెదడు దిగువ స్థానంలో మనసుతో సంప్రదించ కలగిన అంగం ఉంటుంది. ఆ అవయవాన్ని అర్థం చేసుకొనేదానిగా పిలవవచ్చు. జ్ఞానం, హేతువు, అర్థం చేసుకోవడం అన్నవి మెదడు యొక్క మూడు భాగాలు.

ఛాతీలో హృదయానికి పైన 'మనసు' ఉంటుంది, అది సంవేదనల నిచ్చే అవయవం, దానికి పంచేంద్రియాలు కార్యకర్తలు. మనసుకు క్రింద, హృదయం నించి మధ్యస్తంగా, అనగా హృదయానికి, నాభికి మధ్య, చిత్తం ఉంటుంది. అక్కడ నించి నాభి వరకు, అంతకు కొంచెం దిగువ వరకు చైత్య లేదా సూక్ష్మ ప్రాణం ఉంటుంది. ఇవన్నీ సూక్ష్మదేహం లోనివి. అయితే ఈ బిందువుల దగ్గర స్థూలదేహంతో సంపర్కం కల్గి ఉన్నాయి. స్థూలదేహంలోనే రెండు కార్యసాధనాలు స్థాపితమై ఉన్నాయి, ఒకటి భౌతిక ప్రాణం లేదా నాడీమండలం మరియు అన్న కోశము లేదా భౌతిక శరీరము.

Record of Yoga: 1373

సంకల్పం శరీరం యొక్క సజీవ యజమాని

ఇప్పుడు, సంకల్పం ఈశ్వరుని యొక్క పరికరం లేదా శరీరం యొక్క సజీవ యజమాని. అది ఈ కార్యసాధనాలన్నింటి ద్వారా పని చేస్తుంది; ఆలోచన, జ్ఞానాలకు బుద్ధి ద్వారా, సంవేదనలకు మనసు ద్వారా, ఉద్వేగాలకు చిత్తం ద్వారా, సుఖాలకు, ఆనందానికి ప్రాణం ద్వారా, పరిపూర్ణతతో పనిచేసినపుడు, ప్రతి అవయవం ద్వారా, ఆ అవయవం యొక్క సమర్థత ననుసరించి పని చేసినపుడు — అప్పుడు శక్తి యొక్క కార్యాలు సంపూర్ణంగా, ఏ పొరపాట్లు లేకుండా ఉంటాయి. అయితే బలహీనపరిచే రెండు కారణాలున్నాయి. అవి పొరపాటు, విఫలమవడం. మొదటిది, అవయవాల మధ్య అవగాహనా లోపం. ప్రాణం, సంవేదనలు, ఉద్వేగాలు ఆలోచనలతో కలగచేసుకుంటె — అప్పుడు ఆ మనిషి 'అనిష' అనబడతడు. ప్రాణానికి బానిస అంటే కోరికలకు బానిస అని అర్థం. చిత్తం, సంవేదనలు, ఆలోచనలతో కలగజేసుకుంటె, అప్పుడు ఆ సంవేదనలు, ఆలోచనలు, ఆ ఉద్వేగాలు, వాటి కోరికల ద్వారా అసత్యంగా మారతాయి. ఉదాహరణకి ప్రేమ... బుద్ధి విషయంలో కలుగచేసుకున్నప్పుడు ఆ ప్రేమించి నవాడు, తాను ప్రేమించిన వ్యక్తి గురించిన సత్యాన్ని గుడ్డిగా విస్మరిస్తాడు. అతడు తప్పు, ఒప్పుల మధ్య నున్న తేడా గుర్తించలేడు. కర్తవ్యం, అకర్తవ్యం మధ్య తేడా గుర్తించలేడు.... ఆ వ్యక్తికి సంబంధించి నంతవరకు అతడు ఎక్కువగానో, కొంచెం తక్కువగానో అతడి ఉద్వేగాలకు, ప్రేమకు, కోపానికి, ద్వేషానికి, దయకు, ప్రతీకారం మొదలైనవాటికి బానిసకాక తప్పదు. అందువలన మనసు హేతువు విషయంలో కలగచేసుకున్నప్పుడు, ఆ మనిషి తన సంవేదనలను ఆలోచనలుగా లేదా నిజమైన వాగ్వివాదాలుగా పొరపాటుగా అర్థం చేసుకుంటాడు. తాను చూసినదాని, విన్నదాన్ని విచారణ చేసి తీర్పు చెప్పడానికి బదులుగా, విన్నది, చూసినదాని ఆధారంగా తీర్పు చెప్తాడు. మళ్ళీ హేతువు, ఊహ, జ్ఞాపకం, మరియు తర్కం, జ్ఞానంతో తర్కం జోక్యం చేసుకుంటే ఆ వ్యక్తి ఉన్నత జ్ఞానానికి తిరస్కరించబడి, సంభావ్యతలు జరగవచ్చు, జరగక పోవచ్చు అన్న మధ్యస్థితిలో తిరుగుతూ ఉంటాడు. చివరికి బుద్ధి కూడా సంకల్పంతో జోక్యం చేసుకుంటే అప్పుడు మనిషి తన పరిమిత జ్ఞానశక్తికే పరిమిత

మౌతాడు., అతడు ఆ సర్వశక్తి స్థితికి చేరువకాలేడు. క్లుప్తంగా చెప్తే, ఏ యంత్రా న్నైనా, ఏ పనిముట్టునైనా అది చేయలేని పనికి దానిని ఉపయోగిస్తే, అది దాని సహజమైన పని కానప్పుడు అది ఆ పని చేయలేదు, లేదా దానిని పాడుచేస్తుంది. దాని వల్ల ధర్మ సంకరం ఏర్పడుతుంది. ఇప్పుడు నేను వర్ణించినది జ్ఞానం పొందే ముందు సామాన్యంగా మానవుల కుండే స్థితి. అదంతా ధర్మ-సంకటమే, అంటే కార్యనిర్వహణలో అస్పష్టత, సరిగ్గా లేని వ్యవస్థ, అసమర్థతతో కూడిన అజ్ఞాన పాలన. సంకల్పం, నిజమైన మంత్రి, తన క్రింద పనిచేసే ఆఫీసర్ల చేతులో కీలుబొమ్మగా ఉన్నాడన్న మాట. ఎవరి స్వార్థానికి వారు పనిచేస్తూ, అవినీతితో ఒకరితో ఒకరు సహకరిస్తూ, ఒకరి పనిలో మరొకరు జోక్యం చేసుకుంటూ, పాడు చేస్తూ ఈశ్వరుని కార్యాన్ని నష్టపెడతారు. అప్పుడా వ్యక్తి ఇంక యజమానిగా, ఈశ్వరుడిగా ఉండడు, అతడు 'అనిష' గా మారుతాడు — అంటే అతడి సేవకుల చేతుల్లో ఆటబొమ్మగా వంచితుడుగా తయారౌతాడు. అతడు దీన్నెలా అంగీకరి స్తాడు? అజ్ఞానం చేత. అతడికి తన మంత్రులు, క్రింది ఉద్యోగస్థులు, ఇంకా అసంఖ్యాక కార్యకర్తలు, తనతో ఏం చేస్తున్నారో తెలియదు. అజ్ఞానమంటే ఏమిటి? అది అతడి నిజమైన స్వీయ స్వభావాన్ని, అతడి స్థానాన్ని, అతడి అధికా రాన్ని గుర్తించలేకపోవడం. అతడు తన వ్యవస్థలోని ఓ చిన్న భాగమైన ఈ శరీ రాన్నే తన మహారాజతనంగా భావిస్తాడు. అతడు 'అది నా రాజ్యం' అని భావి స్తాడు. తన శరీర కార్యకలాపాలకు తాను ఓ పరికరంగా మారతాడు. అందువల్ల — చికాకు, సంవేదనలు, ఉద్వేగాలు మరియు మానసికమైన వీటన్నింటితోను తాను ఐక్యత చెందుతాడు. అతడు తాను వీటన్నింటికి భిన్నమని, మరింత బలము, గొప్పతనము కలవాడనని మర్చిపోతాడు. అతడు ఇప్పుడు చేయవలసి నది తన శక్తిని తిరిగి పుంజుకోవడం, శక్తి యొక్క పగ్గాలను తిరిగి చేపట్టడం, తాను ఈశ్వరుడనని జ్ఞాపకం ఉంచుకోవడం, తానే రాజు, యజమాని, మరియు తానే దైవమని తెల్సుకోవడం.

దీన్ని అర్థం చేసుకుని అతడు సర్వశక్తిమంతుడనని జ్ఞాపకం ఉంచుకోవాలి. అతడికి అతిశక్తివంతమైన ఆయుధం అతడి సంకల్పం.

Record of Yoga: 1374

సంకల్పం కోసం తపస్సు

సంకల్పాన్ని బలపరుస్తూ, సహాయపడుతూ, దాన్ని నిర్దేశించినపుడు, ఆ సంకల్పమే పాలనా వ్యవస్థలో ఓ క్రమాన్ని తీసుకువచ్చి, అక్కడున్న కార్యవర్గాన్ని తమ తమ పనులను విధేయతతో, సమగ్రతతో చేయమని ప్రోద్బలం చేస్తుంది. అంతా ఒక్కసారి కాదు, దానికి కొంత సమయం పడుతుంది. మొదట అక్కడున్న కార్యవర్గం పనిలో అవ్యవస్థకి, పాలనలో అసమర్థతకి అలవాటుపడి ఉండటం వల్ల వారు ముందు సరిగ్గా పనిచేయడానికి ఇష్టపడరు, రెండవది, ఒకవేళ వాళ్ళు చేయాలని భావించినా వారికది కష్టంగా ఉంటుంది. వారికి ఎలా ప్రారంభించాలో కూడా తెలియదు. ఉదాహరణకి నీవు నీ సంకల్పాన్ని ఉపయోగించడం ప్రారంభించినపుడు, ఏమి జరగడానికి అవకాశం ఉంది? ముందు నీవు నీ ప్రాణశక్తి ద్వారా, కోరిక, ఇష్టం, ఆశల ద్వారా దానిని ఉపయోగించాలని ప్రయత్నం చేస్తావు, లేదా నీవు చిత్తం ద్వారా దానిని ఉపయోగిస్తావు. ఉద్వేగము, ఆత్రుత, దేనికో ఎదురుచూపు... లేదా మనసు ద్వారా అదుపులో ఉంచాలనే చేష్టను, సంఘర్షణను శ్రమతో, ఏ విధంగా అంటే, అదుపులో వుంచాలనే విషయంతో భౌతికంగా కుస్తీ పట్టినట్టు... లేదా బుద్ధిని ఉపయోగించవచ్చు — ఆలోచనల ద్వారా నీ కిష్టమైన విషయానికి ప్రాధాన్యత నిచ్చి, 'ఇలా జరగని', 'అలా జరగనీ' లాంటి ఆలోచనలతో జోక్యం చేసుకోవడం. వారి సంకల్పశక్తిని తిరిగి పొందడానికి యోగులు ఈ పద్ధతు లన్నింటినీ ఉపయోగిస్తారు. హఠయోగులు ప్రాణశక్తిని, శరీరాన్ని ఉపయోగిస్తారు. రాజయోగులు హృదయం, మనసు మరియు బుద్ధిని ఉపయోగిస్తారు. కాని ఉత్తమమైన పద్ధతి వీటిలో ఏదీ కాదు. వీటన్నింటిలోని ఆ చివరిది కూడా రెండవ శ్రేణికి చెందిన పద్ధతి. అందులో సంఘర్షణ, ఓటమి, మరియు తరచుగా నిరాశ కూడి ఉంటాయి. సంకల్పం యొక్క కార్యాచరణ సంపూర్ణంగా ఉండాలంటే — అది వీటన్నింటి నుంచి విడివడి సూటిగా తను చేస్తున్న పనిని సహస్రదళ స్థితి నుండి ఆచరించాలి, ఏ పరిశ్రమ లేకుండా, ఏ ఉద్వేగం లేకుండా, ఆత్రుత లేకుండా, కోరిక లేకుండా. ప్రతీది తన కోసం తాను పని చేస్తుంది, సంకల్పమే తన అసలు కార్యం. అది ఎల్లప్పుడు ఆ ఈశ్వరుడికి విధేయమై ఉంటుంది, కాని అది తనలో తాను పనిచేస్తూ తన ద్వారా తాను

పనిచేస్తుంది. అది మిగిలినవాటిని ఉపయోగించుకుంటుంది, కాని వాటి చేత ఉపయోగించుకోబడదు.

అయితే, సంకల్పం చాలా శక్తివంతమైనది. దానిని సహనంతో, శాంతితో, వీరునివలె అమలుపరిస్తే అది నిలుస్తుంది. ఎందుకంటే, నేను మళ్లీ చెప్తున్నాను, సంకల్పం అంటే స్వయంగా 'కాళి'. అందువల్ల ఆమె చివరిగా తన కార్యాచరణ ద్వారా కొత్త నిబంధనలు లేదా కొత్త అలవాట్లు లేదా మనోవృత్తులు స్థాపన చేసి, వాటి ద్వారా క్రమంగా ఆ పాత అలవాట్లతో పోరాడి వాటిని వెళ్ళగొడుతుంది. ఆ పాతవి అణచబడి, నెమ్మదిగా బలహీనపడి, స్వభావంలో భాగం కాలేకపోయినా, ఆధారం నించి వెళ్లగొట్టబడటాన్ని ప్రతిఘటిస్తాయి. అవి నీ చుట్టూ ఉండి, నీ ఆనందంలో అనుభవాలపై బ్రతికిన అనేక శక్తులు, ఆధ్యాత్మిక జీవుల చేత ప్రోత్సహించబడతాయి. ఈ నిరాకరణ ధర్మం, యోగం యొక్క రెండవ దశకు గుర్తు — ఇది అప్పటికే సంకల్పం సిద్ధించి, ఆధారం శుద్ధమైనపుడు తప్ప, ఇది సాధకునికి చాల యాతనతో కూడిన కష్టమైన పద్ధతి. ఎందుకంటె ఆ నిరోధకశక్తి యొక్క సమర్థత అంతులేనిది, అపారమైనది.

అయితే జ్ఞానం చేత, విశ్వాసం చేత సహకారం పొందినపుడు సంకల్పం తప్పక విజయం సాధించగలదు. అప్పుడు కూడా ఆ వెళ్ళగొట్టబడిన అలవాట్లు, ప్రవృత్తులు, నిరంతరం అవి పోగొట్టుకున్న ఆనందం కోసం, వాటి స్థానం కోసం, శక్తి కోసం, పోగొట్టుకున్న స్థానాన్ని తిరిగి పొందడానికి, తిరిగి ప్రవేశించడానికి సంఘర్షిస్తాయి. దీన్నే పునఃప్రవేశం అంటారు. సంకల్పసిద్ధి, ఆధారశుద్ధిని బట్టి వాటి పునఃప్రవేశం బలహీనంగాను, కొంచెం మితంగాను ఉండడం జరుగుతుంది. ఎక్కువగా కొనసాగదు. ఆధారం శుద్ధంగా లేనపుడు, అసంపూర్ణ సంకల్పంతో కూడి వున్నప్పుడు పునః ప్రవేశం కూడా సుదీర్ఘంగా ఉండి, కష్టపెడుతూ ఉంటుంది. ఎంతగా నిరాకరణ కష్టపెడుతుందో, అదే విధంగా అది కూడా కష్టపెడుతుంది. మరోవిధమైన మూడు అనుకూలమైన ధర్మాలున్నాయి. ఒక కొత్త అలవాటు కాని, ప్రవృత్తి కాని ఒకసారి స్థాపించబడిన తరువాత, అది శక్తివంతమై, పరిపూర్ణంగా వృద్ధిచెందడం దాని ధర్మం. అది స్థిరపడ్డానికి ఆ యోగి సంఘర్షిస్తున్నంత కాలం అతను ఏ క్షణంలోనైనా భ్రష్టుడు కావచ్చు... అంటే అతడు పొరపాటు వలన, బలహీనత వలన లేదా అసహనం వలన ఆ సంఘర్షణ వదలి

వేయవచ్చు,కేవలం ఇది ఒక్కటే యోగి పతనం, ఓటమి, తాత్కాలికంగా విఫల మవ్వటం అతడు ఆ సంఘర్షణను వదలివేయడానికి తిరస్కరించనంత వరకు అది భ్రష్టత్వం కాదు. కాని ఒక్కసారి సరైన ప్రవృత్తి స్థాపించబడినప్పుడు, చివ రికి అతడు దాని ఆధిపత్యాన్ని అనుభవించే భోగి అయ్యేవరకు, దానిని ఏ మనిషి నాశనం చేయలేడు.

Record of Yoga 1378

మానవునిలోని దైవశక్తి

ప్రారంభంలో, సంకల్పం దేనితోనైనా పోల్చి చూసినపుడు బలహీనంగా లేదా సరిగ్గా అభ్యాసం కాకపోయినా, అభివృద్ధి నిదానంగా ఉండాలి. సంకల్పం ఎంత వరకు పరిపూర్ణమైందో, దానికి సమానంగా ఆధారంలో శుద్ధత వస్తుంది, అప్పుడు అభివృద్ధి శీఘ్రంగా ఉంటుంది. ఈ ప్రపంచంలో ఏదైనా ఒక పద్ధతి ప్రకారం జరు గుతుంది. పద్ధతి అంటే ఒక క్రమానుసారంగా జరిగే కార్యాచరణల ద్వారా ఓ ప్రత్యేకమైన ఫలితాన్ని గుర్తింపు పొందిన దశల ద్వారా సాధించడం. ఈ దశలు నెమ్మదిగా సాగవచ్చు లేదా శీఘ్రంగా సాగవచ్చు. కాని నియమానుసారంగా ఒక క్రమంలో సాగే పద్ధతి పాటించబడినంత వరకు, అన్ని దశలను వరుసగా, ఎరుకతో దాటవలసిందే. నీవు దాటవలసిన మైలురాళ్ళెన్నో ఉన్నాయి, కాని వాటిని నువ్వు నడిచి లేదా బండిలో లేదా రైలులో ఎందులోనైనా దాటవచ్చు కాని దాటక తప్పదు. సంకల్పం బలపడ్డం వల్ల నిదానమైన పద్ధతిని శీఘ్రపద్ధతిగా మార్చవచ్చు. అప్పుడు ఓ సమయం వస్తుంది, కాళి సామాన్య మానవుని పరిమి తుల నధిగమించి, మానవుని శక్తిగా కాక మానవునిలోని దైవశక్తిగా ఎదుగుతుంది. అప్పుడు ఈ క్రమమైన అభివృద్ధి పద్ధతుల స్థానే, ఏకాగ్రతతో చేసే పద్ధతులను అనుసరించవచ్చు. అంటే ఒక మైలురాయి నించి మరో మైలురాయిని దాట కుండా, మొదటి మైలురాయినుండి మూడవ మైలురాయికి లంఘిస్తూ నీ పయ నంలోని చివరి మజిలిని చేరవచ్చు. మరో మాటల్లో, పద్ధతి ఒక్కటిగానే ఉంటుంది, కాని కొన్ని దశలు మినహాయించవచ్చు. వాస్తవంలో అవి ఎంత తేలిగ్గా తెలియ కుండా దాటబడతాయంటె, అవి దృష్టిని తప్పించుకుని, అతి తక్కువ సమ

యంలో గడిచిపోతాయి. అందువల్ల అది సాంద్రీకృత లేదా సంక్షిప్త పద్ధతిగా పిలవబడుతుంది.

Record of Yoga 1378

10-9-1926

శిష్యుడు: తాంత్రిక పద్ధతిలో ప్రతీకలున్నట్టు కనపడుతోంది. అందులోని విభిన్న చక్రాలు — కేంద్రాలు — ఒకదాని తరువాత ఒకటి తెరుచుకుంటాయి.

శ్రీఅరవిందులు: ఏది ముందు తెరుచుకోవాలన్నదానికి ఓ నిర్ణీతమైన నిబంధన లేదు. హృదయం చైతన్యస్థానం, అది ముందుగా తెరుచుకుంటే, అది చాలా మంచి ఉన్మీల్యత.

Evening Talks

అనువాదం: డి. సత్యవాణి

పూర్ణయోగము — తాంత్రిక విధానము

పూర్ణయోగములో తాంత్రిక, వేదాంతముల సంయోజనము

మనమనుసరిస్తున్న సంయోజనా విధానంలో మరొక కీలకమైన సూత్రం అమలుపర్చబడింది. ఆ సూత్రం యోగ సంభావ్యతల పరిశీలన వేరొక దృష్టితో కొనసాగితే గ్రహించబడినది. ఈ విధానం తాంత్రిక లక్ష్యాన్ని చేరడానికి వేదాంత విధానం పాటించడంతో ప్రారంభమవుతుంది. తాంత్రిక విధానంలో మహాశక్తి అతి ముఖ్యం, అదే ఆత్మదర్శనానికి ముఖ్య సాధనమవుతుంది. ఈ ఆత్మసంయోజన ప్రక్రియలో అంతరాత్మ అత్యంత ప్రధానమైనదిగా తీసుకోబడి, మహాశక్తిని గ్రహించుటలో గల రహస్యమవుతుంది. తాంత్రిక విధానం క్రింది నుండి ప్రారంభమై అంచెలంచెలుగా ఊర్ధ్వముఖంగా సాగి, ఒక నిచ్చెనను అధిరోహించినట్లుగా, సహస్రారానికి చేరుకుంటుంది. అందువలన ప్రారంభదశలో దాని ఒత్తిడి దేహములోను నాడీవ్యవస్థలోను, దాని వివిధ కేంద్రాలలోను జాగృతమైన మహాశక్తి యొక్కచర్యపై నుంటుంది. దేహంలోని 'ఆరు తామరల' (షట్చక్రాల) వికసనమే ఆత్మశక్తి శ్రేణుల వికసనమ. మన సంయోజనా ప్రక్రియలో మానవుడు శారీరక శక్తి గలవాడి

కన్నా మించిన మానసికశక్తి గలవాడిగా భావించబడతాడు. అతడు ఆ స్థాయి నుండి, ఒక ఉన్నత ఆధ్యాత్మికశక్తికి తనంతట తానుగా ఉన్మీలనమైన మనోజ్ఞాన శక్తితో, తన అస్తిత్వాన్ని ఆధ్యాత్మికం చేయుటకు, ఆ విధంగా సమకూరి క్రియా శీలం గావించబడిన ఉన్నతశక్తితో తన స్వభావాన్ని పరిపూర్ణం గావించుటకు, ఆ స్థాయి నుండి ఈ ప్రక్రియనంతా ప్రారంభించుటకు తగిన శక్తిగలవాడిగా పరిగణిం చబడతాడు. అందువలన మేము ప్రాథమికంగా ఒత్తిడిని జ్ఞానశక్తుల వినియోగం పైనను, కర్మ, ప్రేమ అనబడు త్రివిధ లక్షణాలను ఆత్మలో క్రియాశీలం గావించ డంపైనను పెట్టడం జరిగింది. అందుకు హఠయోగ విధానాలను — వాటి పాక్షిక అనుసరణ అభ్యంతరకరం కాకపోయినా — విసర్జించవచ్చు. రాజయోగ అనుస రణ అప్పుడప్పుడు మాత్రమే అవసరమవుతుంది. ఆధ్యాత్మిక శక్తిని, అస్తిత్వాన్ని, లఘుమార్గంలో విస్తారంగా అభివృద్ధిపరచి తద్వారా మొత్తం మానవ జీవనసరళిని యుక్తమైన వైఖరితో దివ్యీకరించాలనే ఆశయం మమ్ములను ఇందుకు పురిగొల్పిన ప్రేరణ.

మన లక్ష్యం: పరిశుద్ధత, విముక్తి, పరిపూర్ణత, ఆనందానుభూతి

దృష్టిలో నుంచుకోవాల్సిన సూత్రం ఏమిటనగా, దైవానికి ఆత్మార్పణ చేయడం; మానవ అస్తిత్వాన్ని, చేతనను, శక్తిని, ఆనందాన్ని దైవపరం గావిం చడం, మానసికజీవి అయిన మనిషి అంతరాత్మలోని సమస్త కూడలి కేంద్రాలలో దైవంతో ఒక కలయిక, ఒక సన్నిహిత సంబంధం ఏర్పరచి, దానితో దేహమనబడే ఈ పరికరానికి అధిపతిగా, కర్తగా నున్న దైవం ప్రత్యక్షంగా తన ఉనికి, మార్గదర్శ కాల వెలుగులో మానవజీవిని మహాప్రకృతి యొక్క సర్వశక్తులలో దివ్యజీవనం సాగించడానికి తగినవాడిగా తీర్చిదిద్దడం. ఇప్పుడు మనం ఇక ముందు విస్తరిం చాల్సిన యోగలక్షణ విషయానికి చేరాము.

సర్వ యోగముల సమిష్టి ప్రయోజనం మానవుడి అంతరాత్మను సహజమైన ప్రస్తుత అజ్ఞానము, పరిమిత స్థితి నుండి ఆధ్యాత్మిక అస్తిత్వంలోకి విడుదల చేసి దానిని అత్యున్నతమైన దివ్యత్వంతో సంయోగం చెందించడం; అయితే సాధా రణంగా ఇదంతా ఒక ప్రాథమిక ప్రయత్నం మాత్రమే కాదు, సంపూర్ణమైన అంతిమ లక్ష్యం కూడా. ఇందులో ఆధ్యాత్మిక జీవి పొందే ఆనందానుభూతి

ఉన్నది కాని అది మానవత్వం గల ఒక వ్యక్తిని ఆత్మ — అస్తిత్వంలోకి లేక ఒక ఉన్నత స్తరానికి చెందిన వేరొక అస్తిత్వంలో కరిగిపోవటంగా వుంటుంది. తాంత్రిక విధానంలో విముక్తి ఒక అంతిమ స్థితి కాని అదే ఏకైక లక్ష్యం కాదు. అది తన గమనంలో ఆధ్యాత్మిక శక్తి యొక్క సంపూర్ణ సమగ్రతను, ఆనందానుభూతిని, మానవుని ఉనికి లోని వెలుగును, సంతోషాన్ని తీసుకోవడంతో పాటు విముక్తి, సార్వత్రిక చర్య, ఆనందానుభూతి కలసికట్టుగా వ్యతిరేకతలను, అపశృతులను అన్నింటినీ అంతిమంగా అధిగమించుటలో గల అత్యుత్తమ అనుభవాన్ని సైతం లిప్తమాత్రం దర్శిస్తుంది. అంతర్నిహితమైన ఈ ఆధ్యాత్మిక సంభావ్యతల విశాల దృక్పథంతో మనం కార్యక్రమం ప్రారంభిస్తాం, అయితే ఇందులో మరింత సమగ్రమైన ప్రాధాన్యతను కల్పించే మరొక ఒత్తిడిని జోడిస్తాము. మనిషిలోని ఆత్మను దైవంతో సర్వాతీతమైన ఐక్యతను పొందాలని ప్రయత్నించే ఒక ప్రత్యేక జీవిగా కాక అంతరాత్మ లన్నింటిలోను, ప్రకృతి అంతటిలోను ఏకత సాధించే సమర్థతగల విశ్వగతజీవిగా పరిగణిస్తాము. ఈ విశాల దృక్పథానికి దాని సంపూర్ణ ఆచరణ సాధ్యమైన ఫలితాన్నిచ్చేదిగా భావిస్తాము. మానవుని అంతరాత్మ యొక్క వ్యక్తిగత విముక్తి ఆధ్యాత్మిక స్థితిలో, చేతనలో, ఆనందంలో దైవంతో ఐక్యత సాధించటం వలన కలిగే ఆనందానుభూతి ఎల్లప్పుడూ యోగానికి ప్రధాన లక్ష్యం గావాలి. విశ్వగతమైన దైవంతో ఐక్యత స్వేచ్ఛగా అనుభవించడం రెండవ లక్ష్యం కావాలి; కాని ఈ రెండింటి నుండి మూడవదొకటి ప్రత్యక్షమవుతుంది.; దైవం మానవాళి ఆధ్యాత్మిక ప్రయోజనానికై సర్వజీవులతో పాలు పంచుకోవడం లోను, సానుభూతి చూపడంలోను గల అర్థాన్ని సార్థకం చేసుకోవడం. అప్పుడు వ్యక్తిగతంగా చేసే యోగము వేర్పాటు తత్వం విడనాడి మానవజాతిలో దివ్య ప్రకృతి యొక్క సమిష్టి యోగంలో ఒక భాగమవుతుంది. విముక్తి పొందిన వ్య కి ్తగత జీవి స్వయంగాను, అంతరాత్మికంగాను దైవంతో ఐక్యత నొంది మానవాళి యందు దైవం సమగ్రంగా కనువిందు గొలిపే విధంగా వికసించడానికి తనకు తాను తీర్చిదిద్దే పరికరమవుతుంది.

కుండలిని చక్రములు, పూర్ణయోగము

ఈ యోగములోని దివ్యశక్తి యొక్క ఆరోహణ అవరోహణ క్రమము తాంత్రిక

గ్రంథాలలో ఇవ్వబడిన వివరణలను మరోసారి ప్రకటించే అవసరం లేకుండా తనదైన రీతిలో తనను తాను సఫలము చేసుకుంటుంది. చాలామందికి కేంద్ర ముల గురించిన చైతన్యము వుంటుంది కానీ ఇతరులు ఆరోహణను, అవరోహ ణను ఒక సాధారణ మార్గంలో లేదా కేంద్రము నుండి కేంద్రమునకు బదులు స్థాయి నుండి స్థాయికి అనగా శక్తి మొదట శిరస్సులోకి అవరోహించి తరువాత హృదయంలోకి, తరువాత నాభిలోకి, అక్కడ నుండి నిమ్నం లోనికి దిగటాన్ని అనుభూతి చెందుతారు. తాంత్రిక వివరణ ప్రకారము కేంద్రములలో దేవతా మూర్తులను గురించిన ఎరుకను కలిగి వుండవలసిన అవసరము లేదు, కానీ కొంతమంది విభిన్న కేంద్రములలో శ్రీమాత అనుభూతిని చెందుతారు. ఈ విషయములలో మన సాధన పుస్తక జ్ఞానమునకు అంటిపెట్టుకుని వుండదు. కేవ లము కేంద్ర సత్యమును వెనుక నుంచి పురాతన రూపాలకు, సంకేతాలకు లోను కాకుండా దానిని స్వతంత్రంగా సాక్షాత్కరింప జేసుకుంటుంది. ఇచ్చట కేంద్ర ములు స్వయంగా తాంత్రిక గ్రంథములలో ఇవ్వబడిన విశ్లేషణకు బదులు ఒక విభిన్న విశ్లేషణను తమంతట తామే కలిగి వుంటాయి.

జాగృతమైన కుండలినీ ప్రక్రియ కేంద్రముల ద్వారా పైకి వెళ్ళినట్లే కేంద్ర ముల ద్వారా పైకి ఎగసిన జాగృతమైన కుండలనీ ప్రక్రియ మాదిరిగా కేంద్రముల పరిశుద్ధి కూడా ఒక తాంత్రిక జ్ఞానమే. మన యోగములో సంకల్పముతో కేంద్ర ముల పరిశుద్ధి మరియు తెరచివేతల ప్రక్రియ అంటూ లేదు. ఒక నిర్దిష్ట ప్రక్రి యతో కుండలినిని పైకి లేపడము కూడా లేదు. ఇంకో పద్ధతి ఉపయోగించబడింది, కానీ అక్కడ ఊర్ధ్వంలోని ఉన్నత చైతన్యమును కలవడానికి విభిన్న స్థాయిల నుండి, మరియు వాటి ద్వారా చైతన్యము యొక్క ఆరోహణము వుంది. ఈ కేంద్రములు శాసించే స్తరాల (మానసిక, ప్రాణిక, భౌతిక) కేంద్రముల తెరచివేత వుంది, ఇంకా ఆధ్యాత్మిక పరిణామము యొక్క ప్రధాన విధానమైన అవరోహణ కూడ వుంది. అందువలన నేను చెప్పినట్టు ఈ యోగములోని పరిణామ ప్రక్రియ వెనుక ఒక తాంత్రిక జ్ఞానము వున్నది.

*

పూర్ణయోగములో సంకల్పముతో చక్రముల తెరచివేత వుండదు. దివ్యశక్తి అవరో హణతో వాటంతట అవే తెరుచుకుంటాయి. తాంత్రిక పద్ధతిలో అవి క్రింది నుండి

ఊర్ధ్వముఖంగా తెరుచుకుంటాయి — మొదట మూలాధారము నుండి. మన యోగములో ఊర్ధ్వము నుండి క్రింది వైపుగా తెరుచుకుంటాయి, కానీ మూలాధారము నుండి శక్తి ఆరోహణము చోటు చేసుకుంటుంది.

*

నాకు తెలిసినంత వరకు కుండలిని ఆరోహణ ఒక గుర్తింపు పొందిన సంఘటన, కాని దాని అవరోహణము కాదు. ఇక్కడ మన యోగమునకు అనుగుణమైనది ఒకటి వుంది. అది ఉన్నత చైతన్యమును కలవడానికి ప్రాణికము నుండి లేక భౌతికము నుండి చైతన్యము ఆరోహిస్తున్నటువంటి అనుభూతి. ఇది చక్రాల ద్వారా కలగవలసిన అవసరం లేదు, కానీ తరచుగా శరీరమంతటా కలుగుతుంది. అలాగే ఉన్నత చైతన్య అవరోహణము చక్రముల ద్వారా అనుభవంలోకి వచ్చే అవసరము లేదు కానీ మొత్తము శిరస్సును, మెదడును, ఛాతీని, ఉదరమును, శరీరమును ఆక్రమించినట్లుగా ఉంటుంది.

*

తాంత్రిక విధానములో ఒక ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా కేంద్రములు తెరుచుకుని కుండలిని జాగృతమయ్యి, దాని ఆరోహణ చర్య వెన్నెముక ద్వారా అనుభవమౌతుంది. ఇక్కడ ఊర్ధ్వము నుండి వచ్చే దివ్యశక్తి యొక్క ఒత్తిడి దీనిని జాగృతము చేసి, కేంద్రములను తెరుస్తుంది. ఊర్ధ్వములోని ఉన్నత చైతన్యమును కలిసే వరకు చైతన్యము యొక్క ఆరోహణ అక్కడ వుంటుంది. అన్ని కేంద్రములు తెరుచుకుని చైతన్యము శరీరము పైకి లేచే వరకూ ఇది తనకు తానుగా పునరావృతమవుతుంది. (కొన్నిసార్లు ఒక అవరోహణ కూడ అనుభవ మవుతుంది. తరువాతి దశలో ఇది ఊర్ధ్వంలో నిలిచి విశ్వచైతన్యంలోకి, విశ్వాత్మలోకి విస్తరించుకుంటుంది. ఇది మామూలుగా జరిగే ప్రక్రియ, కానీ కొన్నిసార్లు ఈ ప్రక్రియ ఎక్కువ వేగవంతమై ఊర్ధ్వములో నిర్దిష్టమైన తెరచివేత అకస్మాత్తుగా చోటు చేసుకుంటుంది.

*

ఇది నాభీ క్షేత్రములో ఊర్ధ్వముఖంగా మెలికలుగా తిరుగుతూ, కంపిస్తుండే చలనంగల శక్తి బ్రహ్మరంధ్రం వైపు కుండలిని పైకి లేపడమని దీని అర్థము — మొత్తమంతా కాదు. దానిలోని కొంత భాగం చుట్ట చుట్టుకుంటూ లేక వలయా

కారంగా ఊర్ధ్వంలోకి మూలాధారము నుండి స్పందనలతో విడుదలవుతుంది. ఇది ఎప్పుడూ ఇలాగే అనుభూతిలోకి రాదు. కొన్నిసార్లు పైకి లేచే ఒక విధమైన శక్తిని లేక ప్రసరణలను లేక కేవలం చైతన్య చలనము యొక్క ఆరోహణ కదలికను అనుభూతి చెందవచ్చు. కానీ అన్ని సందర్భాలలో ఇది ఊర్ధ్వములో నున్న దివ్యచైతన్యమును కలవడానికి చక్రాలలో మూయబడి వున్న యోగచైతన్యము విడుదల చెందడమే. దీనికి అనుగుణంగా ఊర్ధ్వము నుండి కలిగే అవరోహణ యోగానుభవమును ఫలితాలను సమకూరుస్తుంది.

*

కుండలిని మూలధారములో నిద్రాణమైన వున్న యోగశక్తి, ఇతర కేంద్రములలో సాధారణ చైతన్యము చేత కప్పబడి యున్నది. ఎప్పుడైతే ఇది విడుదల చెందు తుందో తన మార్గంలో కేంద్రాల ద్వారా పయనిస్తూ ఊర్ధ్వములో వున్న బ్రహ్మ చైతన్యమును కలవటానికి పైకి లేస్తుంది.

*

శిరస్సుకు పైన కుండలిని శక్తి వుండదు. శిరస్సుపైన విశ్వగతమైన లేక దివ్య చైతన్యము, దివ్యశక్తి వుంటాయి. కుండలిని చక్రములలో నిద్రాణమైవున్న గుప్త శక్తి

*

కుండలిని లోని ఓజస్సు శ్రీమాతకు చెందినది.

CWSA Vol. 29, Letters on Yoga -- II; Tantra 460-62

లైంగిక ప్రేరణను నియంత్రణలో వుంచే ఆవశ్యకత

శిష్యుడు: మన యోగములో స్వభావములోని నిమ్న చలనము సాధనమునకు ఒక ఆటంకముగా నున్నందున నిలిపివేయాలి, కానీ తాంత్రికులు, ప్రత్యేకముగా వీర సాధకులు, ఈ ఆటంకాలను పరిగణలోకి తీసుకుని వీటి సహాయంతో ఆధ్యాత్మిక జీవితమును నిర్మిస్తారు.

శ్రీఅరవిందులు: నైతికవాదులు విశ్వసించునట్లుగా లైంగిక చర్య దానంతట అదే దుష్టమైనది కాదు. ఇది తన ప్రయోజనము తన కున్న ప్రకృతికి చెందిన ఒక చలనము. ఇది మంచీ కాదు, చెడూ కాదు, కానీ యోగదృక్పథంలో లైంగికశక్తి

ప్రపంచములోని అత్యున్నత శక్తి. ఇది సక్రమంగా ఉపయోగించబడితే అస్తిత్వ మును పునఃసృష్టించి, పునర్జీవింపజేస్తుంది. కానీ దీనిని సాధారణ మార్గములో తృప్తిపరిస్తే, రెండు కారణముల వలన ఇది ఒక ఆటంకముగా వుంటుంది. మొదటిది, లైంగికచర్య ప్రాణికశక్తిని అధికంగా నష్టపరుస్తుంది. ఒక నూతన జన్మను సృష్టించడంతో నష్టము పూరించబడినా ఇది మరణము వైపుకు దారితీసే చర్య. అటు తర్వాత కలిగే నిస్త్రాణత దీనిని రుజువు చేస్తుంది. చాలామందికి ఒక ఏవ గింపును కూడ కలిగిస్తుంది...

రెండవ కారణము, సాధారణ లైంగికచర్యతో పాటు పొందే ఉద్రేకము మానవుడి చైత్య సంభావ్యతలను నాశనము చేస్తుంది.

అతను చైతన్యము యొక్క ఉన్నతకేంద్రముల నుండి విడివడి, పతనం చెందుతాడు. వీటి ద్వారా, దివ్యభోగము ద్వారా దివ్యశక్తి వారికి సమకూరుతుం దనే వైఖరిని జనం అవలంభిస్తారు, కానీ అది కేవలం చెప్పటానికి మాత్రమే. నిమ్నచలనములలో సంతృప్తిని పొందే వ్యక్తులు ప్రతికూల శక్తులకు లోబడి అదే సమయంలో యోగుల వలె చలామణి అవుతారు. వేదాంత దృక్పథము కూడా తరచుగా ప్రతికూలశక్తులకు లోబడటానికి ఒక సాకుగా తీసుకోబడుతుంది. "ఇదంతా మాయ, భ్రాంతి, ఇందులో పుణ్యము లేదు, పాపము లేదు. మంచి లేదు, చెడు లేదు" అని చెప్పి వారిని వారు నిమ్నప్రాణిక శక్తులకు లోబడతారు.

శిష్యుడు: అయితే స్వభావంలోని నిమ్నచలనములు స్వయంగా ప్రతికూలము కాదా?

శ్రీఅరవిందులు: కాదు. కానీ అవి ప్రతికూల శక్తులకు తెరుచుకుండాయి. ప్రతి కూల శక్తులు ఈ నిమ్నచలనములను తమ స్వంత ప్రయోజనానికి ఉపయోగించు కుంటాయి.

శిష్యుడు: లైంగికచర్య ద్వారా కలిగే దిగజారుడు ప్రభావముల విషయములో చట్టబద్ధమైన వివాహ నిబంధన ఏమైనా వ్యత్యాసము చూపిస్తుందా?

శ్రీఅరవిందులు: ఎంతమాత్రం చూపదు. నిషేద ఉత్తర్వులన్నీ సమాజ క్షేమానికి, బాలల శ్రేయస్సు కొరకు. కానీ యోగి జీవితములో తన భార్యతో లైంగికచర్య కూడా ఇతర స్త్రీతో సంపర్కము ఎంత హానికరమో అంత హానికరము.

లైంగిక ప్రేరణను పరివర్తన చెందించే ఆవశ్యకత

లైంగిక సిద్ధాంతము యొక్క గుర్తింపు నుండి, లైంగిక ప్రేరణ దారితీసే శారీరక సంతృప్తిని దివ్యజీవనము నుండి మినహాయించలేము. ఇది జీవితములో ఉంటుంది, అధిక పాత్రను నిర్వహిస్తుంది కనుక దానితో తప్పక వ్యవహరించాలి. తేలికగా ఉపేక్షించలేము, ఊరికనే అణచివేయలేము, లేక మన దృష్టికి అంద కుండా దూరంగా వుంచలేము. ప్రధానంగా ఇది ఒక దశలో ఒక విశ్వ సంబంధమైన సిద్ధాంతము, ఒక దివ్య సిద్ధాంతము కూడా. ఇది దివ్యశక్తి మరియు ఈశ్వరుని ఆధ్యాత్మిక రూపమును ధరిస్తుంది. ఇది లేకుండా ప్రపంచ సృష్టి కానీ, పురు షుడు, ప్రకృతి అనబడే విశ్వగత సూత్ర-అభివ్యక్తి గాని వుండదు. సృష్టికి పురుష ప్రకృతులనబడు రెండు సిద్ధాంతాలూ అవసరమే. వాటి సాంగత్యము, పరస్పర పరివర్తనము సృష్టియొక్క మానసిక కార్యనిర్వహణకు భగవంతుని లీలాప్రక్రి యకు ప్రధానమైన అంతరాత్మ మరియు ప్రకృతిగా అభివ్యక్తమగుటకు అవసర మవుతాయి. స్వయంగా దివ్యజీవనములో ఒక అవతారమో లేక కనీసము ఏదో ఒక రూపములోనో ఈ రెండు శక్తుల ఉనికి లేక వాటి ప్రభావమో లేక ప్రతినిధులతో ప్రారంభించుటయో నూతన సృష్టి కల్పనకు ఆవశ్యక మవుతాయి. మానసిక, ప్రాణిక స్తరము లలో జరిగే మానవ కార్యాచరణలో లైంగిక వ్యాపకము పూర్తిగా దివ్యత్వానికి భిన్నమైన సిద్ధాంతము కాదు. దీనికి తనదైన ఉదాత్తమైన దృక్ప థాలు, ఆదర్శాలు వున్నాయి. నూతన విస్తార జీవితములో ఎంత మేరకు ఏ విధంగా వీటిని సమ్మతించ వచ్చునను విషయం చూడవలసి ఉంది. లైంగిక వాంఛ, లైంగిక ప్రేరణలు పాశవిక సంతృప్తికై పడే ప్రయాస అంతా తీసివేయ బడాలి. ఇది కేవలము ఉన్నత జీవితము కొరకు సంసిద్ధులుకాని వారిలోను పరి పూర్ణ ఆధ్యాత్మిక జీవనానికి ఇంకా సిద్ద పడనివారిలోను కొనసాగాలి. దీనిని ఆకాం క్షిస్తూ కూడా పూర్ణంగా ఆచరించలేనివారిలో ఇది సంస్కరించబడాలి. ఇలా చేయబడి ఆధ్యాత్మిక లేక చైత్యప్రేరణకు ఉన్నత మనస్సు, ఉన్నత ప్రాణికముల నియంత్రణకు లోబడి అనాలోచితమైన, తుచ్ఛమైన, భ్రష్ట విధానాలను విసర్జించి, ఆదర్శము యొక్క స్వచ్ఛతను, స్పర్శను అనుభవించాలి.

ప్రేమ నిలిచి ఉంటుంది. అన్ని విధములైన అత్యున్నత స్వభావమును, అన్ని విధములై ఉన్నత స్థాయికి చెందిన ప్రేమ యొక్క స్వచ్ఛ నిర్మలమైన వాస్తవిక తను, అత్యున్నత ప్రకృతిని సార్థకం చేసుకొనే వరకు, విశ్వవ్యాప్త ప్రేమగా బహుళ వ్యాప్తి చెందే వరకు, దివ్యప్రేమలో లీనమైపోయే వరకు అది నిలిచి ఉంటుంది. స్త్రీపురుష ప్రేమ కూడా అటువంటి ఔన్నత్యాన్ని పరిపూర్ణతను అను భవిస్తుంది. ఎందుకనగా అదంతా ఆదర్శమైన దాని స్వర్గానుభూతిని పొంద గలదు. ఆధ్యాత్మికత కూడా ఆ పురోగమన మార్గాన్నే దైవికమైన వాస్తవికతను చేరే వరకు తప్పక అనుసరించాలి.

శరీరము దాని సంబంధిత చర్యలు దివ్యజీవన భాగముగా అంగీకరించబడి ఈ చట్టము క్రింది కొనసాగవలసిందే, కానీ ఇతర పరిణామ పరివర్తనలలో మాది రిగా దివ్యజీవన చట్టముగా ఆమోదించబడనిది ఇక్కడ కూడా ఆమోదించబడక తప్పక ఆరోహణా తత్వము నుండి పడి పోవాల్సిందే.

స్త్రీపురుష ఆధ్యాత్మిక సంబంధము వెనుక నున్న సత్యమును సాధించడము అనితర సాధ్యము. ఉన్నత దివ్యజీవనమును ఆశించే పురుషుడు, దివ్యచైత న్యము, దివ్యసత్యముల అన్వేషకుడు — పురుషుడు ఆదర్శవంతమైన స్త్రీని, తనకు దివ్యశక్తిగా నుండగలిగే స్త్రీని కలసినపుడు అతని ఆధ్యాత్మిక జీవితము అతను అనుభవించబోయే జీవితము సమృద్ధి చెంది పరిపూర్ణమవుతుంది. ఈ సందర్భంలో కూడ ఇద్దరి మధ్యన చైత్య సంయోగము సంభవిస్తుంది. ప్రారంభిం చడానికి యుక్తమైన చైత్యసంయోగము కలిగిన వ్యక్తుల ఆధ్యాత్మిక సంబంధము క్రమేపీ అభివృద్ధి చెంది తనంతట తాను ప్రకటించుకుంటుంది.

ఆధ్యాత్మిక సంయోగములో 'శక్తి' అయిన స్త్రీ నిజంగా ఒక దివ్యశక్తిలా వుండాలి — అనగా యుక్తమైన మార్గములో పురుషుడి నుండి సహాయమును అందుకోగల ఒక శక్తివంతమైన వ్యక్తిత్వముగా వుండాలి. ఇరువురు ఒకరి కొకరు నిజమైన సహాయకారిగా నుండాలి. ఈ సంబంధమును పొందటము అత్యంత కష్టము. సాధకుడు ఇటువంటి కష్టములు ఎదుర్కొనవలసి వుంటుంది. సిద్ధి పొందిన వాడికి, పరిపూర్ణమైన ఆత్మకు అనితర సాధ్యమైనదంటూ వుండదు. ఏది ప్రకటించ

బడాలో అతనికి పూర్తిగా తెలిసి వుంటుంది. అతనికి దివ్యశక్తి వున్నట్లయితే ఆమె ఎక్కడ వుంటుందో అతనికి తెలుస్తుంది. అతడు ఆమెను పొందు తాడు.

శిష్యుడు: అతిమానస యోగమునకు దివ్యశక్తి అవసరమా?

శ్రీఅరవిందులు: యోగమునకు దివ్యశక్తి అవసరము లేదు. దివ్యశక్తి లేకుండానే పూర్తి జ్ఞానము, చైతన్యము, శక్తి, ఆనందములను సాధించవచ్చును. కానీ ఈ మూలకములను జీవితములో ప్రకటించాలనుకున్నపుడు దివ్యశక్తి అవసరమవుతుంది . దివ్యశక్తి లేకపోతే తనలో నున్న జ్ఞానము, శక్తి, ఆనందము వగైరాలను క్రిందికి జీవితంలోకి తీసుకొని రాలేడు. అటువంటి సందర్భంలో కేవలము భవిష్య కాలములో సాధించబడే కార్యమునకు మార్గము మాత్రమే సిద్ధము చేయగలడు.

Evening Talks, 4-5-1925

ఇది ప్రపంచమును లేక జీవితమును బాహ్యంగా తిరస్కరించకూడదనే భావనగల ఐహిక సుఖ భోగభాగ్యాలను త్యజించే యోగం కాదు. అలా అని నిమ్నశక్తులకు స్థానమిచ్చి వాటి అల్ప లక్షణాలతో విశృంఖల కార్యాచరణను అనుమతించడము దీని అర్థము కాదు.

ఇది నిమ్నప్రకృతి నుండి దివ్యత్వమునకు ఎదిగే యోగము. ఆ ఉన్నత ప్రకృతి ఏమిటో తరువాత అర్థం చేసుకుంటావు. నీవు దానికి అర్హత పొందాలి.

వివాహజీవితము, శాస్త్రము వగైరాల గురించి నీ స్వంత ఆలోచనలు ప్రమాదకరమైనవి. నీవు ఈ ఆలోచనలనే అనుసరించావంటే యోగము నుండి పతనమవడానికి అన్ని అవకాశములు ఉన్నాయి. అవన్నీ మానసిక నిర్మాణములు. స్త్రీపురుషు లిద్దరూ ఆకాంక్ష గలవారైన సందర్భములో, ఆధ్యాత్మిక కృషియను సాధనలో ఒకరికొకరు సహాయము చేసుకోవడము మొదటి అంశము. వారి శక్తులను ఒకరి కొకరు ఇచ్చి పుచ్చుకొని ఉన్నత చైతన్యంలోకి ఎదగాలి.

రెండవది, ప్రేమను గురించిన ప్రసక్తి. చాలా మందిచే, ప్రేమ అని పిలువబడేది ఒక బాహ్యమైన విషయం. చాలా మట్టుకు ఇది సంబంధిత తీవ్ర ప్రాణిక వాంఛలకు పరిమితమై వుంటుంది. ఇది పూర్తిగా తిరస్కరించబడాలి.

దీనికన్నా గాఢమైన ఒక అనుబంధము అక్కడ వుంది. ఇది అంతరాత్మకు సంబంధించినది. ఈ అనుబంధము లోలోపల నుండి దానంట అదే వస్తుంది. ఇది ఒక ఆదర్శవంతమైన ఐక్యతతో ఇరువురిలో తనకు తాను ప్రకటితమవుతుంది

— మనసుల ఐక్యత, అంతరాత్మ ఐక్యత, వ్యక్తుల ఐక్యత. ఈ అనుబంధము పరమ శాంతమైనది, ప్రశాంతితో నిండినది, విశాలమైనది, స్వచ్ఛమైన పవిత్రత గలది. దీనిలో ప్రాణికమైన కామోద్వేగము గాని, వాంఛ, శారీరక అపేక్షల జాడ గాని ఎక్కడా వుండదు. ఇక్కడ పురుషుడికి, శక్తికి వున్న సంబంధము స్త్రీపురుషు లిద్దరి మధ్యన సాధ్యమవుతుంది, కానీ ఈ సంబంధము సాంఘికమైనది, సాధా రణమైనది కాదు. ఒక వ్యక్తి ఒక స్త్రీని వివాహము చేసుకున్న కారణంగా అతని భార్యయే అతని శక్తి కావలసిన అగత్యము లేదు.

ఈ సంబంధాలు అర్థం చేసుకోలేనంత వరకు అనుభవంలోకి వచ్చేంత వరకు, మరొక సాధ్యపడే సంబంధం స్నేహితులకు చెందినది. అనగా నువ్వు నీ భార్యతో అదే జీవితలక్ష్యంతో వున్న స్నేహితుడితో జీవించునట్లుగా స్నేహం తప్ప వేరే ఏ ఇతర సంబంధమూ లేరుండా జీవించాలి.

Evening Talks:156-157

అనువాదం: సునీత శేఖర్

మహాశక్తి పనిచేసే తీరు

మహాశక్తిలో ఆమె చేసే కార్యాలలో విశ్వాసం వుండాలి:

మన ద్వారా తనను సఫలం చేసుకొనే, యోగసిద్ధిని సఫలం చేసే, మన జీవిత కార్యాన్ని సఫలం చేసే క్రీడలో తెర మరుగై వున్నప్పుడు గూడా మన శుభం కోసమే సమస్తాన్నీ నిర్వహించే భగవంతుని ప్రేమ, వైదుష్యాలలో విశ్వాసం వుండాలి. ఈ ఆధారం మనుగడ సాగించడానికి, యోగంలోనూ, జీవి తంలోనూ, దివ్యజ్ఞానాన్ని, శక్తిని, ఆనందాన్ని ఫలప్రదం చేయడానికి ఆతనిచే ఈ ఆధారంలో అభివ్యక్తం చేయబడిన మహాశక్తి యందు విశ్వాసం వుండాలి. శ్రద్ధ లేక శక్తి వుండదు. అపరిపూర్ణ శ్రద్ధ అంటే అపరిపూర్ణ శక్తి. శ్రద్ధయొక్క క్రియాశక్తిలో గాని లేదా దాని ప్రకాశంలో గాని, అపరిపూర్ణత వుండవచ్చు. మొదట్లో విశ్వాసపు పూర్తి వత్తిడి వుంటే చాలు. ఎందుచేతనంటే యోగారంభం నుండీ మనకు పూర్తి ప్రకాశం వుండదు. అప్పుడు మనం యెలా తప్పు చేసినా,

తడబడినా, మన విశ్వాసానికుండే బలం మనల్ని నిలబెడ్తుంది. మనం చూడలేన పుడు, భగవంతుడు మనకు వెలుగు అందకుండా చేస్తున్నాడని అనుకొంటాం. విజయం వైపు ఒక మెట్టుగా ఆతడు మనపై ఓటమిని విధించేటట్లుగా, జ్ఞానం వైపు ఒక మెట్టుగా, తప్పిదాన్ని మనపై విధిస్తున్నట్లు మనం చూడలేం.

Record of Yoga

కృత్రిమ మార్గాలు, అనంతుని స్వేచ్ఛ

నీ మానవ స్వభావమంతా ఒక దివ్య స్వభావం లోనికి మారడమనే బ్రహ్మాండ మైన కార్యం నీలో జరుగుతోంది. అంటే అర్థం, శతాబ్దాలు పట్టే పరిణామాన్ని కొద్ది సంవత్సరాలలోనికి దట్టించడ మన్నమాట. కాలాన్ని ద్వేషించతగదు. చాలా త్వరగా ఫలితాల నిచ్చే యితర మార్గాలున్నాయి. లేదా నీకు కొన్ని నిర్దిష్ట ప్రక్రియలను అందించడం వల్ల యెలాగోలాగ నీవు నీపై పనిచేయగలుగుతావు. ఈ రోజు యెక్కువ సార్లు ప్రాణాయామం చేసాను, ఆసనాలకు మరింత యెక్కువ కాలం వెచ్చించాను, మరింత యెక్కువ కాలం జపం చేసాను, ఈ రోజు ఇంకెంతో చేసాను, యెంతో కచ్చితమైన పురోగతి జరిగిందనీ, యెంతో చేస్తున్నాననీ, నీ అహంకారానికి సంతృప్తి కలిగేటట్లు చేస్తావు. కాని ఒకసారి ఈ మార్గాన్నెంచుకొన్నావంటే దాని కంటిపెట్టుకుని వుండాలి. అవన్నీ మనుష్యులు అనుసరించే పద్ధతులేగాని, అనంత మహాశక్తి చేసే విధానం కాదు. ఆ మహాశక్తి నిశ్శబ్దంగా, కొన్ని సమయాల్లో అగోచరంగా తన గమ్యం వైపు పయనిస్తుంది. ఒక చోట ముందుకు పోతుంది, ఒక చోట ఆగినట్లు కన్పిస్తుంది, తరువాత ప్రబ లంగా, విజయవంతంగా, తాను నిర్వహించిన మహాద్భుత విషయాన్ని బహిరంగ పరుస్తుంది. మానవ మేధస్సుచే రూపొందించబడిన కాలువల వంటివి కృత్రిమ బాటలు. వాటి ననుసరిస్తే ఒక తెలిసిన చోటు నుండి మరో చోటికి సునాయా సంగా, సురక్షితంగా, సునిశ్చితంగా నీవు పయనించగలవు. మన ఈ మార్గం విశాలమైన దారిలేని మహాసముద్రం, దీనిపై నీవు విస్తృతంగా ప్రపంచంలో అన్ని భాగాలకు ప్రయాణించగలవు, అనంత స్వేచ్ఛ లోనికి నీకు అనుమతి లభిస్తుంది. నీకు కావలసినదంతా నావ, దిశానిర్దేశం చేసే చక్రం, దిక్సూచి, నడిపే శక్తి, నైపు ణ్యంగల నావ కెప్టెను. నీ నావ బ్రహ్మ విద్య, శ్రద్ధ నీకు దిశానిర్దేశం చేసే చక్రం,

ఆత్మ-సమర్పణ నీ దిక్సూచి, భగవంతుని ఆజ్ఞచే లోకాలను నిర్మించే, లోకాలకు దిశానిర్దేశం చేసే, లయం చేసే ఆమె నిన్ను నడిపే శక్తి. స్వయంగా భగవంతుడే నీ నావ కెప్టెను. కాని అతడు పనిచేసే ప్రత్యేక విధానమంటూ ఒకటి వుంటుంది, ప్రతిదానికీ అతని సమయం అతని కుంటుంది.

అతిమానస యోగ కీలకమంత్రం ఆత్మ-సమర్పణ

అతిమానస యోగం అంటే ఒకే సమయంలో భగవంతుని వైపు అంతరాత్మ ఆరోహణ, దేహధారియైన ప్రకృతిలోనికి భగవత్తత్వపు అవరోహణ. ఒకే విషయం మీద కేంద్రీకరించి, సమస్తాన్నీ ఒక చోటికి చేర్చి, అంతరాత్మ, మనస్సు, ప్రాణ, దేహాల ఊర్ధ్వం వైపు ఆకాంక్షకై ఆరోహణ పట్టుబడ్తుంది. అనంత శాశ్వత దైవం వైపు మొత్తం అస్తిత్వపు పిలుపుకై అవరోహణ పట్టుబడ్తుంది. ఈ పిలుపు, ఈ ఆకాంక్ష వున్నట్లైతే, అవి నిరంతరం పెంపొందుతూ, సమస్త ప్రకృతిని ఆక్రమించి నట్లైతే అప్పుడు, అప్పుడు మాత్రమే దాని అతిమానస రూపాంతరీకరణ సాధ్యం కాగలదు.

ఈ మర్త్య అర్థచేతస్సుగల సృష్టికి పైన, వెనుక, అంతట్నీ ఆవరించి అది వరకే వుండి వున్న ఒక మహనీయ దివ్యచేతనను స్వీకరించి అందులోనికి ప్రవే శించడానికి మొత్తం ప్రకృతిలో ఉన్ముఖత, సమర్పణ వుండి తీరాలి. అనంత దివ్యమాత హస్తాలలో ఒక బిడ్డలా అంతరాత్మ తయారయ్యేంతవరకు, దైవక్రియా శక్తిని భరించడానికి వృద్ధిచెందుతూండే, అధికంగా పట్టుబట్టే చర్యను భరించగలిగే, సదా బలీయమైన ఒక సామర్థ్యం కూడా వుండి తీరాలి. ఇతర యోగాలకు తెలిసిన సమస్త యితర ఉపాయాలను ఈ యోగంలో కూడా అప్పుడప్పుడూ నిమ్నశ్రేణి ప్రక్రియగా ఉపయోగించవచ్చు. ఈ గొప్ప షరతులు లేకపోతే అవి శక్తిహీనమౌ తాయి. ఒకసారి వీటిని అనుమతించినంత మాత్రాన అవి అనివార్యమైనవి కాలేవు. ఈ యోగాన్ని మనస్సు, ప్రాణ, దేహాల యేవిధమైన కృషి వల్ల గాక, యేవిధమైన మానవమనోవిజ్ఞాన లేక భౌతిక ప్రక్రియవల్ల గాక పరమ మహాశక్తి చర్య వల్ల మాత్రమే చివరికంటా కొనసాగించగలమనేవి, చివరకు తెలుస్తుంది. కాని ఆమె పనిచేసే విధానం ఒకే సమయంలో చాలా మార్మికమైనదిగా, అపరోక్షమైనదిగా, బాహ్యంగా సమగ్రంగా గ్రహిస్తూ అనుసరించడానికి చాలా సంక్లిష్టమైనదిగా,

చాలా గొప్పదిగా, చాలా సంపూర్ణమైనదిగా, సూక్ష్మ మైనదిగా వుంటుంది. దానిని ఇదీ అని చూపడానికి మన మానవ మేధస్సుచే త్రుంచివేసి ఒక సూత్రంగా కూర్చి నిర్వచించడం అంతకంటె యింకా యెంతో కష్టంగా, సంక్లిష్టంగా, గొప్ప దిగా చాలా సంపూర్ణంగా సూక్ష్మంగా వుంటుంది.

మనిషి తన స్వయంకృషితో తన కంటె అధికంగా తనను తయారుచేసుకో లేడు, కాని తనలో పనిచేసేందుకు అతను దివ్యసత్యాన్ని, దాని శక్తిని క్రిందికి ఆవాహన చేయగలడు. దైవప్రకృతి అవతరణ ఒక్కటే మానవ కలశాన్ని దివ్యీ కరించగలదు. పరాత్పర రూపమార్పిడి శక్తికి ఆత్మ-సమర్పణ అనేది యోగ కీలకమంత్రం.

Essays Human and Divine, pp. 365-66

దైవశక్తి చర్య

మహాశక్తి, అనంతుని, శాశ్వతుని శక్తి మన లోనికి అవతరిస్తుంది, పనిచేస్తుంది, మన ప్రస్తుత మనోవైజ్ఞానిక రూపకల్పనలను భగ్నం చేస్తుంది, ప్రతి అడ్డుగోడను తుత్తునియలు చేస్తుంది, మనలను ముక్తం చేసి సదా నవ్యతర మహనీయ దృష్టి, భావరచన, గ్రాహకత, శక్తులతో, నవ్యతర, మహనీయ, జీవన ప్రేరణలతో మనకు పరిచయం కలిగిస్తుంది. అంతరాత్మను, దాని ఉపకరణాలను విశాలం చేస్తుంది, అధికాధికంగా నూతనంగా తీర్చిదిద్దుతుంది. ప్రతి అపరిపూర్ణతకు తల యొగ్గి దానిని సర్వనాశనం చేసేందుకు, దానితో మనం తలపడేటట్లు చేస్తుంది. ఒక మహనీయ సంసిద్ధికి మనలను ఉన్ముఖం చేస్తుంది. మనలో నిరంతరం నూతన జన్మలు, నూతన మనోదర్శనాలు జరిగేటందుకు అనేక జన్మల లేక యుగాల కార్యాన్ని అతి తక్కువ సమయంలో నిర్వహిస్తుంది. తన చర్యలో వ్యాకోచిస్తూ వుండేది, దేహానికి పరిమితమై వుండిపోయే స్థితి నుండి చేతనను విడుదల చేస్తుంది. సమాధిస్థితిలో గాని, నిద్రాస్థితిలో గాని, లేక మెలకువగా నుండే స్థితిలో సైతం, బయటకు పోయి యితర లోకాలలో లేక ఈ ప్రపంచ యితర పరగణా లలో ప్రవేశించి అక్కడ పనిచేస్తుంది లేక అచట తన అనుభవాన్ని వెనక్కు వచ్చేట ప్పుడు తనతో తీసుకొస్తుంది. దేహం కేవలం తనలో ఒక భాగంగా అనుభూతి చెందేంతగా చేతన విస్తరించుకొంటుంది. తనను అదివరకు యేది తనలో నిలుపు

కొన్నదో, దానినది తనలో నిలుపుకొన నారంభిస్తుంది. అది వైశ్వచేతనను సాధించు కొంటుంది, జగత్తుతో తాను సమానమయ్యేంతగా తనను విస్తరింప జేసు కొంటుంది. కేవలం బాహ్యమైన పరిశీలన ద్వారా పొందే సంపర్కంగాక అంతరంగికంగా, సరాసరి ప్రపంచంలో క్రీడిస్తున్న క్రియాశక్తులను తెలుసుకొం టుంది., వాటి చలనాన్ని అనుభూతి చెందుతుంది, వాటి వ్యాపారాన్నీ వర్గీకరి స్తుంది, ఒక విజ్ఞాన శాస్త్రివేత్త భౌతిక క్రియాశక్తుల మీద యెలా పనిచేస్తాడో అలా వాటి మీద వెంటనే పనిచేయ గలుగుతుంది. మన మనస్సు, ప్రాణం, దేహాలలో అనుభవ ఫలితాలను ఆ చర్య ఆమోదిస్తుంది, లేక తిరస్కరిస్తుంది, లేక సవరి స్తుంది, మారుస్తుంది, నూతన రూపమిస్తుంది, అపరిమేయ నూతన శక్తులను, చలనాలను, స్వభావపు పాత అల్పవృత్తుల స్థానంలో సృజిస్తుంది. వైశ్వమనస్సు క్రియాశక్తులు పనిచేయడాన్ని మనం గ్రహించ నారంభిస్తాం. అవి పనిచేయడం వల్ల మన ఆలోచన లెలా పుట్టుకొస్తాయో తెలుసుకొంటాం, మన అవగాహనల సత్యాసత్యాలను మనం లోపల నుండి విడదీసి చూడగలుగుతాం, వాటి క్షేత్రాన్ని విశాలం చేస్తాం, వాటి విశిష్టతను పెంచుతాం, ప్రకాశవంతం చేస్తాం, మన మన స్సులకు శాసకుల మౌతాం, మన చుట్టూ వున్న ప్రపంచంలోని మహా మనస్సు చలనాలకు ఆకార మివ్వడంలో చురుకుగా తయారవుతాం. వైశ్వ, ప్రాణ-క్రియా శక్తుల ప్రవాహాన్ని ఉధృతిని గ్రహించ నారంభిస్తాం, మన సంవేదనల, భావోద్వే గాల, ఉద్రేకాల తీవ్రవాంఛల ధర్మాన్ని చక్కదిద్ద నారంబిస్తాం. వైశ్వ ప్రాణ-శక్తి ఉన్నతతర భూమికలకు ఉద్ధరితమై, వాటిని అనుమతించ, తిరస్కరించ, నూత నంగా సృజించ, విస్తృత భూమికలకు తెరుచుకొన స్వేచ్ఛ కలిగినవారమౌతాం. వైశ్వ పదార్థపు చిక్కు సమస్యకు కీలకాన్ని గ్రహించ నారంభిస్తాం కూడా. వైశ్వ మనస్సు, వైశ్వప్రాణం, వైశ్వచేతనల మధ్య దానిపై సాగుతుండే క్రీడను అనుస రిస్తాం, ఆ క్రీడకు ఉపకరణంగా, ఫలితంగా జరిగే వ్యాపారాన్ని అధికాధికంగా బయటపెట్టి, చివరకు వైశ్వపదార్థ అంతిమ రహస్యాన్ని కేవలం వైశ్వ ఊర్జపు ఒక రూపంగా గాక, అంతర్లీనమై వున్న బందీయై యున్న, లేక అస్థిరంగా స్థిరపడిన, ఆటంకపరచబడిన చేతన యొక్క ఒక రూపంగా చూడనారంభిస్తాం. అర్ధ- నిశ్చేతన కంటె అధికం యెంత మాత్రం కానటువంటి పరమాత్మ అవతారం, ఆత్మ-ప్రకటనగా ఇకనెంత మాత్రం చూడకుండా అదిముక్తము కాగల, సచేతనం

కాగల సంభవతను ఉన్నతతర వైశ్వశక్తులకు స్పందించే నమ్యతను చూడ నారంభిస్తాం. మహనీయ పరిశుద్ధత, సత్యం, ఔన్నత్యం, శ్రేణికి గమించు రూపాంతరీకరణ తీవ్రత వల్ల కలిగిన ఆవశ్యకత అధిక నిరోధానికి వ్యతిరేకంగా లేక మన మసకబారిన చేతన ప్రతిస్పందించ డానికి పడే యెంతో శ్రమకు వ్యతిరేకంగా, మనలో దైవమహాశక్తి పనిచేయడం, వృద్ధిచెందుతున్న కొద్దీ, ఇదంతా, ఇంతకంటే యెంతో అధికంగా మనలో సాధ్యమౌతుంది. మనలో అంతరాత్మిక జాగృతి మీద, ఆమెకు మన ప్రతిస్పందన సంపూర్ణత మీద, పెరుగుతున్న మన సమర్పణ మీద అంతా ఆధారపడి వుంటుంది.

The Synthesis of Yoga, p. 184

చుట్టలుగా చుట్టుకొన్న యోగ-శక్తిని మేలుకొలుపుట

ప్రశ్న: ప్రియజననీ! "చుట్టలు చుట్టుకొని పడివున్న లేక నిద్రిస్తున్న ఒక యోగశక్తి వుంది." అని యిక్కడ వుంది. దానిని మేలుకొలపడం యెలా?

సమా: యోగం చేయాలని తీర్మానించుకొన్న క్షణంలోనే అది చాలా సహజంగా మేలుకొంటుంది. ఆ తీర్మానంలో చిత్తశుద్ధి వుంటే, ఆకాంక్ష వుంటే, అది దానంతటదే మేలుకొంటుంది. వాస్తవానికి అది మేలుకొనడం వల్లే బహుశా అతనిలో యోగం చేయాలనే ఆకాంక్ష కలుగుతుందేమో.

అది దైవకృప ఫలితం కావడానికి కూడా అవకాశం వుంది, లేదా తెలిసిన వారితో సంభాషించిన తరువాత లేక పఠనం తర్వాత, యోగం అంటే యేమిటో తెలుసుకోవాలని దాన్ని ఆచరించాలనే భావాన్ని, ఆకాంక్షను యేదో ఆకస్మికంగా నీకు కలిగించవచ్చు. కొన్ని సమయాల్లో యెవరితోనైనా ఒక కొద్దిపాటి సంభాషణ సరిపోతుంది. లేక ఒక పుస్తకంలో చదివిన ఒక అంశం, ఈ యోగ-శక్తిని మేలుకొలుపుతుంది, ఇదిగో ఇదే నిన్ను నీ యోగం చేసేటట్లు చేస్తుంది. మన జీవితంలో యేదో మార్పు చేటు చేసుకున్నదని ఒక నూతన నిర్ణయం జరిగిందని, ఒక మలుపు తిరిగామని తప్ప — మొదట్లో దాని యెరుక మన కుండదు.

CWM 7:30 March 1955

ప్రశ్న: ప్రియజననీ! ఈ యోగశక్తి అంటే ఏమిటి?

సమా: అది ప్రగతి ఊర్జం. యోగం చేసేటట్లు నిన్ను తయారుచేసే ఊర్జం,

కచ్చితంగా చెప్పాలంటే అది నిన్ను పురోగమించేటట్లు చేస్తుంది — సచేతనంగా, అదొక సచేతన ఊర్జం.

వాస్తవంగా యోగ-శక్తి అంటే యోగం చేయడానికి శక్తి.

ప్రశ్న: ప్రియజననీ? క్రింద నుండి శక్తులను ఆకర్షించడం (లాగడం-అను) చాలా కష్టం కదమ్మా?

సమా: కొంతమంది, భూమిలో ఊర్జపు నిల్వలు చాలా వున్నాయనుకొంటారు — ఊర్జానికి సంబంధించిన నిల్వ వుందనే నేను చాలా తరచుగా విన్నాను — ఆ ఊర్జాన్ని: వాళ్ళు తమలోకి తెచ్చుకొంటే, వాళ్ళు పనులు చేయగలుగుతారు, కాని అదెప్పుడూ కలగాపులగమయ్యే వుంటుంది.

Questions and Answers CWM 7:101

ప్రశ్న: ఈ యోగశక్తిని మేలుకొలపడం యెలా?

సమా: జీవితంలో అత్యంత ప్రాముఖ్యంగల విషయం ఇదొక్కటే అని అతడు భావించడం మీద ఆధారపడి వుంటుంది. అంతే! కొంతమంది ధ్యానంలో కూచొంటారు. వెన్నముక క్రింది ఆధారం మీద (మూలాధారం మీద) కేంద్రీకరించి అది మేలుకొనాలని గాఢంగా ఆకాంక్షిస్తారు, కాని అది చాలదు. అది నిజంగా జీవితంలో అత్యంత ప్రాముఖ్యంగల విషయమైనప్పుడు, మిగతాదంతా యేమాత్రం రుచి లేనిదీ, ఆసక్తి కలిగించనిదీ, విలువ లేనిదీ అయినపుడు, దీని కోసమే అతడు జన్మించినట్లు, దీని కోసమే అతడు భూమి మీద ఉన్నట్లు, యదార్థంగా పరిగణించవలసినది ఇదొక్కటి మాత్రమే అని అంతరంగంలో సంవేదించినపుడు, అప్పుడది చాలు. అతడు విభిన్న కేంద్రాల మీద కేంద్రీకరించగలడు. కాని కొన్ని సమయాల్లో యెంతో శ్రమతో యెంతో సమయం కేంద్రీకరించినా ఫలితం వుండదు. అయితే ఒక రోజేదో నిన్ను కుదిపివేస్తుంది, నీవు నిలబడ లేకపోతు న్నట్లనిపించి దేనినో ఆధారంగా పట్టుకోవాలని అనిపిస్తుంది. అప్పుడు దైవంతో యేకత్వం అనే భావనను నీలో దివ్యసాన్నిధ్య భావనను, చేతన రూపాంతరీకణ భావనను నీవు నీలో పట్టుకోవాలి. పట్టుకొని దాన్నే ఆకాంక్షించాలి, గట్టిగా కోరాలి, నీ అనుభూతులను, కదలికలను, ప్రేరణలను, దీని చుట్టూ వ్యవస్థీకరించాలి. అప్పుడు అది ప్రాప్తమౌతుంది.

కొంతమంది సమస్తమైన పద్ధతులను సిఫారసు చేసారు. బహుశా యీ పద్ధ

తులు వాళ్ళ విషయంలో విజయవంతమై వుండవచ్చు. కాని నిజం చెప్పాలంటే యెవరి పద్ధతిని వాళ్ళే కనుగొనాలి. అనుకొన్నది జరిగిన తర్వాతే దాన్నెలా చేయాలో అతనికి తెలుస్తుంది గాని అంతకు ముందుగా కాదు.

ముందుగా తెలిసే వుంటే, దాని కతడు మానసిక రూపం యిచ్చి అదొక భ్రాంతి — తానిచ్చిన మానసిక రూపంలో యెక్కువగా నివసించే ప్రమాదంలో పడ్తాడు. ఎందుచేతనంటే కొన్ని పరిస్థితులను మనస్సు కల్పించినపుడు, వాటిని నిజం చేసుకొన్నప్పుడు అది స్వయంగా అనుభవం గాక, ఆ అనుభవపు ఒక ప్రతిబింబం అయ్యే, మరింత పూర్తిగా మానసిక నిర్మాణం అయ్యే అవకాశాలు యెక్కువగా ఉన్నాయి. ఈ యదార్థ ఆధ్యాత్మికానుభవాలన్నింటినీ మానసికంగా తెలుసుకొనేదాని కంటే ముందుగానే వాటిని పొందడం తెలివైన పని అని నేనను కొంటున్నాను. అతనికి ముందుగా తెలిస్తే, వాటిని అనుకరిస్తాడు. అలాగాక అత నికేం తెలియకపోతే, — అవెలా వుంటాయి, అవెలా జరిగి తీరాలి, యేం జరుగు తుంది, యెలా జరుగుతుంది — దీనంతటి గురించీ యేమీ తెలియకపోతే, అప్పుడు నిశ్చలుడై వుంటూ తన అస్తిత్వపు అంతరంగంలో ఒక విధమైన యేరి వేత జరుపుతూ అతడు ఆకస్మికంగా అనుభవాన్ని పొందుతాడు. ఆ తరువాత యేం పొందాడనేది అతనికి తెలుస్తుంది. పనైపోయిన తర్వాత, దాన్ని సాధించిన తరువాత దాన్నెలా చేయాలో — ఆ తర్వాత — అతనికి తెలుస్తుంది. అలా అయితే అది యదార్థ అనుభవం అని అనుకోవచ్చు.

కుండలినిని వూహించి దానిని పై వైపుకు లాగడాన్ని ఊహించడమనే తన ఊహను స్పష్టంగా ఉపయోగించుకొనవచ్చు. సరిగ్గా, పుస్తకాల్లో వర్ణించినట్లు అన్ని మాటలూ తెలుసుకొని, వివరాలన్నీ పూసగుచ్చినట్లు అతడు తనకు తాను కథనాలు చెప్పుకోవచ్చు. అలా చెప్తూ వాళ్ళ అనుభవాన్ని నాకు జనం వర్ణించిన అనేక సందర్భాలున్నాయి. అప్పుడు యాదాలాపంగా వాళ్ళను ఒక చిన్న ప్రశ్న వేసాను, వాళ్ళకు తెలిసి వున్న అనుభవమే కలిగినపుడు, లేక ఒక సంగతిని సంవేదించినపుడు అది పుస్తకాల్లో వున్నటువంటివి గాకపోతే? దానికి వాళ్ళు సమాధానం చెప్పలేకపోయారు.

ప్రశ్న: ప్రియజననీ! సహస్రదళ పద్మం విశిష్టత యేమిటి?

సమా: వాళ్ళు దాన్నలా వర్ణిస్తారు. ఎందుకనంటే అక్కడొక సంక్లిష్టమైన కేంద్రం

ఒకటుంది. అంటే దానర్థం, ఆలోచనకు సంబంధించిన అసంఖ్యాక శక్తుల కేంద్రం అన్న మాట. సమస్త రూపాల జ్ఞాన నానాత్వం అని నేననుకొంటున్నాను. ఇంతకు ముందు చెప్పినదానికి యింకో ఉదాహరణ ఇది. పఠించిన, అధ్యయనం చేసిన తరువాత అనుభవం పొందిన వాళ్ళంతా దాన్నలానే పుస్తకాలలో నుండి వాళ్ళు యేరి పట్టుకొన్న పేర్లతో, పుస్తకాల్లో యిచ్చిన పద్మాల వర్ణనలతో వర్ణించారు. దానిని పొందకముందు దేనినీ చదువకుండా, యేమీ తెలుసుకొనకుండా అప్పటికప్పుడు అప్రయత్నంగా అనుభవం పొందినవాళ్ళు యింకా బాగా స్పష్టంగా యింకా చెప్పాలంటే వ్యక్తిగతమైన సత్యతతో దానిని వర్ణించారు. ప్రతి వ్యక్తీ తన స్వీయవిధానంలో అనుభవం దగ్గరకు చేరారు. ఈ కేంద్రాలు మేలుకొన్నపుడు... అవి వాస్తవం, కేంద్రాలున్నాయి, అవి మేలుకొంటాయి అది కూడా వాస్తవమే, ఇది మొత్తం చేతన, ఊర్జాల కార్యవిధానాన్ని యెంతో బృహత్తరంగా మార్చివేస్తుందనేది కూడా వాస్తవమే. కాని తద్వర్ణన అన్యప్రేరణ ఫలితం కానిదై, చిత్తుశుద్ధి కలిగినదైతే ప్రతి వ్యక్తికీ భిన్నంగా వుంటుంది. దేనినో పోలినదిగా అతనికి సంవేదన కలుగవచ్చు, యేం జరిగిందో దానిని ఒక స్థిరమైన, కచ్చితమైన విధంగా విశదీకరించడంలో జరిగేదేమంటే అందులో యెప్పుడూ మనస్సు జోక్యం వుంటుంది.

CWM 7:208

మేలుకొలుపు, మానసిక రచనల యదార్థ అనుభవం

ఈ వ్యవహారం చాలా నిజం, ఘనిష్ఠం, భౌతిక వ్యవహానికి సైతం వుండే సత్యత, సాంద్రత అంతటితోనూ దీనిని అనుభూతి చెందుతాం. కాని నేను చెప్పినట్లు, అతడు చదివి, అధ్యయనం చేసి వున్నపుడు పుస్తకాల్లో వ్రాసి వున్నదానంతటితో అతడి మస్తిష్కం నిండి వున్నపుడు తప్పిస్తే ప్రతి వ్యక్తీ దానిని తనకే ప్రత్యేకమైన రూపంతో వర్ణిస్తాడు. అప్పుడు తనంతట తాను, అతడు చదివినది, అతని అనుభవాని కొక రూప మిస్తుంది. అప్పుడు చిత్తశుద్ధి కలది, సత్యమైనది అనే అభిప్రాయం కలిగించేదేదో అన్యప్రేరణ లేనిది అనిపించే గుణాన్ని ఆ అనుభవం నుండి తొలగించి వేస్తుంది. అదొక మానసిక రచనగా తయారవుతుంది. పాముచుట్టలాగా వుంటుందని నీవు చదువగా చదువగా, సహజంగా నీవు యేకా

గ్రత వహించి, దానిని మేలుకొలుప ప్రయత్నించినపుడు, నీవు చుట్టలు చుట్టు కొన్న పామునే చూస్తావు, ఎందుకనంటే నీవు దాన్నలా భావించావు గనుక. సహ స్రదళ పద్మం అని నీకు చెప్పారు గనుక, నీవొక సహస్రదళ పద్మాన్ని చూస్తావు. కాని అది అనుభవ వాస్తవికత మీద విధించబడిన ఒక మానసిక ముద్ర. కాని అసం ఖ్యాకమైనది, యేకకాలంలో ఏకం, అసంఖ్యాకం అయినదేదో అనే అనుభూతి, యేదో తెరచుకొంటున్నది, మేలుకొంటున్నది, కంపించ నారంభిస్తున్నది, క్రియా శక్తులకు ప్రతిస్పందిస్తున్నదనే అనుభవం లాంటి తీక్షణమైన అనుభూతి కలుగు తుంది. ఇది, అనుభవ వాస్తవాంశం అయినప్పటికీ పుస్తకాలలో కనుగొన్న ఆకారా లతో వర్ణించ మొదలుపెట్టినపుడు అకస్మాత్తుగా నీవు దానిని తేలికపరుస్తున్నట్లు గాని — ఎదుగూ బొదుగూ లేనిదానిగా చేసివేసినట్లు — లేక కృత్రిమం, లేక నిజాయితీ లేనిదానిగా చేసివేసినట్లు అవుతుంది.

ప్రశ్న: అయినప్పుడు, అమ్మా! చదువకపోవడం మంచిదని అర్థమా?

సమా: అతనిలో ఆకాంక్షా తృష్ణ యదార్థంగా వుండాలి అనే షరతుపై. నీవు దానికై యోగం చేయడానికై పుట్టి వున్నట్లైత, నీ మనుగడ నంతటినీ ఇదే శాసించే టట్లైతే, ఆ విషయం నీ కనుభూతమైతే, దేన్నైనా తెలుసుకొనే ముందు, నీలో వున్నదానిని దేన్నో కనుగొనాల్సిన అవసరం వుంటే, అప్పుడు ఒక్క మాట చాలు, నిన్ను అందుకు తగినవానినిగా చేసే ఒక్క సంభాషణ చాలు. కాని అన్వేషించేవా ళ్ళకు, యెవరైతే వెదకులాడుతున్నారో, యెవరైతే కృతనిశ్చయంతో లేరో, ఈ మార్గం లోనికి లాగబడ్డారో, జీవితంలో అనేకమైనవాటి మీద ఆసక్తి వుంటుందో, వాళ్ళు స్థిరంగా వుండరు, వాళ్ళు సాక్షాత్కార సంకల్పంతో కుదురుకొని వుం డరు. అటువంటివాళ్ళు చదవడం చాలా మంచిది, యెందుకనంటే అది వాళ్ళకు అసలు విషయంతో సంపర్కం కలిగిస్తుంది, విషయంలో ఆసక్తి కలిగిస్తుంది.

CWM 7:211

మహాశక్తి ఆరోహణావరోహణకు గుర్తులు

సంక్లిష్టమైన ఈ నీ అనుభవ వర్ణనలో అంతా వుంది — మొదటి మునకకు సంబంధించిన చిహ్నాలన్నీ వున్నాయి. మొదట కలిగినది కొంచెం లోతుగా క్రిందికి పోతున్న స్పృహ, ఆంతరిక లోతులవైపు నీవు కదులుతున్న అనుభూతి, కొంచెం

లోతుకు పోతున్న స్పృహ, ఆ తర్వాత అవయవాల నిశ్చలత, సంతోషపూర్వక స్పర్శ తెలియని స్థితి, కట్టెలా బిగుసుకుపోవడం వున్నాయి. పైనుండి ఒక క్రియా శక్తి వత్తిడి క్రింద దేహం నుండి లోపలి వైపుకు కదలిపోతున్న చేతనకు సంబంధించిన మహా వత్తిడి — ఆ వత్తిడి ఆంతరిక జీవితాన్ని ఒక విధంగా బలమైన స్వయంసిద్ధ స్థిరాసనంగా, ఒక నిశ్చలమైన ఆధారంగా వుండేటట్లు స్థిరీకరిస్తోంది. తరువాత అలలు యెగసి పడడం, శిరస్సుకు యెగబ్రాకడం, నీవు చెప్పినట్లు దాదాపు నిన్ను అచేతనుడిని చేయడం అనే అనుభూతి వున్నాయి. ఆధారంలోని నిమ్నచేతన, ఊర్ధ్వంలోని మహనీయ చేతనను చేరటానికి ఆరోహించడం ఇది. తాంత్రిక విధానంలో యెంతో గొప్ప చేసి చెప్పిన కుండలినిని మేలుకొలుపడం, చుట్టలు చుట్టుకొని దేహంలో అంతర్నిహితంగా వున్న ఊర్జం, వెన్నుపాము, కేంద్రాలు (చక్రాలు), బ్రహ్మరంధ్రం ద్వారా పైనున్న దైవాన్ని చేరడానికి పైకి ఆరోహించడం అనే కదలికను పోలి వున్నది. కాని మన యోగంలో అదొక ప్రత్యేకంగా నైపుణ్యీకరించబడిన ప్రక్రియ గాదు. ప్రవాహాలుగా లేక తరంగాలుగా (మరేవిధంగానైనా) నిమ్నచేతన అప్రయత్నంగా అప్పటికప్పుడు పైకి యెగయడం. దానికి మరో ప్రక్క దైవచేతన, దాని మహాక్రియాశక్తి దేహం లోనికి దిగిరావడం వుంటాయి. స్థిరత, శాంతి, క్రియాశక్తి, శక్తి, వెలుగు, ఆనందం, వైశాల్యత, స్వేచ్ఛ జ్ఞానాల ఒక దైవ అస్తిత్వం లేక దివ్యసన్నిధి — కొన్ని సందర్భాల్లో వీటిలో యేదైనా ఒకటి, కొన్ని సందర్భాల్లో వాటిల్లో అనేకం లేక అన్నీ కలిసి — గ్రుమ్మరిల్లుతూ రావడం అనుభూతమౌతుంది. ఆరోహణా కదలికకు విభిన్న ఫలితాలుంటాయి. దేహంలో ఇక నెంత మాత్రం లేనట్లనిపించేటట్లుగా, దేహానికి పైన వున్నట్లు, లేదా దేహంతో విశాలంగా విస్తరించుకొన్నట్లు, అస్తిత్వం దాదాపు లేనట్లు, లేక స్వేచ్ఛాయుత విస్తరణలో ఒక బిందువుగా మాత్రమే వున్నట్లు అనుభూతి కలిగే విధంగా చేతనను ముక్తం చేస్తుంది. జీవిని లేక జీవిలో ఒక భాగాన్ని దేహం నుండి బయటకు పోయి యెక్కడైనా సంచరించగలిగేటట్లు చేస్తుంది. ఈ చర్య వెనుక మామూలుగా ఒక విధమైన పాక్షిక సమాధి, లేక సంపూర్ణ ఆంతర పారవశ్య స్థితి అనుసరిస్తూ వుంటుంది. లేదా అంతరంగంలోనికి పోవడానికి ఆంతర మానసిక, ఆంతర ప్రాణిక, ఆంతర (సూక్ష్మ) భౌతిక, అంతరాత్మిక లోతులలో ప్రవేశించడానికి దాని అంతరాంతర ఆంతరిక ఆత్మను లేక

దాని ఆంతర మానసిక, ప్రాణిక, సూక్ష్మ భౌతిక అస్తిత్వాన్ని యెరుగ గలిగేటట్లు చయారయ్యేందుకు, స్వీయ ప్రకృతికి సంబంధించిన ఈ భాగాలకు సాదృశమైన పరగణాలు, భూమికలు, లోకాలలో చరించి, జీవించడానికి కూడా, దేహం వల్ల బాహ్యప్రకృతి అలవాట్లచే ఇక నెంత మాత్రం పరిమితం చేయబడకుండా చేత నను బలోపేతం చేయడంగా ఫలించవచ్చు. నీ విషయంలో యిదే జరిగింది. మనస్సు, ప్రాణికం, భౌతికాలను అతిమానసికం వరకూ గల ఉన్నత భూమికలతో సంపర్కం లోనికొచ్చేటట్లు వాటి వెలుగు, శక్తి, ప్రభావాలతో అవి నిండి నిబిడీకృత మయ్యేటట్లు చేయగల, పునః పునః అవిచ్ఛన్నంగా నిమ్నప్రకృతి చేతన (యెల్ల ప్పుడూ యివే చిహ్నాలు కన్పించకపోవచ్చు) ఆరోహణ అది. దైవచేతన, దాని దివ్యక్రియాశక్తి పునః పునః అవిచ్ఛన్నంగా జరిపే అవరోహణ అది. ఆ అవరోహణే అస్తిత్వమంతా, ప్రకృతి అంతా రూపాంతరీకరణ చెందడానికి ఆధారం. ఒకసారి గనుక ఈ అవరోహణ అలవాటుగా మారితే, దైవక్రియాశక్తి, దివ్యజనని మహాశక్తి, ఇంకెంత మాత్రం పైనుండి గాక లేక తెర వెనుక నుండి గాక, నిరంతరంగా "ఆధారం" లోనే సచేతనంగా, పనిచేయడం, దాని కష్టాలతో, శక్యతలతో వ్యవ హారం సాగిస్తూ యోగాన్ని కొనసాగిస్తుంది.

Letters to Dilipkumar Roy Vol.1:96-97

ఎంత కష్టమైనా దివ్య, అపరిమేయ జననికి ఆత్మ-సమర్పణ అనేది మనకు అందుబాటులో వున్న ఒకే ఒక ప్రభావవంత మైన ఆలంబన, మన యేకైక, సదా నిలిచి వుండే ఆశ్రయం. ఆమెకు ఆత్మ-సమర్పణ అంటే, మన ప్రకృతి ఆమె హస్తా ల్లోని ఉపకరణమై తీరాలి, మన అంతరాత్మ దివ్యజనని హస్తాల్లోని ఒక బిడ్డ గావాలి.

CWSA 12:171

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు



శారీరక యోగం

అఖిల

అఖిల భారత పత్రిక – నవంబరు 2015

శారీరక యోగం

శారీరక పరివర్తన గురించిన జ్ఞానము

ఏకాంతంలో మౌనముద్ర వహించి ధ్యానసిద్ధిని పొందగలిగిన వ్యక్తి సైతం తన శారీరక స్పృహను లక్ష్యపెట్టక దానిని విడనాడినప్పుడు మాత్రమే ఆ సిద్ధిని పొందగలడు. అందువలన, ఏ పదార్థంతోనైతే శరీరం రూపొందించబడిందో అది అంతకు పూర్వం ఎంత అపవిత్రము, ఎంత అసంపూర్ణమైనదో ఆ మాదిరిగానే వుండిపోతుంది. కారణం అతను దానిని అట్టి స్థితిలోనే వదిలివేసాడు గనుక. మితిమీరిన భౌతిక ప్రలోభాలకు లోనై, తన వ్యక్తిగత సంతృప్తి కోసం, దైవంతో తాదాత్మ్యం చెందాలనే అహంకారయుక్తమైన కోరికతో, ఒక వక్రగతికి చెందిన మార్మిక పద్ధతిని పాటించడం ద్వారా ఆ వ్యక్తి తన ఐహిక జీవితానికి ఏది మూల కమో దానిని విస్మరిస్తాడు. తనకు నిర్దేశించబడిన కర్తవ్యాన్ని — భౌతిక పదార్థం అపవిత్రం కాకుండా పరిరక్షించి పరిశుద్ధపరచడం — నిర్వర్తించుటకు, ఒక భీరువుగా, వెనుకంజ వేస్తాడు. మన అస్తిత్వంలో ఒక భాగం సమగ్రమైన పవిత్రత గలదని తెలుసుకోగలిగి, దానితో సంపర్కమేర్పరచుకొని, దానితో తాదాత్మ్యం చెందగలగటం అనే విషయం ఉపయోగపడేది ఎప్పుడంటే, ఆ జ్ఞానం భవిష్యత్తులో

ప్రపంచ పరివర్తనను, పరమోన్నతమైన దైవకార్య నిర్వహణను, వేగవంతం గావించడానికి వినియోగించబడినప్పుడు మాత్రమే.

CWM 1:20 శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శరీరానికి ఒక క్రొత్త సంభావ్యత

ఓ క్రొత్త ముసుగు తొలిగింది

మీ అనంతమైన దివ్యప్రేమతో తాదాత్మ్యం చెందిన పరాకాష్ఠస్థాయి నుండి నా దృష్టని మీకు పరికరంగా ఉపయోగపడవలసిన ఈ సంకీర్ణమైన దేహం వైపుకి మళ్ళించి, "అది స్వయంగా నేనే, దానిలో ప్రకాశిస్తున్న నా కాంతి నీకు కనిపించటం లేదా?" అని అన్నారు. అప్పుడు నిజంగానే కనిపించింది: మీ దివ్య ప్రేమ, ముందుగా బుద్ధి, తదుపరి బలం అనే లక్షణాలను ప్రదర్శిస్తూ, ఈ దేహానికి రూపకల్పన గావించిన చిన్న చిన్న జీవకణాలలో ఎంత దేదీప్యమానంగా వెలుగుతున్నదంటే, అది కోటానకోట్ల నిప్పురవ్వలు కూడి అవన్నీ స్వయంగా మిమ్ములనే అభివ్యక్తం చేస్తున్నట్లుగా నున్నది....

ఓ నా ప్రియమైన దేవా, నా అజ్ఞానాన్ని కప్పివుంచిన మరొక కొత్త మసుగును తొలగించారు. దానితో పాటు, మీ హృదయంలో నాకు గల పరమానంద నిలయాన్ని కోల్పోకుండా, నా దేహంలోని కంటికి కనపడని అనంతమైన కణాల హృదయాలలో నేను నిలువగలిగాను.

CWM 1:148

శారీరక రూపాంతరానికి సంభావ్యత

అనిర్వచనీయమైన ఈ దైవం పట్లగల వినయవిధేయతల వలన సమకూరే గొప్ప విజయాల్లో ఒకటి అత్యంత అదైవికమైన దైహిక పదార్థ రూపాంతరీకరణ. దివ్యచైతన్యం వలన కలిగే అనువైన రీతిలో దేహం మలచబడే లక్షణం దైహిక పదార్థానికి అంతిమంగా చేకూరుతుంది. ఈ విధంగా ఉనికిలోకి వచ్చే దివ్య

చేతనా దేహం నాలుగు ముఖ్యమైన లక్షణాలను కలిగి వుంటుంది: తేలికబడటం, ప్రయోజనానికి అనువైన రీతిలో మలచుకోగలగటం, మృదుత్వం మరియు ప్రకాశ మానంగా నుండటం. భౌతిక శరీరం ఎప్పుడైతే దివ్యత్వం చెందుతుందో దానికి ఎప్పుడూ గాలిలో తేలిపోతున్నట్లు అనుభూతి కలుగుతుంది, మందబుద్ధిగాని భారంగా తోచడంగాని, తమోగుణంగాని, మైమరపుగాని ఉండవు. అంతేగాక అనువైన రీతిలో మలచుకోగల శక్తి అపారమైనదిగా నుంటుంది. ఎలాంటి పరిస్థితు లలో నున్నా తాను నిర్వర్తించవలసిన విధులను నెరవేర్చడానికి తక్షణం సిద్ధపడు తుంది. కారణం, మామూలుగా ఆత్మవిశ్వాసాన్ని కుంటుపరచే మాంద్యం మరియు అశక్తతలను సమృద్ధిచెందిన దాని చైతన్యం పారద్రోలుతుంది; దానిని ఛిద్రం చేయ ప్రయత్నించే ప్రతి ప్రతికూలశక్తి యొక్క దాడిని ప్రతిఘటించగల బలాన్ని సమకూరుస్తుంది; ఆ దాడిని పసలేని ప్రతిఘటనగా కాక నెమ్మదిగా వ్యవ హరించి దానిని దుష్ఫలితాలు కలుగనీయకుండా దాటిపోనిస్తుంది. ప్రాణాంత కమైన దాడులు సైతం దానికి హాని కలిగించలేవు. చివరికి అది దివ్యతేజో విరాజిత మౌతుంది. దానిలోని ప్రతి కణం దివ్యచైతన్య శోభను ప్రసరిస్తుంది. తమ సూక్ష్మ దృష్టిని విస్తారంగా తెరచి వుంచుటకు తగినంత పురోగతిని సాధించినవారే గాకుండా సాధారణ మానవుడు కూడా ఆ శోభస్కర ప్రకాశాన్ని పరికించగలడు. ఇది అందరికి వ్యక్తపడగల యదార్థం, సంతతము సందేహాలతో సతమతమయ్యే వారికి సైతం నమ్మకం కలిగించగలిగే దృఢమైన సాక్ష్యాధారం.

శారీరక రూపాంతరీకరణం ఒక దివ్యమైన ఆధ్యాత్మిక పునర్జన్మ — సామా న్యమైన గతాన్ని సమూలంగా త్రోసిపుచ్చే ప్రక్రియ. ఎందుకనగా ఆధ్యాత్మిక పునర్జన్మ అనటంలో అర్థం గతంలో మనకున్న సాంగత్యాలను, స్థితిగతులను ఎడతెగకుండా త్రోసివేస్తూ, ఆ మరుక్షణం నుండి ఒక క్రొత్త జీవితాన్ని పునః ప్రారంభించడం, మన గత చర్యల పరంపరగా సంక్రమించిన కర్మ అనబడే దాని నుండి విమోచన పొందటం. మరో మాటలో చెప్పాలంటే, మహా ప్రకృతి యొక్క కార్యకారణ బంధనం నుండి విముక్తి నొందటం. గత కర్మల బంధం నుండి విడవడటం చైతన్యమందు జయప్రదంగా ముగిసినట్లయితే అప్పుడు జరి గిన తప్పులు, తెలివితక్కువగా చేసిన పొరపాట్లు, నియమోల్లంఘనలు, అవి వేకపు చర్యలు ఏవైతే మన స్మృతిపథంలో సజీవమై వుండి జలగల్లా పట్టుకొని

మన రక్తాన్ని పీలుస్తున్నాయో అవన్నీ రాలిపోయి స్వేచ్ఛాయుతమైన ఆనంద పారవశ్యతలో వదిలేస్తాయి.


CWM 3:175-76

అవయవాల స్థానే చైత్యశక్తి కేంద్రాల పునఃస్థాపన

రూపాంతరీకరణలోని అంతరార్థం పూర్తిగా భౌతికపరమైన శరీర నిర్మాణ మంతా కొన్ని విభిన్న మైన ప్రకంపనాలు గల కేంద్రీకరించబడిన శక్తితో పునఃప్రతి ష్ఠించడం. ఈ విధమైన శక్తికేంద్రాలు ప్రతి అవయవానికి ప్రత్యామ్నాయంగా ఒక చేతనాశక్తి కేంద్రాన్ని ప్రతిష్ఠిస్తాయి. ఈ చేతనాశక్తి కేంద్రం ఒక చేతనాపూర్వక మైన సంకల్పంతో కదిలించబడి, పైనున్న ఉన్నత స్థరాల నుండి అందించబడిన ఆదేశానుసారం పని చేస్తుంది. జీర్ణాశయం, గుండెకాయ, రక్తప్రసరణ, ఊపిరి తిత్తులు సర్వం అంతరించిపోతాయి కాని, వాటికి ప్రత్యామ్నాయంగా, సంకేతా త్మక ప్రతీకగా నిర్ణీతమైన రీతిలో అమర్చబడిన ప్రకంపనాల వ్యవస్థ ఒకటి స్థాపిం చబడుతుంది. ఎందుకనగా అవయవాలు కేవలం శక్తికేంద్రాలకు భౌతికపరమైన ప్రతీకలు, కాని సారభూతమైన యదార్థాలు కావు; కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అవి ఒక ఆకారాన్ని లేక ఒక ఆధారాన్ని సమకూరుస్తాయి. అప్పటి నుండి రూపాం తరం చెందిన శరీరం, జంతుశరీరంతో రూపొందించబడిన సంకేతాత్మక ప్రతీక లైన అవయవాల ద్వారా కాకుండా యదార్థమైన శక్తి కేంద్రాల నుండి పనిచేయడం ప్రారంభిస్తుంది. అందువలన మొట్టమొదట నీవు నీ హృదయం విశ్వగతమైన శక్తిలో దేనికి ప్రతీకగా నున్నదో, నీ శరీరంలోని రక్తప్రసరణ, ఉదరము, మెదడు వేటికి ప్రతీకలుగా నున్నాయో తెలుసుకోవాలి. ప్రారంభానికి వీటన్నింటిని గురిం చిన ఎరుక నీ కుండాలి. అటుపైన ఈ అవయవాలు ఏ మౌలికమైన ప్రకంపనలకు ప్రతీకలుగా నున్నాయో వాటి పై అవగాహన నీకు కలగాలి. నెమ్మదిగా ఈ శక్తు లన్నింటిని నీ శరీరంలో ప్రోగు చేసుకొని ప్రతి అవయవాన్ని చేతనాశక్తి కేంద్రంగా మార్చాలి. ఈ చేతనాశక్తి కేంద్రం యదార్థమైన అవయవం యొక్క సంకేతాత్మక కదలిక స్థానే చోటు చేసుకుంటుంది.... ఆ పనికి కేవలం మూడొందల సంవత్స రాలు సరిపోతాయని నీవు నమ్ముతావా? మనకు తెలిసిన ఆకృతిగల అవయవాల లక్షణాల కన్నా మెరుగైన లక్షణాలు గల ఆకృతితో నున్న అవయవాల రూపకల్ప

నకు అంతకు మించిన సమయం పడుతుందని నా నమ్మిక. ఎవరైనా అలా మలచటానికి అనువైన మృదుత్వంగల ఆకృతిని చూడటానికి కలలు గనటం సహజం. నీ భావనలకు అనుగుణంగా నీ ముఖకవళికలు ఏ విధంగా మారుతాయో (ఆకృతి మార్పు కాదు కాని ఆకృతిలోనే మార్పు) ఈ శరీరం కూడా ఆ విధంగానే మార్పు చెందుతుంది — నీవు నీ శరీరం ద్వారా ఏమి వ్యక్తపరచ దలచుకున్నావో దానికి అనుగుణంగా. ఆ ఆకృతి సర్వలక్షణ సమన్వితమై, పరిణతి చెందినదై, అత్యంత ప్రకాశవంతమై, అతి ప్రశాంతమై, కావలసిన విధంగా మలచబడ వీలైన, కావలసినట్లుగా సంకోచ వ్యాకోచాలు పొందగల, ఇచ్ఛామాత్రం తేలిక కాగలిదిగా నీ వెప్పుడు భూమిని నీ కాళ్ళతో తాపి గాలిలోకి ఎగిరి తేలిపోతున్న కల కనలేదా? గాలిలో ఇష్టమొచ్చినట్లు తిరుగుతావు, కొద్దిగా నీ భుజాన్ని ఓ పక్కకు నెట్టడంతో ఆ దిశగా పోతావు, మరో పక్కకు నెట్టితే వేరొక దిశగా పోతావు, ఆ విధంగా నీ కిష్టమొచ్చినట్లుగా ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి అతి సులభంగా పోతూ చివరకు తిరిగి శరీరంలోకి ప్రవేశిస్తావు. ఊహా మాత్రంగా అలా చేయగలిగినట్లే నీ శరీరంతోను, నీ ఉచ్వాసనిశ్వాసాలకు సంబందించిన కదలికలతోను అదే విధంగా చేయగలగాలి — అయితే, అచ్చట ఊపిరితిత్తు లుండవు, కాని ఒక సంకేతాత్మకమైన కదలిక వెనుక నీకు తేలికపడగల శక్తినిచ్చే యదార్థమైన కదలిక వుంటుంది; అటు పైన నీవు గురుత్వాకర్షణ ప్రభావానికి లోనుగావు, దాని నుండి తప్పించుకుంటావు. ప్రతి అవయవం విషయంలోను అదే పద్ధతి కొనసాగుతుంది.

ఊహాగానానికి అంతులేదు — అనగా ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రసన్నంగా, దాపరికం లేకుండా ఉండగలుగుట. అప్పుడు సహజంగానే ఈ వ్యవస్థలో ఎముక లుండాల్సిన అగత్యం ఉండదు. అది చర్మంతోను, అంతర అవయవాలతోను కూడిన అస్థిపంజరం కాదు, వేరుగా నుంటుంది, సంకల్పం ప్రకారం మెలిగే కేంద్రీకృతమైన శక్తి. దీని అర్థం ఏ విధమైన నిర్దిష్టమైన గుర్తించగల రూపం ఉండదని కాదు. దాని నిర్మాణం దృఢమైన రేణువులతో గాక లక్షణాలతో కూడి వుంటుంది. చెప్పాలంటే, అది మోటుగా బలిసి ఇటు అటు తిరగలేని శరీరాకృతికి భిన్న మైన, ఆచరణకు అనువైనటువంటి, అనావశ్యక హంగులు లేని, కోమలమైన స్వేచ్ఛా కదలికలున్న, తేలికైన శరీరాకృతి.



ఇక్కడున్న ప్రతి ఒక్కరితో చైతన్యవంతమైన సంబంధం ఏర్పరుచుకొన్న తర్వాత నేను ఆ పరమాత్మతో కలిసిపోయాను. అపుడు నాకు శరీరం లేదు, అది కేవలం ఒక మాధ్యమం. ఆ మాధ్యమం ద్వారా దైవం తన దివ్యకాంతిని, దివ్య చైతన్యాన్ని, దివ్యానందాన్ని వారి వారి అర్హతలకు తగ్గట్టు వారిపై కురిపిస్తాడు.

శ్రీమాత

అనువాదం: ఆకుల కృష్ణ

మార్పు చోటు చేసుకోవటానికి సమయం పడుతుంది

ఆ ప్రకారంగా నేనిప్పుడు వివరించినట్టుగా మారడానికి మూడొందల వత్స రాల కాలం సరిపోదని నా నమ్మకం. అంతకు మించి ఇంకెంతో కాలం అవసర మౌతుందనిపిస్తుంది. తీవ్రమైన ఏకాగ్రతతో శ్రమిస్తే, బహుశా....

అయితే అందుకు ఎన్నో అభ్యంతరా లున్నాయి. పరిసర వాతావరణం కూడా ఎంతో కొంత మార్పుచెందితే తప్ప శరీరం మార్పుచెందటం అసాధ్య మని అనుకోవచ్చు. అంతగా నీవు మార్పు చెందినట్లయితే ఇతర విషయాల పట్ల నీ సంబంధం ఏ విధంగా నుంటుంది? అలాగే ఇతర జీవులతో కూడా? మిగతా విషయాలన్నీ కూడా మార్పు చెందడం, కనీసం అవసరం మేరకైనా ఉని కిని కాపాడుకోవటానికి, కొనసాగించటానికి అవసరమేమోనని అనిపిస్తుంది. అట్టి పరిస్థితి చిక్కు సమస్యలకు దారి తీయవచ్చు. ఎందుకనగా ఈ పనిని నిర్వర్తిం చటానికి ఇక ఎంత మాత్రం ఒక వ్యక్తిగత చేతన చాలదు, ఒక సమిష్టి చేతన అవసరం గనుక, ఆ కారణంగా సమస్య మరింత జటిలమవుతుంది.

CWM 5:55-61

రెండు పద్ధతులు, రెండు సంభావ్యతలు

ఇక్కడ రెండు విషయాలున్నాయి. సంపూర్ణమైన అతిమానస ఆవిర్భావన సంభావ్యత ఒకటి, భౌతిక శరీరం ఒక అతిమానస శరీరంగా లేక ఒక మానవదేహం అతిమానసదేహంగా రూపాంతరం చెందే సంభావ్యత మరొకటి — ఒక క్రమాను సారంగా రూపాంతరం చెందటం. అట్టి రూపాంతరీకరణకు బహుశా ఎన్నో సంవ త్సరాలు పట్టవచ్చు. ఆ విధంగా సృష్టించబడిన జీవి, జంతువు మనిషిగా పరిణా మం చెందినట్లుగా నుండదు, అయితే పూర్తిగా పశుప్రవృత్తి అంటని అతిమానస జీవిగా కూడా రూపొందదు, కారణం దాని పుట్టుక జంతుపరమైనది గనుక. ఆ విధంగా ఒక మార్పిడి జరగవచ్చు — జీవి పుట్టుకస్థాయి నుండి విముక్తి చెంద డానికి తగినంత మార్పు — కాని ఏది ఏమైనా అది ఒక స్పష్టమైన సంపూర్ణ అతిమానస సృష్టి కాజాలదు. శ్రీఅరవిందుల ప్రకారం మధ్యస్థమైన ఒక జాతి రూపొందుతుంది — బహుశా కొందరు వ్యక్తుల సమూహం లేదా ఒక వర్గం

కావచ్చు, మనకు తెలియదు — నిచ్చెన ఎక్కటంలో మధ్యనున్న మెట్లు ఉప యోగపడినట్లుగా మార్పుచెందే ప్రక్రియలో ఒక మధ్యంతర వ్యవస్థగా సృష్టి యొక్క అవసరాలకు తగినట్లుగా పనిచేసే లేక కొనసాగే స్థితి. కాని అన్ని మానవ శరీరాలు ప్రస్తుతమున్న విధంగానే రూపొందిన దేహంతో మొదలిడితే కలిగే ఫలితం పూర్తిగా అతిమానస పద్ధతిలో, ప్రక్రియలో రూపొందినట్లుగా నుండదు. జంతు ప్రవృత్తి అంతా మటుమాయమై బహుశా, అధికంగా అతిమానుషమైనదిగా కనపడవచ్చు. కాని దాని శరీరాకృతి మాత్రం పూర్తిగా అతిమానస విధానంలో రూపొందిన సమగ్రమైన శరీరంగా నుండదు.

CWM 9:131-32

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మనిషిని కలవడానికి దైవం స్వయంగా ముసుగు ధరిస్తాడు

నిస్సందేహంగా. మొదటి నుండి మనము దైహికంగా అతిమానసంలో మనుగడ గడిపినట్లయితే, ఎవ్వరూ మనలను సమీపించగలిగే వారు కాదు, సాధన కూడా జరిగేది కాదు. మనకు, పుడమికి, మనుషులకు మధ్య సంబంధమేర్పడే ఆశ వుండేది కాదు. ఇప్పుడున్న స్థితిలో కూడా శ్రీమాత ఎల్లప్పుడూ తనలో తాను రమిస్తూ ఉండటానికి బదులు సాధకుల నిమ్న చైతన్య దిశగా రావలసి వచ్చింది. లేనట్ల యితే "ఎంత దూరంగా, ఎంత కఠినంగా మీరున్నారు. మీకు నాపై ప్రేమ లేదు, మీ నుంచి నాకు సహాయం అందుటలేదు, వగైరా వగైరా," అని అనటం ప్రారంభిస్తారు.

మనిషిని కలుసుకోవడానికి దైవం స్వయంగా ముసుగు ధరించ వలసి వస్తుంది.

CWSA 32:93-94

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శరీరము — మానవ, దివ్య శరీరములు

శరీరం ఒక చిహ్నం — రూపుదాల్చిన దైవకార్యం

మనిషి అభివృద్ధి చెందుట ఇక ఎంత మాత్రం అవసరం లేనప్పుడు మాత్రమే నా శరీరం వారి ఇచ్ఛకు తగినట్లు స్వేచ్ఛగా అతిమానసీకరించబడ గలదు.

*

దైవశీర్షం ఎల్లప్పుడు ఒక భౌతిక శరీరాన్ని తీసుకుంటుంది అనేది వాస్తవం — ఆ శరీరాన్ని తనకు తగిన పనిముట్టుగా పరివర్తన చేసి తాను భూమిపై అభివ్యక్త మవాలనే ఇచ్ఛతో అనేది కూడా వాస్తవం — అలా చేయటంలో ఇంతవరకు అతడు ఓడిపోయేవాడు. కారణాలేవైనా, ఈ పరివర్తన పూర్తి కాకుండానే ఆ శరీరాన్ని 'అతడు' విడిచిపెట్టవలసి వచ్చేది.

ఏ దేహంలో దైవం భూమిపై అభివ్యక్తమవాలో, ఆ దేహంలో సంపూర్ణ పరివర్తన జరిగే వరకు, దైవం దానిని విడువకుండా ఉండాలంటే — కనీసం ఒకే ఒక్క వ్యక్తిలోనైనా — ఈ క్రింది లక్షణాలు ఉండి తీరాలి. అవి: 1) సామరస్యం 2) దృఢత్వం 3) నిజాయితీ 4) ఓర్పు 5) స్వార్థం లేకపోవుట 6) ఆత్మస్థైర్యం, గాంభీర్యం.

ఏ దేహంలో దైవం అభివ్యక్తమవుతాడో, ఆ దేహం అది చేయబోవు దైవకార్యం కంటె కూడ, ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఇంకా చెప్పాలంటే, ఆ దేహం భూమిపై దైవకార్యం యొక్క రూపం ధరించిన ఒక మూర్తిగా, ఒక చిహ్నంగా ఉండాలి.

CWM 13:54-55

పాత దేహాన్ని దైవకార్యానికి సరిపోయేటట్టు సంస్కరించుట

గత కొద్ది రోజులుగా ఉదయం నిద్ర లేచినపుడు, నేను నాది కాని వేరొక దేహంలో ప్రవేశిస్తున్న విచిత్ర అనుభవం కలిగేది. నా దేహం దృఢంగా, ఆరోగ్యంగా పూర్తి జీవంతో, శక్తివంతంగా, కోమలంగా, పొందికగా నుంది. కొత్త దేహాని కివేమీ లేవు. దీనితో స్పర్శ బాధాకరం. దీనికి అలవాటు పడడం చాల కష్టం, చాల కాలం పడ్తుంది నాకు దీనికి అలవాటు పడటానికి.

చేదు నిజాయితీతో, స్థిరంగా, చాలా మార్లు ఈ శరీరం అడుగుతుంది నన్ను — "ఎవరి నుండైనా, దేనినైనా, అసలెందుకు కోరాలి నేను? నన్ను నేనుగా విడిచిపెడ్తే నేనేమీ కాను, నా కేమీ తెలియదు, నేనేమీ చేయలేను. సత్యం నాలో చొరబడి దిశానిర్దేశం చేస్తే తప్ప నేను ఎట్టి అతి చిన్న నిర్ణయం కూడ తీసుకోలేను, ఏ ప్రాముఖ్యం లేని అతి స్వల్ప పరిస్థితులలో కూడ మంచి ఏదో, ఎలా చేయాలో, ఎలా జీవించాలో కూడా తెలుసుకోలేను. ఎలా తప్పనిసరిగా అవాలో, అలా ఎప్పటికైనా పరిణామం చెందగలనా? ఈ భూమిపై, నా ద్వారా, ఏది అభివ్యక్తమవాలని కోరుకుంటున్నదో, అది ఎప్పటికైనా అభివ్యక్తం అవ గలదా?"

కాని నా హృదయం లోతుల నుండి, వాదానికి తావులేని వాస్తవికతతో మీ నుండి ఎందుకు వస్తుంది ప్రభూ, ఎల్లపుడు దీని సమాధానం — "నీవు చేయ లేకపోతే, ఇంకెవ్వరూ భూమిపై ఈ పని చేయలేరు."

ఈ వాదానికి ముగింపు ఒక్కటే — ఏ మాత్రం వెనుకంజ వేయకుండా నా ప్రయత్నాన్ని నేను కొనసాగించాలి, మరణం లేదా విజయం ఆసన్నమయే వరకు.

CWM 13:55-56

శరీరం యొక్క ప్రార్థన

నే నింకా చెప్పలేను "నేనే" అని. ఎందుకంటే, 'నేనే' అన్నపుడు జనం నా శరీరం గురించి ఆలోచిస్తారు. కాని ఆ శరీరం, ఇంకా నిజంగా నేను కాదు. అది ఇంకా పరివర్తన చెందలేదు. వారి బుద్ధిలో అది గందరగోళం ఏర్పరుస్తుంది. అదీ గాక నా కెప్పుడూ అనిపిస్తుంది: శరీరం యొక్క ఈ దృక్పథం తన అపరిపక్వ తను తాను గుర్తించడం అత్యంత అవసరమని, భౌతిక చైతన్యంలో స్థిరమైన ఒక సజీవ అణకువ ఉండడానికి ఇది అవసరమని. నా శరీరంలో పరివర్తన ఎప్పుడు పూర్తవుతుందో అప్పుడు చెప్పగలను 'నేనే' అని, అంతకు ముందు కాదు.

*

ఓ దివ్య తేజమా, అతిమానస సత్యమా, ఈ ఆహారంలో చొరబడు, ఈ శరీరమంత టిలో ప్రతి కణంలో ప్రవేశించు, ప్రతి అణువులో నీ అంతట నీవు స్థిరపడు.

అంతా పరిపూర్ణ నిజాయితీగ, ఏ ఆటంకాలు లేక పరిపూర్ణంగా, అవతరణను స్వాగతించేదిగా. ఇంకా నీవు కాని శరీరభాగాలన్నీ నీ కొరకు తెరచుకొని ఉండు గాక.

*

శరీరం ఆ దివ్య ప్రభువుతో ఇంకా ఇలా అంటుంది, "ఓ పరమేశ్వరా! నీవు నేనెలా ఉండాలని కోరుతావో, అలా అవుతా. దేనిని నేను తెలుసుకోవాలని నీవు కోరుతావో దానిని నేను తెలుసుకుంటా, దేనిని నేను చేయాలని నీవు కోరుకుంటావో, దానిని నేను చేసి తీరుతా."

CWM 13:57

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

శారీరక పరివర్తనా ప్రారంభాలు

అతిమానస శరీరం వైపు మరో ముందడుగు

ఒక అతిమానస వస్తురూపం నన్ను పూర్తిగా ఆవహించింది. ఆ రూపం నా కంటే ఒకింత పొడవుగా వుంది. దాని పాదాలు నా పాదాలను, దాని శిరస్సు నా శిరస్సును మించి ఉన్నాయి.

దీర్ఘచతురస్రాకార పీఠంపై ఒక దృఢమైన దిమ్మ — ఒక చతురస్రాకార పీఠంపై దీర్ఘచతురస్రాకార దిమ్మ — ఒక ఏకైక శిల్పరూపం. ఆ వెలుగు అతిమానస స్వర్ణకాంతిని గాక, భాస్వర కాంతిని వెదజల్లుతోంది. రాత్రివేళ అయితే స్పష్టంగా కనిపించేదని నా కనిపించింది.

ఆ రూపం నా భౌతిక శరీరం కంటె సాంద్రంగా ఉంది. వ్రేళ్ళ సందులనుంచి ఇసుక జారినట్లు భౌతిక శరీరం నుగ్గునుగ్గై రాలి కనుమరుగవుతున్నట్లు కనిపించింది.

ఆ రూపాన్ని మాటల్లో చెప్పలేము. అది మాటల కందనిది. మాటలు స్వల్పమైనవి, సంకుచితమైనవి, అజ్ఞానంతో కూడుకున్నవి.

ఆ రూపాన్ని పొందేందుకు పూర్వీకులు వరుసగా చేసిన ఎన్నో ప్రయత్నాలను నేను గాంచాను.

నా కెన్నో శిరస్సులున్నట్లు అనుభూతి కలిగింది.

ఫిబ్రవరి 29 వతారీఖున కలిగిన అనుభవం సాధారణమైనది, కాని ఈ అనుభవం నా కోసమే అన్నట్లు అనిపించింది.

ఇది నా కెన్నడూ కలగని అనుభవం. నేను అతిమానసశరీరం చూడడం ఆరంభమైంది,

నాకు ఇటువంటి అనుభవం సృష్టికారకమైన భగవంతుని దివ్యజ్ఞానమహస్సు భౌతిక చైతన్యంతో ఐక్యమయినప్పుడు కలిగింది. కాని అది సూక్ష్మతరమైన అనుభవం. ఇది శరీరంలో కలిగిన ప్రత్యాక్షానుభవం. నిజానికి అతిమానసిక శరీరానుభవం నాకు కలుగలేదు. నేను దాన్ని చూడనూలేదు. అదే నేనయ్యాను.

అది నా నుండే వ్యాప్తి చెందింది. వెలుగును ప్రసరించింది. ప్రతిఒక్కరి లోకి వేలకువేల నిప్పురవ్వలు చొచ్చుకుపోతున్నట్లుగా నుంది. అక్కడనున్న ప్రతి ఒక్కరిలో ప్రవేశించడం చూశాను. అది మరో ముందడుగు.

Conversations with a diciple, Sept 12, 1956

శరీరంలో అతిమానసిక శక్తి

మొన్నటి నడిరేయి నాకన్నా పెద్దది, శక్తివంతమైనజీవి నా శరీరాన్ని ఆవహించిన అనుభూతి కలిగి మేల్కొన్నాను. ఆ శక్తి నాలోనే ఇమడలేక పొంగి పొరలుతూ అసౌకర్యపడుతున్నట్లుంది.

ఆ రాత్రి పడకపై వెల్లకిలాపడుకున్నా. నా శరీరమంతా వేగవంతమైన, తీవ్రమైన కాని ఒక నిశ్చలమైన కంపనకు గురి అయినట్లనిపించింది. దీన్ని ఎలా వివరించేది? అది శూన్యంలో కదలలేదు, కేవలం ప్రకంపనేగానే నుండింది. నిశ్చల స్థితిలోనే వుండింది. నా శరీరాకృతియావత్తూ ధగధగగా మెరుస్తున్న శ్వేతకాంతితో దివ్య చైతన్యపు వెలుగైంది. ప్రతి జీవకణం ప్రకంపించినట్లు నా శరీరాని కనిపించింది. అదంతా ఒక్క ప్రకంపనలోని భాగమే.

అది శరీరాన్ని మించి విస్తరించింది. (ఆరు సెంటీమీటర్లని సూచిస్తూ సైగ) వా పడకపై పూర్తిగా నిశ్చలంగానే వున్నాను. అపుడు అది కదలికలేకుండా, స్థల



అతిమానస చైతన్య వెలుగు వైపుకు తిరిగిన చైతన్యం
అది సత్యం కోసం తపిస్తూ సత్యంతోనే సంతృప్తి నొందుతుంది.

అనువాదం: ఆకుల కృష్ణ

మార్పిడి కాకుండా చైతన్యవంతంగా పైకి లేవటం ఆరంభించింది. నా చైతన్యం దివ్య చైతన్యం వైపుకు ఆరోహణ చెందుతున్నట్లనిపించి అదే స్థితిలో వున్నాను. (*శ్రీమాత తన రెండుచేతులను జోడించి నొసటికి సమాన స్థాయిలో ప్రార్థన చేస్తున్నట్లు వుంచింది.*)

పదిహేను నిముషాలు కదలకుండా కూడలిలో కలిసేంతవరకు చైతన్యం పైకి లేచింది.

అది ఒక చైతన్యవంతమైన కూడలి, సంపూర్ణ జాగ్రదావస్థలో జరిగే సమాధి స్థితిలో కాదు.

అలా చైతన్యం ప్రతివస్తురాశికి ఆవల కదలిక లేకుండా, దేశకాలాదులకు బయట, శాశ్వతంగా, పరిపూర్ణంగా ఏకైక దివ్యచైతన్యమయింది. ఒక సచ్చిదానందంలో, పారవశ్యతలో అనిర్వచనీయంగా — నాకు తెలియదు.

అదంతా శారీరక చైతన్యానుభవమే. చివరి మార్పుకు ఎంతో దూరమయింది కాదు. కాని చేయవలసింది ఎంతో ఉంది. ఆ మార్పు శరీరంలో అతిమానసిక శక్తి రూపంలో ఉందని మనం చెప్పవచ్చు.

భౌతికాహంకార విచ్ఛిన్నత

మొదటి సారిగా దాదాపు మూడుగంటలపాటు భౌతికాహంకారం సంపూర్ణంగా విచ్ఛిన్న మైంది. సచ్చిదానందశక్తి తప్ప మరేమి మిగలలేదు. చైతన్యంలోనే గాక భౌతిక సంవేదనలలోను ఆ దివ్య సచ్చిదానందం విశ్వమంతా నిరంతర ప్రవాహంగా విస్తరించింది.

ఈమూడు గంటల సమయంలోనే చైతన్యం పూర్తిగా భిన్నరూపం దాల్చింది. ఈ భూమికి వెలుపలగాక, భువిపైనే నిలచిపోయింది. శారీరక చైతన్యం కూడా భిన్నరూపం దాల్చింది. మిగిలింది యాంత్రికమైన శరీరం మాత్రమే. అది ఏ విధంగానైనా ఉండగలదు. దాదాపు 70 సంవత్సరాలు ఈ చైతన్యశక్తిని ప్రతి ఒక్క శరీర జీవకణంలోనికి చొప్పించగలిగాను. అది చైతన్యవంతమయ్యే విధంగా. అదంతా వెనక్కి వెళ్ళిపోయినట్లనిపించింది. ఆ మూడుగంటలకాలంలో శ్రీమాత ద్వారా ఆ పరమాత్మ వ్యక్తపడుతున్నట్లు తప్ప యింకేమీ లేదు. అది దివ్యశక్తి

వంతమైన నిరంతర ప్రవాహం, పరమాత్మే వివిధ రూపాలలో వ్యక్తమవుతూ వున్నట్లు.

ఆ దివ్యచైతన్యం విశ్వమంత విశాలమైనది. నిరంతర చైతన్య స్వరూపిణి. అంతా తానే అయి ఒక్కటిగా, సంపూర్ణంగా వ్యక్త పడే సాక్షాత్కారం. దానిలో ఏ విభజన లేదు. వివిధ రంగులతో, ప్రకంపనలతో శక్తులతో కూడి అసాధారణమైన ఏకీకృత చైతన్యమది. అంతా దానిలోనే ఉంది. అందులో సత్ , చిత్ , ఆనందం అనే మూడు ఉన్నత లక్షణాలు స్పష్టంగా గోచరిస్తూ ఉంటాయి. అది నిరంతరం కొనసాగుతుండే విశ్వవ్యాప్త అపారత.

అది చలిస్తుంది, చలించదు. దానిని ఎలా వివరించేది?

అది నిరంతరం ఆగకుండా చలిస్తూనే ఉంటుంది. అయినా స్థలమార్పిడి వుండదు. అది శాశ్వతమైనది. పునరావృతంకానిది. ఆద్యంతాలు లేనిది. పునరావృతం కాకుండా వుండే ప్రత్యక్ష జ్ఞానం.

Conversation with a disciple, May, 1960

అనువాదం: ఆకుల కృష్ణ

శరీరంలో వంతెనల నిర్మాణము

విజయగీతిక: అది జరిగింది

(ఏప్రియల్ 12, 1962 నాటి రాత్రి అనుభవం)

రాత్రి నేను హఠాత్తుగా మనం విశ్వయోగమని పిలిచేదాని పూర్తి ఎరుకతో నిద్ర లేచాను. సర్వోత్కృష్ట దివ్యప్రేమ మహాస్పందనలతో అభివ్యక్తమవుతున్నది. ప్రతి స్పందనా తన అభివ్యక్తతలో మునుముందు రాబోయే ప్రపంచాన్ని తీసుకువస్తున్నది. అది శాశ్వతుని అత్యాశ్చర్యకరమగు విస్మయం కలిగించే దివ్య ప్రేమ, కేవలం దివ్యప్రేమ యొక్క అసాధ్యమైన స్పందన. ప్రతి స్పందనా దాని అభివ్యక్తతలో ఈ విశ్వాన్ని ముందుకు తీసుకు వెళుతున్నది.

అక్కడ దృఢవిశ్వాసం — ఏది జరగాలో అది జరుగుతందనీ, అతిమానస దివ్యాభివ్యక్తత సాక్షాత్కరించుకో బడుతుందనీ.

ప్రతిదీ వ్యక్తిత్వరహితము, ఏదీ వ్యక్తిగతం కాదు.

ఇది ఆ విధంగా సాగిపోతూ, పోతూ, పోతూ ఉన్నది. ఏది జరగాలో అది జరుగుతుందనే దృఢవిశ్వాసం.

అనృతం యొక్క ఫలితాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి: మృత్యువు ఒక భ్రాంతి, వ్యాధి ఒక భ్రమ, అజ్ఞానం ఒక భ్రమ — వాస్తవం కానటువంటి, ఉనికి లేనిదేదో, కేవలం దివ్యప్రేమ, దివ్యప్రేమ, దివ్యప్రేమ — అపారమై, అసాధ్యమై, అత్యాశ్చర్యకరమై ప్రతిదానినీ తీసుకువెళ్తూ.

దానిని ప్రపంచంలో ఏ విధంగా వ్యక్తీకరించగలం? అది అసాధ్యం ఎందు వల్లనంటే వైరుధ్యం వల్ల. కాని అప్పుడు ఈ విధంగా తెలుపబడింది: "అతిమానస దివ్యసత్యాన్ని ప్రపంచం తెలుసుకోవాలని నీవు అంగీకరించావు... అది పూర్తిగా, సమగ్రంగా వ్యక్తీకరించబడుతుంది."

అవును, అవును...

అది జరిగింది

(దీర్ఘ నిశ్శబ్దం)

వ్యక్తిగత చైతన్యం తిరిగి వెనుకకు వచ్చింది. సరిగ్గా అప్పుడు ఒక పరిమిత సంవేదన, బాధా పరిమితి; అది లేక వ్యక్తి లేడు. మేము మరల దారిలో ప్రయాణం కొనసాగిస్తున్నాం, గెలుపు తథ్యమని. ఆకాశాలు పూర్తిగా విజయగానాలతో నిండి పోయాయి.

దివ్యసత్యం మాత్రమే ఉన్నది; కేవలం అది మాత్రమే అభివ్యక్తమై తీరు తుంది. ముందుకు సాగిపో!

సర్వోత్కృష్ట విజయుడా, పరమ ప్రభువా,
నీకు వందనములు

(నిశ్శబ్దం)

ఇప్పుడు, పని విషయంగా.

ఓరిమి, సహిష్ణుత, పరిపూర్ణ సమత్వం మరియు ఒక సంపూర్ణ విశ్వాసం.

(నిశ్శబ్దం)

దానిని అనుభవంతో పోలిస్తే నేను చెప్పేదంతా ఏమీ లేదు, ఏమీ లేదు, ఏమీ లేదు, మాటలు తప్ప మరేమీ లేదు.

మన చైతన్యం అటువంటిదే, సంపూర్ణంగా దివ్యప్రభువు కున్నటువంటిదే.

తేడా ఏమీ లేదు. మనం ఆ తత్ పదార్థమే, మనం ఆ తత్ పదార్థమే, మనం ఆ తత్ పదార్థమే.

CWM 15:391-92

ఒక వాగ్దానం సుసంపన్నమయింది

(శ్రీమాత తన 12/13 ఏప్రియల్ 1962 అనుభవాలలోని అంశాలను విపులీకరిస్తున్నారు)

నేను మూలంలో ఉన్నాను — నేనే మూలమును. రెండు గంటల కంటే ఎక్కువ, ఎరుకతో ఇక్కడ ఈ పక్క మీద, నేనే మూలం. పెనుగాలి తెరలు తెరలుగా వీస్తూ ధూళిని లేపినట్లు, పెద్ద ధూళిమేఘంలాగా విస్ఫోటనాలలో అంతమవుతూ, ప్రతి ధూళిమేఘం విశ్వమంత పరిధిని కలిగి ఉంది.

దాని పరమోత్కృష్ట అంతస్సారంలో అది దివ్యప్రేమ — దానికి, ఆ మాటను జనులు సర్వ సాధారణంగా అర్థం చేసుకొనేదానికి, ఏ విధమైన సంబంధమూ లేదు.

ఈ దివ్యప్రేమ యొక్క అంతస్సారంతో కూడిన ప్రతి ధూళిమేఘం విడిపోతూ, పరచుకొంటున్నది... కాని అవి శక్తులు కావు, అది శక్తుల లోకం కంటే చాలా సూదూరంగా ఆవల నున్నటువంటిది. మనకు తెలిసిన విశ్వం ఉనికి ఏమాత్రం లేదు. అది ఒక విధమైన విపరీతమైన భ్రాంతి, దానితో ఏ విధమైన సంబంధం కలిగి లేదు. అక్కడ కేవలం విశ్వం యొక్క సత్యం మాత్రం ఉంది, అటువంటి రంగులతో కూడీన పెద్ద ధూళిమేఘాలు — అవి రంగు లద్దబడి ఉన్నాయి. ఒక విధమైన రంగులోని అంతస్సత్వంతో.

అది అత్యంత ఆశ్చర్యకరం. నేను ఆ విధంగా రెండుగంటల కంటే ఎక్కువ, ఎరుకతో ఉన్నాను.

అప్పుడు నాకు ఒక దివ్యవాణి ప్రతిదానిని వివరించి చెపుతున్నది (కచ్చితంగా చెప్పాలంటే దివ్యవాణి కూడా కాదు, కాని ఏదో శ్రీఅరవిందుల మూలం, ఆద్యమూలం నుంచి ఈ మధ్యనే వెలువడిన ధూళి మేఘం వంటిది). అనుభవం పొరలు పొరలుగా విడివడగానే, ఈ వాణి ప్రతి ధూళిమేఘాన్ని నాకు వివరించి చెప్పింది, విశ్వం యొక్క ప్రతి పరిధిని; అంతట అది ఇదంతా ఏ విధంగా ఇలా

తయారయిందో వివరించి చెప్పింది (శ్రీమాత తిరగవేసిన సంజ్ఞ చేసి చూపారు): విశ్వం వికృతమైన విధం. అది ఏ విధంగా సంభవించగలదని నేను దిమ్మెర పోయాను. ఆ దివ్యచైతన్యంతో, ఆ పరమోత్కృష్ట చైతన్యంతో, ఇప్పుడున్న దానికీ, వికృతమైన విశ్వానికీ, అన్వయించడానికి, ఆ దివ్యచైతన్యమును కోల్పో కుండా సంబంధాన్ని ఏర్పరచడం ఎలా? రెండింటి మధ్య సంబంధం అసాధ్యమని పించింది. అప్పుడు, నేను ఆ దివ్యకార్యమును భూమి మీద చేస్తానని, అది జరిగి తీరుతుందని చేసిన వాగ్దానమును, ఆ దివ్యవాణి లాంటిది నాకు గుర్తు చేసింది. "నేను దివ్యకార్యమును చేస్తానని, అది జరిగి తీరుతుందని చేసిన వాగ్దానం"...

అంత మట్టుకు (ఏప్రియల్ 13), నేను చాలా విషయాలు నేర్చుకున్నాను, కాని వాటన్నింటినీ కంచెకు ఇటువైపు నుంచి నేర్చుకున్నాను. ఇప్పుడు నేను కంచెకు అటు వైపు ఉన్నాను. పూర్తిగా కాదు, కాని కనీసంగా, ఎక్కువ భాగంలో.

జూలై 4, 1962

అంతిమ విజయం దివ్యప్రభువుదే

ఇంతమట్టుకు నేను జీవించి ఉన్నానంటే కారణం దివ్యప్రభువు నేను జీవించి ఉండాలని కోరుకున్నాడు గనుక. లేని పక్షంలో నేను చాలా కాలం క్రిందటే వెళ్ళి పోయి ఉండేదానిని.

నేను శరీరంలో ఏమాత్రం లేను. నేను దానిని దివ్యప్రభువు సంరక్షణకు వదలివేశాను, దానికి అతిమానసం కావాలో అక్కర లేదో అనేది ఆయన నిర్ణయా నికే వదలివేశాను. నాకు తెలుసు, నేను చెప్పాను కూడా, ఇదే అంతిమ పోరాట మని.

ఏ ప్రయోజనం కోసం ఈ శరీరం సజీవంగా వుండాలో అది నెరవేరితే అనగా, అతిమానస పరివర్తనకు తీసుకోవలసిన మొదటి అడుగు అది ... అంటే అది ఈ రోజున కూడా కొనసాగించబడుతుంది. ఇది దివ్యప్రభువు నిర్ణయం. నేను ఆయన ఏమి నిశ్చయించారని కూడా అడగటం లేదు. ఈ శరీరం పోరాటం భరించడానికి అశక్తమైనదైతే అది కరిగి అదృశ్యమై పోవలసినట్లైతే, అప్పుడు మానవజాతి ఒక అపాయకరస్థితి ద్వారా పయనించవలసి ఉంటుంది. అసురశక్తి

శ్రీఅరవిందుల రూపాన్ని ధరించడంలో, దేనిని సృష్టించడంలో సఫలీకృతమైనదో అది అతిమానస సాక్షాత్కారం అనే పేరు మీద కొత్త మతాన్నీ లేదా ఆలోచనలనూ, బహుశా క్రూరమై, కనికరం లేనిదానిని సృష్టించవచ్చు. కాని అది నిజమైనది కాదని ప్రతివారు తప్పక తెలుసుకోవాలి. అది శ్రీఅరవిందుల బోధ కాదు, ఆయన బోధించినదాని సత్యం కాదు. శ్రీఅరవిందుల సత్యం ప్రేమ, ప్రకాశము, దయల సత్యం. ఆయన శ్రేయోభిలాషి, గొప్పవాడు, దయాళువు, దివ్యుడు. అంతిమ విజయం ఆయనకే దక్కుతుంది.

ఇప్పుడు, ప్రత్యేక వ్యక్తిగా, నీవు సహాయం చేయదలచుకుంటే, నీవు కేవలం ప్రార్థనను చేయి. దివ్యప్రభువు ఏది కావాలనుకొంటే అది జరిగి తీరుతుంది. ఆయన దేనిని ఇచ్ఛగించినా దానిని ఈ శరీరంతో చేస్తాడు....

CWM 15:389

నూతన విధానంలో మరణించడం

ఈ ఉదయం నాకు ఏదో చెప్పబడింది (నేను అది ఈ రోజు ప్రొద్దున అనే అనుకుంటున్నాను లేక రాత్రినా నాకు గుర్తు లేదు); అది శరీరానికి చెప్పబడింది, నాకు కాదు. శరీరం పూర్తిగా శుద్ధి చెందే వరకూ అది కొనసాగుతుందని, ఆ దశలోలో దానికి తన పనిని కొనసాగించటానికి లేక .... మధ్య ఎంపిక ఉంటుంది. జీవకణాల స్థాయిలో అది పూర్తి శుద్ధిని అందుకున్నప్పుడు (జనులు సర్వసాధారణంగా పిలిచే భౌతికపరమైన 'శుద్ధి', అది కాదు) దివ్యప్రభావపు దృక్పథంలో, అనగా, ప్రతి కణం పరమేశ్వరుని ప్రత్యేక ప్రభావానికి లోనైనప్పుడు (ఆ పని ఇప్పుడు చేయబడుతూ నున్నది), ఆ పని చేయబడుతుందని శరీరానికి చెప్పబడింది, ఒకసారి గనక ఆ పని పూర్తయితే, శరీరం తనకు తాను, పూర్తిగా పరమేశ్వరుని ప్రభావంలో ఉండి, అప్పుడది నిశ్చయించుకుంటుంది: కొనసాగాలా లేక కరిగిపోవాలా అనేది. ఇది చాలా ఆసక్తిదాయకమైన విషయం, కారణం... కరిగిపోవడం అంటే చెల్లాచెదరైపోవడం అంటే విరజిమ్మటం, కాని విరజిమ్మటం (అది తేలికగా అర్థమవుతుంది) అంటే చైతన్యం చాలా విశాలమైన ప్రదేశంలో పరచుకోవడం. కనుక జీవకణాలకు ఆ ఎంపిక ఇవ్వబడుతుంది, అదే పద్ధతిలో పని చేయాలా (చెల్లాచెదరైపోవడమనే సంజ్ఞ) లేక ముద్దగా పోగవాలా అనేది (శ్రీమాత పిడికిలి

బిగించి చూపించారు) ఈ సమస్యకు ఈ కోణం నుంచి ఊహించడం ఇది మొదటి సారి, అనగా ఒక సాధారణమైన పని దృక్పథంలో.

ప్రశ్న: కాని ఆ విరజిమ్మడం అనేది ఏ విధంగా అనేది తెలియడం లేదు.... అది విరజిమ్మబడితే, అది కరిగిపోతే, మొత్తం పని అంతా కరిగిపోయి నట్లవుతుంది, అంతే కదా?

సమా: లేదు, ప్రతి జీవకణం సంపూర్ణంగా ఎరుక కలిగినది.... అది స్పష్టంగా (బాహ్య ప్రమాణం ప్రకారం) నూతన విధానంలో మరణించడం, అది సాధ్యమే — అది ఇక ఏమాత్రం వాస్తవంగా మనకు తెలిసిన విధానంలో మరణించడం కాదు.

Conversations with a disciple July 31, 1963

శక్తివంతమై, చాలా సమయం పాటు చొచ్చుకుపోయిన అతిమానస శక్తులు

(ఆగస్టు 26 రాత్రి నుంచి 27 వరకు, 1968)

"శక్తిమంతమై, చాలా సమయం పాటు శరీరంలోనికి చొచ్చుకుపోయే అతిమానసిక శక్తులు, ప్రతి చోటా ఒకే సమయంలో..."

శరీరంలోనికి చొచ్చుకుపోవడం. అవును, చొచ్చుకుపోయే ప్రవాహ ప్రసారం, నాకు చాలా సందర్భాలలో ఈ అనుభవం కలిగింది, కాని ఆ రోజు రాత్రి (అనగా, మునుపటి రాత్రి) అది ఒక్కసారిగా హఠాత్తుగా వచ్చింది, అక్కడ అతిమానసిక వాతావరణం తప్ప మరేదీ లేదనిపించే విధంగా, అక్కడ అది తప్ప మరేదీ లేదు. నా శరీరం అందులో ఉంది. అది ప్రతి చోటనుంచి, ప్రతి చోటనుంచి, ప్రతి చోటనుంచి ఒకే సమయంలో ప్రవేశించాలని ఒత్తిడి చేస్తూ ఉన్నది — ప్రతి చోటా. కనుక ఆ ప్రవేశిస్తున్నది ప్రవాహ ప్రసారం కాదు, అది ప్రతి చోటా చొచ్చుకుపోతున్న వాతావరణం. అది ఆ విధంగా కనీసం 4 లేక 5 గంటలు కొనసాగింది. అక్కడ కేవలం ఒకే ఒక్క శరీరభాగం మాత్రమే ఉంది, అందులో అది ఏమాత్రం చొచ్చుకుపోలేదు, అది ఇక్కడి నుంచి అక్కడి వరకు (శ్రీమాత కంఠం నుంచి శిరస్సు అగ్రభాగం వరకు చూపించారు): అక్కడ దానికి బూడిదరంగు ఉంది, ప్రకాశం లేనిదై మందకొడిగా ఉంది, ప్రవాహప్రసారం తక్కువగా చొచ్చుకుపో

యిందా అని అనిపించే విధంగా.... కాని, దానిని వదలివేస్తే, మిగతా అంతటా, అంతటా... అది ప్రవేశించింది, ప్రవేశించింది, ప్రవేశించింది... అటువంటిది నేనెప్పుడూ చూడలేదు, ఎన్నడూ! అది కొన్ని గంటల పాటు ఉంది, గంటలు. సమయమంతా ఎరుకతోనే.

కనుక, అది వచ్చిన సమయంలో, అది అక్కడ ఉన్న సమయంలో నేను ఎరుకతో ఉన్నాను: "ఆహా, అది అందుకోసమే, అది అందుకోసమే, అదే ఆ తత్ , నీవు నా నుంచి కోరుకున్నదదే, ఓ ప్రభూ! అది అందుకోసమే, అది అందుకోసమే, అదే నీవు కోరుకున్నావు". ఆ క్షణంలో ఏదో జరగబోతున్న అనుభూతి నాకు కలిగింది.

CWM 11:122-23

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీఅరవిందులు 'ప్రతిబింబం' అని పిలిచేది శరీరాన్ని. కనుక నేను ప్రభువును అడిగాను, భౌతిక శరీరాన్ని పరివర్తన చేయాలని ఆయన కోరుతున్నప్పుడు ఆయన ఏం చేస్తాడని; సమాధానంగా కిందటి రాత్రి ఆయన నాకు రెండు దర్శనాలు ఇచ్చాడు.

మృత్యువుకు సంబంధించిన అన్ని సాంప్రదాయిక నియమనిబంధనల నుంచి శరీర చైతన్యానికి విమోచనం కలిగించటం ఒకటి; తక్కినదానిలో అతిమానస శరీరం ఏ విధంగా ఉంటుందనేది ఆయన చూపించాడు. చూశావా, నేనడగటం ఎంతో మంచిదయింది కదా!

CWM 10:352-53

9 మే, 1970

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

రూపమార్పు

జీవితాన్ని ఒక నూతన అవగాహనతో చూచే సరిహద్దు మీద నేనున్నాను. ఇతరులు పనిచేసే తీరు, తమచుట్టూ జరిగే ప్రతిదానికీ వాళ్ళు ప్రతిస్పందించే తీరు, వస్తువులను చూచే సామాన్య, సాధారణ విధానం అదంతా కూడా చేతనకు సంబంధించిన ఒకానొక వైఖరిని తెలియపరుస్తుంది. చేతనకు సంబంధించిన ఒకానొక స్థాయినుండి దానిని చూడడం జరిగింది. ఒక రోజున నేను సూక్తులపై వ్యాఖ్యానించినపుడు, ఆ స్థాయి భిన్నమైనదని, వస్తువులను చూచే సాధారణ విధానాని కదెంతో భిన్నమైన కోణమని అకస్మాత్తుగా తెలిసింది. అదివరకుగల వస్తువులను చూచే విధానం దురవగాహన మైనదనీ, అసలటువంటి విధానాన్ని మనమెలా అనుసరించామా అని ఆశ్చర్యపోయేటట్లు అకస్మాత్తుగా తెలిసింది. అదెంతో భిన్నమైనది. నేను మాట్లాడుతున్నప్పుడు ఈ నూతన 'వైఖరి' సహజ రీతిలో తనంత తానుగా వచ్చి స్థిరపడిందని, అదొక రూపాంతరీకరణకై చేసిన కృషి ఫలితం కాదని, అది వరకే సుస్థాపితమైవున్న రూపాంతరీకరణ అనే సంవే దన లేక అవగాహన కలిగింది.

అది సంపూర్ణం కాదు. యెందుకనంటే రెండు వ్యాపారాలూ తెలుస్తూనే వున్నాయి. కాని అది దారిలోనే వున్నట్లు నాకు నమ్మకం కలిగింది. ఆ నమ్మకం కలిగిన తరువాత అది ఆసక్తికరమైనది. చేతన కొన్ని భాగాలు, గొంగళిపురుగు దశనుండి సీతాకోకచిలుక స్థితికి రూపంతో సహా మార్పు చెందుతున్నట్లుగా, అటువంటి దేదో జరుగుతూన్నట్లుగావుంది.

అది సరిగ్గా దారిలో వుంది, భేదం చాలా స్పష్టంగా తెలిసేందుకు చాలినంత దూరంలో అది ఆ దారిలో సాగిపోయింది. ఒక్కసారి అది గనుక పూర్తైతే యేదో గట్టిగా నిలిచిపోతుంది.

(మౌనం)

స్వయంగా జీవకణాలకే యెంచుకొనే స్వేచ్ఛ నివ్వాలని చెప్పారు. ఆ ధ్యానమంతటికీ ముగింపు జీవకణాల సముదాయాల చేతనలో ఒక నూతన మూలకం యేర్పడడం. పురోగతిలో ఒక నూతన అనుభవం కలగాలి. ఫలితం

గతరాత్రి కనీసం వివరించి చెప్పలేని అద్భుతమైన జీవకణ అనుభవాలు కలిగాయి. అదొక నూతన వివేకోదయం అయివుండాలి.

ఒక శిష్యునితో సంభాషణలు, 18 సెప్టెంబరు 1964


నూతన అవగాహన సరిహద్దు క్షేత్రం

నిన్ననో, లేక మొన్ననో రోజంతా ఉదయం నుండి రాత్రి వరకు "నేనున్నాను, — నేనున్నాను లేక భువిపై చనిపోయినవారి చేతన నాకున్నది" అని యేదో చెప్తూనే వున్నది. దానిని మాటల లోనికి మార్చి చెప్తే, ఈ విధంగా నాకు చెప్పినట్లనిపిస్తుంది. "భువికి, భౌతిక వస్తువులకు సంబంధించి నంతవరకు ఇది ఒక మృతజీవి చేతన లాంటిది.... భువిపై జీవిస్తున్న మృతజీవిని నేను". చేతన దృక్పథాన్ననుసరించి — యెందుకనంటే చేతన నిరంతరంగా తన దృక్కోణాన్ని మార్చుకొంటూ వుంటుంది — చేతన దృక్పథానన్ననుసరించి అది, "చనిపోయినవారు భువికి సంబంధించి నంతవరకు యిలా వుంటారు" అన్నట్లుంది, తరువాత, "భువికి సంబంధించినంత వరకు నేను పూర్తిగా ఒక మృతజీవిలా వున్నాను". ఆ తరువాత, "భువి చేతనలో ఒక మృతజీవి నివసిస్తున్నట్లు నేను జీవిస్తున్నాను". ఆ పిదప "నేను సరిగ్గా ఒక మృతజీవిలా భువిపై నివసున్నాను..." అలా అలా సాగింది. నేను మామూలుగానే ప్రవర్తిస్తున్నాను, మాట్లాడుతున్నాను, పని చేస్తున్నాను. కాని ఈ విధంగా చాలా కాలం పాటు జరిగింది. చాలా కాలం పాటు రెండు సంవత్సరాలకు పైగా నేను ప్రపంచాన్నీ విధంగా (*ఒక స్థాయి నుండి మరొక స్థాయికి ఊర్ధ్వానికి పోతున్నట్లు సంజ్ఞ*) ఇప్పుడు దాన్ని నేనిలా చూస్తున్నాను (*క్రిందికి దిగుతున్న సంజ్ఞ*). దీన్నెలా విశదీకరించాలో నాకు తెలియడం లేదు. ఎందుకనంటే మానసీకరించగలిగినది అందులో యేమీ లేదు. మానసీకరించలేనటువంటి వాటిని గురించిన సంవేదనలు అలికినట్లుంటాయి — అస్పష్టంగా — దాన్ని నిర్వచించడం కష్టం. మాటలు, ఆలోచన తలకు కొంత దూరంలో వున్నాయి (*తల చుట్టూ అన్నట్లు సంజ్ఞ*) గమనించి అంచనా వేయదగ్గవాటిగా, చూచి చెప్పదగినవిగా — అది తల చుట్టూ వున్నది. ఈ రోజు రెండు మూడు సార్లు అది అత్యంత బలీయంగా తయారైంది — అంటే అర్థం, మొత్తం చేతనను ఈ స్థితి ఆవరించింది — ఒక రకమైన భావముద్ర లేక

సంవేదన లేక అవగాహన, — కాదు అవేవీ కాదు. భువిపై జీవిస్తున్న ఒక మృతజీవిని నేను.

కాబట్టి దృష్టికి సంబంధించి, వస్తురూపాలకు కచ్చితత్వం లేదు. (కళ్లతో చూడనట్లు సంజ్ఞ) నేను చేతన ద్వారా, చేతనచే చూస్తాను. వినికిడికి సంబంధించి నేను చాలా భిన్న మైన రీతిలో వింటాను. ఒక విధమైన "విచక్షణ" వున్నది గాని "వివేచన" లేదు, యెంచుకొని, నిశ్చయించే ఒకానొక అవగాహన వుంది — అది నిశ్చయిస్తుంది గాని, అప్రయత్నంగా కాదు — దేన్ని చూచిందో, దేన్ని చూడలేదో, యెంచుకొని నిశ్చయించే ఒక అవగాహన వుంది. అటువంటిది అది వరకే దృష్టికి వుంది, కాని వినికిడికి కూడా అబ్బినందువల్ల అది మరింత బలంగా తయారైంది. కొన్నింటి విషయంలో ఒక నిరంతర మర్మర ధ్వనిగా తక్కినవాటి విషయంలో స్ఫటికంలా — స్పష్టంగా వుంటుంది. మరి కొన్నింటి విషయంలో అస్పష్టంగా, వినపడీ వినపడనట్లుంటుంది. దృష్టి విషయంలో కూడా అంతే. ప్రతిదీ ఒక ప్రకాశమయ పొగమంచు వెనుక ఉన్నట్లుగా వుంటుంది — చాలా ప్రకాశమయం, అయినా అది పొగమంచు గదా, అంటే స్పష్టత, కచ్చితత్వం వుండదు — తరువాత అకస్మాత్తుగా పూర్తిగా కచ్చితత్వంగల, స్పషంగా చూడగల, ఒక అసాధరణమైన రీతిలో కచ్చితత్వంగల ప్రతిదాన్నీ వివరంగా తెలిపే దృష్టి. అంటే ప్రతిదీ అధికాధికంగా జ్ఞానపరమైనదిగా, తక్కువ తక్కువగా విషయపరమైనదిగా కన్పిస్తుంది. అది దృష్టిపై తమంత తాముగా వచ్చిపడే దృశ్యాలు కాదు, వినికిడిపై తమంత తాముగా వచ్చి పడే ధ్వనులూ కాదు. కొన్నింటిని స్పష్టంగా తెలిపే, మరి కొన్నింటిని ఒక విధమైన అస్పష్ట నేపథ్యంగల వాటిగా తెలిపేటట్లు చేసే ఒక చేతనా కదలిక వుంది....

...ఉదా; తినడం చాలా విలక్షణంగా వుంది, చాలా విలక్షణం — ఒక దేహం వంక యెవరో చూస్తున్నట్లు — చాలా కచ్చితంగా జరుగుతున్నట్లు, నిర్దిష్టంగా జరుగుతున్నట్లులేదు. అన్నీ కలగలసిపోయిన ఒకరాశిలా లేక ముద్దలా వుంది— అదియేదో జరుగుతూండగా చూస్తున్నట్లు చూస్తోంది! కాదు, నిజంగా అదొక విలక్షణమైన స్థితి. ఈ రోజు అది మరింత బలంగా తయారైంది. అది చేతననంతా లోబరచుకుంది. ఏ చిన్న విషయమైనా నీకు సంపర్కం లేకుండా చేస్తుందనే సంవేదన కలిగించే క్షణాలు కూడా వున్నాయి. (సంబంధం తెగిపోయినట్లు సంజ్ఞ



నాదిగాక, నీ మహాసంకల్పమే నెరవేరాలి, నీవు సంకల్పించినట్లే, నీవు సంకల్పించినట్లే. శాశ్వతంగా నేను నీదానను.
CWM 14:103

శ్రీమాత

దేహంతో అనుసంధానం కోల్పోయినట్లు సంజ్ఞ) చాలా నిశ్చలంగా చాలా ఉదాసీనంగా — వుండగలిగితే అది కొనసాగ గలుగుతుంది.

CWM 10: 223-25

దేహ సంపూర్ణ సమర్పణ

"నీవు దేనికైనా సంసిద్ధమేనా?" అని అడుగుతున్నట్లుండే పరాత్పరుని దివ్య సన్నిధికి చాలా సుపరిచితమైన ఆంతరంగిక సన్నిహితత్వ సాక్షాత్కారం కలిగిన తర్వాతే యెప్పుడూ యిలాంటి అనుభవాలు కలుగుతాయి. సహజంగానే నేను, "దేనికైనాసరే" అని సమాధానం చెప్తాను. దైవ సన్నిధి అత్యద్భుతంగా తీవ్రతరం అవుతుంది. మొత్తం అస్తిత్వంలో ఒకవిధమైన తృష్ణ కలుగుతుంది. అది అలాగే వుండాలి. కేవలం "తత్" మాత్రమే వుంది. అస్తిత్వకారణం కేవలం "తత్" మాత్రమే. దానికి మధ్యలో నీవు "దేనికైనా సంసిద్ధమా?" అని అడుగుతున్నట్లు, లేక సంసిద్ధమైవుందా అన్నట్లు సూచనవస్తుంది.

CWM 10: 223-26

కేవలం పరమేశ్వరుని వల్లనే ఈ దేహం జీవిస్తోంది.

ఒక సమూల మార్పు జరుగుతున్న స్థితి అది.

చేతనా దృక్పథం నుండి చూస్తే అదొక అద్భుతమైన ఆర్జన! ఎందుచేత నంటే ప్రతి ఒక బంధం, బాహ్యవిషయాలపై వుండే మమకారం అంతా ముగిసి పోయింది. అది పూర్తిగా రాలిపోయిండి – పూర్తిగా పతనమై పోయింది. ఒక పరిపూర్ణ స్వేచ్ఛ. అంటే కేవలం "తత్" మాత్రమే — పరమేశ్వరుడు మాత్రమే శాసకుడు. ఈ దృక్పథం నుండి చూస్తే అది మాత్రమే నిజమైన గెలుపు లేక ఆర్జన అవుతుంది. అది అటువంటి సమూలమైన ఉపలబ్ధి... భువిమీద సాధారణ జీవితం జీవిస్తున్నప్పుడు నిజం చేసుకోవడం అసాధ్యంగా యేది పరిగణించ బడిందో ఆ కేవల స్వేచ్ఛగా యిది కన్పిస్తోంది.

దేహంమీద యిక నెంతమాత్రం ఆధారపడకుండా అస్తిత్వపు ఉన్నతభాగా లలో అనుభవమయ్యే స్వేచ్ఛకు దీనికి పోలిక వుంది. కాని గొప్ప విషయమేమి టంటే నేనీ విషయాన్ని నొక్కి మరీ చెప్పుతున్నాను — ఈ అనుభవాలను

పొందింది దేహ చేతన, యిక్కడ కంటికి కనిపిస్తున్న ఈ దేహం అనుభవం అది. మానవ జీవులకు "జీవితంలో నమ్మకం" కలిగించేదేది వుంటుందో అదేదో మిగల లేదనేది స్పష్టం. బాహ్యప్రపంచంనుండి ఆధారమిచ్చే దేదీ ఇక నెంతమాత్రం లేనట్లుగా పైకి అనిపిస్తోంది. ఏదీ లేదుకాని.... పరమేచ్ఛ. పరమేశ్వరుడుదానిని జీవించాలని వాంఛిస్తున్నాడు గనుకనే అది నివసిస్తున్నది గాని లేకపోతే అది జీవించలేదనే అనుభూతి దేహానికున్నది అని సులభంగా అర్థమయ్యే మాటల్లో చెప్పవచ్చు.

CWM 10: 226-27

ఉన్నది ఒకే ఒక దేహం

గత కొద్ది రోజుల్లో నిన్ననో, లేక మొన్ననో ఈ అనుభవం కలిగింది. సాకల్యంగా వికేంద్రీకరణ జరిగిన ఒక చేతన, నేనెప్పుడూ ఉన్నత చేతనను గురించి మాత్రమే గాకుండా భౌతికచేతనను గురించే మాట్లాడతుంటాను. ఇక్కడ, అక్కడ, అక్కడ ఎక్కడో,మరెక్కడో ఆ దేహంలో (జనం "ఈ వ్యక్తి" "ఆ వ్యక్తి" అని చెప్పేది పెద్దగా యే మాత్రంలేదు) ఒకే వికేంద్రీకరణకు లోనైన చేతన వున్నది. జీవకణాలకు సంబంధించి ఒక వైశ్వచేతన ఒక విధమైన జోక్యం వున్నది.ఎందుకని అలా కలిసుండాలని ఒక ముద్దగా వుండాలని ఆ జోక్యం చేసుకొన్న వైశ్వచేతన ఆ జీవకణాలను అడిగినట్లు — ఎవరైనా చెప్పగలిగితే అదలా వుంటుంది — గా అనిపించింది. సంవత్సరాలనాటినుండి వచ్చిపడుతున్న అరుగు, తరుగుదలలను, బాహ్యసంకటాలను మొత్తంగా, ఒరిపిడివల్ల ఉపయోగించబడినందువల్ల జరిగే సమస్త క్షీణతలను అర్థం చేసుకొనడానికి సంవేదించడానికి, నిజానికవి తయారైనాయి. కాని వాటికవి అంత ముఖ్యమైన విషయం కానే కాదు. ఉన్నత దివ్య క్రియాశక్తితో సచేతన సంపర్కం కలిగివుండే సామర్థ్యాన్ని నిలుపుకోవడం కన్న, మరొదానికి దేనికీ అధికప్రాముఖ్యత నివ్వకపోవడమే ప్రధానం అన్నట్లు కన్పిస్తుంది. ఆ దృష్టితో చూస్తే అది చాలా ఆసక్తిని కలిగిస్తుంది. "ఒక పరితాపం", "ఒక తీవ్రాపేక్ష" అని చెప్పవచ్చు. దివ్యక్రియాశక్తితో, సమరసం గావించే దివ్య క్రియాశక్తితో, పరమసత్యదివ్య క్రియాశక్తితో, దివ్యప్రేమ దివ్యక్రియాశక్తితో ఈ సంపర్కంకోసం అదొక ఆకాంక్షలా (సహజంగానే మాటలరూపంలో కాదు) "ఒక

పరితాపం", "ఒక తీవ్రాపేక్షలా" ఉందది. దానిచేతనే. దాని కారణంగానే, అవి ప్రస్తుతం కలిసివున్నట్లుగానే, ఒక రాశిగా లేక ముద్దగా కలిసివుండడానికే మక్కువ చూపుతున్నాయి.

CWM 11:4

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

అట్టడుగునవిన్న పదార్థం దాకా భువి-చేతనలో అతి మనస్సు అభివ్యక్తికి సంసిద్ధం చేయడమే ఇప్పటి వరకూ జరిగిన దాని ఉద్దేశ్యం. కాబట్టి నా భౌతికానికి దివ్యమాత భౌతికానికి మాత్రమే ఉద్దేశించి అది జరుగలేదు.

CWSA 32-93

శ్రీఅరవిందులు

*

నన్ను బాధించని జబ్బు అంటూ యేదీలేదు. సమస్త రుగ్మతల నడకను, వాటికి సంబంధించిన జ్ఞానాన్ని అనుభవంద్వారా తెలుసుకొనడానికి, తెలుసుకొని వాటిపై పనిచేయడానికి నేను నాదేహం పైకి వాటిని తీసుకున్నాను. నా భౌతికానికి భయంలేదు గనుక అది ఉన్నత వత్తిడికి బదులు చెప్పగలదు గనుక, వాటిని వదిలించుకోవడం నాకు తేలిక.

*

పరమేశ్వరునకు నా దేహమిలా చెప్తోంది: "నన్నెలా వుండమని నీవు అబిలషిస్తున్నావో, తప్పక అలా వుంటాను., నేనేం తెలుసుకోవాలని నీవు కోరుతున్నావో దాన్ని తప్పక తెలుసుకొంటాను. నేనేం చేయాలని నీవు వాంఛిస్తున్నవో దాన్నే తప్పక చేస్తాను."

CWM 13: 54-59

శ్రీమాత

అనువాదం: కె.వి. రావు

శక్తి మార్పిడి

మృత్యువు కొనసాగదు:

రూపాంతరపరిణామం గురించి సన్నాహాలు 15వ తారీఖునుండి జరుగు తున్నాయి. దానిని ఏమని పిలవాలి? ఒకశక్తి మార్పిడి...

దిశా నిర్దేశము చేయు సంకల్పము తారుమారయిందేమోనని తోస్తోంది. ఆ విషయం భౌతికంగానూ, శారీరకంగాను గొప్ప ఆశ్చర్యమును కలిగిస్తుంది. ఒక నూతన దిశా నిర్దేశము అవసరమయింది. అది అసౌకర్యముగా నుంటుంది, పైగా దానిని వివరించడం కూడా కష్టమే.... ఒకదాన్ని నీచేత "ఆచరించేటట్లు చేయడం" లాంటిది కాదు. "పనిచేయడం" అనే విషయంలో అనేకరకముల చలనములు ఇమిడిఉంటాయి. తిరుగాడుట, నడచుట వంటివి. అవి ఒకే క్రియా కేంద్రస్థానానికి చెందినవి కావు. ఒక అలవాటు ప్రకారం ఆ పాత కేంద్రమునకు అంటిపెట్టుకొని వుండిపోతే, ఓహ్! ఒక అల్లకల్లోల మేదో రేగిపోతుంది. అందువల్ల ఆ పాత అలవాట్లతో పునరావృతం కాకుండా తగు జాగ్రత్త వహించాలి.

(నిశ్శబ్దం)

ఉదాహరణకు, ఈ ఉదయం ఒకటి జరిగింది. అలాగ అనేకసార్లు కొంతసేపు (ఎంతసేపో చెప్పలేను అంత మరీ తక్కువ సమయం ఏం కాదు, అరగంటో పావుగంటో కావచ్చు) శరీరాకృతి అంటే కణజాలము మొత్తము, ఒక అనుభవానికి లోనయింది. శరీరము యొక్క భంగిమతో కణజాలమంతయు ఒకటిగా నుండాలా లేక అదంతా కరిగిపోయి వేరేవిధముగా రూపాంతరము చెందాలా అని. అయితే అది ఒక వైఖరి మీద లేక ఒక సంకల్పం మీద లేక ఆ రెంటియొక్క మేళవింపుమీద ఆధారపడవచ్చు. ఒక విధముగా కలిగిన అనుభూతి (ఒకటి స్మృతి, రెండవది అనుభూతి; కొన్ని సమయాల్లో అది ఏకకాలమున కలిసి వచ్చే రెట్టింపు అనుభూతి) మిమ్ములను కదిలిస్తుంది, పనిచేయిస్తుంది, గ్రహింపజేస్తుంది, ఒకగత జ్ఞాపకముతో కావచ్చు. నూతనముగా కలిగిన భావము ప్రకారము కావాలని ఎంపిక చేసుకొంటే తప్ప అర్థరహితంగా ఎందుకు తొలగిం చాలి అనే ఉద్దేశంతో కావచ్చు.

ఒకసారి వెను తిరిగి పరిశీలించి చూచినపుడు అది కాదు. పూర్వపు చేతన ఉపరితలమునకు వస్తే వ్యక్తి తగు జాగ్రత్త వహించకపోతే, అది స్పృహను

కోల్పోయినట్లు చేస్తుంది. చాలా సమయం అయిదుగంటలనుండి పావుతక్కువ ఆరు గంటలవరకు ఓహ్! అది ఆ విధంగా నుండింది. ఆ అనుభవం ఒకేసారి జీవితము అశాశ్వతమనే భావనను, శాశ్వతమనే భావనను కలిగిస్తుంది. మృత్యువనేది ఉండదని, అది అర్థరహితమని, కేవలం ఇష్టానుసారం ఎన్నుకొనబడు విషయమేనని స్ఫురిస్తుంది. మరి సంకల్పం తారుమారవటం అర్థరహితం, అది కేవలం ఒక భ్రాంతి....

ఆరంభించే శక్తి యందు కలిగినమార్పు — అలా అనవచ్చునంటే — శక్తిని బదిలీ చేయడమనేది యిదివరలో ఎన్నడూ జరుగలేదన్నటు వంటి ఒక ప్రత్యేక ఒక అనుభూతిని కలిగించింది. దురదృష్టవశాత్తు అది ఎక్కువ కాలం నిలువలేదు. కాని ఆ అనుభవం దేహంలో ఒక దృఢ విశ్వాసాన్ని మిగిల్చింది — భవిష్యత్తు అనిశ్చితమని, అది అలాగే జరుగుతుందని తెలిపేందుకే ఆ అనుభూతి కలిగించదన్నట్లుగా, ఆ అనుభూతి నిలిస్తే, కలుగబోయేది అమరత్వమేనని స్పష్టంగా వ్యక్తమౌతుంది.

CWM 11: 16-18

శక్తి బదిలీ జరుగు క్రియలో ఒక క్లిష్ట సమయం

నరముల మూలంగానే క్లిష్టసమస్య ఎదురవుతుంది. ఎందుచేతనంటే, నరములు అతి సహజమైన చేతనా సంకల్పానికి ప్రతిస్పందిస్తాయి. అది ఆగిపోయి కేంద్రస్థానమునుండే సూటిగా ఒక చర్య ఆదేశించబడితే ఒకవిదంగా ఉద్రిక్తతకు లోనవుతాయి — పిచ్చెక్కినట్లు,గా అటువంటి అనుభవమే నిన్న ఒక గంటకు పైగా కలిగింది. దాన్ని భరించుట కష్టమే కాని అది ఎన్నెన్నో విషయాలను బోధించింది. అదంతా శక్తిని బదిలీ చేయు క్రియ అని అనవచ్చు. పూర్వమున్న శక్తి వెనుకకు మరలిపోతుంది. నూతనశక్తితో శరీరమునకు అనుకూలత ఏర్పడేటంత వరకు గడచినసమయాన్ని క్లిష్టసమయమని పిలువవచ్చును. మొత్తము జీవకణ జాలము నిరంతర ఆకాంక్షతో నిండి ఉండుటవలన తులనాత్మకంగా పరిశీలిస్తే సమయం వేగంగా గడచిపోతున్న అనుభూతి కలుగుతుంది. నిమిషములు దీర్ఘమవుతాయి.

కాని జీవకణ జాలములో ఒక దృఢమైన విశ్వాసము కుదురుతుంది. ఏమి జరిగినా అదంతా దిశానిర్దేశశక్తి బదిలీ కారణంగానని మరియు ఈ పరిణామ ప్రక్రియ మూలంగా నవి అదంతా పదార్థరూపంలో బాధాకరము అయినా (భౌతికము కాకపోయినా పదార్థరూపం బాధాకరము) కణజాలము ఈ విశ్వాసమును సడ లించవు. ఆ పైన ఎటువంటి కృంగుపాటును అవకాశమీయువు, పైపెచ్చు ఆ బాధను అనుభవిస్తూనే ఎదిరిస్తాయి. ఇక యెట్టి ప్రభావమునకు లోను కావు. మార్గ నిర్దేశికశక్తి బదిలీ జరుగుతుంది, పరిమణామ క్రియ కొనసాగుతుంది అనే విశ్వాసముతో పరిణామము జరుగుటకు కావలసిన సంసిద్ధతను పెంచుకుంటుంది. నేను వివరించినట్లు నాడీమండలమునందు కలిగే అనుభూతి చాలా నొప్పిని కలిగిస్తుంది, ఎందుకంటే ఆ జీవకణములు అతి సున్నితమైనవి, తీవ్రమైన సంవేదనలకు గురి అవుతాయి. అయినా అతి చక్కని భౌతిక కంపనముల మేళవింపును అప్రయత్నంగా గ్రహించ గలిగే శీఘ్ర గ్రహణశక్తిని కలిగి ఉంటాయి. (కాని అట్టి స్థితి చాలా చాలా అరుదుగా తారసపడుతుంది. అది కొంతమందిలో మాత్రమే ఉంటుంది.)

ఇట్టి భౌతిక ప్రకంపనను భౌతిక శక్తి అనవచ్చును. చక్కటి ప్రకంపనముల భౌతిక సమ్మేళనము (సహజముగా ఏర్పడిన సమ్మేళనము మానసిక ప్రకంపనముల ప్రమేయం లేకనే పుష్పములనుండి వీచే ప్రకంపనల వంటిది.) ఈ ప్రకంపనలకు నరములు తీవ్రముగా స్పందిస్తాయి. అవి గ్రహించగలవు కూడా. ఆ విధంగా అవి సరిదిద్దబడతాయి.

CWM 11:20- 21

చేతనను భర్తీచేయుట — నూతన కార్యాచరణ

నేను వివరించిన చేతనను భర్తీ చేయు విషయము గురించి పద్ధతి ప్రకారము, నిరంతరము కొనసాగుతున్నది. కాని కొంత చెడుకూడా జరుగుతోంది, లేదా సామర్థ్యము చాలా వరకు కుంటుబడుతున్నది. కాని దృష్టి, వినికిడి విషయంలో ఇది ఒక వింతైన విధంగా జరుగుతున్నది. కొంతకాలం ఇది స్పష్టంగాను, మరికొంతకాలం మరుగున పడినట్లుగా వుంది. అందుకు మూలకారణం వేరే ఉన్నది. ఏదో ఒక ప్రభావం, అది ఏమై ఉన్నదో స్పష్టంగా తెలిసికొనటానికి

నాకు నెలలు పడుతుంది. సర్వత్రా వ్యాపించియున్న సాధారణ చేతనను (శిరస్సుపై ఒక సంజ్ఞ చేస్తారు) — విశ్వచేతన అని పిలువవచ్చు — (భూతల చేతన) ఒక్క నిముషమైనా అది ముందుకు కదల లేదు. ఒక్క నిమిషం అది అక్కడే ఆగిపోయింది... ఇది కార్య నిర్వహణలో ఒక వినూత్న తీరు. చాలా కుతూహలంగా వుంటుంది.

ప్రశ్న: జీవుల విషయంలోను, సంఘటనల విషయంలోను మీ అవగాహన మారిందా? అది మీరు గ్రహించే విధానంలో మార్పా?

జ: అవును మొత్తము మీద అంతే. అది అంతా చాలా వింతగా ఉంది. వాస్తవానికైతే ఉన్న సమయమంతా భౌతిక సత్తయొక్క చేతనను అభివృద్ధి పరచుటకే వినియోగింప బడింది. ఈ భౌతిక సత్త (శ్రీమాత తమ భౌతిక శరీరమును చూపిస్తారు.) వేరొక సత్తను గురించి రూపొందించబడినట్లు తోస్తోంది. తార్కాణాలున్నాయి. దీని ప్రతి స్పందనలు భిన్నంగా ఉంటాయి. దాని వైఖరి మరోలా ఉంది. ఈ ప్రపంచం దేనికీ ప్రతీకగా లేనప్పుడు, అర్థరహితంగా వున్నప్పుడు లక్ష్యం తెలియని పూర్తిగా ఒక ఉదాసీన స్థితిని నేను అనుభవించాను. ఆ తరువాత క్రమక్రమంగా ఒక కొంగ్రొత్త గ్రహణశక్తి ఉద్భవించింది. అది దారిలో ఉంది....

ఒక నూతన అస్తిత్వానికి దృఢమైన రూపం లోబడుతున్నది

...ఒక ఆకృతికున్న దృఢత్వము, బిరుసుతనము, నూతనసత్తయొక్క లక్షణాలకు మెత్తబడి లోనవుతున్నట్లు కనిపిస్తుంది.కాని మనకు తెలుసు, తొలి సంపర్కం ఎప్పుడూ విస్మయాన్ని కలిగిస్తుందని. తరువాత తరువాత ఈ శరీరము దానికి అలవాటు పడుతుంది. అది ఒక స్థితినుండి మరో స్థితికి బదిలీ కాబోతున్న క్షణంలో కొంత క్లిష్టత కనిపించే క్షణం. ఇది క్రమేపి ముందుకు సాగుతుంది. (మార్పిడి జరిగే కొన్ని క్షణాలు కష్టమే) ఎవరైనా అది ఒక నిరీక్షిత ఘడియ అని మాత్రమే చెప్పగలరు.

అలవాట్లన్నీ ఈ విధంగానే వమ్ముచేయబడతాయి. అన్ని క్రియలలోను అలాగే జరుగుతుంది. రక్తప్రసరణ, జీర్ణక్రియ, శ్వాసక్రియ మున్నగునవి. మార్పిడి జరిగే సమయంలో — ఒకటి తన స్థానాన్ని కోల్పోయి దాని స్థానే మరొకటి భర్తీ చేయబడుట కాదు. ఎందుచేతనంటే ఆ రెంటిమధ్య ఉన్నది ఒక

అస్థిరమైన స్థితి, అది కష్టతరము. సర్వకార్యములను సుసాధ్యము చేయగల గొప్ప విశ్వాసమున్నది — సర్వోన్నత ప్రభువుయొక్క ఉనికి యందు నిలిపిన విశ్వాసము, అచంచలమైనది, తేజోమయమైనది, స్థిరమైనది, మార్పు చెందని విశ్వాసమది, ప్రతి విషయాన్ని ఆ విధంగానే కొనసాగించేది.

CWM 11: 58

అనువాదం: డా. దామెర వెంకటేశ్వరరావు

దివ్యమానవుని అవతరణ

పృథ్వికి, మానవాళికీ ఒక నూతన చేతన

'జనవరి ఒకటి' న (1961 జనవరి 1 వ తేది) నిజంగా వింతైన ఘటన జరిగింది. అలా అనుభూతి చెందింది నేనొక్కదాన్నేకాదు, మరికొందరికి కూడా ఆ అనుభవం కలిగింది. అర్ధరాత్రి సమయం తర్వాత, నాకు సుమారు రెండు గంటల సమయంలో, ఈ అనుభూతి కలిగింది. అది చాలా భౌతికంగా అంటే బాహ్యమయినదిగా ఉంది, చాలా బాహ్యమయినది. చాలా ప్రకాశవంతంగా, సువర్ణకాంతితో ఉంది. చాలా దృఢంగా చాలా శక్తివంతంగా ఉంది, అయినప్పటికీ దాని స్వభావము సుస్మితము, సౌహార్ద్రిమూలయి, ఒక ప్రశాంతమయిన సంతోషం అయి ఉండి, వెలుగు, ఆనందములలోకి తెరుచుకొనడం వంటిది. అదొక నూతన సంవత్సర శుభాకాంక్ష లాంటిది.....

అదొక ఆనందం, మైత్రీ భావంతో నిండిన శక్తివంతమయిన ఒక చాలా మృదువైన, ధరహాస పూరితమయినది, ఔదార్య మయినది.

నాకు కావలసిన అనుభూతి, ఒక మహా వ్యక్తిత్వం, ఎంతో బృహత్తరమైనది. ఎందుకంటే దానిముందు ఈ భూమి చాలా చిన్నది. (చేతిలో ఒక బంతిని పట్టుకున్నట్లుగా భంగిమ) ఒక బృహద్వ్యక్తిత్వం, మానవాళికెంతో మేలు చేసేది, ఇందుకై వచ్చింది. (*శ్రీమాత తన అరచేతినుండి బంతిని పైకెత్తుతారు.*) అది ఒక వ్యక్తిగతమైన దివ్యత్వపు భావనను కలుగచేసింది. ఉపకారార్థమై వచ్చింది. ఎంతో దృఢంగా ఎంతో బలంగా ఉంటూనే మరెంతో సున్నితంగా అన్నింటినీ ఆలింగనం

చేసుకుంది. అది ఎంతో బాహ్యంగా ఉంది. శరీరం సర్వత్రా దానిని స్పృశించింది. (శ్రీమాత తన ముఖాన్ని చేతులతో స్పృశిస్తారు). అన్నిచోట్లా...

అది సంవత్సరారంభం. ఎవరో పరమాత్మవంటి పరిధి కలిగినవారు తమ శక్తి అంతటితో నిజంగా ఈ సంవత్సరాన్ని ఆనందమయం చేయటానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పినట్లుగా ఉంది... అది యిలా ఉంది.

అది అతిమానస వ్యక్తిత్వమా, అతిమానస దేహాలను కలిగిన వారందరిలో తనంతట తాను అవతరించబోతుందా?

అది ఎంతో తేజోమయంగా దరహాసపూరితంగా శక్తితో కూడి శ్రేయోదాయకంగా ఉంటుంది. సాధారణంగా మనుషులలో సౌహార్ద్రత కొంత బలహీనంగా ఉంటుంది. దానికి యుద్ధమన్నా పోరాటమన్నా యిష్టం ఉండదు. కాని యిది అలాంటిది కాదు. ఈ కరుణ తనను తాను బలవంతంగా విధించు కుంటుంది. (*శ్రీమాత పిడికిళ్ళను కుర్చీ చేతిపై ఉంచుతారు*) ఇది ఎంతో నూతన మవటం వలన, దృఢమైనది కావటంవలన నాకు ఆసక్తికరంగా మారింది.

ప్రశ్న: ఇది సిద్ధంగా ఉన్న దేహాలలో వ్యాపిస్తుందా?

అవును. నేనలాగని నమ్ముతాను. నాకొక భావన కలుగుతుంది. అది ప్రవేశించబోతున్నట్లు తనను తాను వ్యక్తం చేసుకోవాలనుకుంటున్నట్లు భావన కలుగుతుంది. అవే అతిమానస శరీరాలు లేదా వారే అతిమానస వ్యక్తులు కావచ్చు. తెలియదు. ఆ రెంటికి మధ్యస్థమయినది కావచ్చు, బహుశా అతి మానస మనీషి కావచ్చు. అది మానవరూపంలోనే ఉంది కానీ దివ్యపరిధులతో ఉండే మానవుడిలా ఉంది..

ఏ బలహీనతలు ఏ నీడలూ లేని మనిషి అంతా తేజస్సు, తోజోమయంగా నవ్వుతూ అదే సమయంలో మధురం గానూ ఉంది. అవును. అతిమానసవ్యక్తి అయివుండవచ్చు.

CWM 11:149-151

ఈ దేహానికొక బోధకుడు

దేహంలోపల ఒక చైతన్యముంది. అది చాలా అమూల్యమయినది. అది శరీరానికొక శిక్షణను ఇస్తుంది. అది ఏం చెయ్యాలో బోధిస్తుంది. అది ఎటువంటి

వైఖరిని కలిగి ఉండాలో ఎటువంటి ప్రతిస్పందనలను కలిగి ఉండాలో చెపుతుంది. మీకు చాలా సార్లు చెప్పాను, ఎవరి సూచనలు లేకుండా పరివర్తనా విధానాన్ని గుర్తించటం కష్టమని. అందుకు సమాధానంలా వచ్చింది. అది దేహానికి చెపుతుంది. ఈ వైఖరిని అవలంభించు, యిది యిలా చెయ్యి. అది అలా చెయ్యి అని. శరీరం అందువలన తృప్తిని పొందుతుంది. భరోసాను కలిగి ఉంటుంది. పొరపడటానికి అవకాశముండదు.

అది ఒక బోధకుడిలా వచ్చింది. చాలా ఆచరణాత్మకం. ఎంతో ఆచరణాత్మకం. "దీనిని నిరాకరించాలి. దానిని అంగీకరించవచ్చు, దీనిని సాధారణం చేయవచ్చు." యిలా అన్ని ఆంతరంగికమయిన కార్యాలను నిర్దేశిస్తుంది. ఎంతో భౌతికం కూడా కావచ్చు. కొన్ని ప్రకంపనలను ప్రోత్సహించమని చెపుతుంది. మరొక దానిని అటు మళ్ళించు అంటుంది.వేరొక దానిని దీనిని తొలగించు అని యిలా చిన్ని చిన్ని సూచలనిస్తుంది.

వాత్సల్యపూరిత సుహృద్భావ శక్తి, శాంతి

చాలా వింతగా మనిషి లోపాలు, గుణాలు, అన్నీ బాల్య చేష్టల్లా, అవివేకంగా అనిపిస్తాయి. చాలా విచిత్రంగా ఉంటుంది. అది ఒక ఆలోచన కాదు. అదొక పటిష్ఠ మయిన భావన, ఒక జీవంలేని పదార్థం. సాధారణ వస్తువులన్నీ నిజమైన ప్రాణం లేని పదార్థంలా ఉంటాయి. కృత్రిమంగా అసత్యంగా అనిపిస్తాయి. అది ఎంతో విచిత్రంగా ఉంటుంది. అది ఒక ఆంతరంగికమయిన శిక్షణ, ఎదుటివారిలో లేనిది. ఈ నూతన చేతన, ఈ నిజవైఖరి ఎంతో అద్భుతంగా, దృఢంగా, శక్తివంతంగా, నవ్వుతూ, శాంతియుతంగా ఉంటుంది. ఎంత నవ్వుతూ ఉంటుందంటే దానికి విసుగు కలిగించటం అసాధ్యం. నవ్వుతూ నవ్వుతూ అవలోకిస్తుంది.

(నిశ్శబ్దం)

ఈ నవ్యచేతన యొక్క ప్రత్యేకమయిన, విశిష్టమయిన గుణమేమిటంటే ఏదీ సగం సగం కాదు, ఏదీ కేవలం ఉజ్జాయింపుగా నుండదు. అదే దాని వైశిష్ట్యం అలాగే అది చేద్దాం, కొంచెం కొంచెంగా అనే ఆలోచనలేదు. అవును, లేదా కాదు, అంతే. చేయగలను, లేదా చేయలేను. నిజానికదొక వరం. సమయం వ్యర్థం కాకూడదు. అది చేయవలసిందే. ఈ అనంతమైన శక్తి అన్నిటికన్నా ఉన్న

తంగా ఎంతో ప్రేమతో కూడినది. ఎంతో నెమ్మదయినది.చెప్పటానికి మాటలు చాలవు. దానిని వర్ణించటానికి మాటలు లేవు. ఏదో చేయవలసిందల్లా మీ ధ్యాసను అటుగా మరల్చి ఉంచటమే. వెంటనే అక్కడ ఆనందం వెల్లి విరుస్తుంది. మనం బాధల మధ్యలో ఆనందాన్ని అనుభవించిన వారిని గురించి విన్నాం. ఇది అలాంటిదే. అదొక మహదానందం.

అదే యిది (మదర్ ఒక తెల్ల మందారాన్ని తీసి యిస్తారు. ఆమె దానికి 'దైవకృప' అని నామకరణం చేసారు.)

CWM 11: 156-60

అనువాదం: డా. సరోజా ప్రసాద్

శ్రీమాత నూతన శరీరము

ముక్తి భౌతికమైనది

ఎన్నడూ, ఎన్నడూ, ఈ శరీరం ఆ విధంగా అనుభూతి చెందలేదు. దానికి తోడు, ఈ శరీరం కొన్ని గంటలు చాలా క్లిష్టమైన స్థితిలో వుండింది.... ఆ తరువాత అంతా తానే అయింది. ప్రతి ఒక్కరూ ఒక ప్రకాశించే జ్యోతివలె పసివానివలె నవ్వుతూ ఆ ప్రభువు "నేను సర్వత్రా ఉన్నాను, అన్నింటా ఉన్నాను చూడు" అని చెపుతున్నట్లుగా ఉంది. అది నమ్మ శక్యం కానిది. నమ్మలేం... కాని ఆ రెండు స్థితుల మధ్య సంబంధం లేదు.

సరే, అది శరీరం ఈ విధంగా చెప్పుతున్న సమయం. "ఎలా ఉంది? ఇది ఇంకా ఇలా కొనసాగడం అవసరమౌతుందా? ఎవరైనాసరే తప్పక ఇది కొనసాగించాలా? ఈ ప్రపంచం ఈ మనుషులు, ఈ సృష్టి మొత్తం దీన్ని కొనసాగించాలా?...." అది కనిపించగానే... అంతా ఒక్కసారి అర్థం చేసుకున్నాను. ఆహా! దీనినే వాళ్ళు శాశ్వత నరకంగా అనువదించారు. ఇదే అది. ఎవరికో ఇది గ్రాహ్యామైంది.

దాన్ని చేరే మార్గాలన్నీ — ఏవైతే కృత్రిమమైనవిగా పిలువబడతాయో నిర్వాణంతో సహా అందులోంచి బయటపడాలనుకునే పద్ధతులన్నీ ఏమాత్రం

విలువలేనివి. తనని తాను చంపుకునే తెలివిహీనునితో మొదలు పెట్టి (నిజానికి ఇది అత్యంత బుద్ధి హీనత, అతడి స్థితిని మరింత పాడుచేస్తుంది.) నిర్వాణం దాకా (ఎక్కడ తాను తప్పించుకుంటుంటానని అనుకుంటాడో) అంతా విలువ లేనిది. అవన్నీ భిన్నస్థాయిలు, కాని ఏ విలువా లేనివి. ఆ తరువాత నీకు నిజంగా ఆ నరకం యొక్క అనుభవం కలిగినపుడు ఒక్కసారిగా (అది చైతన్యం యొక్క ఒక స్థాయి, అది తప్ప మరేంకాదు.) ఒక్కసారిగా వచ్చిన ఓ చైతన్య స్థితి... అందులో అంతా ప్రకాశం, వైభవోపేతం, సుందరం, ఆనందం, మంచితనం... ఇంకా వర్ణించలేనివెన్నో. అది అలా ఉంటుంది. "అక్కడ, అక్కడ నీవున్నావు." ఆ తరువాత ఫట్. అది కనిపించింది. వెంటనే ఎగిరిపోయింది. అప్పుడు చూసిన ఆ చైతన్యం తన్ని తాను సుస్థిరం చేసుకుంటూ చెప్తుంది. "ఇప్పుడు మరో అడుగు, ఇంకొక అడుగు." అందుచేత ఇది అదే. అది అంతటి ఉనికితోనే ఈ శరీరం ఆ బాధననుభవించింది. మొత్తం జీవితంలో ఇంత బాధ నెప్పుడు అనుభవించ లేదు. ఇప్పుడు కూడా...

అదే, అదే తెరవబడె మార్గమా. నాకు తెలీదు. కాని ముక్తి అనేది భౌతికం. మానసికమైనది కానేకాదు. కేవలం భౌతికం. నే చెప్పేదాని అర్థం అది, తప్పించుకొని పారిపోవడం కాదు. అది ఇక్కడే వుంది. ఈ శరీరంలోనే ఈ బలమైన అనుభవాన్ని పొందాను.

CWM 11: 179

దైవం ద్వారా మాత్రమే జీవించడానికి ఈ శరీరం తర్ఫీదు పొందింది

ఈ శరీరం వరకు, అది కేవలం దైవం ద్వారా జీవించడానికి అలవాటు పడింది. దైవంమీద ఆధారపడి జీవించడానికి అన్నింటికి ఏ ఒక్క మినహాయింపు లేకుండా. చైతన్యం, సాధ్యమైనంతవరకు దివ్యచైతన్యంతో అనుసంధానమైనప్పుడు అస్తిత్వంయొక్క జ్ఞానం కలుగుతుంది. ఇప్పుడది అతి విశిష్టమైన గాఢత నొందింది. భౌతిక స్థితి మార్పు చెందినప్పుడు అదిచాలా ఘనపదార్థంగా ఉంటుంది. తెలుసా, అది కదలదు, సంపూర్ణంగా ఉంటుంది, ఎంతో యదార్థమైనదిగా ఉంటుంది... దైవంలో (దివ్య అస్థిత్వంలో) ఉండడానికి, దైవంద్వారా దైవంలోనే వసిస్తూ, ఉండడానికి .... మరియు చైతన్యంలో ఉండడానికి (సాధారణ

చైతన్యంలో కాదు. మానవచైతన్యంలో)అది ఎంత ఎక్కువగానంటే మరోదానిని పోల్చి చూస్తే, అది మరణంవలె అనిపిస్తుంది. అంటే భౌతిక సాక్షాత్కారం నిజంగా ఒక స్పష్టమైన సాక్షాత్కారం.

అక్కడ ఒక శక్తి కేంద్రీకృతమవడం ప్రాంరంభమైంది. ఓహ్! ఇది ఇంకా అది కాదు. దానికి బహుదూరమైనది. అది ఏ విధంగా ఉంటుందో అన్న గ్రాహ్యత ప్రారంభమైంది. అవును.... అది నిజంగా అద్భుతం. అది అత్యంత శక్తివంతం! అది ఎంతశక్తివంతము మరియు చైతన్యంలో వాస్తవము అనగా మరేదీ ఆ విధంగా ఉండదు. ప్రాణిక మానసికమైనవన్నీ మసకగా, అనిశ్చితంగా కన్పిస్తాయి. అది చాలా ఘనమైనది (శ్రీమాత *చేతులు గట్టిగా కలిపి పట్టుకుంటారు*). చాలా శక్తిమంతం. ఇంకా పరిష్కరించవలసిన సమస్యలున్నాయి. కాని వాటిని ఆలోచనతో, మాటలతో, పరిష్కరించలేం. ఈ విషయాలన్నీ ప్రయోగాత్మకంగా చేసి చూపడానికే వస్తున్నాయి. వ్యక్తిగతమైనవేకాదు, చుట్టుప్రక్కలున్నవన్నీ, మనుషులు, పరిస్థితులు, ఇదంతా ఈ శరీరానికి నిజమైన చైతన్యం గురించి బోధించడానికే వస్తున్నాయి. అది చాలా... అద్భుతం. (శ్రీమాత *అంతర్ముఖమవుతారు*). ఏదైతే అభివ్యక్తి కావాలని కోరుతుందో ఆ శక్తిని భరించగల ఒక భౌతిక వాహికను సృష్టించుకోవటమే సమస్యగా కనిపిస్తుంది. సామాన్య శారీరక చైతన్యాలన్నీ తనంత తాను అభివ్యక్తం కానున్న ఆ మహత్తర శక్తిని భరించలేని బలహీనమైన నాజూకైన చైతన్యాలు. అందువల్ల శరీరం తనకు తాను శిక్షణ నిచ్చుకునే క్రమంలో ఉంది. మరియు అది నీకు తెలుసా, అది ఒక్కసారిగా అద్భుతమైన అత్యద్భుతమైన భూమ్యాకాశాలు కలిసినట్లు కనిపించే వలయరేఖను గ్రహించినట్టు ఒక మహత్తర అద్భుతంగా తాను భరించగలిగినంతవరకు కొనసాగింది. దానికణుగుణమైన పద్ధతి అవసరం. ఆ మార్పు ... పూర్తి మార్పులో....

అది సరిపోయినంత మృదుత్వం కలిగి ఉందా? నాకు తెలియదు. అది మృదుత్వం గురించిన ప్రశ్న. శ్రీమాత పైనుంచి వస్తున్న ఆ శక్తిప్రవాహాలను తన ద్వారా బయటకు వెళ్ళనిస్తూ, ఏ అవరోధం లేకుండా ప్రసరింపజేస్తూ అభివ్యక్తి కాబోతున్న శక్తి అవరోధం కలిగించకుండా వుండాలి.

CWM 11:269

స్థూలరూపం కరిగిపోవడం

ఈ పైకి కనిపించే రూపవిధానాలు భవిష్యత్తులో కలిగే ఫలితాలు. అందువల్ల... వాటి ఆకృతి మార్పుచెందడం చిట్టచివరి ఘట్టం.

అవును, నేనూ మారను (ఆకృతిలో)... నేనిలా ఉన్నాను (నుదుటిని చూపిస్తూ సంజ్ఞ): ఏం లేదు, ఏం లేదు, అంతా శూన్యం, శూన్యం, శూన్యం.... అక్కడ (పైకి వ్యాపించినట్లుగా చూపుతూ), అది — అవును అది ఓ సువర్ణ విస్తృతి.

(నిశ్శబ్దం)

నాకు ఓ వింతైన అనుభవం కలిగింది.... అది పైన కప్పబడిన గట్టి పెంకు లేదా చెట్ల బెరడు, లేదా తాబేలు యొక్క పైగుల్ల కరిగిపోతున్నట్టుగా, మరియు శరీరం కూడా ఈ విధంగా లేదు. (శ్రీమాత అంతా తెరుచుకుంటున్న సంజ్ఞ చేస్తారు. ఈ శరీరం ఆ సూర్యుని వైపు పగిలి బయటకొచ్చినట్టు). మనిషికి పదార్థంగా కన్పించేది.... ఘనరూపంలో ఉన్న ఈ భౌతిక తొడుగు పడిపోవాలి, ఎందుకంటే అది గ్రహించదు కాబట్టి. ఈ శరీరంలో, ఇక్కడ (శ్రీమాత తన చేతి చర్మాన్ని స్పర్శిస్తారు) అది ప్రయత్నిస్తుంది (బయటకు తెరుచుకున్న... అదే సూచన). ఓహ్! అది చాలా వింత, ఓ వింతైన సంవేదన. ఈ స్థూలవస్తువు కరిగిపోవడానికి చాలినంత సమయం దాన్ని భరించి నిగ్రహించగల్గితే, అప్పుడు నిజానికి, నిజమైన ప్రారంభమవుతుంది.

CWM 11:269-71

నీవేది సంకల్పిస్తే, నీవేది సంకల్పిస్తే

నేనిలా చెప్పవచ్చు: శరీరంలోని జీవకణాలు, దైవం యొక్క వ్యక్తరూపాలేనని భావించేదాకా, ఒక్క దైవం నించి మాత్రమే సహాయం అందుకొనడానికి ప్రయత్నించాలి. ఇదే నిజానికి ప్రస్తుత అనుభవం. ఈ స్థితిలో మార్పు యొక్క ఫలితం గురించి నాకున్న అనుభవం, అది మానసికమైనది కాదు, అందువల్ల దానిని మాటల్లో చెప్పలేను. కాని నిజంగా జీవకణాలు సంవేదన పొందడం ప్రారంభమైంది. మొట్టమొదటిగా అవి పూర్తిగా దైవపరిపాలనలో ఉన్నట్టు (ఇది... నీవేది సంకల్పిస్తే

అన్నదాని ద్వారా అనువదించబడింది). ఈ స్థితి, ఆ తరువాత ఓ రకమైన గ్రాహ్యత (ఎలా చెప్పాలి?) చలనం లేనిది కాదు, బహుశ. చాలా నిదానమైనది — బహుశ నిదానమైన గ్రహణశక్తి, (శ్రీమాత నవ్వుతు, చేతులు తెరుస్తారు) దాన్నెలా వివరించాలో నాకు తెలియదు.

మాటలన్నీ అసత్యాలే, కాని ఒక్కటి చెప్పవచ్చు: "ఉన్నది నీ ఒక్కడివే" — అవును, కణాల సంవేదన "ఉన్నది నీ ఒక్కడివే" అన్నది మాత్రమె. అవును, అది ఆలాంటి అనుభూతే, కాని అదంతా ఈ మాటల్లో పెట్టినపుడు ఈ వస్తువు మరింత గట్టిపడుతున్నట్టుగా ఉంది — మాటలు అనుభవాన్ని గట్టిపరుస్తాయి. అక్కడ ఓ రకమైన మృదుత్వం లేదా ఓ మెత్తదనం (ఓ నమ్మతగ్గ, చాలా విశ్వసించగల మెత్తదనం): "నీవేది సంకల్పిస్తే, నీవేది సంకల్పిస్తే"

(నిశ్శబ్దం)

ఓ నిర్దుష్టమైన దృక్పథంలో (దానిని వివరించడం లేదా నిర్వచించడం కష్టం), అంతా దివ్యమైనదే అవుతుంది. అక్కడ అద్భుతం ఏమిటంటే ఎవరికైనా అంతా దివ్యమయం అవుతున్న అనుభవం కలిగితే, దానికి వ్యతిరేకమైనదంతా చాలా సహజంగా మాయమవుతుంది, వేగంగానో లేదా నిదానంగానో, ఒక్కసారిగానో, లేక కొంచెం, కొంచెంగానో, విషయాలను బట్టి. అది నిజానికి అద్భుతం. అనగా, అంతా దైవం అన్న ఎరుకతో ఉండడం, అంతా దివ్యమయం కావడానికి చాలా మంచి పద్ధతి — అది దాని అన్ని వ్యతిరేకతలని నిర్మూలిస్తుంది.

CWM 11: 273-74

ఈ శరీరం పూర్తిగా దైవప్రభావితం

...సగం, సగంగా లేదు, రాజీ లేదు, సందిగ్ధంగా లేదు, కాదు, అది కాదు. అది ఇది (శ్రీమాత తమ పిడికిలిని క్రిందికి తెస్తారు)

ఈ శరీరానికి ఆ విధంగా ఉంటుంది, ప్రతి నిముషం, ఒక అనివార్య పరిస్థితి. అది జీవితం లేదా మరణం. అంతేగాని అనిశ్చితంగా సాగిన ఉజ్జాయింపు కాదు. శతాబ్దాలుగా అది పూర్తిగా మంచీ కాదు, లేక పూర్తిగా చెడ్డా కాదు — ఇకపై అలా ఉండదు.

అతిమానస శరీరం ఎలా రూపొందించబడాలో, ఆ మార్గం ఏమిటో శరీరానికి

తెలుసు. అది పూర్తిగా దైవప్రభావితమై వుండాలి. రాజీకి తావు లేదు. సందిగ్ధత లేదు. "అది వస్తుందిలే" అన్నదికాదు. అది ఇలా ఉంటుంది. (శ్రీమాత పిడికిలి క్రిందకు తెస్తారు) ఓ అసాధ్యమైన సంకల్పం.

కాని... ఈ విషయాలన్నీ శ్రీఘ్రంగా జరగడానికి అది ఒక్కటే దారి.

ఆ కాలమంతా నీవు జీవన్మరణాల మధ్య కొట్టుకొంటున్న అనుభవం ఉంటుంది. అయితే నీవు సరియైన వైఖరి అవలంభించిన క్షణం నుండి దానికి సంబంధించిన శరీరంలోని భాగం సరైన దృక్పథం తీసుకొన్నప్పుడు అంతా సవ్యంగా సాగుతుంది. అతి సహజంగా, సులభంగా సవ్యంగా సాగుతుంది. అది ఆశ్చర్యకరమైన విషయమే కాని అందులో ఒక నిరంతరంగా సాగే ప్రమాదం, ఉండవచ్చేమో నాకు తెలియదు. రోజులో ఓ వందసార్లు ఓ భావం, జీవ కణాల్లో వుంటుంది, సజీవంగా కొనసాగాలా. భాగాలుగా విడిపోవడమా అన్నది. వాటికి సంకోచం చెందే అలవాటు మామూలయినప్పటికీ, అవి ముడుచుకుపోకుండ ఉండగలిగితే, అంతా సవ్యంగా జరుగుతుంది. కాని అవి నేర్చుకుంటున్నాయి.... (స్వీయసమర్పణా సూచనగా శ్రీమాత చేతులను తెరుస్తారు.) అప్పుడంతా బాగానే ఉంటుంది. బలవంతంగా ఈ శరీరానికి ఓ రకమైన శాశ్వతత్వం నేర్పించి నట్టుగా వుంటుంది. ఇది నిజంగా ఆసక్తిదాయకమైనది. అప్పుడు నా దృష్టికి బాహ్య పరిస్థితులు భయాన్ని కల్గిస్తున్నాయనిపిస్తుంది. (సామాన్య దృష్టికోణంలో చూసినపుడు)....

... ఆ విషయం జరక్కుండా అడ్డుకున్నది మనమే. ఆ శక్తి కార్యాచరణకి స్వయంగా మన నియంత్రణే అవరోధంగా ఉన్నట్టుగా, ఎవరైనా తప్పక... (శ్రీమాత చేతులు తెరుస్తారు).

నిశ్శబ్దం

ఇది నా నమ్మకం. తన నియంత్రణలో ఉంచకపోతే, అంతా పొరపాటుగా జరుగుతుందని విశ్వసించే అధోచేతనయొక్క విధానమది అని నేను నమ్ముతాను. అది నా అభిప్రాయం. ఆ విషయం, అదే చెప్తోంది "ఆహా, నీ రక్షణలో నువ్వుండు, జాగ్రత్తపడు".... (శ్రీమాత చేతులు తెరుస్తారు).

CWM 11: 297-300

మొదటిసారిగా, వేకువజామున, నన్ను నేను చూసుకున్నాను. నా శరీరం — అది అతిమానసశరీరమో, కాదో నాకు తెలీదు. లేదా మార్పును పొందుతున్న శరీరమా (ఎలా చెప్పాలి) కాని నాకు అంతా కొత్తదైన ఒ శరీరం వచ్చింది. దానికి లింగభేదం లేదు. అది స్త్రీ కాదు, పురుషుడు కాదు. అది చాలా తెల్లగా ఉంది. అయితే, నా చర్మం తెల్లగా ఉండడంవలన కావచ్చు. కారణం తెలియదనే అనుకుంటున్నాను. అది చాలా నాజూగ్గా ఉంది. (నాజూకు తనాన్ని సూచిస్తూ సూచన) అది చాలా అందంగా ఉంది. నిజంగా ఒక పొందికైన ఆకృతి. ఆ విధంగా అది మొదటిసారి, నా కస్నులు తెలీదు. అదెలా ఉంటుందోనన్న ఆలోచన లేదు. ఏమీ లేదు. నేను చూశాను. నేనలా ఉన్నాను, నే నిలా తయారయ్యాను.
CWM 11: 301

ప్రశ్న: ముందురోజున నీ శరీరం యొక్క దర్శనం గురించి చెప్పావు. ఈ మార్పు చెందుతున్న శరీరం....

అవును, కాని నేనలా ఉన్నాను. అది నేనే. నన్ను నేను అద్దంలో చూసుకోలేదు. నన్ను నేను ఆ విధంగా చూశాను. (*శ్రీమాత ఆమె శరీరంవైపు చూడడానికి తల వొంచుతారు*) నేను ..... నేను ఆ విధంగా ఉన్నాను.

అది మొదటిసారి. అది ఉదయం నాలుగు గంటలు అని నాకు గుర్తు. అది చాలా సహజంగా మారింది. నేను అద్దంలో చూడలేదు. నేను మామూలుగానే ఉన్నాను. నేను ఏం చూశానో, అదే జ్ఞాపకం ఉంది. (*ఛాతీనుంచి నడిమి భాగం వరకు సూచన.*) నాపై ఒక ముసుగు వుంది. అందువల్లనే నేను ఒక్క మధ్య భాగాన్నే చూశాను. అది ఛాతీనించి నడుము వరకు చాలా భిన్నంగా ఉంది. అది స్త్రీ కాదు. పురుషుడుకాదు.

అది చాలా అందంగా ఉంది అది చాలా సన్నగా, నాజూగ్గా ఉన్నరూపం. అలా అని మరీ పుల్లలా లేదు. ఆ చర్మం చాలా చాలా తెల్లని తెలుపుగా ఉంది. అది నా చర్మం రంగులోనే వుంది. అది చాలా అందమైన ఆకృతి. కాని దానికి లింగభేదం లేదు. అది స్త్రీ అని, పురుషుడని చెప్పడం కుదరదు. లింగం అంతరించింది. అక్కడ (*శ్రీమాత ఛాతీ చూపిస్తూ*) ఏమీ లేదు. అదెలా చెప్పాలో

తెలీటం లేదు. అక్కడ కేవలం ఒక పోలిక వుంది కాని ఏ ఆకృతి లేదు. (శ్రీమాత ఛాతీని స్పర్శించారు) మగవారికున్న మాత్రంగా కూడా ఏమీ లేదు. చాలా తెల్లనిచర్మం, అంతా ఒకే సమానంగా ఉంది. పొట్టకూడా లేదు. అంతా చాలా నాజూగ్గా ఉంది. సరే, నేను మరీ ప్రత్యేక శ్రద్ధ కనబరచలేదు. ఎందుకంటే, నేన లానే ఉంటాను. అది చాలా సహజం అనిపించిది .

అదెలా ఉందన్నది మరింత ఉత్కంఠతో చూడలేదు. ఎందుకంటే అది చాలా సహజంగా ఉంది. అందువల్ల నేను వివరంగా వర్ణించలేను. మామూలుగా చెప్పా లంటే అది స్త్రీ యొక్క శరీరం కాదు., పురుషుని శరీరంకాదు, అన్నది స్పష్టం. మరి దాని బాహ్యరూపం, కనిపించే రూపం చాలా యవ్వనంతో వుంది. మానవ స్వరూపంతో ఒక విధమైన పోలిక ఉంది. (*శ్రీమాత గాలిలో ఓ చిత్రం గీస్తారు.*) భుజాలు, ఆకారం ఉన్నాయి. ఆకృతిలో పోలిక ఉంది. నేను దాన్ని చూశాను. కాని నన్ను నేను చూసినట్లుగా చూశాను. నేను ఆచ్ఛాదనకోసం ఓ రకమైన ముసుగును ధరించివున్నాను. అది ఒక భిన్నమైన రూపం, అయితే అది నా కాశ్చర్యంగా లేదు, అది చాలా సహజమైన అస్తిత్వం.

CWM 11: 303-04

ప్రశ్న: దయచేసి నన్ను నీ నూతన శరీరంలో చూడనిస్తావా? నీ సహాయంతో అది సంభవం కాగలదని నేను భావిస్తున్నాను.

సహాయం ఎల్లవేళలా ఉంటుంది. కాని అది గాఢతరం అవుతుంది. ఎందుకంటే నీవు చాలా సుదీర్ఘకాలం వేచివుండడానికి తయారుగా ఉండాలి.

ప్రశ్న: నేను నిన్ను నీ నూతన శరీరంలో చూడాలని చాలా ఇష్టపడుతున్నాను. అప్పటి వరకు నీ విచ్చిన దాన్ని గ్రహించి, దానిని నాలో ఇముడ్చుకోగల సమర్థతను ప్రసాదించు.

నువ్వు అడిగేదాని అర్థం బహుశా నా నూతన ఆకృతిగురించా, లేదా నా రూపాం తర శరీరం గురించా!

ఎందుకంటే, నూతన శరీరంకోసం ఆ ఉన్న శరీరాన్ని వదిలివేయకుండా, కనీసం కొంతభాగమైనా నా ప్రస్తుత చైతన్యాన్ని వదులుకోకుండా నేను ప్రవేశించ గల ఏ ఒక్కరి సంపూర్ణ సజీవ శరీరం గురించి నాకు తెలియదు.

ఇది నిజానికి కొంతవరకు వేగవంతమైన పద్ధతి, కాని ఎంతో సంపూర్ణత,

ఉత్సాహంతో పనిచేసే ఈ శరీరం జీవకణాలకు న్యాయం చేయడమె కాదు. అవి ఎంతో ఇష్టపూర్వకంగా ఈ రకమైన రూపాంతర ప్రక్రియకు సమర్పించుకున్నాయి.

ఏది ఏమైనా నీకు నేను ముందే చెప్పినట్లుగా, నీవు దాని కోసం నా జన్మ దినాలు గడచిపోవడానికి సుదీర్ఘకాలం వేచివుండాలి. అది చాలా మంచిదే. దాన్ని నేను పూర్తిగా ఆమోదిస్తాను.

CWM 13: 58

ప్రశ్న: కాని శ్రీమాతా, ఆ ప్రకాశించే ఉజ్జ్వల శరీరాన్ని, ఆ రూపాంతర శరీరాన్ని చూడాలని మేం కోరుతున్నాము.

దానికి తగ్గ పరిసరాలు, జీవన స్థితులుండాలి. ఆ అభివ్యక్తిని ఆకాంక్షించె కొందరు వ్యక్తులుండాలి. సత్ సంకల్పంతో ఉన్న వ్యక్తులు, మనుషులు, అభివృద్ధిని సాధించగలిగే వాతావరణం రూపాంతరం ఆకాంక్షించే మనుషులు, అత్యంత సహజమైన సహాకారం, సమగ్రత మరియు శాంతిని ఆకాంక్షించే వారుండాలి. అలాంటి స్థితులున్నప్పుడు నేను అవరోహణ కాగలను. ఇదే ఇక్కడ కొరవడింది. ఇక్కడ ఏ ఒక్కరైనా, నాకు అహంకారం లేదని తాము సంపూర్ణంగా దైవం కోసమే వున్నామని చెప్పగలరా? వారున్నారా, మీరే చూసుకోకుండా సంపూర్ణ సమర్పణ గావించ గలవారున్నారా? ఒక్కరైనా వున్నారా? ఇంకా లేరు. నేను వేచి వుంటాను.

అదెప్పుడు చేయగలమో చూద్దాం, అందుకు వేచి ఉందాం. చూద్దాం ఆ పరాత్పరుడు ఈ క్రిందికి వచ్చి, ఓ రోజు ఇక్కడ ఆమె అభివ్యక్తి కాబోయే రోజును చూస్తాం.

Blessings of the Grace, pp. 26-27

దివ్యహస్తాలు మోస్తున్న పసిపాప

ఇప్పటికి రెండు లేక మూడు రోజులై ఉంటుంది. నాకు సరిగా జ్ఞాపకం లేదు. చాలా ఎక్కువ బాధ కలిగింది. ఆ తరువాత నాకు నేను దివ్యహస్తాల్లో ఉన్న పసిపాప వలె అనుభూతి చెందాను. ఆ విధంగా నుండింది. అర్థమయిందా. దైవం చేతుల్లో నున్న పసిపాపలా ఉండింది. (సంజ్ఞ) కేవలం దివ్య ఉనికిలో ఆ

విధంగా వున్నాక ఆ బాధ మాయమయింది. ఆ బాధ పోవాలని కూడా ఆశించ లేదు! అదే పోయింది! కొంచెం సమయం పట్టింది, కాని తొలగిపోయింది...

నాకు సంపూర్ణగా దైవంయొక్క పొత్తిళ్ళల్లో ఉన్న (సంజ్ఞ) అనుభూతి కల్గింది. అసాధారణమైన అనుభూతి కలిగింది.

(నిశ్శబ్దం)

సరే, కొంత సమయం ఆ విధంగా వుంటుంది. నీ సంకల్పమే, నీ సంకల్పమే, అన్న భావం, ఆ తరువాత అది కూడా నిశ్శబ్దంలోకి జారిపోయింది. (శ్రీమాత సమర్పణైన భావంతొ చేతులు తెరచిపైకి చూపుతారు)

ప్రశ్న: మారాల్సింది ఏకాగ్రతా విధానం కదా?

అవును.

....నిజంగా అది ఒక పసిబిడ్డయొక్క స్వీయ అశక్తతా భావన. నీ కర్థమైందా? కాని అది "ఆలోచించి చేసినది కాదు, సంకల్పించినది కాదు." అది స్వయం ప్రేరకం. అక్కడనించి నీవు మరో స్థితికి వెళ్తావు... (శ్రీమాత ఓ ఆనంద పారవశ్య దరహాసంతో చేతులు తెరిచారు.) ఎవరో సంకల్పిస్తారు, ఎవరో నిర్వర్తిస్తారు, అనే భావన ఉన్నంతవరకు అది నిరుపయోగం అవుతుంది.(అదే సంజ్ఞ, నవ్వుతు చేతులు తెరిచి)

CWM 11: 294-95

అనువాదం: డి. సత్యవాణి

జరిగిందంతా మన మంచికే! ఇక ముందు ఇంతకన్న బాగా జరుగవచ్చు కూడా.

శ్రీమాతయొక్క దేహత్యాగం ఈ ప్రపంచాన్ని రూపాంతరీకరించటం కోసమే అనేది స్పష్టం. అసలు మానవదేహంలోని ప్రతి అణువు దివ్యత్వాన్ని సంతరించుకోటానికే అనేది కూడా స్పష్టమే. శ్రీమాతారవిందులు దీన్ని నిర్ద్వంద్వంగా నిరూపించారు కూడా. 'సత్యచేతన' అత్యంత ప్రకాశవంతమైన 'అతిమానస' సిద్ధిని ఆవిష్కరించటానికే. అందుకే ఆమె తన స్థూల భౌతికకోశం వదలి వెళ్ళారని అనుకోవచ్చు. ఒకసారి శ్రీమాత, "ప్రస్తుతపు సవాళ్ళను ఎదుర్కొనే శక్తి సంతరించుకోవటానికే అలా జరుగుతుందని" సూచనప్రాయంగా ప్రస్తావించారు కూడా!

శ్రీఅరవిందులు దేహత్యాగం చేసిన తరువాతనే వారు అత్యంత శక్తిని సంతరించుకున్నారనీ, ఆ విధంగా అవశ్యం జరుగవలసి ఉన్నదనిన్నీ శ్రీమాత సెలవిచ్చారు. శ్రీఅరవిందులు దేహత్యాగం ప్రత్యక్షంగా కనపడే పదార్థ భావనయే అని అన్నారు. శ్రీమాత మన మధ్య ఇప్పుడు లేకపోవటం కూడా అటువంటిదే మరి!

ఏమో! శ్రీమాత మన మధ్య భౌతికంగా లేరని ఎందుకు భావించాలి? వారి 'అతిమానస' దేహం అప్పటికే సిద్ధించిందని, ఆ దేహం ఆమె మన కొరకే ధరించిందని మనకు తెలుసు. ఆమె భౌతిక కాయంతో ఈ మధ్యన జరిపిన పోరాటం దేహాన్ని అతిమానస కాయంగా మార్చుకునే ప్రక్రియలో భాగమేమో! భౌతిక కాయంతో వారు చెయ్యగలిగినదంతా చేశాక దాన్ని 'అతిమానస దేహం' గా మార్చుకోవటానికి ఇలా చేయాల్సివచ్చిందేమో! అది భవిష్యత్తులో ఆవిష్కరించవలసిన 'అతిమానస' శరీరధారణకు సాంద్రమైన ఈ స్థూలదేహం పనికి రాదేమో!

"అంతా మన మంచికే" అని కేవలం అనుకుంటే చాలదు. "రానున్నది ఇంకా మంచిగా వుంటుంది" అని కూడా మనం అనుకోవాలి.

The Mother Past, Present, Future by Amal Kiran: 16-18

శ్రీమాత దేహత్యాగం: ప్రస్తుత అవసరాలు, రాబోయే ఫలితాలు:

మే నుండి నవబంరు వరకు శ్రీమాత భౌతికం నుండి కొద్ది కొద్దిగా విముక్తు రాలు అవుతూనే వున్నారు. ఈ ఆరునెలల్లో ఆమె ఎక్కువగా సూక్ష్మభౌతిక తాదాత్మ్యంలోనే కాలం గడుపుతూ వున్నారు. సూక్ష్మభౌతికాన్ని స్థూలభౌతికం లోనికి తీసుకురావటానికి ఆమె ప్రయత్నిస్తూనే వున్నారు. ఆ విధంగా భౌతికాన్ని ఆధ్యాత్మిక ప్రభావంతో రూపాంతరీకరించాలనేదే వారి ప్రయత్నం. నెమ్మది నెమ్మదిగా ఆ ప్రయత్నం కొనసాగుతూనే వున్నది. అదే విధంగా ఆ సమయం లోనే భౌతికాన్ని క్రమేణా విడిచిపెట్టే ప్రయత్నం కూడా సాగిపోతూనే వున్నది. అది చివరకు విజయవంతమై వారు స్థూలదేహం వదలి సూక్ష్మదేహంలో ఇపుడు న్నారు. ఇది యదార్థము.

మార్చి 1972 లో శ్రీమాత యొక్క 'అతిమానస' దేహం వారి స్థూలభౌతిక దేహంలో ప్రవేశించేందుకు సూక్ష్మభౌతికం నుండి ఎదురుచూస్తూ వున్నది. ఆ 'అతిమానస ప్రభావితమైన' ఆమె స్థూల భౌతికంలో వారు ప్రదర్శించిన వారి అనుభవాలను గురించి నేను వివరించియే యున్నాను. క్రమంగా వారి భౌతికం లోనికి ప్రవేశించిన ఆ అతిమానస అవతరణే వారి దేహత్యాగానికి దారి తీసింది.

కొన్నాళ్ళు శ్రీమాత స్థూల, సూక్ష్మ దేహాల మధ్య విహరించారు. నెమ్మదిగా ఆ అంతరం తొలగి వారు స్థూలాన్ని త్యజించి అతిమానస సూక్ష్మరూపంలో ప్రస్తుతం మన మధ్య ఉన్నారు. అంతే కాదు, ఆమె ప్రస్తుతం మన యోగానికి గురుస్థానంలో ఉంటూ సూక్ష్మభౌతికంనుండి మార్గనిర్దేశనం చెయ్యటమే గాకుండా అవసరాన్ని బట్టి దృశ్య, స్పర్శ్యానుభూతులను కూడా మనకు కలి గించటానికి సిద్ధంగా వున్నారు.

ఈ విషయంలో మనకు నిర్ధారణ కావాలంటే వారి సమాధి సందర్భంగా శ్రీమతి లలితగారు వివరంగా తెలిపిన అనుభవాలను గుర్తు చేసుకోవలసిందే.

"ఆ క్షణంలో మీరు (శ్రీమాత) తెర వెనుక నుండి కన్పడ్డట్టుగా ప్రత్యక్షమై నారు. మీ దుస్తులు లేత బంగరు రంగులో మెరసిపోతున్నవి. ధగద్ధగాయమైన ధవళ కాంతులతో మీలో యవ్వన సౌందర్యం ఉట్టిపడుతున్నది. ఆ వెలుగు మీ శిరసు చుట్టూ వలయాకారంలో పరివేష్టితమై వర్ణించ నలవి కానట్లుగా వుందని

పించింది — అది మీ కటి ప్రదేశం దాకా కూడా వ్యాపించియుంది. ఇంకా దిగువకు కూడా వెళ్ళింది కాని అది అంతప్రకాశవంతంగా లేదు. మీ దేహం నుండి ఉత్పన్నం అయిన వెలుగు జగమంతా వ్యాపించినట్లుగా వున్నది.”

The Mother Past, Present, Future by Amal Kiran:27c30

17, నవంబరు 1973

శ్రీమాత భౌతికదేహం పూర్వపు సృష్టి నాటిది. అది రానున్న నూతన ఆవిర్భావానికి పాదపీఠం వంటిది. దానికి నిర్దేశించిన కార్యక్రమం అది చక్కగా నిర్వర్తించింది. ఇక శ్రీమాత నూతన దేహంలో త్వరలోనే రానున్నది. ఇది ఒక పరీక్షా సమయం. శ్రీమాత చేతనను మనం ఎంతగా విశ్వసిస్తున్నామో అనేదే దానికి పరీక్ష.

పాత శరీర పునరుజ్జీవనానికి దానికి అంతర్భాగమైన కొన్ని సమస్యలు, బాధలు దానికి ఉండటం సహజమే. వాటిని ఎంతవరకు ఈ శరీరం తట్టుకోగలదో అంతవరకు తట్టుకోవటం ఇప్పటిదాకా జరిగింది కూడా! ఇక మరింతగా అది సాధ్యపడదు. క్రొత్త మార్పు రావాలంటే క్రొత్త ప్రక్రియ జరగాల్సిందే కదా! ఆ దిశగా దాటవలసిన మొదటి మజిలీయే ‘దేహత్యాగం’!

మీ భౌతిక దేహం గతసృష్టికి సంబంధించినది. దానిని కేవలం మీ బిడ్డల ప్రపంచంలో గడపటానికే ఉద్దేశించారు. అంతే కాదు, దానిని రానున్న మీ నూతన దేహానికి ఆధారపీఠంలా కూడా చేసుకున్నారు. అది అలా మీకు సహరించింది కూడా. ఇక మీరు త్వరలో మీ నూతనదేహంలో సాక్షాత్కరిస్తారని ఆశిస్తున్నాము. మీ బిడ్డల ప్రేమాభిమానాలు, పవిత్ర ఆకాంక్ష, కృతజ్ఞతాపూర్వక సమర్పణ మీ పాదాల చెంతనే వున్నాయి.

Collected Works of Nolinikanta Gupta, Vol.5:5, 87

...ఒక అద్భుతం జరిగింది మన కోసం. మన కోసమే శ్రీమాత తన నూతన దేహాన్ని మలచుకున్నారనేది వాస్తవం. తన మృణ్మయదేహాన్ని చిన్మయదేహంగా తాను మలచుకున్నారు. ఈ మార్పు భౌతికంగా మనకు కనపడకపోయినా సూక్ష్మభౌతికంలో ఉండి పోయింది. ఇలా జరిగే అవకాశం ఉన్నట్లుగా శ్రీమాత ఇది వరకే సూచించారు కూడా! ఆ ‘నూతన’ సూక్ష్మరూపాన్ని వారు ముందు

గానే దర్శించినట్లు తోస్తున్నది. అందుకు ఎంతకాలంగా వారు శ్రమించారో! ఇన్నాళ్ళకు మానవాళికి అది వరప్రసాదమైంది.

అలా భౌతికరూపం వెనుక రూపొందుతున్న నూతన సూక్ష్మదేహం ఆమె స్థూలదేహంలో ప్రవేశించింది. ఇతర మానవులలోని భౌతికం ఇంకా అందుకు సిద్ధం కాలేదు. ప్రపంచం ఆ నూతనావిష్కరణను ఒక విధమైన 'చౌరబాటు' గా ఇంకా భావిస్తూనే వుంది. కాని ఎప్పటికైనా భౌతికకోశం రాలిపోవటం అనివార్యం. భౌతిక పరిణామం చెందటం ఆశించతగినదే. దాన్ని రాలిపోవటం అనకూడదు! ఆ విషయం వేరుగా ప్రస్తావిస్తాను.

మన భౌతిక రూపాలను ఆధ్యాత్మిక చేతనతో పరిపుష్టము, పరిపూర్ణము చేయటానికి శ్రీమాత సూక్ష్మశరీర ధారిణియై కాంతిపుంజాలను మన చుట్టూ ప్రస రింపజేస్తూ వున్నారు. ఆ విషయాన్ని మనం బాగా గ్రహించి సువర్ణమయమైన శ్రీమాతకు తగిన సువర్ణమయ సంతానంగా బాహ్యంలోనూ, అంతరంగంలోనూ నిరంతరం ప్రయత్నించటమే మన తక్షణ కర్తవ్యం.

శ్రీమాత ఇలా అన్నారు

"బిడ్డలారా, నేను నూతన దేహంతో మీ ముందుకు మళ్ళీ వస్తున్నాను. ఇది దివ్యచేతనతో పునీతమైన కోశం. అదే సమయంలో నేనూ మీతో కూడా కలసి మెలసి సాధారణ వ్యక్తిగానూ వుంటాను. నేను మీ 'శ్రీమాతనే'. ఇందులో కంగారుపడవలసిన విషయం ఏమీ లేదు. మీ కర్తవ్యం మీరు మరువకండి. కేవలం మీ స్వలాభం గురించే ఆలోచించవద్దు. నన్ను దర్శించండి. నాలో ఐక్యమవటానికి ప్రయత్నించండి. మీ ప్రేమను మాత్రం నా ప్రేమలో విలీనం చెయ్యండి. బిడ్డ లారా, ప్రపంచంలో మిగతావన్నీ మర్చిపోండి; కేవలం నేను చెప్పిందే గుర్తుంచు కోండి."

Collected Works of Nolinikanta Gupta, Vol.6:259

శరీరంలో ప్రతి కణం దివ్యత్వాన్ని ప్రేమించే విధంగానే వుంటాయి. భౌతిక దేహానికి ఉండే ప్రత్యేకత ఏమిటంటే అది ఒకసారి దేన్నైనా గ్రహిస్తే మళ్ళీ మర్చి పోలేదు. ఒకసారి దివ్యత్వానికి అంకితమైతే దానికే మరల మరల అంకితమవు తుంది. అదే దారిలో పయనిస్తుంది. నిరంతరము అదే ధోరణిలో వుంటుంది.

అందులో ఏమీ మారదు — అనుకోనివి ఒక వేళ సంభవించినా, ఏవైనా బాధలు కలిగినా 'సమర్పణా' భావం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. ఊర్ధ్వచేతన యొక్క జోక్యం ఏమీ లేకపోయినా క్రమేణా దివ్యత్వం వైపు ఎదగటం జీవకణాల అంతర్భాగమే.

CWM 11:189-90

శ్రీమాత
అనువాదం కె. ఆర్. యల్. నరసింహారావు

శాశ్వతత్వము యొక్క చేతన

ప్రత్యామ్నాయ స్థితిలో ప్రాణి

నేను మరొక వ్యక్తి నవుతున్నాననే భావన నాకు కలిగింది.

కాదు, అది మాత్రమే కాదు: నేను మరో ప్రపంచం లోనికి ప్రవేశిస్తున్నాను, మరో విధమైన ప్రాణిగా....

ఏది ప్రమాదభరిత స్థితిగా పిలువబడుతోందో (సాధారణ చేతన ప్రకారం)

ప్రమాదకరమైనదే, కాని అద్భుతమైనది —

దాన్ని ఏ విధంగా వ్యక్తపరచగలను?

మొదటిగా ఈ (దేహము) అంతఃకరణ రూపాంతరీకరణ కొనసాగుతున్నది కాని అతి సుదీర్ఘ మైనది, శ్రమతో కూడినది, బాధాకరమైనది.... కాని అలాగే అద్భుతమైనది. దాని అనుభూతి (సర్వత్రా నిలిచినట్లు అమ్మ అభినయించారు)

అధికాధికముగా — దేహము యొక్క సంవేదన, విశ్వాసము ఒక్కటే రక్షించ గలదు. జ్ఞానము ఇప్పటికి సాధ్యపడదు. కాబట్టి నమ్మకము ఒక్కటే కాపాడుతుంది.

కాని "విశ్వాసమే రక్షిస్తుంది అంటే పాత రకం మాటలు ధ్వనిస్తుంది... దాన్ని ఏ పదాల్లో చెప్పాలి? మనము పిలుచుకునే 'జీవితము' 'మరణము' సంబం ధాలపై అభిప్రాయాలు అధికాధికంగా మారిపోతున్నాయి. ఔను. భిన్న మైనవి (అమ్మ తల కదలిస్తూ) పూర్తిగా భిన్న మైనవి."

మరణము లేకుండా పోతుందని కాదు. నీవు గుర్తుంచుకో. మనం చూసే,

మనకు తెలిసిన మరణము, మన జీవితాలకు సంబంధించినం వరకే అవగతమైనది అసలు అది కాదు పూర్తిగా కానే కాదు. ఆ రెండు పరివర్తన చెందుతున్నాయి — ఏ విధముగా నన్నది మనకు ఇంకా తెలియడము లేదు. అది ఒకసారి అత్యంత ప్రమాదభరితముగాను, అమిత సంభ్రమాశ్చర్యాలుగాను కనబడతాయి. ప్రమాదకరమే. స్వల్ప తప్పిదము కూడా మహా విపత్కర పర్యవసానాలను కలిగి స్తాయి. అద్భుతమైనది.

అది చైతన్యము శాశ్వతత్వము యొక్క — సత్యచేతన — మనము అర్థము చేసుకునే, శాశ్వతత్వము కాదు. మరొక విషయమును, మరొక విష యము.

మన సహజ వైఖరి కొన్ని విషయాలు సత్యము కావాలనుకొంటుంది. (ఏదైతే మనకు అనుకూలముగా భావిస్తామో) మరియు మిగిలిన విషయాలు అదృశ్యం కావాలని. కాని అది వాస్తవము కాదు, ఆ విధంగా ప్రతి విషయము భిన్నమై వుంటుంది.

సత్యమైన శాశ్వతత్వము

ప్రారంభములో నాకు శాశ్వతత్వ చైతన్యము కలగడం. ప్రారంభమైనపుడు ఈ సవ్యమైన శాశ్వతత్వ చేతనను మానవుల ఉద్దేశములో నున్న శాశ్వతత్వ చేతనకు సన్నిహితముగా తీసుకువచ్చినపుడు (పూర్తిగా విరుద్ధమైనది) నేను స్పష్టముగా చూశాను. మానవుని ప్రమాణాలికలను (ఒక అనిశ్చితమైన కాలము) తానొక్కడే యోచించడమే కాకుండా, తప్పకుండా అన్ని వేళలా, తన ప్రస్తుత స్థితిని, చైతన్యమును, తన ఉద్దేశాలతో బాటు, జీవితానికి సంబంధించిన అన్ని విషయాలు పూర్తిగా కలబోసి ముద్దగా చేసి వాటిని కూడా ప్రకటిస్తాడు. నేను ఈ ప్రయోగాన్ని చాలా మంది ప్రజల మీద చేసినపుడు, వాళ్ళకు చెప్పాను. "నన్ను క్షమించండి, మనము ఏం చెప్పుకోవాలంటే ఒక ప్రత్యేకమైన క్రమశిక్షణతో కాని ప్రత్యేకమైన దైవానుగ్రహముతో జీవితాన్ని చిరకాలము కొనసాగించవచ్చు. నీవు దేన్నైతే వర్తమానములో అనిశ్చితమైన భవిష్యత్తుకు జీవన పరిస్థితులను పొడ గించాలని ఆశిస్తున్నావో, దాని సమ్మేళనతో నీ అంతట నీవు నిర్మించుకున్న సంబంధ బాంధవ్యాలు, కార్యక్రమాలు మొత్తము కూర్చుకుంటే సజీవ వస్తువులలో

లేక జడపదార్థములతో ఏర్పడిన మొత్తాన్ని కూడా పొడిగిస్తావు."

కాని అవి యధాతథముగా కొనసాగించబడవు. కారణం అన్ని విషయాలు ఎప్పుడూ మార్పుచెందేవే. శాశ్వతత్వము కావాలంటే నీవు కూడా ఈ నిరంతర మార్పుల ననుసరించాలి. లేనట్లయితే సహజంగా జరిగేదేమంటే వర్తమానములో జరుగుతున్నదే జరుగుతుంది. ఏదో ఒక రోజు చనిపోవలసి వస్తుంది. నీవు ఎల్ల వేళల మార్పును అనుసరించకపోవడము వలన. కాని అన్ని వేళల్లో మార్పులను అనుసరించగలిగితే ఇవన్నీ పడిపోతాయి. ఉండేదేమిటో నీకు బాగా అర్థము కాదని తెలుసుకో. కాని అదొక్కటే స్థిరముగా నిలిచేది. మిగతావన్నీ కాలభ్రమణ ములో పడిపోవలసినవే.... అయినప్పటికి ఇంకా నీకు శాశ్వతత్వము పొందాలని ఆశిస్తున్నావా?

పదిమందిలో ఒకరు కూడా కావాలన లేరు!

ఒక్కసారి వారికి వాస్తవాలు, యదార్థముగా అనుభవము లోనికి వస్తే అప్పుడు వారు అంటారు, వద్దు! వద్దు, సర్వస్వము మార్పు చెందుతున్నందున దేహము కూడా వాటితో పాటు మార్పుచెందవచ్చు. దాని వలన నీకు ఏ వ్యత్యా సము కలుగుతుంది. కాని చివరకు ఏదైతే మిగులుతుందో, దాన్ని నీవు సత్య ముగా తప్పకుండా పట్టుకోవాలి — అప్పుడు నీవు అదే కావాలి. కాని ఈ సంపూర్ణ సమ్మేళనము కాదు. నీవు దేన్నైతే 'నీవు 'అని పిలుస్తున్నావో అది అనేక విషయాల సముదాయము....

జీవకణాలు చేసే యోగము

నేను ఒక జీవకణాన్ని తీసుకుంటాను (అమ్మ తన చేతివేళ్ళతో సంజ్ఞ చేసి చూపెడుతుంది). అది చాలా చిన్న కణము. దీనిలా సూక్ష్మ మైనది. సాధారణ కన్నులతో చూడలేము. కాని నేను ఆ దివ్యదృష్టిని, శక్తిని కలిగి యున్నాను. ఈ విధంగా నేను ఒక చిన్న కణాన్ని తీసుకొని దాన్ని తెరచి దానిపై దివ్యచైతన్య ప్రకాశాన్ని ప్రసరింపచేసి రూపాంతరం చేస్తాను. అప్పుడు దాని యందు నిశ్చల మైన దివ్య ఆనందమును, ఉద్వేగరహిత స్థిరశాంతిని ప్రకాశమాన దివ్య సత్య యధార్థశక్తితో నింపి దాన్ని ఉద్దీపన గావిస్తాను. ఈ విధంగా అది దైవిక లక్షణాలతో సంపూర్ణంగా రూపొందుతుంది. దివ్యజ్ఞాన తేజస్సు, ప్రేమ కలిగించే ఆనందము

పరిపూర్ణ నిశ్చల ప్రశాంతితో, తనంత తానుగా శాశ్వతంగా దైవసంకల్పంతో తాను శాశ్వతంగా ఐక్యం అయ్యేంతవరకు ఓర్పుతో నుండగల శక్తిని ప్రసాది స్తుంది. ఇది నేను పనిచేయు పద్ధతి. నేను ప్రతీ కణాన్ని దివ్యచేతనా ప్రదీప్తం గావించి... మరొక కణాన్ని తీసుకుంటాను. అలాగే ఒకదాని తర్వాత మరొక కణాన్ని అదే మార్గములో దివ్యచేతన ప్రదీప్తం చేయడము కొనసాగుతుంది.

ఈ జీవికణాలు చైతన్య ప్రకంపనలతో మెరుస్తూ దేదీప్యమానమవుతాయి. సంసిద్ధమైన వాటిని పక్కకు తీసిపెట్టి పూర్తయినవాటికి మిగతావాటికున్న వ్యత్యాసాన్ని పరిశీలిస్తాను. చాలా భేద ముంటుంది. వాస్తవానికి పోలికకు ఆస్కార ముండదు. నా స్పర్శ — కణాలతో చాలా తేడా వుంటుంది. నా స్పర్శ కలిగినవి శరీరమందు చిరునవ్వులు చిందిస్తూ చైతన్యస్థితిని పొందుతాయి. కణాలు ఐక్యతా నుభవం పొందటం ప్రారంభిస్తాయి సాధిస్తాయి. రూపాంతరము చెందినవాటికి సాధారణమైనవాటికి మధ్య భేదము చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. వాటి మధ్య సారూప్యము లేదు అనగా పాత కణాల్లో గతము ఇంకా అంటిపెట్టుకుని వుండటం వలన మసకబారి దివ్యకాంతి అంతగా కనబడదు. దైవము యొక్క దివ్యతేజస్సు, అతిమానస చైతన్యముతో రూపాంతరము చెందిన కణాల్లో దివ్యశక్తి మెరుస్తుంది. ఆత్మానుభూతి నిండిన గ్రహణశక్తి గోచరిస్తుంది, వేల సంవత్సరాలుగా నున్న అచేతనను బద్దలు కొట్టుకుని బయటపడిన ఆత్మపదార్థానికి మేలుకొలుపు పలుకు తుంది. అది సజీవమైనది, సత్యమైనది, ధృడమైనది. ప్రపంచ పదార్థం భౌతిక నిర్మాణములో కొంచెమైనా ఈ దివ్యానందాన్నైనా ఎవరైనా ఆస్వాదించగలిగితే, విశేష విశిష్ట ఇంద్రియానుభవాల అద్భుత అన్వేషణలో, అతను ప్రపంచామంతా విస్తరిస్తాడు. నిజానికి రూపాంతరీకరణ తృష్ణయందు, మిగిలిన లౌకిక, ప్రాపంచిక విషయాలు ఎంతో నిరర్థకముగా పేలవముగా అసమంజసముగా కనిపిస్తాయి.

దేహము నందు పవిత్రత, దివ్యానందము

పరిపూర్ణమైన శరణాగతి నేపథ్యంలో మన దేహము స్వీకరించే స్థితిలోగాని పునశ్చరణ "నీ సంకల్ప మొక్కటే. ప్రభూ! నీ సంకల్పము నెరవేరు గాక!" ఇదే స్థిరమైన ప్రార్థన పునరావృత మవుతుంది. ఆ దైవసంకల్పము నెరవేరుతుంది. అదే పని చేస్తుంది, రూపాంతరము చేయడానికి మార్గదర్శక మవుతుంది.

దేహము తనంత తానే శరణు పొందుతుంది. అది అతి సహజముగా క్షణమాత్రేన జరుగుతుంది. దాని సామరస్యత ఆశ్చర్యకరము — ఒక మచ్చలేని వాహికలాగా ఆ ప్రభువు ఆదేశము లేకుండా ఏమీ జరగదు. శరీరము సంభ్రమాశ్చర్యాలతో అనిర్వచనీయ ఆనందంతో పులకరిస్తుంది. అచట ఆటంకాల వక్రీకరణ, పాడు చేసేవి, అసభ్యమైన ప్రతిబంధకా లుండవు. అంటే పవిత్రమైన, నిర్మలమైన, స్వచ్ఛమైన మచ్చలేని పవిత్రతత పారదర్శకమైన సత్యత మూర్తీభవిస్తాయి. నేను నా చేతిని చూస్తే శరీరాన్ని అది పారదర్శకమైనట్లుగా కనిపిస్తుంది. అది ఎంత తేలికగా వుంటుందంటే నేనెక్కడ కెళ్ళాలంటే అక్కడకు వెళ్ళగలను. ఈ శారీరక స్థితిలో రోజంతా కష్టించి పనిచేసినా అలసిపోను. అది రాత్రి సమయములో నేను జీవకణాల రూపాంతరీకరణ కొనసాగిస్తున్నప్పుడు భూలోక జీవనంలో నేను స్వీకరించిన కార్యనిర్వహణకు ముగిసిపోదు. దేహము సత్యాహర్ష ప్రకంపనలకు లోనవుతుంది. జరుగుతున్నదానికి సర్వశక్తివంతమైన అనంత శాశ్వతత్వము అనుభవమవుతుంది. వినాశము మరణము అర్ధరహితమవుతాయి. ఎందుకనగా వాటికి ఈ దివ్యానందక్షేత్రంలో చోటు లేదు. దేహము ఒక విధమైన శాశ్వత తత్వమును తెలుసుకుంటుంది. సృష్టిలో సర్వస్వము దైవ సంకల్పానుసారము నడుస్తూ దివ్యచైతన్యములో అంతా పరిపూర్ణ ప్రశాంతమయమైన, అనంతమైన, శాశ్వతమైన అనుభూతిని పొందుతుంది.

ఊహాతీతమైన దివ్యవైభవము! అది ఇంకో విధముగా ఎలా ఉంటుంది? ఎల్ల వేళల దేహములోని ఏమైతే ప్రకాశవంతమైన పదార్థంగా వుంటుందో అది నీవు ఏం సంకల్పిస్తావో ప్రభూ! నీ సంకల్పమే నెరవేరుగాక!" అని పలుమార్లు పలుకుతుంది. లేక కొన్ని వేళల పూర్తిగా శరణాగతి నిండిన కృతజ్ఞతా భావములో ఒక రకమైన అద్భుతానుభవములో "నన్ను నీ కార్యనిర్వహణమునకు అర్హుణ్ణి చేయి. నీవు నా యందు నివసించే యోగ్యతను కలుగుచేయి," అని పునశ్చరణ చేస్తుంది. ఇంతకు మించి నేను ఎక్కువగా వ్యక్తం చేయలేని భావాన్ని వ్యక్తపరుస్తుంది.

నేను దేహములోని అంగాలను రూపాంతరము చేసే పనిని ప్రారంభించాను — లోపల నున్న అవయవాలను ఒకదాని తర్వాత మరొకదాన్ని. నేను ఈ కార్యాన్ని సాధించటానికి ఏ విధమైన బాహ్యజీవనాధారం యొక్క ఆవశ్యకత

ఎప్పటికి కలగదు. జీవనప్రక్రియలో కనీస అవసరాలు ఇక ముందు అవసర ముండదని భావించి ప్రారంభించాను. అవి విశ్వశక్తి నుండి మనుగడకు కావలసిన సత్తాను గ్రహిస్తాయి.

నా కిపుడు మహత్తరమైన ఈ కార్యము ఎలా సాధించానో తెలిసింది. ఎవరైతే నాకు మార్గదర్శకముగా నిలిచి అనుక్షణము నడిపిస్తున్నారో, అనుకూల పరిస్థితులను కల్పిస్తారో బాధావహ క్షణాల్లో కష్టాల ఉద్వేగము నుండి, భరించలేని ప్రమాదకర నొప్పుల నుండి నన్ను బయటకు లాగుతున్నారో, అది నా శరీరమంతా విచ్ఛిన్నమవుతున్నట్లుగా వుండింది. అట్టి సర్వకాల సర్వావస్థలలోను శ్రీఅరవిందులు తోడు నీడగా వుండి నన్ను ముందుకు నడిపించారు.

శ్రీఅరవిందులు చాలా సంవత్సరాల క్రితము శరీరత్యాగము చేసినా, ఆయన సూక్ష్మభౌతికములో అతిమానస ప్రపంచాన్ని అవతరింపచేయడానికి కృషి చేస్తున్నారు. ఆయన భూమి మీదకు రూపాంతరీకరణకు కావలసిన సమస్తమును సమకూర్చారు. ఆయన సహకారములు లేకపోతే రూపాంతరీకరణ ఎంత కష్టసాధ్యమో, ఎంత క్షీణదశలో వుండేదో నాకు అవగతమైనది. ఆయన లేకుండా నేనేమి చేయగలను? నాకే తెలియదు.... ఎక్కువ ఏమీ చేయలేను.

The Supreme, pp. 42-44

అనువాదం: జి. వి. ఎస్. ప్రసాదరావు

"ఓ పరమేశ్వరా! నీవు నేనెలా ఉండాలని కోరుతావో, అలా అవుతా. దేనిని నేను తెలుసుకోవాలని నీవు కోరుతావో దానిని నేను తెలుసుకుంటా, దేనిని నేను చేయాలని నీవు కోరుకుంటావో, దానిని నేను చేసి తీరుతా."
CWM 13:57

— శ్రీమాత



జీవన్మరణాలకు ఆవల

అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2015

జీవన్మరణాల కావల

17/12/2015

విషయసూచిక

సంపాదకుని వ్యాఖ్య

సాధారణంగా జీవితంపై మనకున్న అభిప్రాయం విభాజితమైదిగాను, ద్వంద్వ దృష్టితో కూడినదిగా నుంటుంది. దానిని పరస్పర ప్రతికూలమైనవిగా కనిపించే రెండు పార్శ్వాలుగా విడదీసి లేక — ఏకం సత్ బహుదా విదంతి — ఒకే ఒక టైన పరమ సత్యాన్ని అనేక భాగాలుగా విడదీసి చూస్తాము; అయితే, ఈ విచార ణలో విడదీయబడీన భాగాలను సమైక్యపరచిన సాధనాన్ని — పూలమాలను కూర్చిన అల్లిక దారం లాంటిది — విస్మరిస్తాము. ఈ విభాజిత దృష్టి జీవితంలో చోటు చేసుకొనే ద్వంద్వ పరిణామాల్లో, ముఖ్యంగా జీవితము మరణము, దైవిక ము లౌకికము, మంచి చెడులలో కొట్టొచ్చినట్లుగా గోచరిస్తుంది. జననమరణాలను మనం పరస్పర విరుద్ధమైనవిగా భావిస్తాము కాని లోతుగా శ్రీమాతారవిందుల కృపాకటాక్షంతో ప్రసాదించబడిన సమదృష్టితో పరిశీలించినట్లయితే అది ఒకదాని కొకటి విరుద్ధమైనవిగా కాక అన్యోన్య సహకార మందించుకొనే ప్రక్రియలుగాను, ఏకైక పరమ సత్యము యొక్క రెండు పార్శ్వాలుగా — ఒకే నాణెపు బొమ్మ బొరుసులా కనిపిస్తాయి. రూపాంతరీకరించబడిన జీవితంలో ఇతర ద్వంద్వ దృష్టులు, విభజనలు ఏ విధంగానైతే అంతరిస్తాయో — కారణం అవి వాటి నిజ మైన విలువలలోకి పరివర్తన కావించబడినందున, సమైక్యమైన సంపూర్ణతలో ఒక భాగంగా చూడబడుట వలన — జీవన్మరణాలు కూడా చివరకు వాటి కార్యాచరణ క్రమము, వ్యవహార శైలిలో మార్పు చెంది, ప్రస్తుతం అవి వేటికైతే ముతక ప్రతీ

కలుగా నున్నాయో అవి కూడా సుందరంగా తీర్చిదిద్దబడి, సమన్వయపరచబడి, ఒక నూతన రూపంలో దర్శనమిస్తాయి. ఈ సంచికలోని వ్యాసాలలో జీవన్మరణా లపై మన అభిప్రాయ, అవగాహనలలో కలిగిన ఈ మౌలికమైన మార్పు చర్చించ బడింది.

సమాధి స్థితి, నిద్ర, మృత్యువు

ప్రశ్న: నిద్ర, మృత్యువు మధ్య తేడా ఏమన్నా ఉందా, లేక అవి ఒకటేనా?

ఓహ్, లేదు! ఏమాత్రం కాదు. మానసిక స్పృహలేని స్థితి అయినటువంటి సమాధి మృత్యువు లాంటిది, అవును, మిగిలి ఉన్న లంకె తప్ప — కేవలం ఒక లంకె మాత్రం మిగిలి ఉంటుంది — కాని తేడా అల్లా ఒకరు పూర్తిగా బయటకు వెళ్లిపోయిన స్థితి. వాస్తవంలో, ఒకరు పూర్తిగా బయటకు వెళ్ళిపోయినప్పుడే మానసిక స్పృహ లేనివారవుతారు; అన్యథా, ప్రాణికంలోని అత్యంత భౌతికమైన టువంటిది ప్రతిదీ మిగిలే ఉంటుంది.

ప్రశ్న: నేననేదేమంటే, మీరు నిద్రలో వెళ్ళే ప్రదేశాలు, మృత్యువులో వెళ్ళే ప్రదేశాలు ఒకటేనా అని?

లేదు, లేదు, లేదు. నిద్రపోయేదానిలో చాలా సమయం, కొన్ని మినహాయిం పులతో, ఒకరు అధోచేతన నుంచి పైకి వచ్చే వాటన్నింటితో సంబంధం కలిగి యుంటారు: ఒక మెదడుకు సంబంధించిన అధోచేతన, ఒక భావోద్వేగపూరిత అధోచేతన, ఒక భౌతిక అధోచేతన; జనులు తాము పొందే తొంబై తొమ్మిది శాతం కలలను ఇవి తయారుచేస్తాయి. అప్పుడప్పుడు — సాధారణంగా — మనస్సు గమ్యం లేకుండా తిరుగుతూ ఉంటుంది, కాని తొంబై తొమ్మిదిన్నర శాతం మందికి అది తిరిగి వచ్చినప్పుడు ఏదీ గుర్తుండదు, కారణం లంకె సరిగా ఏర్పరచబడ లేదు.

నిద్ర ఉద్దేశం సచ్చిదానంద చైతన్యంతో సంబంధం పునరుద్ధరించడానికే. కాని వందలో ఒక్కరు కూడా అది చేస్తారనుకోను! వారు సచ్చిదానందంలో కంటే ఎక్కువగా అచేతనలోకి ప్రవేశిస్తారు.

అయినప్పటికీ ఏ రెండు నిద్రలూ ఒకే విధంగా ఉండవు, అదే విధంగా మర

ణాలతోనూ, ఏ రెండూ ఒకే విధంగా ఉండవు, కాని నిద్ర, మరణం వేరు వేరు, ఎందుకంటే... అవి రెండూ భిన్నస్థితులు. నీకు శరీరం ఉన్నంత కాలం, నీవు మరణించినప్పుడున్న స్థితిలో ఉండవు. వైద్యులు 'చనిపోయినట్లు' ప్రకటించిన తరువాత ఒక వారం రోజుల సమయం ఉంటుంది, నీవింకా నడుమ స్థితిలోనే ఉంటావు, కాని యదార్థమైన మృత్యుస్థితి దానికది పూర్తిగా భిన్న మైనది, కారణం అక్కడ ఈ భౌతిక ఆధారం ఏమాత్రం ఉండదు.

...లేదు, నిద్ర అనేది ఏదో మరి ఇంకొకటి. అవును, ఏదో మరి ఇంకొకటి. అది ఎక్కువగా మహా అచేతనలోకి దిగజారిపోవడం లాంటిది — ఒక విధమైన తామసిక దండయాత్ర. సహజంగానే, మన కందరికీ తెలిసిన విషయం దైవ చైతన్యం మహా అచేతనా అగాథాలలో ఉన్నదని; అయినప్పటికి నిద్ర పతనంగా అనిపిస్తుంది, కొంతమంది మనుషులు పూర్తిగా వెనక్కి మహా అచేతన లోనికి పడిపోయి, నిద్రలోకి ప్రవేశించినదాని కంటె చాలా మందకొడిగా దానిలో నుంచి బయటకు వస్తారు.

The Mother: Conversations with a disciple August 5, 1961

సమాధి, శరీరం — వెలుపలి అనుభవం, మృత్యువు

మరింకో విషయం ఉంది (నవ్వు): నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడే, హఠాత్తుగా, చేస్తున్న పని మధ్యలో లేదా వాక్యం మధ్యలో లేదా మరేదైనా పని మధ్యలో సమాధిస్థితిలోకి వెళ్ళేదానిని — కాని ఎవరికీ అది ఏమిటనేది తెలిసేది కాదు! వారందరూ అనుకొనేవారు, నేను నిద్రలోకి జారుకున్నానని. కాని నేను ఎరుకలోనే ఉండేదానిని, ఒక చేయి లేపి లేదా పదం మధ్యలో — అయ్యో! అక్కడెవరూ లేరు (శ్రీమాత నవ్వు). బయట అక్కడెవరూ లేరు. కాని అంతరంగంలో చాలా తీవ్రమైన, ఆసక్తిదాయకమైన అనుభవం. అది నాకు చాలా చిన్నప్పుడే జరుగుతూ ఉండేది....

ఆ సమయంలో నేను ప్రతిరాత్రి శరీరం వదలి బయటకుపోయి పనిచేసే దానిని, ప్రార్థనలు — ధ్యానాలలో నేను చెప్పిన విధంగా (*Prayers and Meditations*, Feb 22, 1914; *CWM* 1:81-82) నేను దానిని కేవలం పైపైన మాత్రమే చెప్పాను. ప్రతిరాత్రి ఒకే సమయంలో, మొత్తం గృహమంతా ప్రశాంతంగా

ఉన్నప్పుడు, నేను నా శరీరం నుంచి బయటకుపోయి, అన్నిరకాలైన అనుభవాలను పొందేదానిని. ఆ విధంగా క్రమక్రమంగా నా శరీరం నిద్రలో నడిచేదిగా తయారయింది (అనగా, రూపానికున్న చైతన్యం ఎక్కువెక్కువగా ఎరుకలోకి వచ్చింది, లంకె మటుకు చాలా దృఢంగా స్థిరంగా ఉండగానే) నేను లేచే అలవాటును చేసుకున్నాను — కాని సాధారణంగా నిద్రలో నడిచేవారిలాగ కాదు: నేను లేచి, నా మేజాబల్ల సొరుగు తెరచి, ఒక కాగితాన్ని తీసుకుని, వ్రాసేదాన్ని... పద్యాలు. అవును, పద్యాలే — నాలో ఏ కవీ లేని నేను! కొన్నింటిని వ్రాసి, తిరిగి ఎరుకతో అన్నింటిని సొరుగులో పెట్టి, చాలా జాగ్రత్తగా గడియవేసి, మళ్ళీ మంచం మీదకు చేరేదానిని.

The Mother: Conversations with a diciple: August 5, 1961

ఎరుకతో మృత్యు క్షేత్రంలోకి ప్రవేశించడం

ప్రశ్న: ఎరుకతో మృత్యువులోకి ప్రవేశించడానికీ, ఎరుకతో శరీరం బయటకు పోవడానికీ తేడా ఏమిటి? చాలా మంది తమ శరీరం బయటకు పోగలరు, అవును కదా?

అవును, కాని వారిలో అందరూ మృత్యుముఖంలోకి పోరు.

ప్రశ్న: అది శరీరం వెలుపలికి పోయే విధానం వంటిదేనా?

అవును. కాని అది కేవలం ప్రారంభం మాత్రమే. ఒకరు శరీరం బయటకు పోవడమెలాగో నేర్చుకోవడంతో ప్రారంభిస్తారు. చాలామంది జనులు, నిద్రపోయినప్పుడు, తమ శరీరం బయటకు పోతారు. కొంచెం హెచ్చుతగ్గులతో వారంతా ఎరుకతో ఆ పని చేస్తారు — కాని అధికభాగం ప్రజలు ఎరుక లేకుండా చేస్తారు, కాని కొంతమంది ఎరుకతో చేసేవారున్నారు. వారు శరీరం బయటకు వెడతారు, కాని భౌతిక క్షేత్రంలోనే ఉండిపోతారు. మహా అయితే, వారు మానసిక క్షేత్రంలోకి వెడతారు, కాని వారు మృత్యు క్షేత్రంలోకి వెళ్ళరు.

అక్కడికి వెళ్ళేవారు కొంతమంది ఉన్నారు. ప్రక్రియ పూర్తి కావడానికి. ఒకరు తన శరీరం బయటకు వెళ్ళినప్పుడు, అతడు కొన్ని లంకెలతోటి తన శరీరంతో ముడివేయబడి ఉంటాడు — వాటిని నేను ఏమని పిలవను? అవి ప్రాణికలంకెలు, మానసికలంకెలు, చైత్య లంకెలు — ఒకరు బయటకు పోయినప్పుడు,

శరీరం నుంచి బయటకు పోయేవి అన్ని రకాలైనవీ ఉంటాయి. సాధారణంగా బయటకు పోయేదేదో పూర్తిగా సూక్ష్మ మైనదై యుంటుంది, మనస్సు లేక ఉన్నత ప్రాణికంలాగా, సమాధిస్థితిలోకి ప్రవేశించకుండా శరీరానికి సరిపోయేటంత చాలా మట్టుకు శరీరంలోనే ఉండిపోతుంది. నిద్రపోయేవారిలో కొంతమంది నిద్రలో ఎక్కువగా కదలుతూ ఉంటారు: వారి అస్తిత్వంలో ఒక భాగం బాహ్యంలో ఉండి పోతుంది, కాని ప్రాణికంలోని అత్యంత భౌతిక భాగం శరీరంలోనే ఉంటుంది. అది అక్కడ ఉన్నంత మట్టుకు, అది పూర్తిగా జీవనక్షేత్రంలో ఉన్నట్లే. మొట్టమొదటగా, మృత్యుసమయంలో కచ్చితంగా శరీరాన్ని వదలిపెట్టిపోయే భాగాన్ని శరీరం నుంచి విడదీయడం అంత తేలికైన పని కాదు. దీనికి చాలా తీవ్రమైన శిక్షణతో చాలా కాలం అభ్యసించివలసి ఉంటుంది. మృత్యుసమయంలో వదలివెళ్ళే అన్ని భాగాలను విజయవంతంగా బయటకు తీసుకువెళ్ళాలంటే, బాహ్యంలోకి వెళ్ళగలిగిన ఒక విధానాన్ని అనుసరించవలసి ఉంటుంది; అటువంటప్పుడు శరీరం మానసిక స్పృహలేని స్థితిలోకి ప్రవేశిస్తుంది. అప్పుడది ఒకరు మరణించినప్పుడు పోయే స్థితిలోకి వెళ్ళిపోతుంది. అది ఇంకా చాలా త్వరితంగా కూడా పూర్తిగా మొద్దుబారిపోతుంది. ఇటువంటిదాని నొకదానిని ఒకరు తప్పకుండా చేయడం నేర్చుకోవాలి, అది అంత తేలికైన విషయం కాదు. ఒకరు పూర్తిగా దానిని చేయదలచుకుంటే, ఏమీ జరగకుండా ఉండగలందులకై ఎవరో ఒకరు ఎల్లప్పుడూ తప్పక వారి శరీరాన్ని కనిపెట్టుకుని ఉండాలి. ఒకరు కేవలం తనకు తానుగా ఎన్నడూ చేయలేరు. శరీరాన్ని రక్షించడానికి ఒకళ్ళు తప్పక ఉండాలి.

అదంతా ఒక వేళ ఒకరు చేయగలిగినా, నేను చెప్పబోయే అనుభవం పూర్తిగా అది కాదు. నేను చెప్పబోయే అనుభవం ఇంకా పూర్తిగా కష్టసాధ్యమైనది. ఒకరు ఆ విధంగా శరీరాన్ని మానసికస్పృహ లేనిస్థితిలో ఉంచి వెళ్లినప్పుడు, వారు లంకెలను తెంపివేస్తారు. కనుక వారు యదార్థంగా చనిపోయినట్లు; అనగా, గుండె ఇక ఏమాత్రం కొట్టుకోదు. కాని ఇంకా అక్కడ 'జీవాకృతి' ఉంటుంది కనుక, అదేమీ ఒకరు ప్రమాదం ద్వారా పోయినట్లు కాదు, అది ఒక జ్ఞానంతోనూ, ఆధిపత్యశక్తులతో కూడిన ఇచ్ఛ ద్వారానూ చేసినదవటం మూలంగా వారు వెనుకకు తిరిగి రావటాన్ని బలంగా చేయగలరు, సంబంధాన్ని పునరుద్ధరించి బలవంతంగా తమ శరీరంలోకి తిరిగి రాగలరు. అదేమీ అంత అనుకూలమైన వ్యవహారం

కాదు — మొత్తం అంతా కష్టమే. కాగితం మీద ఏమీ లేనట్లే చాలా తేలికైనట్లుగా కనపడుతుంది. కాని అది తేలిక కాదు.

ప్రశ్న: మీరిక్కడ ఇలా చెప్పారు: "అది కొంతమందికి మాత్రమే సాధ్యమైన విషయం". అంటే అర్థం దానిని చేసినవారు కొంతమంది ఉన్నారనేగా. కనుక వారు అమృతత్వాన్ని పొందినట్లే కదా, కాని ఇప్పటి వరకు...

అమృతత్వమా! లేదు, నేను దానిని అమృతత్వమని చెప్పలేదు. నేను చెప్పిన దల్లా వారు మృత్యుభయం పోగొట్టుకున్నారని మాత్రమే. కాని నీవనేది పూర్తిగా వేరైన విషయం.

ప్రశ్న: కాని వారు మృత్యు క్షేత్రంలోకి ప్రవేశించారు కూడా, కాదా?

అవును, కాని ఆ సమయంలో శరీరం చాలా మంచి స్థితిలో ఉన్నది. శరీరం మంచి స్థితిలో ఉంది, తిరిగి ఒకరు దానిని పొందగలరు — ఎల్లకాలం బయటనే ఉండిపోవటమనే మాట కాదు.

ప్రశ్న: కాని వారికా అనుభవం వచ్చింది, కనుక వారు వాస్తవంలో చనిపోయేటప్పుడు, వారు దానినే మరల ప్రయత్నించవచ్చును కదా?

వారి శరీరం మంచిస్థితిలో ఉంటే, కాని సాధారణంగా ఒకరు చనిపోయేటప్పుడు శరీరానికి ఏదో జరిగి ఉంటుంది, తెలిసిందా. శరీరంలో ఏదో ప్రమాదకరమైన పరిస్థితి నెలకొని ఉంటుంది. అయినప్పటికీ కూడా, శరీరంలో నుంచి బయటకు వెళ్ళినప్పుడు కూడా, శరీరంలో అస్తవ్యస్తమైనదానిని సరిచేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండరు అని నిశ్చయంగా చెప్పలేము. ఏదో చాలా గంభీరమైన విషయమైనటువంటి గుండెల్లో కత్తిపోటు లేక తల ఉత్తరించివేయబడటాలను తప్పించి! అది చాలా తీవ్రమైన విషయం, కాని శరీరం గనుక చెక్కుచెదరకుండా ఉండి, కేవలం ఒక అసమతౌల్య పరిస్థితి అయినట్లయితే, దానిని తిరిగి సరిచేయవచ్చు.

ప్రశ్న: మాతా, లంకెలు తెగిపోయినప్పుడు ఏం జరుగుతుం?

లంకెలు తెగిపోయినప్పుడా? — వారు మరణిస్తారు.

ప్రశ్న: కాని శరీరం నుంచి బయటకుపోయిన భాగం?

అదా, దానికి ఎరుక ఉంటే, పూర్తిగా ఎరుకతో ఉండిపోతుంది. దానికి దానిదైనటువంటి స్వతంత్ర జీవనం ఉంటుంది, అది పూర్తిగా ఎరుకతో ఉండిపోతుంది. తెగిపోయినా లేక పోకపోయినా అది దాని జీవితాన్ని ఏమాత్రమూ మార్చలేదు. అది

దానికి మరింత చైతన్యాన్నివ్వదు, దాని నుంచి దేనినీ తీసుకపోనూ లేదు — దానికున్న చైతన్యం, దానికున్న జ్ఞానం, దానికున్న ఆధిపత్యశక్తి, వాటన్నింటినీ అది ఉంచుకుంటుంది. ఇది చేయగలిగిన సామర్థ్యం కలిగినవారు శరీరం మీద ఆధారపడరు. అనగా, ఎరుకను కలిగి ఉండటానికి ఒకరు ఏమాత్రం ఆధారపడి ఉండరు — ఏమాత్రం — శరీరం మీద. మొత్తానికి అతడికి స్వతంత్ర చైతన్యం ఉంటుంది.

CWM 6:52-54 శ్రీమాత

మరణించకుండా మరణించడం

ప్రశ్న: కొంత సమయం కిందట మీరు మీ శరీరం ఇంత క్రితం మరణాన్ని గుర్తు చేసుకుందని చెప్పారు....

అవును, అయితే.

ప్రశ్న: కాని మీరు ఆ జ్ఞాపకాన్ని గురించి ఏమీ చెప్పలేదు.

అవును, అది ప్రతివారికీ తెలుసు: నేను త్లెమ్సెన్‌లో థియాన్‌తో పనిచేస్తున్నప్పుడు జరిగింది. నేను పూర్తిగా భౌతిక పద్ధతిలో శరీరం బయటకు వెళ్ళాను, శరీరం మానసికస్పృహ లేనిస్థితిలో ఉంది, అప్పుడు ఏదో వచ్చింది, ఏదో జరిగింది, అది లంకెను తెంపివేసింది. ఆ లంకె తెగిపోయింది.

ప్రశ్న: కాని ఆ విధంగా జరిగినప్పుడు అప్పటి అనుభవం ఏమిటి?

అనుభవం... (నవ్వు) లోనికి తిరిగి రావటం అసాధ్యం! కాని అక్కడ థియాన్ ఉన్నాడు (థియాన్ భయంతో హడలిపోయాడు!), అప్పుడు జ్ఞానం ఉన్నది — తగినంత జ్ఞానం ఉంది! — తాంత్రికపరంగా. జ్ఞానమూ ఉంది, దానితో పాటు ఇచ్ఛ కూడా ఉంది (వెడుతున్నట్లుగా శరీరంలోకి ప్రవేశించే సంజ్ఞను శ్రీమాత చూపారు), లోపల ఒక విశ్వాసం కూడా ఉంది (కాని నేనెప్పుడూ దాని గురించి మాట్లాడేదానను కాదు), ఒక ఏకాగ్రత. అతడి విషయంలో, ఆయన సమర్థుడు, ఆయనకు తెలుసు. అతడు 'లాగ' గలిగాడు. శరీరం పాడయిపోలేదు, తెలిసిందా, అది దెబ్బతిన లేదు, కనుక అది కష్టం కాలేదు. అది చాలా మంచిస్థితిలో ఉంది, కాని దారం తెగిపోయింది, అంటే అర్థం జీవితాన్ని ప్రసాదించేది బయటకు వెళ్ళి పోయింది. అది తిరిగి రాగలిగిన పరిస్థితి లేదు.

నేను ఆధిపత్యశక్తి, ఇచ్ఛ వలన తిరిగి రాగలిగాను, కారణం... యదార్థానికి, కేవలం నేను భూమి మీద ఇంకా ఏదో చేయవలసి ఉండటం మూలంగానే.

అది 1910 లో జరిగిందని అనుకుంటా.

The Mother: Conversations with a disciple June14, 1967

మరణం — వివిధ స్థాయిలలో

ప్రశ్న: అంటే ఆత్మ శరీరాన్ని వదలిపోలేదు, అంతే కదా?

ఆత్మ చాలా మట్టుకు తీర్మానించుకొనే అవకాశం ఉంది, అది శరీరం విలువను కోల్పోయిందని లేక ఇక తగనిదని లేక అసమర్థమైపోయిందని లేక అయిష్టతతో లేక... మరేదైనాగాని, ఇక శరీరం మరణించాలని ఆత్మ నిశ్చయించుకుంటుంది, అందువల్ల అది వెళ్ళిపోవచ్చు; కాని ఆత్మ వెళ్ళిపోవడం శరీరాన్ని చంపదు. లెక్కలేనంతమంది జనులు ఆత్మ లేకుండా ఉన్నారు — వారికి ఆత్మ ఉంటుంది, కాని వారి ఆత్మ వారి శరీరంలో ఉండదు — చాలామంది జనం. వారందరూ హాయిగా జీవిస్తున్నారు.

చెప్పాలంటే, చైత్య అస్తిత్వం లేకుండా జీవించటం చాలా కష్టం. సహజం గానే, చైత్య అస్తిత్వం వస్త్రం ధరించడం లాంటిది — ప్రత్యేక వ్యక్తిత్వ వస్త్రం — శాశ్వత ఆత్మకూ, వస్తూ పోతూ పోయే శరీరానికీ మధ్య, (ఆ జీవితం నుంచి జీవితానికి) అది వృద్ధి పొంది ఇంకా రూపుదిద్దుకొంటుంది, ప్రత్యేక వ్యక్తిత్వం సంతరించుకుంటుంది, ఎక్కువెక్కువగా వ్యక్తిత్వ ఎరుకను కలిగి యుంటుంది. ఆత్మ శరీరాన్ని వదలిన తర్వాత, సాధారణంగా మిగిలినదంతా దాని ననుసరి స్తుంది. కాని అది నేను కావాలని చేసినదాని వలన పొందిన అనుభవం, కనుక నాకు తెలుసు. ఒకరికి అది ఎలా చేయాలో తెలిసి యుండాలి, కాని అది చేయ వచ్చు. నా చైత్య అస్తిత్వం ఇక్కడ శ్రీఅరవిందులతో ఉంది, నేను నా మానసిక, ప్రాణిక, భౌతిక అస్తిత్వాలతో వదలి వెళ్ళాను. అది... కొద్దిగా విపరీత స్థితి. కాని నేను ఆ సంబంధాన్ని పూర్తి ఎరుకతో కూడి చేయటం మూలంగా, అది చేయ బడింది.

జనులు "మృత్యువు" అని పిలిచేదానిని.... నేను ఎంతో మంది జనులను కుప్పలు కుప్పలుగా చూశాను, నా దృష్టిలో వారు, జీవన్మృతులు (వారెవరంటే

చైత్య అస్తిత్వం లేనివారు, లేక ఆత్మతో సంబంధం లేనివారు కూడా). కాని అది తెలియాలంటే అంతరంగదృష్టి ఉండాలి. కాని జనులు పిలిచేటటువంటి "మృత్యువు", అది, జీవకణాలు కుళ్ళిపోవడం, రూపం కరిగిపోవడం, అది ఎప్పుడు జరుగుతుందంటే అత్యంత భౌతిక "ప్రాణిక అధోస్థాయి", ఏదైతే జీవితంలో — ప్రాణికశక్తితో, జీవితంతో — సంబంధం కలుగుజేస్తుందో అది బయటకు వెళ్ళిపోతుంది. ఉదాహరణగా చెప్పుకోవాలంటే జంతువులలో మరణం ఆ విధంగా ఉంటుంది. ఆ "ప్రాణిక అధోస్థాయి" బాహ్యజీవికి ఇంకా కొనసాగించే సామర్థ్యం లేనప్పుడు సాధారణంగా బయటకు వెళ్ళిపోతుంది. అనగా, ఉదాహరణకు, అది రెండుగా నరకబడినప్పుడు లేక గుండె తీసివేయబడినప్పుడు, లేక పూర్తిగా ఏదో విపరీతం దానికి జరిగినప్పుడు! కారణం, కొంతమంది జనులు ప్రమాదాలకి లోనయినప్పుడు, చాలా భాగాలు లేకుండాపోయి, అప్పటికీ జీవిస్తున్న సందర్భాలలో. కాని హృదయం కొట్టుకోవడం ఆగిపోయినప్పటికీ, నేను మునుపు చెప్పిన విధంగా, అది తప్పనిసరిగా మృత్యువు అవవలసిన అవసరం లేదు, ఎందువల్లనంటే అది ఆగిపోయిన తర్వాత, గుండె తిరిగి కొట్టుకోవడం ఆరంభించగలదు. భౌతిక జ్ఞానం కలిగినవారు చెప్తారు.... కొంతమందిలో నేను కొన్ని సెకనులో, నిమిషాలో మరిచిపోయాను. గుండె తిరిగి పనిచేయగలదు. దాని తర్వాత కుళ్ళటం మొదలవుతుంది. కుళ్ళటంతో సహజంగా అంతా అయిపోయినట్టే.

కనుక మనం సరిగ్గా చెప్పగలిగేదేమంటే, మరణంలో కొన్ని దశ లున్నాయి. జీవితంలో దశలు, మరణంలో దశలు: కొన్ని అస్తిత్వాలు అధికతర స్థాయిలో లేక అల్పతరస్థాయిలో సజీవులు, కాని ఇంకా నకారాత్మకంగా చెప్పదలచుకొంటే, కొన్ని అస్తిత్వాలు అధికతర లేక అల్పతర స్థాయిలలో మరణించే ఉన్నారు. కాని తెలిసినవారికి మాత్రం, ఓహ్, ఎవరికైతే ఈ భౌతికరూపం అతిమానసకి ప్రకాశాన్ని అభివ్యక్తం చేయగలదని తెలిసినవారు. ఇంకా ఎవరి యందైతే అతిమానసం లేదో వారు అప్పటికే కొంత మరణించినవారు. అది ఆ విధంగా ఉంటుంది. కనుక, అక్కడ దశలున్నాయి, జనులు సాధారణంగా "మృత్యువు" అని పిలిచేది, వాస్తవానికది పూర్తిగా బాహ్యవిధానం, ఎందువల్లనంటే, దానిని వారు కాదనలేరు — శరీరం ముక్కలైపోవడాన్ని.

The Mother: Conversations with a diciple: June 14, 1967

జీవితానికీ, మరణానికీ మధ్య తేడా పెద్దగా ఏమీ లేదు.

...అక్కడేమీ పెద్దగా తేడా ఏమీ లేదు, జనులు పిలిచే 'జీవితం', వారు 'మృత్యువు' అని పిలిచేదానికీ, తేడా చాలా స్వల్పం, అది ఇంకా తక్కువై, చిన్నదై పోతుంది, నీవు సమస్యను ఇంకా లోతుగా, అన్ని వివరాలలోకి వెళ్ళితే. జనులు వాటి రెండింటి మధ్య స్పష్టమైన తేడాను నిర్ణయిస్తారు — అది పూర్తిగా బుద్ధిహీనత: జీవిస్తున్నా అప్పటికే సగం చచ్చినవారు — కొంతమంది కాగా చనిపోయిన చాలామంది సజీవులే.

The Mother: Conversations with a diciple: October 4, 1967

...మనిషికి మృత్యువు సంగతి ఏమీ తెలియదు — అతడికి అదేమిటో తెలియదు, అతడికి ఏమి జరుగుతుందో తెలియదు, అతడు అన్ని రకాలైన ప్రతిపాదనలు తయారుచేసాధు, కాని వాటిలో ఏదీ కచ్చితం కాదు. ఇంకా ముందుకు నెడితే, ఈ విధంగా నెడుతూ ఒత్తిడి చేస్తే, నేను ఎటువంటి ముగింపుకు చేరానంటే వాస్తవానికి మృత్యువు అనేది ఏదీ లేదు.

అక్కడ కేవలం కనపడేదే ఉంది, పరిమితమైన దృష్టితో చూసే ఒక దృశ్యం. కాని చైతన్యం స్పందనలో విప్లవాత్మకమైన మార్పు ఏమీ లేదు.

CWM 11:61

శ్రీమాత


అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అది జీవితానికి, మరణానికీ మధ్య ఏ తేడా లేదనే అనుభూతిని మీకు కలిగించడానికి చేసిన ప్రయత్నం వంటిది.... అది జీవితం లేక మరణం కాకుండా మరేదో అయినటువంటిది — మృత్యువని మనం పిలిచేది కాదు, జీవితమని పిలిచేదీ కాదు — అది మరేదో. అది.... దైవం.

లేక దైవం దిశగా మన తరువాతి అడుగూ కావచ్చు.

The Mother: Conversations with a diciple: December 9, 1972

అనువాదం: డా: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



మరణించడ మనేది లేదు. కేవలం శాశ్వతుడే చనిపోగలడు. మరణించేవాడు పుట్టడు, నాశనమూ కాడు.


Thoughts and Aphorisms — శ్రీఅరవిందులు

శాశ్వతుడు సజీవ స్థితి నుంచి మృత్యుస్థితికి పయనించగలడు, (కాని మన మనుకునే 'మృత్యువు' కాదు; 'చావగలడు' అంటే 'స్థితిని మార్చుకోగలడు' అని అర్థం). శాశ్వతుడు ఈ స్థితి నుంచి ఆ స్థితికి పయనించగలగడంతో పాటు మరల వెనుకకూ, ముందుకూ పోగలడు. మనం దానిని 'మృత్యువు' అని పిలుస్తాం, కాని దానికీ జీవితానికీ లేక మృత్యువుకూ ఎటువంటి సంబంధమూ లేదు. అవి స్థితుల మార్పులు.

CWM 10:96 — శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

The Mother: Conversations with a disciple, May, 12, 196



మృత్యువు ప్రతివారికి సంభవిస్తుందని బుద్ధుని బోధనలో చెప్పబడింది. కానీ, బుద్ధునికి తెలుసు మరణాన్ని జయించడం సాధ్యమని. అయితే, ఆ కాలంలో లోకానికి ఈ సత్యం అర్థం చేసుకోగలిగిన సంసిద్ధత లేదు.

మృత్యువును జయించవచ్చునని, శరీరం అమరత్వం పొందగలదని శ్రీఅరవిందులు అన్నారు, కాని, ఇది ప్రతివారి విషయంలో సాధ్యపడదు. మరణించేటప్పుడు దైవాన్ని స్ఫురణకు తెచ్చుకొని పరమసత్య దర్శనానికై తీవ్రవాంఛ కలగాలి. ఆ విధంగా వారు అతి సులభంగా, ప్రశాంతంగా మృత్యువు ఒడిలోకి జారిపోవచ్చు, పరమ సత్యాన్వేషణ దిశగా పయనం ప్రారంభించవచ్చు.

*

ఎప్పుడైన మనుషులు తమను గురించి మాత్రమే ఆలోచించ కూడదు. అందుకు బదులు వారి ఆలోచనలను దైవంపై నిలపాలి. అప్పుడు వారి కష్టాలన్నీ తొలగిపోతాయి. వారు తమను తాము దైవం చేతుల్లోకి సమర్పించుకోవాలి, ఎందుకనగా వారి కరకమలాలు వారి పిల్లలను తమ ఒడిలోకి చేర్చుకొనుటకు సిద్ధంగా నుంటాయి. మనుషులు భగవంతుని శరణు జొచ్చితే కష్టాలన్నీ తొలగిపోతాయి.

Mother You Said So: 4th & 10th Dec 1957

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మరణించిన తర్వాత శ్రీఅరవిందుల రక్షణ

ఉదయాన శ్రీమాతకు నేను మృత్యుంజయుని పెద్దక్క చనిపోయిన సంగతి తెలియజేశాను.

శ్రీమాత అన్నారు, "అవును, ఆమెకు బహుకాలంగా ఒంట్లో బాగుండటం లేదు, జబ్బుపడి వున్నది".

బాల్కనీ దర్శనం పూర్తయిన తర్వాత శ్రీమాత ఉదయం ఫలహారం భుజించటానికి కూర్చున్నప్పుడు, చాలా ఆసక్తిదాయక విషయమొకటి తనకు తెలియవచ్చిందని ఆమె చెప్పారు. మృత్యుంజయుని సోదరి నుదుటి మీద శ్రీఅరవిందుల చిహ్నాన్ని ఆమె చూశారు. శ్రీమాత ఎంతో ఆశ్చర్యపడి తనలో తాను, "ఏమిటి? ఇక్కడ...." అప్పుడు ఆమెకు శ్రీఅరవిందుల వాణి వినవచ్చింది, "ఇక నుంచి ఇక్కడ చనిపోయిన వారెవరైనా, నేను నా చిహ్నాన్ని వారి మీద ఉంచుతాను, వారు ఏ పరిస్థితులలో ఉన్నప్పటికీ, వారికి రక్షణ ఇవ్వబడుతుంది". అప్పుడు సమయం ప్రొద్దున 6 గంటల 30 నిమిషాలైంది.

చనిపోవటానికి సరియైన స్థలం బెనారసు అని (వారణాసి) నేను విన్నాను, కాని ఇప్పుడు శ్రీఅరవిందులు ఇంకా మంచి, భద్రమైన చోటును సృజించారు.

Champaklal Speaks: p. 234

మృత్యువుపై విజయం

మహాభినిష్క్రమణ కోసం మరణించుట

విషయం ఏమిటంటే ఆ 'మహాశక్తి' యే ఈ ప్రపంచాన్ని నొప్పించకుండా మార్చగలదు. ఇప్పటికీ ప్రపంచం అందుకు సిద్ధంగా లేదు. దానికి "అనంతప్రేమ" అంటే అవగాహన లేదు. కాని 'అనంతప్రేమ' అన్ని సమస్యలనూ తీర్చగలదు; సృష్టికి సంబంధించిన సమస్యలను కూడా! ఇక అప్పుడు ప్రపంచానికి ఏ సమస్యలు మిగిలి ఉంటాయి? మీకు నేను విశదంగా చెప్పినా ఆ అనుభవం నాకు రూఢి అయింది ఏప్రియల్ 13, 1962 తరువాతనే! ప్రపంచానికి అది ఇంకా ఇప్పుడే

అవగాహనలోనికి రాదు. ప్రపంచం అందుకు ఇంకా సిద్ధంగా లేదు. ఈ విషయం అర్థం చేసుకోవాలంటే బహుశ ఇంకో వెయ్యి సంవత్సరాలైనా పట్టవచ్చు. కాని ప్రపంచం దానికి సిద్ధం అవుతున్నదని అనిపిస్తున్నది. 'విశ్వప్రేమ' భూమీమ్మీద అవతరించే ఛాయలు గోచరిస్తున్నాయి. ఇది నిరంతరం గుర్తించుకోగలిగితే త్వరలో 'అతీతశక్తి' ఆవిర్భవించినట్లే.

వినటానికి ఇంపుగ వున్నవి ఎన్నయినా చెప్పవచ్చు, కాని వాటివలన ఏమాత్రం స్పష్టత రాదు. 'మరణం' కోసం చేసే దేహత్యాగం వలన అమృతత్వం వస్తుందని చెపితే ఎవరికీ అర్థం కాదు, కాని అది అర్థవంతమే. అసలు 'మరణం' అనేది వుంటుందా 'చనిపోవటానికి'! ఈ విషయం స్ఫటికం వలె పారదర్శకమైనదే, కాని అదే సమయంలో అర్థం కానిది కూడా! చనిపోవటం అంటే నిజానికి మంద మారుతం సాంద్రతను సంతరించుకోవటం లాంటిదే. భౌతికంతో మనకు ఉన్న బలమైన అనుబంధమే దీన్ని అర్థం చేసుకోనీయని పెద్ద అడ్డంకి. భౌతిక స్వరూపమే అసలైన సత్యమని మనం అనుకోవటమే ఇందుకు కారణం.

ఈ విషయాన్ని బోధపరచటానికి ఏదైనా చేసి నిరూపించాలని అనుకుంటున్నాను. నా భౌతిక స్వరూపానికి భిన్నమైన లీలామాత్రపు భౌతికంలో మీకు కనిపించటం చాలా అరుదు. సాధారణంగా ఇతరులకు బాగా అవగాహన అయ్యే విధంగానే వాళ్ళకు కనిపిస్తాను. అదే సమయంలో వాళ్ళకు "ఇంకో భౌతికం కూడా శ్రీమాతకు ఉన్నది" అనే అవగాహన కూడా కలుగుతుంది. (శ్రీమాత తమ దేహాన్ని తాకి చూపిస్తారు) నిజం చెప్పాలంటే ఆ రెండో దేహం కూడా నాదే! ఆ ఆకారాన్ని మీరు కూడా చూడాలనుకుంటే మీరు 'సర్వోన్నతుని' సాన్నిధ్యాన్ని సాధించాల్సి వుంటుంది.

నన్ను చూడాలని అనుకునే వారంతా వారు చూస్తున్న ఈ దేహమే నేను అనే భ్రాంతిలో ఉంటున్నవారే. ఉధృత ప్రవాహం లాంటి చలనాత్మక రూపాలన్నీ సత్యమైనవే. కొన్ని ఈ కనపడే రూపం కన్నా ఎక్కువ సత్యమైనవి. నాదైన చేతనతో నేను గమనించినది మాత్రం ఈ కనపడుతున్న రూపం ఒక వికృతి అనిపిస్తుంది. వికృతియే కాదు, సత్యస్వరూపానికి పూర్తిగా భిన్నమైనటువంటిది. దాని లక్షణం వేరు. దాని లక్షణం దానికి ఉండేది. (జరిగినదానిని గురించి చెపుతున్నట్లుగా వుంది కదూ? అప్రయత్నంగా వచ్చినట్లుంది). అట్లా వుండటం దానికి అవ

సరం కూడా! దాని పని దానికి ఈ ప్రపంచంలో వుండనే వుంది.

అసలు ఈ భౌతిక ఆకారంతో నాకు అంత అనుబంధం ఎప్పుడూ ఉండేది కాదు. (ఏమీ తెలియని రోజుల్లో కూడా అంతే.) కేవలం నాలోని 'చేతన' తోనే నాకు అనుబంధం ఉండేది. దానిని భద్రంగా ఉంచుకునేదానిని. అదే నాకు అమూల్యంగా తోచింది. ఈ భౌతిక దేహం ఏమైనా అంత మంచిసాధనమా నిజంగా ఆలోచిస్తే? దీనికి ఏ స్థిరత్వమూ ఉండదు. ఎటు వంచితే అటు వంగుతుంది; అవసరానికి అనువుగా మారుతూ ఉంటుంది. అన్ని దృక్పథాలు దానివే! దానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటుంది. అన్ని ఆదర్శాలు తనకు అనివార్యంగా కనిపిస్తాయి. ఇదే దానికి గల ఒకే ఒక సుగుణం. దానికి ఎంత స్వాభిమానం అంటే దేనిమీద పైచేయిగా ఉండదు. ఎవరినీ కాదనదు. అదే సమయంలో తన బలహీనతలను కూడా అది గుర్తించగలదు; ఏదైనా చెయ్యగలదు. చేస్తుంది కూడా! కావాలనే అది అలా రూపొందించబడింది. అట్లా జరగటం అవసరమే. సున్నితమైన వ్యక్తిత్వం ఒదిగి ఒదిగి తన కంటె ఉన్నతమైన వాటిని, ఉధృతమైనవాటిని కూడా భరించగలదు.

ఆ విషయాలు ఇక ఆపేద్దాం. అవి 'చేతన' కు సంబంధించినవి. 'చేతన' అంటే ఇక్కడ విశ్వచేతన. అది ఇంకా గొప్పది. అవసరాన్ని బట్టి సర్దుకుపోయే శక్తి దానికి కూడా ఉంటుంది. అట్లా వుంటేనే కదా అది పని కొచ్చేది.

The Mother: Converstions with a disciple, July 4, 1962

ఊర్ధ్వజీవనమే ముందడుగు

ఈ దిశగా మనం వేయవలసిన మొదటి అడుగు 'భిన్నత్వం' నుండి దూరంగా వుండటం. దేన్నీ వేరుగా చూడరాదు. 'వేర్పాటు' మనం చేసేదానిలో భిన్నత్వాన్ని, విభేదాలను సృష్టించే ఒక సంకేతమే. 'ఇదే కావాలి; అది కాదు' అని కొందరు పట్టుపడతారు. కాని 'ఇదిగాని అదిగాని, ఏదైనా సరే'అనే భావాన్ని మనం పెంచుకోవాలి. జీవితానికి అన్నీ కావాల్సిందే. మనలో 'స్థితిస్థాపకత' (ఎట్లా బడితే అట్లా వుండగలగటం) పెరగాలి. విశాల భావాలు ఏర్పడాలి. సంకుచిత ధోరణులకు స్వస్తి చెప్పాలి. అప్పుడు అంతా మనదిగానే కనిపిస్తుంది. ప్రస్తుతం నేను పడే తపన దాని కోసమే.

శరీరం కూడా "ఇది కావాలి, అది వద్దు" అని మారాం చేస్తుంది. కాని 'ఏదైనా ఒకటే' అనే విధంగా దాన్ని మలచుకోవాలి.

ఇదే విధంగా 'జీవితము' — 'మరణము' అనేవి కూడ పరస్పర విరుద్ధ భావనలే. కాని 'ఊర్ధ్వజీవనం' లో ఆ తేడాలు వుండవు. అసలు 'ఊర్ధ్వజీవనము' అని దేన్ని పిలుస్తారు? విషయం ఏమిటంటే, మనం 'ద్వైదీ భావన' కు అలవాటు పడ్డాము: "నలుపు — తెలుపు", "మంచి – చెడు", "జీవించటం — మరణించటం". ఇవి మన భావనా ప్రపంచంలో పరస్పర విరుద్ధాలు. దీనికంతా కారణం మనలోని సంకుచితతత్వమే.

The Mother: Converstions with a disciple, January 3, 1970

అన్నిటినీ మించిన తత్వం

ఈ మధ్యనే మీకు చెప్పినట్లు గుర్తు: "శరీరం మరణించక ముందే మరణాన్ని అనుభవిస్తుంది" అని. ఒక విధంగా ఇది అనివార్యమే: ఎప్పుడో ఒకనాడు వచ్చే మార్పుకు ఇప్పుడే సిద్ధపడటం.

శరీరం శిథిలమవటం చివరకు కనపడకుండాపోవటం చాలా కాలంగా మనలను కలచివేస్తున్న ఒక భ్రమ. దీని నుండి త్వరగా బయటపడాలి. ఇప్పుడు మరో దృక్పథం కూడా అవగాహన లోనికి వస్తున్నది: శరీరం పూర్తిగా కనుమరుగైతే (అంటే మరణిస్తే) దాని విస్తృతి ఇంకా పెరుగుతుంది అనిపిస్తున్నది. చేతన యొక్క పరివ్యాప్తి ఇంకా అధికమౌతుంది. మీకు ఈ విషయంపై ఇంతకన్నా అవగాహన కల్పించటం నాకు చేతకావటం లేదు. ఒక విధంగా నా చేతనే నాకు అడ్డు వస్తున్నది. "వ్యక్తి" అనే భావన దేనికి కావాలో, అది లేకపోతే వచ్చే అనర్థం ఏమిటో నేను మీకు వివరించలేనేమో అనిపిస్తున్నది. సత్యచేతనకు 'శరీరం' పెద్ద అవరోధం. ఇది దానికి తెలుసు కూడా. అన్ని బాధలకు కారణం కూడా ఇదే. ఈ భేదభావం ఎప్పుడు పోతుందో అప్పుడు సాన్నిహిత్య భావన, దానితోబాటు బాధల నుండి విముక్తి లభిస్తాయి.

మొదటగా "అది వేరు, ఇది వేరు" అనే భ్రమ అంతరించాలి. "నేను దాని కోసం లేను; అట్లా భేదభావం నాలో వున్నంత కాలం నా ఉనికే ప్రశ్నార్థకం అవుతుంది", అని భావించాలి. అట్టి భావన మన మనసులో కలిగినపుడు మన

వైఖరి ఉత్తమము అవుతుంది. అప్పుడు విశ్వచేతనలో లయించటం కూడా సాధ్య పడుతుంది.

The Mother: Converstions with a disciple, January 31, 1970

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు.

మృత్యువుపై శ్రీమాత సల్పిన కృషి

మృత్యు రక్కసి — జీవన మంత్రము

నేను ఆ నాలుగు అసురశక్తులను కోరి కలవలేదు — అది ఒక దైవ నిర్ణయము.

మొదటిది, మతపరంగా సైతాను అని పిలువబడేది. మహాచైతన్యాన్ని ఆవహించిన అసురశక్తి — అది పరివర్తన చెంది ఇంకా తన పనిని కొనసాగిస్తున్నది. రెండవది, వేదనను కలుగచేసే అసురశక్తి — తనకు తానుగా పరమాత్మ దివ్య శక్తిలో లీనమయింది. మూడవది, మృత్యుదేవత — అది థియోను (శ్రీమాతకు మార్మికవిద్య నేర్పిన గురువు రూపం). ఇక నాల్గవది అజ్ఞానాంధకారాలు అలముకొన్న ఐహిక ప్రపంచానికి అధినాయకుడుగా నున్న మాయాలోక ప్రభువు.

థియోను మృత్యుదేవత యొక్క విభూతి/ వ్యక్తిత్వ ప్రతిరూపము.

ఏమైనప్పటికీ, థియోను కారణంగానే నేను మొదటిసారిగా జీవనమంత్రాన్ని దర్శించాను — అది ప్రాణాన్ని ప్రసాదించగలిగే మంత్రం. అతడు దానిని తనకు ధారాదత్తం చేయమని అడిగాడు. దానిని తన స్వంతం చేసుకోవాలని అతని అభిలాష — ఒక విధంగా అసాధ్యమైన పని. అది ప్రాణప్రదాన మంత్రము. (ఎవరినైనా పునర్జీవింప చేయగలదు, అయితే దాని అపారశక్తిలో ఒక అల్ప అంశ మాత్రమే). అది అంతరంగ సీమలలో ఒక ప్రత్యేక గుప్తస్థానంలో మూయబడి, సంస్కృతంలో వ్రాయబడిన నా నామాక్షరాలతో ముద్రవేయబడి వుంది. అప్పుడు నాకు సంస్కృతము తెలియదుగాని అతనికి తెలుసు. నన్ను ఆ దరికి చేర్చి నపుడు, నాకు కనిపించినది అతనికి చెప్పాను. 'అక్కడ ఒక నమూనా లాంటిది వున్నది. అది సంస్కృతం అయి వుండవచ్చు' (సంస్కృత అక్షరాలను నేను గుర్తించగలను) నేను చూసినదాని ప్రతిని వ్రాసి చూపించమన్నాడు. ఆ విధంగా

చేసాను. అది నా పేరు మిర్రా, సంస్కృతంలో వ్రాయబడినది — ఆ మంత్రం నాకై నిర్దేశింపబడింది., నేను మాత్రమే దానిని వెల్లడి చేయగలను. 'దానిని తెరచి అందులో ఏమున్నదో నాకు చెప్పు' అని అన్నాడు. (ఈ వ్యవహారమంతా నా మనస్సు స్తబ్ధమైన స్థితిలో నున్నప్పుడు కొనసాగింది). అప్పుడు తక్షణం నా అంతరాత్మలో ఒక అవగాహన మెరుపులా మెరిసింది. 'వద్దు' అని బదులిచ్చాను, నేను అది చదివి చెప్పలేదు

నేను శ్రీఅరవిందులతో నున్నప్పుడు అది మరొకసారి దర్శనమిచ్చింది. దానిని శ్రీఅరవిందులకు సమర్పించాను

The Mother: Converstions with a disciple, November 5, 1961

రూపాంతరంలోని చిక్కు

రూపాంతరం చెందిన తరువాత ఎవరైనా ఉండవలసిన స్థితి ఈ విధంగా నుండాలి — అంతా దైవమయం, అంతా ఆశ్చర్యకరం, అంతా అత్యద్భుతం, అంతా ఊహాతీతమైన ప్రేమమయం, సర్వం... సర్వం అపారమైన ఆనందం, ఒక మార్పుకు గురికాని, భిన్నావస్థలలో సైతం మార్పు చెందని, సర్వదా జాగ్ర దావస్థలో ఉండగల స్థితి. అట్టి అద్భుత అలౌకిక స్థితిలో జీవిస్తూ, బుద్ధిహీనంగా, మూర్ఖంగా, సరైన దృక్పథం కోల్పోయి, శక్తిసామర్థ్యాలు ఉడిగి, రకరకాల నొప్పులు, అస్వస్థతలు, బలహీనతలు, అశక్తతలతో అగచాట్లకు గురైన ఈ దైహిక పదార్థంతో అట్టి మహదానందమయ స్థితికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ, అదే సమయంలో ఈ శరీరంలో ఇట్టి ప్రతిస్పందన "ఓ ప్రభూ, మీ కరుణ అనంతం" కలగటమనేది ఒక అసంగతమైన విషయం మనసును వికలం గావిస్తుంది.

అనుభవంతో నాకు బాగా తెలిసినదేమిటనగా, ఎప్పుడైతే ఒక వ్యక్తి గొప్ప జ్ఞానిగానో లేక పూజనీయుడైన మతాచార్యుడిగానో ప్రసిద్ధి గాంచటంతో సంతృప్తి చెంది, ఆ స్థాయికి తగ్గ వైఖరిని నిలబెట్టుకోగలిగినట్లయితే, అంతా సవ్యంగా సాగిపోతుంది — శరీరం అస్వస్థతకు గురి కాదు, ఒక వేళ అయినా దాని నుండి అతి సులభంగా తేరుకోగలదు. అంతా సవ్యంగా కొనసాగుతుంది.... ఎంతవర కంటే పరివర్తనంచెందాలనే సంకల్పం పొడచూపనంతవరకు. కష్టాలు ఎదురయ్యే దెప్పుడంటే, పరివర్తన చెందాలనే సంకల్పానికి వ్యతిరేకత వ్యక్తమైనపప్పుడు.

అయితే ఎవరైనా "సరే మంచిదే. విషయాలెలా వున్నాయో అలాగే వుండనీ, ఫరవాలేదు. నేను చాలా సంతోషంగా వున్నాను. ఒక పరమానంద స్థితిలో నున్నాను" అని అనుకోగలిగితే శరీరం తృప్తిపడటం ప్రారంభిస్తుంది.

The Mother: Converstions with a disciple, July 15, 1961

సహనశక్తి ఆవశ్యకత

ఏదో పూర్తిగా కొత్తదైన విషయ మొకటి భౌతికంలోనికి ప్రవేశింపచేయడం, దానిని శరీరం అంగీకరించకపోవడం — అదీ అసలు సమస్య.

నేను 'మహాప్రకృతి' తో ముఖాముఖి సంభాషణ జరిపిన అనంతరం, సహకరిస్తానని ఆమె నాతో చెప్పినప్పుడు ఈ ప్రతిబంధకం పూర్తిగా అంతరించి పోతుందని అనుకున్నాను. ఎన్నో విషయాలు గణనీయంగా మెరుగు పడ్డాయి, ఈ సమస్య తప్ప (ప్రకృతి యొక్క ఒక భాగం సహకరిస్తున్నది కాని ఇది కాదు). అది అవచేతన నుండి, అచేతన నుండి బయల్వెడలటం నిరంతరం నిర్విరామంగా వృద్ధి చెందుతున్నది. (ఎక్కడైతే చైతన్యం విరాజిల్లుతున్నదో అక్కడ అంతా సవ్యంగా వుంటుంది) ఓహ్, ఎంతగా విసుగు పుట్టించే విషయం!... ఉదాహరణకు, నేను మొదట్లోనే చెప్పినట్లుగా ఒక జ్ఞానికిగాని లేక ఒక మతాచార్యుడికిగాని శరీర రూపధారణ కుండే ప్రాధాన్యత అత్యల్పం, అప్రధానం, కాని ఈ అతిమానస కార్యాచరణ విషయంలో ఆధ్యాత్మిక అంశాలకు, మానసిక అంశాలకు ఈయబడిన ప్రాధాన్యతతో పోలిస్తే శరీరనిర్మాణ పద్ధతి కీయబడిన ప్రాముఖ్యత అతి కీలకమైనది: వీటికి ఏ మాత్రం కూడా ప్రాధాన్యత ఈయబడలేదు. ఓర్పుతో ఉనికిని చివరిదాకా నిలుపుకోగలగటమే అత్యంత కీలకమైన విషయం.

సరే, ఈ విషయంలో నా శరీరానికున్న శక్తి శ్రీఅరవిందులకున్న శక్తికన్నా అధికమైనదనుట బేషరతుగా ఒప్పుకోవాలి.

ఈ వాస్తవికతే పరిష్కారానికి ప్రధానమయింది — కారణం, మా ఇద్దరి (శ్రీఅరవిందులు, శ్రీమాత) తాదాత్మ్యత అతి సులువుగ సమకూరుతుంది: నాకు వారిలో లీనమైపోవడంగాని, లేక వారు నాలో లీనమవటంగాని అసలు సమస్యే కాదు, కష్టం కాదు. ప్రత్యేకంగా ఈ విషయాన్నే కొన్నిసార్లు చర్చించాము. నేను వారితో అన్నాను: ప్రస్తుతమున్న పరిస్థితులలో నేను ఈ శరీరాన్ని

త్యజించి వారిలో లీనమైపోవటం విచారించతగ్గది, కష్టమైనది కాదని; ఈ విషయం వారికి ఆలోచనా రూపంలో కాదు, మాటల ద్వారానే తెలియచేసాను. వారు కూడా నాకు మాటల ద్వారానే సమాధాన మిచ్చారు: "ఈ పని కోసం నీ శరీరం పరిత్యజించ వీలుపడదు, నీ శరీరం లేకుండా ఈ కార్యం నెరవేరదు". అటు పిమ్మట ఇక నేనేమీ అనలేదు, ఇక నాకు దానిని గురించిన చింత అవసరమనిపించ లేదు. అంతటితో ఆ ప్రసక్తి ముగిసింది.

ఇది 1949 లో చెప్పబడింది — వారు దేహపరిత్యాగం చేయటానికి ఓ సంవత్సరానికి కొంత ముందుగా.


నిజంగా ఆ మాదిరిగానే జరిగింది.

The Mother: Converstions with a disciple, July 7, 1961

ఈ దేహము — ఒక రణరంగము

విశ్లేషించి చూస్తే చివరికి తేలేదేమిటంటే ప్రతి విషయము తప్పక దైవేచ్ఛ పైనే ఆధారపడి వుంటుందని, ఎందుకనగా మరింత లోతుగా పరిశీలించినట్లయితే, భౌతిక ధర్మాలు, నిరోధక శక్తులు దైవానికి లెక్కించతగ్గవి కావు అని తెలుస్తుంది. కాని దైవం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవటమనేది పరిస్థితులు హద్దు మీరి చేజారిపోయే సమయంలో మాత్రమే. ఆతని మహాసంకల్పానికి ప్రతికూలత వ్యక్తమైనప్పుడు, దైవసాక్షాత్కార నియమాలకు వ్యతిరేకత ఎదురైనప్పుడు. అయితే ఆ సంభావ్యత చిట్టచివరి క్షణంలోనే కలుగుతుంది. శ్రీఅరవిందులు ఈ ఘటనను 'సావిత్రి' లో ఎంతో చక్కగా వ్యక్తపరచారు. ఈ గ్రంథంలో, కనీసం మూడుసార్లు ఈ సమాజంచే గుర్తింపు పొందబడిన నియమాలను, వాటి పర్యవసానాలను, దైవసాక్షాత్కారానికి దారితీసిన దారుణ పరిస్థితులను రద్దుపరచగలిగిన దైవసంకల్ప బలమేదైతే తనకు తానుగా అభివ్యక్తమవగలదో, దానిని ఎంతో చక్కగా ఉటంకించారు — ఇది చోటు చేసుకొనేది చిట్టచివరి క్షణంలో, అనగా, హద్దు మీరబోయే సంభావ్యత ఏర్పడినప్పుడు.

కొన్ని మాసాల క్రితం ఈ శరీరం మరొకమారు ఒక రణరంగంగా మారి ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటున్నప్పుడు, తాత్కాలికంగా నిశ్చేష్ట స్థితిలోకి జారిపోయినప్పుడు, తనను తాను ఇలా ప్రశ్నించుకున్నప్పుడు... అది మేధా



రూపాంతర పరిణామం చెందిన మృత్యువు, దివ్యజీవన మవుతుంది; అదే అమరత్వం. పరివర్తన చెందిన క్రూరత్వము అపారమైన దివ్యప్రేమ అవుతుంది; అదే అప్రమేయమైన పారవశ్యకత. రూపాంతర పరివర్తన చెందిన అజ్ఞానం, వివేక విషయ పరిజ్ఞానాన్ని మించిన దివ్యజ్ఞాన కాంతి అవుతుంది.

Sri Aurobindo, Thoughts & Aphorisms; CWM 10:164-65 శ్రీమాత

అనువాదం; అందుగులపాటి కైలాసపతి

పరంగా ఆలోచించటం కాదు కాని ఒక విధమైన స్ఫూర్తిని పొందాలని ఏదో స్వర్గానుభూతిని పొందాలనే ఆరాటం... తాను ఏ దిశను అనుసరిస్తున్నానో, విషయాలు ఏ మాదిరిగా మార్పు చెందుతాయో అని ఆశ్చర్యపడటం. హఠాత్తుగా జీవకణా లన్నింటిలో ఈ భావన ఏర్పడింది. (అది ఎక్కడి నుండి వచ్చిందో నాకు తెలుసు) " మనము ఈ భావజాల మిశ్రమం నుండి వేరు చేయబడితే ఈ భావసముదాయం చెదరగొట్టబడి అటుపై కొనసాగకపోయినట్లైతే, మనం తప్పక నేరుగా పోగలుగుతాము, సూటిగా ఒక బాణంలా" — అది ఒక మహాద్భుత కాంతికిరణం — ''తిన్నగా శ్రీఅరవిందులను, మన తలవాకిట ప్రత్యక్షంగానున్న వారి అతిమానస ప్రపంచంలో, తిరిగి కలవటానికి." ఆ భావనలో ఎంత ఆనందం, ఎంత ఉత్సాహం! జీవకణా లన్నింటిలో ఎంతో ఉత్సాహం ఉరకలెత్తింది! అవి తాము వేరుచేయబడతామా లేదా అనే విషయాన్ని ఏమాత్రం ఖాతరు చేయ లేదు. "ఓహ్, అయితే ఏం!" అన్నట్టుగా వుంది వాటి వాలకం.

శరీరాన్ని ప్రకాశవంతం గావించే పనిలో ఇది నిజంగా ఒక నిశ్చయాత్మక దశ.

జీవకణాలన్నీ తమను వేరు చేయాలని ప్రయత్నిస్తున్న ఆ మూఢశక్తి కన్నా తాము ఎన్నో రెట్లు అధిక శక్తివంతమైనవనే అనుభూతి చెందాయి. మృత్యువు అనబడే పదంపై వాటికి ప్రాశస్త్యం పోయింది. "మాకు లెక్కేమిటి? మేమక్కడికి వెళ్ళి, ప్రపంచ రూపాంతరీకరణ అనే శ్రీఅరవిందుల కార్యంలో, ఏదో ఒక విధంగా — ఇక్కడో, అక్కడో, ఈ విధంగానో, ఆ విధంగానో — పాల్గొంటాము — ఏదైతే ఏమి!"

The Mother: Converstions with a disciple, July 15, 1961

మరణానంతర మార్గాన్ని నిరాటంకం చేయుట

థియోనును కలవడానికి పూర్వమే, ఏదైనా తెలుసుకొనుటకు ముందుగానే, నాకు రాత్రి వేళల్లో అనుభవాలు కలిగాయి. అవి అప్పుడే శరీరత్యాగం గావించిన మనుషుల బాగోగుల బాధ్యత వహించి రాత్రివేళల్లో చేపట్టే చర్యలు — ఎరుకతో చేసేవి — అయితే చేయాల్సినదేమిటో నాకు తెలుసు, అవి చేసాను. అప్పుడు నా వయసు దాదాపు 20 సంవత్సరాలుండవచ్చు.

థియోను బోధించేదేమిటో తెలుసుకున్న వెంటనే — వ్యక్తిగతంగా అతనిని కలవక పూర్వమే — నాకు అంతకు పూర్వము తెలియని విషయాలను అధ్యయనం చేసి అర్థం చేసుకొన్నప్పుడు, నేను ఒక పద్ధతి ప్రకారం పని చేయటం ప్రారంభించాను. ప్రతి రాత్రి, ఒకే సమయంలో, నేను చేయవలసిన పని ఏమిటనగా సంపూర్ణ భౌతిక పరిస్థితికి మానసిక పరిస్థితికి మధ్య రక్షణను గల్పిస్తూ ప్రాణికానికి అడ్డంగా సాగే బాటయొక్క నిర్మాణానికి సంబంధించినది. దాని కారణంగా వ్యక్తులు ఆ బాటలో పయనించ నక్కర లేదు. ఎందుకనగా వారిలో చైతన్యం వున్నప్పటికీ జ్ఞానం లేనందువలన అది అతి కఠినమైన మార్గమవుతుంది, దారుణమైన నరకాన్ని స్ఫురింప చేసేదవుతుంది; నరకయాతనను కలిగిస్తుంది. నేను ఆ బాటను ఏర్పరుస్తుండేదానిని — అది 1903 లేక 1904 దరిదాపు కాలం, సరిగా గుర్తు లేదు — నెలల తరబడి ఆ పనిలో నిమగ్నమై వుండేదాన్ని. ఆ సమయంలో ఎన్నో రకాల సంఘటనలు చోటు చేసుకున్నాయి, అన్ని రకాలైన, అత్యద్భుతమైన సంఘటనలు — అత్యంత అసాధరణమైనవి, వాటిని గురించి సుదీర్ఘమైన కథలు చెప్పగలను....

నేను టెరెస్‌సన్ వెళ్ళినపుడు, మేడమ్ థియోనుకు ఆ విషయం గురించి చెప్పాను. ఆమె అన్నారు, "అవును, నీవు భువి పైన నిర్వర్తించడానికి వచ్చిన కార్యంలో అది ఒక భాగం. కొద్ది మాత్రం జాగృతి చెందిన మానసిక చైతన్యం గలిగి నీ దివ్యతేజాన్ని చూడగలిగినవారు కూడా వారు మరణించే క్షణాన, వారెక్కడ మరణించినా, నీ వెలుగు వైపు పయనిస్తారు, నీవు వారు అలా సాగి పోవటానికి ఉపకరిస్తావు". ఇది నిరంతరంగా కొనసాగే పని, ఎడతెగకుండా కొనసాగేది. మనుషులు వారి శరీరాలను వదిలినప్పుడు వారికి కలిగే అనేకమైన సంఘటనల గురించి ఎన్నో గణనీయమైన అనుభవాలను నాకు కలుగజేసింది. నా కెన్నో విధమైన అనుభవాలు కలిగించింది, ఎన్నో రకాల దృష్టాంతాలు కనిపించాయి. అదంతా చాలా ఆసక్తికరంగా నుండింది.

Sujata Nahar: Mother's Chronicle: Chapter 12 Mirra the Occultist

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

నేల తల్లికి నవజీవన ప్రారంభాలు

నాకు ఆసక్తిని కలిగించే విషయమేమిటంటే నాపై నేను జరుపుతున్న ప్రయోగం. ఆ ప్రయత్నం ఒక ప్రత్యేకమైన ఫలితం కలగాలని కాదు, యావత్ ప్రపంచానికి కలుగబోతున్న ఒక సంభావ్యత గురించి. ఎందు కనగా, అది నేను మూలాధారంగా, నా శరీరం నుండి, ఎక్కడైతే నేను దైహిక పదార్థాన్ని అతిమానస మూలపదార్థంతో ప్రభావితం చేయ గలిగానో అక్కడి నుండి, ఎవరైతే దివ్యమైన నవ చైతన్యానికి తెరుచు కోగలిగారో, ఎవరైతే శరీర రూపాంతరీకరణను గాఢంగా వాంఛిస్తు న్నారో, వారికి ఒక సంభావ్యత సమకూరాలని. అలాంటి వారికి శ్రమ చాలావరకు తగ్గుతుంది, నాపై నేను జరిపిన ప్రయోగాల వలన ఎన్నో కష్టాలు తొలగించబడతాయి. నీపై నేను జరుపుతున్న ప్రయోగ మందు, నేను అనుసరిస్తున్న మార్గమందు నాకు ఒక అర్థవంతమైన అసాధరణ ప్రయోజనం కనబడుతున్నది. అది ఒక కొత్త అనుభవం, ఒక నవజీవన ప్రారంభం. దానికి అస్తిత్వం యొక్క వాస్తవికతలోని పర మార్థం వైపు కొనిపోగల సంభావ్యతలున్నాయి.

The Supreme, p. 30

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రీఅరవిందులు మరణించారని చెప్పడం అజ్ఞానం

శ్రీఅరవిందుల విషయంలో "వారు మరణించారు" అని వైద్యులు నిర్ణయించారు — వారు సంపూర్ణంగా సజీవులు, సమగ్రంగా జీవిస్తున్నారు. అయిదు రోజులైన తర్వాత గూడా వారిని అందులో... పెట్టడం యెందుకనంటే (యెలా చెప్పను?) అది బాహ్యప్రపంచ వత్తిడి వల్ల జరిగింది, పైగా వారిని సంరక్షించడం అసాధ్యం. మేం అంగీకరించవలసి వచ్చింది, కాని వారు చనిపోయారని నేను అనలేను! వారే మాత్రం మరణించలేదు అనేది చాలా స్పష్టం. దేహం అప్పటికే... మొదలవుతోంది (చాలా స్వల్పంగా, కాని అయిదో రోజు చివరి కొచ్చేసరికి) అంటే వారి శరీర వర్ణం క్షీణిస్తోంది. కాని... (అమ్మ ఒక అద్భుతమైన సంజ్ఞ చేసారు).

మొదటి మూడు రోజులు నేను అక్కడ, వారి పడక ప్రక్కన నిలబడి వున్నాను.... ఒక సంపూర్ణమైన... చాలా స్పష్టంగా చూడగలిగే విధంగా — వారి దేహంలో వ్యవస్థితమైన చేతన అంతా, కావాలనే దాని నుండి వెలువరించి నా దేహంలోనికి ప్రవహింపజేసారు. దాన్ని చూడడమే గాదు, అది ప్రవేశించేటప్పుడు కలిగిన ఒరిపిడిని గూడా సంవేదించాను.

అయినా జనం "వారు మరణించారు" అంటారు — అదే అజ్ఞానం.

అమ్మ: ఒక శిష్యునితో సంభాషణ, జూన్ 14, 1967

*

శ్రీఅరవిందులు అదివరకున్నట్లుగానే వున్నారు

స్వయంగా శ్రీఅరవిందులే, అదివరకున్నట్లుగానే వున్నారు, కాని యింకా అధికంగా.... ఒక సామరస్యత నిండిన రూపంతో (యెడద దగ్గర) బాగా విశాలంగా, విశాలంగా, దృఢంగా వున్న రూపం. పైగా చాలా హుషారుగా వున్నారు, రాచఠీవితో రాకపోకలు సాగిస్తున్నారు, కూర్చుంటారు, లేస్తారు. వారి దేహవర్ణం బంగారు కంచు రంగు, వారి అతిమానస బంగారు వర్ణాన్ని పోతపోయిగా ఘనీభవించినట్లున్న రంగు. వారి బంగారు వర్ణం అతిమానస అస్తిత్వం ఘనీభవిం

చినట్లున్నది. వారికి ఆకారాన్ని తీర్చిదిద్దటానికి అది చాలా చిక్కబడినట్లు, గడ్డ కట్టినట్లున్నది. అది కాంతిని పరావర్తనం చేయడం లేదు, లోనుండే వెలుగుతున్న ట్లున్నది. (కాని అది ప్రసరించడం లేదు). పైగా ఆ కాంతివల్ల నీడలు పడడం లేదు, కాని పరిపూర్ణంగా సహజమైనదిగా వుంది, ఆశ్చర్యం కలిగించడం లేదు, ప్రపంచంలో అత్యంత సహజమైనదిగా వుంది, అలా వున్నారు వారు. వయస్సు న్నట్లు లేదు, వారి జుత్తు కూడా వారి దేహం రంగులోనే వుంది. వారికి జుత్తుంది, కాని దాన్ని జుత్తు అనలేం, అదే రంగు కనులు గూడా: ఒక బంగారు చూపు, అయినా అత్యంత సహజమైనదిగా వుంది, యేమాత్రం ఆశ్చర్యం కలిగించడం లేదు. వారు మామూలుగా కూర్చొనేటట్లే మామూలుగా (కుడి కాలు ముందుకు సాచి కూచుంటారు) మామూలుగా పెట్టినట్లే కాలు పెట్టి కూర్చుంటారు. లేచే సమయంలో హుషారుగా లేస్తారు, వారు వస్తున్నారు, వెళ్తున్నారు.

అమ్మ: ఒక శిష్యునితో సంభాషణ జూన్ 29, 1969

*

శ్రీఅరవిందులిప్పుడు యెంతో శక్తివంతంగా పనిచేస్తున్నారు

ప్రశ్న: శ్రీఅరవిందులను గురించి నన్ను నేనే ఈ విధంగా ప్రశ్నించుకొం టున్నాను. వారు యెంతవరకు చేరుకొన్నాక వెళ్ళిపోయారు — రూపాంత రీకరణ యే స్థాయిలో? ఉదాహరణకి, మీరిప్పుడు చేస్తున్న పనికి, అప్పుడు చేస్తూ వుండిన పనికి మధ్య యెటువంటి భేదం వుంది?

సమా: వారు తమ దేహంలో చాలా గొప్ప మొత్తంలో అతిమానస క్రియాశక్తిని ప్రోదిచేసారు. వారు నిష్క్రమించిన వెంటనే, ...చూడు, వారు తమ పడక మీద పడుకొని వున్నారు, నేను వారి ప్రక్కనే నిలబడి వున్నాను. పూర్తిగా ఘనిష్ఠమైన రీతిలో — దానిని చూడగలమన్నంత బలమైన అనుభూతి కలిగించేంతగా ఘనిష్ఠంగా — వారిలో వున్న ఈ అతిమానసిక క్రియాశక్తి అంతా, వారి దేహం నుండి నా దేహం లోనికి చేరింది. అలా చేరేటప్పుడు కలిగిన రాపిడిని కూడా అనుభూతి చెందాను. అది అసాధారణంగా జరిగింది, అసాధరణం. అదొక అసాధా రణ అనుభవం. చాలా సమయం, అలా చాలా సమయం ఆ విధంగా (అమ్మ, ఆ దివ్యక్రియాశక్తి తమ దేహంలోనికి వస్తున్నట్లు సంజ్ఞ చేసారు). నేను వారి

పడక ప్రక్కనే నిలబడి వున్నాను. అదలా కొనసాగింది. దాదాపు అదొక యింద్రియ సంవేదన, పదార్థ రూప సంస్పర్శ. అలా చాలా సేపు జరిగింది.

ప్రశ్న: కాని ఆంతరికంలో జరిగే కార్యం యే స్థాయిలో ఉదా: అధోచేతన ప్రక్షాళన, తదితరమంతా యే స్థాయిలో వుందనేది తెలుసుకోవాలనుకొంటున్నాను? ఆ కాలంలో వారు చేసిన పనికి, ఇప్పుడు యే కార్యం చేయడానికి మీరొచ్చారో దానికీ మధ్య యెటువంటి భేదముంది? అంటే నా ఉద్దేశ్యం, అధోచేతన తక్కువగా అధోచేతనమైందా లేక...

సమా: ఓహ్! అదా, అవును, తప్పకుండా, తప్పకుండా...

...కర్మ చేయడానికి కున్న శక్తిలో భేదం వుంది. వారు దేహంలో వున్నప్పటి కంటె స్వయంగా వారు మరింత కర్మను, మరింత శక్తివంతంగా చేయగల స్థితిలో వున్నారు. పైగా, అందుకోసమే, వారు దేహాన్ని వదలి వెళ్ళారు. ఎందుకనంటే ఆ విధంగా చేయడం అవసరమైంది.

అది చాలా ఘనిష్టం, వారి పని చాలా ఘనిష్టంగా తయారైంది. అది మానసిక సంబంధమైనది కాదనేది స్పష్టమే. అది మరో సీమ నుండి. అది ఆకాశ సదృశం కూడా కాదు... అది ఘనిష్టమైనది. దాదాపు పదార్థరూపంగా వున్నదది అని చెప్పవచ్చు.

CWM 11:328-29 శ్రీమాత

శ్రీఅరవిందుల శక్తివంతమైన సన్నిధిని వారి గదిలో సంవేదించవచ్చు

అచట — అచట పరమ సత్య అభివ్యక్తి వున్నది. వారి గది ముందుండడమంటే వారి నిరపేక్ష దివ్యచేతనను గ్రహిస్తుండడమే. తనను తాను తెరుచుకోవడం తెలిసినవాడు యథార్థంగా తనను విశాలంగా, అన్యప్రేరణ లేకుండా తెరచుకొని ప్రతి విషయంలోనూ నిలకడగా అందుతున్న శ్రీవారి సహాయాన్ని తెలుసుకొంటాడు. అది నమ్మశక్యంగాని విషయం. అది మహాశ్చర్యకరమైన విషయం! పైగా అది సర్వశక్తివంతమైనది. నటించకు. వారి ముందు ముక్కు సూటిగా వ్యవహరించాలి, ప్రతి చిన్న విషయంలోనూ నిష్కపటంగా వుండాలి, నిజాయితీగా వుండాలి. వారి మహదానందస్థితిని సంవేదించగల విధంగా అతి సరళంగా తనను తెరచుకొని వుండాలి.

వారి పరమ సత్యతాశక్తి అసాధరణం. తమను తాము వారు మొత్తంగా బహిర్గతం చేసుకొన్నట్లైతే యెవరూ వారి ముందు నిలువలేరు, యెవరూ దాన్ని భరించలేరు. అందుచేత నేను నిన్ను ముందుగా హెచ్చరిస్తున్నాను. వారి గది ముందు నిలబడేందుకు అనుమతిగలవారిలో నీవొకడివని (యితరులకు తెలిసేటట్లు — అను) నటించకు లేక అలా కన్పించకు. అది వారి దివ్యసన్నిధితో కంపిస్తూంటుంది... సంతోషంగా వుండు, యిక్కడ క్రింది స్థాయిలో వారి కార్యాన్ని సాధించడానికి నీ జీవితాన్నర్పించు. అదొక అరుదైన అవకాశం. దానికి తగినవాడిగా వుండు, కాలాన్ని వృధా చేయకు.

(మౌనం)

ఎంత అద్భుతం! ఎటువంటి మహాశక్తి! ఎంత మహోన్నత ప్రాభవం! మనతో వున్న ఆ ఒక్కరు, వారి మహాశక్తి, వారి మహాక్రియాశక్తి యింకా ఆ గదిలో కంపిస్తూనే వుంది. అది ధ్యానించదగిన స్థలం, అది వెలువరించే పరమ సత్యకంపనాన్ని స్వీకరించడానికి తగిన స్థలం. అది ఉత్తేజితమై వుంది. నిజాయితీగల వ్యక్తి శ్రీఅరవిందుల సన్నిధిని స్పర్శనీయంగా సంవేదించగలడు. వోయిలా![1]

Blessings of the Grace, pp. 109-10

*

సమాధి వద్ద శ్రీఅరవిందుల శాశ్వత దివ్యసన్నిధి

నీవు సంకటంలో పడినపుడు, నీకు సమాధానం కావాలనుకొంటే, అదేదైనా కానివ్వు, లేక నీకు అంతగా బాగా లేకపోతే లేదా యేదో నిన్ను బాధిస్తుంటే, లేక నీవు చేసిన యేదైనా పొరపాటు వల్ల నీకు అసౌఖ్యం కలుగుతుంటే — నీకు కోపం వచ్చిందనుకో, తనివితీర లేదనుకో, అంతగా ప్రాముఖ్యం లేనిది, చాలా సాధారణమైనది, విలువలేనిదైనా, కారణం నీకు తెలియని విషయాలలో సైతం, ఏదైనా వుండవలసిన విధంగా సక్రమంగా లేనట్లైతే — అప్పుడు అటువంటి అసౌకర్య స్థితి నుండి నీవు బయటపడాలనుకొంటే సరాసరి సమాధి దగ్గరకు చేరుకో, అచట నీ శిరసు వంచి, నీవు చెప్పదలచుకొన్నదాన్నంతా విన్నవించుకో. మొమో

[1] మనలను ఆకట్టుకొనేందుకు లేదా తమ సంతృప్తిని లేక సమ్మతిని తెలిపేందుకు ప్రయోగించే ఫ్రెంచి పదం.

టం లేకుండా, సంశయించకుండా నా దగ్గర చెప్పడానికొచ్చి చెప్పినట్లు శ్రీఅర విందులకు విన్నవించు — అలా చేసినపుడు నీ కష్టాలు వెంటనే తీరిపోవడం, మాట్లాడిన క్షణంలోనే పూర్తిగా మటుమాయం గావడం నీవనేక సార్లు చూసావు....

అదే విధంగా నీవు వారికి (శ్రీఅరవిందులకు) విన్నవించుకో. ఈ విధంగా శిరసును సమాధిపై వుంచు, (అమ్మ తమ శిరసును వంచి చూపుతారు) నీ కష్టాలు తీరాలని వారిని అర్థించు. లేకపోతే (హృదయ ప్రాంతం నుండి పైకి లేస్తున్నట్లుగా ఒక చేయి అమ్మ కదిలిస్తారు) ఒక ప్రార్థనను వారి వైపు పంపించు. కాని చాలా నిజాయితీగా వుండాలి సుమా! అదీ గాక నీ అస్తిత్వపు లోలోతున నీవు యేకాగ్రత సాధించి ప్రార్థించాలి. వారు నిన్నాలకిస్తారని, నీకు నీ సమాధానాన్నిస్తారని నాకు దృఢంగా తెలుసు. ఏ సంశయం లేకుండా, అప్పుడు వారితో నీవు తేలికగా భాషించవచ్చు. వారితో సంబంధం పెట్టుకొని తమ సమాధానాలను పొందినవారు చాలా మంది వున్నారు. వారు మన కిప్పుడు చాలా అందుబాటులో వున్నారు, అంతే కాదు చాలా చాలా చురుకుగా వున్నారు. అయినప్పుడు, చూడు, ఇలా అయితే నీవు వేచి వుండవలసిన అవసరం కలుగదు....

చాలా సానుకూలమైన, సరాసరి పనిచేసే, చాలా అందుబాటులో వుండే పద్ధతి యిది. ఎప్పుడైనా నీ వడుగవచ్చు. నీవు కేవలం సమాధి దగ్గరకు రా, నీ కక్కడ సమాధానం లభిస్తుంది.

ఇప్పుడు ప్రతిదానికీ వారి దగ్గరకు వెళ్ళగల అవకాశ ముంది

ఏదైనా బాగా లేకపోతే, కారణం తెలుసుకోవాలనుకొంటే లేదా ఒక బలహీనతను నీవు వదలించు కోవాలనుకుంటే, లేదా (రుగ్మత) నయం కావాలనుకొంటే, లేతా ప్రక్షాళితుడవు గావాలనుకొంటే, పరిశుద్ధుడ వయ్యేందుకు, ఒక కష్టం తొలగించబడేందుకు, యే సమాధానం కోసమైనా సరే సమాధి దగ్గర కొచ్చి శ్రీఅరవిందులను అర్థించు, నీకు సమాధానం దొరుకుతుంది. వారి సమాధానమే గాదు, వారి ఆశీస్సులు, వారి కరుణ, వారి శాంతి, వారి ప్రకాశం కూడా లభిస్తాయి. సర్వశక్తివంతమైనవారి ప్రేమ నిన్ను ముంచెత్తి నిన్ను బంధించి వేస్తుంది. నిన్ను నీవు వారి కర్పణ గావించుకొంటే సమస్త విపత్తుల నుండి రక్షించబడ్తావు. వారి ప్రభావం అలాంటిది. ఎవరైతే నిరాడంబరంగా, నిజాయితీగా, వినయంగా

వుంటారో, అతనికి వారు తమను తాము తెలుపుకొంటారు. పరిపూర్ణ చేతస్కులై వారక్కడున్నారు, ప్రపంచపు కార్యకలాపాలన్నింటికీ దిశానిర్దేశం చేస్తున్నారు....

...పూర్వం వారు తమ దేహంలో వున్నపుడు, వారు చాలా దూరంగా వున్నట్లుంటారు, యెక్కడో మనుషులకు అందనంత దూరంగా వున్నట్లుంటారు, యిక్కడి సాధకుల వ్యవహారాలు వారికేం పట్టవు అని చెప్పేవారనేది నీకూ తెలుసు గదా.... అదెంత మాత్రం సరైన మాట కాదు. ఎందుకనంటే నిజానికి, ప్రపంచాన్నుద్ధరించడం, అతిమానస ప్రపంచ ఆగమనానికి ఈ ప్రపంచాన్ని సన్నద్ధం చేయడం అనే తమ పనిని చేయడానికి బదులు, గుట్టలుగా పడివుండే లేఖలకు రాత్రంతా, ప్రతి రాత్రీ సమాధానాలు వ్రాస్తూ వుండేవారు. సాధకుల పురోగతిని గమనించడానికి శ్రమిస్తూండేవారు, సాధకులకు సంబంధించిన విషయాలతో తల మున్కలౌతుండేవారు. అయినప్పటికీ సాధకులు సరాసరి నాతో సమాచార సంబంధంలో వుండేటట్లు, భౌతిక భూమికపైన, అలాగే సాధన కోసం ఆంతరంగికంగా నా సహాయం పొందగలిగేటట్లు యేర్పాటు చేసారు. నా ద్వారా వాళ్ళు అతిమానసికం వైపుగల చేతనాశిఖరాల ఉపలబ్ధిని పొందగలిగేటట్లు లేదా యెటువంటి కష్టాన్నైనా అధిగమించ గలిగేటట్లు యేర్పాటు చేసారు. మా పనిని — అతిమానసికం వైపు అన్వేషణ — అనే మా పనిని వ్యతిరేకిస్తూ, అడ్డంకిగా తయారైన విభిన్న లోకాలు, రకరకాల శక్తులు, చేతనకు సంబంధించిన అసంఖ్యాక స్థితులపై నియంత్రణను సాధించడానికి, వాటిని జయించడానికి మాత్రమేగాక వాటిని తమ అధీనంలో వుంచుకొనడం అనే పనిలో నిమగ్నమై వున్నారా కాలంలో. లౌకిక వ్యవహారాలను చక్కదిద్దడాన్ని నా కొదిలేసారు. ఈ ఆశ్రమ నిర్వహణనంతా, అలాగే వ్యక్తుల పురోగతి, సాముదాయక యోగం వైపు జరిగే కృషిని నా కొదిలేసారు. అటువంటి కాలంలో జనంతో కలవడానికి లేదా వాళ్ళ అభియోగాలు వినడానికి వారికి యే మాత్రం సమయం వుండేది గాదు. కాని యిప్పుడు వారు తమను తాము విశ్వవ్యాపకం చేసుకొన్నారు, అత్యంత విశాలమయ్యారు. చాలా సన్నిహితంగా, చాలా దగ్గరగా వచ్చారు. సామీప్యత ద్వారా, ప్రత్యక్ష ప్రభావం ద్వారా వారి దగ్గరకు వెళ్లగలిగేటట్లు ప్రతి వ్యక్తితోనూ సంబంధం పెట్టుకొన్నారు.

అదో దుర్ఘట కార్యం. వారి సన్నిధి, సమాధి చుట్టూ, అంతటా కంపిస్తోంది,

ఘనిష్టంగా వుంది. వారి ప్రభావం నీ లోనికి చొచ్చుకుపోయి కేంద్రీయ పురుషుని తట్టి చేతనను ఆధ్యాత్మిక జీవితానికై మేలుకొలుపుతుంది. అజ్ఞేయవాదులు, నాస్తికులు, సమాధిని చూచిపోదామనే ఉబలాటంతో వచ్చిన, చెడు సంకల్పం కలవాళ్ళు, సమూల మార్పును తెచ్చే మార్మికత వల్ల మహదాశ్చర్యానికి లోనై తిరిగి వెళ్తారు, ఆంతరిక శాంతిని పొందుతారు. ఎందుచేతనంటే అచట శ్రీఅర విందులు తమ శాంతిని, కరుణా కటాక్షాన్ని నిరంతరం వెదజల్లుతుంటారు. ఇదిగో ఇది వారి ముందు, దర్శనార్థం వచ్చినవాళ్ళు కదలిపోతుంటే, వారిని తడిపివేస్తుంది. అది వారి క్రియాశక్తి, వారి సాన్నిధ్యపు నమ్మశక్యంగాని కార్యశీలత.

*

సమాధి: ధ్యానించడాని కదొక పవిత్రమైన చోటు

నేను సమాధి వంక చూచి, అక్కడ జరుగుతున్నదాన్ని గమనించి, కళ్ళు మిరుమిట్లు గొలిపే స్తంభాకృతిగల వెలుగు ఊర్జంతో, రూపాంతరీకరించు శక్తితో కంపిస్తుండడాన్ని చూసి ఆశ్చర్యచకిత నయ్యాను. సమాధి అంతటి నుండీ వైభ వంతో, అధిక ప్రకాశంతో, ఒక వెలుగు స్తంభాకృతిలో ప్రవహిస్తున్నట్లు పైకి యిలా లేస్తోంది — శ్రీమాత తమ చేతులతో పై వైపుకేదో పోతున్నట్లు సంజ్ఞ చేస్తారు.) అది పదార్థ రూపం ధరిస్తున్న నూతన దివ్యకాంతి....

రాత్రివేళ అంతా ప్రశాంతంగా వున్నపుడు జనమంతా ఈ స్థలంలో విడిచి పోయినదాన్నంతా — అనృతం, కోరికలు, అసహనం నిండిన అర్థింపులు, సర్వ విధ అభియోగాలు, దుస్సంకల్పాలు, రుగ్మతలు, హాని కలిగించే శక్తులు — అన్నింటినీ తొలగించి, పరిశుభ్రం చేసే, ఈ స్థలాన్ని శాంతిమయంగా, సుఖ ప్రదంగా ఉండేటట్లు చేసే కొన్ని అదృశ్యజీవు లున్నాయి. శ్రీఅరవిందుల సాన్ని ధ్యాన్ని సంవేదించడానికి వీలుగా యెంతో ప్రేమతో మొత్తం చుట్టుప్రక్కలంతా పరిశుద్ధం చేస్తాయి.

అది ధ్యానం చేయడానికి పవిత్రీకరించబడిన స్థలంగాని, ఉబుసుపోక కబుర్లు చెప్పుకొనే స్థలం కాదు. మాట్లాడుకోవడాని కసలే కాదు — అది వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. సమస్త ప్రపంచాన్ని ఒక సూక్ష్మ మానసికప్రేరణతో నడు పుతూ దైవావతరణకై సాక్షికంగా తెర మరుగుచేసిన తమ చేతనను క్రమంగా

నెలకొల్పుతూ, వారక్కడ తమ మహిమోపేతమైన దేహంతో వున్నారు.

మనం దివ్యం కాగలుగుతామనేదాని కదొక సజీవ ఆశ్వాసం

మన దివ్యసంభావ్యతకు వారు ఒక సజీవ ఆశ్వాసం, దివ్యకాంతిని, దివ్యశక్తిని ప్రసారం చేసే దివ్యత్వపు వాగ్దానం — దైవాభివ్యక్తివైపు పురోగమించే నడక. అందుచేత మొత్తం వాతావరణమంతా ఒక దివ్య, గంభీర పరమ శాంతితో దట్టించబడి వుంది, అర్థమైందా? అక్కడున్నది సాక్షాత్తూ వారే — దివ్యదేహంలో — వారే దివ్యీకరించబడిన, సమస్త మానవజాతి ప్రతినిధి. తమ దేహంలో వారు పొందిన సాక్షాత్కారాలు, ఈ యౌగిక కృషి వల్ల తమ దేహంలో కూడబెట్టుకున్నదేది వున్నదో, అది వారి దేహాన్ని ఒక రూపాంతరీకరణ శక్తితో నింపివేసింది. అది దట్టించబడింది — పొంగిపొరలే ఒక క్రియాశక్తితో, ఒక వెలుగుతో క్రియాశీలంగా దట్టించబడింది, ఇదిగో ఇది వాతావరణమంతట్నీ ఆవరించివేసింది. చుట్టుపక్కలంతా వారి సన్నిధియే. అది కలకాలం వుంటుంది. యెందుకనంటే అది అతి మానసిక క్రియాశక్తి, క్షీణించే చిహ్నాలు లేవు, అది క్షీణించలేదు.

సమాధి చుట్టూ చేరినపుడు జనం హరించుకొనేది యిదిగో దీన్నే. తమకు తెలియకుండానే వారి ప్రేమలో తానమాడతారు. సమాధి దగ్గర కొచ్చినప్పుడు వాళ్ళెందుకని తన్మయత్వానికి లోనవుతున్నారో కూడా వాళ్ళు గ్రహించలేకపోతున్నారు. అది అత్యంతాశ్చర్యం కలిగించే విషయం! సమాధిని స్పర్శించగానే వాళ్లు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు, యెందుకనంటే చుట్టూ పనిచేస్తున్న క్రియాశక్తి వాళ్ళు చెప్పుకొనే మతపరమైన భావావేశాలను అన్నింటినీ నాశనం చేస్తుంది, స్వర్గం వైపు రెక్క లల్లాడిస్తూ యెగిరిపోయే భావావేశాలను చెల్లాచెదురు చేస్తుంది, వారి కర్థం కాని ఒక పరమ సత్యత ముందు వారిని నిలబెడ్తుంది. అచట నెలకొన్న పరమ సత్యపు అసాధారణ కార్యవిధానం వల్ల వారు మహదాశ్చర్యానికి లోనవుతారు. ఉన్ముఖమైవున్న వాళ్ళు దాని స్పర్శ పొందుతారు. అచటి వాతావరణంలో వున్న ఆ పరమశాంతితో తమను తాము నింపుకొనడానికి, దానిని తమ అస్తిత్వంలో జీర్ణింపచేసుకొనడానికి తిరిగి వస్తుంటారు. శ్రీఅరవిందుల సన్నిధి యెంతో ఘనిష్టమైనది, యెంతో సజీవమైనది — ఈ వాతావరణాన్ని నింపివేసి, దానిని లోబరుచుకొన్న ఒక సజీవ అపరిమేయం లాంటిదది. కనుపించి

వెంటనే మాయమైపోయే వెలుగులు, వర్ణాలలో అది యెలా తేలిపోతోందో నేను చూడగలుగుతున్నాను. అంతుచిక్కని ఆనందం, సౌందర్యం, పరిశుద్ధత సారం, పదార్థం లేనిదైనప్పటికీ దాదాపు పదార్థం అని చెప్పదగ్గ (చేతికి చిక్కకుండా) తప్పించుకుపోయే ఒక సన్నిధి, ప్రపంచానికి తెలియని మాధుర్యం అందులో వుంది. దైవాన్ని ఆకాంక్షిస్తూ యేకాగ్రత వహించిన ఒక హృదయం సమాధి ముందు నిలబడితే, మరి దేన్నీ గాకుండా, వారి ఆనందస్థితినే కోరుకొంటే, సమస్త శక్తినీ కలిగిన స్వర్గాలలో అనుభవించినవదాని కంటె, లేక పృధ్వి యెన్నడైనా యెరిగిన దానంతటికన్న చాలా మంగళకరమైన, ఉన్నతమైన ఆనందసీమలోని కతను కొనిపోబడ్తాడు.

*

వారు కష్టాలను, అవరోధాలను నిరంతరం కూకటివ్రేళ్ళతో పెకలించి వేస్తుంటారు

వారి భక్తులు, ఆకాంక్షాపరులు — తమ బ్రహ్మాండమైన సాన్నిధ్యంతో ఈ ప్రదేశాన్నంతా తమ అధీనం చేసుకొన్న శ్రీఅరవిందుల చేతనతో యేకం చేయాలని యెవరైతే యదార్థంగా ఆకాంక్షిస్తున్నారో — రాచఠీవి గలవారి సాన్నిధ్య వైభవాన్ని, నన్నిపుడు నీవు చూస్తున్నట్లుగా ఘనిష్టంగా చూస్తారు. వారితో సంభాషించ గోరువారు, తొట్రుపాటు లేని వారి సమాధానాన్ని తెలుసుకొంటారు. సర్వశక్తిమంతులై తమ శక్తి అంతటితోనూ వారక్కడున్నారు. తెర వెనుక నుండి నిలకడగా వత్తిడి చేస్తూ, నమ్మశక్యం కానంతటి సహనంతో, దృఢచిత్తులై విజయాలను పరంపరగా సాధించడం వారి కార్యవిధానం గనుక, మొదట మానవజాతి చేతనను మార్చడానికి, దాని సమస్త పరిమాణాలలో దానిని రూపాంతరీకరించడానికి, ఈ అవరోధాలు, ఈ క్షణిక పతనాలూ, దాని ముందున్న ఆటంకాల నధిగమించేటట్లు మానవజాతిని సమాయత్తం చేస్తాయని బాగా యెరిగినవారై, అది పనిచేసే తీరుకు, దాని వైఖరికి, వారి వెలుగు గల శాంతిలో ఒక భౌగోళిక ఉద్యమం ద్వారా దారిచూపుతున్నారు. అన్నింటినీ మించి ఇది ఆధ్యాత్మికతను ఆధారం చేసుకొన్నదే గాని, వేటి సారం మతమౌఢ్యం, యుద్ధం, తదితర అనవసర తగాదాల్లో ఆ మిధ్యా మతోద్యమాల మీదనో గాదు. ఫలితాలను చూడు... మను

షుల క్రౌర్యంతో ప్రపంచం అలసిపోయింది — రక్తం పారుతోంది, హింస పెత్తనం చేస్తోంది, అటువంటి భయంకర విధ్వంసాలను మన మెన్నడూ చూడలేదు. మనుషులు మృగాల్లా తయారయ్యారు, మృగాలకంటే నికృష్టులుగా తయారయ్యారు.

...మనిషి తన చేతనను పరివర్తన చేసుకోనంత కాలం... అదొక అధిగమించలేని దుర్గమస్థితి. అసాధరణ శక్తిసామర్థ్యాలుగల యే ఒక్కరో, మనుషులు, లేక వ్యక్తులు యేమీ చేయలేరు, లేక దైవానికి హానికరశక్తులకు మధ్యగల అంతరాన్ని తొలగించి దానిని పూడ్చలేరు. మనిషిని ఈ స్థితిలోనికి నెట్టింది అజ్ఞానం. కాని విచారించకు, ఈ పని అప్పగించబడిన యేకైకుడు, బాధ్యత వహించిన యేకైకుడు, ఒక నూతన ప్రపంచ పొలిమేరల వైపు మనిషిని తీసుకుపోవడానికి పని చేస్తున్నాడు. కష్టాలను, అవరోధాలను అతడు అవిరామంగా కూకటివ్రేళ్ళతో పెకలించి వేస్తుంటాడు. ఈ రుగ్మతను వారు మాత్రమే నయం చేస్తారు, యెందుకనంటే, అతడే మన అస్తిత్వ శాసకుడు. దృఢనమ్మకం కలిగి వుండు, అంతా మంచే జరుగుతుంది. పరిణామ సర్పిలాకారంలో అతని ఐహిక మనుగడకు సంబంధించిన పర్యాయక్రమంలో ఇది బహుశా మనిషి చేరుకొన్న అట్టడుగు స్థానం అయి వుంటుంది. కాని త్వరలో మనం వెలుగును చూస్తాం. గొప్ప మార్పు రాబోతున్నదనే భరోసా — దైవీరాజ్యాన్ని క్రిందికి తీసుకొచ్చి ఈ పుడమిపై ప్రతిష్టించగలిగిన ఒకే ఒక్కటైన వారి సన్నిధి నిశ్చితత్వాన్ని దర్శిస్తాం.

Blessings of the Grace, pp. 119-125

స్వేచ్ఛానువాదం: కె. వి. రావు

అమరత్వము — మృత్యురహిత స్థితి

అమరత్వానికి, మృత్యురహితస్థితికి మధ్య వ్యత్యాసముంది. శ్రీఅరవిందులు దీనిని 'సావిత్రి' లో బహు చక్కగా వివరించారు.

భవిష్యత్తులో మానవ స్థూలశరీరం ఏ విధంగా నుండబోతున్నదనే ఊహకు సమాధానమే మృత్యురహిత స్థితి. అది ఎడతెగని పునర్జన్మ. మరోమారు సర్వ సాధారణమైన సార్వత్రికంగా చోటు చేసుకొనే పరిణామ క్రమానికి అనుగుణంగా మలుచుకోగలిగే లక్షణం కొరవడిననందున అశక్తమై శరీరం భవిష్యోన్ముఖంగా వృద్ధిచెందే బదులు ప్రస్తుత స్థితిలోనే తటస్థంగా నిలిచిపోతుంది.

ఒక ప్రధానమైన అంశం మాత్రం స్థిరంగా వుంటుంది: ప్రతి ఒక్క అణువుకు దాని ఆంతరంగిక పరమాణువుల వ్యవస్థ వేర్వేరుగా నుంటుంది. వాటి మూలాధార పదార్థంలో అసమానతను కలుగచేసేది అదే. బహుశా ఆ విధంగానే ప్రతి వ్యక్తికి తనలోని జీవకణాలను వ్యవస్థీకరించడానికి ఒక విభిన్నమైన ప్రత్యేక విధానం వుంటుంది. ఈ ప్రత్యేక విధానమే బాహ్యంలో చోటు చేసుకునే మార్పు లన్నింటిలోను కొనసాగుతుంది. మిగిలినదంతా రద్దు కాబడుతుంది లేదా పునర్వ్యవస్థీకరించబడుతుంది కానీ రద్దు కాబడే కార్యక్రమం మాత్రం తిరోన్ముఖంగా పడిపోయి అంతరించే బదులు ఒక నూతన దిశగా పురోగమించడానికి బలంగా నెట్టబడి, పరమ సత్య ప్రగతి పథాన్ని అనుసరించాలనే అభిలాషతో పునర్వ్యవస్థీకరించబడుతుంది.

కాని అందుకోసం శరీరం — శరీర చైతన్యం — మొదలు తనను తాను విస్తృతపరచుకోవడం నేర్చుకోవాలి. అది అనివార్యం, ఎందుకనగా అలా జరగకపోతే, అతిమానస వెలుగు కలిగించే ఒత్తిడి వలన జీవకణాలన్నీ ఒక విధంగా సలసల మరిగే జావలా తయారవుతాయి.

సాధారణంగా జరిగేదేమిటంటే శరీరం ఎప్పుడైతే దాని ఆకాంక్షయొక్క తీవ్రస్థాయిని లేక దివ్యప్రేమ యొక్క పారవశ్య స్థితిని చేరుకుంటుందో, అప్పుడు ఆ పరాకాష్ఠ స్థాయి తీవ్రతను ఇముడ్చుకోలేక అది శక్తిహీనమై చేష్టలుడిగి వెనుక పడుతుంది. పరిస్థితులు స్థిరపడతాయి. ఒక నూతన స్పందనతో నీవు ఉత్తేజితుడవుతాయి, ప్రతిదీ తన సహజ గమనాన్ని పునఃప్రారంభిస్తుంది. అందువలన అతి

మానస శక్తి యొక్క పరిణామాల తీవ్రతను జంకకుండా తట్టుకొని నిలుచుటకు, అన్ని వేళలా ముందుకు సాగడానికి, అన్ని వేళలా పరమ సత్యము యొక్క ఊర్ధ్వముఖ పురోగమనాన్ని అనుసరించుటకు, శారీరక దౌర్బల్యంతో ఈ లక్ష్య సాధనలో వెనుకంజ వేయకుండా నిలుచుటకు, నిన్ను నీవు తప్పక విస్తృత పరచు కోవాలి.

Conversations with a disciple, Nov 25, 1959

అనువాదం: అకుల కృష్ణ

"నే నిక్కడే ఉన్నాను, నే నిక్కడే ఉన్నాను"

(శ్రీఅరవిందుల మహాభినిష్క్రమణ తరువాత వారి సన్నిహితుడు, చాలా కాలంగా వారి శిష్యుడిగా కొనసాగిన శ్రీ నిరోద్ బరన్‌గారి వ్యాసం నుంచి సేకరించ బడినది.)

ఆ మహత్తర త్యాగం యొక్క అంతిమ క్షణాలు

ఇప్పుడు శ్రీఅరవిందులు తన పరిసరాల నించి తనను తాను నెమ్మదిగా ఉపసంహరించుకున్నట్టు కనిపిస్తోంది... ఈ శరీరం మీద పడ్డ బాధలను పట్టించు కోవడం కంటే వారి ఉద్దేశ్యంలో ఉన్న ప్రయోజనం కోసం చేసే ప్రయత్నంలో పూర్తిగా నిమగ్నమవటం ఎక్కువగా ఉపయుక్తమని వారు భావించినట్టు స్పష్ట మవుతున్నది. వారు తన శరీరాన్ని దాని కార్యకలాపాలకు పర్యవసానాలకు దానిని వదిలేసి, ప్రపంచ-ప్రయోజనం కోసం చేస్తున్న నిగూఢమైన కార్యంలో నిమగ్నమై నట్టు కన్పిస్తున్నారు. వారు పొందిన ఈ శరీరం వారికి సరైన సేవ చేసింది. శ్రీమాత చెప్పినట్లుగా, అది బాధలు భరించింది, సహించింది, పని చేసింది, మనందరి కోసం సర్వం సాధించింది. ఇంక ఇప్పుడు దైవికమైన కదలికలకు అది అవరోధమైనప్పుడు, వారు దాని నెందుకు మార్చకూడదు? వారు ఏనాడు తన శారీరక అసౌకర్యాలను తన కార్యసాధనకు అడ్డు రానీయక, నిరంతరం వారి కార్యదీక్షలో ఒకే విధమైన ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని నిలబెట్టుకున్నారు. అందుకని

తన కార్యం సాధించాక, తన అతీంద్రియ ఉన్నత ప్రయోజనాలను సాధించడంలో, శరీర బాధలు తన మార్గానికి అడ్డుపడనీయ లేదు. ఇంత తీవ్రమైన అశక్తతను కూడా, అత్యంత ఆనుకూల్యం చేసుకున్నారు. వారి శరీరం ఎంతటి ప్రతికూలమైన పరిస్థితులకైనా లొంగిపోయేది కాదు. ఒక వేళ వారు ఒక రంగంలో ఓడిపోయినా ఆ నష్టాన్ని మరో రంగంలో పూర్తిగా పూరించుకునేవారు. వారికి ఓటమి, అపజయం ఎదురౌతుందని ముందుగా తెలిసినా, చివరి వరకు వారి సాధనను, కృషిని, పోరాటాన్ని ఆపేవారు కాదు. "నేను తలపెట్టిన కార్యం విఫలమౌతుందని తెలిసినా, చివరి క్షణం వరకు నేను దాని కోసం పనిచేస్తాను" అన్నవి ఒక లేఖలోని వారి మాటలు. గీతలోని నిష్కామ కర్మ వారికి స్ఫూర్తి....

అది మరువలేని డిశంబరు 4 వ తేది, చిరకాలానికై సువర్ణాక్షరాలతో లిఖించబడిన తేదీ. శ్రీఅరవిందులు తన గాఢ అంతర్ముఖత్వం లోనించి పూర్తిగా బాహ్యంలోకి వచ్చి, కూర్చోవాలన్న అభిలాషను వ్యక్తం చేశారు. మేము వారించినా, బలవంతం చేశారు. కొంతసేపు తరువాత వారిలో బాధించే అస్వస్థతా లక్షణాలన్నీ క్రమంగా అంతరించిపోవడం మేం చూశాం. వారు మళ్ళీ యధాప్రకారం ఆరోగ్యంతో మామూలుగా ఉన్నారు. ఆ తరువాత వారు కుర్చీలో కూర్చున్నారు. ఈ హఠాత్ పరిణామాన్ని చూసి మేం విస్మయంచెంది, ఆనందంతో, ఆశ్చర్యంతో ఒకరి నొకరు చూసుకున్నాం "చివరకి మా ప్రార్థన వినబడింది!" భక్తితో నిశ్శబ్దంగా ఉన్న మా హృదయాల్లో ఈ భావం పొంగింది. అది నమ్మశక్యం కానిది! ఇప్పుడు మా ప్రశ్నను తిరిగి వారి ముందు పెట్టడానికి సాహసించాం.: "ఈ అస్వస్థతను తొలగించడానికి మీరు మీ శక్తిని ఉపయోగించడం లేదా?" "లేదు" అన్న సమాధానం మాకు దిగ్భ్రాంతిని కల్గిస్తూ వచ్చింది. మా చెవులను మేము నమ్మలేక కచ్చితంగా తెలుసుకోవటానికి మళ్ళీ అడిగాం. మా భ్రమకు ఇంక తావు లేదు. మేం విన్నది ఖడ్గపు అంచు అంత పదునైన సూటి సమాధానం. మేం ధైర్యంగా మరో ప్రశ్న వేశాం: "ఎందుకు ఉపయోగించకూడదు? మీరు మీ శక్తిని ఉపయోగించకపోతే మీ జబ్బు ఎలా తగ్గుతుంది?" దానికి వారు నిగూఢమైన సమాధానం ఇచ్చారు: "వివరించలేను, మీరు అర్థం చేసుకోలేరు".

ఎట్టకేలకు ఈ మర్మాన్ని తెల్సుకుందుకు ఓ సాధనం ఇక్కడ దొరికింది! అందుకే ఆ అనారోగ్యం క్రమేణా ఎక్కువైంది. వారి ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తున్న

విధానంలో స్పష్టంగా మూడు దశలు గమనించవచ్చు: 'సావిత్రి" ని పూర్తిచేయడం, దర్శనం, మరియు పాఠశాల వార్షికోత్సవం. ప్రతి దశ, ఒకదాన్ని మించి ఒకటి మరింత గాఢంగా వారిని అంతర్ముఖుణ్ణి చేసింది. ఒక చివరి దశలో ప్రతి దశలో శ్రీమాత వ్యాఖ్యానించారు, "నేనక్కడున్నప్పుడల్లా, వారు ఆ అతిమానస ప్రకాశాన్ని క్రిందికి లాగుతుండడం చూశాను", వారి ఈ మాటలు శ్రీఅరవిందులు ఏ ప్రయత్నంలో మునిగి ఉన్నారో స్పష్టంగా తెలియపరుస్తాయి. వారి దృష్టిని, ఏకాగ్రతను మరోదాని వైపు మరల్చారు, అది వారి దృష్టిలో శారీరక బాధలను పట్టించుకోవడం కన్నా అత్యంత ముఖ్యమైనది. అయితే మాకు ఆ దృష్టి లేదు, అర్థం చేసుకోగల శక్తి లేదు. అందువలన ఆ ప్రకాశ అవరోహణ మా హృదయాల కోరికను ఫలింప చేస్తుందని భావించాం.

ఓ గంట తరువాత, వారు పక్క మీద తిరిగి పడుకున్నారు. దానితో బాటు అన్ని అస్వస్థతా లక్షణాలు మరింత ప్రతీకారంతో తిరగబడ్డాయి. ఆ చిన్న విశ్రాంతి... రాబోతున్న వారి కార్యాచరణ అసంపూర్ణంగా ఉండగానే తెర వేస్తున్న నీలినీడతో తలపడడానికి వారికి సమయ మిచ్చింది. ఆ దురదృష్టకర క్షణానికి అరగంట ముందుగా వారు కొంచెం మంచినీళ్ళు త్రాగారు, ఒక్కసారి మా సేవలను గుర్తించినట్టుగా చివరిసారిగా వాత్సల్యపూరితచూపులతో మమ్మెలను చూసి, చివరి ఘట్టంలో మునిగిపోయారు.

తెల్లవారగట్ల వార్త వ్యాపించింది. శిష్యుల ప్రతిస్పందన ఎలా ఉంటుందో వర్ణించడం కన్న ఊహించుకొనుట ఉత్తమం. ఆ నిశ్శబ్ద చీకట్లో ఒకరి తరువాత ఒకరు ఆ దివ్యలోకపు మెట్లెక్కి, ఇంతకు ముందు ఎవరు, ఎన్నడు చూడనిది, చూడలేనిది చూశారు. వారు చూసినది మృత్యువు కాదు, అది పునర్జీవనం కాదు, అది నిర్వాణస్థితి కూడా కాదు. కాని అది అసాధారణమైన అంతిమ విశ్రాంతి, మృత్యువు అత్యంత శక్తివంతమై, ప్రకాశవంతమై ప్రతి అవయవము లోను సౌందర్యభరితమై, ఆ రాజాధిరాజు శరీరంలో అమరమై భాసిస్తోంది. భౌతిక తత్వంలో గీటురాయిగా స్పష్టంగా వ్యక్తమై ప్రకటితమైన పరమ సత్యం. అది ఏమాత్రం మామూలు శరీరం కాదు,అది సగం మూయబడి, సగం తెరవబడిన పరమ సత్యం యొక్క స్వర్ణాచ్ఛాదన. ఎవరికి అంతర్ దృష్టి ఉన్నదో వారు ఆ పరమ సత్యాన్ని తెలుసుకోగలిగారు. ఎవరికి అంతర్ శ్రవణం ఉన్నదో వారి

గుండెలోని నిశ్శబ్ద అంతర్ గుహలో హృదయాన్ని చీల్చుకుంటూ వచ్చిన కేకను, "నే నిక్కడే ఉన్నాను, నే నిక్కడే ఉన్నాను" అన్న నాదాన్ని విన్నారు.

ఆ జాగృత చైతన్యంతో మనము మన గురువు మన ముందుంచిన దివ్య లక్ష్యం వైపు సాగుతున్నాం, దేనికైతే వారు తుది శ్వాస వరకు శ్రమించారో, ఏ లక్ష్యాన్ని సాధించేవరకు శ్రమిస్తానని వాగ్దానం చేశారో, దాని కోసం... దాని వైపుగా సాగుతున్నాం. ఆ లక్ష్యాన్ని సాక్షాత్కరింపచేసుకున్న పరాత్పరి, చిచ్ఛక్తి, శ్రీమాత మన మార్గదర్శి, మన దేవత. తరగని శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక అతీంద్రియ విజయాలతో మరియు స్వయంచాలకంగా తనలోకి ప్రవేశించిన అతిమానస ప్రకాశంతో నిండిన ఆమె మనలను శ్రీఅరవిందులు దర్శించిన ఆ భవిష్య మానవుల స్వరూప, స్వభావ నమూనాగా రూపొందించగలరు.

ఆ మహత్తర సంఘటన తరువాత ఆశ్రమానికి వచ్చిన సందర్శకు లెవరైనా వారి మహాత్యాగంలోని విజయ సంకల్పం హృదయాల్లో జనించడం,చెరగని ముద్ర వేయడం తప్పక తెలుసుకోగలరు. వారి సమాధి నుండి సహస్ర జ్యోతులు ఊర్ధ్వ ముఖంగా ప్రజ్జ్వరిల్లుతూ, ఆ మహాప్రకాశం మన ఆత్మలో స్థిరపడి, ఒక నిరంతర పునరుజ్జీవన జ్వాలగా జ్వలిస్తూ శ్రీమాత యొక్క అస్తిత్వం నుండి శరీరం ద్వారా ప్రసరిస్తూ, ఆ వాతావరణాన్నంతా అవరిస్తాయి. ఎవరైనా శ్రీఅరవిందుల ఉనికిని చూడవచ్చు, వారి పదఘట్టనలను వినవచ్చు, వారి లయాత్మక స్వరాన్ని వినవచ్చు. అవి సదా జాగృతమై భౌతిక శరీరపరమైన ఆటంకాన్ని అధిగమించినవై వుంటాయి. ఏదో ఒక రోజు ఆ మహాత్యాగం ఫలిస్తుంది, వారు సావిత్రిలో వర్ణించినది సత్యమై నిలుస్తుంది. అసలు సావిత్రి అనగా ఏమిటి? శ్రీమాత యొక్క, మన గురువు యొక్క ఆంతరంగిక జీవన సంఘటనలకు అక్షరరూపం కాక. వారు ఆ మహాకావ్యంలో ఏ చిత్రాలను పొందుపరిచారో, అవి ఈ ప్రపంచ రంగస్థలంపై విశ్వసనీయమైనవిగా నిర్వహించబడ్డాయి.

ఆ అద్భుతమైన నాటకం యొక్క మొదటి భాగానికి తెరపడింది. రానున్న తరువాయి భాగం తెర వెనుక నిర్వహించబడుతున్నది. ఆ మహత్తర ప్రతికూల శక్తితో పోరాటం ఆగలేదు. ఈ పృధ్విపై జరుగుతున్న యుద్ధభూమిలో ఓటమి నొంది అంతరించినట్లుగా కనిపించినా, అతీంద్రియ స్థాయిలో భీకరంగా ఆ పోరు సాగుతోంది. ఆ ద్వంద్వ యుద్ధము ముగిసినపుడు తెర పైకెత్త బడుతుంది.

అప్పుడు 'మృత్యుపుస్తకం' యొక్క వ్యాఖ్యానం వినబడుతుంది. ఈ పృథ్వీ రంగస్థలంపై, ఉపసంహారం భౌతికంగా ప్రకటితమౌతుంది. రూపుదాల్చిన ఆ గాఢ విజయం యొక్క జయ జయధ్వానాలు ఈ విశ్వమంతటా ప్రతిధ్వనిస్తాయి, "నే నిక్కడే ఉన్నాను, నే నిక్కడే ఉన్నాను" అంటూ.

Extracts from Nirodbaran: "I am Here, I am Here" pp. 16-24

అనువాదం: డి. సత్యవాణి

ప్రశ్న: మధుమయీ మాతా, నాకు నిద్రించే ముందు, సావిత్రిగాని లేదా మీ యొక్క మరేదైనా పుస్తకం గాని చదివే అలవాటుంది. కాని నే నిప్పుడా అల వాటు కోల్పోయాను. నేను సమాధి దగ్గరకు కూడా క్రమం తప్పకుండా వెళ్ళటం లేదు. ఈ విషయాల యొక్క నిజమైన విలువ నా కర్థం కావటం లేదు. వాటిని క్రమబద్ధంగా చేయాలా, లేదా మనకు చేయాలని అనిపించి నప్పుడు చేయాలా? అసలు ఇవన్నీ ఎవరైనా ఎందుకు చేయాలి, ఎలా చేయాలి?

సమా: జ్ఞానాన్ని వృద్ధి చేసుకొనేందుకు లోతైన విషయాలను అర్థం చేసు కొనేందుకు ఎవరైనా 'సావిత్రి' ని పఠిస్తారు. భక్తిని పెంపొందించుకొనుటకు, శ్రీఅరవిందులతో అనుసంధానమై వారి సహాయం పొందడానికి... సమాధి వద్ద ఏకాగ్రత వహిస్తారు.

ఈ విషయం పట్ల నీకు ఏమాత్రం విలువ ఉన్నా, నీవు వాటిని క్రమం తప్పక ఆచరించాలి. ఎందుకనగా అచేతనలోని తమస్సే నిన్ను వాటి ఆచరణకు దూరంగా ఉంచుతుంది.

నీవు ఆధ్యాత్మికమైన, చైతన్యవంతమైన జీవితం కోసం పుట్టావు — బహుశ వీటిని సాధించడానికి కావలసిన సంకల్పం కలగడానికి నీ వింకా ఎదగలేదు

ఆశీస్సులు

CWM 16:397

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి